ఆచార్య రంగ

స్వీయ చరిత్ర

FIGHT FOR FREEDOM



తెలుగు

రావెల సాంబశివరావు

ఆచార్య రంగ

అంకితం

మన నాయక పూర్వులు

ప్రోలయ, కాపయ, వినాయక దేవ,

హరిహర బుక్క, వీర బల్లల, సోమదేవలకు;

స్వేచ్ఛా పోరాటంలో పరస్పరం సహకరించుకొన్న

దక్షిణాపథంలోని నాయక గణానికి

(క్రీ. శ. 1320 - 1365)

ఆచార్య రంగ
స్వీయ చరిత్ర

FIGHT FOR FREEDOM

తెలుగు

రావెల సాంబశివరావు

శ్రీ జె ఎస్ ఆర్ కృష్ణయ్యగారి సహకారంతో

పీకాక్ బుక్స్ ● హైదరాబాద్

ఆచార్య రంగ స్వీయ చరిత్ర

"Acharya Ranga Sweeya Charitra", Telugu version of *"Fight for Freedom,"* the Autobiography of Prof. N G Ranga, rendered into Telugu by Sri Ravela Sambasiva Rao, published by Peacock Books, publication wing of People's Trust

COVER: Pilla Venkateswara Rao

Publication No: 17

©: People's Trust

Price: Rs. 450

First Published in 2016, November.
Hyderabad, India

copies printed: 2000

Printed at Sailikhita Priters, Khairatabad, Hyderabad.

For copies: all the main book stalls, in both the Telugu states

Address for Communication

A. GANDHI, EDITOR, PEACOCK CLASSICS/BOOKS
G. 2, BLOCK NO. 6, PANCHAVATI, PRAGATHI NAGAR,
OPP. JNTU, NIJAMPET POST, HYDERABAD - 90

Ph: 040 2389 4648
email: agaandhi@gmail.com
Blog: www.peacockclassics.blogspot.in
website:peacockclassics.com

ప్రొఫెసర్ హీరేన్ ముఖర్జీ నివాళి

మౌలిక ఆశావహుని ముందడుగు

ఒకనాటికి అందరం పంచభూతాల్లో కలగలసిపోవాల్సినవాళ్లమే. 95 సంవత్సరాల సంపూర్ణ జీవితం పూర్తిచేసిన వ్యక్తి అలా పంచభూతాల్లో విలీనమైనప్పుడు మనకు బెంగ అంతగా ఉండకపోవచ్చుకానీ ఎన్జీ రంగతో సన్నిహితంగా మెలిగినవాళ్లకు ఆయన మరణం మనసును మెలిపెట్టి బాధిస్తుంది. ఆ బాధ నుండి బయటపడేందుకు కొంత సమయం పడుతుంది. యువతకు బహుశా పెద్దగా తెలియకపోవచ్చుకానీ ఆయన ప్రస్తుత రాజకీయ నాయకుల కోవకు భిన్నమైనవారు. అంతరించిపోతున్న రాజకీయ నాయకుల తెగకు చెందినవారు. సుప్రసిద్ధుల్లో ఆయనే దాదాపు చిట్టచివరివారు. కొన్ని పర్యాయాలు కొరకరాని కొయ్యగా కనిపించినా ఎప్పుడూ అహంకారానికి ఆమడదూరంలోనే ఉండేవారు. మన భరతజాతి నేపథ్యానికి వెలుగులు అద్దినవారు, మెరుగులు దిద్దినవారు.

ఆయన నాకంటే వయస్సులో ఏడేళ్లు పెద్ద. అయినా మేము ఆక్స్‌ఫర్డ్‌లో ఒకేసారి చేరాం. ఆక్స్‌ఫర్డ్ మాతృ సంస్థలోనూ సవతి తల్లి ప్రేమే. ఆయన సరాసరి పరిశోధనలో కుదురుకుంటే ముందుగా మేము ఆనర్స్ స్కూల్లో ఆధునిక చరిత్రతో కుస్తీ పట్టాల్సి వచ్చింది. (ఆ కుస్తీ నుండి ఆయన తప్పించుకోగలిగారు)

ఆయన ఆక్స్‌ఫర్డ్‌లో ఉన్నకాలం ప్రగతిదాయకం. అది 19వ శతాబ్దం మూడో దశకం పూర్వార్ధం. ఆ సమయంలో ముఖ్యంగా ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి వంటి విశ్వవిద్యాలయాలు కొత్తదారి తొక్కే వినూత్న విద్యార్థి గణానికి మార్గదర్శనం గావిస్తున్నాయి. విశ్వవిఖ్యాత పౌర వ్యవహార దక్షుడు **జేమ్స్ కేమెరాన్** అదంతా ప్రియాతిప్రియమైన గతంగా గుర్తుకుతెచ్చుకుంటూ ఉల్లేఖించిందేమంటే: 'మేమంతా కమ్యూనిస్ట్‌లుగా ఉన్నప్పుడు లేదా మేమంతా కమ్యూనిస్ట్‌లమేనని ఊహించుకుని ఉక్కిరిబిక్కిరవుతున్నప్పుడు లేదా మేమంతా కమ్యూనిస్ట్‌లం కావాలని ఉవ్విళ్లూరుతున్నప్పుడు' నాకు ఆ జాధ్యం అంటుకుంది. రంగలో

నరనరాన సామ్రాజ్యవాదమంటే వ్యతిరేకతే. అయినా ఆయన కమ్యూనిజం పట్ల ఓ విధంగా అంటరానితనాన్ని పాటించినట్లే. **హెరాల్డ్ లాస్కీ** ప్రత్యేకంగా రూపొందించిన సామాజిక ప్రజాస్వామ్యంలో ప్రొఫెసర్ రంగా బుద్ధిజీవిగా సేదతీరారు, రాజకీయంగా రాణకెక్కారు.

భారతదేశానికి తిరిగివచ్చిన తర్వాత దేశభక్తి భావనతో రగిలిపోతూ స్పందించే యువతలో ఒకనిగా కొద్దికాలంపాటు ఆర్థిక శాస్త్రాన్ని విద్యార్థులకు బోధించారు. నాకు గుర్తున్నంతవరకూ ఆయన బోధన చేపట్టింది మద్రాస్‌లోని పచ్చయప్ప కళాశాలలో. అయితే మాలోని ఉత్తమ కోవకు చెందినవాళ్లల్లో జాతీయ ఆవేశం ఆవహించినట్లుగానే ఆయననూ ఆవహించి రాజకీయాల్లోకి దుమికేటట్లు చేసింది. రాజకీయ కార్యక్రమాల్లో భాగంగా ఆయన జైలుపాలయ్యారు. ప్రజా ఉద్యమాలకు అప్పట్లో వేదికగా ఉన్న భారత జాతీయ కాంగ్రెస్‌లో సహజంగానే ఆయనకు ఆశ్రయం లభించింది. అయితే ఆయనలో దేనికైనా ఒకదానికి అంటకాగే స్వభావం లేనందువల్ల ఆయన సుదీర్ఘ క్రియాశీల జీవన గమనంలో పలుమార్లు కాంగ్రెస్‌లో కొనసాగుతూ, విడిపోతూ వచ్చారు. ఆయన హృదయంలోని కోమలత్వం కారణంగా చివరకు ఆయన కాంగ్రెస్‌వాదిగానే మిగిలిపోయారు.

ఆయన జ్ఞాపకాల దొంతరలో మనకు అత్యంత ఆనందాన్ని సమకూర్చే అంశం ప్రాపంచికంగా ఆయన భూమితో మమేకం కావడమే, ఆంధ్ర ప్రాంతపు మట్టిలోని సుగంధాన్ని ఆఘ్రాణిస్తూ పోవడమే, ఆ గ్రామీణ జీవన విధానాన్ని ఆస్వాదించడమే. ఆంధ్ర ప్రాంతపు పొలాల్లో వరి బంగారు రంగు కాంతులీనుతూ ఊయలలూగుతూ దిగంతాల వైపునకు సాగిపోతున్నట్లుగా కనిపిస్తుంది. **కష్టజీవులైన రైతుల సముద్ధరణే ఆయన ప్రధాన కార్యక్రమమై నిలిచింది.**

ఆయన మరణవార్త వినగానే 'వృద్ధయోధులెన్నటికీ కన్నుమూయరు, కేవలం కనుమరుగవుతారు' అనేది చటుక్కున స్ఫురించింది. ప్రొఫెసర్ రంగ ఎక్కడున్నా అగ్రభాగానే, కాకుంటే అగ్రనేత పక్కనే ఆయన స్థానం. ఆయనలోని ధీశక్తికి ఎంతో మన్నన. అది ఎంతోకాలంగా కొనసాగుతూ వచ్చింది. 1930ల్లోనో (అంతకంటే కొంచెం ముందో) మోతీలాల్ నెహ్రూ, ఎస్.శ్రీనివాస అయ్యంగార్లు స్వరాజ్య పార్టీకి నాయకత్వం వహించిననాటికే ప్రొఫెసర్ రంగా కేంద్ర చట్ట సభకు పోటీ చేసి గెలుపొందారు. కీర్తిని మూటగట్టుకునేందుకు ఆయనకు

ఎక్కువకాలం పట్టలేదు, మరీ ముఖ్యంగా భారతీయ రైతుల ప్రతినిధిగా. ఆయన నాకు సన్నిహితంగా తెలిసేనాటికే ఒక సుప్రసిద్ధ వ్యక్తిగా వెలుగొందుతున్నారు. అందువల్లనే ఆయన జీవనయానంలోని **తుది మాసాల్లో నాకు అర్థమైనంతవరకూ భరించలేని విస్మృతికి గురవ్వడంచూసి నా హృదయం క్షోభించింది.** ఇప్పటికీ జాతీయ రంగం నుండి ఒక సుప్రసిద్ధుడు నిష్క్రమించాడన్న స్పృహ విస్తృత ప్రజానీకం గమనంలోకి తీసుకుందని గట్టిగా చెప్పలేను.

నేను ఆయన్ను చివరగా చూసింది 1991 మార్చి ప్రాంతాల్లో అనుకుంటా. అప్పుడు మా ఇరువురినీ పద్మ విభూషణ్ బిరుదుతో సత్కరించారు. (ఇటువంటి అరుదైన గౌరవాన్ని కలుగజేసిన ప్రధాని **చంద్రశేఖర్**కు ధన్యవాదాలు) నేను తొలిగా చూసింది మాత్రం 1936లో చారిత్రాత్మక లక్నో కాంగ్రెస్‌లో. నేను ఆ సభకు సందర్శకునిగా హాజరయ్యాను. ఆ ప్రాంగణంలోనే మరువ జాలని అఖిలభారత రైతు మహాసభను కూడా నిర్వహించారు. బహుశా సాహిత్యం పట్ల కూడా అభిరుచిని పెంచుకున్న కారణంగా ఆయన అఖిలభారత అభ్యుదయ రచయితల ప్రారంభ సభకు హాజరుకావడం జరిగింది. ఆ సభకు పేరెన్నికగన్న సాహితీమూర్తి **ప్రేమ్‌చంద్** అధ్యక్షత వహించారు. **సరోజినీ నాయుడు, అస్రత్ మొహానీ** మరెందరో సాహితీ ప్రకాండులు ఆ సభకు హాజరయ్యారు. నేను అప్పుడు బెంగాలు రచయితల శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్నా. నేను విదేశం నుండి తిరిగి వచ్చినతర్వాత ఓ యేడాదిన్నరపాటు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పనిచేశాను. చట్ట వ్యతిరేక పక్షంగా ముద్రవేసిన అఖిలభారత కమ్యూనిస్ట్ పార్టీలో విద్యార్థులు, సాంస్కృతిక కళాకారులు, కార్మిక సంఘ ప్రతినిధుల మధ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నా.

1936 నాటి కిసాన్ సభకు నేను విధివిధానాలననుసరించే హాజరయ్యాను. అక్కడ నేను ప్రొఫెసర్ రంగాతోపాటు **ముజఫర్ అహ్మద్, స్వామి సహజానంద, బంకిం ముఖర్జీ, ఇందూలాల్ యాజ్ఞిక్**వంటి నాయకుల్ని కలిశాను. (వీళ్లంతా నాకు తెలిసినవాళ్లే) ఈ పేర్లు నేను ఎందుకు ఉదహరిస్తున్నానంటే తర్వాత రోజుల్లో కూడా ఆయన ఆ సభను గురించి ముచ్చటిస్తూ కమ్యూనిస్ట్ ఉద్యమంలోని అలనాటి సహచరుల్ని గురించి ప్రస్తావించేవాడు. ఇదంతా ఆయన విశాల హృదయానికి అద్దంపడుతుంది. కమ్యూనిస్ట్‌ల పట్ల సాధారణ సామాజిక

ప్రజాస్వామికవాదుల్లో ఉండే వ్యతిరేకత నుండి బయటపడిన తన స్వేచ్ఛ అందులో ప్రతిబింబించేది. ఆయనలోని ఉదార భావన ఆయన్ను సహజసిద్ధంగా ఆవిర్భవించిన పార్లమెంట్ సభ్యునిగా వెలుగొందేటట్లు చేసింది. వాస్తవానికి ఆయన తమ సొంత అభిప్రాయాలకే అంటిపెట్టుకుని ఉన్న సందర్భాల్లో తద్విరుద్ధ భావనలను వ్యతిరేకించాల్సి వస్తే దృఢంగానే అయినా నాగరికంగా వ్యతిరేకించేవారు. కనుకనే దశాబ్దాల తరబడి పార్లమెంట్ వ్యవహారజ్ఞునిగా ఆయన తనకు అందివచ్చిన ప్రతిభను చాటుకున్నారంటే ఆశ్చర్యపడాల్సిందేమీలేదు. పార్లమెంట్ సభ్యునిగా స్వాతంత్ర్యం రాకపూర్వం, వచ్చిన తర్వాత అప్పుడప్పుడూ విరామ సమయాలు ఏర్పడినా మొత్తం దాదాపు ఆరు దశాబ్దాల కాలం పూర్తిచేయడం ద్వారా గిన్నిస్ రికార్డులకెక్కడం యాదృచ్ఛికమేమీకాదు.

నా పాతికేళ్ల పార్లమెంట్ సభ్యత్వకాలంలో (1952-77) రంగ, నేనూ మిత్రులుగా మెలిగాం. అభిప్రాయాలపరంగా స్పష్టంగా మేము విభేదించినా మా ప్రవర్తనా తీరు, మా జీవన వైఖరి (మీకు నచ్చేటట్లయితే) మా జీవన సిద్ధాంతాల విషయంలో మేము ఒకరికొకరం ఎంతో దగ్గరగా జరిగాం. 1952లోనూ, ఆ తర్వాత కొంతకాలం ఆయన కాంగ్రెస్ పార్టీకి మూలస్థంభంగా నిలిచాడు. అయితే ఆయన ఎన్నడూ పక్షపాత వైఖరి ప్రదర్శింపక మాట్లాడే పద్ధతి కొంత వింతగా కనిపించినా (సందర్భానుసారంగా నూతనంగా కనిపించినా) తమ వాదనా పటిమతో, వాగ్దాటితో ప్రసంగిస్తూ వచ్చినా సభ్యుల మన్ననలను పొందగలిగే వారు. సుదీర్ఘ అనుభవం గల ఒక రాజకీయ వాదిగా ఆయన నిజాయితీకి ఎంతగా పూర్తి విశ్వాసం చేకూరిందంటే ఆయన పోకడలు వింత పోకడలు అనిపించేంతగా. అయినా ఆయన ఏవిధంగా చూసినా కేవలం పార్టీకి విధేయునిగా మాత్రమే నిలిచిపోయినట్లు కనిపించదు. ఆయన చదువు **విదేశీ విశ్వవిద్యాలయం ఆక్స్‌ఫర్డ్‌లో సాగినా తమ గ్రామీణ నిరాడంబరత్వాన్ని మాత్రం కోల్పోలేదు.** అయితే ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆటకాయితనంతో ప్రొఫెసర్ రంగను ఒక వైపు ఆచార్య అని సంబోధిస్తూనే మరోవైపు గేలి చేస్తున్నా ప్రొఫెసర్ రంగ బహుశా లోలోపల తెగ సంబరపడిపోయేవాడనుకుంటా. గౌరవ సూచకంగా ఆచార్య కృపలానీ విషయంలో ప్రత్యేకించివాడే అటువంటి సంబోధనను ప్రధాని ప్రొఫెసర్ రంగపై ఒక అస్త్రంలా ప్రయోగిస్తూ ఉంటే దాన్ని తిప్పికొట్టకుండా బహుశా

సుకుమారంగా, కించిత్ అస్పష్టంగా ఆనందిస్తున్నట్లుగా కనిపించేది.

ప్రొఫెసర్ రంగకు ఎక్కువకాలం కాంగ్రెస్‌లో కొనసాగడం సాధ్యంకాలేదు. కొండ వెంకటప్పయ్య,, ప్రకాశం పంతుల గార్ల పెత్తనం కొనసాగినంతకాలం వ్యవహారం సజావుగానే నడిచినట్లు ఆయన భావించారు. తర్వాత పదవుల్లోకి, ప్రాభవంలోకి వచ్చినవారు, అస్మదీయుల పట్ల చూపే పక్షపాత ధోరణి మింగుడుపడేటట్లుగా ఆయనకు కనిపించలేదు.

అయితే స్వతంత్ర పార్టీ వైపు ఆయన దూసుకుపోవడం దురదృష్టకరం కావచ్చు. ఏదిఏమైనా ఆయన పార్టీలు మారాడన్నది స్పష్టమే. 1961లోనో ఏమో ఆయన షష్టిపూర్తికి నన్ను మాట్లాడమని కోరడం నాకు గుర్తుంది. అప్పుడు ప్రసంగిస్తూ అన్నాను - నా మిత్రుణ్ణి ప్రచలిత అభిప్రాయాల జన్మ విరోధిగా, కర్షకుల పాలిట అసహాయ శూరునిగా తాను ఎంచుకున్న రాజకీయ పక్షంలో ఎక్కువకాలం కొనసాగేందుకు ఇష్టపడని నాయకునిగా అభివర్ణించాను.

అప్పుడప్పుడూ పార్లమెంట్‌లో రంగ ఆనందాన్ని కోల్పోయినవాడిలా కనిపించేవారు. అప్పట్లో ప్రతిపక్షాల్లో ముందు వరసలో ఉన్న తమ పార్టీకి రంగా కాకుండా తానే ప్రతిపక్ష నాయకుడైనట్లు మినూమసానీ ప్రవర్తించేవాడు. (అప్పుడప్పుడూ మినూ మసానీ రాతల్లో కూడా ఆ ధోరణి కనిపించేది) అయితే అందులో రంగ అల్పత్వంకానీ, నీచత్వంకానీ గోచరించేవికావు. మర్యాదను అతిక్రమించే ఇతరుల్లోని అటువంటి చేష్టలను అంతగా పట్టించుకునేవాడుకాదు. పార్లమెంట్‌లో స్వతంత్ర పార్టీ తరపున పోరాడే సందర్భాల్లో కొద్దిగా కలహశీలంగా కనిపించినా (ఆయన ఆ ఉరుముల, మెరుపుల వాతావరణాన్ని నిలువరించ లేకపోయినా) ఆయనలోని దర్పాన్నీ, సభా మర్యాదలను నిలుపుకునే విషయంలో విఫలుడయ్యేవాడు కాదు.

రంగ అందరి మాదిరిగా రాజకీయం నడిపి ఉంటే పరిస్థితి మరో విధంగా ఉండేది. మోయలేనన్ని పదవులు దక్కేవి. అయితే ఆయన స్వభావం తద్భిన్నమైనది. ఆయనలో అంతర్గతంగా నైతిక శక్తి ఉండేది. ఉదాహరణకు రాయబార కార్యాలయాల్లో నిర్వహించబడే ఎటువంటి విందులకూ ఆయన హాజరయ్యేవారుకాదు. పార్లమెంట్‌లోని అనేకమంది పేరొందిన పార్లమెంట్ సభ్యులనలేకాక ఆయన ఇంటి నుండి పార్లమెంట్‌కు, పార్లమెంట్ నుండి ఇంటికి,

ఢిల్లీ వీధుల్లోనూ పాదచారిగానే కనిపించేవారు. (వయస్సు మళ్లిన హృదయనాథ్, కుంజ్రూ కూడా అదేవిధంగా చేసేవారు.) డాబూ, దర్పం ఎరుగని తిన్నగైన జీవనానికి ఆయన నిలువెత్తు సాక్ష్యం. పార్టీలు మారినా, దుబారా చేసే పుత్రుని మాదిరిగా ప్రతిఫలం ఆశించే మనిషి కాదు.

ఇందిరాగాంధీ విధానాలను, సిద్ధాంతాలను (లేదా వాటి లేమిని) ఆయన మాదిరిగా తప్పుపట్టినవారు లేనిమాట నిజమేకానీ ఆమెలోని నిర్భయత్వాన్ని కొనియాడలేకుండా ఉండలేకపోయేవారు. ఆయన ఒక పర్యాయం నాతో అన్నారిలాఃు దేశంలో అత్యయిక స్థితిని విధించి తదనంతర సంకట స్థితిని ఎదుర్కోవడంలో చూపిన తెగువను పొగడకుండా ఉండలేకపోతున్నా. ఆయన వరకూ ఆయన ఆ మలినం తమకు అంటుకోకుండా చూసుకోగలిగారు.

ఆయన సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్నా **అవినీతికి సంబంధించి ఎన్నడూ ఏవిధమైన గుసగుస కూడా ఆయన విషయంలో వినబడలేదు.** ఆయన, భారతీదేవి రంగ (ఆమెను జ్ఞప్తికి తెచ్చుకుని జోహారులర్పించాలి) ఇటువంటి విషయాల్లో ఆదర్శప్రాయులు. రంగ విషయంలో చెప్పినట్లుగా ప్రస్తుతం ఏ ప్రముఖ రాజకీయ నాయకుని విషయంలో అయినా ఇలా చెప్పగలిగితే ఎంత బాగుంటుందో! 'రికార్డుల్లో ఎటువంటి విషయాలు వెలుగుచూసినా ఆయనకు సిగ్గుతో తలదించుకోవాల్సిన పని ఉండనే ఉండదు.

మనలో ఎక్కువకాలం జీవించినవారు ఒకరి తర్వాత ఒకరు ఎలా కనుమరుగవుతున్నదీ రంగా మరణానంతరం గుర్తుకొస్తున్నది. మొరార్జీదేశాయి వందో సంవత్సరపు జీవన యానంలోకి అడుగుపెట్టినా నూరేళ్లు నిండకుండానే కన్నుమూశారు. గుర్జారీలాల్ నందా కృశించిపోతున్నారు. కర్నాటకలో నిజలింగప్ప పరిస్థితీ ఇదే. షీలభద్రయాజీ జీవించే ఉన్నాడుకానీ ఎక్కడో కొట్టుమిట్టాడుతూ ఉన్నట్లుంది ప్రాణం. రాజకీయ ప్రముఖుల్లో తొంభై యేళ్లు దాటినవారు త్వరలోనే కనిపించకుండా పోయేటట్లున్నారు. ఇక నా విషయానికొస్తే నా వయస్సు 88 సంవత్సరాలు. పూర్వపు అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సభ్యుల్లో ఇంకా జీవించి ఉన్నవారిలో అందరికంటే పెద్దవాణ్ణి. కమ్యూనిస్ట్‌గా కూడా ప్రజా సంఘటన కాలంలో (1938)లో సుభాష్ బోస్ అధ్యక్షత వహించిన హరిపురా కాంగ్రెస్ కమిటీకి నన్ను కూడా ఎన్నుకున్నారు.

నాకుగా నేను చెప్పాల్సి వస్తే రంగకు జీవితం పట్ల అభిరుచి మెండు. మరీ ముఖ్యంగా ఇటీవల కాలంలో అది నాలో మృగ్య మవుతున్నది. అందుక్కారణం ఒకప్పుడు మనం మనసులో భావించుకున్నదంతా చేజారి మట్టిపాలవుతున్నట్లుగా కనిపించడమే. నాలోని ఈ విధమైన చొరబాటుకు క్షమించమని కోరుతున్నా. అయితే నాకు స్ఫుటంగా గుర్తున్నంత వరకూ 1989లోగానీ లేదా 1991లోగానీ రంగ నన్ను ఆటపట్టించారు. షెల్లీ కవిత్వాన్ని ఉటంకిస్తూ నయంకాని జబ్బులకు కనికరించి చంపడమే పరిష్కారమని నేను గతంలో చెప్పినదాన్ని గుర్తుచేశారు.

'రేయింబవళ్లు నా నుండి
ఆనందం ఉడాయిస్తున్నది
అనుభవశీల నవ వసంతం
మూర్ఛిల్లే నా హృదయాన్ని
గ్రీష్మం, శిశిరం, సమస్త రుతువులు
దుఃఖమయం గావిస్తున్నవి
అయినా అదొక విధమైన
ఆనంద పరవశమా?
అయినా చాలు, ఇక చాలు
ఇంతకుమించి అసలే వద్దు!'

రంగ అవగాహన సరైనదేనని నాకు తెలుసు. మేము జీవించి ఉండగానే మా కలలు సాకారం కాగలవని నమ్మబలికే విధంగా మా ఇష్టాలను నెరవేర్చాల్సిన ఉత్తరదాయిత్వం చరిత్రకేమున్నది? అందరూ సాహసోపేతంగా, సంకల్పబలంతో, మౌలిక ఆశావాదంతో కృషి చేస్తూ ముందడుగు వేయాల్సిందే. అటువంటి గుణాలన్నీ నాకంటే ప్రొఫెసర్ రంగలోనే అధికం.

ప్రొఫెసర్ రంగకి ప్రొఫెసర్ హీరేన్ ముఖర్జీ ఆనాడు సమర్పించిన ఘన నివాళి ఇది. దీన్ని 'హిందూ' దినపత్రిక జూన్ 25, 1995న ప్రచురించింది.

-ప్రచురణ కర్తలు

కృతజ్ఞతలు

ఈ కార్యాన్ని పురమాయించినవారు తెనాలి వాసి **జె ఎస్ ఆర్ కృష్ణయ్య** గారు.

ఈ బృహత్కార్యాన్ని సాధించడంలో పీకాక్ బుక్స్ అనేకమంది సాయాన్ని స్వీకరించింది. మొదట ఆచార్య రంగ స్వీయ చరిత్రను పీకాక్‌వాళ్లు ప్రచురించాలని **జె ఎస్ ఆర్ గారు** అడిగారు. నేను కొంత తటాపటాయించాను. ఇంగ్లిషులో సుమారు 550 పేజీలున్న రంగ జీవితాన్ని తెలుగులోకి తేవడం తేలికైన వ్యవహారం కాదు. దానికి ఎంతో ఓపిక కావాలి. ఓపిక ఒక్కటే చాలదు. 1920ల నుంచీ 1990ల వరకూ తెలుగు ప్రాంతంలోనూ జాతీయంగానూ అంతర్జాతీయంగానూ జరిగిన పరిణామాల పట్ల అహగాహన లేనివారెవ్వరూ ప్రామాణికమైన అనువాదం చెయ్యలేరు. అయితే **రావెల సాంబశివరావు గారు** తెనిగిస్తున్నారని **జె ఎస్ ఆర్ గారు** చెప్పడంతో కొంత ధీమా వచ్చింది. ఆయన ఎంతో శ్రద్ధగా పని ముగించి చక్కగా బైండ్ చేసిన రాతప్రతిని పంపించారు. ఆయనకు నా కృతజ్ఞతలు.

ఈ క్రమంలోనే పరిచయమయిన మరో వ్యక్తి **జొన్నలగడ్డ రామారావుగారు**. ఈ పుస్తకం తయారీలో ఆయన మొదటి నుంచీ చివరిదాకా చాలా విలువైన సూచనలు ఇచ్చారు. ఆయనకు నా కృతజ్ఞతలు.

అడగగానే తన ముందుమాటని పంపించిన **ఎలమంచిలి శివాజీ** గారికి నా కృతజ్ఞతలు. మరో వ్యక్తి **పిళ్లా వెంకటేశ్వర రావు గారు**. మాకు దొరికిన ఫోటోలు కొన్ని పాతబడిపోయాయి. కొన్ని బొత్తిగా అస్పష్టంగా ఉన్నాయి. సాధ్యమైనంత వరకూ వాటిని మెరుగుచేయడానికి ఆయన చాలా సమయం వెచ్చించారు. టైటిల్ కూడా ఆయనే రూపొందించారు. ఆయనకు నా కృతజ్ఞతలు.

వీరందరూ తప్పుల్ని సరిచేయడంలో నాకు సాయపడ్డారు. అయినా ఇంకా ఎక్కడైనా పొరబాట్లు మిగిలివుంటే వాటికి మాత్రం నాదే నైతిక బాధ్యత.

ఎ. గాంధి,

సంపాదకుడు,

పీకాక్ బుక్స్

ప్రజల మనిషి రంగాజీ

ఆచార్య రంగా రాజకీయ రంగ ప్రవేశానికి ముదు స్వాతంత్ర్య పోరాటం, రాజకీయ వ్యవహారాలు కేవలం పట్టణాలకు మాత్రమే పరిమితమై ప్రాక్టీసులేని ప్లీడర్లచుట్టూ తిరుగుతుండేవి. రంగా రాకతో అవి పల్లెసీమలకు, వ్యవసాయ రంగానికి విస్తరించాయి. సాహిత్య రంగంలో చెళ్లపిళ్ల వెంకటశాస్త్రికి వేలూరి శివరామశాస్త్రి, పింగళి లక్ష్మీకాంతం, త్రిపురనేని రామస్వామి చౌదరి, విశ్వనాధ సత్యనారాయణ వంటి ఉద్దండపిండాలు శిష్యులుగా ఉన్నట్టే రాజకీయరంగంలో రంగాజీకి చంద్ర రాజేశ్వరరావు, మాకినేని బసవపున్నయ్య, సుబ్బతాతరాజు, నీరుకొండ రామారావు, చేగిరెడ్డి బాలిరెడ్డి, పెద్దిరెడ్డి తిమ్మాయిరెడ్డి, కందుల ఓబులరెడ్డి, పి. రాజగోపాల నాయుడు, నాగినేని వెంకయ్య, ధనేకుల నరసింహం, దివి కొండయ్య చౌదరి, అనంత వెంకటరెడ్డి, పుల్లెల శ్యాంబాబు, వి.వి. రమణ, లచ్చన్న, సుంకర సత్యనారాయణ, ఆలపాటి శివరామకృష్ణ, బి.వి. శివయ్య, పసుపులేటి కోటేశ్వరరావు, వై.వి. కృష్ణారావు, రోశయ్య ఇలా ఎంతోమంది శిష్యులు ఉండేవారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు, నేనూ ఈ జాబితాలో చివరి తరానికి చెందిన వాళ్లం. ఆంధ్రదేశంలో రైతాంగ సమస్యలపై స్పందించ గలిగింది ఈ రంగా శిష్యగణమే. ఆ మధ్య వై.వి. కృష్ణారావును రంగా బడిలోని వారికే పరిమితమైన రైతాంగ సమస్యలు తమకెలా ఒంటబట్టాయి? అని ప్రశ్నించాను. దానికాయన 'నేనే కాదు రాజేశ్వరరావు, బసవపున్నయ్య, సుందరయ్య – అందరం గోభూమి వేసవి రాజకీయ పాఠశాలలో ఓనమాలు దిద్దుకున్న వాళ్లమే. అక్కడే ఈ ఒరవడి మాకబ్బింద'ని తడుముకోకుండా సమాధానమిచ్చారు.

రాజకీయ నాయకులేగాక న్యాయపతి నారాయణ మూర్తి, పండితారాధ్యుల నాగేశ్వరరావు, కే సభా, పోలవరపు శ్రీహరిరావు, బి ఎస్ ఆర్ కృష్ణ, కె.వి. సుబ్బయ్య, దరువూరి వీరయ్య, దేవిప్రియ, చంద్రపాల్ వంటి వారు చేయి తిరిగిన రచయితలుగా రూపుదిద్దుకున్నది, ఆచార్యులవారి ఆస్థానంలోనే, ఏరోజు కారోజు చేసిన పర్యటనలు, చెప్పిన ఉపన్యాసాలు, చేపట్టిన కార్యక్రమాలు స్వయంగా తానే వార్తాపత్రికలకు

వ్రాసి పంపేవారు. నేడున్నంత వార్తా సేకరణ పద్ధతులు, అవకాశాలు లేని రోజులవి. రాసిన వార్తలను కార్బన్ పేపరుతో కాపీలు తీసి పత్రికా కార్యాలయాలకు పంపేవాళ్ళం. వారానికో, పది రోజులకో ప్రచురితమయ్యేవి. అదీ అనుమానమే. అచ్చవుతాయో లేదోనని.

తనవారెవరైనా, కించిత్తు మంచిపని చేసినట్లు తెలిస్తే వెంటనే అభినందిస్తూ కార్డుముక్క రాయడం, ఆచార్య రంగాకు అలవాటు. పార్లమెంటులోనైనా, బహిరంగసభలోనైనా, ఎవరైనా మంచి ఉపన్యాసం చేస్తే 'హియర్ – హియర్', అంటూ పసి పిల్లవాడిలా బల్లచరిచి, ప్రోత్సహించవలసిందే. దానికి తర-తమ బేధాలు లేవు. స్వ-పర పక్షమనే అడ్డంకులు – ఈ అభినందనలకు అడ్డురాలేదెన్నడూ. ఓమారు ప్రధాని వి పి సింగ్ రంగాజీకి తటస్థపడ్డారు. 'నేను నీకు ప్రతిపక్షం' అన్నారు రంగాజీ. 'రంగాజీ మీరు నాకు – నేను మీకు – ప్రతికూలురమా? మీరు పార్టీల కతీతం' అని వంగి, వంగి ప్రణామాలు చేశారు. పక్కనే ఉన్న నన్నుచూసి 'వీడు నా శిష్యుడు- నీ ముఠా' అని పరిచయం చేశారు. అప్పటి నుంచి వి పి సింగ్ కూడా నా ఎడ వాత్సల్యంతో నుండేవారు. ఉపరాష్ట్రపతి కృష్ణకాంత్ లాహోర్‌లో రంగాజీ నిర్వహించిన రాజకీయ పాఠశాలలో విద్యార్థి. ఆయన తండ్రి పార్లమెంటులో రంగా సహచరులు. ఆ తరువాత కొంతకాలానికి కృష్ణకాంత్ కూడా రంగాతో కలిసి పార్లమెంటు సభ్యునిగా ఉన్నారు. రంగాగారినెన్నడూ అధికార పదవులు ఆకర్షించలేక పోయాయి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా రాజాజీకి మద్దతు నిచ్చారు. కృషీకార్ లోక్ పార్టీనుంచి తిమ్మారెడ్డి, లచ్చన్నలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాల్సిందిగా రాజాజీని అడగడానికి వెళ్లిన రంగాతో 'వారి మాటలా ఉంచు. నీవు ఉప ముఖ్యమంత్రిగా చేరు' అని రాజాజీ ప్రతిపాదించారు. 'సారంగధర నాటకంలో రాజరాజ నరేంద్రుని వేషం కట్టలేను' అని సమాధానం చెప్పి రంగాజీ లేచి వచ్చేశారు. ఆయన శిష్యులమనుకొనేవారు, ఉత్తరోత్తరా రాజరాజ నరేంద్రులుగా రూపొందడం ఆశ్చర్యం. మహారాష్ట్ర గవర్నర్ లేదా ఉపరాష్ట్రపతి పదవిని చేపట్టాలని ఇందిరా గాంధీ ప్రతిపాదించినా సున్నితంగా తిరస్కరించి పార్లమెంటుకే రంగా పరిమితమయ్యారు.

రంగాజీ ఆలోచనలు, ఆవేశాలు ఆదిలో వామపక్షం వైపు మొగ్గేవి. ధాన్యం ఉత్పత్తిదారుల సమావేశాలు, జమీన్ రైతు పోరాటాలు రైతాంగ ఉద్యమాలు అన్ని ఆ

కోవలేనివే. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్‌కు అగ్రస్థానంలో ఉన్న రంగాజీ జవహర్‌లాల్‌తో విభేదించి, బయటకు రావడం ఒక పొరపాటైతే, తిరిగి 1972 ఆగష్టు 16న ఇందిరా గాంధీ పార్టీలో చేరడం మరొక గ్రహపాటు. కాంగ్రెస్‌లో చేరిన ఐదేళ్ళకు రాజ్యసభ సభ్యుడిగా మూడేళ్ళుండి, ఆ తరువాత మరో పదేళ్ళు లోక్‌సభ సభ్యుడిగా కొనసాగి తనను తాను కుంచించుకున్నారు. ఈ విషయాన్ని చరణ్‌సింగ్ ఓసారి నాతో ప్రస్తావిస్తూ 'స్వతంత్ర పార్టీ పనికిరాదనుకుంటే రాజీనామా చేసి ఇంటివద్ద కూర్చుంటే సరిపోయేది. జవహర్‌తో విభేదించిన ధీశాలి ఇందిరతో రాజీపడటం మనస్తాపం కలిగించింది అన్నారు. నేనీ విషయాన్ని ఓ పర్యాయం రాజగోపాలనాయుడు సమక్షంలో రంగాజీతో పేర్కొనగా 'నీవు ఒక పైత్యకారివి - అసందర్భ ప్రస్తావనలు తెస్తావు' అని దాటేశారు. రాజన్న మాత్రం 'కొన్ని కొన్ని సంఘటనలు అలాగే జరుగుతాయి, అని ముగించారు, శూన్యంలోకి చూస్తూ. అయితే ఇవేవీ రంగాగారి ఔన్నత్యాన్ని దెబ్బతీయలేదు. రైతాంగం ఎడ తనకున్న పక్షపాతాన్ని వదులుకోలేదు. తాను ఏ పార్టీలో ఉన్నా, అంతర్లీనంగా తన సిద్ధాంతానికి, గ్రామీణ రైతాంగం ఉద్ధరణకు తిలోదకాలివ్వలేదు. అరవై, డెబ్భై సంవత్సరాల సుదీర్ఘ ప్రజాజీవనంలో కడకంటా, కడిగిన ముత్యంలానే మిగిలారు.

ఈ తరం రాజకీయవేత్తలకు రంగా గురించి అంతగా తెలియదు. 1991 ఎన్నికల ప్రచారంలో ఆయనను పట్టుకొని 'మీరు రైతులకు ఏమి చేశారు? అని ప్రశ్నించారు కొందరు పాత్రికేయులు. 'నేను చేసేది ఏమిటి? శివాజీ లేడూ? వాడు చెయ్యడం లా? వాడు నా శిష్యుడే గదా? వాడు చేస్తే నేను చేసినట్లు కాదూ? అని ఎదురు ప్రశ్నలడిగి వారి నోరు మూయించారు. నేను తెలుగుదేశంలో ఉన్నా నా కృషిని కూడా తన ఖాతాలో జమ చేసుకొనగల ఔన్నత్యం రంగాజీది. పార్లమెంటు సభ్యత్వం మినహా, మరే పదవినీ చేపట్టని రంగాజీ అజరామరంగా ప్రజల హృదయంలో శాశ్వత స్థానాన్ని సంపాదించారు. దానికి కారణం కిసాన్ మజ్దూర్ పార్టీ, కృషీకార్ లోక్‌పార్టీ, స్వతంత్ర పార్టీ, కాంగ్రెస్ పార్టీ ఎక్కడున్నా తన 'కర్షక వేదం' నుంచి దూరంగా జరగకపోవడమే. చిరకాలంగా రైతులకు దక్కని సాంఘిక న్యాయం పరుల దయాభిక్షగా గాక తమ హక్కుగా వర్గ స్పృహతో ఉద్యమించాలని కన్ను మూసేంతవరకు, పరితపిస్తూనే ఉన్నారు. తమ సొంతానికి అనుభవించేదాని కన్నా - పరుల సుఖ సంతోషాలకు, సమాజ సంక్షేమానికీ రైతులు అందించేది ఎంతో ఎక్కువని ఎన్నడో

గుర్తించిన ఉదాత్తుడు రంగాజీ. అయితే ఈనాడు రైతులు దోపిడీకి గురవుతున్నారు. ఈ అన్యాయాన్ని నివారించకపోతే సామాజిక భద్రతకే ప్రమాదం. రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్న ఈ నాటి యువతరం ఆచార్య రంగాను ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన ఎంచుకున్న మార్గాన్ని వ్యక్తిగత నడవడిని అనుసరించడం అవసరం. అధికారాన్ని అందుకోవడానికి అక్కరకొచ్చే నిచ్చెనమెట్లుగా గాక ఉన్నత మానవ విలువలను పెంపొందించి, భద్రపరచి, భావితరాల వారికి అందించడమే రాజకీయాల పరమావధి అని విశ్వసించిన మనిషి రంగాజీ. ఈ ఆదర్శాన్ని నేటి యువనేతలు శిరసావహిస్తే అదే ఆచార్య రంగాజీకి నిజమైన నివాళి కాగలదు.

యలమంచిలి శివాజీ

(మాజీ రాజ్యసభ సభ్యులు)

ముందుమాట



ఈ పుస్తకంలో పుటలనిండా ఇటు ఆంధ్రదేశంలోనూ, అటు హిమాలయాలు మేలుకట్టుగా గల ఉపఖండం భరత భూమిలోనూ సంభవించిన అనేకానేక ప్రజా సంఘటనల్లో నేను నిర్వహించిన పాత్ర ఏ మేరకు అనేది నింపాలనేదే నా తలంపు. అలాగే ఇది 1959లో స్వతంత్ర పార్టీ స్థాపన వరకూ ప్రజా జీవితంలోని నా కార్యక్రమాల్ని రేఖామాత్రంగా వివరిస్తుంది.

నా మిత్రులెందరో చెప్పే ప్రకారం నా జీవితంలో వెలుగుతో నిండిన నిర్మాణాత్మక దశ రాజాజీ వంటివారితో కలసి స్వతంత్ర పార్టీ స్థాపించిన నాటి నుండి అని. అదంతా భారతీదేవి గారికి ఆనందం కలిగించింది. మేము ఏర్పాటుచేయదల్చిన ఈ నరికొత్త రాజకీయ వేదికపై నా స్థానం విషయంలో ఆందోళన చెందాల్సిన పనిలేదు. సొంత గూటి నుండి ముమ్ముందు ఎటువంటి కుట్రలు, జగడాలు ఉండవని ఆమెకు తెలుసు.

అంతా విధి విలాసం. ఆయన అన్ని సంవత్సరాలు ప్రధానిగా కొనసాగిన కాలంలో నేను జవహర్‌లాల్‌జీ దయకు పాత్రుడ్ని కాదల్చుకోలేదు. అంతకాలమూ

నేను జాతీయ రాజకీయాల్లో ముందుపంక్తిలోనే ఉండి నా ప్రాథమిక విశ్వాసాలను, రాజకీయ స్థోమతను దేనికీ బలిపెట్టలేదు. మేమిద్దరం భారత ప్రజల ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి కోసమే పాటుపడ్డాం. అయితే మా మార్గాలు పరస్పర వ్యతిరేకాలు. **నేను ఆర్థిక మాంద్యాన్ని ఓ పెనుభూతంగా చూశాను - మరీ ముఖ్యంగా రైతుల విషయంలో. అయితే ఆయన ఆ విషయంలో రాజకీయ దుబారాను కొనసాగించాడు.** యిరువురం భారతదేశాన్ని ప్రపంచంలో శక్తి సంపన్నమైన సురక్షిత ప్రాంతంగా నిలపదల్చాం. అయితే టిబెట్‌కు రాజకీయ స్వాతంత్ర్యం సమకూర్చడం ద్వారా దాన్ని సాధించవచ్చునని నేను భావిస్తే ఆయన చైనాతో చేతులు కలిపాడు.

మా ఇరువురికీ తెలుసు మా మధ్య సంబంధాలు క్షీణిస్తున్నాయని. అవి తిరిగి బలపడతాయని భావించేందుకు వీలులేదు. నెహ్రూకు, ఇతర కాంగ్రెస్ నాయకులకు మధ్య బంధాలు వేరు. అవి అధికారం కోసమో, పక్షపాత దృష్టితోనో ఆయన అందచందాలను, కీర్తిని గానం చేస్తూ బాగా పుంజుకుంటాయి. కనుకనే 1957లో నా ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన అంతగా ఉదాసీనంగా వుండడం జరిగింది.

1962లో నేను స్వతంత్ర పార్టీ అధ్యక్షుడిగా ఉండి సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్‌కు పోటీ చేసినప్పుడు ఆయన నన్ను ఓడించేందుకు బద్ధకంకణుడు అవడంలో మరి విడ్డూరమేమున్నది? నేను నెగ్గకుండా చూడడంలో ఆయన విజయం సాధించాడు. అయితే తిరిగి నేను 1962లోనే లోక్‌సభకు ఉపఎన్నికల్లో పోటీ చేశాను. అప్పుడు ఆయన ప్రచారంలో మూడు రాష్ట్రాల మంత్రుల్ని (ఆంధ్ర, మైసూరు, మద్రాస్ రాష్ట్రాలకు చెందినవారిని) నాకు ఎదురుగా మోహరింప జేశాడు. వారితోపాటు వాళ్ల ముఖ్య మంత్రులూ కలిశారు. అలా వాళ్లు 22 మంది మంత్రులూ, ముఖ్యమంత్రులూ, ఇరువురు కేంద్ర మంత్రులూ ప్రచార యాత్రలో చిత్తూరు వీధుల్లో అగ్రభాగాన నిలిచారు. అదంతా వాళ్లు జవహర్‌లాల్‌జీ పట్ల విధేయత ప్రకటించేందుకే. నా పట్ల కాంగ్రెస్ సంపూర్ణ వ్యతిరేకతను ప్రదర్శించేందుకే.

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముఖ్యమంత్రి అయినవారు నన్ను చిత్తు చిత్తుగా ఓడించమని పిలుపునిచ్చారు. అందుకువారు చెప్పిన కారణమేమంటే కన్యాకుమారి నుండి హిమాలయాల వరకూ అందరు నాయకులు జవహర్‌లాల్ అగ్రగణ్యత్వాన్ని బాహాటంగా అంగీకరిస్తూ ఉంటే నేను మాత్రం నిరంతరం వ్యతిరేకిస్తూనే వున్నానట. దేవుడికి దయ కలిగింది. నెహ్రూయిజాన్ని ఓడించి నన్ను గెలిపించడంలో చిత్తూరు

ప్రజలు కృతకృత్యులయ్యారు.

కాంగ్రెస్‌లోని అనేకమంది పాత మిత్రులు, నేను కాంగ్రెస్ నుండి1959లో విడిపోకుండా అందులోనే కొనసాగి మరింతగా అనుకున్నది సాధించే పనికదా అని విస్తుబోతూ ఉంటారు. నేను రాజాజీతో కలసి స్వతంత్ర పార్టీ స్థాపించి వుండకపోతే నెహ్రూ తలపెట్టిన జాతీయ స్థాయి సమిష్టి వ్యవసాయ ఉద్యమాన్ని నిలువరించగలిగేవాణ్ణా అనగానే వాళ్లు కొంత శాంతించే వాళ్లు. ప్లానింగ్ కమిషన్ రాజ్యాంగేతర శక్తిగా ఎదుగుతూ తప్పుడు విధానాలను ప్రవేశపెట్టడాన్ని స్వతంత్ర పార్టీ ఎండగట్టడం వల్లే దేశం ఊపిరిపీల్చుకోగలిగింది. కమ్యూనిజం దిశగా సాగే దాని ప్రణాళికలు, ప్రాధాన్యతలను పున:పరిశీలించి దాని ప్రమాదాలను పసిగట్టేటట్లు చేయగలిగింది.

నెహ్రూ గ్రామ దాన ఉద్యమాన్ని కొల్లగొట్టాలని చూస్తే అందుకు మేము వ్యతిరేకించాం. అప్పుడు ఆయన వ్యవసాయాన్ని సహకార ఉద్యమం వైపునకు మళ్లింపజూశాడు. మళ్లీ దానిపై కూడా మేము ఉద్యమించడంతో 1963లో రాజ్యాంగానికి పదిహేడో సవరణ తలపెట్టాడు. నేనూ, నా కిసాన్ సహచరులూ కాంగ్రెస్‌లో కొనసాగుతూ రాజ్యాంగ వ్యతిరేకమైన ఆ చర్యను నిలువరించగలిగే వాళ్లమా? స్వతంత్ర పార్టీ ఆవిర్భవించకపోతే అది సాధ్యపడేదేనా? స్వతంత్ర పార్టీ తలపెట్టిన అదిగో అటువంటి అచంచల ప్రతిఘటన వల్లనే, రాజాజీ ఆశీర్వాద బలం వల్లనే నెహ్రూను కిక్కురుమనకుండాచేసి సీలింగ్ పరిధిలోకిరాని రైతులందరూ ఆ రాజ్యాంగ సవరణ బారినపడకుండా బయటపడ్డారు.

కాంగ్రెస్ పాలనలోని కంట్రోళ్ల, పర్మిట్ల, లైసెన్స్‌ల ప్రభుత్వాన్ని మేము వ్యతిరేకిస్తూ వస్తున్నాం. అత్యవసర వస్తువుల అమ్మకం, పంపిణీని కట్టడిచేసే చట్టపరమైన దోపిడీ నుండి రైతుల్ని కాపాడే విషయంలో విజయం సాధించాం. స్వతంత్ర పార్టీ భూమిశిస్తు రద్దును కోరుతుంది. భూమిశిస్తు రూపంలో అనాదిగా రైతులు అన్ని రకాల ప్రభుత్వ రథచక్రాల కింద పడి నలిగిపోతున్నారు. ఒరిస్సాలో స్వతంత్ర పార్టీ ఆధ్వర్యంలోని మంత్రి వర్గం భూమిశిస్తును రద్దుచేసి ఆదర్శప్రాయమైంది. ఉత్తరప్రదేశ్, బీహార్, పంజాబ్‌లోని కాంగ్రెసేతర ప్రభుత్వాలు కూడా ఆ దారినే నడిచాయి. నేను దీన్ని అధికారం చెలాయించే కాంగ్రెస్‌లో అగ్రశ్రేణి నాయకత్వానికి దూరంగా జరిగి సాధించిన ఘన విజయంగా భావిస్తాను. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షంలో ఉండి ఒక చోదకశక్తిగా నిలదొక్కుకోగలిగాను.

ప్లానింగ్ కమిషన్ సూపర్ కేబినెట్‌గా వ్యవహరించకుండా మన జాతీయ ప్రాధాన్యతల్లో వ్యవసాయానికి తగిన ప్రాధాన్యతను ఇచ్చి ఉంటే 1959 జూన్ 4 నాటి మద్రాస్ మహాసభ ఇచ్చిన రాజకీయ దిశా నిర్దేశం సంపూర్ణంగా సమర్థనీయమే.

స్వతంత్ర పార్టీలో గత తొమ్మిది సంవత్సరాలుగా మేము ఆర్థిక మాంద్యం, అవినీతివంటి మహమ్మారిలపై జాతీయ స్థాయి ఉద్యమాలు నిర్వహించాం. అలాగే హమాలీల అణచివేతపై కూడా. హమాలీలంటే తిండిగింజల బస్తాలను మోసే రైతులు, రైతు కూలీలు.

ఉదారవాద ఆర్థిక సిద్ధాంతాల రూపకల్పన, ప్రచారంలోని సకారాత్మక, గుణదోష వివేచకమైన ధోరణి జనసంఘ్ ఆర్థిక కార్యక్రమాలపై సానుకూల ప్రభావాన్ని చూపింది. దాని అధినాయకుడైన దివంగత శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ కూడా వాళ్ల కార్యాచరణను కూడా నియంతృత్వ సోషలిస్ట్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఉదారవాదం వైపునకు నడిపించాడు. మేము నిర్వహించే స్వతంత్ర ఉద్యమ కార్యక్రమాలు నెహ్రూ ప్రణాళికలపై, ఆయన సోషలిస్ట్ ఆర్థిక నియంత్రణపై ఎక్కుపెట్టినవైనందున కాంగ్రెస్‌పై జనసంఘ్ సవాల్‌కు ఊతాన్నిచ్చినట్టయ్యింది. ఆ విధంగా ఈ రెండు శక్తులూ అభివృద్ధి చెందుతూ కాంగ్రెస్‌కూ, నెహ్రూ తరహా నాయకత్వానికి సృజనాత్మక, శక్తిశీల, ప్రజాస్వామిక ప్రత్యామ్నాయాన్ని అందిస్తూ ముందుకు సాగాయి.

అంతర్జాతీయ రంగంలో మన విధానాల సమూల మార్పును మేము ఎలుగెత్తి చాటాం. మన అలీన విధానాన్ని మార్పు చేయాలని సరికొత్త ఎత్తుగడతో తూర్పు ఆసియా దేశాల పసిఫిక్ సంఘటనను ఏర్పాటుచేసి కమ్యూనిస్ట్ చైనా దురాక్రమణను నిలిపివేయాలని, మన పొరుగు దేశాలతో మరింత దగ్గర సంబంధాలు నెలకొల్పాలని కోరాం. ఇజ్రాయెల్‌ను, తైవాన్‌ను స్వతంత్ర దేశాలుగా ప్రకటించాలన్నాం. దలైలామాను టిబెట్ అధినాయకునిగా చేయాలన్నాం. మన విదేశాంగ విధానం ఇంకా రష్యాతోనో, అమెరికాతోనో, అరబ్ దేశాలతోనో ముడిపడి ఉండరాదని వాదించాం.

రాజాజీ ప్రపంచ శాంతికి ఎంతగానో పాటుపడ్డారు. అణు యుద్ధాన్ని ఈసడించుకుని అణు ప్రయోగాల నిలిపివేతకు ఎడతెగని పోరాటం చేశారు. ఈ దిశగానూ మరెన్నో విధాలుగా స్వతంత్ర పార్టికి చెందిన మేము ప్రజల్ని చైతన్యవంతుల్ని చేశాం. ప్రపంచ రాజకీయాల్లో పున:పరిశీలించాల్సిన మన పాత్రను గురించి చెప్పాం. నెహ్రూయిజంవంటి దృష్టి దోషాల నుండి ప్రజలను కాపాడేందుకు కృషి చేశాం.

రాజాజీ ఆ సమయంలో అలా నెహ్రూయిజంపై దండెత్తుతూ కమ్యూనిజానికి, నెహ్రూయిజానికి వ్యతిరేకంగా సాగే ఉద్యమంలో అగ్రభాగాన నిలిచేందుకు మమ్మల్ని ఆహ్వానించడం మన ప్రజలకు, ప్రజాస్వామ్యానికి అదృష్టం కలసివచ్చినట్టయ్యింది. తర్వాత పరిణామాల దృష్ట్యా 1959లో కాంగ్రెస్ నుండి వైదొలగాలనే నా నిర్ణయం మన ప్రజాస్వామ్యానికి ఆనాడు కావాల్సిన ఉత్ప్రేరక శక్తిగా రుజువైనందుకు నాకెంతో ఆనందం కలిగింది.

మేము విసిరిన సవాల్‌కు గల నైతిక శక్తి ఏపాటిదో నెహ్రూకు తెలుసు. అది 1952 ప్రాంతంలో కాంగ్రెస్‌ను వీడిన K.M.P, K.L.P, P.S.P వర్గాల ప్రభావం వంటిదికాదని, అది తన ఆర్థిక కట్టుబాట్ల ప్రణాళికా రచనకు ముందు జరిగిన చీలికలని తెలుసు. ఆయన వాగ్దానం చేసిన ప్రణాళికాబద్ధమైన ప్రగతిని సాధించకపోగా ప్రజలను కష్టాలపాలు చేసిందన్న వాస్తవం నుంచి మా వ్యతిరేకత తన్నుకు వచ్చింది.

కాంగ్రెస్ నాయకత్వంలో ఆయన వారసురాలు, ఆయన కుమార్తె నాయకత్వంలో మళ్లీ నా మీద కసి తీర్చుకోసాగారు. 1967లో జరిగిన సాధారణ ఎన్నికల్లో నన్ను ఓడించారు. **అయితే సర్దార్ లచ్చన్న, ఆంధ్ర అసెంబ్లీలో మా నాయకుడు, ఎంతో అభిమానంతో తాను గెలిచిన సీటుకు రాజీనామా చేసి తిరిగి జరిగిన ఉప ఎన్నికలో విజయం సాధించేటట్టు చేశారు.** కాంగ్రెస్ ఆ ఎన్నిక సందర్భంగా తలపెట్టిన మాయోపాయాలేవీ వాళ్లకు అక్కరకు రాలేదు. నేనే విజయం సాధించాను.

అలా నేను మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. పార్లమెంట్‌లోకి రెండుసార్లు ప్రవేశించేందుకు నాలుగు పర్యాయాలు పోటీ చేయాల్సి వచ్చింది. అది మా సమిష్టి కృషి వల్ల, త్యాగాల వల్ల సాధ్యపడింది. అయితే అది మళ్లీ నెహ్రూ తరహా నియంతల గుత్తాధిపత్యం కిందకు పోయింది.

ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేటప్పుడు కాంగ్రెస్ మోసాలకు గురికాకుండా నిలువగలగడం సంతోషదాయకం. వాళ్లు కాంగ్రెస్ బెదిరింపులకు, పక్షపాత వైఖరికి బలి పశువులు కాకుండా నిలదొక్కుకోగలిగారు. కాంగ్రెస్ ఎరగా చూపిన డబ్బుకో, కులాభిమానాలకో, అధికారం ఆధారంగా అందించే ఉపకారాలకో ఆశపడలేదు. అలా స్వేచ్ఛను ప్రేమించే ఈ అశేష ప్రజా కోటిని స్వతంత్ర వీరులుగా భావించి వందనాలు చెల్లిస్తున్నాను. నా ప్రజా జీవనంలో ప్రజా సేవకునిగా నేను సముపార్జించిందంతా వాళ్ల పరంచేసేందుకు నన్ను నేను సమర్పించుకునేటట్టుగా

వాళ్లు చేయగలిగారు.

ఈ గ్రంథంలో రెండు అధ్యాయాలు చోటుచేసుకోనందుకు నాకు బాధగా ఉంది. అది 1926-30 మధ్యకాలంనాటి నా కార్యకలాపాలకు సంబంధించిన విశేషాలు. అప్పట్లో మద్రాస్ విశ్వవిద్యాలయానికి చెందిన పచ్చయప్ప కళాశాలలో నేను చరిత్ర ఆర్థిక శాస్త్ర విభాగానికి చెందిన ప్రధాన ఆచార్యుణ్ణి. నేను ఆ సమయంలో ప్రభుత్వానికి గౌరవ ఆర్థిక సలహాదారుగా కూడా ఉండేవాణ్ణి. ఇదిగో సరిగా ఆ కాలంలోనే మద్రాస్ రాష్ట్రానికి చెందిన డి.ఎం.కె. ముఖ్యమంత్రి సి.అన్నాదురైకి పాఠాలు చెప్పాను. ఆయన మా స్వాభిమాన ఉద్యమంలో మాతో భుజం కలిపారు.

యెడతెగని ప్రజా కార్యకలాపాల్లో అప్పుడప్పుడూ వీలుచిక్కించుకుని దీని రాతప్రతిని తయారుచేశాను. చాలాభాగం 1957 నాటికే తయారైంది. తర్వాత వచ్చిన మార్పుల్ని దృష్టిలో ఉంచుకుని ఈ వివరాలన్నీ 1959వ సంవత్సరం వరకూ అక్కడక్కడా సరిదిద్దాను. అంటే స్వతంత్ర పార్టీ ఆవిర్భావం వరకూ. అంటే దానితో నా ప్రజా జీవితం మరో మలుపు తిరిగింది.

ఈ గ్రంథ రచనలో సహకరించిన ఎ.పి.జైన్, ఆర్.కె.శర్మ, శ్యామ్‌లాల్ గుప్తలకు కృతజ్ఞతలు.

గోభూమి
నిడుబ్రోలు
26 జనవరి 1968.

-ఎన్.జి.రంగ

విషయ సూచిక

1.	నా శైశవ గీతం	27
2.	మా పూర్వీకులు	63
3.	ఆక్స్‌ఫర్డ్‌లో తొలి యేడాది	67
4.	ఐరోపాలో, ఆక్స్‌ఫర్డ్‌లో నా జీవితం	73
5.	1933-36 నాటి ప్రజా ఉద్యమాలు	99
6.	నేనూ-చేనేత పనివారు (1935-55)	125
7.	లోక్‌సభకు ఎన్నికలు (1957)	128
8.	సెంట్రల్ అసెంబ్లీలో నా కృషి	132
9.	పార్లమెంటరీ కమిటీల పాత్ర	139
10.	రైతు విద్యాలయం నుండి అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ వరకూ (1934-36)	142
11.	రాయలసీమ, కళింగాంధ్ర రాజకీయ కార్యకర్తలకు శిక్షణ (1935-40)	151
12.	రైతుల కార్యకలాపాల్లో వ్యవసాయ కూలీల పాత్ర (1936-40)	155
13.	భారత జాతీయత-యునైటెడ్ ఫ్రంట్ (1936-40)	159
14.	కమ్యూనిస్ట్‌లకు వ్యతిరేకంగా జాతీయవాదుల కూటమి (1944-46)	170
15.	వామపక్ష సారస్వత ప్రభావం (1930-40)	175
16.	పలాస సదస్సు (మార్చి 1940)	179
17.	మా దాంపత్య జీవితం	182
18.	సౌందర్య పిపాస-ఆనందోపాసన-సత్యాన్వేషణ	190
19.	పర్యటనల అనుభవాలు	197
20.	భారతీయ శాస్త్రజ్ఞులతో భావ వినిమయం	208
21.	గాంధీజీ -యునైటెడ్ ఫ్రంట్ యుగం	213
22.	దేవిజీ సేవలు (1940-44)	216
	సామ్రాజ్యవాదులు, కమ్యూనిస్ట్‌లతో కలహం	228
23.	బాపూజీ నిర్మాణాత్మక కార్యక్రమాలు (1925-45)	224
24.	నెహ్రూతో నా సంబంధాలు: ఎంత దగ్గరో, అంత దూరం (1939-45)	228
25.	సర్దార్ పటేల్‌తో సంబంధాలు (1936-48)	232

26.	కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం సుభాష్‌బాబు ఆదర్శపూరిత ఉత్ప్రేరక ప్రభావం (1940 - 43)	238
27.	కె ఎం పి రాజీకు బాపూ దీవెనలు	241
28.	యుద్ధ సమయపు రాజకీయ ఖైదు-1940	245
29.	వలస ప్రజల స్వాతంత్ర్య కూటమి-1940	248
30.	బాపూజీ అంతిమ సందేశం-కాంగ్రెస్‌ను రద్దుపర్చడం-1948	251
31.	దేశ విభజన-అటు పిమ్మట	260
32.	భారత రాజ్యాంగ రచనపై సంగ్రహావలోకనం (1947-50)	264
33.	ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విచారణలు-విపత్తులు (1946-51)	272
34.	కాంగ్రెస్‌లో ఐక్యత కోసం నా విఫల యత్నాలు (1948-51)	289
35.	1951లో ఆంధ్రలో కాంగ్రెస్ పరాజయం	291
36.	వర్కింగ్ కమిటీ గవాక్షం నుండి అఖిలభారత కాంగ్రెస్ ... (1945-51)	236
37.	కంట్రోళ్ల రాజ్యంలో దుష్టపాలన (1941-48)	309
38	ప్రణాళికలు - నేను (1953)	320
39.	ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ-చేతివృత్తులవారు (1943-65)	330
40.	ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ దిశగా ప్రయాణం- (1946-56)	335
41.	రెండవ ప్రపంచ యుద్ధం-అనంతర పరిణామాలు (1956-66)	344
42.	విదేశాంగ విధానం-విదేశీ సాయం (1950-56)	350
43.	విదేశాంగ విధానం-విదేశీ ప్రయాణాలు (1955-58)	356
44.	కాంగ్రెస్‌కు రాజీనామా టాండన్, నెహ్రూతో ఉత్తరప్రత్యుత్తరాలు	372
45.	కృషికార్ లోక్‌పార్టీ పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యం కాంగ్రెస్ మంత్రుల్లో అవినీతి జాడ్యం	390
46.	1957లో లోక్‌సభ ఎన్నిక- నా అనుభవాలు	399
47.	లోక్‌సభలో దిగ్భ్రమ (1957-59)	405
48.	కాంగ్రెస్ అధ్యక్ష పదవి ప్రారబ్ధం (1955-66)	413
49.	వినోబా ఉద్యమానికి వ్యతిరేకంగా ఆంధ్ర రైతుల నిరసన...(1957-59)	421
50.	స్వతంత్ర పార్టీ నాయకత్వంలోకి రాజాజీ ఆహ్వానం	427
51.	పార్లమెంట్ సభ్యునిగా రాజీనామాకు నిరాకరణ	439

1. నా శైశవ గీతం

నేను పుట్టింది నిడుబ్రోలులో. అది అతి ప్రాచీన గ్రామం. అక్కడి శివాలయం వెయ్యేళ్లనాటిది. తమిళనాడులోని కాంచీపురాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించిన **చోళ చక్రవర్తి కులోత్తుంగ చోళుడు** దాన్ని నిర్మించాడు. అంతకంటే ప్రాచీన గ్రామాల మధ్యన మా గ్రామం ఉంది. అర్థాన్నిబట్టి చూస్తే మా గ్రామం పురాతన కాలంలోనే పెద్ద నగరంగా వెలుగొంది ఉండాలి. దానిపై బౌద్ధుల, విష్ణుకుండినుల, చోళుల ప్రభావం అధికంగానే ప్రసరించి ఉండాలి. క్రీ.శ. 1900 వరకూ మా జిల్లా కృష్ణా జిల్లా. అది కృష్ణా నదికి ఇరువైపులా విస్తరించి ఉండేది. పదమూడో శతాబ్దం వరకూ ఈ ప్రాంతాన్ని కర్మ రాష్ట్రమని లేదా కమ్మ రాష్ట్రమని పిలిచేవాళ్లు.

ఇది ప్రధానంగా వ్యవసా యక ప్రదేశం. అటువంటి ప్రదే శంలో **ఒక వ్యవసాయ ప్రధాన కుటుంబంలో జన్మించడం నా అదృష్టంగా భావిస్తున్నా.**

భారతదేశంలో వ్యవసాయ కుటుంబాల మూలాలు ఆదిమ జాతి సంతతికి చెందినవి. అటువంటి ఆదిమ జాతి సంత తుల్లో సగం సంతతులు సోదరు లుగా మెలిగేవాళ్లు. మిగతా సగంతో వివాహాది సంబంధాలు కలిగి ఉండేవాళ్లు.

నా తండ్రిది గోగినేని లేదా గంగినేని వారి తెగ. అమ్మది పాములపాటి వారి తెగ.

నా తండ్రి తెగ మొదట కడపలోనూ తర్వాత వరంగల్‌లోనూ ఉండేది. అక్కడి నుండి కొందరు ఖమ్మంకు, ఖమ్మం నుండి దివిసీమకు, అక్కడి నుండి భట్టిప్రోలు, నడింపల్లి, గూడవల్లి ప్రాంతాలకు చేరుకుని దాదాపు 250 సంవత్సరాల క్రితం నిడుబ్రోలుకు చేరుకున్నారు.

నా తల్లి తెగవారు పాములపాడుకు చెందినవారు. అది కృష్ణా నదికి ఉత్తరంగా ఉండేది. వాళ్లు కూడా 250 సంవత్సరాలకు పూర్వమే నిడుబ్రోలుకు చేరుకున్నారు. ఈ రెండు తెగలకూ చెందిన వ్యవసాయ కుటుంబాలు మా గ్రామ సాంఘిక జీవనంలో ప్రముఖ పాత్ర పోషించాయి.

మా ప్రాంతంలో ఏ గ్రామంలో నివసించేవాళ్లయినా భారతీయ జీవన విధానంలోని దాదాపు అన్ని సామాజిక శక్తుల పనితీరును దగ్గరగా గమనించగలరు. అన్ని మతాలకు చెందినవాళ్లు మా గ్రామ సీమల్లో నివసించేవాళ్లు. అంటే హిందూ, క్రైస్తవ, మహ్మదీయ మతాలకు చెందినవాళ్లు. మా గ్రామాల్లోని సాంఘిక-ధార్మిక సంబరాల వల్ల సామాజిక జీవనం ఉల్లాసంతో ఉప్పొంగేది, ప్రజలను ఉన్నత స్థాయికి చేర్చేది.

అయితే **దురదృష్టవశాత్తూ మా గ్రామాల్లో కులం కూడా రాజ్యమేలేది.** ఇళ్లల్లో జరిగే వేడుకలు, విందులు, వినోదాలు చాలా వరకూ కులాల చేరికగానే ఉండేవి. ఎక్కడైనా అన్ని కులాలవారిని ఆహ్వానించడం జరిగినా వారికి భోజనాలు విడిగానే ఏర్పాటుచేసేవాళ్లు. **సహపంక్తి భోజనాలు ఉండేవికావు.** అస్పృశ్యతా జాడ్యం, అగ్ర వర్ణాలు, నిమ్న వర్గాలు అనే విభజన పట్ల ప్రజల్లో గల సామాజిక, ధార్మిక విశ్వాసాలు గ్రామీణ సామాజిక జీవనంలో విష బీజాలు నాటాయి. గ్రామీణులంతా కలసికట్టుగా ఉండేందుకు వీలులేకుండా సమరశీలతను ప్రసాదించాయి. సామాజికంగా అగ్రభాగాన ఉన్న బ్రాహ్మణులు కమ్మ, రెడ్డి, తెలగ, యాదవ కులాల వారిని చిన్నచూపు చూస్తుంటే వ్యవసాయమే వృత్తిగా గల మాల, మాదిగ తెగలవారిని పైతెగలవాళ్లు చిన్నచూపు చూసేవాళ్లు.

గ్రామీణ సమాజంలో భూవసతి సామాజిక భద్రతను, ఆర్థిక పుష్టిని సమకూర్చింది. అది వడ్రంగం, కమ్మరి, కుమ్మరివంటి అనేక వృత్తులవారికి పని కల్పించి వారికి ధాన్యం వారి శ్రమకు ప్రతిఫలంగా అందేటట్లు చేసింది. ఆ విధంగా గ్రామీణ సమాజంలో రైతు కీలక పాత్ర పోషించసాగాడు.

నేను జన్మించింది క్రీ.శ. 1900 వ సంవత్సరం నవంబర్ ఏడో తేదీన. ఆ రోజునే

కార్తీక పౌర్ణమి. ఆ రోజు వెన్నెల కన్నుల పండువగా ఉంటుంది. అనేకమంది కవులకు వెన్నెల కవితా వస్తువు. బౌద్ధులకు, వైష్ణవులకు అది ఎంతో పవిత్రమైన రోజు. మా తల్లి తరపు తాత కుటుంబం సంపాదనాపరులైన రైతులు. మా తాత పేరు **రామయ్య.** వ్యవసాయానికి ఆయన ఆ చుట్టుపక్కల గ్రామాల్లో పెట్టింది పేరు. దృఢకాయుడు, భుజాలు వెడల్పుగా ఉండేవి. పొన్నూరు తిరునాళ్ల తిప్పి చూపేందుకు అవి బాల్య దశలో నన్ను బాగా మోశాయి. ఆయన తన కమతాన్ని మూడింతలు పెంచాడు. నాకు ఐదేళ్ల వయస్సున్నప్పుడు ఆయన మరణించాడు. ఆయన భార్య నాకు అమ్మమ్మ. కొంచెం పొట్టిగా, బక్క పలచగా ఉండేది. పంజాబీ వనితలా అందంగా ఉండేది. ఆమె భర్తను మించి ఉదారంగా వ్యవహరించేది.

తండ్రి తరపు తాత సంపన్నుడుకాదు. పెద్దగా సంపాదనాలేదు. ఆయనకు భూమిపైకంటే కూడా పశు సంపదపై మోజు. ఆ కారణంగా కూడా ఖర్చులు అధికంగా ఉండేవి. ఆయన తనువు చాలించేనాటికి ఆస్తిలో సగం హారతి కర్పూరమైంది. ఆయనకు మా నాన్న ఒక్కడే కొడుకు. ఆ ఒక్క కొడుక్కీ అప్పులు మిగిల్చిపోయాడు. మా నానమ్మ ఎంతగా ఇంట్లో రెక్కలు ముక్కలు చేసుకున్నా భర్తకు వ్యవసాయపు పనుల్లో, పశు పోషణలో సహకారం అందించలేకపోయేది.

మా అమ్మ **అచ్చమాంబ**, మా నాన్న **నాగయ్య**ల పెళ్లికి ముందే ఆ రెండు కుటుంబాలు చాలా సన్నిహితంగా మెలిగేవి. అసలు దక్షిణ భారతదేశంలో అన్నాచెల్లెళ్ల మనుమలు, మనుమరాళ్లు ఒకరినొకరు వివాహమాడదలిస్తే ఆ వివాహం జరిగి తీరాల్సిందే. ఈ ఆనవాయితీ ఆధారంగానే మా అమ్మకూ, నాన్నకూ వివాహమైంది. ఆ విధంగా గోగినేని, పాములపాటి తెగలు ఓ అర్ధ శతాబ్ది తర్వాత మళ్లీ వియ్యమందుకుని కలిసిపోయాయి.

రక్త సంబంధీకుల పెళ్లిళ్లు మళ్లీ తగ్గిపోసాగాయి. కట్నకానుకలు పెత్తనం సాగించాయి. దూర ప్రాంతాల సంబంధాలు సాధారణం కాసాగాయి. మళ్లీ ఎందువల్లనో అదే గ్రామంలో అదే తెగల మధ్య సంబంధ బాంధవ్యాలు బలపడసాగాయి. **కులాల అంతరాలు పోవాలనే మాటలైతే వినపడేవి కానీ కులాంతర వివాహాలు కనిపించేవికావు.** ప్రయాణ సౌకర్యాలు ఎంతగా మెరుగుపడినా అదే గ్రామంలో అదే కుదురులో చేసుకోవడమే సాధారణమైంది. కట్నకానుకలను కాదని అయిన సంబంధాలనే కోరుకోసాగారు.

సారవంతమైన పెద్ద కమతాలనేగాక ఇళ్లు, ఇంటి స్థలాలు, గొడ్డూగోదా, పాకలు,

చావిళ్లు మా తాతల నుండి మేము వారసత్వంగా పొందడమేకాక వాళ్ల తాతముత్తవ్వల నుండి వాళ్లకు సంక్రమించిన సామాజిక సేవ, సామాజిక స్ఫూర్తివంటి వాటిని కూడా అందిపుచ్చు కున్నాం. మా ముత్తాత గోగినేని నాగయ్య అప్పటి భూమిశిస్తు విభాగంలో ప్రముఖ ఉద్యోగిగా పనిచేశారు (1770–1800). అలా ప్రజా సేవకు సంబంధించిన స్ఫూర్తి గోగినేని శాఖ నుండి పాములపాటి శాఖకు పాకింది. వాళ్లు కట్టించిన సత్రాలను 1933 నుండి ఇండియన్ పెంట్ ఇనిస్టిట్యూట్‌కు ధారాదత్తం చేశాం.

నాగయ్య గారి మనుమడు రామయ్య ధర్మదాతగా పేరుగాంచాడు. **మా పూర్వీకులు నెలకొల్పిన గ్రంథాలయం గ్రామాభ్యుదయానికి ఉపకరించింది.** అలాగే మా బంధువు బుచ్చినాయుడు గారి దాతృత్వం వల్ల నిడుబ్రోలులో పి.బి.యన్. కళాశాల స్థాపించారు. పాములపాటి వారి వంశీకుల్లో ఒకరు నల్లమల అడవుల్లో పులితో పోరాడి మరణించగా ఆయన భార్య **సతీసహగమనం** పాటించింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని నిర్మించిన దేవాలయం కూడా ఉన్నది.

చుట్టుపక్కల కుటుంబాలకంటే గోగినేని, పాములపాటి వారి కుటుంబాలు హరిజనులను చేరదీసేవి. ఇతర నిమ్న జాతుల్ని కూడా దయగా చూసేవాళ్లు. ఈ కుటుంబాలకన్నా సామాజికంగా పటిష్టంగా ఉండి ప్రభావం చూపగల కుటుంబాలు లేకకాదు. వాళ్లు ఆ విషయాల్లో శ్రద్ధపెట్టలేదు.

పిన్న వయస్సులోనే మా తెగలవాళ్లు అశోకుని కాలానికి చెందిన సప్త సంతానాలను గురించి ముచ్చటించుకునేవాళ్లు. వాళ్ల పూర్వీకుల దాతృత్వాన్ని గురించి చెప్పుకుంటూ ఉండేవాళ్లు. ఇదంతా అటువంటి వారసత్వాన్ని పొందినందుకు ఒళ్లు గగుర్పొడిచేటట్లు చేసేది.

మా అమ్మ **అచ్చమాంబ**కు పూజా పునస్కారాలు మెండు. వివాహమైనతర్వాత చాలాకాలం వరకూ సంతానం కలుగలేదు. అప్పుడు మా మాతామహుడు దక్షిణదేశానికి కూతుర్నీ, అల్లుణ్ణీ మరికొందరినీ తీసుకుని తీర్థయాత్రకు బయలుదేరాడు. తిరుపతి వెంకటేశ్వరుడు, శ్రీరంగంలోని రంగనాయకుల కృప వల్ల నేను నిండు పౌర్ణమి రోజున అందులోనూ కార్తీక మాసంలో జన్మించినందువల్ల విశ్వ సృష్టికీ స్థితికీ కారకులైన ఆ దేవుళ్ల పేర్లు నాకు పెట్టారు.

నా తల్లిదండ్రులు స్వాభిమానం కలవాళ్లు. అతిశయం వైపు మొగ్గు చూపుతున్నట్టుగా కనిపించేది. మా నాన్నకు ఆయన తండ్రి అప్పు పంచి ఇచ్చాడు. దానికితోడు ఈయన

చేపట్టిన పశు పోషణ దాన్ని మరికొంత పెంచింది. మా అమ్మ అప్పు తీరేవరకూ తన నగలను, పట్టుచీరలను ధరించనంది. శుభ కార్యాలకు, ఇతరుల గృహాలకు వెళ్లడం మానుకుంది. ఆమె సోదరుడు రామస్వామి గారు ఆ బాకీలు తీర్చేందుకు సిద్ధమయ్యారు. అయితే స్వాభిమానం గల పడతులెవ్వరూ పెళ్లి సమయంలో ఇచ్చిన స్త్రీ ధనంకాక ఇంకేమిచ్చినా ముట్టుకోరాదన్నది మా అమ్మ అభిప్రాయం. మా నాన్న స్వాతిశయమూ తక్కువదేం కాదు. ఇంకేం వాళ్లు అందుకు అంగీకరించక బాగా కష్టపడి, పంటలు పండించి ఓ ఆరేళ్లలో బాకీలన్నీ తీర్చగలిగారు. మా అమ్మ పశుపోషణ పట్ల శ్రద్ధ చూపింది. ఆ బాకీలన్నీ తీరిన తర్వాత మా అమ్మ తిరిగి నగలు ధరించింది. మా మేనమామ మద్రాస్ నుండి తెచ్చిన పట్టుచీర కట్టింది. అయితే ఆ ఆనందం మూన్నాళ్ల ముచ్చటే అయ్యింది. ముప్పయ్ రెండేళ్లకే మృత్యు దేవతకు కన్నుకుట్టడంతో ఆమె కన్నుమూసింది. అప్పుడు నా వయస్సు ఎనిమిదేళ్లు, నా తమ్ముడు వెంకటప్పయ్యకు ఆరేళ్లు, లక్ష్మీనారాయణకు మూడేళ్లు. ఆమె చాలా అందగత్తె అని ఊళ్లోవాళ్లు చెప్పుకునే వాళ్లు.

మా నాన్న కొంచెం పొట్టిగా ఉండేవాడు. నలుపైనా అందంగానే ఉండేవాడు. మేము పుట్టిన తర్వాత ఎందుకో ఆయన ముక్కు వంకర పోయింది. మా అమ్మ గతించిన తర్వాత ఆయన ఆరోగ్యం దెబ్బతిన్నది. గ్రామాల్లో ముఠాతత్వాలు ఆయనకు నచ్చేవికావు. ఏ విషయమైనా తనకు తానుగా నిలబడేవాడు. మేము అన్నదమ్ములం ముగ్గురం, మా అమ్మ చనిపోయిన తర్వాత, మేనమామల ఇంట్లో పెరగసాగాం. మా నాన్న అంత పెద్ద స్వగృహంలో ఒంటరిగా జీవించేవాడు. మళ్లీ పెళ్లంటే ఒప్పుకోలేదు. 1920 ఆగస్టులో నేను మరో నెల రోజుల్లో ఇంగ్లండ్‌కు ప్రయాణమయ్యే తరుణంలో ఏకాంత జీవనం గురించి పెదవి విప్పాడు: 'మీరు ముగ్గురూ మాకు లభించిన ఫలాలు. కావాల్సినంత సంపద ఉంది. దీనితో నేను తృప్తిగానే ఉన్నా. మీరంతా బాగా చదువుకుంటున్నారు. అంతకంటే నాకింకేం కావాలి?'

మా నాన్న రెవెన్యూ అధికారుల, పి.డబ్ల్యు.డి. అధికారుల ఆగడాలపై పలుమార్లు ధ్వజమెత్తడం జరిగింది. అయితే వాళ్లను వ్యతిరేకించడం ఎంత కష్టమో తెలియవచ్చింది. కమక అందరిలాగే మా నాన్న తన భూమిపై తనకు సర్వసత్తాక అధికారం కలదనుకునేవాడు. ఆ విషయాల్లో ఎవరూ వేలుపెట్టరాదని గట్టిగా విశ్వసించేవాడు. **అప్పటికి** ఆయనకు నిర్బంధ భూసేకరణ చట్టం గురించి అవగాహన లేదు. కొందరు

గ్రామస్థులు మా భూమిగుండా కాలువ తవ్వాలని కుట్రపన్నారు. వాళ్లు ఆయనకు వైరి వర్గంవాళ్లు. అందుకు మా నాన్న సమ్మతించకపోవడంతో ప్రభుత్వం పోలీసు, రెవెన్యూ, పి.డబ్ల్యు.డి. అధికారులను మోహరింపజేసింది. అయినా గ్రామస్థులు వాళ్లను చెదరగొట్టడం జరిగింది. మా నాన్నపై విధి నిర్వహణలో ఉన్న అధికారుల్ని బెదిరించాడనే నేరారోపణ మోపారు. అప్పుడు ఆయన అన్నది ఏమంటే 'వాళ్లెవరు నా అనుమతి లేకుండా నా పొలంలో పాదంమోపి అపవిత్రం చేయడానికి? వాళ్ల ఇళ్లల్లోకానీ, పదిమందికీ చెందిన తావుల్లోకానీ నేనెవర్నీ అవమానించలేదే? కొట్టలేదే? వాళ్ల ఆస్తుల్నికానీ, హక్కుల్నిగానీ నేనేమీ అడ్డుకోలేదే?' అని. అందులో వ్యంగ్యం, విషాదం రెండూ అర్థమయ్యాయి జిల్లా మున్సిఫ్‌కు. కేసు కొట్టివేస్తూ పొలంలో ఒక పక్కగా కాలువ పోయేందుకు అంగీకరించమని సలహా ఇచ్చాడు. ఆ పొలం తర్వాత రంగా ట్రస్ట్‌కు ఇచ్చివేయడం జరిగింది.

ఇంకోసారి స్థానిక రెవెన్యూ ఉద్యోగులు కొందరు రైతుల్ని రెచ్చగొట్టి మా పొలంలో 0.06 ఎకరాల భూమిని ఆక్రమించుకునేటట్లు చేశారు. అది తెలుసుకున్న మా నాన్న తన భూమిని తనకు ఇప్పించాల్సిన బాధ్యతను గుర్తుచేశాడు. ప్రభుత్వం స్పందించకపోతే కోర్టులను ఆశ్రయించాడు. ఎంతో డబ్బు ఖర్చయ్యింది. చివరకు కోర్టు ఉత్తర్వుల ద్వారా ఆ ఆక్రమణను తొలగించుకోగలిగాడు. మా నాన్న హక్కుల సాధన విషయంలో నేనాయనకు చేదోడువాదోడుగా ఉన్నాను. ఆ సందర్భంగా పొలాలు కొలవడం నేర్చుకున్నా, డాక్యుమెంట్లు ఎలా రాయాలో తెలుసుకున్నా. నోట్లు రాసే పద్ధతి కూడా అర్థమయ్యింది. వకాలతులు పూర్తి చేయడం కూడా వచ్చేసింది. కోర్టు నుండి వచ్చే కాగితాలకు సమాధానాలు రాయసాగాను. ఇదంతా 15-21 సంవత్సరాల మధ్య వయస్సున్నప్పుడే జరిగింది. అలా ఆయనకు సాయపడుతూనే హైస్కూల్ చదువు అత్యధిక మార్కులతో కృతార్థుణ్ణి కావడంతో నేను ICS పోటీ పరీక్షలో నెగ్గుకు రాగలననే నమ్మకంతో తాను కూడబెట్టిందంతా నాపై ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యాడు మా నాన్న 1920లో.

నేను లండన్‌కు పయనమయ్యేరోజు రానే వచ్చింది. ఆగస్ట్ 19న బొంబాయికి బయలుదేరాను. ఆయనకు నా పట్ల గల అమిత ప్రేమ వల్ల నాకు వీడ్కోలు చెప్పేందుకు రైల్వే స్టేషన్‌కు రాలేకపోయాడు. తర్వాత ధాన్యం ధరలు పడిపోయాయి. రూపాయి మారకం రేటు పడిపోయింది. ఆక్స్‌ఫర్డ్‌లో నాకు అయ్యే ఖర్చులు మొదట

అనుకున్నదానికంటే రెట్టింపయ్యాయి. అయినా ఆయన నా చదువుకు ఆటంకం కలిగించదల్చుకోలేదు. మరణశయ్యపై ఉండి, ఆయన నా తమ్ముడిని పిలిచి నా చదువుకు ఆటంకం కలుగరాదని చెప్పాడు. ఆయనకు మా పట్ల గల ప్రేమ అంత గాఢమైనది, గూఢమైనది. అటువంటి తండ్రి నన్ను ICS అధికారిగా చూడాలనుకోవడంలో ఆశ్చర్యపడాల్సిందేమీలేదు.

నా చిన్నతనంలో తెలుగు వర్ణమాల నాకు చాలా కష్టంగా ఉండేది. బడి చదువు పట్ల విరక్తి కలిగింది. అయితే మా కుటుంబంలోని బాల వితంతువు మంగమ్మ గారు నాకు గురువైంది. ఆమె మాటపై నాకు గురి కుదిరింది. ఆమె వ్యవసాయం విషయంలో, లోక వ్యవహారంలో అందించిన విద్య అంతా ఇంతా కాదు.

మా అమ్మ చదువుకున్నదికాదు. అయితే నేను బ్రాహ్మణుల పిల్లల్లాగా చదువుకోవాలని తహతహలాడేది. **బడిలో పంతుళ్లకేమో పిల్లల్ని కొట్టడం మీద ఉన్నశ్రద్ధ పాఠాలు చెప్పడం మీద ఉండేదికాదు.** అయితే మా తాత, తండ్రివలేకాక నాలుగు ముక్కలు నేను, నా తమ్ముడు రాయడం చూసిన తర్వాతే మా అమ్మ తనువు చాలించింది. మేము మా మంగమ్మ అత్తయ్య, అమ్మమ్మ రక్షణలో ఉండిపోయాం.

బడి చదువులకు దూరంగా ఉన్నా నా చదువు సాగుతూనే ఉంది. రైల్వే మేస్త్రీ చెప్పే భారత, రామాయణ కథలను విని పొలం వెళ్లి గొడ్లు కాసే పిల్లలకు ఆ కథల్ని నా మాటల్లో చెప్పసాగాను. అందుకు ఆ మేస్త్రీ ఎంతో ముచ్చటపడ్డాడు. అటువంటి కథలున్న పుస్తకాల్ని నాకు తెచ్చి ఇచ్చాడు. అవి చదివి ఆ కథల్ని నా మాటల్లో చెప్పసాగాను. అది నా చదువుకు ఒక బలవర్ధక ఔషధంగా మారింది. నేను పొలాలు పట్టుకుని తిరగడం మానుకుని ఊళ్లో ఉండే పిల్లలకు ఆ కథలు చెప్పసాగాను. అవి మెల్లగా ప్రకృతికి, వ్యవసాయానికి సంబంధించిన కథలుగా రూపొందసాగాయి. తర్వాత ఆ కథలు మా మంగమ్మ అత్తయ్యకు కూడా నచ్చడంతో ఆమె వాటికి ప్రథమ శ్రోతగా మారిపోయింది.

తర్వాత నారాయణ అనే హరిజన ఉపాధ్యాయుడు కథలు చెప్పడంలో దిట్ట. ఆయన మా గ్రామానికి వచ్చాడు. ఆయనకు దేవుళ్లను ఎదిరించిన శక్తుల కథలు చాలా వచ్చు. ఆయన దృష్టిలో ఆ శక్తే అన్నిటికీ మూలం. అలా ఆ కథకులు నాకు నేర్పగలిగినంత నేర్పారు.

ఇంతలో మా **మామయ్య రామస్వామి**, ఆయన కర్షక మిత్రుడు **జంపని ఆంజనేయులు**

జాతీయోద్యమ ప్రభావానికి గురయ్యారు. అది 1908 నాటి బెంగాలు విభజన సందర్భంగా జరిగిన సంగతి. సమీపంలోని అమృతలూరులో ఒక గ్రంథాలయం స్థాపించి, దానితో పాటు ఒక సంస్కృత పాఠశాలను నెలకొల్పి అంతకుపూర్వం సంస్కృతం చదవడం నిషేధించబడినవారికి నేర్పే ఏర్పాటుచేశారని వారికి తెలియవచ్చింది. ఇంకేం వీళ్లు మా గ్రామంలో కూడా ఒక గ్రంథాలయం ఏర్పాటుకు పూనుకున్నారు. ఒకరోజు ఎక్కడి నుండో ఒక పుస్తకాల పార్శిల్ వచ్చింది. ఆ పుస్తకాలు బైండ్ చేసిన తీరు, కొత్త కాగితాల నుండి వస్తున్న సువాసన, ఆకర్షణీయమైన అక్షరాలు నాకెంతో నచ్చాయి. అందులో ఒక పుస్తకం తీసుకుందామంటే మా మేనమామ గ్రంథాలయానికి వెళ్లి తీసుకోమన్నాడు. అక్కడ గ్రంథ పాలకుడు **ఆంజనేయులు** గారిని కలసి, తొలిసారిగా **'రాణీ సంయుక్త'** అనే పుస్తకాన్ని అక్కడి నుండి తెచ్చుకున్నా. అంత మంచి పుస్తకాన్ని తెచ్చుకోవడం ఎంతో గొప్పగా ఉంది. దాన్ని ఒక వారం రోజుల్లో తిరిగి ఇవ్వాలని చెప్పగా అలా చేస్తే మరో పుస్తకం ఇస్తారా అని అడిగాను.

రాణీ సంయుక్త పుస్తకం చదివితే భారతదేశపు చివరి **చక్రవర్తి పృథ్వీరాజ్, మహారాణి సంయుక్తలు** మన దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడేందుకు శాయశక్తులా పోరాడి వీరమరణం పొందారని తెలిసింది. ఆఫ్గన్ దురాక్రమణ విషయం అటుంచుదాం. సంయుక్త తండ్రి **జయచంద్ర** ఆఫ్గన్ల వైపు ఉండడమేమిటి? వారం లోపలే పుస్తకాన్ని తిరిగి ఇచ్చేశా. దాని సారాన్ని వివరించమని ఆంజనేయులు గారు అడిగితే ఆపకుండా అరగంటసేపు చెప్పుకు పోయాను. దానితో ఆయన నాకు ఒక పుస్తకంగాక రెండు పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లేందుకు అనుమతించారు. తర్వాత మామయ్యకు తెలిసి ఆనందించాడు. అందరికీ పండితుణ్ణవుతాననే అభిప్రాయం కలిగింది.

అలా నాకు **గ్రంథాలయోద్యమం ద్వారా విజ్ఞాన చంద్రికా గ్రంథమాల, మచిలీపట్నం లోని ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల సమాచారం తెలియవచ్చింది.** గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, డాక్టర్ పట్టాభి గార్లు పరిచయమయ్యారు. పిన్న వయస్సులో అందమైన అచ్చు, ఆకర్షణీయమైన బైండింగ్‌తో ఉన్న పుస్తకాలు మనస్సును ఎంతగా ప్రభావితం చేస్తాయో ఆనాడే తెలియవచ్చింది. అందుకే **నేషనల్ బుక్ ట్రస్ట్** స్థాపనను నేను స్వాగతించాను.

1909-10 మధ్యకాలంలో నేను కలల ప్రపంచంలో బతికాను. తెలుగు కవుల పద్యాలు, పాటలు పాడుకున్నాను. అందులో భారత, భాగవత రచనల నుండి ఆధునిక రచనల వరకూ ఉన్నాయి. రాజస్థాన్, బెంగాల్ ప్రాంతాల కథలు చదివాను. నీలిమందు

రైతుల వ్యథలు తెలుసుకున్నాను.

గ్రంథ పాలకులు ఆంజనేయులు గారి ద్వారా చుట్టుపక్కల గ్రామాల్లోని మహ్మదీయులు విదేశీయులు కారని, మత మార్పిడుల వల్ల మహ్మదీయులుగా మారారని తెలుసుకున్నాను. ఆయన నన్ను హరిజన సంక్షేమానికి కృషి చేయాల్సిందిగా కోరారు. వాళ్లు బ్రిటిష్ పాలనలో క్రైస్తవులుగా మారిపోకుండా చూడాలని సలహా ఇచ్చారు.

అప్పటికి రైతుల పిల్లలు, హరిజనుల బిడ్డలు, గ్రామాల్లోని బాలికలు ఉన్నత పాఠశాలల్లో చదువుకు ఇంకా అలవాటుపడలేదు. వెళ్లిన వాళ్లు పొన్నూరు, మునిపల్లె, మునుకుదురు, ఆలూరు గ్రామాల్లోని బ్రాహ్మణ బాలురంతగా రాణించడంలేదు. అది నాకు సిగ్గు చేటనిపించింది. కనుక వారాంతాల్లో నా వద్దకు వచ్చేందుకు ఇష్టపడే వాళ్లకు ఉచితంగా బోధించేవాణ్ణి. అటువంటి విద్యార్థుల్లో ఒకరు తర్వాత రోజుల్లో శాఖాధిపతి అయ్యారు.

రైతుల్లో బడికిపోయే వయస్సు దాటిన వాళ్లను కూడా అక్షరాస్యుల్ని చేయాలనుకున్నా. **రైతులకు విద్యాలేమి ఒక శాపంగా తయారైందనుకున్నా.** అందులో అది ఆంధ్ర గ్రంథాలయోద్యమంలో తొలి దశాబ్ది. నావంటి యువకులపై దాని ప్రభావం జాస్తిగానే ఉండేది. ఇంకేం మా గ్రామంలో రాత్రి పాఠశాలను ప్రారంభించాం. తర్వాత రోజుల్లో ఆ రాత్రి పాఠశాలలో చదివిన వారు మా గ్రామంలో ప్రజా సేవకులయ్యారు.

ఆ రోజుల్లో **కాశీనాధుని నాగేశ్వరరావు**గారి ఆంధ్ర పత్రిక సామాజిక కార్యక్రమాల్ని చేపట్టే నావంటి యువకులకు ఊతాన్నిచ్చేది. అందులో ఒక కార్యక్రమం వారంలో ఒకరోజు రైతుల ఇళ్లకు వెళ్లి ధాన్యం పోగుచేయడం, దాని ద్వారా బడికి జీతాలు చెల్లించలేని వాళ్ల ఫీజులు చెల్లించడం. అలా మేము ఫీజులు కట్టి చదివించిన ఓ రెడ్ల అబ్బాయి ఎం.ఎ; బి.ఎల్; చదివి ఒక ప్రముఖ నాయకుడయ్యాడు ఆంధ్రప్రదేశ్‌లో.

చారిత్రకంగా పల్నాడు, చోళ, కాకతీయ, యాదవ, విజయనగరాలకు చెందిన రాజ్యాల్లోని సంబంధ బాంధవ్యాల కారణంగా కొన్ని రైతుల తెగలు క్షత్రియులుగా చూడబడేవారు. అయినా నాకెందుకో కులాల పెచ్చుతగ్గులు నచ్చేవికావు. **నేను కులాలకు, మతాలకు అతీతంగా సహపంక్తి భోజనాలు ఏర్పాటుచేసేవాణ్ణి.** ఆ విధంగా నేను సామాజిక సమన్యాయం కోసం చేసిన పోరాటానికి బీజాలు ఇక్కడ సమస్త వృత్తులవారిని చేరదీయడంలోనే పడ్డాయి. అసలుసిసలైన క్షత్రియ యువకుల్లోనూ, ఇతరుల్లో కూడా అటువంటి క్షాత్ర ధర్మాన్ని కనుగొనే శ్రద్ధే ప్రజాస్వామ్యానికి కావాల్సింది.

గ్రామీణ గ్రంథాలయోద్యమంలో నా కృషికి ఆంజనేయులు తోడ్పాటు ఎంతగానో ఉంది. అది 1910-16 మధ్యకాలం. నేను బ్రాహ్మణుడిలా మాట్లాడేటట్టు చేశాడు. బ్రహ్మ సామాజికుడైన వీరేశలింగం రచనలు చదివేటట్టు చేశాడు. ఆయన అస్పృశ్యతకు, కుల వ్యవస్థకు, దేవతలు, దెయ్యాలు వంటివాటికి వ్యతిరేకంగా రాశాడు. అలాగే **వివేకానందుని వేదాంతం, తిలక్, బిపిన్‌చంద్రపాల్ రాజకీయం** వంటివి అవగాహనల్లోకి వచ్చేటట్టుగా చెప్పి జాతీయ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను నాకు అందుబాటులోకి తెచ్చాడు. ఆంజనేయులు సహాయంతో నేను తెలుగులో ఉన్న వృక్షశాస్త్రం, శరీర నిర్మాణ శాస్త్రం, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, అమెరికా, ఇంగ్లండ్‌ల రాజ్యాంగాలు, ఇంగ్లండ్-అమెరికా-ఫ్రాన్స్ దేశాల రాజ్యాంగ చరిత్ర చదివాను. ఆంధ్ర పత్రిక దినపత్రిక, వారపత్రిక చదివేవాణ్ణి. కృష్ణా పత్రిక వారపత్రిక చదివేవాణ్ణి. అందులోని వ్యాసాలు చదవడం వల్ల చరిత్రకు, రాజకీయాలకు సంబంధించి లభించిన జ్ఞానం విశ్వవిద్యాలయాల నుండి పట్టాలు పుచ్చుకున్నవారికి కూడా ఉండేది కాదు.

మాతృభాషలో బోధనకు సంబంధించిన సౌలభ్యం అప్పుడే తెలియవచ్చింది. **మన దేశంలోని భాషోద్యమాన్ని స్వాగతించాను.** మా మేనమామ రామస్వామి గారు నన్ను 1911లో బాపట్లలో నిర్వహిస్తున్న తొలి తెలుగు మహాసభలకు తీసుకెళ్లాడు. నాకు తెలుగు పాండిత్యం బాగానే అబ్బింది. నాకు పొన్నూరు పండితులు సంస్కృతం నేర్పేందుకు నిరాకరించినందుకు మా మేనమామ బాగా కోపగించుకున్నాడు. కనుక నన్ను పొన్నూరులో ఆంగ్ల పాఠశాలకు పంపదల్చుకున్నాడు. ఆయన నన్ను చూసి మా సోదరి ఉండి ఉంటే చదువులో కొడుకు అభివృద్ధి చూసి ఎంతగా మురిసిపోయేదో అనుకున్నాడు. 'నేను గ్రంథాలయంపై ఎంతో ఖర్చు చేశాను. అందుకు కారణం అది రంగా జీవితంలో గొప్ప విప్లవాత్మక మార్పును తెచ్చి అతణ్ణి ఒక పండితునిగా తీర్చిదిద్దింది' అన్నాడు. అయితే 1911లో జబ్బు చేసి ఆయన మృత్యువాతపడ్డాడు. నేను ఇంగ్లీష్ చదవడం చూడకుండానే కన్నుమూశాడు. ఆయనకు గల ఆస్తి మొత్తం మా అన్నదమ్ములు ముగ్గురికీ పంచి ఇచ్చాడు. ఆయన **భార్య లక్ష్మీదేవి, సోదరి మంగమ్మ, తల్లి అమ్మిమ్మ** మాకు గార్డియన్లుగా నిలిచారు. మా అక్క లక్ష్మీదేవికి ఒక్కటే ఆడపిల్ల. ఆ పిల్ల కూడా అంతకుముందే చనిపోయింది. వాళ్లంతా మమ్మల్ని బాగా చూసుకున్నందువల్లే మేము ఇంతవాళ్లమయ్యాం. ఆక్స్‌ఫర్డ్‌లో నేను చదువుకోగలిగాను. వాళ్ల రుణం ఏమిచ్చి తీర్చుకోగలను? నా గ్రంథం **'క్రెడో ఆఫ్ వరల్డ్ పెజెంట్రీ'** వారిరువురికీ అంకితమిచ్చాను.

మా మేనమామ అకాల మరణం మరో రెండేళ్లు నేను ఇంగ్లీష్ చదువుకు వెళ్లేందుకు ఆటంకంగా నిలిచింది. మంగమ్మ కొందరు పండితుల్ని సంప్రదించింది. అదేదో ఇంగ్లీష్ చదువులు పొలం పుట్రాలేని మాలాంటి బ్రాహ్మణులకుగానీ రంగాకు ఎందుకన్నారు. ఇంకేం ఆమెకు ఆ సమాధానం సంతృప్తిని కలిగించిందనుకుంటాను. కనుక ఆమె నన్ను వ్యవసాయంపై శ్రద్ధ పెట్టమంది. నేను కర్షక యువకులకు పాఠాలు చెప్పడం కొనసాగించినా, స్థానిక గ్రంథాలయాన్ని ప్రజా రంజకం గావిస్తున్నా తర్వాత రెండు సంవత్సరాలు వ్యవసాయానికే ధారపోశాను. అప్పుడు వ్యవసాయ ఖర్చుల లెక్కలు రాయడం వల్ల అది జీవితంలో నాకు ఎంతగానో ఉపయోగపడింది. ప్రణాళికలు-పథకాలపై చర్చల సందర్భంగా అది గీటురాయిగా నిలిచింది.

మా నాన్న ఇంగ్లీష్ చదువుకోనందున ప్రభుత్వ అధికారుల వల్ల ఇబ్బందులకు గురైన విషయం గుర్తుచేసిన కారణంగా ఎట్టకేలకు నన్ను ఆంగ్లం చదివించేందుకు పొన్నూరుకు 1914లో పంపారు. అదే సంవత్సరం తొలి ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది.

పొన్నూరు ఆంగ్ల పాఠశాలలో ప్రవేశించిన తర్వాత అక్కడి ఉపాధ్యాయులకు అర్థమైపోయింది- ఒక్క ఆంగ్లంలో తప్ప ఇతర అంశాలన్నింటిలో వాళ్లల్లో చాలామందికి ఉన్నంత జ్ఞానం నాకూ ఉందని. నేను థర్డ్ ఫాం (8వ తరగతి)కి వచ్చేటప్పటికి ఒక ఆదర్శ ఉపాధ్యాయుడు ఆర్.వెంకయ్య అనే ఆయన ఆసరా లభించింది. ఆయనది నెల్లూరు. ఆయన ప్రకృతి ప్రేమికుడు. వర్డ్స్‌వర్త్ కవిత్వమంటే వల్లమాలిన అభిమానం. స్వామి రామతీర్థ అనుయాయి. ఆయన సంరక్షణలో నేను ప్రసంగించడంలో, వ్యాస రచనలో రాటుదేలసాగాను.

తొలి ప్రపంచ యుద్ధపు ఘటనలు గ్రామాల్లో చదువుకున్నవాళ్లల్లో చైతన్యాన్ని నింపసాగాయి. ఆంధ్రోద్యమం ఊపందుకుంది. అది జాతీయ ఉద్యమంగా రూపుదాల్చి దేశ స్వాతంత్ర్యాన్ని కోరసాగింది. ఉపాధ్యాయుడు వెంకయ్య, మిత్రుడు ఆంజనేయులు నాకు కోపు కాశారు. విద్యార్థులు రాజకీయ సదస్సుల్లో పాల్గొనరాదన్న గవర్నర్ నిషేధ ఆంక్షలను ఉల్లంఘించి వెంకయ్య గారి నగరమైన నెల్లూరులో 1917లో జరిగిన ఆంధ్ర మహాసభకు హాజరయ్యాను. అక్కడ ఆంధ్ర రత్న **దుగ్గిరాల గోపాలకృష్ణయ్య** గారి ఉత్తేజపూరిత ప్రసంగాన్ని తొలిసారిగా విన్నాను. ఆయన **రాయప్రోలు సుబ్బారావు**గారి ఆంధ్రుల కీర్తిని చాటే పాటలను పాడగా విన్నాను. అంతకుముందే **చిలుకూరి**

వీరభద్రరావుగారి ఆంధ్రుల చరిత్ర రెండు సంపుటాలు చదివి ఉన్నాను. కొందరు తిలక్ త్యాగాలను తెలియజేస్తుంటే దేశభక్తి పూరితమైన శివాజీ సాహసాలు గుర్తుకొచ్చాయి. అప్పటికే నేను **కె.వి.లక్ష్మణరావు** గారు రాసిన శివాజీ జీవిత చరిత్ర చదివి ఉన్నాను.

నెల్లూరు సభ నా కళ్లు తెరిపించింది. నేను ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి అశేష ప్రజా వాహినిలో కలిసిపోయాను. ఆ సభ తర్వాత బ్రిటిష్ గవర్నర్ **అనీబిసెంట్**ను నిర్బంధానికి గురిచేశాడు. దాన్ని తెలుగు పత్రికలన్నీ ఖండించాయి. ఆమె సంపాదకత్వాన వెలువడే **'న్యూ ఇండియా'** అనే ఆంగ్ల పత్రిక భాష అందరికీ అర్థమయ్యేరీతిలో ఉండేది. ఆ పత్రిక సంపాదకీయాలు మాకు ఎంతగానో ధైర్యాన్ని నూరిపోసేవి. అందువల్ల మేము బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆలోచించగలిగాం, మాట్లాడగలిగాం, రాయగలిగాం.

అన్నింటికీ మించి దక్షిణాఫ్రికాలో విజయాన్ని మూటగట్టుకుని వచ్చిన మహాత్మా గాంధీ భారతీయ జనజీవనంలోకి ప్రవేశించడం ప్రశంసార్హమైంది. అంతలో బర్మాలో ఆరేళ్ల కారాగారవాసం తర్వాత తిలక్ భారతదేశం తిరిగి రావడం, శ్వేతజాతికి చెందిన అనిబిసెంట్ భారత జాతీయ వాంఛితాలను ఎలుగెత్తిచాటడం చూసి మా ప్రాంతంలో నేనూ అనిబిసెంట్ నిర్బంధానికి వ్యతిరేకంగా ఊరేగింపు నిర్వహించాను. పోలీసులు వెంటనే మంగమ్మను, తన ముద్దుల కొడుకు చర్యల్ని ఖండిస్తూ హెచ్చరించి వెళ్లారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తన అడుగులో అడుగేస్తున్నందుకు నా తండ్రికి ఆనందంగానే ఉంది.

నేను కిశోర ప్రాయంలోనే వీరేశలింగం రచనలు పది సంపుటాలు మళ్లీ మళ్లీ చదివాను. నేను దేవుళ్లను పూజించడం మానేసి **ఏకేశ్వరోపాసన** వైపునకు మళ్లాను. నేను శాకాహారిగా మారిపోయాను. జన్మ కారణంగా ఎవరినీ గొప్పవారిగా గుర్తించక వాళ్ల మంచితనం, ప్రవర్తన, పాండిత్యం, శీల సంపద ఆధారంగా వాళ్ల గొప్పతనాన్ని నిర్ణయించసాగాను. నేను ఆయన ఆత్మకథ చదివాను. ఆయన రాసిన ప్రఖ్యాత పురుషుల జీవిత చరిత్రలు చదివాను. అది నేను దిన చర్య రాసేందుకు తగిన స్ఫూర్తినిచ్చింది.

1917 ప్రాంతంలో అత్యంత ఆశ్చర్యకరమైన సంఘటన ఒకటి జరిగింది. మా బంధువు ఒకాయన ఇరవై సంవత్సరాలుగా ఏమయ్యాడో తెలియదు. ఆయన అకస్మాత్తుగా దక్షిణాఫ్రికా నుండి తిరిగి వచ్చాడు. ఆయన మహాత్మా గాంధీతో కలసి జైలుకు వెళ్లాడు. ఆయన మహాత్ముడ్ని గురించి, కస్తూరీబాయి గురించి ఒక విశ్వజనీన

భావనను మా మనస్సుల్లో చిత్రించాడు. అనేక సాయం సమయాలు ఆయనతో గడుపుతూ ఆయన చెప్పే విషయాలు నోట్స్ రాసుకునేవాణ్ణి.

నేను ఉద్యమకర్తగా రాణిస్తూనే ఉన్నా. అయితే చదువులోనూ అంతే స్థాయిలో రాణించాల్సి ఉంది. ఆంగ్లం, గణితం, భౌతిక శాస్త్రాల్లో మార్కులు అంత బాగా రావడంలేదు. అప్పికట్లకు చెందిన **ఆచంట నాగయ్య**, గుంటూరులో చదువుతున్న మా ఊరు బ్రాహ్మలబ్బాయి **గోపాలకృష్ణయ్య**లు నాకెంతగానో సాయపడ్డారు. అందరం మెట్రిక్యులేషన్ పరీక్షల్లో కృతార్థులమయ్యాం. తగిన స్థోమతులేక గోపాలకృష్ణయ్య చదువు మానేశాడు. తర్వాత జీవితంలో రైతు ఉద్యమంలో ఆయన నా వెంట నడిచాడు. గోపాలకృష్ణయ్య కొంతకాలంపాటు ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. తర్వాత వక్తృతమొచ్చింది. కడవరకూ మేము మంచి మిత్రులుగానే ఉండిపోయాం.

1919లో ఉన్నత పాఠశాలల్లో స్కౌట్ ఉద్యమం ఊపందుకుంది. అది యువకుల్ని సామాజిక సేవకు పురికొల్పేదిగా కనిపించింది. **నేను కూడా అందులో చేరి రాణించాను.** 1920లో మా ఉన్నత పాఠశాల హాలులో జిల్లా సహకార సదస్సు నిర్వహించారు. నన్ను స్వచ్ఛంద సేవకుల జట్టుకు నాయకునిగా ఎంపిక చేశారు. అప్పుడు తెలిసివచ్చింది నాకు – సహకార ఉద్యమం ద్వారా మన రైతు సోదరులు, వృత్తి పనివాళ్లు అప్పులిచ్చేవాళ్ల కబంధ హస్తాల నుండి ముక్తిని పొందగలరని.

మేము ఫుట్‌బాల్ క్లబ్ నిర్వహించడం జరిగిందికానీ నా సమయం సాయంత్రాలు అధికం గా గ్రంథాలయంలో పుస్తక పఠనంలోనే గడిచేది. మా గ్రామ మునసబు **ఏవి.సుబ్బయ్య** గారి ప్రాపకం పొందేందుకు అనేక మంది కవులు మా గ్రామానికి వస్తూ ఉండేవారు. ఎందువల్లనో నాకు కవిత్వం అబ్బలేదు. అయినా లలిత కళలంటే నాకు అభిమానమే. మా గ్రామంలో ఆంజనేయులు సహకారంతో ఒక ఔత్సాహిక నాటక సమాజాన్ని నెలకొల్పాం. సభ్యుల దురలవాట్ల వల్ల మెల్లగా అది మూతపడింది. అయితే రైతు కుటుంబానికి చెందిన ఒక సభ్యుడు **పర్వతనేని వీరయ్య** అగ్రగామి సంగీతజ్ఞునిగా ఆంధ్రదేశంలో వినుతికెక్కాడు. ఆయనకు తర్వాత కాలంలో గణతంత్ర వేడుకల్లో దేశాధ్యక్షుని నుండి గౌరవం పొందేటట్లుగా సాయం అందించగలిగాను.

ఆంజనేయులు, **పాములపాటి వెంకట కృష్ణయ్య** గార్లు మద్రాస్ ప్రెసిడెన్సీ కమ్మ మహాసభ జరపాలని ఉవ్విళ్లూరుతున్నారు. వాళ్లతో నన్నూ కలవమన్నారు. అయితే **సామాజికంగా వెనకబడినవారు రాజకీయంగా, సామాజికంగా స్వయంసన్నద్ధులవుతున్న**

రోజులవి. కులాలకు సంబంధించిన సభలను ప్రగతిదాయకంగా నిర్వహించేవాళ్లు. దాన్ని మేము కమ్మ మహాసభగా ప్రారంభించినా తాలూకాలోని బ్రాహ్మణేతరులంతా సహకరించారు. ఆంగ్ల వనితను వివాహమాడిన **బారిష్టరు పి.వి.సుబ్బారావు**, ఎడింబరో నుండి ఎం.ఎ. పట్టా పుచ్చుకుని ఐ.సి.ఎస్. ట్రయినింగ్‌కు త్వరలో ఇంగ్లండ్ వెళ్లనున్న **శ్రీ వి.రామకృష్ణ**, ఆక్స్‌ఫర్డ్‌లో తర్వాత కాలంలో నాకు గార్డియన్‌గా ఉన్న **కె.గోపాలకృష్ణయ్య** గార్లు ఆ సభకు హాజరయ్యారు. యువకుడు, కర్షక కవి **తుమ్మల సీతారామ్మూర్తి** స్వాగత గీతాన్ని రాసి గానం చేశారు. ఆయనే తర్వాత అభినవ తిక్కనగా కీర్తి గడించారు. (ఆయనకు మాత్రం తెలుగు లెంక బిరుదుపైనే ఎక్కువ మక్కువ).

ఆ సభలో రాజకీయ తీర్మానాలు చేయలేదు. సామాజిక సంస్కరణల అవసరాన్ని నొక్కి వక్కాణించడం జరిగింది. **ప్రతి స్త్రీకి, పురుషుడికి వేదాలను, ఉపనిషత్తులను, ఇతర పవిత్ర గ్రంథాలను వల్లె వేసే హక్కు ఉండాలని, అస్పృశ్యతను అరికట్టాలని, పరదా, వరకట్నం వంటి దురాచారాలు దూరం కావాలని, నిరక్షరాస్యతను తరిమికొట్టాలని, వయోజన విద్యను ప్రోత్సహించాలని, గ్రామీణ గ్రంథాలయాలను ఉద్ధరించాలని** తదితర తీర్మానాలను ప్రవేశపెట్టాం. పలు తీర్మానాలు రైతు పక్షంగా వుండేటట్లు చూశాను. ఇక ఒక వార పత్రిక ప్రచురించాలని, అది రైతు సమస్యలను పట్టించుకునేదిగా ఉండాలని నేను పట్టుబట్టాను.

పోగైన చందాల్లో చాలా భాగాన్ని మదుపు చేయగలిగాం. కొందరు ఆ డబ్బుతో 'కమ్మ పత్రిక' నడపాలన్నారు. నేను మాత్రం **'రైతు పత్రిక'** నడపాలన్నాను. చివరకు నా మాటే నెగ్గింది. ఇదంతా జరిగింది నేను మెట్రిక్యులేషన్ కృతార్థుణ్ణయ్యే కొద్ది నెలలకు ముందు. 1920లో నేను ఇంగ్లండ్‌కు వెళ్లాలంటే వీడ్కోలు సభలో స్థానిక నేతలు రైతు పత్రిక నడిపేందుకు కృషి చేస్తామని మాట ఇచ్చారు. అంత చిన్న వయస్సులో అటువంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవడం ఇప్పుడు తిరిగి చూసుకొంటే ఆశ్చర్యజనకమే.

నాకంటే రెండు మూడు రెట్లు వయస్సున్న నాయకులున్నా వాళ్లంతా బ్రిటిష్‌వాళ్లలా ఆలోచించేవారు. కులపక్షపాతం కలిగినవారు. అయితే వీరేశలింగం రచనల ప్రభావం వల్ల, మహాత్మా గాంధీ, లోకమాన్య తిలక్ వంటి మహామహుల ప్రబోధాల వల్ల నేను కేవలం **కుల ప్రాతిపదికపై, బ్రాహ్మణ వ్యతిరేకతపై సంతృప్తి చెందలేకపోయాను.**

1915లో మేము మా గ్రంథాలయాన్ని పునరుద్ధరించి వార్షికోత్సవాన్ని నిర్వహించాం. బాపట్ల నుండి పలువురు న్యాయవాదుల్ని ఆహ్వానించాం. వాళ్లంతా

మాకు ఐక్యతా రాగాన్ని వినిపించారు. అది నాకు బాగా నచ్చింది. అయితే తొలిసారిగా మా ప్రాంత రైతుల గురించి ప్రసంగించే వేదికగా దాన్ని నేను మలుచుకున్నాను.

తర్వాత వార్షికోత్సవానికి కృష్ణా జిల్లాకు చెందిన రైతు బారిష్టరు త్రిపురనేని రామస్వామి గారిని ఆహ్వానించాం. అంతకు కొద్ది నెలల క్రితమే ఆయన ఇంగ్లండ్ నుండి తిరిగి వచ్చాడు. ఆయన కవి అనీ, తిరుపతి వెంకట కవుల శిష్యుడనీ తెలియవచ్చింది. ఆయన ప్రసంగం మమ్మల్ని బాగా ఆకట్టుకుంది. మా మనస్సుల్ని ఓ కుదుపు కుదిపింది. పూజారుల ఆధిక్యతను ఆరాధించే మనలోని వెధవాయిత్వాన్ని ఆయన ప్రశ్నించడంతో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పొన్నూరు పండితులు, బాపట్ల, తెనాలి నుండి వచ్చిన న్యాయవాదులు పలువురు మండిపడ్డారు.

నేను కొంచెం బిడియపడుతూ ఆయన్ను కలిశాను. ఆయన ఆంధ్రోద్యమాన్ని, కాంగ్రెస్ ఉద్యమాన్ని కూడా ఆ విధంగానే దుయ్యబడతారా అని అడిగాను. ఆయన వాటిని సమర్థిస్తానన్నారు. దానితో నా మనస్సు కుదుట పడింది. స్థానిక బ్రాహ్మణుల అకారణ ద్వేషం ఆంజనేయుల్ని బ్రాహ్మణేతర ఉద్యమం వైపునకు లాగింది. నాకు అది అంత ఇష్టంగా లేదు. ఇంతలో **ఓట్లు చదువుకున్న వాళ్లకేనన్న** నినాదం వినిపించింది. అలా అయితే రైతులు పెద్దయెత్తున నష్టపోతారు. ఏం చేయాలి? పరిస్థితి క్లిష్టతరమైంది.

కవిరాజు

మరింతగా ఆ విషయాల్లో అవగాహన పెంచుకునేందుకు మద్రాస్ బ్రాహ్మణేతరుల పత్రిక **'జస్టిస్'** అనేదాన్ని, బొంబాయి బ్రాహ్మణేతరుల పత్రిక **'రైతు'**ను,

అనిబిసెంట్ గారి **'న్యూ ఇండియా'** పత్రికను, కాశీనాథుని నాగేశ్వర రావు పంతులు గారి **ఆంధ్రపత్రిక**తో పాటు తెప్పించసాగాం. ఒకరి సలహాపై నేను **డాక్టర్ టి.ఎం.నాయర్** రచనలు చదివాను. కార్మికుల్ని కొల్లగొట్టేదాన్ని వ్యతిరేకించే ఆయన అభిప్రాయాలు నాకు నచ్చాయి. శ్రామికుల కేసును వాదిస్తూ ఇంగ్లండ్‌లో మరణించడం ఆయన నిజాయితీని పెంచేదిగా కనిపించింది. అందువల్ల ఆయన జీవిత చరిత్ర తెలుగులో రాసేందుకు మొదలుపెట్టాను. జీవితపు చివరి ఘడియల్లో ఆయన తీసుకున్న రాజకీయ వైఖరి నాకు నచ్చలేదు.

1917లో ప్రజలు విజయవాడ సభకు తరలి వెళుతున్నారు. బ్రాహ్మణేతరులకు కొంత రక్షణ కల్పించనిదే స్వరాజ్యం ఇచ్చి ప్రయోజనం లేదన్న వాదన స్వరాజ్య సాధనను వెనక్కు నెడుతుందేమోనని భయమేసింది. అయితే ప్రపంచ సంగ్రామం వల్ల రాజకీయ సంస్కరణలకు అవకాశం ఏర్పడింది. అయినా రామస్వామిపై బ్రాహ్మణ లాయర్ల వ్యతిరేకత బాగా పెరిగింది. అయితే బ్రాహ్మణేతర యువకుల మద్దతు పెద్దయెత్తున లభించింది. ఈ ప్రాంతపు బ్రాహ్మణేతర యువకులు జంధ్యాలు ధరించసాగారు. పేర్ల చివరన వర్మ, శర్మవంటివి తగిలించసాగారు. **నేను 'బ్రాహ్మ్'ను** అయినందున నాకు ఇదంతా నచ్చలేదు.

రామస్వామి చెప్పేదంతా నిజమేనా అనిపించేది. అలా సందేహించే నాకు ఆయన **'శంబుక వధ'** అనే పుస్తకం ఇచ్చి చదవమన్నారు. దాన్ని పలుమార్లు చదివాను. **రాముడంతటివాడు కూడా మునులు, పూజారుల ప్రభావం వల్ల అంతటి ఘాతుకానికి తలపడడం జరిగిందని విశ్వసించేందుకు నాకు చాలాకాలం పట్టింది.** బ్రాహ్మణేతర విద్యార్థుల పట్ల బారిష్టరు రామస్వామి గారి ప్రసంగానికి వ్యతిరేకంగా స్థానిక బ్రాహ్మణులు తీవ్రంగా స్పందించడం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది.

మరో వైపు నుండి ఆంజనేయులు, వెంకయ్యగార్లు సంప్రదాయ విశ్వాసాల వైపునకు నా దృష్టి మరల్చారు. శక్తి పూజలో హరిజనులకు ప్రాధాన్యత ఉండేది. అక్కడ అంటుసొంటు ఉండేవి కావు. అయితే వీరేశలింగం గారు అటువంటి పూజల సందర్భంగా జరిగే జంతు బలులను నిరసించారు. శైవ, వైష్ణవాల మధ్య ఆధిపత్య పోరు కూడా నాకు నచ్చలేదు. నాకు పోతన కవిత్వమంటే ఎంతో ప్రీతి. క్రైస్తవులు విగ్రహారాధనను నిరశిస్తున్నారు. నాకు **భగవద్గీత** అర్థంకాకపోయినా వల్లెవేస్తూనే వున్నాను. అయితే భారతీయ తత్వాన్ని అర్థంచేసుకునేందుకు నాకు వీరేశలింగం

బోధనలు అరకొరగా కనిపించాయి.

నాకు స్వామి వివేకానంద, రామతీర్థల బోధనల్లో ఒక సమన్వయ పద్ధతి కనిపించింది. వావిళ్లవారు వివేకానందుని రచనలను తెలుగులో ప్రచురించారు. రామతీర్థ రచనలు మాత్రం ఆంగ్లంలోనే లభించేవి. రామతీర్థ రచనలను తెలుగు చేయాలనే కోరిక బలీయంగా ఉండేది. ఆంజనేయులు ప్రోత్సాహంతో రెండొందల పేజీలు తెలుగులోకి అనువదించాను. 1920వ సంవత్సరంలో అందులో కొంతభాగం తెలుగు వారపత్రిక **సమదర్శిని**లో అచ్చయ్యింది. మిగతాది **'స్వరాజ్యం'**లో 1923లో అచ్చయ్యింది. ఇటువంటి బౌద్ధిక సాధన నాలో క్రమశిక్షణను నెలకొల్పి నన్ను నేను అదుపు చేసుకునే అవకాశాన్ని కల్పించింది.

1929-30 మధ్యకాలంలో వీరేశలింగం రాసిన జీవిత చరిత్రలు ముమ్మరంగా చదివే రోజుల్లో నన్నొక భావావేశం చుట్టుముట్టింది. **కాకతీయ సామ్రాజ్య అధినేత్రి రుద్రమ దేవి జీవిత చరిత్ర రాయాలనుకున్నా.** చిలుకూరివారి ఆంధ్రుల చరిత్రలో ఆమె గొప్పతనం ఎంతగానో కొనియాడబడింది. ఆమె కూడా రైతుల వంశానికి చెందినది కావడం, ఆమె బిడ్డలను నలుగురినీ రైతు వంశాలకు చెందిన రాజులకే ఇచ్చి వివాహం జరిపించడం నన్ను బాగా ఆకర్షించింది. 1919వ సంవత్సరానికి అది రాయడం పూర్తయ్యింది. దాన్ని గ్రామస్థులకు చదివి వినిపించగా వాళ్లు మెచ్చుకున్నారు. నా ఆనందానికి అవధులు లేకుండాపోయింది.

1917 నుండి మేము కొద్దిమందిమి శ్రద్ధగా జాతీయవాద వార్తాపత్రికలైన **ఆంధ్ర పత్రిక, న్యూ ఇండియా** చదవసాగాం. మహాత్మా గాంధీ, తిలక్, అనిబిసెంట్ సూచించిన మార్గాల్లో నడవసాగాం. యుద్ధానంతరం బ్రిటిష్‌వాళ్లు స్వరాజ్యం బేషరతుగా ఇచ్చి తీరుతారని అనుకున్నాం. కృష్ణయ్య హరిజనుల్ని సైనికులుగా చేర్చుతూ ఉంటే మేము అభ్యంతరం చెప్పలేదు. **మహాత్ముడు ఎప్పుడైతే చంపారన్ మెజిస్ట్రేట్ ఆంక్షల్ని ధిక్కరించాడో అప్పుడు మా నరాల్లోకి కొత్త సత్తువ ప్రవేశించినట్లయ్యింది.** ప్రభుత్వాన్ని ధిక్కరించగల శక్తులు భారతదేశంలో ఉన్నందుకు మా నాన్నకు ఆనందంగా ఉంది. గాంధీజీ నిజమైన శక్తి మిత్రుడు అనుకున్నాడు. గాంధీజీ వల్ల మనకు మేలు జరుగుతుందని, మన అకృష్టం జాతీయోద్యమంతో ముడిపడి ఉందని భావించాను.

మాంటేగ్కు సమర్పించేందుకు కాంగ్రెస్ ప్రణాళికపై సంతకాలు సేకరించమని దేశ భక్తులకు గాంధీజీ పిలుపునిచ్చాడు. ఆ ఉద్యమం సందర్భంగా నేను మా నాన్నను

కొంత డబ్బు ఇవ్వమని కోరగా ఆయన 'అందంగాలేని నా సంతకం ఆ జాబితాలో ముందు ఉండేటట్లు చూడు' అన్నాడు. అలాగే ఉంచాం. ఓ పది గ్రామాలకు పైగా తిరిగి వందలాది చేవ్రాళ్లను, నిశానీలను సేకరించగలిగాం. అయితే ఆ కృషి పత్రికల్లోకి ఎక్కకుండా చేశారు. ఇంతకాలానికి నేను గతంలోకి తొంగిచూస్తుంటే నా తండ్రి రైతుగా పెట్టిన ఆ సంతకం తర్వాత నా ప్రజా జీవితానికి ఆశీర్వాదంగా భావించుకుని నేనెంతగానో ఆనందిస్తాను, గర్విస్తాను కూడా.

రామస్వామి మామయ్య నాకు 1910లో సూటు కొని తెచ్చి ఆంగ్లేయుల దుస్తులు అలవాటు చేశాడు. తర్వాత జమీందార్ల గిల్ట్ టోపీ కూడా తెచ్చాడు. అయితే ఆ టోపీలు ధరించేందుకు మా అమ్మ ఒప్పుకోలేదు. **అవి పనీపాటా లేకుండా సోమరిపోతుల్లా జీవించే జమీందారులకుకానీ రైతు బిడ్డలకు కాదని అంది.** అలాగే ఆంగ్లేయుల కుర్చీలు, సోఫాలు, బల్లలువంటి వాటి పట్ల కూడా నేను మోజు పడలేదు. స్వదేశీ ఉద్యమం పట్ల నాకు గల అభిమానం వల్ల నా దృష్టి అటు వైపు మళ్లలేదు. నేను స్వదేశీ దుస్తుల్నే ధరించేవాణ్ణి. స్వదేశీ వస్తువులనే వాడేవాణ్ణి.

మా గ్రామంలో చేనేత పనివాళ్లు జాస్తిగానే ఉండేవాళ్లు. కొద్దిమంది కమ్మరులు ఉండేవాళ్లు. వడ్రంగులు కూడా ఎక్కువగానే ఉండేవాళ్లు. కంసాలులూ ఉండేవాళ్లు. మా అమ్మ చనిపోయేవరకూ మా అమ్మమ్మ, మా అవ్వ రాట్నంపై నూలు వడుకుతూ ఉండేవాళ్లు. ఆ నూలుతోపాటు మరికొంత కొని మాకు అవసరమయ్యే వస్త్రాలు నేసేందుకు చేనేత పనివాళ్లకిచ్చేవాళ్లం. నేను ఆ కార్మికుల ఇళ్లల్లోనే గడపడం మా అమ్మకు చిరాకు కలిగించేది. బడికి పోకుండా అక్కడ ఉండడం ఆమెకు నచ్చలేదు. ఆమె పిలుచుకుని వెళ్లడానికొస్తే మగ్గం గుంటల్లో దాక్కునేవాణ్ణి. ఆ చేనేత కార్మికుల ద్వారా నాకెటువంటి విలువైన బోధన లభించిందో ఆమె అంచనాలకు అందదు.

అలాగే **నేను సమస్త వృత్తులవారి ఇళ్ల వద్ద ఎంతెంత కాలం గడిపిందీ లెక్కలు గట్టి చెప్పలేకపోవచ్చుకానీ వాళ్ల కష్టసుఖాలు, ఆకలి కేకలు అన్నీ నాకు బాగా తెలుసు.** వాళ్ల ఆకలి తీర్చేందుకు నేను ధాన్యం, పప్పులు, కూరగాయలు వంటివి వాళ్లకు అందించడంలో మా అవ్వ సహకారం నాకు లభించేది. గ్రామీణ వృత్తుల్ని పునరుద్ధరించాలని గాంధీజీ పిలుపు ఇచ్చేనాటికే వాళ్ల కష్టసుఖాలు నాకు బాగా అవగాహనలోకి వచ్చిన విషయాలయ్యాయి. **అందువల్ల గాంధీజీ సందేశాన్ని వాళ్లకు అందించి స్వరాజ్యం వస్తే వాళ్ల బతుకులు బాగుపడితీరుతాయని చెప్పేవాణ్ణి.** మా మంగమ్మ

అమ్మకు చెప్పేవాణ్ణి. 'మా అమ్మ నేను నా సమయాన్ని వాళ్ల ఇళ్లల్లో వృథా చేస్తున్నా ననుకునేది. ఇప్పుడు చూడు, మహాత్మా గాంధీ దృష్టిలో అది మంచి చదువుగా మారిపోయింది'.

అలా నేనొక వైపు జాతీయ కార్యకర్తగా, సంఘ సంస్కర్తగా ఎదుగుతూనే నా సోదరులు **వెంకటప్పయ్య, లక్ష్మీనారాయణల** చదువుపై శ్రద్ధపెట్టాను. వాళ్లు కూడా నాలాగే చదువుకోవాలని జాతీయ ఉద్యమాన్ని ప్రశంసించేటట్లు శిక్షణ పొందాలని కోరుకున్నాను. వాళ్లు నేను చేపట్టే ఉద్యమ కార్యక్రమాలన్నింటిలో సహకరించేవాళ్లు. వెంకటప్పయ్యకు ఇంగ్లీష్ చదువులు చెప్పించడం మంగమ్మమ్మకు ఇష్టంలేదు. ఇంగ్లిష్ చదివిన ప్రతివాళ్లూ నౌకర్లుగా బతుకీడ్చాల్సిన అవసరంలేదని చెప్పి చదివించాను. లక్ష్మీనారాయణ ఆ స్థాయికి వచ్చేటప్పటికి ఇంట్లో పూర్తి పెత్తనం నాదైంది.

వెంకటప్పయ్య చదువు మెట్రిక్యులేషన్‌తో ఆపేశాడు. నాన్న, మేనమామల మరణం తర్వాత పొలం పనులు వగైరా నేను చూసుకోవాల్సి వచ్చింది. లక్ష్మీనారాయణ ఆర్థిక శాస్త్రంలో ఎం.ఎ. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. న్యాయవాదిగా కూడా తర్ఫీదు పొందాడు. అయితే 1935లో కిసాన్, వృత్తికళాకారుల, సహకార ఉద్యమాల్లో నాతో కలసి పనిచేసేందుకు న్యాయవాద వృత్తిని కూడా త్యజించాడు.

మేము మా గ్రామంలో ఒక ఉన్నత పాఠశాల అభివృద్ధికి పాటుపడ్డాం. ఒక సాధారణ రైతు తనకున్నది ఆ పాఠశాలకు దానమిచ్చి కౌలు రైతుగా జీవించాడు. ఆయన పేరు **కె.లక్ష్మయ్య.** ఆ పాఠశాల ప్రారంభ సమయాన తుమ్మల సీతారామ్మూర్తి గారు కవితా గానం చేశారు.

మా అన్నదమ్ముల్లో పెద్దవాళ్లిద్దరినీ ఓ ఇంటివాళ్లను చేయాలనే తలంపు మా నాన్నకు వచ్చింది. అయితే సోదరి **లక్ష్మీదేవి**కి మాత్రం మేము డిగ్రీ చదువులు పూర్తిచేసిన తర్వాత అయితే గొప్ప సంబంధాలు వస్తాయని చెప్పి మా నాన్న తన కోరికను వాయిదా వేసుకునేట్టు చేసింది. చివరకు మా నాన్న నాతో సంప్రదించాడు. తన ఆరోగ్యం సరిగా లేదని, కనుక వెంటనే పెళ్లికి ఒప్పుకోమని నచ్చచెప్పగా నేను కాదనలేక సరే అన్నాను. ఆంజనేయులు చెప్పిన వివరాలు, ఇచ్చిన సలహా మా నాన్నకు నచ్చాయి. నన్ను పిల్లను చూడమన్నారు. వాళ్లిద్దరూ చూస్తే చాలన్నాను నేను. ఇంకేముంది పసుపు కుంకాలు పెట్టుకున్నారు. అంటే మా పెళ్లి జరిగి తీరుతుంది. దానికి తిరుగుండదు. అయితే పాశ్చాత్యులకూ, ఇక్కడివాళ్లకూ ఒక తేడా ఉంది. అక్కడ ఖాయమనుకుంటే

తర్వాత పిల్ల, పిల్లవాడు కలసి తిరుగుతారు. ఇక్కడ పెళ్లయ్యాక కూడా పునస్సంధానానికి కొన్ని యేళ్లు పట్టవచ్చు. మా విషయంలో మేము అలా 1924 వరకూ ఆగాల్సి వచ్చింది. నేను ఆక్స్‌ఫర్డ్ నుండి తిరిగి వచ్చిన తర్వాతకానీ మా పెళ్లికి పూర్ణత్వం సిద్ధించలేదు. వధువు అంతా ఆంజనేయులు గారు వర్ణించి చెప్పినట్లుగానే ఉంది.

భారతీదేవి గారింట్లో అరణం ఆరగిస్తూ ఉండగానే ప్రజా సేవకు నాకు మరో అవకాశం లభించింది. మా మామ గారు మాచవరం, మునుకుదురు, చింతలపూడి గ్రామాల్లోని చివరి భూములకు తగిన సమయానికి నీళ్లు అందించాలనే రైతుల వుద్యమానికి నాయకత్వం వహించారు. ఇందులో రాతకోతల్లో అంతకుముందు సాయపడుతున్న ఓ అగ్రకులపు స్నేహితుని శక్తియుక్తులు చాలడంలేదు. అతను ఇంజనీర్లతో సంప్రదించలేకపోతున్నాడు. అప్పుడు మా మామ గారు వెలగా సుబ్బయ్య గారి సూచన మేరకు పిటిషన్లు రాయడం, ఇంజనీర్లను సంప్రదించడంవంటి పనుల్లో నేను వారికి సాయం అందించాను. అది మా మామ గారికి నచ్చింది.

మా నాన్న నన్ను ఐ.సి.ఎస్. అధికారిగా చూడాలనుకున్నారుగా. ఆ విషయం ఆంజనేయులు మా మామ గారికి చెప్పడం జరిగింది.

'ఎందుకు? బానిసగా మార్చేందుకా?' అన్నారు మామ గారు.

'మీరు కలెక్టర్‌ను కలసినప్పుడు అంతటి వినయాన్ని ప్రదర్శిస్తున్నారెందుకు? తిరిగి పిటిషన్లు, విజ్ఞప్తులు కొనసాగిస్తూనే ఉంటారుగా' అన్నాను నేను.

'అది ఆయన చేయాల్సిన పని చేయమని చెప్పేందుకే. **మనం రైతులం. మనకు మనమే సాటి. మనం స్వేచ్ఛాజీవులం.** మన తిండి మనం స్వయంగా సంపాదించుకుంటాం. నన్నడిగితే పొలాలకు రైతే రాజు'.

'మరి బ్రిటిష్‌వాళ్లెవరు? వాళ్లు మనల్ని పరిపాలిస్తున్నారుగా' అన్నాను నేను.

'అంతకుముందు పాలించినవాళ్లున్నారు. వాళ్లంతా పోయారు. వీళ్లూ ఓనాటికి పోవాల్సిందే. రైతే రాజు. అది భగవదేచ్ఛ' అన్నారు మామ గారు.

నాకు అనిపిస్తూ ఉంటుంది – ఇప్పటి మాదిరిగా మేము చదువుకునే రోజుల్లో విద్యార్థులను చారిత్రకంగా, సాంస్కృతికంగా ప్రాముఖ్యాన్ని సంతరించుకున్న ప్రాంతాలకు విహారయాత్రలకు తీసుకెళితే ఎంతో బాగుండేదని. 1919 క్రిస్టమస్ రోజుల్లో మద్రాస్ వెళ్లడాన్ని మినహాయిస్తే అప్పటివరకూ నేను గుంటూరు, నెల్లూరు, కృష్ణా జిల్లాల పరిధి దాటిపోలేదు. అయితే ఆంధ్ర పత్రిక ఆవిర్భావ దినం నుండి

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఏం జరుగుతున్నదనేది ఆ పత్రిక ద్వారా తెలుసుకుంటూనే ఉన్నా.

మా నాన్నతో కలసి నేను గోదావరి జిల్లాలోని ఏలూరు కూడా వెళ్లాను. అక్కడి నుండి తెలకపిండి తెచ్చేవాళ్లం. ఏలూరులో అలా ప్రతి సంవత్సరం రెండు రోజులు ఆనందంగా గడిపేవాణ్ణి. అక్కడి స్త్రీలు మా అమ్మలాగే కుంకుమ బొట్టు పెట్టుకోవడం నాకు నచ్చింది. అయితే కొందరు ఆడవాళ్లు చుట్టలు కాల్చడం నాకు నచ్చలేదు. నేటికి కూడా గోదావరి జిల్లాలోనేకాక కళింగ ప్రాంతంలోని స్త్రీలు చుట్టలు కాల్చడం, పాశ్చాత్య స్త్రీలు సిగరెట్లు కాల్చడం నాకు నచ్చదు. ఈ విషయంలో నేను మరీ చాందస్తుణ్ణి!

కనుమరుగైన విజయనగర రాజధాని **హంపీ**నిగానీ, ధ్వంసమైన కాకతీయుల రాజధాని **ఓరుగల్లు**నుకానీ, పలనాటి రణరంగం **కారెంపూడి**ని గాని, **వేంగి కోట**నుగానీ, శ్రీకాకుళంలోని **ఆంధ్రవిష్ణువు** దేవళాన్నికానీ దర్శించలేదు. ఆ ప్రాంతాల విద్యా విషయక ప్రాముఖ్యాన్ని అంతగా అప్పుడు పట్టించుకున్న వాళ్లులేరు. చాలా సంవత్సరాలకుకాని నేను **అజంతా, ఎలిఫెంటా** గుహల్ని చూడడం, **హరిద్వార్, హృషికేష్** వంటి తీర్థాలకు పోవడంగానీ జరగలేదు.

మా జిల్లా మిరప, దోస పంటలకు ప్రసిద్ధి. నేను పిల్లవానిగా ఉన్నప్పుడు ఒక పర్యాయం కోటప్పకొండకెళుతూ వేడి వేడి అన్నంలో దోసకాయ, పచ్చిమిరపకాయలతో చేసిన పచ్చడిలో ఇంట్లో చేసిన కమ్మని నెయ్యి వేసుకుని కడుపారా సంతృప్తిగా భుజించాను. నేనెన్నో పర్యాయాలు విమానాల్లో, ఓడల్లో, రైళ్లల్లో, కార్లల్లో ప్రపంచాన్ని ఎంతగా చుట్టివచ్చినా నా తల్లిదండ్రులతో కలసి గూడుబండిలో మువ్వల పట్టెడ, ఇతర అలంకారాలతో ఉన్న ఎద్దులను కట్టి నడుపుకుంటూ ప్రభలతో వెలుగొందే కోటప్పకొండకు వెళ్లిన ఆ ఆనందమే వేరు. అందుకు కారణం–తల్లిని ఎనిమిదేళ్ల వయస్సులో, తండ్రిని ఇరవై యేళ్ల వయస్సులో పోగొట్టున్నవాణ్ణి. బహుశా నాకు అందవలసిన ప్రేమ వాళ్ల నుండి అందని కారణంగానో, వాళ్లతో గడపాల్సినంత కాలం గడపలేకపోవడం వల్ల కూడా నాకు అలా అనిపిస్తూ ఉండొచ్చు.

గుంటూరు మా వ్యాపార పట్టణం. అది మా జిల్లా కేంద్రం. నేనూ, మా పెద్ద తమ్ముడు ధాన్యం బళ్లు రెండూ నడుపుకుంటూ మా నాన్నతో సంవత్సరానికోసారి గుంటూరు వెళ్లేవాళ్లం. సాయంత్రం బయలుదేరితే మరుసటి రోజు ఉదయానికి వెళ్లేవాళ్లం.

మధ్యాహ్నం పన్నెండు గంటల సమయంలో వేపచెట్టు పక్కనున్న హోటల్‌కు భోజనానికి తీసుకెళ్లేవాడ్ని. తర్వాత కమీషన్ కొట్ల వద్దకు వెళ్లి ధరల ప్రకారం డబ్బు లెక్కించి నాన్నకు ఇచ్చేవాడ్ని. దొంగల భయమనేది ఉన్నా ఆ ప్రయాణం ఎంతో ఉల్లాసంగా సాగేది. నాకు అది ఓ ప్రయోజనకరమైన అనుభవంగా నిలిచింది.

ఆంజనేయులు, ఆయన మిత్రులు 1916-17వ సంవత్సరంలో భారతదేశ యాత్రకు బయలుదేరారు. **వాళ్లు పూరి, కలకత్తా, బుద్ధగయ, కాశీ, ప్రయాగ, ఢిల్లీ, కురుక్షేత్ర, హృషికేష్, హరిద్వార్, బొంబాయి, పండరిపురం, హైదరాబాద్ చుట్టివచ్చారు.** అక్కడి విశేషాలన్నీ పూసగుచ్చినట్టు ఆంజనేయులు ఎప్పటికప్పుడు నాకు ఉత్తరాలు రాస్తూ ఉండడంతో అవన్నీ నా మనస్సులో చెరగని ముద్ర వేశాయి. అటువంటి **యాత్రా విశేషాలు మన సాహిత్యానికి ఎంతో అవసరం.** మన రైతులు కూడా అటువంటి యాత్రలు నిర్వహించాల్సి ఉంది. అటువంటి నా కోరికననుసరించే నా శిష్యులు **వీరాచారి**, పార్లమెంట్ సభ్యులు **వి.వి.రమణులు** 1954-55వ సంవత్సరంలో, 1958 వ సంవత్సరంలో రైతు యాత్రలను ప్రత్యేక రైళ్ల ద్వారా నిర్వహించారు. ఆ యాత్రా విశేషాలను కడు రమ్యంగా రచించారు రైతు యువకుడు కె.వి.సుబ్బయ్య.

చివరకు ఎలాగైతేనేం నేను మద్రాస్‌ను 1919 క్రిస్టమస్ సందర్భంగాను, జూలై 1920లో కలకత్తా, కాకినాడ, రాజమండ్రి, మచిలీపట్నం నగరాలను సందర్శించాను. అవేవీ నాకు కొత్తగా కనిపించలేదు. వాటి వివరాలన్నీ మిత్రులు కళ్లకు కట్టినట్టు రాశారు కదా. మనుషుల్ని పిడుగు చంపినట్టుగానే విద్యుచ్ఛక్తి కూడా చంపగలదని తొలిగా మద్రాస్‌లో తెలుసుకున్నాను. మద్రాస్‌లోని భోజనం అంతా తమిళ రుచులతో కూడినదే. ఆంధ్రుల పిల్లలకు అది నచ్చేదికాదు. నేను ఏదోవిధంగా తినేవాడ్ని. అది నా ఆరోగ్యాన్ని మెరుగుపర్చింది. అయితే బెంగాలీ భోజనం తినడం నా వల్ల కాలేదు. అందులో వేసే ఆవాల నూనె మోతాదు ఎక్కువగా ఉండడం కూడా అందుకు కారణమే. అయితే కలకత్తాలోని బొటానికల్ గార్డెన్స్, విక్టోరియా మెమోరియల్ మ్యూజియం, యూనివర్శిటీ హాలు అత్యద్భుతంగా ఉన్నాయి. అలాగే విద్యాసాగర్ పేరిట నిర్మించిన పార్క్, ఫౌంటెన్ నన్ను అమితంగా ఆకట్టుకున్నాయి. వీరేశలింగం రాసిన విద్యాసాగరుని జీవిత చరిత్ర నేను అంతకుముందే ఎప్పుడో చదివాను.

కలకత్తాలో గంగా నది, సముద్రాన్ని కలిసే తావున్నది. దాని పేరు అక్కడ గంగ కాదు హుగ్లీ! అది నాకు చాలా అగ్లీ (వికారంగా) గా కనిపించింది. అయితే కాళీఘాట్‌లో

స్నానం చేస్తున్నప్పుడు మాత్రం ఒకనాడు ఇక్కడే కదా రామకృష్ణ పరమహంస ప్రతి ఉదయం స్నానం చేసింది అనిపించింది. నేను అంతకుముందే రామకృష్ణ పరమహంస సూక్తులు, వివేకానందుడు ఆయన గురించి రాసిన పుస్తకం, వివేకానందుని బోధనలపై **సిస్టర్ నివేదిత** గ్రంథం చదివి ఉన్నాను. ఆ రచనలన్నీ పూర్తిగా అర్థంచేసుకున్నానని ఎలా చెప్పగలను? అయితే నిత్యం జరిగే అద్భుతాలను స్వీకరించేందుకు అలవాటుపడిన మనస్సు వాటిని అర్థంచేసుకోలేకపోతోందా?

కలకత్తా నుండి తిరిగి వస్తూ ఓ సుప్రభాతాన సుందరమయమైన **చిల్కాసరస్సు**ను సందర్శించే భాగ్యం కలిగింది. అది నిజంగా సరోవరాల్లో చిలుకవలే ఎంతో ముద్దుగా కనిపించింది. దీని తర్వాత కొన్ని దశాబ్దాలకు **శ్రీమతి భారతీదేవి** తొలిసారి చిల్కా సరస్సును సందర్శించిన సమయంలో సరిగా అటువంటి అనుభూతే కలిగిందని వెల్లడించారు.

నాకు కాకినాడ అంటే ఎంత మోజో! **గోపాలకృష్ణయ్య, రఘుపతి వెంకటరత్నం నాయుడు** గార్లు **షేక్స్‌పియర్** తరహా ఆంగ్ల భాషను ఎంతగా వడిసి పట్టిందీ చెప్పేవారు. ఆయన సంఘ సేవా కార్యక్రమాల గురించి వీరేశలింగం గారి ఆత్మకథ ద్వారా తెలుసుకున్నాను. ఆయన్ను దర్శించుకోగలిగినందుకు ఎంతగానో తృప్తి చెందాను. బ్రిటిష్ ప్రభుత్వం 'సర్' అనే బిరుదును ప్రదానం చేసింది. ఆయన మద్రాస్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా ఎన్నికయ్యారు. దళిత యువకులెందరో ఆయన్ను 'బాపు'గా భావించుకునేవారు. ఆయన వాళ్లను తన కన్నబిడ్డల్లా చూసుకుంటూ ఆంధ్ర మేధావుల స్థాయికి చేరారు.

నేను గురువుగా భావించే వీరేశలింగం గారి పట్టణం రాజమహేంద్రవరం చేరుకోగానే ఉప్పొంగిపోయాను. అక్కడ ఆంధ్రుల గంగమ్మ తల్లి గోదావరిని, టౌన్‌హాలును, మా గురువు గారు కట్టించిన విధవల భవనాన్ని, ఆశ్రమాన్ని, ఉన్నత పాఠశాలను చూడగలిగాను. వాటన్నింటినీ చూసి నేను నిరుత్సాహపడలేదు. అయితే అంతకు రెండేళ్లక్రితమే మరణించిన వీరేశలింగం గారిని చూడలేకపోయాననే బాధ మిగిలింది. ఆయన చేసిన సాంఘిక సేవ, భాషా సేవ గుర్తుకొచ్చాయి. ఆయన సాధారణ స్థితి నుండి ఎంతో ఎత్తుకు ఎదిగిన తీరు కళ్లముందు కదలాడింది. ఆయన ఐరోపా ఉదారవాదం, పునరుజ్జీవనాల నుండి స్ఫూర్తి పొందిన విషయం జ్ఞప్తికి వచ్చింది. గోదావరిలో స్నానమాడాను. **శ్రీనాథుని** వర్ణనలకు మూలాలెక్కడివో గమనించగలిగాను.

అలా దేశమంతా తిరిగి ఇంటికి చేరి మా నాన్న గారికి చెప్పాను. **నాకు ఈ దేశంలోని విశ్వవిద్యాలయాల్లో చదవాలని అనిపించడంలేదు.** నాకు మరింతగా పాశ్చాత్య వాతావరణం అవసరమనిపిస్తోంది. మా మంగమ్మ అమ్మకు మా ఆర్థిక స్థోమత అందుకు అనుకూలమైనది కాదని అనిపించింది. పైగా మా అవ్వ వయస్సు 70 ఏళ్లు. కనుక వాళ్లు నేను భారతదేశంలోనే ఉండిపోవాలని కోరుకుంటున్నారు. వాళ్ల కోరిక మేరకు నేను గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో ప్రవేశించాను. అయితే నేను తృప్తి చెందలేదు. ఆంజనేయులు మా నాన్న వద్దకు వెళ్లి ఖర్చు తాను భరిస్తానని, నన్ను ఇంగ్లండ్‌కు పంపమని కోరాడు. మా నాన్న నన్ను పిలిచి నువ్వు మెల్లగా మద్రాస్ వెళ్లి పాస్‌పోర్టు సంపాదించు అని అన్నారు.

ఆ రోజుల్లో పాస్‌పోర్టు సంపాదించడం చాలా కష్టం. ప్రభుత్వానికి ఎవరైనా సిఫారసు చేయాలి. నేను తొలి మద్రాస్ భారతీయ మేయర్ **పి.టి.చెట్టి**ని కలిశాను. ఆయన బ్రాహ్మణేతర నాయకత్వంలో అగ్రభాగాన ఉన్నవారు. నేను ఇంగ్లండ్ వెళ్లి ఇంకా బాగా స్వరాజ్యం కోసం పోరాడేందుకు అధ్యయనం చేసి వస్తానన్నాను. అందుకు ఆయన నా వీపు తట్టి ఎంతగా మురిసిపోయారో! 1920లో ఆయనకు మద్రాస్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చినా పెద్ద వయస్సు కారణంగా **సుబ్బయ్య రెడ్డి**కి ఇవ్వమని సూచించినవారు. అటువంటి మహామహునికి నేను చారిత్రక ఘటనలతో కూర్చిన నా గ్రంథం **'ది ఎకనామిక్స్ ఆఫ్ ది హ్యాండ్లూమ్'** అనే దాన్ని అంకితమిచ్చానన్న తృప్తి మిగిలింది. అయితే ఇది జరిగింది ఆయన మరణించిన చాలా కాలానికి.

నాకు పాస్‌పోర్టు తగిన సమయానికి లభించదేమోనని మా తండ్రికి ఆందోళనగా ఉంది. అయితే అది నేను మా ఊరి నుండి బయలుదేరే రోజునే అందింది. కీర్తిశేషులు **జంపాల సాంబయ్య** గారు విదేశాలకు వెళ్లే రైతు యువకులను ప్రోత్సహిస్తూ ఉండేవారు. ఆయన నా ఓడ టిక్కెట్, రైలు ప్రయాణం ఫ్రాన్స్ మీదగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేసిపెట్టారు.

నేను బయలుదేరడానికి ముందురోజు మా గ్రామంలో వీడ్కోలు సభ నిర్వహించారు. అప్పుడు త్వరలో రైతు పత్రిక ప్రచురించడం జరుగుతుందని, దానికి బారిష్టరు రామస్వామి సంపాదకులుగా ఉంటారని తెలియజేశారు. నేను నా ప్రసంగంలో చెప్పాను – రైతు పత్రికను జాతీయ హక్కులకు అనుగుణంగా నడపాలి. అందులో రైతుల ఆశయ సాధన ప్రతిబింబించాలి. ప్రజలపై అధికారుల అణచివేత చర్యలను

ఖండించాలి. అన్ని వర్గాల, కులాల, జాతుల సామాజిక సమానత్వం కోసం అది పాటుపడాలి' అని. నన్ను ఐ.సి.ఎస్. మీద దృష్టి నిలుపుమనీ ఈ పనంతా తాను చూసుకుంటాననీ బారిష్టరు రామస్వామి గారు మాట ఇచ్చారు.

ఇంట్లోని వారంతా నా విదేశీయానం విషయంలో రకరకాల భావనలతో వున్నారు. నా కుటుంబ అవసరాలేమిటో నేను గ్రహించగల స్థితిలో ఉన్నాను. **నేను సామాన్య ప్రజల్లో ఒకడిగా ఉండడం బాగానే నేర్చుకున్నాను.**

గ్రామీణ సామాజిక, రాజకీయ స్థితిగతులు (1914 -1920)

మా పూర్వీకులు వరంగల్‌కు చెందిన కాకతీయ యోధులు. ఈ రోజు (15.8.1957) భారత స్వాతంత్ర్య దినోత్సవ దశమ వార్షికోత్సవం. నేను ఢిల్లీలో ఎర్రకోట వద్ద ఉన్నాను. వాతావరణంలో కూడా మన ఆశలు, ఆకాంక్షలు ప్రతిబింబిస్తున్నాయి. సూర్యోదయ సమయంలో సూర్యుడు మనం కోరే సామాజిక విప్లవంలా వేడిగా, వాడిగా వెలుగులు విరజిమ్ముతున్నాడు. గంటలోనే మళ్లీ మెత్తబడిపోయాడు. మబ్బుల మధ్య నక్కాడు. సన్నటి తుంపర. రెండో పంచవర్ష ప్రణాళికకు నిధులు తేవడం ఎలా అనే ఆశ్చర్యంలో మునిగితేలుతున్నట్టున్నాడు.

ప్రధాని ఎర్రకోట గోడ ముందు నిలబడి తొలి స్వాతంత్ర్య సమయపు వీరుల, వీర వనితల గురించి చెబుతుంటే నాకు మూడు పర్యాయాలు వీరోచిత పోరాటాలు నిర్వహించిన ఆంధ్ర రైతు యోధులు గుర్తుకొచ్చారు. వాళ్లు గోదావరి నదీతీరాన 14వ శతాబ్దంలోనూ, కృష్ణా నదీతీరాన 17వ శతాబ్దంలోనూ దక్షిణా పథాన్ని కాపాడుకునేందుకు ఉత్తరం వైపు నుండి వచ్చే ముస్లిం ఆక్రమణదారులతో పోరాడారు.

ప్రతాప రుద్రదేవుడు రాథోడ్‌కు చెందిన పృథ్వీరాజ్‌లా పోరాడగా ఆయన వంశానికి చెందిన ప్రోలయ, కాపయ నాయకులు మూడు శతాబ్దాల తర్వాత నేతాజీ (సుభాష్ చంద్రబోస్)లా పోరాడారు.

అక్కడ నెహ్రూ ఒక శతాబ్దంపాటు దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ నాయకత్వంలో వీరోచితంగా పోరాడి జీవితాల్ని సైతం పణంగా పెట్టిన అనేకమందికి నివాళులర్పిస్తూ ఉండగా మన గ్రామీణ రైతు కుటుంబాలకు మూల పురుషులైన అనేకమంది ఢిల్లీ పాదుషాలకు, బ్రిటిష్ ప్రభుత్వానికి ఎదురునిలిచి వీరోచితంగా పోరాడిన వారి ప్రగతిశీల, వీరోచిత పాత్రను నేను గుర్తుచేసుకోసాగాను.

నెహ్రూ అలా గత చరిత్రను తవ్వుతున్నాడు. ఓ వెయ్యి సంవత్సరాలు వెనక్కు వెళ్లాడు. నా కళ్లముందు నిలుస్తున్నది మాత్రం సామాన్యులు. ఎవరి మోచేతి కింద నీళ్లు తాగనవసరం లేకుండా, వాళ్లకైవాళ్లు మరొకరిపై పెత్తనం చెలాయించకుండా, వాళ్లు మరొకరి పెత్తనం కిందకు రాకుండా ఉండే క్రమశిక్షణాయుత నిర్మాణాత్మక స్వేచ్ఛ కోసం ఉవ్విళ్లూరుతున్నవాళ్లే.

స్వతంత్ర భారతావనిలో తొలి దశాబ్దంలో రైతులు, చేతివృత్తులవారు, కార్మికులు అందరూ జాతి పునర్నిర్మాణ దిశగా ప్రణాళికల అమలుకు భుజం భుజం కలిపారు. దేశభక్తికి, వీరోచిత కట్టడులకు ఆలవాలమైన మా కుటుంబ జీవన సరళి కూడా నన్ను ఆ దిశగానే నడిచేటట్లు చేసింది. విజయనగర రాజుల, కాకతీయుల కాలం నుండి వీరోచితంగా పోరాడిన మా పూర్వీకులకు బ్రిటిష్‌వాళ్లు ఉద్యోగాలిస్తామంటే వద్దన్నారు. ఎప్పటికైనా పనికొస్తాయేమోనని వాళ్ల కత్తుల్ని పెట్టెల్లో పెట్టి రహస్యంగా దాచిపెట్టారు. ఇళ్లల్లోని వీరుల పెట్టెలే అందుకు సాక్ష్యాలు. మా పూర్వీకుల విషయం మళ్లీ వివరించి చెబుతా.

ముందుగా నేను మా కుటుంబం గురించి చెబుతా. రామస్వామి మా మేనమామ. ఆయన తన తండ్రి **రమణయ్య** గారంతటి కార్యదక్షుడు కాడు. మంగమ్మ అమ్మ వలే డబ్బుపైగానీ, ఆస్తిపైగానీ దృష్టిలేదు. ఆయన ఖర్చు మనిషి. పేదలకు సాయం చేసేవాడు. నాటకాలపై మోజు ఉండేది. నాటక సమాజాలను పోషించేవాడు. ఆయన ఉన్నత వంశపు పోకడలు, సాంస్కృతికంగా చేపట్టిన కార్యక్రమాలు నాపై కొంత ప్రభావం చూపినా మా మంగమ్మ అమ్మ, సోదరి లక్ష్మీదేవి గడిపిన నిరాడంబర జీవితం, ధార్మిక గుణం నాపై అధిక ప్రభావం చూపాయి. వారికి నేను రుణపడి ఉన్నా.

గ్రామీణ క్రీడలు

నాకు గ్రామీణ క్రీడలంటే చాలా ఇష్టం. వాటిల్లో నేను పాల్గొనేవాణ్ణి. ఇంగ్లండ్ వెళ్లేవరకూ నేనుగానీ, ఇతరులుగానీ మా ఊళ్లో వాటిని నిర్వహించేవాళ్లం. కోతి కొమ్మచ్చివంటి ఆటల్లో నేనెక్కని చింతచెట్టులేదు. ఏడేళ్ల వయస్సు వచ్చేవరకూ ఆడ పిల్లలు, మగపిల్లలు కలసి ఆడే ఆటల్లో పాల్గొనేవాణ్ణి. ఉయ్యాల ఆటల్లో ఎంత పెద్దగా ఊగేవాళ్లమో చింతచెట్లకు తాళ్లేసికట్టి. ఇక బలిగుడు (చెడుగుడు) సంగతి చెప్పక్కర్లేదు. కాణీ ఖర్చుండదు కనుక కటిక పేదవాళ్లు సైతం ఆడుకునేవాళ్లు.

మా ఊళ్లో చాలా చెరువులు ఉండేవి. ఒకటి గోభూమికి ఎదురుగా ఉండేది. మరొకటి శిక్షణ సంస్థకు ఎదురుగా ఉండేది. ప్రాథమిక పాఠశాలకు, శివాలయానికీ ఎదురుగా ఉన్నది అన్నిటికన్నా పెద్దది. చంద్రుడు, సూర్యుడు ఆ తటాకాల్లో ఆడే ఆటలు ఎంత చూడముచ్చటగా ఉండేవో. మత్స్య వారోత్సవం ప్రతి సంవత్సరం బ్రాహ్మణేతరులు కోలాహలంగా నిర్వహించేవాళ్లు. ఆ చెరువుల్లో ఎవర్నీ ఈతకొట్టనిచ్చే వాళ్లుకాదు. అంతకుమించి విచారించాల్సిన అంశమేమంటే వాటిల్లోని తామరపూలు అంతగా వికసించేవి కావు. ఆ చెరువుల్లో ఒకదాంట్లో ఒక పడవ ఉండేది. యువకులు దాన్ని అటూ ఇటూ తిప్పుతూ ఉండేవాళ్లు. కొన్ని గ్రామాల్లో 'తెప్ప తిరుణాళ్లు' నిర్వహిస్తుండేవాళ్లు. అలాంటివి అన్ని గ్రామాల్లో నిర్వహిస్తే ఎంత బాగుంటుందో.

నాకు పదిహేనేళ్ల వయస్సున్నప్పుడు మా ఊరి పెద్దలు జింకల్ని, దుప్పుల్ని, మంచి మంచి గుర్రాలను, పొట్టి ఎద్దుల్ని, పందెపు ఎద్దుల్ని, హంసలు, బాతులు, నెమళ్లు, పాటలు పాడే పక్షుల్ని తెచ్చి మేము ఒక చిన్న జంతు ప్రదర్శనశాలలో తిరుగాడిన అనుభూతిని కలిగించారు. ఇటువంటి ప్రదర్శనశాలలు గ్రామీణ భారతదేశంలో ఎన్ని ఏర్పాటైతే అంత మంచిది.

వీరముష్టివాళ్ల వంటి గారడీవాళ్లు మా గ్రామానికి సంవత్సరంలో ఒకటి రెండుసార్లు వచ్చేవాళ్లు. ఒక పర్యాయం బెండుతో చేసిన మంచంపై మనిషిని పడుకోబెట్టుకుని నలుగురు మోశారు. అతడు వగిడాకు అంత తేలిగ్గా ఎలా మారాడన్నది నేటికీ విద్దూరంగానే కనిపిస్తుంది.

గ్రామీణ పండుగలు

పొన్నూరు మా పక్క గ్రామం. అది నిడుబ్రోలుకు మైలు దూరంలో ఉంటుంది. (ఇప్పుడు కలసిపోయాయి. ఆ రెండు గ్రామాలను విడదీసేది కోల్‌కతా–చెన్నై రైలు మార్గమే) ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో భావన్నారాయణ స్వామి ఉత్సవాల్లో ఆ గ్రామం ఓ పక్షం రోజులు ఓ వెలుగు వెలిగేది. రైతులు వాళ్లకు సంవత్సరానికి కావాల్సిన సరకులన్నీ కొనుక్కుని వెళ్లేవాళ్లు. అలాగే సమస్త ఉపకరణాలను కూడా కొనుక్కుని వెళ్లేవాళ్లు. కళాకారులు భరతనాట్యాలు ప్రదర్శించేవాళ్లు. నాదస్వరం, మృదంగ విద్వాంసులు కూడా తమ ప్రావీణ్యాలను ప్రదర్శించే వాళ్లు. స్థానిక చేతివృత్తులవారి ఉత్పత్తులను దూర ప్రాంతాలవాళ్లు కూడా వచ్చి కొనుగోలు చేసేవాళ్లు. ఇప్పటికీ ఆ

గ్రామీణ వాతావరణం అలాగే నిలిచి ఉంది.

అటువంటి ధార్మిక ఉత్సవాలు, సామాజిక పండుగలు అనేక ప్రాంతాల్లో వెలుగుచూస్తూనే ఉంటాయి. కొన్ని ఎక్కువకాలం మనలేవు. మా ప్రాంతంలో **గోవాడ**లో శివరాత్రికి తిరునాళ్లు జరుపుతారు. దాన్ని **కోటప్పకొండ** తిరుణాళ్ల పద్ధతిలో నిర్వహిస్తారు. అందువల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రభలను గోవాడకు ఆహ్వానించేవాళ్లు. అలా గోవాడ తిరునాళ్లు ప్రసిద్ధి చెందాయి. ఈ ప్రాంతపు గ్రామీణ సామాజిక జీవనంలో అదొక భాగమైంది. అటువంటి తావుల్లో ప్రజల జ్ఞానాభివృద్ధికి, వయోజన విద్యకు అవకాశాలు మెండుగా లభించ వచ్చు. ఆంగ్లేయులు, స్కాట్లెండ్ వాళ్లు ఇటువంటి తిరునాళ్లను ఎంతో ప్రయోజనకరంగా తీర్చిదిద్దడం చూసి నేను ఆశ్చర్యపోయాను. ఇక అమెరికన్ల విషయమంటారా వాళ్లు వాటి విషయంలో ఆనందంతో తలమునకలవుతారు.

నా సాంఘిక ప్రవర్తనా రీతి - వివిధ ప్రభావాలు

వీరేశలింగం, కట్టమంచి రామలింగారెడ్డి, త్రిపురనేని రామస్వామివంటి వారి రచనలను చదివినందువల్ల, మహాభారతం, రామాయణం వంటి పురాణ కాలక్షేపాల వల్ల నా మనస్సులో నాటుకున్న ధార్మిక భక్తికి సంబంధించిన గోపుర కవాటాలన్నీ బదాబదలయ్యాయి. అయితే జ్ఞానం పెరిగేందుకు, భారతీయ సంస్కృతిని నిలబెట్టేందుకు అటువంటి కాలక్షేపాలు అవసరమే. పైగా మా గ్రామంలో ఓ రైతు 1916-20 మధ్య అలా పురాణాలు చదివి చెప్పసాగాడు. అలా ఒక బ్రాహ్మణేతరుడు పురాణాలను వివరించి చెప్పడమే ఆనాడు అదొక పెను విప్లవం. **వివేకానందుడు, రామతీర్థల వేదాంత ప్రబోధాలు నన్ను నాస్తికత్వం బారినపడకుండా కాపాడాయి.** రైతుల కోవకు చెందిన సుమతి, వేమన శతకకారుల శతకాలను అందరిలాగే నేనూ వల్లెవేశాను. అయితే అందులోని శైలీ మాధుర్యం, ఆలోచనామృతం నాకు బాగా రుచించేవి. 1918 నాటికి వారి పద్యాలు భర్తృహరి సుభాషితాలకు, భారత సూక్తులకు సాటి వస్తాయని తెలిసిపచ్చింది. అందువల్ల వాళ్ల పద్యాలు ఆనాటి నా ధార్మిక విశ్వాసాలకు పట్టుగొమ్మలయ్యాయి. ఉదాహరణకు వేమన 'రాళ్లు దేవుళ్లయితే గుట్టలకు గుట్టలు ఆహారాన్ని మెక్కరా' అని నిలదీశాడు. ఇక సుమతి హెచ్చరికను గమనిస్తే 'ఇంటిలోని స్త్రీ కంట కన్నీరుపెడితే అదృష్టదేవత ఆ ఇంట ఉండనొల్లదు'. సుమతి సూచన ప్రకారం కృతఘ్నుడో, మూఢుడో అయిన రాజుకు సేవలు చేసేకంటే వడి గల యెద్దుల గట్టుక మడి దున్నక బతకవచ్చు'.

పదవి కట్టబెట్టడం ఎలా ఉంటుందంటే :

'కనకపు సింహాసనమున
శునకము కూర్చుండబెట్టి శుభలగ్నమునన్
దనరగ పట్టము గట్టిన
వెనుకటి గుణమేల మాను భువిలో సుమతీ'

సుమతి చెప్పిన ప్రకారం :

'ధనమా వచ్చిన వచ్చును
సలలితముగ నారికేళ సలిలము భంగిన్
ధనమా పోయిన పోవును
కరిమింగిన వెలగ భంగి కదరా సుమతీ'

అందువల్ల దానికోసం తాపత్రయం తగదు. ఓడలు బండ్లవుతాయి, బండ్లు ఓడలవుతాయి. వేమన ఏమంటాడు :

'అలవిగాని చోట అధికులమనరాదు' అంటాడు. అందుకు ఉదాహరణగా **'కొండ అద్దమందు కొంచెమై ఉండదా?'** అంటాడు.

సుమతి ఏసుక్రీస్తు వలే **'అపకారికి ఉపకారము నెపమెన్నక చేయువాడె నేర్పరి'** అంటాడు.

వాళ్ల ఆలోచనలను అలా ఉటంకించడంలో ఎంతో సౌలభ్యం ఉంది. అదిగో అటువంటి ఆలోచనలు, బోధనలు నా మనస్సునిండా ముసురుకునేవి.

మహా కవి పోతన కూడా నా మనస్సుపై చెరగని ముద్రవేశాడు. మహాభారత గ్రంథం నుండి శ్రీకృష్ణుని జీవితాన్ని అతి రమ్యంగా వర్ణించి చెప్పాడు. అతను గొప్ప భక్తుడు. నిజమైన మహర్షి. ఆయన కవిత్వంలోని భక్తి పారవశ్యం నన్నినాటికీ ఆకట్టుకుంటుంది. తన గ్రంథాన్ని భగవదార్పితం చేస్తానేకానీ పనికిమాలిన రాజులకు అంకితం ఇవ్వనన్నాడు. దిక్కుతోచని అటువంటి రాజొకరు ఆ గ్రంథాన్ని భూస్థాపితం చేశాడు. ఆ రాజు శుక్రనీతిని కాదని మాకియవెల్లి రాజకీయ శాస్త్రానికి నాంది పలికాడు. 'కారే రాజులు, రాజ్యముల్ కలుగవే...' అంటూ చెప్పి శిబి చక్రవర్తివలే ఆ రాజులు అమరులు కాలేరు కదా... అదంతా నాకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

పూర్వకాలంలో గ్రామాలను తీర్చిదిద్దిన వారు తోపులకు, తోటలకు అవకాశం కల్పించారు. కోయిల వంటి పక్షులకు మావి చిగురు, మనకు పండ్లు, ఫలాలు, చింతపండు లభించేవి. అటువంటి తోపుల్లో చేనేత పనివారు నేసే బట్టల్ని సాపుచేసేవారు. అలాగే అరటి చెట్లు కూడా కాలువ గట్ల వెంట ఉండేవి. ఇలా గ్రామాలను తీర్చిదిద్దడం గుజరాత్‌లో కూడా కనిపించేది. అయితే ఆధునిక కాలంలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు, రోడ్లు వేసే సివిల్ ఇంజనీర్లు వాటి అవసరాన్ని గుర్తించక ధ్వంసం చేస్తున్నారు. మాస్కోలో ఇంజనీర్లు అటువంటి విధ్వంసకర చర్యలకు పాల్పడకుండా జాగ్రత్తలు పాటిస్తారు.

చింతచెట్టు ఇంట్లో ఉంటే చింతలకు దారితీస్తుందని భావించి మనం ఆ చెట్టును పోగొట్టుకుంటూ ఉంటే దీర్ఘకాలం మన్నే ఆ చెట్లను సింహళీయులు వాళ్ల స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా విశ్వవిద్యాలయాల్లో నాటుతారు.

వృక్షాలు, పక్షుల పట్ల ప్రేమ

పక్షుల ప్రేమ, వృక్షాల నీడ, పంట నిండుదనం చూసినప్పుడు నా ఆనందానికి పట్టపగ్గాలుండవు. **భారతదేశంలో ఏ రుతువు అందం దానిదే.** నేను పాఠశాలకు వెళ్లకముందే ఇటువంటి అభిరుచులు నాలో మొలకెత్తాయి. ఇదంతా మా మంగమ్మ అమ్మ అమాయకత్వపు బోధనల వల్ల , వెంకయ్య మాస్టారి వల్ల, ప్రకృతి ప్రేమికుడు, ఆంగ్ల కవి **వర్డ్స్ వర్త్** కవిత్వం వల్ల, గోపాలకుడైన కృష్ణునికి చెట్ల పట్ల, పిట్టల పట్ల గల అనురాగాన్ని అందంగా చెప్పిన పోతన కవిత్వం వల్ల నాలోని ఆలోచనలు దృఢపడ్డాయి. చిలుకలు, శారికలు, మైనాల వంటి పక్షులను చూసినప్పుడు... పున్నాగ, మొగలి, రోజా, చేమంతి మొదలైన పూలను చూసినప్పుడు వాటి అందం, గుబాళింపు నా గుండెను ఆనందంతో నింపేవి.

గ్రామీణ ప్రజా జీవనంతో మమేకం

గ్రామ పంచాయతీలను పునరుజ్జీవింపజేయాలని అనిబిసెంట్ పిలుపునివ్వడం వల్ల, భారతీయులకు ప్రజాస్వామ్యం గురించి ఎవరూ కొత్తగా చెప్పనవసరంలేదని, అది వాళ్ల సర్వసత్తాక గ్రామ పాలనలోనే వెల్లడైందని **శంకరన్ నాయర్** బ్రిటిష్‌వాళ్లకు చురక వేయడం వల్ల అవి నాలో గ్రామాల భవిష్యత్తు పట్ల ఆశలు రేపాయి. గ్రామ స్వయం పరిపాలన దిశగా కలలు కన్నాను. రాజకీయ శాస్త్రం గురించి నేను తెలుగు

పుస్తకాల ద్వారానే అవగాహన పెంచుకున్నాను. నాకు ప్రాతినిధ్య పాలన (Representative Government) పూర్తిగా బోధపడలేదు. మన గ్రామీణ వాతావరణంలో అటువంటి సంస్థలు మనకు లేవు.

మా ప్రాంతంలో తొలిసారి ఎన్నికలు చూసింది **1916లో తాలూకా బోర్డు ఎన్నికలు** జరిగినప్పుడు. ఓటు హక్కు అప్పుడు పరిమితం. **బాగా పాలమున్న భూస్వాములు మాత్రమే ఓటర్లు.** మాంటేగు ఓటు హక్కును ఎక్కువమందికి కలుగజేసే అభిప్రాయాన్ని ప్రకటించగానే రామకోటేశ్వరరావు ఓటు ప్రాముఖ్యాన్ని వివరిస్తూ ఒక కరపత్రాన్ని విడుదల చేయడాన్ని నేను స్వాగతించాను. అలా ప్రజాస్వామిక సంస్థల విషయంలో నగర యువతతో పోల్చుకుంటే నాకు అవగాహన తక్కువే.

1914–20 మధ్యకాలంలో గ్రామీణాభివృద్ధికి నేను చేసిన కృషి అల్పమేమీ కాదు. దాని కొనసాగింపునకు గ్రామీణ యువతలో మార్పు తేవడం కూడా అంత సులభమేమీ కాదు. తర్వాత గ్రామ సేవకులు కూడా అటువంటి ఇబ్బందులనే ఎదుర్కోవడం చూసిన తర్వాత మధ్య యుగపు భారతదేశంలో మన గ్రామీణ సామాజిక కార్యక్రమాలను ముడిపెట్టడం వల్లనే అవి అలా నిరంతరాయంగా కొనసాగుతున్నాయనిపించింది. ఆ కారణంగానే శ్రీరామ నవమికి, జన్మాష్టమికి, వన మహోత్సవాలకు, వినాయక చవితికి, సంక్రాంతికి అంత ప్రాచుర్యం వచ్చింది.

కీర్తి గడించిన మంచి వ్యక్తుల మధ్య కలహాలేల?

బాలగంగాధర్ తిలక్ ఆరేళ్లు జైలు జీవితం అనుభవించి విడుదలైన తర్వాత మహారాష్ట్ర ప్రజలు **లోక్‌మాన్య** బిరుదును ప్రదానం చేసి లక్ష రూపాయలు ఇచ్చారు. **'స్వరాజ్యం నా జన్మహక్కు. నేను దాన్ని సాధించి తీరుతా'** అన్నది మాకు బాగా స్ఫూర్తినిచ్చింది. గ్రామీణాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక విద్యకు కోటి రూపాయల గ్రాంట్ మంజూరు చేయమని **గోపాలకృష్ణ గోఖలే** కోరడం మేము చేపట్టిన నిరక్షరాస్యత నిర్మూలన కార్యక్రమానికి మంచి ఊపునిచ్చింది. అటువంటి దేశ భక్తులిద్దరూ ఒకరికొకరు ఎందుకు అడ్డుతగులుతారు? నేను బాగా రాజకీయాల్లోకి చొచ్చుకుపోయిన తర్వాత తెలియవచ్చింది – అటువంటి వ్యతిరేకత సహజంగానే చోటుచేసుకుంటుందని, అవి తీవ్రమైన భావావేశాల వల్ల, ఒకరి పట్ల మరొకరికి జనించే అసూయ వల్ల అలా కరుగుతుందని. ఇంతలో నేను ఇంగ్లండ్ వెళ్లాను. మహాత్మా గాంధీ ప్రారంభించిన

సహాయ నిరాకరణ ఉద్యమాన్ని **అనిబిసెంట్** వ్యతిరేకించింది. మహాత్ముడు అన్న నోటితోనే ఆమె ఆయన్ను ఎంతగా తూలనాడిందో. **శ్రీనివాస శాస్త్రి** కూడా అదే బాటన నడిచాడు. జాతీయ భావాలతో ఊగిపోయే యువకునిగా నేను 1920-21లో **గాంధీజీని విమర్శించేవాళ్లను ఖండించే జట్టులో కలిశాను ఆక్స్‌ఫర్డ్ ప్రాంగణంలో.**

స్వామి దయానంద సరస్వతి తెలుగు పుస్తకం **'సత్యార్థ ప్రకాశిక'** లభిస్తే 1920లోనే చదివాను. ఆయన కుల వ్యవస్థపై చేసిన విమర్శ నచ్చింది. అంతేకాక అస్పృశ్యతపై, పూజారుల సంప్రదాయ వాదంపై విసిరిన విసుర్లు నచ్చాయి. అయితే మిగతా పవిత్ర గ్రంథాలతో పోల్చి వేదాలు కూడా భగవదత్తాలు కావన్న ఆయన వాదన మాత్రం నాకు ఆమోదయోగ్యంగా లేదు.

తర్వాత తర్వాత గ్రహించాను **అనేకమంది భారతీయుల ఆలోచనల్లోనూ, ఆచరణలోనూ ఎంతో వ్యత్యాసం ఉందని.** నా ఆలోచనలకు, ఆచరణకు జత కుదిరేవరకూ నాలో ఆనందం తొంగిచూసేదికాదు. తర్వాత కాలంలో బాపూజీది కూడా అటువంటి స్వభావమేనని తెలిసి ఆనందమేసింది. భారతీయ దార్శనికులు చేసే ఆలోచనకు, చెప్పే మాటకు, ఆచరించే పద్ధతికి పొంతన కుదరాలని నిరంతరం చెబుతూ వస్తున్నా. అటువంటి ఐక్యతను బహు కొద్దిమంది మాత్రమే సాధించగలిగారు.

నేను మాత్రం నా కిశోర ప్రాయం నుండే దేన్ని విశ్వసిస్తే దాన్నే అమలుపర్చేవాణ్ణి. ఉదాహరణకు నాకు కథలు పుస్తకాలు నచ్చే రోజుల్లో స్నేహితులందరినీ కథల పుస్తకాలే చదవమని చెప్పేవాణ్ణి. వీరేశలింగం బోధనలు రుచి మరిగిన తర్వాత అస్పృశ్యతను పాటించేవాణ్ణి కాదు. అలాగే వీరేశలింగం, దయానందల బోధనల ప్రభావం కారణంగా విగ్రహారాధన, బలులివ్వడంవంటివి నిష్ప్రయోజనమని, అనాగరికమని భావించాను. 1933 ప్రాంతంలో నేను **ఠాగోర్ రాసిన 'గోరా' నవల చదివాను.** నావంటి గ్రామీణ యువకుల్లో 1916-20 ప్రాంతాల్లో చెలరేగిన మానసిక, నైతిక ప్రకంపనలనూ, సంఘ సంస్కరణ కార్యకలాపాలను ఎంతగానో వాస్తవంగా చిత్రీకరించి అందించగలిగాడనుకున్నా.

నా విద్యార్థి జీవితంలోకి అమెరికా సంయుక్త రాష్ట్రాలు

జి.హరిపురుషోత్తమరావు గారు రచించిన **అబ్రహం లింకన్** జీవిత కథను నేను మా గ్రామంలోని పాఠశాలలో చదువుకునే రోజుల్లోనే చదివాను. అయితే 1917లో

నేను రాజకీయ రంగంలో క్రియాశీలంగా వ్యవహరిస్తూ ఆ జీవిత చరిత్రను మూడో పర్యాయం చదువుతున్నప్పుడు దాని గొప్పతనం నాకు తెలిసివచ్చింది. **బెంజమిన్ ఫ్రాంక్లిన్** జీవిత చరిత్రను కూడా అప్పటికే చదివి ఉన్నాను. అమెరికన్ నీగ్రోలు వాళ్ల బానిసత్వం నుండి ఎలా బయటపడింది తెలియవచ్చింది.

ఇంతలో అమెరికా తొలిగా ప్రపంచ యుద్ధంలో పాల్గొంది. ఆ సందర్భంగా వార్తాపత్రికల్లో అమెరికా చరిత్ర, స్వేచ్ఛ పట్ల , దేశ స్వాతంత్ర్యం పట్ల దాని ప్రేమ, సామ్రాజ్యవాదం పట్ల వ్యతిరేకత కథనాలుగా వచ్చాయి. ఆ తర్వాత ఆ దేశాధ్యక్షుడు **ఉడ్రోవిల్సన్** స్ఫూర్తిదాయక ప్రసంగాలు వచ్చాయి. అందులో ఒక దేశంపై మరో దేశం పెత్తనమేమిటని ఆయన ప్రశ్నించాడు. అవి కారుమబ్బుల్లో కాంతి రేఖల్లా కనిపించాయి. ఆయన 14 సూత్రాలను భారతీయులు స్వాగతించారు. భారతదేశపు తొలి అత్యున్నత న్యాయాధీశుడు వాటిని భారతదేశానికి అన్వయించాలని విజ్ఞప్తిచేసే సాహసం చేశాడు. తమ ఆధీనంలో ఉన్నవారు మరో దేశం ముందు అది ఎంత గొప్పదైనాకానీ అలా చేతులు చాచడం బ్రిటిష్ ప్రభుత్వానికి నచ్చలేదు. అలా **అయ్యర్** చర్యను ఖండించడంలో ప్రెసిడెంట్ విల్సన్‌ను తమ ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవద్దని చెప్పినట్టయ్యింది. మేము బ్రిటిష్ ప్రతి చర్యకు ఆగ్రహంతో ఊగిపోయాం. సమయానికి తగిన విధంగా బ్రిటిష్ సామ్రాజ్యవాద వైఖరి విషయంలో ప్రపంచాన్ని ఆత్మావలోకనం గావించుకోమనగల సాహసి భారతీయుల్లో ఒకడున్నాడని వుప్పొంగిపోయాం. లీగ్ ఆఫ్ నేషన్స్ ప్రతిపాదన కూడా మావంటి యువకుల్ని నిరుత్సాహపర్చింది. అందుకు కారణం **హోమ్ రూల్** ఉద్యమం ఊపందుకోవడమే. అందువల్ల మేము మన దేశం స్వతంత్ర భారతదేశంగా రూపుదాల్చాలనే విషయం వైపే మొగ్గుచూపాం.

బ్రిటిష్ ప్రభుత్వం ప్రపంచ యుద్ధంలో భారతీయ సైనికుల కీలక పాత్రను వేనోళ్ల కొనియాడింది. దానివల్ల మనం ఎవరికంటే తక్కువ కాదనే భావం మాలో పెల్లుబికింది. మనం చేసిన సహాయానికి ప్రతిఫలంగా మాకు దేశానికి స్వాతంత్ర్యం ప్రసాదించాల్సిందేనన్నాం.

పల్లెలు, పట్టణాల మధ్య స్పందనలో వ్యత్యాసం

నా జీవితంలోని తొలి ఇరవై యేళ్లు అలా గ్రామీణ భారతంలోని తులనాత్మక ప్రశాంతతలో, సామాజిక నిశ్చలత్వంలో గడచిపోయాయి. భారతదేశానికి, పాశ్చాత్య

ప్రపంచానికి ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో వ్యత్యాసం ఉంది. పరుగులు పెట్టే అమెరికాను అలా వదిలెయ్యండి. మన నడక ఫ్రాన్స్, ఇంగ్లండ్ మాత్రం కూడా లేదు. మన జాతీయ పనిముట్లలోకి సాంకేతిక పరిజ్ఞానాన్ని చొప్పించే విషయంలో కూడా మనో వైజ్ఞానికంగా కూడా మనం సన్నద్ధం కాలేదు. అలా ఆధునిక భావనలను, యంత్రాలను, పారిశ్రామిక, వాణిజ్య ప్రక్రియలను అందిపుచ్చుకునే విషయంలో ఎంతో వ్యత్యాసం ఉంది. అదే విధంగా నేటి గ్రామీణ భారతదేశం ప్రతి విషయంలోనూ పట్టణాలతో పోల్చి చూస్తే వెనకబడిపోతోంది. ఇవాళే ఇలా ఉంటే 1910-20 ప్రాంతాల్లో అప్పుడప్పుడే మా ఫిర్కాలోని యాభయ్యో, వందో గ్రామాలకు, ఇంకా పూర్తిగా నిద్రవీడని కొన్ని పట్టణాలకు ఆవల అసలైన ప్రపంచం ఉందని నేను కనులువిప్పి కనుగొనే కాలం సంగతి ఎలా ఉందో మీరు ఊహించగలరు.

మా ఆంజనేయులు ద్వారా ఆనాటి దినపత్రికల్లో ప్రతిఫలించే జాతీయతా రీతుల్ని ఒడిసి పట్టకుండా ఉండి ఉంటే, వెంకయ్య ద్వారా 19వ శతాబ్దపు ఆంగ్లేయ వుదారవాదాన్ని దానికి అనుగుణమైన వ్యాఖ్యల్ని వివేకానందుడు, రామతీర్థల రచనల ద్వారా చదవకుండా ఉండి ఉంటే, యుగకర్తను చేసిన వీరేశలింగం గారి రచనలను చదవకుండా ఉండి ఉంటే ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన భావాలతో, ఉద్యమాలతో, ఘటనలతో ఎటువంటి సంబంధం లేకుండానే మేము మా గ్రామీణ పరిధిలోనే గిరిగీసుకుని ఉండాల్సి వచ్చేది. అయినా అప్పటికింకా నాకు రష్యా విప్లవం గురించి ఏమీ తెలియదు. ఆ విప్లవ స్వరూపంగానీ, ప్రాముఖ్యం గురించికానీ, ప్రపంచ ఘటనలపై దాని ప్రభావం గురించికానీ ఏమీ తెలియదు. అదే విధంగా అమెరికా ప్రెసిడెంట్ ఉడ్రో విల్సన్ 14 సూత్రాల గురించికానీ, లీగ్ ఆఫ్ నేషన్స్ గురించికానీ, అవి భారత జాతీయోద్యమానికి ఉపకరించే విషయం గురించికానీ పెద్దగా తెలియదు.

భారతదేశపు యువరాజులు బ్రిటిష్‌వాళ్లకు అటువైపు పాదాక్రాంతులవుతూ ఇటువైపు సొంత ప్రజల పట్ల ఎందుకు నిరంకుశులుగా వ్యవహరిస్తున్నారనేది అర్థంకాని విషయంగానే ఉండిపోయింది. భారతదేశం భారతదేశంగా ఉన్ననాడు ఆ దేశపు రాజులు, జమీందార్లు ఎలా అయితే విదేశీ చొరబాటుదార్లను దేశంలోకి చొరబడకుండా చూశారో అటువంటి స్థితి కోసం మేము అర్రులు చాస్తున్నాం.

జాతీయోద్యమంలో ఐ.సి.ఎస్.వాళ్లు నిర్వహించాల్సిన పాత్ర విషయంలో కూడా ఆనాటికి స్పష్టతలేదు. ఉండి ఉంటే బాపట్ల, తెనాలి, గుంటూరుకు చెందిన అందరు

పెద్దలు 1920లో నేను ఐరోపా వెళ్లే సందర్భంగా వీడ్కోలు పలికేందుకు వచ్చి వుండేవాళ్లుకాదు.

రౌలత్ చట్టాన్ని కే.శే.శ్రీనివాస శాస్త్రిగారి వంటి సౌమ్యులు కూడా వ్యతిరేకిస్తున్నారంటే ఏదో ఘోరం జరిగిపోయిందనిపించింది. జలియన్‌వాలా వుదంతాన్ని పురస్కరించుకుని గాంధీజీ ఇచ్చిన పిలుపు మేరకు మేమంతా నిరాహారదీక్షను పాటించాం. మన జాతితో బ్రిటిష్‌వాళ్లు విశ్వాసపాత్రంగా ప్రవర్తించడంలేదని తేలిపోయింది. అయితే దానికి వ్యతిరేకంగా చర్చలు, సభలను రాజకీయ నాయకులుగానీ, యువతగానీ పెద్దయెత్తున నిర్వహించలేదు. ఇక భూములున్న రైతుల విషయానికొస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏమి జరుగుతున్నదనేది వాళ్లకు దాదాపుగా తెలియనే తెలియదు. 1921-31నాటికి ఉద్యమాల వల్లనే వాళ్లకు కనువిప్పు కలిగింది. ఆ ఉద్యమాల్లో వాళ్లు పాల్గొనవలసిన అవసరమేమిటో తెలియవచ్చింది.

నేను ఆక్స్‌ఫర్డ్‌లో చదువుతున్న తొలి యేడాదే **'సంవత్సరం లోపే స్వరాజ్యం'** అనే ధ్యేయంతో సహాయ నిరాకరణోద్యమానికి శ్రీకారం చుట్టారు. అంత సమయం పట్టడానికి కారణం జాతీయోద్యమాన్ని అవగాహనకు తెచ్చుకునే విషయంలో గ్రామీణ భారతానికి, పట్టణ ప్రాంతపు భారతదేశానికీ మధ్య గల వ్యత్యాసమేనని చెప్పాలి. పరిస్థితి కొంత మెరుగుపడినా గ్రామీణ ప్రాంత ప్రజల వైకల్యం పూర్తిగా తొలగిపోయిందని చెప్పలేం.

ఆహారం, వస్త్రధారణ, సామాజిక మర్యాదలు వంటి వాటి విషయంలో ఎవరైనా ఇట్టే అర్థంచేసుకోగలరు. కాఫీ, టీ, కోకావంటివి తాగడమూ తినేటప్పుడు పోర్కులు, కత్తులు వాడడమూ భోజనాల బల్ల వద్ద పాటించాల్సిన మర్యాదలన్నింటినీ అప్పుడే అలవాటు చేసుకోవాల్సి వచ్చింది కనుక ఐరోపా జీవన రీతుల్ని అలవాటు చేసుకునే విషయంలో నాకు కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. నాకు స్త్రీలను తల్లులుగా, సోదరీమణులుగా మాత్రమే చూడడం వచ్చుగానీ వాళ్లతో కలసిమెలసి చదువుకోవడం, ఆడుకోవడం, వాళ్లను కేవలం అమ్మాయిలుగానూ, స్త్రీలుగానూ చూడడం నా అనుభవంలోకి వచ్చిన అంశాలు కావు. అయితే నేను ఇంగ్లండ్‌కు ప్రయాణిస్తున్న ఓడలో ఓ మూడు వందలమంది భారతీయ విద్యార్థులుంటే ఓ వందమంది వరకూ ఐరోపా వాళ్లున్నారు. అందువల్ల సామాజిక మర్యాదలు పాటించే విషయంలో తప్పులు దొర్లుతాయేమోననే బెరుకు కొంత తగ్గింది. పైగా నేను విస్తారంగా పుస్తకాలు చదివిన కారణంగా ఇతర తెలుగు విద్యార్థులు పడినన్ని బాధలు నేను పడలేదనే చెప్పాలి.

నేను పి.సి.రేతోపాటు అదే ప్రథమ శ్రేణి డెక్ మీద ప్రయాణిస్తున్నందుకు సంతోషం కలిగింది. ఆయన గురించి నాకు తెలుసు. ఆయన రసాయన శాస్త్రంలో ఆవిష్కరించిన నూతన అంశాల గురించి అవగాహన ఉంది.

నేను ఇంగ్లండ్‌లో ఏ సంస్థలో ఏమి చదవాలి అనే విషయంలో సలహా కోరాను. నేను అప్పటికి ఏ విశ్వవిద్యాలయంలో కూడా ప్రవేశానికి అనుమతి పొందకుండానే అలా ఇంగ్లండ్ బయలుదేరడం ఆయనకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

అయితే జాతీయ సమస్యల పట్ల నాకున్న అవగాహన కారణంగా నా పట్ల శ్రద్ధ కనబర్చారు. అలాగే బెంగాలీ నాయకుల జీవిత చరిత్రలు చదివిన కారణంగా ఆ విషయాలు మాట్లాడుకున్నాం. ఆయన విజ్ఞాన శాస్త్రంలో కనుగొన్న నూతన అంశాల గురించి కూడా ముచ్చటించుకున్నాం. మేము మంచి మిత్రులుగా మారిపోయాం. అలా నేను ఇంటికి దూరమైన బెంగ మాయమైంది. నిరంతర సముద్ర యానపు విసుగు నుండి దూరం కాగలిగాను. **మెట్రిక్ చదువు ఆక్స్‌ఫర్డ్‌లో ప్రవేశానికి చాలదని తెలిసి నిరుత్సాహానికి గురయ్యాను.** ఎవరో, ఎలాగో నన్నూ **రామకృష్ణ** గారిని కలిపారు. ఆయన అప్పట్లో అక్కడ ఐ.సి.ఎస్. తర్ఫీదులో ఉన్నారు. ఆయన, **టి.బి.రావు** గారు నాకు ఆక్స్‌ఫర్డ్‌లో ప్రవేశం పొందేందుకు ఎంతగానో సాయపడ్డారు.

గ్రామీణ భారతం నుండి గ్రామీణ ఇంగ్లండ్‌కు

మేము అందరం పట్టణానికి రెండు మైళ్ల దూరంలో గల **బోట్లే** గ్రామంలో నివసించసాగాం. ఆక్స్‌ఫర్డ్ పట్టణంలో సకల ఆధునిక సౌకర్యాలున్నా అది కూడా అంత పెద్ద పట్టణమేమీకాదు. అయితే భారతదేశంలోని ఓ గ్రామం నుండి వెళ్లి అక్కడ బోట్లే గ్రామంలో నివసించడం కూడా అనుకోకుండా కలసివచ్చిన అదృష్టంగానే భావించాను. వీధులు, కాలినడక బాటలు నాకు నచ్చాయి. **థేమ్స్, ఐసిస్** నదులు, వాటి ఉపనదులు ఆ ప్రాంతంలో చిక్కురు బొక్కురుగా అల్లుకున్నాయి. రకరకాల వృక్ష సంపద ఎన్నో ఏళ్లనాటిది.

నాకు మా ప్రాంతపు చింత, నేరేడు చెట్లు గుర్తుకొచ్చాయి. కనుక నేను భారతదేశపు ఒక గ్రామ ప్రాంతం నుండి ఇంగ్లండ్ దేశపు మరో గ్రామ ప్రాంతానికి చేరుకుని జీవితాన్ని ఆహ్లాదమయం చేసుకోగలిగాను.

2

మా పూర్వీకులు

గత రెండు సహస్రాబ్దాలుగా మా పూర్వీకులు కష్టజీవులు, దేశం కోసం పోరాడినవారు. ఇది ప్రపంచంలోని అన్ని దేశాల్లోని కర్షకులకు వర్తిస్తుంది. బౌద్ధ యుగంలో ఆర్యులకు, దస్యులకు చెందిన ఉన్నత, అధమ తరగతుల ప్రజల మధ్య విభేదాలు కొనసాగాయి. క్షత్రియులు ఉన్నత వర్గ మేధావుల పెత్తనానికి ఎదురుతిరిగారు. అక్కడ భూ వసతి కలిగి, సామాజికంగా ముందడుగు వేసి, సాంస్కృతికంగా స్వయం సమృద్ధిని సాధించిన వ్యవసాయదారుల్ని పశ్చిమాన క్షత్రియులన్నారు. గంగాతీర మైదానంలోని వారిని కర్మకారులు లేదా కుర్మిలన్నారు. మహానది, గోదావరి, కృష్ణా, పెన్నా, తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లోని వారిని కమ్మవారన్నారు. బౌద్ధంలో ధర్మ రమ్మ అయినట్లు కర్మ కమ్మగా రూపాంతరం చెంది ఉంటుంది.

అలా ఒరిస్సాలో మహానంది నదికి దక్షిణాన గల ఉదార స్వభావులు, స్వేచ్ఛా ప్రియులు, స్వతంత్ర జీవులుగా ఉన్నవారు కమ్మవారిగా గుర్తింపుపొందారు. వాళ్లు సేనల్లో ఎంతగా రాణించారో వ్యవసాయదారులుగానూ అంతగానే గణుతికెక్కారు. గ్రామాల పరిపాలనలోనూ వారిదే పైచెయ్యిగా ఉండేది.

బౌద్ధం క్షీణించిన తర్వాత పునరుజ్జీవం పొందిన హైందవ సమాజంలోనూ వారికి

భూమి పట్ల గల అవ్యాజానురాగం, వ్యవసాయం చేయడంలో కౌశల్యం, స్వేచ్ఛ కోసం, సామాజిక అంతస్తు కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడ గల పటిమ వాళ్లను ముందు వరసలో నిలబెట్టింది. వాళ్లంతా జాతిపరంగా లేదా సామాజికపరంగా ఒకటిగా నిలిచారని చెప్పజాలం.

ఆంధ్ర దేశాన్ని, కర్నాటకను కలిపి పల్లవులు క్రీ.శ. 5-6 శతాబ్దాల మధ్య, రాష్ట్ర కూటులు 6-8 శతాబ్దాల మధ్య, చాళుక్యులు 9-10 శతాబ్దాల మధ్య, చోళులు 10-11 శతాబ్దాల మధ్య తర్వాత 11-13 శతాబ్దాల మధ్య కాకతీయులు, 14-17 శతాబ్దాల మధ్య విజయ నగర రాజులు పరిపాలించారు.

దక్షిణ పథంలో గోదావరి ఒడ్డున సుభిక్షంగా ఉన్న కాకతీయులపై విదేశీయుల కన్నుపడింది. అసలీ కాకతీయులు ఎవరు? కమ్మవారు వాళ్ల పూర్వీకులంటారు. అలాగే వెలమలు, తెలగలు, మున్నూరు కాపులు కూడా చెబుతారు. ఇప్పటికీ వాళ్లంతా ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న వాళ్లలాగానే కనిపిస్తారు.

ఓరుగల్లులో కాకతీయులు... విజయనగరంలో, చంద్రగిరిలో, రాయవెల్లూరులో రాయల సంతతి, తంజావూరు, మధురల్లో నాయక రాజులు పతనం చెందేవరకూ పైన చెప్పినవారందరూ ఒకే తెగగా ఉండి వాళ్లల్లో వాళ్లు పిల్లల్ని ఇచ్చిపుచ్చుకోవడాలు ఉండేవి. అయితే స్థానిక నాయకత్వంలోని హ్రస్వదృష్టి వల్ల పొరపొచ్చాలు వచ్చి ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువగా విడిపోవడం జరిగింది. ఆ విధంగా **ఆంధ్ర దేశపు కర్షక జాతిలో వెలమలు, రెడ్లు, మున్నూరు కాపులు, తెలగలు, కొప్ప వెలమలు, గాజుల చెట్టీలు, బలిజలు, గౌడులుగా విడిపోగా మిగిలినవాళ్లు కమ్మవాళ్లు.** వీళ్లందరిలోనూ పల్లవులు, రాష్ట్ర కూటులు, చోళులు, కాకతీయులు, శ్రీకృష్ణదేవరాయలు, నాయక రాజులు నిలబెట్టిన రాచరికపు, భారత నాగరిక లక్షణాలు కనిపిస్తాయి.

మూడు దశాబ్దాల కాకతీయుల పాలనలో కమ్మ వర్గానికి చెందిన సేనానులు నాయక్‌లుగా, నాయనిమ్మార్లుగా, నీడులుగా, రాయుడులుగా, రాయళ్లుగా వాళ్ల మూలాలను అనుసరించి గుర్తింపుపొందసాగారు. కాకతీయ పాలకుల్లో బాగా కీర్తి గడించింది **గజపతిదేవ.** ఆయనకు శక్తిమంతుడైన ఓ సేనా నాయకుడుండేవాడు. ఆయన పేరు **గంగయ సాహిణి.** ఆయన సంరక్షణలో వనసీమ ఉండేది. (అంటే ఇప్పటి చిత్తూరు, కడప, అనంతపురం ప్రాంతాలు). గజపతిదేవుని కుమార్తె **రాణి రుద్రమదేవి** కాలంలో గంగయ సాహిణి ప్రధాని, సేనాని కూడా. గంగయ సాహిణి తర్వాత ఆయన వారసులు

ఒక కోటను స్థాపించి దానికి **'గంగినేని కొండ'** అనే పేరుపెట్టారు. అది ఇప్పుడు కడప జిల్లాలో ఉంది. చిత్తూరు, నెల్లూరు, కృష్ణా, ఖమ్మం జిల్లాల్లో గంగినేని పేరుతో అనేక గ్రామాలున్నాయి.

నాయక రాజులు కాకతీయ సామ్రాజ్య పతనాన్ని జీర్ణించుకోలేకపోయారు. తిరిగి ఒక దశాబ్ద కాలంలోనే కోలుకున్నారు. రైతుల నుండే వారు **ప్రోలయ నాయకుణ్ణి** రాజుగా ఎంచుకున్నారు. ఆయన నాయకత్వంలో గంగినేని కొండను, తర్వాత ఓరుగల్లు రాజ్యాన్ని సంపాదించుకున్నారు. రెండు దశాబ్దాలపాటు ఈ వీరోచిత తెగ రాజ్యపాలన చేసింది. ఆ గంగయ సాహిణి వారసత్వమే గంగినేని, గోగినేని, గొవిడి, గంగా మొదలైన ఇంటి పేర్లతో విలసిల్లారు.

1326లో ఆంధ్ర రాజ్యాన్ని తిరిగి మొగలులు చేజిక్కించుకున్న తర్వాత, ముసునూరి వంశానికి చెందిన కాపయ నాయకుడు ఓడిన తర్వాత ఒక్క తాటిపైనున్నవారంతా కమ్మ, రెడ్డి, తెలగ, వెలమ, బోయ నాయకులుగా విడిపోయారు. అప్పుడు గంగయ సాహిణి తెగ సేనా వృత్తిని మాని వ్యవసాయాన్ని చేపట్టారు. అయినా తమ పెద్దలు వాడిన కృపాణములు, ధక్కలకు సంవత్సరానికి ఒక పర్యాయమైనా వీరారాధన గావించేవాళ్లు. వాటిని పెట్టెల్లో భద్రపర్చి సంవత్సరానికి ఒకసారి అలా పూజలు చేసేవాళ్లు. అయితే మా పూర్వీకులైన వీళ్లు కడప నుండి చిత్తూరు జిల్లాలోని గంగినాయనిపాలెంకు, ఖమ్మం జిల్లాలోని గంగినేనికి, నెల్లూరు, కృష్ణా జిల్లాల్లోని గంగినేనిపాలెం గ్రామాలకు ఎలా చేరుకున్నది తెలియదు.

సరే, ఇంటి పేరు 'వెలుగు'కు తగినట్లుగా భారతీదేవి గారు నా జీవితంలో వెలుగులు నింపేందుకు మా కుటుంబంలోకి అడుగుపెట్టింది. ఎవరు ఎటువంటివారో కనుగొనడంలో, ధర్మ పరిరక్షణలో, లోకజ్ఞానంలో ఆరితేరినదయినందువల్ల అదంతా నా జీవితాన్ని వెలుగులతో నింపేందుకు బాగా వినియోగపర్చారు. వెలుగు కుటుంబాలే క్రమేపీ 'వెలగా' కుటుంబాలుగా వ్యవహారంలోకి వచ్చాయి.

ఆమె తాత **కోటయ్య** గారు ముందు చూపు గల కర్షకుడు. ఆయన కారంచేడు నాయకులతో కలసి భారతదేశం-బర్మాల మధ్య నడిచే ఎగుమతి, దిగుమతి వ్యాపారాల్లో షేర్లు కొన్నారు. ఆయన మద్రాస్ వెళ్లి విదేశీ వ్యాపారులతో సంప్రదింపులు జరపగలిగేవారు. అందువల్ల ఆయన గ్రామీణ జీవన విధానానికి విదేశీ నైపుణ్యాలను దిద్దగలిగారు. ఆయన తండ్రి పేరు **సుబ్బయ్య** గారు. ఆ ప్రాంతంలో పేరెన్నిక గన్న

రైతుగా నిలిచారు. ఆయనకు వడ్రంగం తెలుసు, పశు వైద్యం తెలుసు. 1921లో మహాత్మాగాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించినప్పుడు వాళ్ల తెగకు చెందిన **అన్నపూర్ణమ్మ** గారే తొలిదాత. మా ప్రాంతమంతా స్వాతంత్ర్య పోరాటంలో అప్పటి నుండి అలా వివిధ దశల్లో పాలుపంచుకుంటూనే ఉంది.

మా గ్రామంలోని తొలినాటి కుటుంబాలు రైతులవీ, వివిధ వృత్తులవారివీ ఏమయ్యాయో తెలియదు. బ్రాహ్మణ కుటుంబాలు, విశ్వ బ్రాహ్మణ కుటుంబాలు నిడుబ్రోలు లేక నీడుమోలు పేర్లతో ఉన్నాయి. అలాగే కమ్మవారిలో నింబ్రోలు, యెర్రప్ప నాయక్, ఆయన తండ్రి సుబ్బా నాయక్ ఉండేవారు. వాళ్లు 12వ శతాబ్దానికి చెందినవారు. కొన్ని కుటుంబాలు ఓరుగల్లు నుండి వచ్చాయి. వారు ఓరుగంటివారు. **రాజుల్లో చివరివాళ్లకు కొసరాజు ఇంటి పేరైంది.** అలాగే విజయనగరం, నన్నె చోళులకు గుర్తుగా నన్నపనేని, రాయుడు, గొంది వంటి ఇంటి పేర్లున్న కుటుంబాలున్నాయి. పాములపాటి వారి కుటుంబం మునసబుల కుటుంబం.

పూర్వం నుండి మా మాతామహుల కుటుంబాలు పాములపాటి వారి మధ్య, పితామహులు గంగినేని లేదా గోగినేని కుటుంబాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉండేది. మన గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి రాజకీయం సర్వసాధారణమే.

మా గ్రామానికి నీటి వనరులు బాగానే ఉన్నాయి. కావాల్సినంత నీరు సేద్యానికి కృష్ణా నది నుండి కాలువల ద్వారా లభిస్తుంది. అది మా కుటుంబాన్ని పంటలు పండుతాయో లేదోనన్న భయం నుండి కాపాడింది. మా వాళ్లకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సమకూర్చింది. అది వాళ్ల సాంఘిక, రాజకీయ అధికారాల గురించి, బాధ్యతల గురించి ఆలోచించేటట్లు చేయగలిగింది. అందువల్ల మా డెల్టా ప్రాంతంలో అనేక పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పడం జరిగింది. 1923 నుండి నేను తలపెట్టిన ప్రతి ఉద్యమానికి వాళ్లు వెన్నుదన్నుగా నిలిచేవాళ్లు. అంతకుముందువాళ్లు చాలీచాలని ఆదాయం వల్ల, చేతినిండా పనిలేకపోవడం వల్ల అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతూ ఉండేవాళ్లు. వ్యవసాయ ప్రధానమైన మన దేశంలో ఇదిగో ఇటువంటి నేపథ్యంలో నేను జన్మించి ఒక జాతీయవాద కర్షక యువకునిగా 1916-20 మధ్యకాలంలో పెరిగాను.

3

ఆక్స్‌ఫర్డ్‌లో తొలి యేడాది

గత నలభై సంవత్సరాల్లో మన దేశ ప్రజల్లోనూ, మన దేశంలోనూ ఎంతటి ప్రగతిదాయక మార్పో! 16.8.1957లో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ శత జయంతిని జరుపుకుంటున్నాం. ఆ సందర్భంగా భారత ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ తమ ప్రసంగంలో ప్రజల్ని ఆధునిక ప్రపంచంలో తమ బాధ్యతలను గుర్తెరిగి, అవకాశాలను అందిపుచ్చుకుని లక్ష్యసాధనకు సమాయత్తం కావాల్సిందిగా కోరాడు. అదే లక్ష్యాన్ని ఐరోపాలోని భారతీయ విద్యార్థులూ 37 సంవత్సరాల క్రితం (1920లో) పెట్టుకొన్నారు. అయితే మా సంఖ్య వేలల్లోనిదే. అయితే ఈ లక్ష్యాన్ని, స్వాతంత్ర్యానంతరం సమకూరిన ఆత్మవిశ్వాసాన్ని కోట్లమంది మనస్సుల్లోకి చొప్పించాల్సి ఉంది.

అదే సందర్భంలో భారత ప్రధాని భారత ప్రజలతో శపథం చేయించారు: 'మనం

వి ఎస్ కృష్ణ, ఎన్ జి రంగ, ఎల్ వి బి చౌదరి, వి రామకృష్ణ

యావద్భారత దేశపు ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకునేటప్పుడు స్థానికంగా తీర్చాల్సిన వేలాది అవసరాలను, అభ్యర్థనలను కూడా గుర్తించాల్సి ఉంది'. ఆక్స్‌ఫర్డ్‌లోనూ, మిగతా విశ్వవిద్యాలయాల్లోనూ ఉన్న భారతీయ విద్యార్థుల్లో ఇలాంటి అవగాహనే ఉండేది. మేమంతా (మొదటి) ప్రపంచ యుద్ధానంతర కాలంలో స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ హాయిగా ఆంగ్ల, ఐరోపా జీవితపు స్వేచ్ఛా సమానత్వాలను అనుభవిస్తూ ఉండడం వల్ల అటువంటి స్థితి భారతీయులకు కూడా సమకూరాలని కోరుకునేవాళ్లం. అప్పటికే జాతీయ కాంగ్రెస్‌లోని దిగ్గజాలు **ఆర్.సి.దత్తు**, ఇరువురు **బెనర్జీలు, అలీ సోదరులు, మహాత్మాగాంధీ, అరవింద ఘోష్, సురేంద్రనాథ్ బెనర్జీ, మోతీలాల్ నెహ్రూ, చిత్తరంజన్‌దాస్, ప్రకాశం పంతులు** గారివంటి వారెందరో ఇంగ్లండ్‌లో విద్యను ఆర్జించినవారే. కోట్లాదిమంది భారతీయుల్లో కొద్దిమంది మాత్రమే అటువంటి అవకాశాన్ని అందిపుచ్చుకోగలిగారు. ఐరోపా ప్రజల స్వేచ్ఛాయుత జీవన విధానాన్ని గమనించి, వాళ్ల ఆలోచనలను పంచుకుని స్వాతంత్ర్యంలోని ఉత్తేజాన్ని అనుభవిస్తూ తెల్లవారితో సమానంగా తిరగగలిగారు. కనుక ఇక్కడకు చేరుకుని ఇటువంటి అనుభవాన్ని చవిచూసిన వారంతా తిరిగి మన జాతికి అటువంటి స్వాతంత్ర్యాన్ని సముపార్జించి పెట్టాలని, అటువంటి సామాజిక అభివృద్ధిని అందించాలని తహతహలాడేవాళ్లు. ఆ విధంగా ఒక ప్రత్యేక బాధ్యత తమపై ఉందని భావించేవారు. అందువల్లనే 1921లో గ్రామీణ ప్రజానీకం కోసం గాంధీజీ చేపట్టిన ఉద్యమాన్ని మేమెంతగానో మెచ్చుకోవడం జరిగింది.

భారతీయ జీవనంలోని అనేక అవరోధాల్ని తొలగించుకుంటూ ముందుకు సాగేందుకు మాకు రెండు, మూడు మాసాలు పట్టింది. భారతదేశంలో ఉండగా ఐ.సి.ఎస్. వాళ్లను చూసి 'అబ్బో' అనుకునేవాళ్లం. వాళ్లతో కలసిమెలసి తిరిగేవాళ్లం. అప్పటివరకూ **మహాత్మాగాంధీని నాయకులందరిలో ఒకడిగా గుర్తించినవాళ్లం ఒక్కసారిగా ఆయన్ను మహా నాయకునిగా చూడసాగాం.** మేము అక్కడ ఆంగ్లేయులు ఎటువంటి అడ్డంకులూలేని రాజకీయ స్వాతంత్ర్యాన్ని అనుభవించడం గమనించాం. వాళ్ల పార్లమెంటైన కామన్స్ సభలోని ప్రజాస్వామ్య పద్ధతుల్ని, వాటి శక్తియుక్తుల్ని దగ్గరగా చూడగలిగాం. అందువల్ల ఆంగ్లేయులకు, భారతీయులకు మధ్య గల వ్యత్యాసాలను వేరొకరు చెప్పాల్సిన పనిలేకుండా కనులారా గ్రహించగలిగాం. ఆ వుత్తేజం వల్లే భారతదేశాన్ని త్వరగా దాస్యం నుండి విముక్తి గావించాలనే కోర్కె బలపడింది.

యుద్ధానంతర ప్రపంచంలోని జాతీయ, అంతర్జాతీయ అవగాహన అక్కడి పత్రికల ద్వారా లభించింది. అయితే మేము స్థానిక అంశాల గురించి ఆలోచించడం మానలేదు. దక్షిణ భారతదేశంలోని బ్రాహ్మణేతర ఉద్యమం, ఉత్తర భారతంలోని హిందూ-ముస్లిం ఐక్యత, కుల సమస్య, విగ్రహారాధన, మధ్యతరగతి ప్రజల్లో నెలకొన్న నిరుద్యోగ సమస్య అత్యవసర జాతీయ సమస్యలుగా మాకు అనిపించేవి. ఆ విధంగా 1920వ సంవత్సరం నా జీవితంలో అత్యంత రాజకీయ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

ఆ సంవత్సరమే తిలక్ మరణించడం వల్ల మహాత్మాగాంధీ కాంగ్రెస్ పగ్గాలు చేబూనడం జరిగింది. బ్రాహ్మణేతరులు కౌన్సిల్స్‌లో చేరే విషయంలో ఏర్పడ్డ ఆకర్షణ మన్నగిల్ల సాగింది. బ్రిటిష్ ప్రధాని అంతర్జాతీయ సమితి (లీగ్ ఆఫ్ నేషన్స్)ని బతికించే ప్రయత్నం చేస్తున్నాడు. భారతీయ విద్యార్థులంతా భారత జాతీయోద్యమానికి మద్దతు పలకడం ద్వారా ఒక వైపు గర్విస్తూ ఉంటే అది ప్రపంచ ప్రభుత్వ ఆవిర్భావానికి, ప్రపంచ పౌరసత్వానికి అడ్డంకిగా నిలుస్తున్నదని ఐరోపా మేధావులు ఆక్షేపిస్తున్నారనే విషయాన్ని **హెచ్.జి.వెల్స్** రాసిన గ్రంథం **'ఔట్ లైన్స్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ'** ద్వారా తెలుసుకున్నాం. మరో కోణం నుండి చూస్తే **మేము సామ్యవాదానికి అనుకూలంగానో, వ్యతిరేకంగానో ఏదో ఒక అభిప్రాయాన్ని ఏర్పర్చుకోవాల్సి వచ్చింది.** ఇంగ్లండ్‌లో లేబర్ పార్టీ ప్రభావం అధికం కాసాగింది. వాళ్ల నాయకులు యుద్ధ మంత్రి మండలి (war cabinet)లో ఉన్నారు. విశ్వవిద్యాలయ పరిధిలో **ఫేబియన్ సొసైటీ**, దాని నాయకులు **సిడ్నీ బియాట్రిస్ వెబ్‌ల** ప్రభావం ఎక్కువగానే ఉంది. నా స్నేహితుడు రామకృష్ణకు వెబ్ రచనల పట్ల మక్కువ ఎక్కువ. అలాగే **బెట్రాండ్ రస్సెల్** రచనలన్నా అంతకంటే ఎక్కువగా ఆదరణ చూపేవాడు. రామకృష్ణ సహాయంతో నేను రస్సెల్ గ్రంథం **'ది రోడ్స్ టు ఫ్రీడం'** (స్వేచ్ఛా మార్గాలు) చదివాను. దానివల్ల పేదరికం, సామాజిక పీడన, రాజకీయ ఆధిక్యం వంటి సమస్యల పరిష్కారాల్లోని క్లిష్టతలు తెలియవచ్చాయి. అయితే భారతీయులు చేయాల్సింది ఏమిటి? ఐ.సి.ఎస్. తర్వీదు పొందేవారు చేసినట్లు **జె.ఎస్.మిల్** రాసిన **'లిబర్టీ'** చదివి సరిపెట్టవచ్చా? ఆనాటి ఇంగ్లండ్ పడే ఇబ్బందుల్ని చూస్తూ కూడా దేశానికి స్వాతంత్ర్యం లభిస్తే చాలు మిగతా సమస్యలన్నీ వాటికవే సర్దుకుంటాయని భావించడం ఎలా? సామ్యవాదం వైపు మళ్లడం మేలా? అయితే ఏ విధమైన సామ్యవాదం? అలాగే అంటరానితనాన్ని అరికడితే చాలదనుకున్నాం. కుల ప్రాతిపదికన చోటుచేసుకున్న హెచ్చుతగ్గుల్ని సరిచేయాలి. దానితోపాటు సామాజిక,

ఆర్థిక ప్రగతిని సాధించాల్సి ఉంది. ఇదంతా మనం బ్రిటిష్, ఫ్రెంచివాళ్లను చూసి గ్రహించవచ్చు.

అది కూడా చాలదనిపించేది నాకు. ఎందుకంటే గనుల్లో శ్రమించే కార్మికుల ఆందోళనలు, ఇంగ్లండ్ అనుసరించే ప్రజాస్వామిక పద్ధతులు వాళ్లకు సంతృప్తిని కలిగించడంలేదనే విషయాన్ని రుజువు చేస్తున్నాయి. అక్కడ చెమటోడ్చే వాళ్ల పరిస్థితులు కూడా మన బొంబాయి కార్మికుల పరిస్థితులకంటే మెరుగైనవేవీ కాదని నాకు చెప్పడం జరిగింది. లండన్‌లోని తూర్పు కొసన నివసించే యూదు జాతికి చెందిన కార్మికుల కడగండ్లను నేను స్వయంగా చూశాను.

నేను ఆక్స్‌ఫర్డ్‌లో కుదురుకుని సామ్యవాదం గురించి చదవడం, వాకబు చేయడం వల్ల అక్కడి ప్రొఫెసర్లు, పత్రికలవాళ్లు సోవియట్ రష్యాలో జరిగిన ప్రగతి గురించి, లెనిన్ బోధనల గురించి చెప్పుకొచ్చేవాళ్లు. దానివల్ల నేను ఏర్పర్చుకున్న అభిప్రాయమేమంటే కమ్యూనిస్ట్ రష్యాలోని శ్రామికులు, కర్షకులు కలిసి కృషి చేయడం వల్లనే అది అంతగా రాజకీయ ప్రాబల్యాన్ని కూడగట్టుకోగలిగిందని, ఇంగ్లండ్‌లోని లేబర్ పార్టీ కూడా అటువంటి ఆధిక్యతనే కూడగట్టుకోగలదని భావించాను.

మార్క్స్, లెనిన్వంటి వారి బోధనల కారణంగా అటువంటి సామాజిక వ్యవస్థ ప్రపంచమంతటా వ్యాపిస్తుందని ఆ క్రమంలో భారతదేశంలో కూడా కార్మికులు, కర్షకులు సర్వాధిపత్యాన్ని సాధించగల రోజు, యుగం ఆవిర్భవిస్తుందని కలలుగనేవాణ్ణి.

నేను లండన్‌లో **ఇండియన్ మజ్లిస్, ఆక్స్‌ఫర్డ్ స్టూడెంట్స్ యూనియన్, ఏషియాటిక్ క్లబ్, లోటస్ క్లబ్** వంటి తావులకు వెళ్లి వాళ్ల వాదోపవాదాలను వినేవాణ్ణి. అలా విశ్వవిద్యాలయ విద్యార్థులు సమకాలీన, పరస్పర విరుద్ధ జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యం గల విషయాలపై బాధ్యతాయుతంగా, ఆత్మవిశ్వాసంతో స్వేచ్ఛగా చర్చలు జరపడం వల్ల నేను తెలుసుకోవాల్సిన అనేక విషయాలు తెలుసుకోగలిగాను. బ్రిటిష్ మంత్రివర్గ సభ్యులు, అమెరికన్ రాజనీతివేత్తలు, ఫ్రెంచి ప్రధానులు, పూర్వం భారతదేశంలో పనిచేసిన బ్రిటిష్ వైస్రాయిలు చర్చల్లో పాల్గొని విద్యార్థులతో పోటీపడేవారు.

1920 నాటికి బ్రిటిష్ స్త్రీలకు ఓటు హక్కు కొంతమేరకు లభించింది. మిల్ కన్న కల స్త్రీలకు సమాన హక్కులు అనే విషయం కార్యరూపం దాల్చేటట్లుగా ఉన్నది. భారత స్త్రీలకు కూడా అటువంటి హోదా సమకూరాలని మేము కోరుకునేవాళ్లం. **హౌస్ ఆఫ్ లార్డ్స్** అనేది రద్దవుతుందని అనుకునేవాళ్లు. సోషలిస్ట్‌లు అది రద్దు

కావాలన్నారు. లిబరల్ వర్గం దాన్ని సంస్కరించాలన్నారు. **లార్డ్ బ్రైస్ కమిటీ** దాని సమూల సంస్కరణను సూచించింది. అందువల్ల భారతదేశంలో కూడా రాచరికపు పీడ వదలదు కాబోలు అనిపించింది. మేము ఫ్రెంచి విప్లవాన్ని గురించి చదివాం. ఆక్స్‌ఫర్డ్ ప్రొఫెసర్, కష్టకీ ఆ దేశ విద్యా మంత్రి **హెచ్.ఎ.ఎల్ ఫిషర్** పందొమ్మిదో శతాబ్దపు ఐరోపా విప్లవాల గురించి రాశారు. జార్ కుటుంబం పట్ల రష్యా దురుసుగా ప్రవర్తించిన తీరు ఏవగింపుగా ఉన్నా ఆసక్తిదాయక పూర్వ దృష్టాంతంగా నిలిచింది. ఇదంతా తరతరాలుగా నెలకొన్న రాచరికపు భావన పట్ల, భారతదేశపు యువరాజుల పట్ల గల జాతీయతానురాగం మాలో బీటలువారేటట్లు చేసింది.

నాకు సెయింట్ కేథరీన్స్ డెలిగెసీ అనే తావున అధ్యయనానికి స్థానం కల్పిస్తామనే మాటే ఉన్నా నేను ఆక్స్‌ఫర్డ్‌లో ప్రవేశించి అక్కడి మిత్రుల సాంగత్యం పొందడం అదృష్టంగా భావిస్తున్నా. మద్రాస్ ప్రాంతం నుండి వచ్చి అక్కడ తర్ఫీదు పొందుతున్న ఆరుగురు నన్ను స్వాగతించారు. ఆ ఆరుగురిలో **షాబుద్దీన్** తర్వాత కాలంలో పాకిస్తాన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. ఆయన అమితంగా అభిమానించిన **ఎం.సి.చాగ్లా** బొంబాయి న్యాయ స్థానపు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. తర్వాత భారత ప్రభుత్వంలో విదేశాంగ మంత్రిగా పనిచేశారు. మలబారు ప్రాంతపు **వెల్లోడి** లండన్‌లో భారతదేశపు డిప్యూటీ హైకమిషనర్‌గా పనిచేశారు. తర్వాత నెహ్రూ కేబినెట్‌కు సెక్రటరీగా సేవలందించారు. **టి.భాస్కరరావు** గారు కలెక్టర్‌గా పదవీ విరమణ చేసి

పారిశ్రామిక రంగంలో కుదురుకున్నారు. **వెలగపూడి రామకృష్ణ** గారు దక్షిణాదిలో భారీ పారిశ్రామికవేత్తగా, భారీ పరిశ్రమ రంగపు నేతగా వెలుగొందుతున్నారు.

రామకృష్ణ నాకు ఎన్నో విషయాలు అవగతమయ్యేటట్లు చేశారు. నాకెంతగానో నా చదువులో సాయపడుతూ ఉండేవాడు. **లింగం వీరభద్రయ్య చౌదరి** గారికి అక్కడి చలి భరించడం దుర్భరంగా ఉండేది. రామకృష్ణ గారికి తప్ప మిగతా వారందరికీ కూడా అలాగే అనిపించేది. రామకృష్ణ గారు, నేనూ కలసి ప్రతి సాయంత్రం బాగా నడిచేవాళ్లం. ఆ సందర్భంగా ఎన్నో విషయాలు చర్చించుకుంటూ ఉండేవాళ్లం. ఎల్.వి.బి.చౌదరి, **వి.ఎస్.కృష్ణ** కూడా రైతు కుటుంబాల నుండి వచ్చి రామకృష్ణ గారి ద్వారా ఐ.సి.ఎస్. ప్రొబేషనర్లకు దగ్గరయ్యారు. చౌదరి గారికి తెలుగు సాహిత్యం పట్ల ప్రత్యేక అభిరుచి. కృష్ణకు ఆంగ్ల సాహిత్యం పట్ల మక్కువ. వాళ్లిద్దరి మధ్య చర్చల ద్వారా, వాటి మననం ద్వారా, పుస్తక పఠనం ద్వారా మౌనంగా సాహిత్య అవగాహనను నేను పెంపొందించుకోగలిగాను. చౌదరి నన్ను పుస్తకాల పురుగు కింద జమకట్టేవాడు. ఐ.సి.ఎస్. తర్ఫీదు పొందేవారితో తెలివిగా వాదించేవాడు. కృష్ణ అందరికంటే చిన్నవాడు. తొణకని కుండ, సూక్ష్మగ్రాహి. **చౌదరి, కృష్ణ, నేను త్రయంగా తిరిగినా మాలోని భిన్నత్వం నిలిచే ఉండేది. ఆక్స్‌ఫర్డ్ నుండి మాకెంతగానో లబ్ధి చేకూరింది.**

ఆకర్షణీయంగా ఉండి ప్రమాదాల్లోకిలాగే విశ్వవిద్యాలయ యువ విద్యార్థుల సామాజిక జీవన సుడిగుండాల్లోకి నేనెన్నడూ పోలేదు. అందుకు కారణం భారతదేశంలోని గ్రామీణ జీవనం, రామకృష్ణ పరమహంస, వివేకానంద, రామతీర్థ రచనలు. **నా ధ్యాసంతా భారతదేశంలోని పేదరికాన్ని ఎలా పోగొట్టాలనే.** అందుకు నాకు బ్రిటిష్ అభివృద్ధిని చూడగల సులోచనాలు లభించాయి. నేనింకా ఆక్స్‌ఫర్డ్‌లో పూర్తిస్థాయి విద్యార్థిగా రూపొందలేదు. నా ప్రతిభని గుర్తెరిగినా రామకృష్ణ తాను విశ్వవిద్యాలయాన్ని వదలి వెళ్లేటప్పుడు నన్నొక సంవత్సరంపాటు ఆ ప్రాంగణంలో ప్రసంగించవద్దన్నాడు. నేను ఆయన సలహా పాటించాను. 1922 నుండి నేను విద్యార్థి సంఘ సమావేశాల్లో, ఇండియన్ మజ్లిస్‌లో, లేబర్ క్లబ్‌వంటి వాటిల్లో ప్రసంగించసాగాను.

4

ఐరోపాలో ఆక్స్‌ఫర్డ్‌లో నా జీవితం

నన్నిక్కడకు పంపింది ఐ.సి.ఎస్.కు తర్ఫీదు పొందేందుకు. దానితోపాటు బారిస్టర్‌గా తయారయ్యేందుకు. రెండింటి తయారీలో నేను నిమగ్నమయ్యాను. ఇంతలో మహాత్మాగాంధీ 'ఒక్క సంవత్సరంలోపే స్వరాజ్యం' అనే పిలుపునిచ్చారు. దానితో భారతదేశంలో పాఠశాలలకు, కళాశాలలకు, కోర్టులకు భారతీయులు వెళ్లడం మానేశారు. మహాత్మాగాంధీ, నోబెల్ ప్రైజ్ విజేత విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్‌ల మధ్య విశ్వవిద్యాలయాలను బహిష్కరించే విషయంలో వివాదం చెలరేగింది. అది ఆక్స్‌ఫర్డ్‌లో ఉన్న మావరకూ వచ్చింది. మా సహపాఠి **మీనన్** ఆక్స్‌ఫర్డ్ వదలి గాంధీజీ ఉద్యమంలో

డా. ఎస్ రాధాకృష్ణన్, కె వి గోపాలస్వామి, భారతీదేవి, ఎల్ వి బి చౌదరి, మురారి

ఓ పుల్లారెడ్డి, పి ఎస్ కృష్ణ, ఎన్ జి రంగ, వి వి చౌదరి (పై వరుస)

చేరిపోయాడు. అయితే తర్వాత కాలంలో ఆయన తిరిగి ఆక్స్‌ఫర్డ్‌కు వచ్చి బారిస్టర్ అయ్యాడు. **ఎం.ఎన్.రాయ్** స్థాపించిన **రాడికల్ డెమోక్రాటిక్ పార్టీ**కి జాతీయ స్థాయి నాయకుడయ్యాడు. జాతీయ కాంగ్రెస్‌కు ఎదురొడ్డి నిలిచాడు.

రామకృష్ణ, ఇతరులు అంత ఖర్చుతో ఇంగ్లండ్ చేరి నిష్ప్రయోజనకరంగా భారతదేశం తిరిగి వెళ్లడం మంచిది కాదని నచ్చజెప్పడంతో నేనక్కడే ఉండిపోయాను. లేకుంటే నేనూ తిరిగి భారతదేశం వచ్చి ఉద్యమంలో పాల్గొనేవాణ్ణే. పైగా స్వతంత్ర భారతదేశానికి కూడా సమర్థులైన, నిజాయితీపరులైన, ప్రజాస్వామిక భావాలతో విలసిల్లే అధికారులు, న్యాయవాదులు, ప్రొఫెసర్లు తదితరులు కావాల్సి వస్తారు కనుక నావంటి దేశ భక్తిప్రపూరితులైన యువత ఐరోపాలో తర్ఫీదును పూర్తిచేయడం మంచిదన్నారు.

ఆక్స్‌ఫర్డ్‌లో గడిపిన తొలి సంవత్సరం అంతా నా జీవితంపై గాంధీ ఉద్యమ ప్రభావం ఎంతగానో పడింది. విజయవాడలో గాంధీజీ కృష్ణా నదీ సైకతాల్లో నిర్వహించిన సభల విషయం, ఆయన నిధి సేకరణ విషయాలు ఎప్పటికప్పుడు వారం వారం ఆక్స్‌ఫర్డ్‌లో మాకు తెలుస్తూ ఉండేవి.

ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయాల్లో విద్యా బోధన గురించి, అక్కడి వాతావరణం గురించి, అక్కడి జీవితం గురించి ఎందరో ఎన్నో విధాలుగా రాసిన వాళ్లున్నారు. వాటితో పోల్చి చూసినప్పుడు నా వర్ణనలు పేలవంగా ఉండొచ్చు. కనుక ఆ వర్ణనల జోలికి పోను. నేను అతి పురాతనమైన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం గురించి, భారతదేశపు ప్రాచీన విశ్వవిద్యాలయాలు అమరావతిలో, కాంచీపురంలో, నలంద, తక్షశిలలో నెలకొల్పిన వాటి గురించి చదివాను. నేను ఆక్స్‌ఫర్డ్‌కు వచ్చేముందు మద్రాస్, కలకత్తా విశ్వవిద్యాలయాలను సందర్శించాను. చాలావరకూ భవన నిర్మాణంలో పోలికలు కన్పించినా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం సరస్వతీ మందిరంగా నా కనులముందు నిలిచింది.

మహాత్మాగాంధీకి ఆరేళ్ల జైలుశిక్ష విధించిన వార్త విని నేను ఐ.సి.ఎస్. పరీక్షకు వెళ్లకూడదనుకున్నాను. అయితే ఈ విషయంలో సలహా చెప్పేందుకు సీనియర్ మిత్రులు లేకపోయారు. నాకు నేనే నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. అప్పటికి నేను పేరొందిన రచయితల పుస్తకాలు చదువుతూ ఉన్నాను. నాపై **షెల్లీ, హెచ్.జి.వెల్స్, విలియం మోరిస్, బ్లూచ్‌ఫోర్డ్**వంటి వారి రచనల ప్రభావం అధికం కాసాగింది. నేను మహాత్మాగాంధీ అనుచరుడినై జాతి స్వేచ్ఛ కోసం కృషి చేయాలనుకున్నాను. అంతటితో సరిపోతుందా?

గ్రామీణ భారతదేశంలోని ప్రతికూల శక్తుల మాటేమిటి? అధికారుల మితిమీరిన పెత్తనం నుండి, అవినీతి నుండి వాళ్లు విముక్తులయ్యేదెట్లా? ఇంగ్లండ్‌లో వర్తమాన సమాజంలో పెట్టుబడిదారీ విధానపు దోపిడీ నుండి ప్రజలను బయటపడవేసేందుకు **సోషలిస్ట్‌లా, శ్రామిక నేతలా కృషి చేయవద్దా?** అవును, భారతదేశంలో కూడా కృషీవల జీవనం కొనసాగించే అన్ని కులాల వారు అధికారానికి చేరువకావాల్సిందే. అందుకోసం నేను ఆక్స్‌ఫర్డ్‌లో విద్యను కొనసాగించి తద్వారా రైతు సోదరుల్లో రాజకీయ చైతన్యం పెంపొందిస్తే వాళ్లను నాయకుల్ని చేయడం సాధ్యపడుతుందనుకున్నాను.

అటువంటి ముఖ్యమైన నిర్ణయం తర్వాత మన ప్రజానీకానికి సేవ చేసేందుకు ఎల్లలెరుగని తృష్ణతో చదువు కొనసాగించాను. ఇంగ్లండ్‌లో వాళ్లకు ఎదురయ్యే సమస్యలు భారత ప్రజలకు ఎదురైతే ఎలా పరిష్కరించాలి అనే దిశగా ఆలోచించేవాణ్ణి. పశ్చిమ దేశాల్లో ప్రజల జీవన విధానాల్లో సామాజిక సామరస్యపు స్థాయి, సాంస్కృతిక ఉపకరణాలు, రాజకీయ హక్కులు, బాధ్యతలు అధికం. వాళ్ల పశువుల నుండి పాలు అధికంగా లభించడమేకాక నాణ్యత కూడా మెరుగే. వాళ్లు వ్యవసాయానికి వినియోగించేది అశ్విక శక్తి అయితే మనది వృషభ శక్తి. వాళ్ల పరిశ్రమలు, వాణిజ్యం కూడా ముందంజలో ఉండేవి. వాళ్లల్లో క్రమశిక్షణ, సహనం, వాణిజ్య నీతి, నిర్వహణా నైపుణ్యత మనం అందుకోలేనిదిగా కనిపించేది. వాళ్లు ఆడ, మగ అనే తేడా లేకుండా వివక్ష రహితంగా సమానత్వాన్ని సమకూర్చుకున్నట్లుగా కనిపించేది. వాళ్ల శ్రామికులు చదువుకున్నవాళ్లు, సంస్కృతీపరంగా ఎదిగినవాళ్లు, భౌతికంగా అభివృద్ధి చెందినవారు. ఈ అంశాలు వాళ్ల జీవన విధానమే ఒక అధ్యయనం అన్నది భారతీదేవి గారు ఓ ఐదేళ్ల ముచ్చట. అదీ పాశ్చాత్య సంపర్కంతో నేను స్వయంగా సాధించిన అధ్యయనం తీరు.

నేను ఎవరి నుంచి, దేని ద్వారా ఆక్స్‌ఫర్డ్‌లో ఎంత నేర్చుకున్నానేది, ఎంతగా లబ్ధి పొందానన్నది తేల్చి చెప్పడం కష్టం. అక్కడి విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం, యునైటెడ్ విద్యార్థి చర్చా వేదికలు సామాజికంగా నా ఎదుగుదలకు తోడ్పడ్డాయి. అనేక దేశాల విద్యార్థుల్ని కలసి చర్చించే అవకాశం ఏర్పడిన కారణంగా ఒక అంతర్జాతీయ దృక్పథం నాలో నెలకొన్నది. తర్వాత కాలంలో కాలనీ వాసుల, రంగుజాతుల వారి స్వేచ్ఛ కోసం పోరాడేందుకు అది పునాదిగా నిలిచింది. ఆక్స్‌ఫర్డ్‌లోని నదుల నిరంతర ప్రవాహాల తీరాల వెంట నా నడకలు, చర్చలు ఉండేవి. అక్కడ ఉన్న రమణీయమైన ప్రకృతి వల్ల నాకు సౌందర్య దృష్టి కూడా అలవడింది.

అక్కడి ఉపాధ్యాయ వర్గంలోని డాక్టర్ కార్లయిల్, లిప్సన్, ప్రొఫెసర్ ఆడమ్స్, మిసెస్ స్టాక్ బట్లర్, మెగ్రీగార్, టాడ్, శాండ్రాల్ వంటి హేమాహేమీలు నాకు బోధించారు. దానికితోడు వి.ఎస్.కృష్ణ, ఎల్.వి.బి.చౌదరి, ఇంకా విద్యార్థి సంఘాలతో చర్చలు నాకు కావాల్సినంత ఉత్తేజాన్ని, శక్తిని సమకూర్చేవి. కృష్ణ నాకు గ్రంథ పఠనం ద్వారా సమాచారాన్ని బేరీజు వేసుకునే అలవాటును అందించాడు. ఉప కులపతిగా ఎల్.వి.బి.చౌదరి నన్ను నా ఆలోచనల పరంగా వాస్తవ పరిధి దాటకుండా చూస్తూండేవాడు. కృష్ణ తర్వాత కాలంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో కీర్తి గడించాడు.

వలస దేశాలకు చెందిన విద్యార్థులు ఒక చోట చేరి వారి వారి దేశాల గురించి మాట్లాడుకుని, వారి సామాజిక స్థితిగతులను బేరీజు వేసుకుని వారి వారి దేశాల్లో సామాజిక, రాజకీయ అభివృద్ధిని ఎలా సాధించాలి అనే విషయాలు చర్చించుకునేందుకు ఒక వేదిక అవసరాన్ని నేను గుర్తించాను.

ఆక్స్‌ఫర్డ్ లేబర్ క్లబ్, 'ది న్యూ ఆక్స్‌ఫర్డ్' విద్యార్థి మాస పత్రిక వ్యవస్థాపకుల్లో నేనూ ఒకడిని కావడం నాకెంతో ఆనందదాయకం. 1920-21లో గని కార్మికుల సమ్మె విఫలం కావడంతో కార్మికుల సమస్యల అధ్యయనానికి లేబర్ క్లబ్ ప్రాముఖ్యత సంతరింపజేసుకుంది. **మిస్ స్టాక్** దానికి అధ్యక్షురాలిగా ఎంపికైంది. వి.ఎస్.కృష్ణ పలు సంవత్సరాలు ఆ క్లబ్ సభ్యులుగా కొనసాగారు. ఆక్స్‌ఫర్డ్‌లోని దాదాపు అన్ని ప్రజాస్వామిక చర్చా వేదికల్లోనూ నేను చురుగ్గా పాల్గొనేవాణ్ణి.

మా విద్యార్థి సంఘం వల్ల ఇతరులకు చేకూరినట్లుగానే నాకూ ఎంతో మేలు చేకూరింది. అక్కడ నేను చర్చించడంలోనూ, వక్తృత్వంలోనూ ఎన్నో మెళకువలు గ్రహించగలిగాను. సమయస్ఫూర్తి అబ్బింది, దానితోపాటు కొంత పాండిత్యం కూడా. వేగంగా మాట్లాడడం నేర్చు కున్నాను. భావవ్యక్తీకరణ మెరుగైంది. ఇంగ్లీష్ విద్యార్థుల్లాగా భారతీయ విద్యార్థులు కూడా అక్కడ రాణించేవాళ్లు. ఉదాహరణకు నాకు ముందు చేరిన **కె.పి.ఎస్.మీనన్, టి.సి.గోస్వామి, చాగ్లా** అక్కడ చర్చల్లో అలా రాణించినవాళ్లే. తర్వాత కాలంలో శ్రీలంక ప్రధానిగా ఎన్నుకోబడిన **బండార నాయకే** కూడా అలా ఆ విద్యార్థి సంఘంలో గణతికెక్కినవాడే. నేను 1955లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన సందర్భంలో 1922లో వార్షిక చర్చల్లో పాల్గొన్న సందర్భంగా నేను పెద్ద తలపాగా ధరించిన చిత్రాన్ని కూడా అక్కడ చూసి అమితానందం పొందాను.

నా చదువు విషయంలో **బేకర్ గారు, డాక్టర్ గిల్బర్ట్ స్లేటర్ గారు, డాక్టర్ మాక్‌గ్రెగర్** గారు

ఎంతగానో గమనార్హమైన సహాయాన్ని అందించారు. మరీ ముఖ్యంగా రెండు విషయాల్లో -ఒకటి విశ్వవిద్యాలయ నియమాలను తప్పుగా వ్యాఖ్యానించిన సందర్భంలో. నేను ఒక విదేశీ భాషలో ఉత్తీర్ణుడనైతే విశ్వవిద్యాలయ ప్రవేశానికి అర్హత సాధించినట్లేనన్నారు. నేను ఫ్రెంచి భాషలో ఉత్తీర్ణుడనయ్యాను. అయినా మరో భాషలో ఉత్తీర్ణత సాధించాల్సిందేనన్నారు. సరే, ఏం చేస్తాం? జర్మన్ భాషలో కూడా ఉత్తీర్ణుడనయ్యాను. మిగతా అంశాల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన నాకు చివరి నిమిషంలో అలా చికాకు తెప్పించారు. అందువల్ల నేను బేకర్ గారి వద్దకు వెళ్లి అటువంటి పరిస్థితుల్లో ఆక్స్‌ఫర్డ్‌లో ఉండి చదివే కంటే అమెరికా వెళ్లి చదువుకోవడం మేలనిపించిందన్నాను. మిగతా అధ్యయనాంశాల్లో నేను సాధించిన మార్కుల్ని చూసి సంతృప్తి చెంది ఆయన నా తరఫున పోరాడారు.

మరో పర్యాయం ఆయన నన్ను ఐ.సి.ఎస్. పరీక్షకు వెళ్లేటట్లు చూడాలనుకున్నాడు. అయితే నేను ఐ.సి.ఎస్.కు వెళ్లనన్నాను. మహాత్మా గాంధీని ఖైదు చేయడమే అందుకు కారణమన్నాను. కనుక నేను నా దేశానికి సేవ చేయదల్చానని చెప్పాను. నా సమాధానానికి మెచ్చుకుని రెండు ఎకనామిక్స్ అంశాల అధ్యయనానికి అనుమతించారు. అయితే అందులోని ఇబ్బంది ఆయనకు తెలియంది కాదు. అయినా ఆయన నా పట్ల చూపిన శ్రద్ధ కారణంగా నేను ఆర్థిక శాస్త్రంలో బి.లిట్. అనే పరిశోధనా డిగ్రీని పొందడమేకాక రాజకీయ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రాల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణుడనయ్యా. అందుకాయన అమితానందం పొంది నాకు, శ్రీమతి భారతీదేవి గారికి వారింట విందు ఏర్పాటుచేశారు.

తర్వాత సీనియర్ మెడ్లే స్కాలర్‌షిప్ కోసం నా పేరు సిఫారసు చేసినా నేను దాని కోసం ఎదురుచూడలేదు. ఆయన ఆ సందర్భంగా నాకు అందజేసిన ధృవపత్రంలో **'ఆక్స్‌ఫర్డ్‌లో రంగా విద్యా విషయక కార్యకలాపాల్లోని ప్రత్యేకత ఎన్నదగింది'** అని పేర్కొన్నారు. అంతకుమించి నాకు కావాల్సిందేముంది?

డాక్టర్ గిల్బర్ట్ స్లేటర్ మద్రాస్ విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్రంలో తొలి ప్రొఫెసర్‌గా వచ్చేముందు ఆక్స్‌ఫర్డ్‌లో లెక్చరర్‌గా ఉండేవారు. నా పరిశోధనలకు ఆక్స్‌ఫర్డ్‌లో పర్యవేక్షకుడు ఆయనే. నా పరిశోధనా గ్రంథంలో ఈ కింది నాలుగు అధ్యాయాలు రూపొందడానికి ఆయన బాగా తోడ్పాటునందించాడు:

1) ఆంధ్రదేశంలోని భారతీయ గ్రామీణుల సామాజిక ఆర్థిక స్థితిగతులు 2)

దక్షిణభారత పత్తి ఉత్పత్తిదారుల ఆర్థిక స్థితిగతులు 3) చేనేతకు సంబంధించిన ఆర్థికాంశాలు 4) దక్షిణభారతదేశ పత్తి పరిశ్రమ చరిత్ర. మొదటి మూడు అధ్యాయాల విషయంలో నా పరిశోధనాంశాలు ఆమోదింపబడతాయనే విశ్వాసం ఆయనకున్నది. నాల్గో అంశం విషయంలో ఆయనకు సందేహం ఉంది. చివరకు ఆయన సందేహాలకు సమాధానాలు చెప్పుకుంటూ నెగ్గుకొచ్చాను. ఒకవేళ డిగ్రీ రాకపోయినా నా పరిశోధనా గ్రంథంతో బాపూజీని కలిస్తే ఆయన ఆలింగనం చేసుకుంటారన్నాను. ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన ప్రొఫెసర్లకంటే నాకు భారతదేశపు స్థితిగతులు బాగా తెలుసన్నాను. అంతటి ఆత్మస్థయిర్యంతో నేను 1926లో ఆక్స్‌ఫర్డ్ నుండి బి.లిట్. డిగ్రీ పొందాను.

శ్రీమతి భారతీదేవి గారు **రస్కిన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్‌**లో కళాధ్యయనం గావించారు. కళా రంగంలో ఆమెకు స్వతస్సిద్ధమైన అభిరుచి, సామర్థ్యం ఉన్నాయి. మేమిద్దరం ఇంగ్లండ్‌లో అనేక మార్గాల్లో నడుస్తూ గ్రంథాలతో, నావలతో, లాకులతో మైత్రిని పెంచుకుంటూ ఆక్స్‌ఫర్డ్‌లోని ప్రాకృతిక సౌందర్యాన్ని ఆస్వాదించసాగాం.

ఆమె అనతికాలంలోనే ఆంగ్లంలో ధారాళంగా మాట్లాడసాగారు. ఐరోపాలో వున్నంతకాలం ఆమె భారతదేశపు చీరలను మాత్రమే ధరించారు. నేనామెను ఇంగ్లండ్ నాతో తీసుకుని వెళ్లి మంచి పని చేశాను. అక్కడ పెత్తనం సాగించే సామాజిక శక్తులు, వాటి తీరుతెన్నులను ఆమె గ్రహించగలిగారు. ఆ పరిజ్ఞానమంతా గత నలభై సంవత్సరాలుగా అనుభవిస్తున్న బాధల్ని, ఆశాభంగాల్ని తట్టుకునేందుకు బాగా పనికొచ్చింది.

గత శతాబ్దకాలంలో పారిశ్రామికీకరణ కారణంగా వారు కోల్పోయినదాన్ని పునరుద్ధరించేందుకు ఆంగ్లేయుల కృషి మమ్మల్ని ఆకట్టుకుంది. వాళ్లు గ్రామీణ జీవనం పట్ల ఆకర్షితులు కావడం నచ్చింది. అలాగే గ్రామీణ గ్రంథాలయాల పట్ల వాళ్లు శ్రద్ధ చూపెట్టడం కూడా ఆకట్టుకుంది. అవన్నీ మన దేశంలో గ్రామీణాభివృద్ధికి చేపడుతున్న ఉద్యమాలకు అనుగుణంగానే ఉన్నాయి. **ఐరోపాలో గ్రామీణ నాగరికత పునరుద్ధరణకు కృషి జరుగుతున్న తరుణంలో మన గ్రామీణ నాగరికతా సౌభాగ్యాన్ని మనం కోల్పోవడమన్నది దారుణమనిపించింది.** అందువల్ల మేము భారతదేశానికి తిరిగొచ్చి మన గ్రామీణ సంస్కృతిని నిలబెట్టుకునేందుకు తహతహలాడసాగాం.

1926నాటికి **మోటూరి సత్యనారాయణ** (తర్వాత ఆయన పార్లమెంట్ సభ్యులయ్యారు), **ఎం.బాపినీడు**, నేనూ కలసి **'తిరిగి గ్రామాలకెళ్దాం'** అనే ఉద్యమాన్ని

చేపట్టాం. బ్రిటన్‌లోని సంఘ సేవకులకు, మన సేవకులకూ మధ్య ఎంతో వ్యత్యాసాన్ని నేను గమనించాను. వాళ్లు క్రమబద్ధంగా వ్యవహరించేవాళ్లు. అన్నింటిలో తలదూర్చరు, పొదుపరులు, సేకరించిన విరాళాల పట్ల ఎంతో శ్రద్ధగా ఉండేవారు. మన సంఘ సేవకులు ఆ ప్రమాణాలను పాటించాల్సి ఉంది. వాళ్లేదైనా అనుకుంటే దాన్ని సాధించేవరకూ వదలరు. ప్రారంభించిన పని మధ్యలో ఆగిపోయినా మనం పట్టించుకోం. అక్కడ సంఘ సేవకులకు గౌరవ వేతనం యోగ్యమైనదిగా ఉంటుంది. మన సంఘ సేవకులు పొందేది గాలిలో దీపం పెట్టిన చందమే.

నేను ఆంగ్లేయ మిత్రులు– అటు కర్షకులు, ఇటు విద్యార్థుల ద్వారా కూడా చాలా లబ్ధి పొందాను. ఆంగ్లేయ మిత్రుల్లో చెప్పుకోదగిన వారు **ఎల్.బి.షార్ట్** గారు (బోల్టన్ మూనిటేరియన్ మంత్రి కుమారుడు), **టామ్ విలియమ్స్** (సౌత్ వేల్స్‌లోని గని కార్మికుడు), మిస్ స్టాక్, ఆమె సోదరి **ఎలిజబెత్** (ఎగువ మధ్యతరగతికి చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి **మిస్ విలియమ్స్** కుమార్తెలు, కుశాగ్ర బుద్ధిగలవారు) **ఫిలిప్ థాంసన్** (లాంక్‌షైర్ ఔళి కార్మికుడు). టామ్‌కు రస్కిన్ కాలేజీలో చదువుకునేందుకు, ఫిలిప్‌కు కాథలిక్ వర్కర్స్ కాలేజీలో చదువుకునేందుకు ఉపకార వేతనాలు లభించాయి. నేను వాళ్ల ఇళ్లను, కళాశాలలను, సంబంధిత పారిశ్రామిక కేంద్రాలను సందర్శిస్తూ ఉండడం వల్ల విశ్వవిద్యాలయాల స్థాయి, విద్యను ఆర్జించడంలో శ్రామిక యువకులు ఏ విధంగా సఫలీకృతులవుతున్నదీ గమనించగలిగాను.

ఎల్.బి.షార్ట్ దృఢమైన సోషలిస్ట్ భావాలు కలిగిన వ్యక్తి. ఆయన మిస్ విలియమ్స్‌ను వివాహమాడాడు. తర్వాత సంవత్సరాల్లో కార్మిక రాజకీయాల్లోనూ, యూనిటేరియన్ రాజకీయాల్లోనూ అద్దంకులెదురైనా వారి ప్రయాణం ఆసక్తికరంగానే సాగింది. మిస్ స్టాక్ ఆంగ్ల సాహిత్యంలో ఉన్నత శ్రేణి డిగ్రీ అత్యధిక మార్కులతో సాధించింది. ఆ తర్వాత కలకత్తాలో విశ్వవిద్యాలయ స్థాయికి ఎదిగింది. ఆమె సోదరి ఎలిజెబెత్ కూడా విద్యావంతురాలే. ఫిలిప్ థాంసన్ లండన్‌లో ప్రొబేషన్ అధికారిగా ఉన్నాడు. నా ఆదర్శమేమోకానీ వాళ్లూ, మరికొందరు నేటికీ నాతో మైత్రిని కొనసాగిస్తున్నారు.

1920 క్రిస్టమస్ రోజుల్లో నేను ఎడింబరో వెళ్లి స్కాట్లండ్‌ను , అక్కడి ప్రజలను చూశాను. అదొక మంచి అనుభవం. అక్కడి భారతీయ విద్యార్థులు సహకార వ్యతిరేక ఉద్యమం పట్ల హర్షాతిరేకాన్ని వ్యక్తంచేశారు. అయినా కొందరి బుర్రల్లో నుంచి ఇంకా పైత్యంచారీ తత్వం తొలగిపోయినట్లు కనిపించదు. అక్కడి భారతీయ విద్యార్థుల్లో ఇద్దరు

మంచి మిత్రులయ్యారు. అందులో ఒకరు **కె.నరహరి.** ఆయన భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత భద్రాచలం ప్రాంతంలో పొగాకు పంట పండించి బాగా డబ్బు సంపాదించాడు. ఆయన మార్గాన్నే అనుసరించి పలువురు, కొందరు కొండజాతి వారు కూడా స్థితిమంతులయ్యారు. రెండోవారు తెనాలికి చెందిన డాక్టర్ **కె.వి.చౌదరి.** ఆయన విశ్వాసపాత్రుడైన, సంకోచమెరుగని వైద్యునిగా పేరు సంపాదించారు.

మేము ఎడింబరోలోని హోలీరూడ్ రాజ ప్రాసాదాన్ని సందర్శించాం. స్కాట్లండ్ ముట్టడిని గైడ్ వివరిస్తూ ఉంటే పలువురు భారతీయ విద్యార్థులు ఎంతగా సంవేదన చెందారో. ఎట్టకేలకు పాపం **మేరీ క్వీన్** మా హృదయాలను చూరగొన్నది- తాను చూపిన శూరత్వం వల్ల, తాను పడిన బాధల వల్ల , తన వల్ల జరిగిన తప్పిదాల వల్ల. భారతీయుల మాదిరిగానే స్కాట్లు కూడా ఆంగ్లేయుల బారినపడినందువల్ల కూడా ఇటువంటి సంవేదనకు గురై ఉండొచ్చు.

తొలిసారి అక్కడ నేను నగర పాలక సంస్థవారి మరుగుదొడ్లను చూశాను. భారతదేశంలోని పట్టణాల్లో కూడా అటువంటివి నిర్వహించగలిగితే ఎంత బాగుండునో అనిపించింది. జపాన్‌లో పట్టణాల్లో కూడా అలాగే పరిశుభ్రంగా నిర్వహిస్తారుకానీ వ్యక్తిగత గోప్యత అంతంత మాత్రమే. అయితే మలయాళీ ఖైదీలకు అది ఇబ్బంది కలిగించదని తర్వాత తెలుసుకున్నా.

నేను ఆక్స్‌ఫర్డ్‌కు తిరిగి రాగానే బాధాకరమైన వార్త తెలిసింది-మా నాన్న గారు జబ్బుపడ్డారని, చికిత్స నిమిత్తం మద్రాస్‌కు కూడా తీసుకొచ్చేందుకు వీలులేని పరిస్థితుల్లో ఉన్నారని. తర్వాత వారం ఆయన మరణించారని ఓ ఉత్తరం వచ్చింది. నా రాజకీయాలు, నా చదువు వల్ల నా తండ్రికి సరిగా సేవ చేయలేకపోయాననే బాధ నన్ను చుట్టుముట్టింది. ఆయనలోని స్వాతంత్ర్యేచ్ఛ, స్వాభిమానం, గ్రామ రాజకీయాలకు దూరంగా జరగడం ఇటువంటి వాటిని ఆంగ్ల ప్రజలు మెచ్చుకోవడాన్ని చూసిన తర్వాత నేను కూడా ప్రశంసించాను.

1921 వేసవిలో లింగం వీరభద్రయ్య చౌదరి, నేనూ కలసి **ఫ్రాన్స్**‌లో ఉత్తరంగా ఉన్న **బ్రిటనీ**కి వెళ్లాం. అక్కడ ఒక సముద్ర తీర గ్రామంలో బస చేశాం. సముద్రంలో ఈత, అడవుల్లో సెలయేళ్ల పక్కన నడక ఎంతగానో ఆహ్లాదాన్ని పంచేవి. గ్రామీణ ప్రజా జీవనానికి, ప్రకృతి సౌందర్యానికి సంబంధించిన అనేక పద్యాలను చౌదరి వినిపిస్తూ ఉండేవాడు.

ఫ్రెంచి దేశంలో సెలవుల్లో ఆ సముద్ర తీరంలో విహారానికి వచ్చే ఆ దేశీయుల తీరు పక్తు భారతీయ పద్ధతిలో పెరిగిన నాకు నచ్చేది కాదు. **పన్నెండు నుండి పదహారో శతాబ్దం వరకూ సాహిత్యపు క్షీణ యుగంలో రాజ్యమేలిన ప్రబంధ సాహిత్యం పట్ల నాకెంతో** పోలిక. అదంతా శారీరక సంపదల ప్రదర్శనగా, ఉమర్ ఖయ్యామ్ తరహా జీవన విధానంగా కనిపించేది.

1921 క్రిస్టమస్ సమయంలో నేను లాన్సింగ్ అనే సస్సెక్స్ గ్రామంలో గడిపాను. అక్కడ లోయల్లో నా నడక ఆనందాన్ని పంచేది. అక్కడ ప్రతి గుట్టతో, చెట్టుతో, మడుపుతో చివరకు గొర్రెల మెడలోని చిరు మువ్వల సవ్వడితో నైతం చెలిమి చేశాను. నేమ భారతీదేవి గారు 1939లో బర్మాలో పర్యటించినప్పుడు అక్కడ కూడా అటువంటి ప్రాకృతిక దృశ్యాలు కనువిందు చేశాయి.

1922 ఏప్రిల్‌లో **డర్‌హామ్‌**లోని **స్వాన్‌విక్** గ్రామంలో భారతీయ సదస్సు ఒకటి నిర్వహించారు. వందలమంది భారతీయ విద్యార్థులు, వాణిజ్యవేత్తలు చర్చల్లో పాల్గొన్నారు. భారతదేశానికి జాతీయత కోసం ఆ రెండు రోజులూ పూర్తిగా చర్చలు జరిగాయి. వివేకానందస్వామితోపాటు మరెందరో కాంగ్రెస్ పక్షాన నిలిచారు. కనుక నేనూ అటే. నా రెండు ప్రసంగాలను అమితంగా మెచ్చుకున్నారు. ఒకరిద్దరు తాత్కాలికంగా **మాంటేగు** చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలను తగు మార్పులతో అమలుచేస్తే 1930 నాటికి సంపూర్ణ ప్రాంతీయ స్వయంప్రతిపత్తి లభించగలదన్నారు. అటువంటి సలహాలను పాటించే రకంలో మేము లేము. **జలియన్‌వాలా బాగ్ విషాద గాధ, జనరల్ డయ్యర్ ఘాతుక చర్యలు** మా మనసులను కలచివేశాయి. మాలోని జాతి గౌరవాన్ని దెబ్బతీశాయి. ఆ సదస్సులో నేమ అతివాదుల పక్షాన నిలవడం నా ఇంగ్లండ్ జీవితంలో ఓ ముఖ్యమైన మలుపు. నేమ ఆంగ్లంలో బాగా ప్రసంగించగలనని అర్థమైంది. నేను ఐ.సి.ఎస్.కు వెళ్లడం వ్యర్థమనిపించింది.

ఆ వసంతకాలంలో ఈస్టర్ దినాల్లో నేను **చాడ్లింగ్‌టన్** అనే గ్రామంలో ఒక రైతు ఇంట 'పేయింగ్ గెస్ట్' గా ఉండి వాళ్ల వ్యవసాయ తీరుతెన్నుల్ని దగ్గరగా పరిశీలించాను. **పెద్ద ప్రజలకు చౌకగా తిండి గింజలను అందించడం కోసం ఆంగ్లేయులు వ్యవసాయాన్ని** ఎలా పెంపొందించారనిపించింది.

1922 వేసవి కాలం నా ఐరోపా జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి. వర్కర్స్ ఎడ్యుకేషనల్ అసోసియేషన్ వారు నిర్వహించిన ఒక సమ్మర్ స్కూల్ (వేసవి పాఠశాల)కు

హాజరయ్యాను. **బట్టీ** అనే ఆయన దానికి కార్యదర్శి. మాంచెస్టర్ నుండి ఎం.ఎ. డిగ్రీ పొందేందుకు ఆయనకు ఎంతోకాలం పట్టింది. ప్రొఫెసర్ హెన్రీ క్లీ, రెడ్‌పోర్ట్ అనేవారు పాఠాలు చెప్పారు. వేల్స్, లాంక్ షైర్, యార్క్ షైర్ ప్రాంతాల నుండి వారి వారి కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తూ ఆ వేసవి శిబిరానికి చేరుకున్నారు. వాళ్లంతా యువకులు. వాళ్లకు ఎటువంటి మానసిక అవరోధాలుకానీ, పక్షపాత ధోరణులుకానీ ఉన్నట్లు కనిపించలేదు. వాళ్లకు సోషలిజం పట్ల ఎనలేని విశ్వాసం. ఆక్స్‌ఫర్డ్ నుండి వెళ్లిన నాకు ఏదో మరో కొత్త లోకంలోకి ప్రవేశించినట్లు అనిపించింది.

వాళ్లకు ప్రిన్స్ ఆఫ్ వేల్స్ అంటే ఆక్స్‌ఫర్డ్‌లోని వారికున్న వ్యామోహంలేదు. వారు భారతీయుల్ని సహపండితులుగానే భావించారు. వారు బ్రిటిష్ సామ్రాజ్యవాదమన్నా, సామ్రాజ్యమన్నా గర్వపడేదేంలేదు. వాస్తవానికి వాళ్లు వాటికి బద్ధ శత్రువులు. అందుకే వాళ్లకు భారతీయులంటే సానుభూతి. కనుక వాళ్లు నాకు మిత్రులయ్యారు. అది నాకు కనువిప్పు కలిగించింది. అప్పటివరకూ భారతదేశంలోని ఆంగ్ల నీతి పట్ల బ్రిటన్‌లో అంతటి వ్యతిరేకత ఉన్నదని నాకు తెలియదు. పైగా **భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత కూడా పేదరికం తొలగిపోదు అనిపించింది. బ్రిటన్‌లో మాదిరిగానే కార్మికులు, కర్షకులు శక్తిహీనులవుతారనిపించింది. సామాజిక న్యాయాన్ని సాధించడం ఎలా, సంపదలో, రాబడిలో వ్యత్యాసాలను తొలగించడం ఎలా, సామాజిక ప్రజాస్వామ్యాన్ని సాధించడమెలా అన్న అంశాలు నన్ను ఓ కుదుపు కుదిపి మన ప్రజలను కూడా అటువంటి ఆశయాలకు చేరువ చేయడమెలా అని ఆలోచించేటట్లు చేశాయి.**

రోజుకు 7 లేదా 8 గంటలు గనుల్లో, కార్ఖానాల్లో, కార్యాలయాల్లో పనిచేస్తూ వాళ్ల జీవనోపాధిని సమకూర్చుకుంటూ ఖాళీ సమయాన్ని కార్మిక సంఘ కార్యకలాపాలకు లేదా రాజకీయాలకు వెచ్చించే ఆ కార్మిక సంఘ నాయకులన్నా, సోషలిస్ట్ నాయకులన్నా నాకు గౌరవ భావం ఏర్పడసాగింది. వాళ్ల స్థితి భారతదేశంలోని అణగారిన వారి స్థితే అయినా బ్రిటిష్ కార్మికుల్లో రాజకీయ చైతన్యం అధికం. మన వాళ్లల్లోనూ అటువంటి చైతన్యం నెలకొంటే బాగుండుననిపించింది. ఆ మూడు వారాల సమయంలో నా అధ్యయనం నాపై బాగా ప్రభావాన్ని చూపింది. అటువంటి విద్యా విషయకమైన వుద్యమాన్ని ప్రజోపయోగం నిమిత్తం భారతదేశంలో కూడా నిర్వహించేందుకు రూపకల్పన చేయసాగాను. అక్కడి సామాజిక, ప్రజాస్వామిక ఉద్యమాల క్రియాశీలతలను గమనిస్తూ నాకుగా నేను ఉప్పొంగిపోసాగాను.

అక్కడ నాకు అనేకమంది మిత్రులయ్యారు. **ఫిలిప్ థాంప్సన్, ఎల్సీబెర్రీ దంపతులు** నాకు అత్యంత ఆప్తులయ్యారు. భారతీదేవి గారికి కూడా వారంటే ఇష్టమే. భారతదేశంలో మా ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన నిడుబ్రోలుకు చెందిన హరిజనుడు **బి.మాణిక్యారావు** 1946లో తిరిగి మేము బ్రిటన్‌కు చెందిన ఆ మిత్రులతో సంబంధాలు ఏర్పర్చుకునేందుకు కారకుడయ్యాడు. మాణిక్యారావు 1955లో మరణించారు. ఆయన తుది శ్వాస విడిచేవరకూ మా ఉద్యమంలో మా వెన్నంటే ఉన్నాడు. ఆయన భార్య ఆమె కాళ్ల మీద ఆమె నిలబడేటట్లు చేసేందుకు ఆమెకు ఉపాధ్యాయ తర్ఫీదును ఇప్పించడంలో తోడ్పాటునందించాం.

అటువంటి మిత్రులు ఇంగ్లండ్‌లో ఇంకా నాకున్నారు. గౌర్టన్‌కు చెందిన **విలియం ఇవాన్స్** నాకంటే పెద్దవాడు. వాస్తవ ప్రణాళికలను తయారుచేసుకునేందుకు నాకు వీలు కల్పిస్తూ ఉండేవాడు. నాకు అనేక సంవత్సరాలు బోల్టన్‌కు చెందిన **జార్జ్ థాంప్సన్** మిత్రునిగా మెలిగాడు. ఆయన లేబర్ పార్టీకి చెందిన ఒకనాటి పార్లమెంట్ అభ్యర్థి. ఆయన మంచి వక్త. ఆయన నాకంటే చాలా పెద్దవాడు. అయినా భారతదేశంలో నేను చేపట్టిన సాంఘిక సేవా కార్యక్రమాల్లో ఉత్సుకత కనబర్చేవాడు. నేను రాజకీయ ఖైదీగా ఉన్న సమయంలో ఆయన రాసిన లేఖలు నాలో ఉత్తేజాన్ని నింపేవి. 1946లో పాన్ ఆఫ్రికన్ కాంగ్రెస్‌లో ప్రసంగించేందుకు నేను **మాంచెస్టర్** వెళ్లినప్పుడు ఆయన సతీసమేతంగా నన్ను చూసేందుకు వచ్చారు. వాళ్ల తావుకు ఆహ్వానించారు.

నా మిత్ర గణంలోని మరో మంచి మిత్రుడు ప్రొఫెసర్ **హెన్రీక్లే.** కోల్ పథకానికి అనుగుణంగా భారతదేశానికి గిల్డ్ సోషలిజం అనువైనదని భావించాం. బాంగోర్ స్కూల్‌లో ఆయన నా సహపాఠి. 1930 నాటికి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌కు చెందిన డైరెక్టర్లలో ఒకరు. నేను భారతదేశంలో జరిపే కృషిని ఆయన మెచ్చుకుంటూ వుండేవారు.

బాంగోర్ స్కూల్ తర్వాత నేను **లాంక్షైర్, వేల్స్** వెళ్లడం జరిగింది. అక్కడ అనేకమంది **విద్యార్థి మిత్రుల ఇళ్లల్లో అతిథిగా గడిపాను. వాళ్ల సామాజిక జీవనాన్ని దగ్గరగా చూడగలిగాను. వాళ్ల ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేశాను.** అది నిరుద్యోగం తాండవిస్తున్న సమయం. వాళ్ల కార్మిక సంఘాలు, క్లబ్బులు, శ్రామిక విద్యా కేంద్రాల పనితీరును పరిశీలించగలిగాను. నన్ను వాళ్లు గనులకు, ఉక్కు కర్మాగారాలకు, ఔళిమిల్లులకు తీసుకెళ్లారు. పాలిటెక్నిక్‌లు, ఇతర శిక్షణా సంస్థలు అక్కడి కార్మికులు మరింతగా

కౌశల్యాన్ని ప్రదర్శించేందుకు ఎలా పనిచేస్తాయో చూశాను. అలా ఇంగ్లండ్ పారిశ్రామికంగా ఎలా అభివృద్ధి చెందగలుగుతున్నదో చూశాను. వాటితోపాటు ప్రగతిదాయక ఉద్యమాల శక్తియుక్తులను కూడా గ్రహించాను. శ్రామిక వర్గాల గురించి, కార్మిక సంఘాల గురించి, సోషలిజం గురించి, ఇంగ్లండ్ సాధించిన పారిశ్రామిక ప్రగతి గురించి **మేము ఆక్స్‌ఫర్డ్‌లో తెలుసుకునేది ఇలా స్వయంగా గడించిన అనుభవంలో సగం కూడా ఉండదు. ఎంగెల్స్, హేమండ్, వెబ్స్, ఫేబియన్, కన్నింగ్‌హామ్** రచనలు సరికొత్త అర్థాలను సంతరించుకోసాగాయి.

నాలో పెనుమార్పు సంభవిస్తూ ఉంది. ఇంతకుపూర్వం నా దృష్టి గ్రామీణ పరిశ్రమల మీద, వికేంద్రీకరణ మీద, వాటి వ్యాప్తి మీద ఉండేది. ప్రాచీన కళలు, చేతివృత్తులపైన నాకు శ్రద్ధ ఉండేది. కాని **1922లో ఈ పర్యటనల తర్వాత మెల్లగా నాలో భారీ పరిశ్రమలు, బాగా వృద్ధి చెందిన వినియోగదారుల అవసరాలను తీర్చే పరిశ్రమలను నెలకొల్పడం మంచిదనే బీజాలు నాటుకున్నాయి.** అయితే ఆ రెండింటి మధ్య సమన్వయం సాధించాలనే తీరుగా కృషి చేసేందుకు చాలాకాలం పట్టింది.

అయితే ఆంగ్లేయ వ్యవసాయదారుల సామాజిక, వృత్తిపరమైన జీవన విధానాల ఆకళింపులోకి ఆక్స్‌ఫర్డ్‌లో చేరిన రెండు మాసాలకే చొచ్చుకుపోసాగాను. అది రెండు వ్యవసాయ కుటుంబాల సాన్నిహిత్యం వల్లే సాధ్యపడింది. అందులో ఒకటి **హౌజ్** కుటుంబం, రెండోది **వైజ్** కుటుంబం. రామకృష్ణ హౌజ్ కుటుంబంతో ఉండేవాడు. ఆ దంపతులిద్దరూ నాకు సంరక్షకులుగా ఉండేవారు. వాళ్లు గోధుమ, మొక్కజొన్న పంటలకు సంబంధించిన ఆర్థిక అంశాలు, పాడిపరిశ్రమ వివరాలు వెల్లడించేవాళ్లు. మేముండే ఈ **'ఎల్మ్ ఫాం'**కు ఒక మైలు దూరంలో వైజ్ కుటుంబం ఉండేది. ఆ కుటుంబం కూడా గోధుమలు, మొక్కజొన్న పంటలను పండించడమేగాక కోళ్ల పరిశ్రమ పై కూడా దృష్టి సారించింది. శ్రీమతి వైజ్, ఎదిగొచ్చిన ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు కుమార్తెలు ఆ కుటుంబంలో ఉండేవారు. నన్ను కూడా వాళ్ల కుటుంబ సభ్యునిగానే చూసేవాళ్లు. **ఐదు సంవత్సరాలపాటు వైజ్ కుటుంబ సంపదలు క్షీణించసాగాయి. లాయిడ్ జార్జ్ ప్రభుత్వం యుద్ధ సమయంలో మొక్కజొన్న, గోధుమ పంటల విషయంలో చేపట్టిన పరిరక్షక విధానాన్ని రద్దు చేయడమే అందుకు కారణంగా చెప్పవచ్చు.** ఆ విపత్తు నా కుటుంబానికే జరిగినట్లు మనస్సులో బాగా నాటుకుంది. వాళ్లు ఆ వ్యవసాయ క్షేత్రాన్ని వదులుకోవాల్సి వచ్చింది. కుటుంబంలోని వారు వేర్వేరు దేశాలకు వెళ్లిపోయారు. ఈ

విపత్తుకు కారణం ఏమిటని అడిగితే ఆయన చెప్పింది ఏమంటే–**యుద్ధ సమయాల్లో కాకుండా మిగతా సమయాల్లో ఏ ప్రభుత్వమూ రైతుల సంక్షేమాన్ని పట్టించుకుంటుందని విశ్వసించరాదు. విదేశీ దిగుమతులు ఇక్కడి పంటల ధరలను దెబ్బతీస్తాయి.** 'నేను నా భార్య సలహా పాటించి గోధుమపై ప్రాధాన్యాన్ని తగ్గించి పాడి పరిశ్రమపై దృష్టి నిలుపకపోతే మా కుటుంబమూ కుప్పకూలేదే'.

ఆ సమయంలో భారతదేశంలో కూడా ధరలు తగ్గుముఖంపడుతున్నాయి. హేనాయన్ను అడిగాను. 'మీ రైతులను ప్రభుత్వం అలా మోసగిస్తూ ఉంటే చూస్తూ ఎలా ఊరుకుంటారు? యుద్ధ సమయంలో రేట్లు పెరిగేటట్లు చేసి తర్వాత అది అలా చేతులెత్తేస్తే ఎలా? మీరంతా చదువుకున్నవారు. వ్యవసాయ కార్మికులకు కూడా సంఘాలున్నాయి కదా' అన్నాను. ఆయన చెప్పిన ప్రకారం ఆంగ్ల వ్యవసాయదారుల సంఘం ఇంకా బలపడలేదు. అదొక శక్తిహీనమైన సంస్థ.

ఈ విధంగా ఆంగ్లేయ రైతుల జీవనానికి సంబంధించి దాదాపు అన్ని కోణాల నుండి చర్చించుకునేవాళ్లం. రైతుల కుటుంబాలకు చెందిన ఆడపిల్లలు నగరాల్లోని వృత్తులకు సంబంధించిన శిక్షణ పొందేవారు. మగ పిల్లలు వివిధ పరిశ్రమల్లోనూ, వ్యాపారాల్లోనూ కుదురుకునేవారు. ఆ తీరు నాకు ఆశ్చర్యాన్ని కలిగించేది. ఐదారుగురిలో ఒక్కొద్దిమంది మాత్రమే వ్యవసాయానికి అంటిపెట్టుకుని ఉంటున్నారు. హౌజ్ గారి పెద్దబ్బాయి యెడ్డీ వ్యవసాయంలోనే కుదురుకుని ఆధునిక పద్ధతుల్లో పాడి పరిశ్రమను అభివృద్ధి చేయదల్చాడు. కొందరు అమ్మాయిలు కూడా వ్యవసాయ వృత్తిని చేపట్టడం నాకు ముచ్చటేసింది. తర్వాత తెలిసిందేమంటే 1952 నాటికి కూడా యుద్ధకాలం నాటి రక్షణ, సంపద, పెంపుదల వంటి చర్యలు కెనడా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఇంగ్లండ్‌లో కొనసాగుతూనే ఉన్నాయి. ఇటువంటి అంశాలన్నింటిపైనా రామకృష్ణ ఆక్స్‌ఫర్డ్‌లో ఉండగా ఆయనతోనూ, తర్వాత వైజ్‌తోనూ పంచుకుంటూ ఉండేవాణ్ణి. ఆ విధంగా శ్రామికులతో నా పరిచయాలు ఆసక్తిదాయకంగా మారసాగాయి. 1946లో ఆక్స్‌ఫర్డ్ కౌంటీలో నేను రైతు ప్రతినిధులతో కలసి లండన్‌లో తొలి ప్రపంచ రైతు సదస్సుకు హాజరైన సందర్భంగా 1922–24 ప్రాంతంలో బోట్లీలో రైతు కూలీగా ఉన్నప్పుడు నాతో స్నేహం చేసిన వ్యక్తి కనిపించి పరిచయం చేసుకున్నాడు. నన్ను తిరిగి కలుసుకున్నందుకు ఆనందంగా ఉందన్నాడు. నేను చిన్నతనంలోనే రైతు నాయకుడయ్యే లక్షణాలు కలిగి ఉన్నానని, అది సాకారమైనందుకు ఆనందంగా ఉందన్నాడు. అలా

తిరిగి కలుసుకోవడం నాకూ ఆనందంగానే ఉంది. అయితే వాళ్లతో నిరంతరాయంగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరపని కారణంగా మైత్రీ బంధాలు తెగిపోయాయి.

హౌజ్ కుటుంబం వ్యవసాయాన్నే అంటిపెట్టుకుంది. వాళ్ల పిల్లలు రైతు సంఘంలో క్రియాశీలంగా ఉన్నారు. 1952లో శ్రీమతి హౌజ్‌ను కలసినప్పుడు ఆమె అన్నది 'ప్రొఫెసర్ రంగా! రైతుల ఉనికిని గుర్తుపెట్టుకునేందుకు ప్రభుత్వానికి ప్రపంచ యుద్ధం అవసర మైంది. అందుకే మా వారితో అనేదాన్ని – రైతులకు సంఘటిత శక్తే శరణ్యమని. మీరు భారతీయ కర్షకులకు సాయం అందిస్తున్నందుకు ఆనందంగా వుంది'.

1922లో ఆ పర్యటన ముగించుకుని నేను స్కార్‌బరోలోని శ్రామిక పరిశోధనా విభాగం వారి వేసవి పాఠశాలకు హాజరయ్యాను. అక్కడ నేను సోషలిస్ట్ రచయితల్లో, శ్రామికుల్లో ప్రముఖులైన వారందరినీ దాదాపుగా కలుసుకున్నాను. గిల్డ్ సోషలిజం మీద **జి.డి.హెచ్.కోల్ హాబ్సన్** రాసిన పుస్తకాలను ప్రశంసించాను. **హెన్.ఎన్.బ్రెయిల్స్‌ఫోర్డ్** భారతదేశం పట్ల చూపే సానుభూతి బాగా ప్రాచుర్యం పొందింది. **పీజీ ఆర్నాట్, రజనీ పామీదత్** వంటి భవిష్యత్తు కమ్యూనిస్ట్ నాయకులు, **మిస్.ఎల్లెన్ విల్కిన్‌సన్**తో పాటు లేబర్ పార్టీ ప్రభుత్వంలో మరెందరో లెక్చరర్లు మిత్రులయ్యారు. నేను అప్పటికి లెక్చరర్‌ను, విద్యార్థిని కూడా. **నేను కొంచెం బిడియపడే బాంగోర్ సోషలిస్ట్ దశ నుండి లేబర్ పార్టీలోని వామపక్ష రాజకీయాల వైపు ధైర్యంగా అడుగులు వేశాను.** మేము అనేక అంశాలను చర్చించేవాళ్లం. అందులో లీగ్ ఆఫ్ నేషన్స్ (నానా రాజ్య సమితి) ఏమి కానున్నది? రష్యా, సెకెండ్ (సోషలిస్ట్) ఇంటర్నేషనల్ భవితవ్యంవంటి అనేక విషయాలు అందులో చోటుచేసుకునేవి. అప్పుడే సోవియట్ రష్యా వైఖరి పట్ల లేబర్ పార్టీ వైఖరి క్షుణ్ణంగా తెలుసుకున్నా. సోవియట్ రష్యాలో పాలనా యంత్రాంగంలో రైతుల్ని శ్రామికులతో సమానంగా చూస్తారనుకునేవాళ్లు. సోవియట్ సైన్యం, కమ్యూనిస్ట్ పార్టీలు కూడా ధాన్యం లెవీలు, మిలిటరీ ప్రొక్యూర్‌మెంట్లు రైతులు భరించలేనంతగా వసూలుచేసేవారు.

బాంగోర్‌లో పాఠాలు చెప్పినవాళ్లు వలస దేశాల్లో స్వేచ్ఛ నిదానంగా వచ్చినా చాలని చెప్పారు. ట్రేడ్ యూనియన్లు వలస దేశాలకు వెను వెంటనే ముక్తి లభించాల్సిందేనన్నారు. స్కార్‌బరోలో పాఠాలు చెప్పినవాళ్లు శ్రామిక నాయకులు, సోషలిస్ట్‌ల ద్వారా ముక్తి ఎలా లభిస్తుందనే విషయాల మీద చర్చించేవాళ్లు. మేమంతా భారతదేశానికి దాస్యం నుండి విముక్తి చాలా త్వరగా లభిస్తుందనుకున్నాం.

శక్తిమంతమైన రష్యా దేశం భారత స్వాతంత్ర్య సమరానికి మద్దతు పలికేందుకు సిద్ధంగా లేదా? అదంతా ఏదో ఉత్తేజాన్ని పురికొల్పే అంశంగా తయారైంది. అయితే **మహాత్మాగాంధీని ఆర్థికప్రగతి నిరోధకునిగా, భారతదేశ పెట్టుబడిదారుల ప్రతినిధిగా, సామాజిక ప్రతిఘాతకునిగా ముద్రవేయడం నన్ను అమితంగా బాధించేది. అసలు ఈ సోషలిస్ట్‌లకు రైతుల సంగతి పట్టదా అని అందోళన చెందేవాణ్ణి.** వాళ్లు రైతుల్ని తొలగించడం ప్రాథమిక సామాజిక అంశంగా పరిగణిస్తున్నారనే భయం నాలో చోటుచేసుకుంది. పారిశ్రామిక నేపథ్యపు సామాజిక రంగంలో మనుగడ సాగించినందువల్ల వాళ్లు శ్రామికుల పట్ల, వాళ్ల సమస్యల పట్ల మొగ్గు చూపడం సహజమే. అయితే వాళ్ల చర్చల్లో గానీ, భావనల్లోగానీ భారతదేశంవంటి దేశాల్లోని అతి ప్రధాన వ్యవసాయక ఆర్థిక అంశాలు చోటుచేసుకునేవి కావు. వాళ్లు ఆలోచించేది ఐరోపా ఆర్థిక సిద్ధాంతాల గురించే. అయితే భారతదేశ సమస్యలకు వాళ్ల వద్ద ఎటువంటి పరిష్కారాలు లేవనిపించింది. నేను అక్కడి ఉపాధ్యాయుల్లో పెద్దవారైన **బ్రెయిల్స్ ఫోర్డ్** వద్ద ఈ విషయాలు ప్రస్తావించాను. నా ప్రతిస్పందనలకు ఆయన సానుభూతి లభించింది. నాకు మహాత్మాగాంధీ పట్ల గల విశ్వాసం సమంజసమైనదే అన్నాడు. అక్కడి యువ ఉపాధ్యాయ వర్గం భారతదేశంవంటి దేశాల్లోని వాళ్ల భావనలను, అవసరాలను అర్థంచేసుకోవడం లేదని ఆయన అన్నాడు. **భారతదేశ సమస్యల విషయంలోగానీ, రైతుల సమస్యల విషయంలోకానీ అంతగా కొనియాడబడే మార్క్సిజంలో పరిష్కారాలు లభించవు.** ప్రొఫెసర్ క్లే కూడా నేను భావించినట్లు భారతదేశ ప్రగతి గిల్డ్ సోషలిజం మార్గంలో భారతదేశ సంప్రదాయక వృత్తుల పునరుద్ధరణ జరగాల్సిందేనని అంగీకరించారు.

భారతదేశంలో గిల్డ్ సోషలిజం స్థాపనకు కులాల ప్రాతిపదికన నడిచే వృత్తులు ఎలా సానుకూలమో కోల్, నేనూ చర్చించుకునేవాళ్లం. బ్రెయిల్స్‌ఫోర్డ్ కూడా మా చర్చల్లో కొన్నిసార్లు పాల్గొనేవాడు. **అభివృద్ధికి ఆటంకాలుగా నిలిచే కులాలను మార్పు చెందించి ప్రగతి మార్గంలో నడిచేటట్లు చేయొచ్చనే నమ్మకం కుదిరింది.**

ఒక సాయంత్రం బ్రెయిల్స్ ఫోర్డ్ అన్నారు: భారతదేశంలోని రైతు సమస్యలకు పరిష్కారం డేనిష్ రైతుల విధానం ఉపకరించవచ్చునన్నాడు. అంటే సహకార విధానాన్ని ప్రవర్తించుకోవాల్సి ఉందన్నమాట. **రాబర్ట్ ఓవెన్, రాక్‌డేల్ పయనీర్స్** రచనలు... **వెబ్స్, హాకెట్, ఫిలిప్ గిబ్స్**వంటి వారి గ్రంథాలు చదివి బ్రిటిష్ సహకార ఉద్యమం నాయకులను కలిసిన పిమ్మట నాకూ అలాగే అనిపిస్తున్నదని చెప్పాను.

వేల్స్‌లో నేను అనేక సహకార సంఘాలను సందర్శించాను. ఆక్స్‌ఫర్డ్ సహకార సంఘంలో నేను సభ్యుణ్ణి. అయితే ఆయన అన్నదేమంటే, ఈ రంగంలో ఆంగ్లేయ వుద్యమం ఎక్కువగా వినిమయదారులను నొక్కిపెట్టిందని, అది ఉత్పత్తిదారుల వైపు నుండి సఫలీకృతం కాలేదని. దానితో నేను ఆయన సిఫారసు లేఖల సాయంతో ఐరోపాలో శ్రామిక సహకార సంఘాల పనితీరును అధ్యయనం చేసేందుకు నా అంతట నేనే ఐరోపా పర్యటనకు పూనుకున్నాను. ఆయన నన్ను పరిచయం చేస్తూ రాసిన లేఖల్లో పరిపుష్టంగా కనిపించిన ఒక వాక్యం ఏమంటే – ఆయన సహజంగా కనిపించే దేశ భక్తుడే కాదు, గాంధీ విధానం పట్ల భక్తి శ్రద్ధలు కనబర్చే గాంధేయవాది అయిన సోషలిస్ట్, నిఖార్సయిన అంతర్జాతీయ వాది'. 1958లో ఆయన మరణించేవరకూ ఆయనతో నా మైత్రిని కొనసాగించాను.

నేను ఇంగ్లండ్‌లో ఉన్నప్పుడు నా ధ్యాసంతా అమెరికా సంయుక్త రాష్ట్రాల వైపే. **'బెట్ లైన్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ'** అనే తన గ్రంథంలో హెచ్.జి.వెల్స్ ఉడ్రో విల్సన్‌ను తీవ్రాతితీవ్రంగా విమర్శించాడు. అయితే అప్పటి పరిస్థితుల్లో ఆయన అంతకంటే చేయగలిగిందేమీ లేదని **ఉడ్రో విల్సన్** పట్ల గాఢాభిమానం గల ఆక్స్‌ఫర్డ్‌లోని భారతీయులు భావించేవాళ్లు. ఆయన గురించి బాగా తెలుసుకోవాలని ఆయన జీవిత చరిత్ర చదివాను. తర్వాత ఆయన రాసిన గ్రంథం **'ది న్యూ ఫ్రీడం'** మళ్లీ మళ్లీ చదివాను. ఆయన పట్ల గౌరవం పెరిగింది. ఆయన్ను రెండు పర్యాయాలు దేశాధ్యక్షునిగా ఎన్నుకున్న ప్రజల పట్ల కూడా గౌరవం పెంచుకున్నా. అలాగే నేను ఫ్రెంచి నాయక గణాన్ని గురించి, బ్రిటిష్ ప్రధానులు **లాయిడ్ జార్జి, బోనార్**లాలను గురించి చదివాను. అయినా వారంటే నాకు ఇష్టం ఏర్పడలేదు. యుద్ధానంతర కాలంలో ఉడ్రో విల్సన్‌తోగానీ, **అబ్రహం లింకన్**తోగానీ సరితూగగల ఐరోపా వారెవ్వరూ కనిపించలేదు. అయితే ఐరోపాలోని 19వ శతాబ్దానికి చెందిన ఉదారవాదులు నాకు స్ఫూర్తిదాయకంగా కనిపించారు. వారి గురించి అనేక గ్రంథాలు చదివాను. పైగా అమెరికన్ పెట్టుబడిదారులు అక్కడి శ్రామికుల పట్ల ఏర్పర్చుకున్న వైఖరిని కోల్ దుయ్యబట్టాడు. యుద్ధానంతరం అమెరికాను సందర్శించిన బ్రిటిష్ శ్రామిక నాయకుల విమర్శలు అమెరికన్ల పెట్టుబడిదారీ విధానంపై హెచ్చరికలుగా నాకు కనిపించాయి. నీగ్రోల పట్ల, **కు-క్లుక్స్-క్లాన్** కార్యకలాపాలు, **అమెరికా సామాజిక పునాదులు నాలో సందేహాలను రేకెత్తించాయి.**

హరిజనుల పట్ల అంతకుమించే విధంగా భారతదేశంలో వ్యవహరించే తీరును నేను

[illegible]రవలేదు. ఏదిఏమైనా నేను అమెరికా వ్యవహారాల పట్ల అమితమైన శ్రద్ధ [illegible]పసాగాను.

నేను ఇంగ్లండ్‌లో ఉన్న మూడు సంవత్సరాల కాలంలో నా ఆలోచనలు పెంపొందే [illegible]యంలో అక్కడి స్థానిక రాజకీయాలు నాపై జ్ఞానదాయక ప్రభావాన్ని చూపాయి. [illegible]హరణకు నేను ఇంగ్లండ్ చేరిన సంవత్సరానికి అక్కడ ఐర్లండ్ స్వాతంత్ర్య సమరం [illegible]రాకాష్ఠ దశకు చేరుకుంది. **1921-22లో ప్రత్యేక ఐరిష్ స్వతంత్ర రాజ్యం [illegible]ర్పాటుచేయడంతో సమస్యకు పాక్షిక పరిష్కారం లభించింది.** ఆక్స్‌ఫర్డ్‌లోని అందరి [illegible]ర్థుల మాదిరిగానే సాయుధ పోరాటం, సాయుధ సంపత్తికి పేరొందిన ఇంగ్లండ్‌ను, [illegible] సామ్రాజ్యాన్ని ఎలా చిత్తు చేయగలిగిందో చూశాను. అయితే తొలి ప్రపంచ [illegible]ద్ధం తర్వాత ఇంగ్లండ్ ఎంతగా బలహీనపడిందో, శతాబ్దాల తరబడి సాగిన ఐరిష్ [illegible]రాటానికి ఆంగ్లేయులు ఎంతగా అలసిపోయారో మేము పూర్తిగా గ్రహించ [illegible]కపోయాం.

[illegible]మేము **డివలేరా, గ్రిఫిత్స్, కాలిన్స్**లను చూసి స్వాతంత్ర్యం సంపాదించిన తరుణాన [illegible]పొంగిపోయాం. అయితే గుండెపోటుతో గ్రిఫిత్స్ మరణించడం, సాహసి మిఖేల్ కాలిన్స్‌ను [illegible]పజేయడం, డివలేరా ఈ పర్యాయం తన అనుయాయులతోనే పోరాడవలసి రావడం [illegible]ంటి బ్రిటిష్‌వారు భారతదేశాన్ని వదలి వెళ్లేతీరును ఊహించగలంగానీ మహాత్మాగాంధీ [illegible]హింసా మార్గాన్ని అనుసరిస్తున్నందున ఐర్లండ్‌లో పాలిక భారతదేశంలో పారదన్న [illegible]వేశ ఊరటను కలిగించింది. అయితే 1947-48 మధ్యకాలంలో దేశ విభజననాటి [illegible]రాడాలు అంతకుమించినవిగా నిలిచాయి. ఏదిఏమైనా ఐర్లండ్ విజయం మాకు [illegible]నకమే అయ్యింది.

1922-23 మధ్యకాలంలో టర్కీ ప్రతిఘటన మనకు ఆసరాగా అందివచ్చింది. [illegible]మా భారత యువతకు ఆదర్శప్రాయుడయ్యాడు. బ్రిటన్‌లోని లేబర్ పార్టీ భారతదేశ [illegible]స్వాతంత్ర్యానికి మద్దతు ప్రకటించింది. యుద్ధానంతరం **లాలాలజపతిరాయ్** ఆక్స్‌ఫర్డ్ [illegible]ర్శించారు. ఆయన మమ్మల్నందరినీ భారతదేశ దౌత్య ప్రతినిధులుగా ఆక్స్‌ఫర్డ్‌లో [illegible]మా పాత్రల్ని చక్కగా పోషించమని ఉద్బోధించారు. కనుక మేము 1923లో జరిగిన [illegible]ఎన్నికల్లో లేబర్ పార్టీకి మద్దతు పలికాం. లేబర్ పార్టీ ప్రధాన ప్రతిపక్ష స్థాయికి [illegible]కుంది.

[illegible]ఫర్డ్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాల్లో చదివే విద్యార్థులకు ప్రత్యేక అనుకూల అంశమేమంటే

ఆయా విశ్వవిద్యాలయాలు ఏర్పాటుచేసే సుదీర్ఘవేసవి విజ్ఞాన యాత్రలు. అటువంటి యాత్రల కారణంగా నాకు పలువురు మిత్రులయ్యారు– పలు దేశాలకు చెందినవారు, పలు ప్రగతిదాయక ఉద్యమాలకు చెందినవారు. అది నాలో ఆత్మ విశ్వాసాన్ని ప్రోది చేసింది. భారతదేశ స్వాతంత్ర్యం పట్ల ఎంతగా తపన చెందుతున్నా నేను కేవలం జాతీయవాదిగా మిగిలిపోలేదు. లీగ్ ఆఫ్ నేషన్స్ అసెంబ్లీ సమావేశాలకు హాజరైనప్పుడూ, అంతర్జాతీయ కార్మిక సదస్సుల్లో చాలామంది నాయకుల్ని కలసి చర్చలు జరిపిన సందర్భాల్లోనూ అదంతా ఏదో ఔన్నత్యపు అనుభూతిని కలిగించేది. మరీ ముఖ్యంగా **ఆల్బర్ట్ థామస్**తో చర్చించినప్పుడు అటువంటి అంతర్జాతీయ సంస్థ కర్షకులకు అండగా ఉంటే బాగుండుననిపించింది. **యంగ్ ఇండియా, తెలుగు దిన, వారపత్రికలు మోసుకొచ్చే వార్తలు చదివే నేను మహాత్మాగాంధీ ఆలోచనలకు మరీ ఎక్కువగా ప్రభావితం కాసాగాను.** గాంధీజీ గ్రామీణ సామాజిక, ఆర్థిక సమస్యలపైన చూపిన శ్రద్ధ, రైతుల అభివృద్ధికి పెట్టిన శ్రద్ధ నన్ను బాగా ఆకట్టుకున్నాయి. గాంధీజీకి నచ్చిన రస్కిన్ పుస్తకం **"Unto This Last"** నేను చదివాను. రస్కిన్ కళల పట్ల, హస్తకళల పట్ల మక్కువ చూపారు. వాటిని వృత్తిగా చేపట్టినవారు ధనకాంక్ష గలవారు కాకపోవడం వల్లనే ఆ గ్రంథానికి అంతగా ఆకర్షితులమయ్యాం. అందులో ఎంతటి ఆంగ్ల వచనా రచన సౌందర్యం ఇమిడి వుందో చెప్పలేం! ఆయన అందులో చూపిన మానవత ఎక్కువగా నచ్చిందో లేక ఆయన శైలీ విన్యాసం నచ్చిందో తేల్చుకోలేకపోయాను.

'యేడాదిలో స్వరాజ్యం' అన్న గాంధీజీ నినాదం ఫలించకపోవడం ఎంతగా నిరాశాజనకమైనా అందుకు ఆయన్ను తప్పుపట్టాల్సిన పనిలేదు. ఆంగ్ల దినపత్రికల దయమాలిన విమర్శలు మమ్మల్ని బాగా బాధించేవి. గ్రామీణ భారతదేశానికి గాంధీజీ సూచించిన ఆర్థిక ప్రణాళికే శరణ్యమని నేను ఎంతగా ఆలోచన చేసినప్పటికీ మాకంటే ముందు **ఆక్స్‌ఫర్డ్‌లో చేరిన విద్యార్థులు దానికి గట్టిగా మద్దతు పలకడంలేదు.**

ఐరోపా అధ్యయన యాత్ర

నేను ఐరోపా యాత్రకు బయలుదేరే ముందు లండన్‌లో ఒక పక్షం రోజులు అక్కడి శ్రామిక ఉపాధి కల్పనా శాఖ, నిరుద్యోగ భీమా, ఓడ రేవుల్లో శాశ్వత కార్మికుల స్థానాల్లో రోజువారీ కూలీల నియామక పథకాలు, అనేక సంక్షేమ పథకాల గురించి అధ్యయనం చేశాను. లండన్ కౌంటీ కౌన్సిల్, బరో కౌన్సిళ్ల పనితీరు, అక్కడ కమిటీల

పాత ఒక వైపు, మరో వైపు ప్రభుత్వ అధికారుల కార్యకలాపాలను అర్థంచేసుకునేందుకు ప్రయత్నించాను. అనేకమంది కార్మిక నాయకుల్ని ప్రశ్నించి విషయాలను సేకరించాను. లైబ్రరీలో కూర్చుని హౌస్ ఆఫ్ కామన్స్ నిర్వహణా పద్ధతుల్ని గమనించాను. ఆ విధంగా గతంలో నేను ఆ మహోన్నత నగరంలో మధ్యతరగతి ప్రజల, కార్మికుల సామాజిక జీవన స్థితిగతుల గురించి అవగాహన ఏర్పర్చుకుంటే ఈ పర్యాయం ప్రత్యక్ష సేవను అందించే వేలమంది ప్రజా సేవకులు వారి వారి ప్రతినిధుల ద్వారా పార్లమెంట్ వరకూ ఎలా ప్రభావితం చేసేదీ గమనించగలిగాను.

శోభాయమానమైన అక్కడి పార్లమెంట్ భవనపు వరండాలో నడుస్తుంటే, అక్కడి శిల్పాలను, చిత్రపటాలను తిలకిస్తూ ఉంటే ఆంగ్లేయ చరిత్ర అంతా కదలినట్లయ్యింది. ఆ భవనపు ప్రతిబింబాన్ని **థేమ్స్ నది**లో మరీ ముఖ్యంగా రాత్రి వేళల్లో చూసి ఎంతగా మూర్ఖుడ్యే వాడినో! అదొక ప్రజాస్వామిక దేవళం. నేను అక్కడి పార్లమెంట్ సభ్యుల్లో అనేకమంది సంఘ సంస్కర్తల రూపంలో ఎంతగా పాటుపడిందీ చదివి ఉన్నాను. మానవత్ ప్రపంచం వారి ఆలోచనలను అందిపుచ్చుకునే విధంగా అనేక విషయాల్లో అవిరళ కృషి చేశారు: కర్మాగారాల్లో పనిచేసే కార్మికుల సమస్యలు, హక్కుల బిల్లు, రాత్రి వేళల్లో స్త్రీలు, బాలలు పనిచేయడాన్ని నిషేధించడం, బానిసత్వం, మురికివాడల తొలగింపునకు కృషి చేయడం, పత్రికా స్వేచ్ఛ, సభా స్వాతంత్ర్యం, రాసే హక్కు, చదువుకునే హక్కు, గృహ వసతి, ఓటు హక్కు వంటివి అందులో కొన్ని. **త్వరలోనే పార్లమెంట్ ద్వారా అక్కడకు సోషలిజం చొచ్చుకు వస్తుందని విశ్వసించాను.** అందువల్ల ఇంగ్లండ్‌కు ఎప్పుడు వెళ్లినా వాళ్ల పార్లమెంట్‌ను సందర్శించి ఈ వీరులను స్మరించుకునేవాణ్ణి.

లండన్‌కు తూర్పు కొసన గల **టాయన్‌బీ** హాల్‌లో నా బస. ఈ యాత్రా సమయంలో పరిచయమైన దాని వార్డెన్ **జె.జె.మల్లన్** నాకు మార్గదర్శి. ఆ సంస్థ కార్యదర్శి సోషలిజం పట్ల ప్రజాస్వామ్యం పట్ల నాలోని విశ్వాసాన్ని చూసి పొంగిపోయేవాడు: 'రంగా నాకు అమెరికన్‌లా కన్పిస్తాడు. ఎప్పుడూ క్రియాశీలంగా, ఏవో కార్యకలాపాల్లో మునిగితేలుతూ ఉంటాడు. ఆయన్ను మళ్లీ 34 సంవత్సరాల తర్వాత 1954లో ఢిల్లీలో కలిసినప్పుడు ఎంతటి ఆశ్చర్యమో! ఈ ప్రపంచం మాకు అంత పెద్దదిగా కనిపించదు. మా మధ్య దూరాలను పెంచదు' అన్నాడాయన.

నేను ఈ ఐరోపా యాత్రలో ప్రథమంగా పారిస్ చేరుకున్నాను. అక్కడ ఒక

వారం రోజులపాటు ఉన్నాను. అక్కడ కూడా అదే అధ్యయనం కొనసాగించానుకానీ కొంచెం తేడా లేకపోలేదు. నేను ఆంగ్ల భాష మాట్లాడినంతగా ఫ్రెంచి భాష మాట్లాడలేను. అక్కడి దినపత్రిక 'హ్యూమనైట్' పత్రికా సంపాదకులు, పేరెన్నికగన్న సోషలిస్ట్ **ఎం.పాల్ ఫారే** నాకు మార్గదర్శి. అక్కడి రాజకీయ పక్షాల సంక్లిష్టత నాకు గందరగోళంగా కనిపించింది. అది రాజకీయ పక్షాల ఆశయాల అంతరంగాకాక వ్యక్తుల మధ్య విభేదంగా కనిపించింది. వాళ్ల కార్మిక సంఘాల పటిష్టమైన పనితీరు నన్ను బాగా ఆకట్టుకుంది. అదేవిధంగా వాటి శ్రామికవాద సోషలిజం కూడా. బ్రిటిష్ కార్మిక సంఘాలకంటే ఇక్కడి కార్మిక సంఘాలు రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరింప జేసుకున్నాయి. ఈనాటికి (1958) కూడా పార్లమెంట్‌లోనూ, కార్మిక సంఘాలపరంగానూ ఫ్రెంచి రాజకీయాల్లో మార్పులేదు.

నేను డెన్మార్క్‌లో గడిపిన వారం రోజులూ ఎంతో స్ఫూర్తిదాయకం, సంతృప్తికరం. రైతుల భవిష్యత్తు, వారి సమస్యల విషయంలో అక్కడ పరిష్కారాలు లభించాయి. **రైతుల కార్యకలాపాలన్నీ సంపూర్ణంగాగానీ, పాక్షికంగాగానీ తామే స్వయంగా రూపొందించుకున్న సహకార సంఘాల ద్వారా జరుగుతూ ఉంటాయి.** రైతులు ఆ సహకార సంఘాల్లో భాగస్వాములుగా ఉంటారు. వాళ్లు బానిసత్వం నుండి రెండు శతాబ్దాల క్రితమే బయటపడ్డారు. అయినా సహకార సంఘాల ద్వారా వాళ్లు ఆర్థిక, సామాజిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించారు. వాళ్ల విజయ రహస్యం ఏమిటి? అది దిగ్విజయంగా నడిచే వాళ్ల ప్రజా పాఠశాలల్లో (Folk Schools) దాగి ఉంది. **వాళ్ల పౌరసత్వ అధ్యయనం కోసం వేలమంది రైతు యువతీ యువకులు రెండు నుండి నాలుగు మాసాలపాటు శిక్షణ పొందుతారు.** మతపరమైన అవగాహన, చరిత్ర, భూగోళం, ఆర్థికశాస్త్రం, రాజకీయ శాస్త్రం, పౌర సంస్థలు తదితర విషయాల గురించి బోధించడంతోపాటు శాస్త్రీయ వ్యవసాయానికి సంబంధించి అనుభవంతో కూడిన శిక్షణ వాళ్లకు అక్కడ లభించేది. ప్రయోజనంతో అనుసంధానించబడిన అక్కడి వసతిగృహ జీవనం, వారి ధార్మిక నేపథ్యం వారు స్వాభిమానాన్ని, వినయ విధేయతలను, మైత్రిని కూడగట్టుకునేందుకు ఎంతగానో ఉపకరించేవి. అవి పబ్లిక్ పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో కూడగట్టే విద్య కంటే తక్కువేమీ కాదు.

డెన్మార్క్ రైతుల విజయం భారతదేశ రైతుల భవిష్యత్తుపై నాలో ఆశలు చిగురింపజేసింది. తర్వాత ఇటువంటి పాఠశాలను స్థాపించడంలో హాలెండ్, స్వీడన్,

చార్లు, బెల్జియం, జర్మనీవంటి దేశాల్లో అక్కడి కర్షక నేతలు ముందున్నారన్న విషయం నా జర్మనీ పర్యటనలో తెలిసింది. అటువంటి పాఠశాలలను భారతదేశంలో కూడా స్థాపించేందుకు ప్రణాళిక తయారుచేయాలని అనుకున్నాను.

లీగ్ ఆఫ్ నేషన్స్ సమావేశాలు జరుగుతున్న తరుణంలో నేను జెనీవా వెళ్లడం జరిగింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ **గిల్బర్ట్ ముర్రే** నాకు తెలుసు. **లార్డ్ రాబర్ట్ సిసిల్**ను నేను కార్మిక సంఘ చర్చల సందర్భంగా ఒక పర్యాయం కలిశాను. వారిద్దరూ నేను సందర్శకుల గ్యాలరీ నుండి లీగ్ ఆఫ్ నేషన్స్ సమావేశాలను తిలకించేందుకు ఏర్పాట్లుచేశారు. నేను యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, ఇటలీల ప్రతినిధులు ప్రసంగించగా విన్నాను. నేను అక్కడ కూర్చున్నంత సేపూ ప్రపంచంలోని ప్రజలంతా ఒక కుటుంబంగా మనవలసినవాళ్లు యుద్ధంగానీ, శాంతిగానీ, సంధిగానీ మహాభారతంలో కురుపాండవుల్ని తలపింపజేస్తున్న భావన కలిగింది. ఆ సభ రాజసూయ యాగానికి ముందు జూదసభలా కనిపించింది. భారతదేశానికి లీగ్ సభ్యత్వం విషయంలో అసంబద్ధతను గుర్తించాను. భారతదేశం ఫ్రాన్స్, ఇంగ్లండ్‌ల మాదిరిగా స్వతంత్ర దేశంగా చూపబడింది. అమెరికాకు అందులో ప్రవేశం నిరాకరించడం ద్వారా దాని బలహీనత బహిర్గతమైంది. ఆసియా ఖండానికి చెందిన జపాన్‌ను గౌరవప్రదంగా చూడడం ఆనందమేకానీ చైనా విషయం నిరాశాజనకం. ప్రపంచ శాంతికి గణనీయమైన ఫలితాలను లీగ్ ఆఫ్ నేషన్స్ అందించాలంటే దాన్ని సమూలంగా సంస్కరించాలనే వెల్స్ అభిప్రాయంతో నేను ఏకీభవిస్తాను.

జెనీవా ఎంతో ఆకర్షణీయమైన పట్టణం. మరపురాని సరోవరాలు, రాత్రివేళల్లో చైతన్యపరిచే వెలుగుల దండలు, ఆల్ప్స్ పర్వత హిమ శిఖరాగ్రాలు, సతత హరిత వృక్షవనాలు అలసిన మానవుణ్ణి తిరిగి పుంజుకునేటట్లు చేస్తాయి. అందుకే జెనీవా నా భావనల్లో శాశ్వతంగా నిలిచి ఉంటుంది.

నేను అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రధాన కార్యాలయాన్ని కూడా సందర్శించాను. నాకు దాని ఆదర్శాలు, కార్యాచరణ నచ్చాయి. నాకు నచ్చని అంశమేమంటే అది కేవలం పారిశ్రామిక కార్మికులకు ఉద్దేశింపబడడమే, అందులో ఇతరులకు ప్రవేశం కల్పించకపోవడమే.

1948లో శాన్‌ఫ్రాన్సిస్కోలో నిర్వహింపబడిన సభలకు నేను భారత ప్రతినిధిగా హాజరయ్యాను. 1957లో జెనీవాలో జరిగిన సభలకు పరిశీలకునిగా వెళ్లాను. **నా**

ఒత్తిడి కారణంగా అప్పడప్పుడూ భారతదేశ శ్రామిక ప్రతినిధి వర్గంలో రైతు ప్రతినిధులకు కూడా స్థానం దక్కుతూ ఉండేది. వ్యవసాయ కూలీల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు ఒక నిరంతర అధ్యయన కమిటీ ఏర్పాటయ్యేటట్లు చూడగలిగాం.

యుద్ధానంతర కాటకం కారణంగా 1943-45 మధ్యకాలంలో అంతర్జాతీయ సమితి ఆహార, వ్యవసాయ సంస్థను నెలకొల్పి ఉత్పత్తి దారుల, వినియోగదారుల అవసరాలను తీర్చే దిశగా కృషిని కొనసాగించింది.

నేను స్విట్జర్లాండ్‌లో ప్రజాస్వామ్యం అత్యద్భుతంగా విరాజిల్లుతున్నదని చదివి వున్నాను. అటువంటి ప్రజాస్వామ్యమే భారతదేశానికి తగినదని అనుకున్నాను- మన గ్రామ పంచాయతీల సాంప్రదాయాన్ని ఆధారం చేసుకుని. అయితే మూడు భాషలకు చెందిన మద్రాస్ రాష్ట్ర ప్రజల మాటలు విన్న నాకు ఈ విధమైన పద్ధతులు కూడా ఫలితాలను ఇవ్వజాలవేమోననిపించింది. స్విట్జర్లాండ్ చిన్న దేశమే అయినా అది స్వాతంత్ర్యాన్ని సాధించడమేగాక ప్రపంచంలో కీలక స్థానంలో నిలిచింది. భారతదేశ స్థానం ఎక్కడ? దానికి స్వాతంత్ర్యం సిద్ధించేదెన్నడు? బుర్రనిండా ఇవే ఆలోచనలు.

నేను ఇటలీ చేరుకున్న సమయానికి ఫాసిస్టులు రైతుల సహకార వ్యవస్థపై విష్లవాత్మక తిరుగుబాటును నిర్వహిస్తున్నారు. 1943లో మిలాన్‌కు చెందిన ఏ మధ్యతరగతి ప్రజలైతే ముస్సోలినీని కాల్చి చంపి శవాన్ని వేలాడదీశారో వాళ్లే 1922లో కార్మిక సంఘాల, సహకార సంఘాల నాయకుల్ని కొట్టి ఆయా సంస్థల భవనాలకు నిప్పంటించారు. అటువంటి నిరసనకారులు కొందరు ఒక సాయంత్రం నన్ను మిలాన్‌లో కలసి వెంటనే ఆ పట్టణాన్ని వదలి వెళ్లమని హెచ్చరించారు. అలా చేయనిపక్షంలో మరుసటిరోజు ఉదయానికి నాకు దేహశుద్ధి చేస్తామన్నారు. కౌలు రైతులు సహకార సంఘాల ద్వారా సాధించిన అభివృద్ధిని మెచ్చుకుంటూ వెలువడిన పత్రికా ప్రకటనలే అందుకు కారణంగా చెప్పవచ్చు. నేను మరో మూడు రోజులపాటు మిలాన్‌లోనే గడిపాను. ఎటువంటి అవాంఛిత సంఘటనా జరగలేదు. నేను రోమ్‌లోనూ, ఫ్లోరెన్స్‌లోనూ ఉన్నాను. మిలాన్‌లో 'అవంతి' దినపత్రిక సంపాదకుడు **సైనర్ సెర్రాటి** నాకు మార్గదర్శి. నేను ఇటలీని వదలిన కొద్ది వారాలకే ముస్సోలినీ గద్దెనెక్కాడు. ఆ పత్రికా సంపాదక మిత్రుణ్ణి హతమార్చారు. తర్వాత అక్కడ ఫాసిస్టులు, పూర్వపు సహకార వాదులు కలసి ఒక కార్పొరేట్ రాజ్యాన్ని రూపొందించుకున్నారు. అందులో గిల్డ్ సోషలిజం, ఫాసిస్ట్ తరహా నేషనలిజం, నియంతృత్వం సుతారంగా కలగలసిపోయాయి.

ఇటలీలో గ్రామ ప్రాంతం సుందరమయం. చలికాలంలో దక్షిణ భారతదేశంలో మాదిరి ప్రకృతి అంతా వెలుగులో స్నానమాడుతుంది. నగరాలు, పట్టణాలు మురికికూపాలు. అక్కడ మాక్రోని, ద్రాక్ష రుచులు నాకు నచ్చాయి.

నేను జర్మనీ వచ్చాక బెర్లిన్, మ్యూనిచ్, హామ్‌బర్గ్‌లలో పర్యటిస్తున్న తరుణంలోనే **ఫ్రుమ్యోల్బణం** నిక్కి చూడసాగింది. ఆ సరికొత్త ఆర్థిక తరహా సహకార సంఘాల నడ్డి విరవసాగింది. అధికారంలో ఉన్న సోషలిస్ట్‌లు, ఉదారవాదులు నిస్సహాయులుగా చండిపోయారు. సోషల్ డెమోక్రాటిక్ పార్టీ పట్ల, అది సాధించిన దానిపట్ల నేను ఆకర్షితుణ్ణయ్యాను. అది సహకార ఉద్యమానికి సంపూర్ణ మద్దతు అందించింది. బ్రెయిల్స్ ఫోర్డ్, కోల్‌వంటి వారు చెప్పిన ప్రకారం అటువంటి తరహా ప్రజాస్వామ్యమే జీవశక్తులో కావాల్సింది. బ్రిటిష్ శ్రామిక వర్గ నాయకుడు **ఆర్థర్ హెండర్సన్** ఇంగ్లండ్‌కు కూడా అటువంటి ఆర్థిక పార్లమెంట్ కావాలన్నాడు. నేను సోషల్ డెమోక్రాటిక్ పార్టీ ఆలోచనలను, ప్రణాళికలను అధ్యయనం చేశాను.

నాకు జర్మన్ ప్రజలు ఎంతగానో నచ్చారు. జర్మన్ జాతి పట్ల నా అభిమానం పెరగడానికి కారణం మాక్స్ ముల్లర్ మహాశయునికి వేదాల పట్ల, సంస్కృత సాహిత్యం పట్ల మక్కువ ఎక్కువ. ఆ సమయంలో బెర్లిన్‌లో జర్మన్ భాషను చదువుతున్న **వి.ఎస్.కృష్ణ** మన్నిక సంగీత సభకు తీసుకెళ్లాడు. నేను **గోథే**ను ఇష్టపడడానికి కారణం – **ఆయనకు కాళిదాసు పట్ల, 'శాకుంతలం' పట్ల మక్కువ ఎక్కువ.**

లండన్ తిరిగి వచ్చిన తర్వాత బ్రెయిల్స్ ఫోర్డ్‌ను తిరిగి తన నివాసంలో కలిశాను. నా అంతట నేనే రెండు మాసాల యాత్రను ముగించుకురావడాన్ని ఆమె ఎంతగానో ప్రశంసించింది. పారిస్, రోమ్‌ల ప్రభావమేమీ నా మీద పడలేదని కూడా ఆమె గ్రహించింది. భారతదేశపు రైతుల్ని కడగండ్ల నుండి గట్టెక్కించేందుకు మార్గాన్వేషణ చేస్తూ రావడం చూసి ఆమెకు ఆనందమేసింది. జాతికి స్వాతంత్ర్యం సిద్ధించిన పిమ్మట ఎటువంటి ప్రజాస్వామిక సోషలిస్ట్ విధానాన్ని చేపట్టాలో అన్వేషిస్తున్న వ్యక్తిగా బ్రెయిల్స్ ఫోర్డ్ కూడా నన్ను అభినందించారు. ఆయన నా పర్యటన విశేషాలు విని కొన్ని హెచ్చరికలు చేశారు. సహకార సంఘాలు మరీ పెచ్చుమీరితే వచ్చే ఫలితాలకు ఇటలీ ఫలితాలే సాక్ష్యం అన్నారు. అయితే రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాల విషయంలో, ఉత్పత్తుల్ని అమ్మే విషయంలో సహకార సంఘాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పి ఆయన్ను ఒప్పించగలిగాను.

సోషలిస్ట్‌ల, కమ్యూనిస్ట్‌ల అంతర్గత విభేదాల గురించి నేను విని ఉన్నాను, చదివాను కూడా. వారిరువురూ కార్మిక వర్గాన్ని పట్టించుకున్నంతగా వ్యవసాయ కూలీల పట్ల శ్రద్ధ చూపడంలేదు. అయితే **బ్రెయిల్స్ ఫోర్డ్ అనేదేమంటే సోషలిజం అనేది లేకపోతే జాతీయవాదం ఫాసిజంగా రూపుదాల్చే ప్రమాదముందని. రైతు కూలీ సంక్షేమానికి మార్క్సిజం అంతగా ప్రయోజనకారికాబోదన్న నా అభిప్రాయానికి పేజ్ ఆర్నాట్, పామేదత్‌లు ఉలిక్కిపడ్డారు.** వాళ్లు లెనిన్ రచనలు చదవమని సలహా ఇవ్వడంతోపాటు కొన్ని గ్రంథాలు, కరపత్రాలు అందించారు.

1922 చలికాలంలో ఐరోపా పర్యటన చేసి ఆక్స్‌ఫర్డ్ తిరిగి వచ్చిన నాకు మూడు నాలుగేళ్ల అనుభవం గడించిన అనుభూతి కలిగింది. యాత్రానుభవాల ఆధారంగా రెండు, మూడు తావుల్లో ప్రసంగించాను. **కార్మికులు, కర్షకులు కలసిమెలసి సంఘీభావంతో సహకార సంఘాల ద్వారా సోషలిస్ట్ విధానంలో అభివృద్ధి చెందాల్సిన అవసరాన్ని గుర్తించాను.** మార్క్స్, లెనిన్ పట్ల నాకు అంధ విశ్వాసం లేదు. పాశ్చాత్య ప్రజాస్వామ్యంలోని లొసుగులు కూడా నా అవగాహనలోకి రాసాగాయి. అక్కడి మురికివాడల్లో నివసించే ప్రజల జీవన స్థితి గతులను కళ్లారా చూసినవాణ్ణి కనుక కార్మిక సంఘాల ద్వారా ఆ వర్గాల అభివృద్ధికి పాటుపడాల్సిన అవసరం ఉందన్నాను. ఇక నా పరిశోధనాంశం విషయం వచ్చేటప్పటికి భారతదేశపు కొన్ని గ్రామాల సామాజిక, ఆర్థిక స్థితిగతుల అధ్యయనంతోపాటు పత్తి పండించే వారి, నూలు వడికేవారి, నేత నేసేవారి ఆర్థిక జీవనంతోపాటు దక్షిణ భారతదేశంలోని నూలు మిల్లుల, వస్త్ర పరిశ్రమకు చెందిన ఆర్థిక స్థితిగతుల్ని కూడా అధ్యయనం చేయదల్చాను. జీకర్ నాలోని వ్యక్తిగత వికాసానికి ముచ్చటపడి ఆ అధ్యయనంలో ముందుకు సాగమన్నాడు. అంతకుముందు **మూడు సంవత్సరాలక్రితం ఎంతటి సాహసోపేతంగా ఆక్స్‌ఫర్డ్‌కు బయలుదేరానో అంతే సాహసోపేతంగా తిరిగి స్వదేశానికి పయనమయ్యాను.**

ఆంగ్ల సాహిత్యంకంటే తెలుగు సాహిత్యమంటేనే నేను ఎక్కువ ఇష్టపడతాను. నాకు భారతీయ చిత్రకళ గురించి అప్పటికి అసలేమీ తెలియనందువల్లే పాశ్చాత్య చిత్రకళ నచ్చేది. ఆర్చెన్స్ సహకారంతో నేను ఐరోపా పట్టణాల్లోని చిత్రకళా మందిరాలన్నింటినీ సందర్శించి అక్కడి చిత్రకళకు ముగ్ధుణ్ణయ్యాను. అక్కడి చర్చి నిర్మాణ కౌశల్యం నన్ను బాగా ఆకట్టుకుంది. వాళ్లు వాటిని భద్రంగా ఉంచే తీరును చూసి మన ప్రాచీన దేవళాల విషయంలో ఎంతగా అశ్రద్ధ చూపిస్తున్నామో తెలుసుకోగలిగాను.

చర్చి వెలుపల వినిపించే పాశ్చాత్య సంగీతం కంటే నాకు త్యాగరాయ కృతులే వచ్చేవి. జాజ్ కొంత నయమే. అలాగే భారతీయ నాట్య సంగీతం. ఇక విగ్రహాల విషయానికొస్తే అక్కడి భారీ విగ్రహాలు కూడా బాగా ఆకట్టుకునేవి.

చారిత్రక ప్రాముఖ్యం దృష్ట్యా పారిస్, రోమ్ నన్ను ఆకట్టుకున్నాయి. 19వ శతాబ్దపు విప్లవాలకు పుట్టినిల్లుగా పారిస్ నాకు బాగా నచ్చింది. **డికెన్స్ నవల 'టేల్ ఆఫ్ ది టు సిటీస్'**లోని ఘటనలను గుర్తుకుతెచ్చుకున్నాను. భారతీదేవి గారు కూడా పారిస్‌లో ఒక వారం గడిపింది. ఆమెకు నేనే గైడ్‌ను. ఆమె అక్కడి ప్రాకృతిక సౌందర్యాన్ని, నాటక కళను, సంగీతాన్ని ఆనందించారు.

రోమ్ చూసిన తర్వాత పోతన గారి పద్యం రాజుల మీద చెప్పింది గుర్తుకొచ్చింది. రోమ్ న్యాయ నైపుణ్యానికి, పరిపాలనా దక్షతకు కూడా పెట్టింది పేరు. అయితే వర్తమాన ఇటలీలో అది అంతగా కానరావడంలేదు. అసలు ఈ పట్టణాలన్నీ శిథిలాల మధ్యే ఎందుకు వర్ధిల్లుతాయన్న ఆలోచన ఢిల్లీ వచ్చిన తర్వాత కలిగింది. అయినా అది మానసికంగా తేల్చుకోవాల్సిన అంశమనిపించింది.

నేటికీ స్వతంత్ర భారతావనిలో పాలకులు ఇంద్రప్రస్థలోని శిథిలాలు, గోరీల చుట్టూనే

కొన్ని ఏళ్ల తర్వాత ఇంగ్లండులో పాత రైతు మిత్రులతో రంగ

అభివృద్ధిని సాధించాలని చూస్తారు!

బ్రిటిష్ హైకమిషనర్‌గా ఉన్న రైట్ ఆనరబుల్ **మాల్కమ్ మాక్ డొనాల్డ్ తండ్రి రామ్సే మాక్‌డొనాల్డ్** మేము ఆక్స్‌ఫర్డ్‌లో ఉన్నప్పుడు బ్రిటిష్ పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకునిగా ఉన్నారు. ఆయన సివిల్ సర్వీసులకు భారతీయ పద్ధతిలో తర్ఫీదునివ్వాలని తొలి పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యునిగా కోరారు. ఆయన బ్రిటిష్ సోషలిస్ట్ నాయకుల్లో ప్రముఖుడు. లేబర్ పార్టీ అధికారంలోకి రాగానే ఆయన ప్రధాని పదవి చేపట్టారు. 1920 తర్వాత భారతదేశంలో లేబర్ పార్టీ ఆర్డినెన్స్ రాజ్యాన్ని ప్రవేశపెట్టింది. అది జాతీయవాదుల్ని నిరాశకు గురిచేసింది. మరింత ఉదారంగా వాళ్ల ప్రభుత్వం వ్యవహరించాలని కోరుతూ నా ప్రయత్నాలు నేను కొనసాగించాను.

అయితే లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చీరాగానే రాజ్యాన్ని కుంచింపజేయడం కుదరదు కనుక లేబర్ పార్టీకి మరికొంత సమయం కావాలనే అభిప్రాయంలో ఆయన ఉన్నారు. 1930లో తొలి రౌండ్ టేబుల్ సమావేశం సందర్భంగా కూడా నేను ఆయన్ను కలిశాను. అయితే ఆయన భారతదేశానికి నిరాశను మిగిల్చినట్లుగానే 1931లో వాళ్ల పార్టీకి నిరాశనే మిగిల్చాడు. ఆయన చేయలేని పనిని ఆయన జూనియర్ **క్లెమెంట్ అట్లీ** 1947లో చేసి చూపించాడు.

చిన్న దేశాల స్వాతంత్ర్య సాధనకు ఇప్పటికైనా ప్రపంచం సానుకూలంగా స్పందిస్తుందా? ఈజిప్ట్‌పై 1956 నాటి దాడుల, 1956లో లెబనాన్, జోర్డాన్‌లపై దాడుల మాటేమిటి? హంగరీని రష్యా కబళించాలని చూసే మాటేమిటి? జాతి వివక్షకు అంతం ఎన్నడు? హిమాలయాల నుండి చైనా వెనుదిరిగేదెన్నడు? కనుక **నేను ఆక్స్‌ఫర్డ్‌లో చదివేనాటి మాదిరిగానే నేటి యువతకు చేతినిండా పనుంది.**

వాళ్లు జాతుల స్వాతంత్ర్యం కోసం, మానవ హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తూ ఉండాల్సిందే. అందువల్లనే నేను **-'ప్రపంచ రాజ్యం'** అనే భావనను సమర్థిస్తాను. **ఇదే నా జీవిత అభిలాష.**

5

1933-36 నాటి ప్రజా ఉద్యమాలు

1931లో నేను రెండు పర్యాయాలు సుభాష్ బాబు (సుభాష్‌చంద్రబోస్)ను కలసి ఆర్థిక, సామాజిక అభివృద్ధి విషయంలో సుదీర్ఘ చర్చలు జరిపాను. నేను దక్షిణభారతంలో నిర్వహిస్తున్న కిసాన్ ఉద్యమం పట్ల ఆయన శ్రద్ధ చూపారు. ఉత్తర భారతదేశంలో కూడా అటువంటి ఉద్యమం నడిపే అవకాశాల గురించి ఇద్దరం చర్చించాం. నేను వెంకటగిరిలో ప్రారంభించిన జమీందారీ వ్యతిరేక విధానపు బలం ఆయన్ను ఆకట్టుకుంది. ప్రభుత్వానికి, రైతులకు మధ్య దళారీలు ఉండరాదన్న నా ఆలోచనని ఆయన స్వాగతించారు. ఆయన స్నేహశీలేగాక మంచి సంభాషణా చతురుడు కూడా.

అప్పటి భారత జాతీయ కాంగ్రెస్ సందర్భంగానే నేను డాక్టర్ హరదీకర్, కీర్తిశేషులు

నిడుబ్రోలులో రైతు శిక్షణా సంస్థ

బులును సాంబమూర్తివంటి సేవాదళ ఉద్యమ నాయకుల్ని కలిశాను. **రైతు ఉద్యమంతోపాటు సేవాదళ ఉద్యమాన్ని కూడా నడపాలనే ఆలోచన చేశాను.** 1930-34 మధ్య నెలకొన్న ఆర్థిక మాంద్యంలో రుణ విరామం ప్రకటించాలని వాదించాం. 1931 కాంగ్రెస్ సభలకు సర్దార్ పటేల్ అధ్యక్షుడు. ఆయన బార్డోలి కిసాన్ సత్యాగ్రహ వీరుడు.

నేను గాంధీజీతో ఆ సభల పట్ల నా పూర్తి సంతృప్తిని ప్రస్తావించాను. ఆయన నన్ను జవహర్‌లాల్, సుభాష్‌లకు సహకరిస్తూ ముందుకు సాగమన్నారు. వారిరువురకూ ప్రజల పట్ల ప్రేమ కలదన్నారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రధాన పాత్ర పోషించగలరన్నారు.

కరాచీలో **'సింధ్ అబ్జర్వర్'** అనే శక్తిమంతమైన పత్రికా సంపాదకులు **కోటంరాజు పున్నయ్య** గారిని కలిశాను. ఆయన 1920ల్లో అక్కడకు వెళ్లి స్థిరపడిపోయారు. 1930లో ఇంగ్లండ్‌లో నా కృషిని, కేంద్ర అసెంబ్లీలో నా పనితీరును ఎంతగానో మెచ్చుకున్నారు. అటువంటి మెచ్చుకోళ్లే స్వాతంత్ర్య సమరయోధులకు కావాల్సింది.

గాంధీ-ఇర్విన్ పాక్ట్ చర్చల్లో పాల్గొనమని నన్ను పలువురు ఆంధ్రకు చెందిన కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు. నన్ను రెండో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు ప్రతినిధిగా ఎన్నుకున్నారు. అయితే అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యుణ్ణవుతాననే నమ్మకం కుదరలేదు. ఆనాటి ఒత్తిడి అటువంటిది. జైళ్ల నుంచి వచ్చిన వారంతా అటువంటి ప్రత్యేక స్థాయిని కోరుకుంటున్నారు.

ఆ సభలు జరిగింది బ్రిటిష్ ప్రభుత్వం **భగత్‌సింగ్**ను ఉరితీయాలని నిర్ణయించిన వెంటనే. గాంధీజీ దయాభిక్షపెట్టి ఆ దేశ భక్తునికి విధించిన మరణదండన శిక్షను రద్దు చేయమని కోరాడు. అప్పట్లో సామ్రాజ్యవాదుల కిరాతక చర్యలు ప్రగతివాదుల పట్ల అలా ఉండేవి. గాంధీజీ విన్నపాన్ని వాళ్లు పెడచెవిన పెట్టారు.

భారత కమ్యూనిస్ట్ పార్టీ మీరట్ ఉదంతం తర్వాత రూపుదిద్దుకుంటున్నది. వారు భగత్‌సింగ్ బలిదానాన్ని, రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు హాజరుకావాలన్న గాంధీజీ అభిమతాన్ని అనుకూలంగా మలుచుకోదలిచారు. సుభాష్ చంద్రబోస్ గాంధీ-ఇర్విన్ ఒప్పందాన్ని తీవ్రంగా విమర్శించాడు. ఆయన కాంగ్రెస్‌ను రిపబ్లికన్ పార్టీగా మార్చదలిచాడు. బొంబాయి-కరాచీ మధ్య సాగిన సాగర యాత్ర చాలా బాగా సాగింది. వందలాదిమంది కాంగ్రెస్‌వాదులు ఒకే స్టీమర్‌పై కలసి ప్రయాణం చేస్తున్నారు.

వర్తమాన విషయాలను చర్చించుకునేందుకు అదొక మంచి వేదికగా మారింది. స్వాతంత్ర్యం అందిపుచ్చుకునేంత దగ్గరలో ఉందనే భావనలతో, అప్పుడే జైళ్ల నుండి బయటకు వచ్చినవాళ్ల అనుభవాలతో అంతా కోలాహలంగా ఉంది. అనేక ప్రాంతాల్లో కాంగ్రెస్‌వాదుల మధ్య విభేదాల గుసగుసలూ వినిపించాయి. అయితే తిరుగు ప్రయాణంలో నేను ఎడారివాసుల సమస్యలు పరిశీలించాలనే ఉద్దేశ్యంతో రైలులో ప్రయాణించాను.

ఆ మహాసభలు గాంధీ మార్క్ రాజకీయ విధివిధానాలపై చెరగని ముద్ర వేశాయి. ఆ సమావేశాల్లోనే గాంధీజీ ఇలా వ్యాఖ్యానించాడు : **'గాంధీ మరణించవచ్చు, కానీ గాంధీయిజం అంతమొందదు'.** నేను గాంధీజీ విధానానికి కట్టుబడి ఉన్న కారణాన ముందుగా బ్రిటిష్‌వాళ్లు భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తేనే రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు మద్దతు పలికేది అన్న బోసు భావన నాకు రుచించలేదు.

లాహోర్‌లో లజపతిరాయ్ భవన్‌కు వెళ్లి ఆ మహా నాయకునికి శ్రద్ధాంజలి ఘటించాను. నేను ఆయన్ను ఆక్స్‌ఫర్డ్‌లో కలసిన సందర్భాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నా. 1920లో ఆయన అక్కడ నిర్వహించిన రాజకీయ శిక్షణా కేంద్రాన్ని నేను ఆంధ్ర ప్రాంతంలో నిర్వహించదల్చాను. అక్కడి ప్రసిద్ధమైన కోటలు, మసీదులు సందర్శించాను. నాకు తోడుగా అనకాపల్లికి చెందిన వీర్రాజు ఉన్నాడు. నాయక గణం ఐకమత్యంతో నడుచుకుంటే అక్కడి వీరుల స్ఫూర్తితో త్వరలోనే విజయం సాధించవచ్చుననుకున్నాను.

1930 నుండే ధరలు పడిపోతున్నా 1931వ సంవత్సరం మధ్యకాలానికిగాని దాని ప్రభావం రైతులకు, వృత్తిపనివాళ్లకు సోకలేదు. గ్రామీణ రుణ గ్రహీతలపై తమ బకాయిల చెల్లింపుల కోసం బ్యాంకుల ఒత్తిడి పెరిగింది. అప్పు తీసుకున్నవాళ్లను నిర్బంధించవలసిందిగా కోర్టులలో దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. వేలం పాటల్లో గౌరవనీయులైన అనేకమంది రైతులు పొలాలు కోల్పోయి దివాళా తీశారు. ఇందులో వాళ్ల తప్పేమీ లేదు. బంగారం మార్కెట్‌లోకి కుప్పలు తెప్పలుగా వచ్చిపడింది. ఎటుచూసినా దైన్యమే దైన్యం.

మే-జూన్ 1931 ప్రాంతంలో కీర్తిశేషులు గూడవల్లి రామబ్రహ్మంగారు ఆంధ్ర రైతు రక్షణ సమస్యను తెనాలిలో ఏర్పాటుచేశారు. నేను దానికి అధ్యక్షత వహించాను. కోర్టుల్ని ప్రభావితం చేయాలనే ఉద్దేశ్యంతో నేను నా ప్రసంగాన్ని ఆంగ్లంలో తయారుచేసి ఆచ్చొత్తించి న్యాయాధీశులకు పంపడం జరిగింది. ఆ సంక్షోభంలో మారిటోరియం

(చెల్లింపుల నిలుపుదల) ప్రకటించి రైతులను ఆదుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేయడం జరిగింది. వ్యక్తిగత వారెంట్లు రైతుల విషయంలో జారీ చేయవద్దని, వ్యవసాయ పనిముట్లు, పశువులు, ఆహార ధాన్యాలు, వంట సామాగ్రి, స్త్రీల పుస్తెలవంటివి జప్తు చేయవద్దని, అప్పులు తీర్చడంలో రైతులకు తగిన సమయాన్ని మంజూరు చేయాల్సిందిగా కోరాను. అటువంటి సభ నిర్వహించడం భారతదేశంలో అదే ప్రథమం. **నా వాదనలు రైతుల గుండెల్లో ప్రతిధ్వనించసాగాయి.** ప్రభుత్వం పెడచెవిన పెట్టినా న్యాయస్థానాలు కాస్త పట్టించుకోవడం జరిగింది.

నేను ఆ సందర్భంగా రైతులకు చెప్పిందేమంటే నిస్సహాయులుగా మారవద్దని, ఆర్థిక మాంద్యం అనేది ప్రపంచ వ్యాప్తంగా పట్టి పీడిస్తోందని. కనుక **అప్పు తెచ్చిన ప్రతి రూపాయి వెంటనే ఎలా చెల్లించాలనే ఆత్రుత అక్కర్లేదని చెప్పాను.** వాళ్ల ప్రథమ కర్తవ్యం – కుటుంబ పోషణ, జీవనాధారాన్ని నిలబెట్టుకోవడం, స్వేచ్ఛా జీవులుగా మనగలగడం.

అటువంటి రైతు సభలు అనేకం జిల్లా, తాలూకా స్థాయిల్లో ఆంధ్రదేశమంతటా నిర్వహించడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో నూతన జాగృతి, మారటోరియం అనే పదం బహుళ ప్రచారం పొందింది. ఆ ఉద్యమం 1937-38 వరకూ కొనసాగింది. ఆ కాలం కాంగ్రెస్ వారు మంత్రి పదవుల్లో ఉన్న కాలం. మెల్లగా ఈ ఉద్యమం 1935లో మేమూ, ఇంకా కొంతమంది కలసి ఏర్పాటుచేసిన దక్షిణ భారత రైతు కూలీ ఐక్య సంఘటన చేపట్టింది. తర్వాత అది మెల్లగా 1936 నాటి అఖిల భారత కిసాన్ సమ్మేళనంలో భాగమైంది.

మద్రాస్ రాష్ట్ర ప్రీమియర్‌గా ఉన్న సి.రాజగోపాలాచారి గారి సాహసోపేత చర్యల కారణంగా ప్రభుత్వం దాన్ని పట్టించుకుంది. అయితే అప్పటికే నాల్గింట మూడు వంతులమంది సన్నకారు రైతులు తమ భూముల్ని పోగొట్టుకున్నారు. మధ్యతరగతికి చెందిన రైతుల భూమిలో సగభాగం పోనేపోయింది. ఏదిఏమైనా **1931 నాటి తెనాలి సభ భారతదేశంలోని రైతులను జాగృతపర్చ గలిగింది.**

భూమిశిస్తు పెంపుదలకు వ్యతిరేకంగా ఆందోళన

మారటోరియంతోపాటు నేను 18.75 శాతం పెంచిన భూమిశిస్తుకు వ్యతిరేకంగా ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో పోరాటం చేయాల్సి వచ్చింది. అప్పటి మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు చెందిన **రీసెటిల్‌మెంట్ ఎకనామిక్ ఎంక్వయిరీ కమిటీ** కార్యదర్శిగా

నేను అటువంటి శిస్తు పెంపునకు వ్యతిరేకంగా నివేదిక సమర్పించాను. అప్పుడు ప్రభుత్వ నిర్ణయాన్ని, మూడు సంవత్సరాల క్రితం బార్డోలీ రైతుల పునరావాస విషయంలో నా నివేదికను ఒక హైకోర్టు జడ్జి ముందుంచమన్నాను. బొంబాయి ప్రభుత్వం అలాగే చేసింది. నా విన్నపాన్ని ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. కనుక అటువంటి ఏకపక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని ముమ్మరం చేశాను. విజయవాడకు చెందిన **కాట్రగడ్డ మధుసూదనరావు**, దివిసీమకు చెందిన **గొట్టిపాటిబ్రహ్మయ్య**, పశ్చిమ గోదావరికి చెందిన **డి.నారాయణరాజు**, రాజమహేంద్ర వరానికి చెందిన **వి.సత్యనారాయణ** వంటి వారెందరో నాతో కలసి రైతుల పక్షాన నిలిచారు. మేమంతా గ్రామ స్థాయిలో కిసాన్ కమిటీలు ఏర్పాటుచేసి వాటికి స్వచ్ఛంద సేవకుల్ని సమకూరుస్తూ నెలల తరబడి గట్టిగా కృషి చేశాం. బార్డోలీ రైతు సత్యాగ్రహంలో పాల్గొన్న గాంధీజీ అనుయాయులు కొందరిని మా జిల్లాలకు ఆహ్వానించాం. వారి సందేశాలు ప్రజలకు అందేటట్లు చేశాం. ఆ విధంగా **మా ఉద్యమం శిస్తు నిరాకరణ ఉద్యమ ప్రారంభానికి నాందీ ప్రస్తావన అయ్యింది.** అదృష్టవశాత్తూ అప్పటి కాంగ్రెస్ అగ్ర నాయకులు దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు, అయ్యదేవర కాళేశ్వరరావువంటి వారి మద్దతు ఈ ఉద్యమానికి లభించింది. మధ్యేవాదులు కూడా మాకే మద్దతు పలకడంతో మా శక్తిని గ్రహించిన కేంద్ర ప్రభుత్వం మేము తలపెడతామనుకున్న శిస్తు నిరాకరణ సత్యాగ్రహానికి వ్యతిరేకంగా ఒక ఆర్డినెన్స్‌ను జారీచేసింది. (18.75 శాతం శిస్తు పెంపుదల విషయంలోనే మేము అంతటి ఉద్యమాన్ని నిర్వహిస్తే తర్వాత కొంతకాలం పోయాక కాంగ్రెస్‌కు చెందిన ఆంధ్ర మంత్రి వర్గం భూమి శిస్తును నూటికి నూరు శాతం నుండి మూడు వందల శాతం వరకూ పెంచింది. సర్దార్ గౌతు లచ్చన్న నాయకత్వంలో ఆంధ్ర స్వతంత్ర పార్టీ కోర్టుల్ని ఆశ్రయించగా ప్రభుత్వ నిర్ణయం న్యాయ సమ్మతం కాదన్నది సుప్రీంకోర్టు).

హక్కుల సాధనలో ఆంధ్ర ప్రాంత రైతులు ముందున్నారు. వీరు సాధించినన్ని హక్కులు ఉత్తర హిందూస్థానీ రైతులు సాధించలేకపోయారు. అందువల్లనే వాళ్లల్లో అధికంగా నిస్సహాయత, రాజకీయంగా, ఆర్థికంగా వెనకబాటుతనం ఉండేది. మద్రాస్ ప్రాంతంలో జమీందారీ వ్యవసాయ రైతులు కోరేదేమంటే కౌలు తగ్గింపు, అదువులపై అధిక హక్కులు, పుల్లరి తగ్గించడం, వాళ్ల భూముల్ని సర్వే చేయడం, వ్యవసాయానికి నీటి వనరులు కల్పించడం. వీటితో వాళ్లు సంతృప్తి చెందుతారు. అయినా కొందరు జమీందార్లు రాజుల్లా ప్రవర్తించేవాళ్లు, ప్రజల్ని శిక్షించేవాళ్లు. నేను ప్రజలకు ఆ దళారీ వ్యవస్థపై

తిరగబడడం నేర్పాను. జమీందారీ విధానం రద్దుకు ఒరిస్సాలో కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా పనిచేసిన **బిశ్వనాథ్ దాస్** వంటివారు నా సాహసోపేత దాడికి మద్దతు పలికారు. ఈ సరికొత్త కార్యావళికి వాళ్లు బాగా చేయూతనిచ్చారు.

1931లో నెల్లూరు జిల్లా రైతు సదస్సు కొవ్వూరు తాలూకాలోని అల్లూరులో నిర్వహించారు. అక్కడ జమీందారీ రైతుల ఆచూకీ కమిటీ నొకదాన్ని ఏర్పాటుచేశారు. దానికి నేను అధ్యక్షుణ్ణికాగా జమీన్ రైతు వారపత్రిక సంపాదకులు నెల్లూరు వెంకట రామానాయుడు కార్యదర్శిగా, **పి.వి.సుబ్బారెడ్డి. ఎం.సీతారామరెడ్డి** సభ్యులుగా వుండేవారు. అప్పట్లో జమీందారీ జులుం ఎంతగా ఉండేదంటే మేము ఎంక్వయిరీకి వెళితే ఆ భయంతో రైతులు స్పందించేవారు కాదు. అయితే వెంకటగిరి జమీందారీ కుటుంబాలకు వారసులైన **కటికినేని సోదరులు** మాకు అక్కడ నిలిచేందుకు నీడనిచ్చి రైతు సోదరులను ప్రోత్సహించడంతో తమ సాధకబాధకాలు చెప్పేందుకు ముందుకొచ్చారు. వెంకటగిరి జమీందార్లకు జిల్లాలో మూడింట ఒకవంతో, నాల్గింట ఒక వంతో భూమిపై శిస్తు వసూలు హక్కు ఉండేది. ఆ జమీందారీ బ్రిటిష్ ప్రభుత్వానికి ఒక ప్రధాన అంగమా అన్నట్లుగా ఉండేది. అందువల్లనే ఎస్టేట్ చట్టానికిలోబడి వాళ్లు అధికారం చలాయిస్తూ ఉండేవారు. చాలామంది ఆ కోట ప్రభుత్వానిదే అనుకునేవారు.. జమీందారే ప్రభువు అనుకునేవాళ్లు. ఆయన సన్మానించినా, శిక్ష వేసినా అదంతా రాచరికంగానే భావించుకునేవాళ్లు. కనుక వెంకటగిరి చుట్టుపక్కల గ్రామాల్లో, సూళ్లూరుపేట తాలూకాలో మా ఎంక్వయిరీ పెద్ద దుమారమే లేపింది. రాజా వారి స్నేహితులకు మా కార్యక్రమం నచ్చలేదు. అడ్డంకులు కల్పించేందుకు పూనుకున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులతో చేతులు కలిపారు. ఇదంతా మాకు రైతుల్ని కూడగట్టేందుకు అనుకూలంగా మారింది. రైతు స్వేచ్ఛను ప్రకటించేందుకు ఆంధ్ర రాష్ట్ర జమీందారీ రైతు సదస్సు వెంకటగిరిలోనే నిర్వహించేందుకు అనేకమంది రైతులు ముందుకొచ్చారు.

అప్పటివరకూ రాజకీయ కార్యకర్తల్లో బహుకొద్దిమంది మాత్రమే ఎదురు నిలువగలిగేవాళ్లు. అందుకు కారణం చట్ట సభలపైనా, వార్తా పత్రికలపైనా, బహిరంగ సభలపైనా మేధావుల్లో, కవుల్లో, పండితుల్లో జమీందారులకు గల పట్టే. ప్రగతిదాయక ఆలోచనలు గల రైతులకు అర్థమైంది నేనెటువంటి ప్రమాదకరమైన కార్యాన్ని తలకెత్తుకున్నానో. అందువల్ల వాళ్లంతా మరింతగా ఉత్సుకతను చూపసాగారు.

అటువంటి నేపథ్యంలో వెంకటగిరిలో రాష్ట్ర సదస్సు ఏర్పాటుచేయడం జరిగింది.

ప్రసిద్ధ పార్లమెంటేరియన్ కీర్తిశేషులు **సత్యమూర్తి, దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు, బిశ్వనాథ్ దాస్**వంటివారు ఆ సభలకు హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వెలిబుచ్చారు. బ్రిటిష్ అధికారానికి వత్తాసు పలికే జమీందారీ విధానం రద్దుకై ముందుకు సాగాలన్నారు.

రాజకీయ సభ కార్యక్రమానుసారంగా గొప్పగా సాగింది. జమీందారీ రైతు సదస్సు కూడా బహిరంగ ప్రదర్శనలు, సభలు లేకుండానే రాజకీయ సభ జరిగిన ప్రాంగణంలోనే నిర్వహించుకున్నాం. ఆ విషయం తర్వాత రోజు ఉదయం జిల్లా అధికారులకు తెలియజేశాం. వాళ్లు తీసుకునే ఏ చర్యకైనా సిద్ధమేనన్నాం. మద్రాస్ నుండి వెలువడే పత్రికలు మా సదస్సుపై నిషేధాన్ని దుయ్యబట్టాయి. అప్పట్లో లెజిస్లేటివ్ కౌన్సిల్ సమావేశాలు జరుగుతున్నాయి. జమీందారుల్ని బలపర్చేందుకు ప్రభుత్వం అపవిత్రంగా చూపే ఆతురత పట్ల కౌన్సిల్ బాగా ఆక్షేపించింది. ఆ విధంగా మాపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా అధికారుల చేతులు కట్టివేసినట్లయ్యింది. **ఆ సభలో జమీందారీ వ్యవస్థ రద్దుకు నా ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించారు.** ఆ తర్వాత దశాబ్దంలో అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ దాన్ని ఆమోదించేటట్లు చేయగలిగాను. 1946 నాటికి కాంగ్రెస్‌వాదులందరూ దానికి అంగీకారం తెలిపేటట్లు చేయగలిగాను.

వెంకటగిరిలో సభ విజయవంతంగా నిర్వహించిన తర్వాత అడవుల్లో హక్కుల విషయంలో జమీందార్ల మనుషులు రైతుల్ని వేధించ సాగారు. రైతులు వాటిని వ్యతిరేకిస్తూ నా సలహా కోరారు. న్యాయ సలహా పొంది **మేము వెంకటగిరి అటవీ సత్యాగ్రహానికి సంసిద్ధమయ్యాం.** మద్రాస్ పత్రికలు మాకు మద్దతు పలికాయి. ఉత్తర భారతదేశపు పత్రికలు కూడా అఖిలభారత స్థాయిలో ఆ సమస్య తీవ్రతను గుర్తించాయి. అయితే బీహార్, బెంగాల్, ఉత్తరప్రదేశ్, సెంట్రల్ ప్రోవిన్స్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ఎక్కువమంది కొద్ది స్థాయిలోగానీ, పెద్ద స్థాయిలో కానీ జమీందారులే. కనుక వాళ్లకు రైతుల కష్టాలు పట్టవు. ఇక్కడి మాదిరిగా రైతుల్లో అక్కడ చైతన్యం ఉండదు. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ ఆవిర్భావం, జమీందారీ రైతుల ఆర్థిక స్థితిగతులపై నా ఆంగ్ల గ్రంథం అచ్చయిన తర్వాతనే బీహార్ రైతులు తమ ఆర్థిక దుస్థితికి కన్నీర చేయగలిగారు. ఇది 1935 నాటి మాట. కృష్ణా, గోదావరి జిల్లాల రైతు సంఘాలు శిస్తు పెంపు విషయంలో మచిలీపట్నంలో ఉన్న రెవెన్యూ బోర్డు సభ్యుణ్ణి కలిసి మాట్లాడమని కోరడంతో నేను మచిలీపట్నానికి బయలుదేరుతూ అక్కడ నాకు ఆలస్యమైనా వాళ్లను ముందుకు సాగమని

సలహా ఇచ్చి బయలుదేరాను.

నేను మచిలీపట్నంలో రెవెన్యూ బోర్డు సభ్యుణ్ణి కలిసి ఆయనకు రైతుల సమస్యను వివరించాను. నేను వెంటనే వెంకటగిరి బయలుదేరి వెళ్లాల్సి ఉంది. హుటాహుటిన బెజవాడ వెళ్లి అక్కడ పన్నులు చెల్లించవద్దనే ఆందోళనకారులకు సలహా ఇచ్చి గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు వెళ్లేందుకు బెజవాడ స్టేషన్‌కు చేరుకున్నా. రైలెక్కబోయే నన్ను నిర్బంధించి స్థానిక మెజిస్ట్రేట్ శివశంకర్ ముందు హాజరుపర్చారు. ఒక సంవత్సరంపాటు తిరుగుబాటును ప్రేరేపించే ప్రసంగాలేవీ చేయనని హామీ ఇవ్వమన్నారు. నేను అది ఇచ్చేందుకు నిరాకరించడంతో సబ్ జైలుకు పంపారు. అప్పుడు నన్ను ఆలింగనం చేసుకుని మద్దతు పలికిన పెదవడ్లపూడి ఇరిగేషన్ సొసైటీ నాయకుణ్ణి జైలు నుండి తిరిగి వచ్చి చూసే భాగ్యం నాకు కలుగలేదు. ఎందుకంటే ఆయన మరణించారు.

వెంకటగిరి కిసాన్ సత్యాగ్రహం

అనుకున్న ప్రకారం వెంకటగిరి సత్యాగ్రహం ప్రారంభమైంది. కృష్ణా జిల్లాలో కాంగ్రెస్ సత్యాగ్రహుల్లో అనుభవం గడించినవారు కొందరు అక్కడకు వెళ్లి మొదటివారంలో వాళ్లకు మార్గదర్శనం గావించారు. అయితే అప్పటి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులైన **బెజవాడ గోపాలరెడ్డి** తమకూ, వెంకటగిరి సత్యాగ్రహానికి ఎటువంటి సంబంధంలేదని ప్రకటించడం మా అందరినీ నిరాశకు లోనయ్యేటట్టు చేసింది. జమీందారు మనుషులు ఆ ప్రకటన విషయంలో వేలకొద్దీ కరపత్రాలు అచ్చొత్తి గ్రామాల్లో పంచారు. అది ఓ రకంగా అనుకోని దెబ్బ మా సత్యాగ్రహానికి.

వెంకటగిరి సత్యాగ్రహం కొద్ది నెలలు సాగింది. మోపూరు ప్రాంత ప్రజలు వెన్నుదన్నుగా నిలిచారు. తీర్థంపాడుకు చెందిన **పి.గోవిందా రెడ్డి** పాత్ర ప్రశంసనీయం. పశువుల వేలం, తోటల్ని ధ్వంసం చేయడం, వాముల్ని తగలబెట్టడంవంటి దుశ్చర్యలకు అధికారులు పాల్పడ్డా రైతులు మాత్రం నిరుత్సాహపడలేదు. ప్రభుత్వం జోక్యం చేసుకుని జమీందారీ అధికార వర్గానికీ, రైతులకూ మధ్య రాజీ కుదర్చాల్సి వచ్చింది. రైతులు అటవీ సంపదపై హక్కుల్ని తిరిగి సాధించుకున్నారు. వీటన్నింటికీ మించి వాళ్లు సరికొత్తగా ఆత్మ స్థయిర్యాన్ని, స్వయం సమృద్ధిని సాధించారు. రైతు సంఘానికి జమీందారు గుర్తింపునిచ్చాడు. నా నాయకత్వంలో వాళ్లు విశ్వాసాన్ని ఉంచి భారతదేశపు

రైతులపై నా ప్రభావం వృద్ధి చెందేందుకు కావాల్సిన పునాదులు వేశారు.

నాకొక సంవత్సరంపాటు కఠిన కారాగారవాసం, ఐదొందల రూపాయల జరిమానా విధించిన మెజిస్ట్రేట్ ఆక్స్‌ఫర్డ్‌లో నాకు జూనియర్. నా వాక్పటిమను శ్లాఘించాడు. నా త్యాగశీలతను మెచ్చుకున్నాడు. తర్వాత శతాబ్దాల్లో ఆయన నాకు మంచి మిత్రునిగానే మెలిగాడు. ఆయన ఒక నిజాయితీపరుడైన, సమర్థుడైన ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేశారని నాకు అనిపించింది. క్లిష్ట సమయాల్లో నాగార్జున సాగర్ ప్రాజెక్టును ముందుకు నడిపేందుకు మా మైత్రి అక్కరకు వచ్చింది.

తొలిసారి కారాగారవాసం

'లైఫ్ అండ్ థాట్స్ ఆఫ్ ఎ పొలిటికల్ ప్రిజనర్' (రాజకీయ ఖైదీ జీవితం, ఆలోచనలు) అనే నా పుస్తకంలో జైలు జీవితం గురించి రాశాను. ఇక్కడ రెండు సంఘటనలను ప్రస్తావించి సంతృప్తి చెందుతాను. రైల్వే ప్లాట్‌ఫాం మీద నిలబడ్డ భారతీదేవి గారు చాలా ఆందోళనకరంగా కనిపించారు. అది చూసి మిగతా మిత్రులంతా విచారగ్రస్తులయ్యారు. చిరునవ్వు చిందించి ఆకాశంలో చంద్రోదయం అయ్యేటట్టు చూడమని ఆమెను కోరాను. ఆమె అప్పుడు నవ్వు ఆపుకోలేకపోయింది. అందరిలో ఆనందమే ఆనందం. అంతలో రైలు బయలుదేరింది.

నన్ను ప్రభుత్వం జైలుకు పంపిన తర్వాత ఆమె వెంకటగిరి రైతుల పక్షాన నిలిచింది. వెంకటగిరిలో ఆమె పాల్గొన్న సభలో జమీందారు పక్షంవాళ్లు రాళ్లు రువ్వగా ఆమెకు బాగా గాయమైంది. ఆమె ఒక నెల రోజులపాటు గోదావరి, కృష్ణా జిల్లాల్లో దేశభక్తులైన రైతులతో కలసి రైతు యాత్రలు నిర్వహించింది. ఆమెకు తోడుగా **ఎం.చుక్కమ్మ** గారు ఉండేవారు. రైతు కుటుంబాల్లోని స్త్రీలను సత్యాగ్రహం పిలుపు వినబడితే పాల్గొనమని కోరారు. పది రోజుల గెరిల్లా పోరాటం తర్వాతగానీ ఆమె పోలీసుల చేతికి చిక్కలేదు. మా అందరినీ నెల్లూరు జైలులోనే ఉంచారుకానీ జైలు గోడలు మమ్మల్ని వేర్వేరుగా ఉంచాయి.

అఖిలభారత కాంగ్రెస్ కమిటీకి నా ఎన్నిక - జవహర్ వైఖరి

రానున్న ఇరవై సంవత్సరాల్లో నా కాళ్లకు పడే బంధాలు ఎలా ఉండబోతాయో 1931 నాటి ప్రొవెన్షియల్ కాంగ్రెస్ కమిటీ ఎన్నికల్లోనే తెలిసివచ్చింది. కమిటీ

సమావేశం విశాఖపట్నంలో. కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవలసి ఉంది. అందరినీ కొత్తవాళ్లను ఎన్నుకోవాలనే కాంక్ష ప్రబలంగా ఉంది. నాకు ఎవరి పట్ల అభిమానంగానీ, దురభిమానంగానీ లేవు. మార్పును కోరుకునే వారంతా నన్ను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సభ్యుణ్ణి చేయాలనుకున్నారు. కనుక మార్పును కోరే వర్గంలోకి నన్నూ చేర్చేశారు. అయితే జైలు నుండి తిరిగి వచ్చిన మా జిల్లాకు చెందిన అనేకమంది అఖిలభారత కాంగ్రెస్ కమిటీ (ఎ.ఐ.సి.సి)లో సభ్యులు కావాలని తీవ్రంగా పోటీపడుతున్నారు. వారంతా నాపై కోపాన్ని ప్రదర్శిస్తున్నారు. అయితే అన్ని జిల్లాల, అన్ని కులాల సభ్యులు నా అభ్యర్థిత్వానికి మద్దతు పలుకసాగారు. కనుక నేను అత్యధిక మెజార్టీతో గెలుపొందాను. అందులో నా తప్పు ఏమీ లేకపోయినా ఓడిపోయినవాళ్లంతా పగవాళ్లయ్యారు. నన్ను జైలుకు పంపేముందు నేను ఒకే ఒక్క ఎఐసిసి సమావేశానికి హాజరయ్యాను.

సమావేశం బొంబాయిలో జరుగుతున్నది. ప్రాథమిక హక్కుల కరాచీ చార్టర్‌కు తుది మెరుగులు దిద్దాల్సి ఉంది. **బ్రిటిష్ ప్రభుత్వాన్ని మనం ఎంతగా వ్యతిరేకించాలో అంతగా జమీందారీ విధానం రద్దును వ్యతిరేకించేందుకు సిద్ధం కావాలన్నాను. జవహర్‌లాల్ నెహ్రూ దాన్ని అంగీకరించేందుకు సిద్ధంగా లేడు.** ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లకు చెందిన ఎఐసిసి సభ్యులు జమీందార్లు అయినందువల్ల నా ప్రతిపాదన వాళ్లకు రుచించదు. మహాత్మాగాంధీ ఎఐసిసి సభ్యునిగా నా ప్రతిపాదనను కొనియాడారు. దాని సాధన కోసం మరికొంత సమయం వేచి వుండాలని హెచ్చరించారు. నెహ్రూ మిగతా వాళ్లతో సఖ్యత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. **కమలాదేవి ఛటోపాధ్యాయ** నేను ప్రతిపాదించిన సవరణలను బలపర్చింది. అనేకమంది సోషలిస్ట్‌లు కూడా నన్ను మెచ్చుకుని స్నేహహస్తం అందించారు.

గ్రామ పంచాయతీ ఉద్యమానికి నా తోడ్పాటు

1933-35 సంవత్సరాల మధ్యకాలంలో నేను గ్రామ పంచాయతీల ఏర్పాటు వుద్యమానికి అధిక సమయాన్ని వెచ్చిస్తూ ప్రత్యేక శ్రద్ధ చూపేవాణ్ణి. ఈ కార్యక్రమంలో నాకు **పి.వి.నరసింహారావు** తోడ్పాటు ఉండేది. నాకు గ్రామ పంచాయతీలపై విశ్వాసం ఆక్స్‌ఫర్డ్‌కు వెళ్లకముందు నుండే ఉండేది. బౌద్ధయుగంలోనే భారతీయులకు ఇటువంటి అవగాహన ఉండేది. చోళుల కాలంలోనే భారతదేశం గ్రామీణ స్వయంపాలక సంస్థలకు

పెట్టింది పేరు. **ఇంగ్లండ్‌కు పారిష్‌లు అందించే సేవలు గ్రామ పంచాయతీల ద్వారా భారతీయులకు లభించాలని కోరుకునేవాడిని.** నాకు ఈ ఉద్యమంలో **ఎన్.గోపాలస్వామి అయ్యంగారి** తోడ్పాటు కూడా లభించింది. ఆయన అప్పట్లో విలేజ్ పంచాయత్స్‌కి రిజిస్ట్రార్ జనరల్. స్వతంత్ర భారతంలో ఆయన రక్షణ మంత్రిగా ఉన్నారు.

సాధారణంగా ఒక గ్రామానికి పంచాయతీ బోర్డు సమకూరాలంటే కొండవీటి చాంతాడంత పద్ధతుల్ని ఆచరించాల్సి ఉంటుంది. అయితే మూడు సంవత్సరాల కాలంలో మేము మదింపు చేసిన పద్ధతిలో ఐదొందల కొత్త పంచాయతీ బోర్డులు ఏర్పాటయ్యేటట్లు చూశాం. అప్పటికే ఉన్న రెండొందల పంచాయతీ బోర్డులకు జవసత్వాలను కల్పించాం. గ్రామీణ పునర్నిర్మాణం, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వ గ్రాంట్లను రాబట్టడంవంటి కృషిని ముమ్మరం చేశాం. మేము జిల్లా, తాలూకా స్థాయిలో పంచాయతీ అధ్యక్షులకు శిక్షణా తరగతులు ఏర్పాటుచేసి ప్రభుత్వ గ్రాంట్లకు ఎస్టిమేట్లు తయారుచెయ్యడం నేర్పాం.

అధిక సంఖ్యాకుల పాలనా నియమానికి, గ్రామీణ జీవనానికి పొంతన కుదరదు

పంచాయతీ బోర్డు ఎన్నికల ద్వారా గ్రామీణ పంతాలు, వట్టింపులు, ఎక్కువ తక్కువలు, రాజకీయ కక్షలు పెచ్చరిల్లాయి. కులం, ధనం, ఓట్లు సంపాదించే తతంగాలు, అధికారాన్ని చేపట్టే పథకాలు పౌర జీవనానికి భారం కాసాగాయి. వీటి నుండి దూరం కావడమెలా అని నేను ఆలోచించసాగాను. అక్కడి వాళ్లు ఎలా ఇటువంటి ఇబ్బందుల్ని అధిగమించగలుగు తున్నారని నా ఐరోపా పర్యటనల్లో నేను జాగ్రత్తగా పరిశీలించేవాణ్ణి. **క్రైస్ వాళ్లు అల్పసంఖ్యాకులకు కూడా ప్రాతినిధ్యం ఉండేటట్టు చూసేవాళ్లు.** చోళుల కాలంలో కూడా ఆనాటి పంచాయతీ ఎంపిక పద్ధతి లాటరీ పద్ధతి అని ఉత్తర మేలూరు దేవాలయ కుడ్య శిలాఫలకం ద్వారా తెలియవచ్చింది.

ఎన్నుకున్న సభ్యుల నుండి లాటరీ పద్ధతి ద్వారా పంచాయతీ అధ్యక్షుణ్ణి ఎన్నుకునే పద్ధతిని సూచించాం. ఈ సూచన **జయప్రకాశ్ నారాయణ్**కి కూడా నచ్చడం వల్ల 1959లో అటువంటి పద్ధతి అమల్లోకి వచ్చింది. స్వరాజ్య సాధన నాటి నుండి ఉత్తర భారతదేశంలో పంచాయతీ ఉద్యమం ఊపందుకుంది. అయితే ప్రభుత్వంలోని కాంగ్రెస్ పాలకులు దాన్ని గ్రామాల్లో రాజకీయ ప్రాబల్యం సాధించుకునేందుకు వుపయోగించుకున్నారు. పైగా నిధులు ఖర్చు చేసే విషయంలో పంచాయతీ బోర్డులకు అంతగా స్వేచ్ఛ ఉండేది

కాదు. ఏయే పంటలు వేయాలి? ఫలసాయాన్ని నిల్వ చేసేదెలా? వాటిని అమ్మడమెలా అనే విషయాలపై కూడా దృష్టి పెట్టాల్సి వచ్చింది. అనుభవంలేని ఇటువంటి పనులు భారం కాసాగాయి. పంచాయతీలకు అన్ని పనులూ కట్టబెట్టాలనే ఉబలాటం గ్రామీణ సామాజిక జీవనాన్ని కలుషితం చేసినట్లయ్యింది. మేము పంచాయతీ ఉద్యమానికి కృషి చేస్తూ వచ్చిన పాతిక సంవత్సరాల తర్వాత నెహ్రూ, కాంగ్రెస్ మంత్రులు అలా గ్రామాలను అస్థిరపర్చసాగారు. ఇక ప్లానింగ్ కమిషన్ వారేమో చిన్న కమతాలవాళ్ల భూములు పంచాయతీలకు అప్పగించేటట్లు పథక రచన చేయసాగారు. వినోబా బావే గ్రామ దానం కూడా దానికి వంతపాడింది. అటువంటప్పుడు నేను గళమెత్తి జవహర్‌లాల్‌జీని, వినోబాజీని ఎదుర్కొని తగిన రాజకీయ ప్రతిఫలాన్ని పొందడంలో వింతేముంది?

రాజకీయాల్లో జమీందార్లకు, రైతులకు మధ్య లడాయి

1932లో నేను జైలు నుండి విడుదలయ్యాను. వెంకటగిరి రైతులంతా అమితానందంగా ఉన్నారు. అందుకు కారణం అటవీ సత్యాగ్రహం విషయంలో పాక్షికంగా విజయం సాధించడం ఒకటైతే, రెండోది జమీందారులే వాళ్ల సహజ యజమానులనే అనాది విశ్వాసం పటాపంచలు కావడం. అక్కడ తాలూకా, జిల్లా బోర్డులకు ఎన్నికల సందర్భంగా, నేను ఒక వారం రోజులపాటు పర్యటించాను. ఎక్కడకు వెళ్లినా నాకు ఘన స్వాగతమే. పోటీ ప్రధానంగా జమీందారులు నిలబెట్టిన అభ్యర్థులకు, రైతుల పార్టీకి మధ్యనే. జమీందారుల అధికారం, డబ్బు అక్కడ పనిచేయలేదు. వెంకటగిరి, సూళ్లూరుపేట తాలూకా బోర్డులు రైతుల పార్టీ హస్తగతమయ్యాయి. రైతులే అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల్లో ఉన్నారు.

మాకు ఆ ఎన్నికల్లో విజయాన్ని చేకూర్చిన అంశాల్లో ప్రధానమైనది – నెల్లూరు **వెంకట రామా నాయుడు** (జమీన్ రైతు పత్రికా సంపాదకులు) గారి ప్రచార గీతం.

రైతు యువకులు అలా గీతాలాపన చేస్తూ గ్రామాల్లో వీధుల వెంట తిరిగారు. బహిరంగ సభల్లో గానం చేసేవాళ్లు. అది రైతులను ఏకం గావించి రైతులు నిలబెట్టిన అభ్యర్థులకు ఓట్లు పడేటట్లు చేసింది. ఆ గేయాలు 1951-52 సాధారణ ఎన్నికల్లో కృషికార్ లోక్‌పార్టీ అభ్యర్థుల ప్రచార గీతంగా కూడా వాడుకున్నారు.

ఆ గీతం ఇలా సాగుతుంది:

ఓటు పాట

(భజన చేసే విధము తెలియండి అనుమాదిరి)

రైతుకే ఓటివ్వవలెనన్నా! నీ కష్ట సుఖములు
రైతు ప్రతినిధె చెప్పగలడన్నా!
రైతునని ఓట్లడిగి తీసుక
రైతు కొంపల కూల్చు పట్లను
నీతిగాదను జ్ఞానమున నిన్
గోతిలోపల ద్రోయకుండెడు ॥ రైతుకే ॥

విందు తిండికి లొంగ వలదన్నా!
ముందు ఆకలి తీరుటెట్లన్నా
విందు తిండితొ మోసపోయి
మందమతులకు ఓట్లనిచ్చి
అందు లోభము తెలిసి వెనుకను
కుంద లాభము లేదు నిజముగ! ॥రైతుకే॥

(ఈ పాట అలా సాగిపోతూ చివరికి ఇలా ముగుస్తుంది)

ఓటు విలువ తెలుసుకొనరన్నా! ఓ
పూట తిండికె ఓటునిచ్చుట సిగ్గు చేటన్నా!
ఓటుతోనె ముందు స్వేచ్ఛా-
కోట కట్టగ వలసి యున్నది
నేటికైనను నిదుర మేల్కొని
దాటు స్వార్థము పౌరుషముతో ॥రైతుకే॥

రైతు ఉద్యమానికి గాంధీజీ ఆశీస్సులు

రైతు ఉద్యమం విజయం సాధించడం కొందరు కాంగ్రెస్ పెద్దలకు రుచించలేదు. అందువల్ల మేము జమీందారీ విధానానికి వ్యతిరేకంగా రైతు ఉద్యమాన్ని నడపడం గాంధీజీకి

ఇష్టంలేదని ఓ ముగ్గురు పెద్దలు కాంగ్రెస్ కార్యకర్తల్లో పుకార్లు లేవదీశారు. కనుక దాన్ని అరికట్టాలంటే నేను గాంధీ గారి ఆశీర్వాదాన్ని పొందాల్సి ఉంది. జనవరి 1934లో ఆయన వెంకటగిరి సందర్శించేవరకూ వేచి ఉన్నా. మేము సమావేశాన్ని జమీందారుల దాయాదుల ఇంటనే ఏర్పాటుచేశాం. అటవీ సత్యాగ్రహాలు, కొందరు లాఠీ దెబ్బలు రుచిచూసినవారు జమీందారీ వ్యవస్థతో వాళ్లెంతగా విసిగిపోయిందీ వివరించారు. ప్రభుత్వ పక్షం, జమీందారీ పక్షం కలగలసిపోయాయని మేము ఆయన్ను నమ్మించగలిగాం. మా మాటలను గాంధీజీ ఓపిగ్గా విన్నారు. 'జమీందారీ విధానం-డౌన్ డౌన్' అనే మా నినాదం విన్నారు : 'ఔను, దాని రద్దుకు కృషి చేసేందుకు మీరు అర్హులే. **అయితే మీరు సత్యాగ్రహ పద్ధతిని అనుసరించేందుకు సిద్ధమేనా?**' అని అడిగారు గాంధీజీ. రైతులంతా అంగీకారం తెలిపారు. 'మంచిది రంగా, నువ్వు ఈ రైతులతో ముందడుగు వేయొచ్చు' అన్నారు గాంధీజీ. గాంధీజీ ఆశీర్వాదం తర్వాత జాతీయ స్థాయిలో కిసాన్ ఉద్యమానికి తగిన శక్తిని సమకూర్చింది.

జమీందారీ వ్యవస్థ పనితీరుపై పరిశీలన ప్రజా ఉద్యమంగా రూపుదాల్చింది

వెంకటగిరి రైతులు ఎన్.వి.నాయుడు, కటికినేని సోదరులు, వి.రాఘవయ్యలు జైలుకు వెళ్లకూడదనే నిర్ణయం తీసుకున్నా, రైతుల రక్షణకు అండగా నిలవడంలో జమీందారీ పార్టీ చిత్రహింసలకు గురిచేసే కోర్టు వ్యవహారాలకు పాల్పడినా, అదృష్టవశాత్తూ అవి రైతుల ఆసక్తిని దెబ్బతీయలేకపోయాయి. ప్రతి జమీందారీ ప్రాంతం నుండి ఆహ్వానాలు అందసాగాయి- వారి వారి ప్రాంతాల్లో అటువంటి ఆర్థిక విచారణలు చేపట్టి వారి స్థితిగతులు, ఇబ్బందులు, అవసరాలు తెలియజేయమని.

అప్పటి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంపాదకులు సంతానం అలా ఒక రంగం తర్వాత ఒక రంగంలో నన్ను ముందుకు దూసుకెళ్లమని ప్రోత్సహించారు. అందుకు కారణం అప్పటివరకూ అటువంటి రంగాలు కాంగ్రెస్ ప్రభావానికి దూరంగా ఉన్నాయి. తృతీయ ఆంధ్ర జమీందారీ రైతుల సదస్సు ఏలూరులో నా అధ్యక్షతన నిర్వహించారు. నేను బొబ్బిలి, వెంకటగిరి సంస్థానాల్లో నిర్వహించిన అధ్యయన ఫలితాల ఆధారంగా జమీందారీ రైతుల హక్కుల పత్రం ముసాయిదాను తయారుచేశాను. దాన్ని ఆర్.ఎం.శర్మ, ఎన్.వి. నాయుడులు సరిచూశారు. సభ దాన్ని ఆమోదించింది. అందులో రెండు

ముఖ్య అంశాలు : మొదటిది జమీందారీ విధానం రద్దు కావాలని కోరటం, రెండోది జమీందారీ రైతుల్ని కూడా రైత్వారీ రైతుల స్థాయికి చేర్చడం. భూమి శిస్తు రైత్వారీ రైతులకున్నట్లే జమీందారీ రైతులకు కూడా నిర్ణయించాలి. పంటలు పండనప్పుడు శిస్తు చెల్లింపులు తగ్గించాలి. తటాకాలు మొదలగు నీటి వనరులకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలి.

స్వాతంత్ర్యానంతర రైతులకు ఇదంతా వింతగా ఉండొచ్చుకానీ అప్పట్లో చాలా జమీందారీ ప్రాంతాల్లో సర్వేలు చేపట్టనందువల్ల, తాము సాగుచేసే పొలం విస్తీర్ణంతో సంబంధంలేకుండా రైతులు శిస్తు చెల్లించాల్సి వచ్చేది. ఆ సదస్సులో అఖిలాంధ్ర జమీందారీ రైతుల ఎంక్వయిరీ కమిటీని ఏర్పాటుచేశారు. దానికి నేను చైర్మన్. ఎన్.వి.నాయుడు, ఆర్.ఎం.శర్మలు సభ్యులుగా ఉన్నారు. దాదాపుగా మేము సంస్థానాలన్నింటికీ వెళ్లాం. వేలమంది రైతుల్ని, స్థానిక నాయకులను కలిశాం. రికార్డుల్ని విశేషంగా పరిశీలించాం. తటాకాలను, పంట కాలువలను పరిశీలించాం. అడవులగుండా ప్రయాణిస్తూ పశువులు మేసే బీళ్లను చూశాం.

అదంతా అద్భుతంగా ఉంది కానీ అత్యంత భయానకం కూడా. పలు తావుల్లో నన్ను కొట్టేందుకు ప్రయత్నించారు. వీలైతే నా అవయవాలను నుజ్జునుజ్జు చేయాలనుకున్నారు. పలు తావుల్లో బహిరంగంగా అవమానపర్చారు. చెప్పేందుకు వీలుకాని బూతులు తూటాల్లా పేలాయి. రౌడీ మూకలతో పెద్దపెట్టున తిట్టించేవాళ్లు. మాకు అండగా నిలిచిన రైతు నాయకులను, సేవకులను అవమానించేవాళ్లు, కొట్టేవాళ్లు. ఇళ్లు, పాకలు తగలబెట్టేవాళ్లు. పంటలను ధ్వంసంచేసేవాళ్లు. కొన్ని తావుల్లో నేను మారువేషంలో వుండాల్సి వచ్చేది. బొబ్బిలి సంస్థానంలో అయితే మరీ దారుణం. అందుకు కారణం అక్కడి రాజా సాహెబ్ ముఖ్యమంత్రి కావడమే. మా ముందు వాంగ్మూలం ఇచ్చేందుకు రైతులకు ధైర్య సాహసాలు అవసరమయ్యేవి.

జిల్లా స్థాయిలో పలువురు కాంగ్రెస్ వాదులు మాకు ఆతిథ్యమిచ్చి ఎవరిని కలవాలో సమాచారమిచ్చి సాయపడ్డారు. ఐదు మాసాలపాటు నిరంతరం తిరుగుతూ అంతకుముందెన్నడూ కాంగ్రెస్ నాయకులు కాలుమోపని మారుమూల గ్రామాలకు కూడా వెళుతూ మా అధ్యయనాన్ని కొనసాగించి నివేదికను పూర్తిచేశాం. అదృష్టవశాత్తూ వాటిలోని అనేక అధ్యాయాలను ఆంగ్ల దినపత్రికలు, స్వరాజ్య, ఇండియన్ క్రానికల్‌లలో ప్రచురించారు. సంపూర్ణ నివేదిక నవంబర్ 1933 నాటికి తయారైంది.

దానిని నేను మహాత్మాజీకి జనవరి 1934లో సమర్పించగలిగాను. ఆ నివేదిక సమర్పించినందుకు, కాంగ్రెస్ విధానాల పరిధిలోకి జమీందారీ ప్రాంతాలను తెచ్చినందుకు ఆయన నన్ను అభినందించారు. ఆ నివేదికను ప్రచురించడంతో జమీందారీ విధాన వ్యతిరేక ఉద్యమం జాతీయ స్థాయికి చేరి రాజకీయ స్థోమతను సమకూర్చుకుంది. కలకత్తా, అలహాబాద్, బొంబాయిలకు చెందిన దినపత్రికలు ఈ ఉద్యమాన్ని గుర్తించి ప్రభుత్వం, ప్రజలు అర్థంచేసుకునే విధంగా సంస్థానాల్లోని రైతుల కష్టాలను గుప్పించడంతో జాతీయోద్యమ కార్యక్రమాల్లో జమీందారీ రైతుల అంశాలకూ చోటుదక్కినట్లయ్యింది.

కిసాన్ సమ్మేళన్‌కు చెందిన మేము కారాగారవాసం అనుభవిస్తూ ఉండగా. 1932-33 మధ్యకాలంలో కాంగ్రెస్‌వాదులు సత్యాగ్రహ పోరాటంలో మునిగితేలుతుండగా ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల రైతులు ప్రభుత్వానికి 18.75 శాతం శిస్తు పెంపుదలకు అంగీకారాన్ని తెలియజేస్తూ అలా పెంచినదాన్ని మూడు కిస్తీలుగా వసూలుచేసుకోవాల్సిందిగా కోరారు. అంటే 1932లో ఒక అణా, 1933లో రెండు అణాలు, 1934లో మూడణాలు అదనంగానూ ఆ తర్వాత పెంపుదలలోని వ్యత్యాసాన్ని మొత్తం చెల్లిస్తామన్నారు.

మేము జైల్లో ఉండగానే ప్రభుత్వం ఒక అణా అదనంగా వసూలుచేసింది. నేను జైలు నుండి విడుదల కాగానే శిస్తు పెంపుదలను వ్యతిరేకిస్తూ ఉద్యమాన్ని ప్రారంభించాను. కిసాన్ ఉద్యమ సెగ ప్రభుత్వానికి తగిలింది. నేను ప్రచారంలో కొత్త వ్యూహాలు పన్నాను. ప్రాంతీయ సదస్సుల్లో రైతులు ఆమోదించిన తీర్మానాల రూపంలో తమ కోర్కెలను పొందుపర్చి జిల్లా, తాలూకా రైతు సంఘాలకు పంపాను. వాటిని జిల్లా కమిటీల్లోనో, సదస్సుల్లోనో, మహా సభల్లోనో చర్చించి వాటితోపాటు ప్రభుత్వానికి, పత్రికల వాళ్లకూ పంపమని చెప్పాం. అలాగే గ్రామ సంఘాలకూ పంపి వాళ్లనూ అలాగే చేయమని కోరదల్చాం.

రైతు వారోత్సవాలు, యాత్రలు

ఒక వారం పాటు రైతులు రైతు యాత్రల్ని తాలూకా, జిల్లా స్థాయి రెవెన్యూ కార్యాలన్నింటి వైపూ సాగించారు. నేను జైలు నుండి విడుదలైన కొద్దిమాసాలకే మార్చి 1933లో తొలి యాత్రలు నిర్వహించారు. కొన్ని జిల్లాల్లో మాత్రమే సఫలత చేకూరింది.

నా చిన్ననాటి మిత్రుడు **ఆచంట నాగయ్య, నా సోదరుల** సారధ్యంలో తొలి యాత్ర గుంటూరులో సాగింది. రెండో యాత్ర నవంబర్ మొదటి వారంలో మా సోదరుడు వెంకటప్పయ్య నినాదాలతో కూడిన పాటలు పాడి రైతులను ఆకర్షించాడు. అప్పికట్ల నుండి గుంటూరు వరకూ రైతులు ఎడ్లబండ్లు కట్టి ఊరేగింపుగా వచ్చారు. ఆ ప్రదర్శన గుంటూరు పౌరుల కళ్లు తెరిపించింది. అది రైతుల విప్లవ యాత్రగా భాసిల్లింది.

కె.వెంకటాచలపతి గారి నాయకత్వంలో మచిలీపట్నంలో యాత్ర సాగింది. రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ ద్వారా పేరుగడించిన **ఎం.రామచంద్రరావు**, తూర్పుగోదావరి జిల్లా ప్రముఖ కాంగ్రెస్ నాయకులు **ఎన్.సుబ్బారావు**ల నాయకత్వంలో భీమవరం, రాజమండ్రిల్లో రైతు యాత్రలు జరుపుకున్నారు. అలా **రైతు యాత్రలు శాంతియుతంగా ప్రభుత్వాన్ని చేరే శక్తిమంతమైన ఆయుధాలుగా మారాయి.** మూగవారిగా పడి ఉన్న రైతులు చైతన్యవంతులయ్యారు. రైతులు సంఘటితంగా గళంవిప్పారు. వాళ్ల సమస్యలు వాళ్లకు అర్థమైతే, వాళ్ల అవసరాలు వాళ్లకు తెలిస్తే వాళ్లు బాగానే వాదించగలరని రుజువైంది. అలా నేను ఆంధ్ర ప్రాంత రైతులకు తిరుగులేని నాయకుడిని అయ్యాను. ఆ సమయంలో ఆంధ్ర పర్యటనకు వచ్చిన కమలాదేవి రైతు యాత్రల విజయాన్ని ప్రశంసించింది. అది మాకు ఆనందాన్ని కలిగించింది.

ప్రభుత్వం తొలి రైతు యాత్రలకు సానుకూలంగానే స్పందించింది. తొలి యాత్ర సందర్భంగా ప్రభుత్వం గోదావరి, కృష్ణా జిల్లాల్లో రెండు అణాల అదనపు శిస్తును రద్దు చేసింది. ఇతర జిల్లాల్లో 12.5 శాతం భూమి శిస్తును రద్దు చేసింది. రెండో యాత్ర వల్ల మద్రాస్ ప్రావిన్స్‌లోని 23 జిల్లాల రైతులకు మేలు చేకూరింది. నన్ను రైతులు **'శిస్తు తగ్గింపు రంగా'** అని కీర్తించారు. అయితే దానికి భిన్నంగా నేటి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదేమిటి? యాభైకి పైగా యాత్రలు నిర్వహించారు. హైదరాబాద్ సెక్రటేరియట్‌కు 1962లో నిర్వహించిన రైతు యాత్రలో సర్దార్ గౌతులచ్చన్న, భారతీదేవి వర్మ వాయకత్వంలో ఐదు వేలమంది రైతులు పాల్గొన్నారు. వాళ్లు వంద శాతం నుండి మూడొందల శాతం వరకూ పెంచిన భూమి శిస్తును వ్యతిరేకించారు. దీనికితోడు కమ్యూనిస్ట్‌లూ రైతు యాత్రలు నిర్వహించారు. కిసాన్ సమ్మేళనానికి చెందిన 750 మంది సత్యాగ్రహులు రైతులకు మద్దతుగా జైళ్లకెళ్లారు. కమ్యూనిస్ట్‌లనూ నిర్బంధించారు. ప్రభుత్వ చర్యను కోర్టు కొట్టివేసిన తర్వాతకానీ అది దిగి రాలేదు. 'స్వరాజ్యం అంటే వార్మతనెరుగని పాలనా! అని రైతులు విస్తుబోయారు.

హరిజనోద్ధరణ

హరిజనులను అస్పృశ్యత నుండి విముక్తి గావించేందుకు కనీసం కొన్ని పౌర హక్కులనైనా వాళ్లకు సాధించిపెట్టలేకపోయినందుకు కాంగ్రెస్ పెద్దల వైఫల్యానికి నిరసనగా మహాత్మాగాంధీ 1933 వేసవిలో 21 రోజుల నిరాహారదీక్షను చేపట్టారు. అటువంటి ముందడుగును నేను స్వాగతించాను. **నేను గుంటూరు జిల్లా హరిజన్ సేవక్ సంఘ్ అధ్యక్షుణ్ణయ్యాను.** తాలూకా సంఘాలను నెలకొల్పాను. హరిజన సేవా ప్రచారకులను పూర్తికాలం సేవలందించేందుకు నియమించాను. అస్పృశ్యతకు వ్యతిరేకంగా కట్టుదిట్టమైన యంత్రాంగాన్ని తీర్చి దిద్దాను. నేను తొలి హరిజన సేవా దళాలను ఫిబ్రవరి–మార్చి 1933లో ఏర్పాటుచేసి నిర్వహించాను. అందులో మొదట హరిజనులు పదిమందే ఉన్నారు. రేపల్లె, తెనాలి తాలూకాల్లోని అనేక గ్రామాల్లో పర్యటించాం. గ్రామాల్లోనూ, హరిజనవాడల్లోనూ బస చేశాం. నినాదాలిస్తూ, పాటలు పాడుతూ ఊరేగింపులు, బహిరంగ సభలు నిర్వహించాం. అస్పృశ్యతను రూపు మాపి హరిజనులను సమాన గౌరవంతో చూడాలని కూడళ్లలో గుమిగూడినవారికీ చెప్పేవాళ్లం.

తొలినాళ్లలో కొద్దిమంది సనాతన నాయకులు, పూజారుల నుండి వ్యతిరేకత ఎదురైంది. అయితే త్వరితగతిన రైతులు నా పక్షాన నిలిచారు. హరిజనులకు కూడా సమాన పౌర హక్కులు కల్పించాల్సిందేనన్నారు. హరిజన సేవాదళంలోని హరిజనేతరులు హరిజన సభ్యులకు వాళ్ల గృహాల్లో వసతి కల్పించారు. సహపంక్తి భోజనాలు అమల్లోకి తెచ్చారు. చాలా తావుల్లో హరిజనుల్ని చెరువుల్లో, బావుల్లో నీళ్లు పట్టుకెళ్లనిచ్చారు. కొన్నిచోట్ల మాత్రం దేవాలయాల్లోకి హరిజన ప్రవేశం కల్పించారు.

గాంధీజీ నిరాహారదీక్షల ప్రభావం

1932లో మహాత్మాగాంధీ తలపెట్టిన పూనా నిరాహారదీక్ష, పూనా ఒప్పందం, అస్పృశ్యతకు వ్యతిరేకంగా గాంధీజీ దేశ వ్యాప్తంగా దశాబ్దాల తరబడి నిర్వహించిన ప్రచారం కారణంగా మా సేవాదళ్ విజయానికి మార్గం సుగమం చేశాయి. హరిజనుల పట్ల మిగతా కులాల హిందువులు ఉదారంగా ఉండడానికి నా వ్యక్తిగత ప్రభావం కూడా అక్కరకు వచ్చింది. అలా తొలినాళ్లలో ఆంధ్ర సేవాదళ్‌కు దక్కిన పరువు ప్రతిష్టలు తర్వాత కాలంలో ఇబ్బడిముబ్బడయ్యాయి.

గాంధీజీ రెండో పర్యాయం ఈ విషయంపై దీక్ష చేపట్టినప్పుడు మేము మందువేసవిలో మారుమూల గ్రామాల్లో కూడా పర్యటించాం. అనేకమంది సంఘ సేవకులను సమకూర్చుకోగలిగాం. డజన్లకొద్దీ గ్రామాల్లో వందలకొద్దీ బావులు, చెరువుల్లోని నీళ్లు హరిజనులకు అందుబాటులోకి వచ్చాయి.

హరిజనులకు ప్రభుత్వ భూములు

హరిజన సేవలో నేను మరో రెండు మార్గాల్లో ముందడుగు వేశాను. ఎవరికీ చెందని ప్రభుత్వ భూములను హరిజనులకు మంజూరు చేస్తే వాళ్లల్లో కొందరికి శాశ్వతంగా జీవనోపాధి లభించి సామాజిక భద్రత చేకూరుతుందనిపించింది. నేనూ, సోదరుడు అప్పయ్య, నాగయ్య కలసి ఈ దిశగా కృషిచేసి ప్రభుత్వ పోరంబోకు భూములు గుంటూరు జిల్లాలో హరిజనులకు మంజూరయ్యేటట్లు చూడడంలో కృతకృత్యులయ్యాం. మా ప్రయత్నం వల్ల 1926-32 మధ్య కాలంలో నీటి వనరులు సమకూరిన పెదవడ్లపూడి - పాతూరు పథకం కిందకు వచ్చిన అరవై వేల ఎకరాల భూమిలో దాదాపు ఐదు వేల ఎకరాలు హరిజన, క్రైస్తవులకు దక్కాయి. నెల్లూరు జిల్లాలో నీటి పారుదల కిందకు వచ్చిన రెండు వేల ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక భూస్వాములు కబళింపజూస్తున్నారని తెలిసి శ్రీ **వేముల కూర్మయ్య**తో కలసి అక్కడికి హుటాహుటిన వెళ్లి స్థానిక హరిజనులను కూడగట్టి అక్కడి రైతుల సహకారం లభించేటట్లు చేసి ఆ భూముల్ని హరిజనులకు పంచేటట్లు చేసి విజయం సాధించాం.

హరిజనోద్ధరణకు హరిజనులూ నడుం బిగించాలి

అప్పటివరకూ మహాత్మాగాంధీ **అస్పృశ్యత** నివారణ **స్పృశ్యుల** ద్వారానే జరగాలని వాదించేవారు. దానితో నేను సంతృప్తి చెందలేదు. హరిజన ప్రచారకుల ద్వారా ప్రయోగాలు చేయించి, పాటలు పాడించి హరిజనుల్ని హిందువులుగానేకాక పౌరులుగా కూడా చూడాల్సిన కర్తవ్యాన్ని బోధింపదల్చాను. **కమటం షణ్ముగం, నూతక్కి వెంకటేశ్వర్లు** వంటి ప్రచారకులుగానూ, హరికథలు చెప్పేవారిగానూ వినుతి కెక్కారు. మా రైతు సంఘానికి చెందిన **అజనప్ప**వంటివారు పూర్తికాలం ఈ సేవలో నిమగ్నమయ్యారు. తర్వాత అజన పార్లమెంట్ సభ్యులయ్యారు.

1920-34 మధ్యకాలంలో పరిస్థితులు కొంత మెరుగయ్యాయి.

పరిసరాల పరిశుభ్రత మెరుగుకాసాగింది. ఇంటిచుట్టూ కూరగాయలు పండించసాగారు. కాని ఆర్థిక మాంద్యం ఆవరించింది. వాళ్ల స్థితిగతులు భరించలేనివిగా తయారయ్యాయి. వాళ్ల దుస్థితి చూస్తే గుండె తరుక్కుపోయేది.

వ్యవసాయ కూలీలు - లేబర్ కమిషన్

హరిజనుల్లో అత్యధికులు వ్యవసాయ కూలీలైనందున వ్యవసాయ కూలీల స్థితి బాగుపడితే హరిజనుల ఆర్థిక స్థితి కూడా మెరుగవుతుందని భావించేవాణ్ణి. 1928-29లో బ్రిటిష్ ప్రభుత్వం **రాయల్ కమిషన్ ఆన్ లేబర్** అనే దాన్ని నియమించింది. భారతదేశ పరిశ్రమల్లో పనిచేసే శ్రామికుల్లో జాతీయత, సమానత్వంవంటి భావనలు పెరుగుతున్న కారణంగా ఆ కమిషన్ నియామకం జరిగింది. నేను వ్యవసాయ కూలీలపై కూడా ప్రత్యేకంగా దృష్టిని సారించమని కమిషన్‌ను కోరాను. దానివల్ల హరిజనుల స్థితి మెరుగవుతుంది అనుకున్నాను. అయితే కమిషన్ ముందుకు కేవలం పరిశ్రమల్లో పనిచేసేవారి సమస్యలు మాత్రమే తీసుకురావడం జరిగింది. **నేను పూనుకుని వ్యవసాయ కూలీల పక్షాన ఒక సుదీర్ఘమహజరు తయారుచేశాను.** శ్రామిక సంఘాల చట్టాన్ని, శ్రామికుల నష్టపరిహార చట్టాన్ని తగిన సవరణలతో రైతు కూలీలకు కూడా వర్తింపజేయాలని కోరాను.

తర్వాత నాకు వాళ్ల సంక్షేమానికి కృషి సెంట్రల్ అసెంబ్లీ ద్వారా కొనసాగించే అవకాశం లభించింది. కనీస వేతనాల చట్టం స్వల్ప మార్పులతో వ్యవసాయ కూలీలకు కూడా వర్తించేటట్లు చూడగలిగాను. **అంతర్జాతీయ కార్మిక కార్యాలయంలోనూ, సెంట్రల్ లెజిస్లేచర్‌లోనూ వ్యవసాయ కూలీల ప్రతినిధిగా గుర్తింపు పొందడం నాకు మహదానందమే కాదు గర్వకారణం కూడా.**

వయోజన ఓటు హక్కు కోసం కృషి

హరిజనుల, బడుగు వర్గాల అభ్యున్నతికి వయోజన ఓటు హక్కు మరో శక్తిమంతమైన సాధనం కాగలదని కూడా నేను భావించాను. కనుక దాని కోసం కూడా 1923 నుండి కృషి చేస్తూ వస్తున్నా.

సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్త ఆందోళన రగిలించిన నేషనల్ యునైటెడ్ ఫ్రంట్ స్వతంత్ర భారత రాజ్యాంగ రచనకు మోతీలాల్ కమిటీని నియమింపజేసేటట్లు చూడడం ఒక ఘన కార్యమే. ఉదారవాదులు, ముస్లిం నాయకులు

దాన్ని బలపర్చారు. భారతదేశ నాయకత్వంతో వయోజన ఓటు హక్కు సిద్ధాంతాన్ని అంగీకరింపజేయడాన్ని అదే అదనుగా భావించా. నేను కొందరు సభ్యుల్ని కలిశాను. త్రివేణిలో ప్రచురించబడిన నా వ్యాసాలకు మరికొంత సమాచారాన్ని జోడించి కమిటీ పరిశీలనకు పంపాను. అందరికీ ఓటు హక్కు అస్పృశ్యతా నిర్మూలనకు దారితీస్తుందని నమ్మాను. కమిటీ కూడా అదే అభిప్రాయానికి వచ్చి రాజ్యాంగ ముసాయిదాలో ఆ అంశాన్ని చేర్చిందని తెలిసి అమితానందం పొందాను.

స్వతంత్ర భారతదేశంలో కూడా గవర్నర్ వ్యవస్థ కొనసాగాలని కోరుకున్నాను. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నిలకడగా ఉండాలంటే గవర్నర్ వ్యవస్థ అవసరం ఎంతైనా ఉండనుకున్నా. అయితే **డాక్టర్ పట్టాభి** దాన్ని గేలిచేశాడు. అయితే తర్వాత కాలంలో అయన స్వతంత్ర భారతంలో గవర్నరై కులికారు!

మోతీలాల్ నెహ్రూ కమిటీ ఉమ్మడి నియోజక వర్గాల పద్ధతే మేలని అభిప్రాయపడింది. అంతే నేను దానికి నా అంగీకారాన్ని తెలియ జేస్తూనే కొన్ని నియోజక వర్గాలను మైనారిటీలకు ప్రత్యేకంగా కేటాయించాలని వాదించాను. అది బ్రిటిష్‌వాళ్లు అనుసరించే పద్ధతి కాదు. నేను ఇటువంటి నిశ్చితాభిప్రాయంతో వున్నందునే తొలి రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ సందర్భంగా బాపూజీ దాన్ని వ్యతిరేకించడం నాకు రుచించలేదు. అయితే తర్వాత ఆయన దాన్ని అంగీకరించినందుకు సంతోషించా. రౌండ్ టేబుల్ సమావేశం సందర్భంగా మరికొన్ని సీట్లు ముస్లింలకు, ఇతరులకు ప్రత్యేకంగా కేటాయించే విషయానికి అంగీకారం కుదరకపోవడం వల్లే అది దేశ విభజనకు దారితీసింది. కాశ్మీర్ విషయంలో ఎడతెగని పేచీ, పాకిస్థాన్-భారతదేశాల మధ్య అంతర్జాతీయ సమస్యలవంటివి చూస్తుంటే రిజర్వేషన్ల విషయంలో మన నాయకత్వం ఇమ్మెడిపోకుకోవడం సమంజసమేనా అని అనుకోవాల్సి వస్తుంది.

పూనా, పాట్నా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశం

1933లో రాజకీయ ఉద్యమం వెనుకంజలో ఉంది. కాంగ్రెస్‌పై ప్రభుత్వ నిషేధం అమలులో ఉంది. నిరాహారదీక్షను విరమింపజేసేందుకు మహాత్మాగాంధీని తాత్కాలికంగా విడుదల చేశారు. ఎం.ఎస్. అనే విదర్భ కాంగ్రెస్ నాయకుని నాయకత్వంలో కాంగ్రెస్ వాళ్లంతా సమావేశమయ్యారు. భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్ణయించుకోవాల్సి ఉంది. తక్షణ స్థాయిలో ఒక కార్యక్రమం నుండి మరో కార్యక్రమం చేపట్టడంలో కాంగ్రెస్

వాళ్లు ఎప్పుడూ ఇబ్బందిపడుతూనే ఉండేవాళ్లు. సహాయ నిరాకరణోద్యమం ముగిసిన తర్వాతగానీ స్వరాజ్య పార్టీ తన విధాన సభా పక్షాన్ని ఏర్పాటుచేసుకోలేకపోయింది. అలాగే జాతి స్వేచ్ఛ కోసం చట్టసభల్ని వాడుకునేందుకు ఒక సంవత్సరం పాటు పాట్నా కాంగ్రెస్ వరకూ ఆగాల్సి వచ్చింది. ఆ సంవత్సర కాలంలో వ్యక్తి సత్యాగ్రహ ప్రయోగానికి పూనుకుని దాని అవసరాన్ని గుర్తించడం జరిగింది. పాట్నా నిర్ణయం అమలుకు మార్గం సుగమం చేసేందుకు కే.శే.సత్యమూర్తి **భూలాభాయ్ దేశాయ్**లు ఎంతో కష్టపడాల్సి వచ్చింది. పూనా సభలో అన్నింటినీ మించి గమనింపదగిన అంశమేమంటే మహాత్మాగాంధీ దర్శన భాగ్యం. భగవంతుడిలోని సద్గుణాలు మూర్తీభవించిన వ్యక్తిగా నాకు ఆయన కనిపిస్తారు. ఆయన సామ్రాజ్యవాదంపై నైతిక శక్తి ఆధిక్యతను నిరూపించగలిగారు. సనాతన వాదుల అస్పృశ్యత హిందూ మతంలో భాగంకాదని చెప్పించగలిగారు.

పూనా సభ సందర్భంగా భారత జాతీయతకు సంబంధించిన మరో అనుభవం కూడా రూపుదాల్చింది. గాంధియన్ సోషలిజంను భారత జాతీయతలో భాగంగా గుర్తించాల్సిన అవసరం ఉందనుకునేవాళ్లంతా నా ఆహ్వానంపై గోఖలే హాలులో సమావేశమయ్యారు. **శ్రీమతి కమలాదేవి అధ్యక్షత వహించారు. అప్పుడు మేము రూపొందించిన రాజ్యాంగ సూత్రాల ముసాయిదా సంవత్సరం తర్వాత కాంగ్రెస్ సోషలిస్ట్ సదస్సులో చర్చలకు ఉపయోగపడింది.**

అమ్మమ్మ మరణం

1933 శివరాత్రి నాకు రెండు అనుభవాలను పంచింది. శివరాత్రి నాడు వుదయం నేను కోటప్పకొండ జిల్లా రైతు సదస్సుకు బయలుదేరుతుండగా అమ్మమ్మ (అమ్మిమ్మ) ఈ పర్వదినాన తనువు చాలించేందుకు ప్రాణం ఉగ్గబట్టుకుని ఉందని తెలిసింది. నా గుండె గుభేల్‌మంది. ఎందుకంటే ఆ రోజు నేను కోటప్పకొండలో ఉంటానని రైతులకు మాట ఇచ్చాను. నా బాధ చూసి అమ్మిమ్మ ఇలా అంది: 'నేను ఈరోజు పోతే బొందితో కైలాసానికే. ఆయన ఎలాగూ ఈరోజు కోటప్పకొండపైనే ఉంటాడు. కనుక నన్నూ, నిన్నూ వేరు చేయలేడు. నువ్వు కోటప్పకొండకు బయలుదేరి వెళ్లి రైతుల కోసం పాటుపడు'. అలా నన్ను ఆమె కోటప్పకొండకు వెళ్లేందుకు ప్రోత్సహించింది.

రైతుల హక్కుల పత్రం

రైతు యాత్ర నిర్వహిస్తూ జిల్లా కలెక్టర్లను కలసి వారి ద్వారా ప్రభుత్వానికి పంపేందుకు రైతుల హక్కుల పత్రాన్ని ఒకదాన్ని కోటప్పకొండ సభలో రూపొందించాం. కీ.శే. కాకుమాను లక్ష్మయ్య అప్పటి కృష్ణా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు. అదే రోజున మేము జిల్లా పంచాయతీ సదస్సు కూడా నిర్వహించుకున్నాం. గ్రామ పంచాయతీలకు ఎక్కువ ఆర్థిక సాయం అందించాలని కోరే విషయంలో **పి.వి.ఎన్.రావు** అగ్రభాగాన వున్నారు. అక్కడ సమావేశమైన గ్రామ పంచాయతీ అధ్యక్షులందరూ రైతుల హక్కుల పత్రాన్ని ఆమోదించారు. రెండు సభల్లోనూ ప్రముఖ పాత్రికేయుడు **ఎస్.జి. ఆచార్య** క్రియాశీలంగా వ్యవహరించాడు. సభలు ముగిసీ ముగియగానే ఏ రైలు ఉంటే అది ఎక్కి నిదుబ్రోలుకు హుటాహుటిన ఆ రాత్రి బయలుదేరాను. మధ్యలో ఎక్కడో నేను విడిచిన దిగబోయానట ఆ నడిచే రైలులో నుంచి. అప్పుడు నా మిత్రులు నన్ను చూసి ఆపి నాకే ప్రమాదం జరగకుండా కాపాడారట. స్పృహలోకొచ్చిన తర్వాత అర్థమైంది నాకు ఎటువంటి ముప్పు తప్పిందో. అయితే చిత్రమేమిటంటే ఆ సమయంలోనే మా అమ్మమ్మ ఇంటి వద్ద తుది శ్వాస విడిచిందట. ఆమె మరణ వార్తలో అక్కడకు చేరినవాళ్లను చూసి నవ్విందనీ, శివనామం స్మరించి తృప్తిగా కన్నుమూసిందని చెప్పారు. ఆమె వయస్సు అప్పటికి ఎనభై సంవత్సరాలు దాటుంటుంది. ఆమె గుణాలు నాకు కొన్ని వచ్చాయని ఎంతగానో మురిసిపోయేది.

ఆంధ్ర ప్రాంతంలో గాంధీజీ పర్యటన

మహాత్మాగాంధీ అఖిలాంధ్ర హరిజన పర్యటన డిసెంబర్ 1933-జనవరి 1934 మధ్యకాలంలో ఆంధ్ర హరిజన సేవక్ సంఘ్ కార్యదర్శి **ఎం.బాపినీడు** నాయకత్వంలో నిర్వహించబడింది. **గుంటూరు జిల్లాలో ఆయన పర్యటించింది ఒకే ఒక్క రోజు.** ఆయన కారు వెళుతుండగా తెనాలిలో రైలులో కలుసుకున్నాను. గుంటూరు నుండి బాపట్ల వరకూ ఆయన కారులోనే ప్రయాణించాను. వేదిక మీద నుండి దింపి కారులో కారెక్కించడం ఎంతో కష్టమైంది. అంతటి జన సందోహం. **దారి పొడవునా ఆయన దర్శనం కోసం ఎడతెగని జన ప్రవాహం.** అటువంటి దృశ్యాన్ని దేవుళ్లు చూడాలి! **ఆకాశంలోనూ సంబరమే.** ఎటుచూసినా పువ్వులు, పూల దండలే. 'మహాత్మాగాంధీకి

జై' అనే నినాదాలు దారిపొడవునా మారుమోగాయి. కారులో మాతోపాటు ప్రొఫెసర్ **ఎన్.ఆర్.మల్కానీ** కూడా ఉన్నారు. ఆయన గాంధీజీకి ఆంతరంగిక కార్యదర్శి. ఆయనకు నన్ను పరిచయం చేస్తూ 'ఈయన ప్రొఫెసర్లకు ప్రొఫెసర్' అని మనసారా నవ్వసాగారు గాంధీజీ.

మహాత్ముణ్ణి చూడాలని వచ్చే పాంగిపొర్లే జన ప్రవాహాన్ని అడ్డుకోవడం ఎంత కష్టమో చేబ్రోలులో తెలియవచ్చింది. ఆ గ్రామం కాంగ్రెస్‌కు పట్టుగొమ్మ. ఆంధ్ర నుండి స్త్రీ సత్యాగ్రహులు ఆ గ్రామం నుండి వెళ్లినంతమంది మరో గ్రామం నుండి వెళ్లలేదు. పురుష సత్యాగ్రహుల సంఖ్యా అధికమే. అయితే అటువంటి గ్రామంలో కూడా బాపూజీ కొద్దిక్షణాలు ఆగేందుకు పర్యటన నిర్వాహకులు ఏర్పాటుచేయలేదు. నేనేం చేయాలి? ముందుగానే ఆ గ్రామం గురించి బాపూజీకి వివరిస్తూ వచ్చి ఆ గ్రామం చేరుకోగానే కొద్ది నిమిషాలు ఆగేందుకు అంగీకరింపజేశాను. స్త్రీలు, సత్యాగ్రహులు గాంధీజీకి దండలు వేశారు. కార్యక్రమం అంతా సజావుగానే సాగింది. ఇంతలో ఒక స్త్రీ సత్యాగ్రహి బాపూజీ పాదాలను స్పృశిస్తానంది. అది ఆయనకు రుచించని విషయం. కనుక కారు బయలుదేరింది. ఆ ఊపులో ఓ స్త్రీ కిందపడిపోయింది. దెబ్బలేమీ తగలలేదుకానీ ఆ సంఘటన నా మనస్సును గాయపర్చింది. నేను ఆయన్ను ఆ గ్రామంలో అలా ఆగేటట్లు చేయడం మంచిదైంది. **అక్కడి సత్యాగ్రహులు ఎంతగా స్ఫూర్తిని పొందారంటే తర్వాత ఓ పుష్కరంపాటు అక్కడ నిరంతరాయంగా ఆంధ్ర మహిళా రాజకీయ శిక్షణా శిబిరం నిర్వహించారు.**

భారత రైతు శిక్షణా సంస్థ ఆవిర్భావం

మేము మార్గమధ్యంలో ఇంకే సంఘటనా జరగకుండానే మా గ్రామం చేరుకున్నాం. మునిపల్లెలో, పచ్చలతాడిపర్రులో లభించిన స్వాగతం ఆయన్ను ఆనందింపజేసింది. నిడుబ్రోలులో బాపూజీ **రమ-నీడు** రైతు సంస్థను ప్రారంభించారు. **జి.ఎల్.నారాయణ, ఎన్.వి.సుబ్బయ్య**ల సంపాదకత్వాన నడిచే కిసాన్ ప్రచురణాలయాన్ని ప్రారంభించారు. అది ప్రచురించిన తొలి పుస్తకం **'హరిజన నాయక్'**ను ఆవిష్కరించారు. దాని రచయితను నేనే. భారతీదేవి గారు ఆమె గాజుల్ని, మా గ్రామ మహిళల నుండి స్వీకరించిన చందాలను ఆయనకు అందజేశారు. మా అమ్మ మంగమ్మ ఆయన పాదాల చెంతనే కూర్చున్నది. సినీ నటుడు **సి.ఎస్.ఆర్.ఆంజనేయులు**, మరెందరో విరాళాలు అందజేశారు.

బాపూ ప్రసంగం ఒక అరగంటసేపు సాగింది. అది అంతకుముందు ఆయన ప్రారంభించిన భారత రైతు సంస్థ ప్రాముఖ్యాన్ని వివరించిన ప్రసంగం.

మా తమ్ముళ్లిద్దరినీ, అలాగే మామయ్య పాములపాటి బుచ్చినాయుడు గారినీ, మా పూర్వీకుల సత్రాన్ని భారత రైతు సంస్థకు అప్పగించేందుకు ఒప్పించగలగడం నా అదృష్టంగా భావిస్తాను. అది రమణయ్య, అంకినీడు అనే ఇద్దరు రైతు సోదరుల పేర్లు కనుక దానికి **రమ-నీడు** విద్యాలయం అని నామకరణం చేశాం. పూర్వీకులు దానం చేసిన ఇంటిని ఇలా ఆధునిక రైతు సంస్థగా మార్చినందుకు బాపూజీ సంతోషాన్ని వ్యక్తంచేశారు. నేను దానికి గౌరవ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించేందుకు అంగీకారాన్ని తెల్పడంతో బాపూజీ ఇలా అభినందించారు. 'ఒక ఆక్స్‌ఫర్డ్ ప్రొఫెసర్ తన కుటుంబ ఆస్తిని, తన సేవల్ని ఈ సంస్థకు అప్పగించడం కొనియాడదగిన అంశం'. నా ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మా అన్నదమ్ముల భవితవ్యం గురించి ఆందోళన చెందే మా అమ్మకు బాపూజీ ఆశీర్వచనాలు, అభినందనలు ఊరట కలిగించాయి.

మా గ్రామం నుండి మేము తాళ్లపాలెం ప్రయాణమయ్యాం. అది హరిజన గ్రామం. ఆ గ్రామంలో తరతరాలుగా వైద్య సేవకు అంకితమైన ఆయుర్వేద డాక్టర్ల కుటుంబం ఉండేది. ఉదయం వర్షం పడినందువల్ల డొంకదారి కారు వెళ్లడానికి అనువుగా లేదు. ఆయన తన పర్యటనలో వెళ్లాల్సిన ఏకైక గ్రామాన్ని సందర్శించకుండా తిరిగి వెళ్లదల్చలేదు. ఒకటిన్నర మైళ్లు కాలినడకన ప్రయాణించాం. వందలమంది బాపూజీని అనుసరించారు. అదంతా దండి యాత్రను జ్ఞప్తికి తెచ్చింది. ఆయన తాళ్లపాలెం చేరుకుని వేలాదిమంది హరిజనులకు తన సందేశాన్ని అందించారు. వాళ్ల సంక్షేమానికి వాళ్లను శ్రమించమన్నారు.

అక్కడి హరిజన రైతులు బాపూజీ నడిచిన ఒకటిన్నర మైళ్ల డొంక దారిని మెటల్ రోడ్డుగా మార్చి **'గాంధీ మార్గ్'** అని నామకరణం చేశారు. రైలులో నుండి చూస్తే 'గాంధీ మార్గ్' బోర్డు కనిపిస్తుంది. అది కనిపించినప్పుడల్లా 1933 నాటి ఆ మధుర్ణానుభూతి గుర్తుకు వస్తుంది.

సాయంత్రానికి రేపల్లె చేరుకున్నాం. మధ్యాహ్నం వినయాశ్రమంలో గడిపాం. **లక్ష్మి సీతారాం** ఆశ్రమం బాపూజీకి అంకితం చేశారు. ఆశ్రమంలో కార్యక్రమాలు చాలా ఉన్నాయి కానీ బాపూని ప్రధానంగా ఆకట్టుకున్నవి రెండే. ఒకటి గ్రామీణ

మహిళా సదస్సు, రెండు దార్శనిక కేంద్ర ప్రారంభం. స్వామి సీతారాం, **తుమ్మల బసవయ్య దంపతులు** ఆ ఆశ్రమ వ్యవస్థాపకులు. వాళ్లు ముగ్గురూ గాంధీజీ శిష్యులు. నిర్మాణాత్మక కార్యక్రమాల పట్ల విశ్వాసం కలవారు.

రేపల్లెకు జనం తండోపతండాలుగా కృష్ణా నదికి ఇరువైపుల నుండి బాపూ సందర్శనం కోసం తరలివచ్చారు. అతి కష్టం మీద స్థానిక నిర్వాహకులు బాపూజీని ప్రత్యేక రైలులోకి ఎక్కించగలిగారు. బాపూ దర్శనంతో తెనాలి పులకించిపోయింది. మరుసటిరోజు ఉదయం భారతీదేవి గారు, నేనూ బాపూజీతో కలిసి తెనాలి రైల్వే స్టేషన్‌కు వెళ్లాం. అక్కడ అనేకమంది సత్యాగ్రహుల్ని, హరిజన సేవకుల్ని, ప్రత్యేకించి మహిళా సత్యాగ్రహుల్ని, కాంగ్రెస్ కార్యకర్తల్ని బాపూజీకి పరిచయం చేశాను.

లక్షలాదిమందికి మహాత్ముని దగ్గర నుండి అలా దర్శించడం వాళ్ల జీవితంలో ముఖ్యమైన ఘట్టం మాత్రమే కాదని అంతకుమించిన అనుభూతి మరొకటి ఉండబోదని నాకు తెలుసు. అందువల్ల ఆయన విశ్రాంతి సమయంలో కూడా పరిచయాలు చేస్తూనే వచ్చాను. అందుకే రైలెక్కే సమయంలో బాపూ భారతీదేవి గారిని అడిగారు-'నిన్నటి నుండి నిర్దయగా నన్ను నడిపినట్టే జీవితంలో నిన్నూ నడుపుతారా?' అంటూ మెల్లగా నా వీపు తట్టారు. అలాగే 1959-65 మధ్యకాలంలో రాజాజీ ఆశీర్వాదాలు, దర్శన భాగ్యం వివిధ రాష్ట్రాల్లోని ప్రజలకు కలిగేటట్లు చూశాను.

బాపూజీని తిరిగి వెంకటగిరిలో కలిశాం. ఆయనకు బస కటికినేని సోదరుల ఇంట ఏర్పాటుచేశాం. అక్కడి పచ్చటి మైదానాల్లో బాపూ ప్రసంగం రైతుల హక్కుల కోసం పోరాడాల్సిన అవసరాన్ని గుర్తించేటట్లు చేసింది.

నెల్లూరు పర్యటనలో బాపూకు తోడుగా భారతీదేవి, కాంగ్రెస్ సత్యాగ్రహి, నెల్లూరులో కస్తూర్బా విద్యాలయ వ్యవస్థాపకురాలు **పానకా కనకమ్మ** ఉన్నారు. రైలెక్కుతూ బాపూ అన్నారు : 'రంగా! నిన్నూ, నీ సతీమణిని అభినందిస్తున్నా. ఆమెను నా కూతురిగా ప్రేమిస్తున్నా. ఆమె ఆంధ్రలో మహిళల విషయం చూసుకుంటుంది. ఇక ఆంధ్ర రైతుల గురించి దిగులులేదు. వాళ్ల సంరక్షణా భారం నువ్వు తీసుకున్నావు. అదిగో అటువంటి **పరిచయాల ద్వారా, అభినందనల ద్వారా, బోసి నవ్వుల ద్వారా బాపూ కోట్లాదిమంది దేశ సేవకుల్ని, సంయమనంతో ఆలోచించగల రాజకీయ నాయకుల హృదయాలను కొల్లగొట్టగలిగారు.**



6
నేనూ చేనేత పనివారూ (1935-55)

ఐక్య సంఘటన, కిసాన్ ఉద్యమం అఖిలభారత స్థాయికి చేరుకుంటున్న రోజుల్లో నేను 1925లో స్థాపించి అవసాన దశకు చేరుకుంటున్న చేనేత కార్మికుల ఉద్యమాన్ని చేనేత కార్మికుల్లో చదువుకున్న యువత సహకారంతో అఖిలాంధ్ర స్థాయికి చేర్చగలిగాను. 1936లో తొలిగా శ్రీ శ్రీకంఠం, కీ.శే. పెండ్యం వెంకట్రాములు చేనేత కార్మిక సంఘాన్ని అఖిలభారత స్థాయికి చేర్చే ప్రయత్నాలు చేశారు కానీ అది స్థిరమైన రూపానికి రాలేదు. ఇతర రాష్ట్రాల నుండి వారికి కావాల్సినంత సహకారం లభించలేదు. దానితో **పెండ్యం వెంకట్రాములు** ఆ సంస్థను ఆంధ్ర రాష్ట్ర స్థాయికి పరిమితం చేసి కృషి చేశారు. ఆయన కాంగ్రెస్‌వాదిగా జైలుకు వెళ్లినవారు. నా సలహాలు తీసుకుంటూ ఆరేళ్లపాటు గట్టిగా పనిచేశారు. ఆంధ్రదేశమంతటా చేనేత కాంగ్రెస్ కమిటీలను నెలకొల్పారు. దానితోపాటు ప్రభుత్వ ప్రోద్బలంతో ఎన్నో చేనేత సహకార సంఘాలను నెలకొల్పారు. అఖిలభారత చేనేత సెస్సు నిధుల నుండి తొలి విడతగా నిర్వహణ ఖర్చుల కింద ఒక్కొక్క సంఘానికి పది లక్షల రూపాయలు మంజూరు చేశారు. సహకార సంఘాల నాయకత్వానికి, చేనేత కాంగ్రెస్ నాయకులకూ మధ్య సఖ్యత కుదిర్చేందుకు మా గ్రామానికి చెందిన **ప్రగడ కోటయ్య** సాయపడ్డారు. ఆయన మా రైతు శిక్షణా సంస్థ నుండి డిగ్రీ పుచ్చుకున్నవారు. మద్రాస్ టెక్స్‌టైల్ సంస్థ నుండి డిప్లొమా పొందారు. ఈ ఆంధ్ర చేనేత పనివారల నాయకత్వం బలపడింది. 1940 నాటికి చేనేత సహకార సంఘ నాయకులు ప్రగడ కోటయ్య, **టి.రమాకాంతారావు, వీరభద్రరావు, కె.బసవ రాజు**

వంటి వారి సలహాతో రాష్ట్ర స్థాయి సంస్థ అయిన మద్రాస్ ప్రెసిడెన్సీ చేనేత పనివారల సహకార సంఘ నాయకత్వాన్ని చేపట్టే దశకు ఎదిగారు.

వాళ్లు నన్ను అభ్యర్థిగా పోటీ చేయమన్నారు. నేను అప్పటికి **'ఎకనామిక్స్ ఆఫ్ ది హ్యాండ్‌లూమ్'** గ్రంథం రాసి ఉన్నాను. కాంగ్రెస్ నాయకుణ్ణి. రైతు ఉద్యమ సిద్ధాంతకర్తను. చేతిపనివారల సంస్థలకు చెందినవారిలో పట్టున్నవాణ్ణి. అందువల్ల ప్రభుత్వాన్ని, జస్టిస్ పార్టీని ఎదిరించి నెగ్గుకురాగలిగాను. చేనేత పనివారల సహకార సంఘాలకు ప్రెసిడెన్సీలో తలమానికంగా ఉన్న సహకార సంఘానికి అధ్యక్షుడిగా పనిచేసింది కేవలం నాలుగు మాసాలే. అదీ జాతీయ స్థాయిలో మరిన్ని బాధ్యతల్ని నిర్వర్తిస్తూ.

ప్రాథమిక చేనేత సహకార సంఘాల కార్యదర్శులకు మేము శిక్షణా తరగతుల్ని ఏర్పాటుచేశాం. చేనేత వస్త్రాల అమ్మకాలను ఆధునీకరించాం. అమ్మే దుకాణాలను రెట్టింపు చేశాం. వాటికి రాయితీలు కల్పించాం. ప్రగడ కోటయ్య గారిని రాష్ట్రానికి డిజైనర్‌గానూ, పేరెన్నికగన్న కళాకారుడు **జి.మల్లయ్య** గారిని గౌరవ డిజైనర్‌గానూ నియమించాం. అద్దకాల కేంద్రాలను ప్రారంభించాం. విదేశీ వ్యాపారుల నుండి, టోకు వ్యాపారుల నుండి ఆర్డర్లు పొందేందుకు నమూనా పుస్తకాలను తయారు చేయించాం. **ఇప్పుడు అఖిలభారత హ్యాండ్లూమ్ బోర్డు చేసే కార్యక్రమాలన్నింటికీ ఆనాడే బీజాలు వేశాం.** ఈ పనిలో ప్రగడ కోటయ్య, రమాకాంతారావు, **ఎం.సోమప్ప**లు ఎంతగానో సహాయం అందించారు.

నేను 1940లో జైలుకు వెళ్లాల్సి వచ్చినప్పుడు నా అధికారాలను సోమప్పగారికి అప్పగించాను. అప్పటికి ఆయన నాయకత్వానికి కొత్తేకానీ తర్వాత లక్షలాదిమంది చేనేత కార్మికుల నాయకునిగా గణుతికెక్కాడు. చేనేత పనివారు నిర్మించుకున్న తొలి సహకార నూలు మిల్లు బోర్డు ఆఫ్ డైరెక్టర్లకు తొలి అధ్యక్షుడు.

తొలిగా మేము భారత రైతు శిక్షణా సంస్థలోనే చేనేత పనివారల యువతకు ప్రత్యేక శిక్షణను ఏర్పాటుచేశాం. తర్వాత చేనేత కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణా తరగతులు, పాఠశాలలు, సదస్సులు నిర్వహించాం. అనేక జిల్లాల్లో చేనేత కార్మికుల పాదయాత్రలు కూడా నిర్వహించాం.

యుద్ధ సమయంలో భారతీదేవి, కిసాన్ కాంగ్రెస్ కార్యకర్తలు నిండు హృదయంతో చేనేత కార్మిక ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారు. ఆమె రాష్ట్ర చేనేత కాంగ్రెస్‌కు గౌరవ అధ్యక్షురాలైంది. కిసాన్ ఉద్యమాన్ని ముందుగా గేలిచేసినట్లే చేనేత ఉద్యమాన్ని

కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీవారు, అఖిలభారత కమ్యూనిస్ట్‌లు గేలి చేయనారంభించి శక్తితో అలరారే చేనేత నాయకులకు బద్ధ శత్రువులయ్యారు. ఆ సంస్థను చేజిక్కించుకునేందుకు విఫలయత్నం చేశారు. మార్క్స్ సిద్ధాంతపు చరిత్ర ఆధారంగా చూస్తే కుటీర పరిశ్రమలకు మరణశిక్షను విధించినట్లయ్యింది. చేనేత పరిశ్రమ బతికి బట్టకడుతుందనే విశ్వాసం లేదు వారికి. వికేంద్రీకరణకు, స్వయం పాలనకు సహకార పద్ధతిపై నిర్వహింపబడుతూ స్వయం ఉపాధి ఆధారంగా జీవనం సాగించే కుటీర పరిశ్రమలకు చెందిన కళాకారుల పట్ల వాళ్లకు సానుభూతిలేదు. వాళ్లను సంస్థాగతంగా తీర్చిదిద్దే నన్ను చూస్తే సోషలిస్ట్‌లకు, కమ్యూనిస్ట్‌లకు ఎగతాళిగా ఉండేది. అయితే మేము చేనేత కార్మికుల్ని క్రియాశీల రాజకీయ శక్తిగా మార్చే తరుణంలో ఆ సంస్థల్ని వాళ్లు కబళించి చేనేత కార్మికుల ఐక్యతను దెబ్బతీసేవాళ్లు. యుద్ధ సమయంలో వారు కొంత సఫలతను సాధించారుకానీ దేవీజీ, కోటయ్య గార్లు ఎంతో సాహసంతో వాళ్లను ఎదుర్కొగలిగారు.

చేనేత కార్మికులు మిల్లులో తయారైన నూలును ఉపయోగిస్తున్నారనే సాకుతో కొందరు ఇరుకు మనస్తత్వం గల కాంగ్రెస్ వాళ్లు కూడా మాతో విభేదించారు. గాంధీజీ మానవతా దృక్పథాన్ని, ఆచరణాత్మకతను ప్రదర్శించి మా ఉద్యమానికి అడ్డుపడలేదు. హై స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమాన్ **నారాయణ్ అగర్వాల్** గారిని ఈ ఉద్యమ అభివృద్ధికి నాతో సహకరించమని కోరారు. అప్పటి నుండి **ఉద్యమం కేవలం చేనేత పనివారికే పరిమితం కాకుండా స్వయం ఉపాధిపై విశ్వాసముంచిన ప్రతివారినీ ఆదుకున్నది.**

1947-52 మధ్యకాలంలో నేను భారత నూనె గింజల కమిటీకి ఉపాధ్యక్షుణ్ణి అయిన తర్వాత నలభై లక్షలమంది గాండ్ల వారు సహకార సంఘాలు నెలకొల్పు విధానం కృషి చేశాను. ప్రభుత్వం చేతివృత్తి కళాకారుల అభివృద్ధికి సహకరించేదికాదు. వీళ్ల మార్గాలకు బదులు మరమగ్గాలను ప్రోత్సహించేది. దురదృష్టవశాత్తూ పలువురు నాయకులు పదవుల మోజులో పడిపోయారు. చేనేత కార్మికుల, ఇతర చేతివృత్తుల హక్కుల కోసం పోరాటం సరిగా సాగలేదు.

7

లోక్‌సభకు ఎన్నికలు -1957

కేంద్ర ప్రభుత్వ నిర్ణయానుసారం కోటిమంది నివసించే తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రతో కలపడంతో ఆంధ్రప్రదేశ్ అనే కొత్త రాష్ట్రం ఏర్పడింది. ఆంధ్ర ప్రాంత వాసులు ముక్కోటి మంది. అంతా కలిపి నాలుగు కోట్లమందితో హైదరాబాద్ రాజధానిగా కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటుచేశారు. అంతకు రెండు సంవత్సరాలకు ముందే అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కారణంగా ఆంధ్ర ప్రాంతంలో కేవలం పార్లమెంట్‌కు మాత్రమే ఎన్నికలు జరిగాయి.



ఆచార్య రంగని ఏనుగుపై ఊరేగించిన తెనాలివాసులు

విలీనమైన తెలంగాణ ప్రాంతం లో అసెంబ్లీకి, పార్లమెంట్‌కు ఎన్నికలు జరిగాయి.

లోక్‌సభకు అభ్యర్థుల్ని ఎంపిక చేసే కమిటీలో కృషీకార్ లోక్‌పార్టీ విభాగానికి ప్రాతి నిధ్యం వహిస్తున్నది కేవలం ఇద్దరమే – నేనూ, **లచ్చన్న**. అంతకుపూర్వం ముఖ్యమంత్రి అయి, లచ్చన్నతో జతకట్టిన గోపాల్ రెడ్డి తిరిగి **సంజీవరెడ్డి**తో చేతులు కలిపాడు. నేను ఆ కమిటీ సభ్యునిగా వాళ్లను కాంగ్రెస్ మొత్తం వ్యవహారంగా దాన్ని చూడమన్నాను. ముఠా గొడవల్ని విడనాడమన్నాను. చివరకు అలా ఆంధ్రా కమిటీ సిఫారసు చేసిన పేర్లలో నాదీ, **బాల్‌రెడ్డి**ది మాత్రమే ఉన్నాయి. దీన్నిబట్టి తెలుస్తుంది ముఠా గొడవలు ఏ స్థాయిలో ఉన్నదీ! మరో ఇద్దరు సంజయుని పాత్రనో, నారదుని పాత్రనో పోషించేవాళ్లను మేము కూడా అంగీకరించేటట్లు చేసి మరో ఇద్దరి మద్దతుతో వాళ్ల పేర్లను కూడా కలిపారు.

కృషికార్ లోక్‌పార్టీకి, ప్రజా పార్టీకి కలయికనాటి ఒప్పందం ప్రకారం తగిన ప్రాతినిధ్యం అఖిలభారత కాంగ్రెస్ నాయకులు కల్పించలేదని గొడవపడ్డాం. 1954–55లో ఎటువంటి పరిస్థితుల్లో ఐక్య కాంగ్రెస్ ఏర్పడిందో వాళ్లప్పుడే మర్చిపోయారు. కృషీకార్ లోక్‌పార్టీకి గౌరవప్రదమైన స్థానం కల్పించాలన్న పెద్ద మనుషుల ఒప్పందం గాలిలో కలసిపోయింది. ఈ అన్యాయాన్ని మేము ఎదురొడ్డినా ఫలితం శూన్యం.

లోక్‌సభకు నా పేరును ప్రతిపాదించడం మరో వింత. జిల్లా కాంగ్రెస్ కమిటీ సిఫారసు ప్రకారం నేను గానీ, భారతీ దేవి గారుకానీ పోటీ చేయాల్సి ఉంది. ఆంధ్ర ప్రాంతపు మంత్రుల గళం నా వైపు మొగ్గు చూపితే అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు మాత్రం దేవీజీని నిలబెట్టమని నన్ను ఒత్తిడి చేయసాగారు. కాంగ్రెస్ మద్దతు ఏమాత్రం లభిస్తుందో తెలియని పరిస్థితుల్లో ఆమె వాళ్ల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడేందుకు సిద్ధంగా లేదు. అయితే కృషీకార్ పార్టీ వర్గం ప్రజలు నా పక్షానే ఎల్లప్పుడూ మొగ్గు చూపడంతో అంత ఇష్టంకాకపోయినా అంగీకరించాల్సి వచ్చింది. చివరకు ఎలాగైతేనేం నాయకులు నా అభ్యర్థిత్వాన్ని సమ్మతించారు.

ఎఐసిసి నాయకులు నా అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయకముందే గుంటూరు జిల్లా నాయకులు కొందరు రాష్ట్ర నాయకులతో చేతులు కలిపి తెనాలి పార్లమెంటరీ నియోజక వర్గాన్ని కేటాయించి నాకు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేయాలనుకుంటున్నారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలియవచ్చింది. స్థానిక కమ్యూనిస్ట్‌ల మద్దతుతో ఒక స్వతంత్ర అభ్యర్థిని పోటీకి నిలిపి నన్ను ఓడించాలని చూస్తున్నారు. ఆ విధంగా కృషీకార్

లోక్‌పార్టీ ప్రజాదరణను కూడా దెబ్బతీయాలని చూస్తున్నారు. అది తెలుసుకున్న నేను స్థానిక కాంగ్రెస్ నాయకుల్ని కలసి వాళ్లు చెప్పేది ఓపిగ్గా విన్నాను. వాళ్లకు నచ్చచెప్పగలిగాను.

నేను అనధికారికంగా నా ఎన్నికల ప్రచారం ప్రారంభించిన పక్షం రోజులకు అర్థమైంది – ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలోని మంత్రుల మద్దతుదారులు బహిరంగంగా నన్ను వ్యతిరేకించడంలేదుకానీ పట్టుదలగా కమ్యూనిస్టుల్ని, తమ అభ్యర్థిని పోటీ నుండి తప్పుకోవద్దని కోరసాగారని. నా విజయం ఖాయమని తలచిన కమ్యూనిస్ట్‌లు నన్ను ఇరుకునపెట్టి ఆంధ్ర ప్రాంత ప్రజల నుండి అనవసరంగా అపఖ్యాతిని మూటగట్టుకో దల్చక వాళ్ల అభ్యర్థిని విరమింపచేస్తారనే తలంపుతో ఒక పలుకుబడి గల నాయకుని తరపున ఒకరితో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయించారు. ఆ స్వతంత్ర అభ్యర్థికి కమ్యూనిస్ట్‌లు మద్దతు పలికారు. ఆ అభ్యర్థి రాజకీయాలతో ఎక్కువగా ప్రమేయంలేని రైతు కుటుంబానికి చెందినవాడు. మంత్రి తరపు కాంగ్రెస్ వాళ్లు కూడా అతని పక్షాన నిలిచారు.

ఎన్నికల ప్రచారంలో మంత్రులకు దగ్గరగా ఉండే ఇద్దరు ప్రజా ప్రతినిధులు మాత్రమే నాకు బహిరంగంగా మద్దతు పలికారు. అందులో ఒకరు పి.కోటయ్య, రెండోవారు 'ప్రొఫెసర్ రంగా ఓటమిని జవహర్‌లాల్ ఓటమిగా భావించరాదు అని, ఒకవేళ ఓటమి సంభవిస్తే ఆయన తన మిత్రులకే ధన్యవాదాలు చెప్పాల్సి ఉంటుంది' అని ప్రచారం చేసినవారు.

రకరకాలుగా నన్ను ఓడించే ప్రయత్నాలు చేశారు ఆంధ్ర మంత్రుల మద్దతుదారులు. కులపరంగా వాళ్లు కొంత మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. కమ్యూనిస్ట్‌లు సోషలిస్ట్‌ల మద్దతు పొందారు. పది వారాలపాటు సాగిన ఎన్నికల ప్రచారంలో ఒక్క కాంగ్రెస్ మంత్రి కూడా నా నియోజక వర్గంలో తిరగలేదు. పి.సి.సి.లో మంత్రివర్యులు జవహర్‌లాల్‌జీని, మరికొందరు కేంద్ర మంత్రుల్ని రప్పించారు కానీ వాళ్లెవ్వరూ నా నియోజక వర్గంలో అడుగుపెట్టలేదు. కృష్ణా నదికి ఆవలి ఒడ్డుకు వచ్చిన జవహర్‌లాల్‌జీ ఈవలి ఒడ్డుకు రాలేదు. గుంటూరు వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నా నియోజక వర్గానికి రాలేదు.

నేను మహాత్మాగాంధీ ఆదర్శాలను నమ్మిన ప్రజలపైనా, కృషీకార్ లోక్‌పార్టీ మద్దతుదారులపైనా ఆధారపడ్డాను. గ్రామీణులు నాకు మద్దతు పలికేందుకు

ముందుకొచ్చారు. నేను వాళ్ల గ్రామాలకు వెళ్లాను. వాళ్ల ఇళ్లకు సైతం వెళ్లాను. పలు గ్రామాలవాళ్లు నా ఎన్నికల పర్యటన ఖర్చుల కోసం విరాళాలు కూడా ఇచ్చారు. రైతులు, వృత్తికళాకారులు అందులోనూ ముఖ్యంగా చేనేత పనివారు, హరిజనులు, ఇతర బడుగు వర్గాలకు చెందినవారు నా వెనుక నిలిచారు. వాళ్లంతా కమ్యూనిస్ట్ వ్యతిరేకులు. నేను వాళ్లకు కిసాన్ మజ్దూర్ పార్టీ సందేశాన్ని అందించేవాణ్ణి. నేను ప్రచారంలో రోజుకు 16 గంటలకు పైగా గడిపేవాణ్ణి. నా నియోజక వర్గంలోనేకాక గుంటూరు జిల్లాలోని మిగతా మూడు నియోజక వర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం ప్రచారం చేయాల్సి వచ్చేది. ఈ శ్రమనంతటినీ తట్టుకునేందుకు నా శరీర ఆరోగ్యం సహకరించేది. నేను కృషీకార్ లోక్‌పార్టీ కార్యకర్తలకు, గాంధేయవాదులకు ఎంతో రుణపడి ఉన్నాను.

ఇక **పి.కోటేశ్వరరావు, విజయ్‌రాజ్‌కుమార్, వీరాచారి** వంటివారు నా తరపున చేసిన ప్రచారం ఎన్నదగినది. వాళ్లు కిసాన్ మజ్దూర్ పార్టీ రాజ్యం గురించి చెప్పేవారు. రైతు కుటుంబ ఆర్థిక వ్యవస్థ, రైతుస్వామ్యపు ఆర్థిక విధానం వంటి వాటిని వివరించి నేను తిరిగి పార్లమెంట్‌కు వెళ్లడం తథ్యమని, అక్కడ నేను రైతుల, చేతివృత్తులవారి, గ్రామీణుల ప్రతినిధిగా వెళతానని చెప్పేవారు. కమ్యూనిస్ట్‌లకు వ్యతిరేకంగా కూడా ప్రచారం చేశారు. **గ్రామీణులు, రైతులు నన్ను ఆదుకున్నారు.** ఇన్ని అడ్డంకులు ఎదురైనా నన్ను **ఇరవై వేల ఓట్ల అధిక్యంతో గెలిపించారు.**

ఎన్నికలు ముగిసిన నెల రోజుల తర్వాత కూచిపూడిలో నిర్వహించిన విజయోత్సవ సభలో నేను రైతుల్ని హెచ్చరించడం జరిగింది: ప్రధాని నెహ్రూ అధ్యక్షతన పనిచేసే ప్రణాళికా సంఘం రైతులపై సహకార వ్యవసాయ విధానాన్ని రుద్దబోతున్నదని. దాన్ని ఖండించాడు కొత్త రఘురామయ్య. అయితే ఎల్వాల్ సదస్సులో ప్రవేశపెట్టిన గ్రామదాన పథకం ద్వారా అసలు రంగు బయటపడింది. నెహ్రూ చర్యలు దేశాన్ని ఆర్థికంగా అతలాకుతలం చేస్తాయని హెచ్చరిస్తూ వస్తూనే ఉన్నా. అయితే **అధికారం కోసం అర్రులు చాచే కాంగ్రెస్‌వాదులు నాకూ, జవహర్‌లాల్‌జీకి మధ్య గల విభేదాల్ని మరింతగా పెంచి పోషించి రాష్ట్ర రాజకీయాల్లో ముందడుగు వేశారు.** అయితే నేను మాత్రం వాటన్నింటినీ లెక్కచేయకుండా రైతుల పక్షాన నిలిచి గాంధేయ మార్గాన్ని అనుసరించాను.

8

సెంట్రల్ అసెంబ్లీలో నా కృషి

1935-46 మధ్య నడిచిన తొలి కేంద్ర శాసనసభలో నేను కీ.శే. **భూలాభాయ్ దేశాయ్** నాయకత్వంలో పనిచేశాను. ఆయన అక్కడ కాంగ్రెస్ నేతగా ఎన్నుకొన బడినప్పుడు సర్దార్ పటేల్‌లాగా, డాక్టర్ రాజేంద్రప్రసాద్‌లాగా, సి.రాజగోపాలాచారిలాగా పేరు ప్రఖ్యాతులు కలవాడు కాకపోయినా అనతికాలంలోనే కేంద్ర శాసనసభలో గొప్ప వక్తగా పేరు గడించాడు. ఆయన జ్ఞాపకశక్తి ఎంత గొప్పదంటే ఎటువంటి సున్నిత అంశమైనా ఒక గంటసేపు అనర్గళంగా ప్రసంగించగలడు. ఆయన వాగ్ధాటి అలాంటిది. ఆయన మాట్లాడుతూ ఉంటే అందరూ మంత్రముగ్ధుల్లా వింటూ కూర్చునేవారు. మంత్రులు సమాధానం చెప్పేందుకు చాలా కష్టపడాల్సి వచ్చేది. ప్రతిపక్షంలో ఉన్న మాకు (పార్టీ ప్రమేయం లేకుండా) ఆయన ప్రధాన ప్రసంగాలు స్ఫూర్తిదాయకంగా ఉండేవి. అయితే చిత్రమేమిటంటే అక్కడి రాజకీయాల కారణంగా ఈయన మాట్లాడిన వెంటనే జిన్నాకు మాట్లాడే అవకాశం ఇచ్చేవారు.

శ్రీ **గోవింద వల్లభ్ పంత్** మాకు ఉప నాయకుడు. ఆయన బడ్జెట్‌పైనా, ఆర్థిక అంశాలపైన చేసే ప్రసంగాలు అందరినీ బాగా ఆకట్టుకునేవి. ఆర్థిక శాఖామాత్యులకు ఆయనంటే సింహస్వప్నమే.

కేంద్ర అసెంబ్లీ (1937) సభ్యులు, కింద నుంచి 4వ వరుస, కుడి నుంచి మూడోవ్యక్తి రంగ

చర్చల్లోగానీ, ప్రశ్నోత్తరాల సమయంలోగానీ, తిప్పికొట్టడంలోగానీ **సత్యమూర్తి**ది అందవేసిన చెయ్యి. ఆయన బాగా శ్రమించేవాడు, క్రియాశీలి. వాగ్వివాదంలో వెనుదీసేవాడు కాదు. అంశాలను ఒకదాని తర్వాత ఒకటిగా పేర్చుకుని తూటాల్లా పేల్చేవాడు. ఆ క్షణం పదిమంది ప్రభుత్వ పక్షంలోని తెల్లవాళ్లు కూడా ఆయనకు సాటిరారు. ఆయన ఆంగ్లనైపుణ్యంలోనేకాదు కామన్‌వెల్త్ దేశాలన్నింటితో సరిపోల్చినప్పుడు కూడా సాటిలేని పార్లమెంటేరియన్.

మరొక అనుభవశాలైన దేశ భక్తుడు **ఎం.ఎస్. ఎనీ.** ఆయన నేషనలిస్ట్ పార్టీ అధినేత. పార్లమెంట్‌ని ప్రారంభించే సమయంలో గొంతు పెగిలేదికాదు. నోటినిండా సుపారీ. అయన గొప్ప వక్తలా కనిపించనే కనిపించరు. అయినా ఎవ్వరూ తడమని అంశాలను ముట్టి తడిమి చూపేవారు. ఆ విధంగా సభను రంజింపజేసేవారు. మా అదృష్టంకొద్దీ అయన 1959-67 మధ్యకాలంలో కూడా పార్లమెంట్‌లో ఉన్నారు. ఆయనకు అప్పటికి ఎనభై ఏళ్ల వయస్సు దాటినా ఎప్పటిలాగానే అప్రమత్తంగా వుండేవారు.

వీరిద్దరి నుండి మరో ఇద్దరు మంచి వక్తలు ఉండేవారు. ఒకరు **హెచ్.మోడీ**, మరొకరు **సర్ కావస్‌జీ జహాంగీర్.** మొదటివారు చక్కగా, శక్తిమంతంగా మాట్లాడేవారు, ఆకట్టుకుని విసిరేవారు. ఎనభై ఏళ్ల వయస్సులో కూడా ఆయనలో సరసం నిలిచే వుండేది. రెండోవారు రాజకీయాల్లో సమన్వయాన్ని జొప్పిస్తూ ఆర్థిక విషయాల్లో ఆయనదే విధానం వైపు మొగ్గుచూపుతూ మమ్మల్ని అలరించేవారు. ఈ ఇద్దరికీ **మీనూ మెహతా, గోపాలకృష్ణ గోఖలే** అంటే గురి.

ఆ రోజుల్లో స్పీకర్ పదవికి అత్యంత రాజకీయ ప్రాముఖ్యం లభించేది. పరాయి దేశాలపై రాజకీయ ప్రయోజనంకానీ, పార్లమెంటరీ సాఫల్యాలుకానీ లభించేది ఆ పదవిలో ఉన్నవారి రూలింగ్ కారణంగానే. అటువంటి పదవికి తొలిసారిగా ఎన్నుకున్నది **మావలంకర్**ను. మేమూ ఆ పదవి కోసం ప్రయత్నాలు చేశాంకానీ **జిన్నా**మద్దతు మాకుండగా ఆ పదవి **సర్ అబ్దుర్ రహీం**కు దక్కింది. అతను ప్రభుత్వానికి బాగానే కోపు కాని స్వాతంత్ర్యానికి పూర్వం స్టాండింగ్ ఆర్డర్స్, రూల్స్, ప్రొసీజర్స్‌కు అంతగా ప్రాముఖ్యత లేకపోయినప్పటికీ సత్యమూర్తి చేతిలో అవి ఆయుధాలుగా నిలిచాయి.

చాయిదా తీర్మానాలంటే ప్రభుత్వానికి హడల్. అనధికార తీర్మానాలు పలుమార్లు ప్రమాదభరితంగా మారేవి. మంత్రుల్లో **ఎన్.ఎన్. సర్కార్** మాత్రం తట్టుకుని నిలబడగలిగేవాడు. **సర్ జేమ్స్ గ్రిగ్** అనే ఆయన కాస్త ఎదురుదాడికి దిగగలిగేవాడు.

చాలామంది మంత్రుల కంటే (అప్పుడు వాళ్లను ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్లు అనేవాళ్లు) మేమే చర్చల్లో మెరుగ్గా కనిపించేవాళ్లం. మేము సభను వదలి వెళ్లేవాళ్లంకాదు. మిలిటరీవాళ్ల మాదిరి మేము దానికి రక్షణ కల్పిస్తున్నాం అనుకునేవాళ్లం.

మేము కాంగ్రెస్ సభ్యులుగా పలు సందర్భాల్లో కీలకమైన అంశాలపై నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చేది. ఉదాహరణకు సెంట్రల్ లెజిస్లేచర్‌ను ఉద్దేశించి వైశ్రాయి ప్రసంగించేటప్పుడు మేము హాజరుకావాలా, వద్దా అనే అంశాన్నే తీసుకుందాం. మొదటి పర్యాయం ఆ విషయంలో మాకు ఇబ్బంది ఎదురుకాలేదు. అందుకు కారణం అప్పటి వైశ్రాయి **లార్డ్ విఖ్లింగ్‌డన్**. 1932లో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు హాజరై తిరిగి వచ్చిన గాంధీజీ తనను కలుసుకునే అవకాశాన్ని నిరాకరించాడు. కాంగ్రెస్‌ను అవమానపర్చాడు. అందువల్ల కాంగ్రెస్ సభ్యులు సభలకు హాజరుకాకుండా ఉండడం సహజమే. కాని **లార్డ్ లిన్‌లిత్‌గో** తర్వాత వైశ్రాయి అయినప్పుడు ఆయన గాంధీజీతో మాట్లాడారు. వ్యవసాయాభివృద్ధికి శ్రీకారంచుట్టారు. గ్రామీణాభివృద్ధికి కోటి రూపాయలు గ్రాంట్‌గా ఇచ్చారు. అయినా అధికారులకు వ్యతిరేకంగా సాంఘిక బహిష్కరణ నిర్ణయానికి మేము కట్టుబడి ఉండాల్సి వచ్చింది. న్యాయశాఖామంత్రి ఇన్సూరెన్స్ అమెండ్‌మెంట్ బిల్లు చర్చ సందర్భంగా భారతీయుల ఆందోళనను పరిగణనలోకి తీసుకుంటానని, మా మద్దతును అందించాల్సిందిగా కోరినప్పుడు సుదీర్ఘ చర్చ తర్వాత మద్దతు పలికేందుకు సమ్మతించాం. ఆ విధంగా **మేము జాతి ప్రయోజనాలని కాపాడుకునేవాళ్లం.**

ఇతర దేశాల్లో నివసించే భారతీయుల విషయంలో మరీ ముఖ్యంగా దక్షిణాఫ్రికాలో నివసించేవాళ్ల విషయం వచ్చినప్పుడు ప్రతిపక్ష సభ్యులందరం ఒకటిగా నిలిచి భారతీయ ఐక్యతను చాటిచెప్పేవాళ్లం. అటువంటి ఐక్యతా ప్రదర్శన కోసం, ప్రభుత్వ పన్నాగాలను తిప్పికొట్టేందుకు అప్పుడప్పుడూ జిన్నాతో చేతులు కలిపేందుకు సైతం వెనకాడేవాళ్లంకాము.

ఎన్.ఎం.జోషి, వి.వి.గిరి, నేను శ్రామిక వర్గ విషయాల్లో కలసి పనిచేసేవాళ్లం. అది ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలిచే ఒక మహత్తర కలయికగా భావించేవాళ్లు. మేము వ్యవసాయ కూలీల రక్షణ కోరాం. కాంట్రాక్ట్ లేబర్ విధానం రద్దుకు కృషి చేశాం. శ్రామిక వివాదాల సందర్భంగా రాజీ కుదిర్చే యంత్రాంగం చొరవ చూపాలని కోరాం. కార్మిక చట్టాలను వ్యవసాయ కూలీలకు కూడా వర్తింపజేయాలనే పట్టుదల నాది.

నేను అసెంబ్లీ సభ్యుడినైన సంవత్సరంలోపే మంచి గుర్తింపు లభించింది. బాగా ప్రసంగాలు చేసే బహు కొద్దిమంది సరసన నిలిచాను. నాయకుణ్ణి, ఉప నాయకుణ్ణి, సత్యమూర్తిని, తర్వాత ఆర్థిక మంత్రిని, కార్మిక మంత్రిని, వ్యవసాయ మంత్రిని నా అంతగా ఇరుకున పడేసినవాళ్లు మరొకరు లేరు. **మాన్‌చెస్టర్ గార్డియన్** పత్రికా విలేకరి నన్ను భారతదేశ అసెంబ్లీలో **మాక్స్‌టన్** వంటివాడినని కొనియాడాడు. బోంబే క్రానికల్ ప్రత్యేక విలేకరి **కీశే షా** బడ్జెట్‌పై నా ప్రసంగాన్ని గాంధియన్ సోషలిజం బహిర్గతం చేసిన వాగ్ధాటిగా వర్ణించాడు. ఆంగ్లో ఇండియన్ పార్టీ నాయకుడు **సర్ ఫ్రెడరిక్ జేమ్స్**, 'భారతదేశంలోని రైతుల, శ్రామికుల తరఫున ప్రభుత్వాన్ని చీల్చిచెండాడే ప్రసంగాలు నేను చేయగలనన్నాడు. మా పట్ల నిరంతరం విమర్శలు గుప్పించే **జేమ్స్ గ్రిగ్** కూడా 'భారతదేశపు సామాన్యుల తరఫున శ్రద్ధగా మాట్లాడగల ఏకైక వ్యక్తివి నువ్వే' అని కొనియాడాడు. **అయినా స్పీకర్ దృష్టిలో మాత్రం కొరకరాని కొయ్యను.** ఎక్కడ దొరుకుతానా అని చూసేవాడు. అటువంటి అవకాశం ఆయనకు దొరకనిచ్చేవాణ్ణికాదు.

ఒక పర్యాయం నేను మంత్రి ధోరణి పాశవికంగా ఉందని చాలా మెల్లగా అన్నాను. అంతే ముంది దొరికిపోయాననుకున్నా. కాని నేను అనేది ఏమిటని ఆయన అడిగారు. చాలా నేను ఏదో అనుకుంటున్నా' అన్నాను. 'గౌరవ సభ్యులు అటువంటి మాటలు ఆ మాత్రం శబ్దం కూడా చేయకుండా మాట్లాడుకోవాలి' అన్నారు. (సభ నవ్వులతో దద్దరిల్లడం సహజమేగా).

నేనెప్పుడూ పెట్టుబడిదారుల పక్షం వహించకపోవడంలో ఆశ్చర్యపడాల్సిందేమీలేదు. అయితే కాంగ్రెస్ పక్షంలోని ధనికులంతా ప్రభుత్వ పక్షంలోని ధనికులతో వాళ్ల వుమ్మడి

కేంద్ర అసెంబ్లీ (1937) సభ్యులు, కింద నుంచి మూడో వరుస, కుడి నుంచి మొదటి వ్యక్తి రంగ

ప్రయోజనాల కోసం చేతులు కలిపేవాళ్లు. ఐరోపా పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం ఉద్దేశించబడిన ఒడంబడికను కాంగ్రెస్ పెట్టుబడిదారులు సమర్థించే సందర్భంగా నేనన్నాను: **'చిరుతపులి మచ్చలైనా మారిపోవచ్చు కానీ ధనవంతులు మాత్రం మారరని!**

అసెంబ్లీకి ఒక మంచి గ్రంథాలయం ఉండేది. డాక్టర్ **కుంజ్రూ**, నేనూ తెగ చదివేవాళ్లం. అప్పటి గ్రంథ పాలకుడు కే.శే. **ముఖర్జీ** గారు మాకు బాగా సహాయపడుతూ ఉండేవారు. మాకు ఫలానా విషయం మీద సమాచారం కావాలనగానే దానికి సంబంధించిన సమస్త పుస్తకాలు, నివేదికలు మాకు అందించేవాడు. ఆయన కూడా మంచి చదువరి. అటువంటి గ్రంథ పాలకులుంటే మాటల యుద్ధంలో ఐదో వంతు నెగ్గినట్టే.

ఇటు చట్ట సభల్లోగానీ, అటు కమిటీ చర్చల్లోకానీ నేను ప్రజాదరణ కలిగిన అంశాలపై శక్తిమంతంగానూ, ఎదుటివాళ్లను ఒప్పించే ధోరణిలోనూ మాట్లాడతాననే కీర్తిని మూటగట్టుకున్నా. అందువల్లనే సర్దార్ పటేల్ తన వద్దకు వచ్చిన అటువంటి నివేదికల్ని నాకు పంపేవారు. అలా నాకు చేరిన తొలి అర్జీ గుజరాత్ రైతులకు సంబంధించినది. 1935-36లో వచ్చిన వరదల్లో వాళ్లకు సంభవించిన నష్టానికిగాను ప్రభుత్వం అందించాల్సిన సాయానికి సంబంధించిన అర్జీ అది. ఆ విషయంలో వచ్చిన విజయం నాలో ఆత్మవిశ్వాసాన్ని ఎంతగానో పెంచింది. **గాంధీ-ఇర్విన్ ఒప్పందం**లోని ఉప్పు క్లాజును ఉప్పు పండించే తీరప్రాంత రైతులందరికీ వర్తింప జేసేటట్లు చూసినందుకు గాంధీజీ అభిమానానికి పాత్రుణ్ణయ్యాను.

అప్పట్లో నేను నాగార్జున కొండ వద్ద మ్యూజియం నిర్మించాలని, దాన్ని చేరేందుకు అనువుగా కార్లు వెళ్లే మార్గాన్ని ఏర్పాటుచేయాలని కోరాను. అది అమలుకు నోచుకుంది. అలాగే భట్టిప్రోలు, మరికొన్ని బౌద్ధ ప్రాముఖ్యాన్ని సంతరించుకున్న ప్రదేశాలను సంరక్షించే బాధ్యతను ప్రభుత్వం నా కోరిక మేరకు చేపట్టింది.

అయితే పెడెంట్ యూనియన్ యాక్ట్‌కు సంబంధించి నేను ప్రవేశపెట్టిన బిల్లు, రైతులు, మిగతా సన్నకారు రుణగ్రహీతలు జైలుపాలు కాకుండా చూసే బిల్లు, క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ (నేర చరిత్ర గల ఆదివాసీల చట్టం) పై బిల్లులు అధికార పక్షం నుండి వ్యతిరేకతను ఎదుర్కొన్నాయి.

నేను ప్రజా ప్రతినిధుల్లో రైతు అనుకూల పక్షాన్ని ఒకదాన్ని ఏర్పాటుచేయడంలో చొరవ చూపాను. దానికి డాక్టర్ **ఖాన్ సాహెబ్** అధ్యక్షత వహించేందుకు అంగీకరించారు.

అది భూలాభాయ్ దేశాయ్‌కి, సర్దార్ పటేల్‌కు నచ్చలేదు. అయితే గాంధీజీ మద్దతు లభించింది. ఆ రైతుల పక్షం సభలోని ఇరు పక్షాల సభ్యులపై తన ప్రభావాన్ని చూపగలిగింది.

సాధారణంగా బాగా ప్రసంగించేవాళ్లు మంత్రులు అవుతారని అనుకుంటారు. 1937లో మమ్మల్ని వదిలేసి ప్రొవెన్షియల్ అసెంబ్లీలకు ఎంపికైన పలువురు వాద ప్రతివాదాల్లో ఎటువంటి ప్రావీణ్యమూ సంపాదించనివారు బీహార్, మద్రాస్, మధ్యప్రదేశ్, అస్సాం, ఉత్తర ప్రదేశ్, బొంబాయి వంటి తావుల్లో ముఖ్యమంత్రులు, మంత్రులు అయ్యారు. ఇక స్వాతంత్ర్యానంతరం అటువంటి సరుకులేని సభ్యుల గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పనేముంది?

నేను శాసనసభ్యునిగా భావితరాలు గుర్తుంచుకునే పని ఒకటి చేశాను. శ్రీకృష్ణదత్త పాలీవాల్, మోహన్‌లాల్ సక్సేనాలతో కలసి అసెంబ్లీ హాలు శిఖరాగ్రానికి చేరుకుని దానిపై ఎగిరే యూనియన్ జెండాను తొలగించాను. ప్రజలు ఎన్నుకున్న సభ్యులున్న భవనంపై పరాయి పాలకుల జెండా ఎగరడమేమిటనేది మా వాదన. అటువంటి పనికి మాతో క్షమాపణ చెప్పించమని గాంధీజీని వైశ్రాయి కోరారు. దాన్ని మేము తీవ్రంగా ఖండించాం. అలా 1947లో అధికారికంగా జరగాల్సిన చర్యను ఎనిమిదేళ్ల ముందుగానే చేపట్టి ఆ పనిలో వైతాళికులుగా నిలిచాం.

ఆ సభకు విదేశాంగ నీతికి సంబంధించిన అంశాలను చర్చించే హక్కులేదు. మేము అలా చర్చించగలిగేది ఆదివాసులకు సంబంధించిన అంశాలపైనే. ఆ విషయంపై డాక్టర్ ఖాన్ సాహెబ్ శక్తిమంతమైన ప్రసంగాలు చేసేవారు. డాక్టర్ **గిల్బర్ట్ సాల్టర్** ఆక్స్‌ఫర్డ్ బ్రెయిల్స్ పోర్డ్‌ల్లో నా పర్యవేక్షకుడు) అదివాసీల నుండి ఎటువంటి కవ్వింపు చర్యలు లేకుండానే వాళ్ల గ్రామాలపై బాంబుల వర్షం కురిపించడాన్ని దుయ్యబట్టేవాడు. ఆ విధానానికి వ్యతిరేకంగా నేను ఒక సంవత్సరంపాటు జాతీయ స్థాయి ఉద్యమాన్ని నిర్వహించాను. దేశ విభజన తర్వాత అటువంటి దాడులు ఆగిపోయాయి. ఆదివాసీలు నివసించే ప్రాంతాల్లో బహుళార్థ సాధక ప్రాజెక్టులు నిర్మించి వాళ్ల సంక్షేమానికి పాక్ ప్రభుత్వం మాదిరిగా మనమూ చర్యలు చేపట్టాలని కోరేవాళ్లం.

అసెంబ్లీని సంప్రదించకుండా భారతదేశాన్ని ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో భాగస్వామిని చేసినదానికి నిరసనగా అసెంబ్లీ సమావేశాలకు వెళ్లరాదని కాంగ్రెస్ నిర్ణయించింది. యుద్ధ సమయంలో దాదాపు నాలుగేళ్లు మేము ఆ చట్ట సభ వైపునకు

తొంగిచూడలేదు. ఆ సమయంలోనే యుద్ధ సమయపు ఆర్డినెన్స్‌లు ప్రత్యేక చట్టాలుగా రూపుదిద్దుకున్నాయి. అసెంబ్లీ అనేది అంతా ఎగతాళి పంచాంగమైంది.

1944 నవంబర్‌లో తిరిగి కాంగ్రెస్ పార్టీ సభ్యులు చట్ట సభల్లోకి ప్రవేశించారు. సహాయ నిరాకరణ, జైలుకు వెళ్లే కార్యక్రమాల అనంతరం యుద్ధ సమయపు దోపిడీ నుండి ప్రజలను కాపాడేందుకు అలా చేయడం జరిగింది. ఈసారి సభలో సత్యమూర్తి లేరు. అమరోతి జైలులోని హింసల కారణంగా కన్నుమూశారు. ఆయన మంత్రి కాలేదు. అయితేనేం శక్తి సంపన్నుడైన మంత్రి సాధించే దాని కన్నా అధికంగానే సాధించగలిగాడు. ఆయనలేని కారణంగా అసెంబ్లీ చిన్నబోయింది!

లియాఖత్ అలీఖాన్తో చేతులు కలిపి భూలాభాయ్ దేశాయ్ అత్యంత తీవ్రమైన తప్పు చేశాడు. అందుకు కారణం వాళ్లిద్దరూ కలసికట్టుగా ఒక అభ్యర్థనను ప్రభుత్వం ముందు ఉంచదలిచారు. అదే ఆపద్ధర్మ జాతీయ ప్రభుత్వం. ఇంకా అప్పటికి కొందరు జాతీయ నాయకులు అహ్మద్‌నగర్ కోటవంటి జైళ్లలో మగ్గుతుండగా వాళ్లను సంప్రదించకుండా ఇటువంటి నిర్ణయం సముచితం కాదనుకున్నాం మాలో కొంతమందిమి. కొద్ది మాసాల తర్వాత జాతీయ నాయకుల్ని జైళ్ల నుండి విడుదల చేశారు. బ్రిటిష్‌వాళ్లు ఆ నాయకులను పైస్థాయిలో ప్రత్యేకంగా సంప్రదించసాగారు. అటువంటి తరుణంలో భూలాభాయ్ గారు జాతీయ నాయకుల విశ్వాసాన్ని కోల్పోయారు. తర్వాత నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో ఆయన పోటీ చేయనేలేదు. ఆ విధంగా తన ప్రథమ శ్రేణి పార్లమెంటేరియన్ రాజకీయ వ్యాపకానికి తెరపడింది. అయినా ఆయన ఇండియన్ నేషనల్ ఆర్మీ తరఫున వినిపించిన వాదనను అందరూ శ్లాఘించారు. ఆయన ఉద్యమంలో తిరిగి తిరుగులేని నాయకుడయ్యాడు. అయినా ఆయనకు నూకలు చెల్లాయి. ఆయన మరణంతో జాతి, చట్ట సభ ఎనలేని ప్రజా ప్రాతినిధ్య విధానపు అధినేతను కోల్పోయాయి.

9

పార్లమెంటరీ కమిటీల పాత్ర

కమిటీలు-అవి స్థాయీ సంఘాలు కానివ్వండి, సలహా సంఘాలు కానివ్వండి ప్రజాస్వామిక సంస్థలకు మూలస్థంభాలని చెప్పొచ్చు. అవి చర్చిస్తాయి, సంసిద్ధం చేస్తాయి, సలహాలను అందిస్తాయి. కేంద్రంలో ఇటువంటి సంఘాల ఏర్పాటులో బ్రిటిష్ ప్రభుత్వం తన నిజాయితీని నిరూపించుకుంది. **ఇటువంటి సదాచారాన్ని వదలివేయడమన్నది నెహ్రూ పాలనాకాలంలో చేపట్టిన తెలివితక్కువ పని.**

కేంద్ర అసెంబ్లీ నన్ను పబ్లిక్ అకౌంట్స్ కమిటీకి, అగ్రికల్చర్ కమిటీకి సభ్యునిగా ఎన్నుకున్నది. తాత్కాలిక పార్లమెంట్ కాలంలో నన్ను స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీకి ఎన్నుకున్నారు. దాన్ని ఇప్పుడు ఎస్టిమేట్స్ కమిటీ అంటున్నారు. పరిశ్రమలు, పౌర సరఫరాల మంత్రిత్వ శాఖలకు సంబంధించిన కమిటీలకు కూడా నేనే సభ్యుణ్ణి. పార్లమెంట్ సభ్యులుగా అనుభవం గడించినవారు అటువంటి కమిటీల్లో విలువైన తోడ్పాటును అందించవచ్చు లేదా అవినీతికీ పాల్పడవచ్చు. ఆ కమిటీలను ఇప్పుడు అనధికార సంప్రదింపుల కమిటీలు (ఇన్‌ఫార్మల్ కన్సల్టేటివ్ కమిటీలు) అంటున్నారు. ఈ కమిటీ సభ్యుల నియామకం పూర్వంలాగా ఎన్నిక ద్వారా జరగడంలేదు. అందువల్ల అధికారయుతంగా కాకపోయినా సలహాల రూపంలో బాగానే సహాయం అందించవచ్చు.

కేంద్ర అసెంబ్లీ (1937) సభ్యులు, కింద నుంచి మూడో వరుస, కుడి నుంచి మూడోవ్యక్తి రంగ

ఎస్టిమేట్స్ కమిటీ, మంత్రిత్వ శాఖల పనితీరుపై బాగానే దృష్టి సారించడం జరుగుతున్నది. అవకతవకలపై కన్నువేసి ఉంచడం జరుగుతున్నది. పాలన సజావుగా సాగేందుకు, వ్యయ నియంత్రణకు తగు సూచనలు ఇవ్వడం కొనసాగుతున్నది. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ తన కొరడా ఇంకా ఝుళిపిస్తూనే ఉంది. అయితే బాధాకరమైన అంశమేమంటే ఆ కమిటీ సిఫారసుల్ని మంత్రులు అంతగా పట్టించుకోవడంలేదు. రాజ్యసభను తన సభ్యుల్ని ఈ కమిటీలకు ఎంపిక చేసుకోవాల్సిందిగా సూచించడం శుభ సూచకమే. అయితే ఈ కమిటీలకు నిర్ణయాల్లో భాగస్వామ్యం వుండేటట్టు చేసి ప్రతిపక్షాలు కూడా తమ వంతు కృషి చేసేందుకు అవకాశం కల్పించడం ఎంతైనా అవసరమే.

పార్లమెంటరీ కమిటీలతోపాటు వివిధ మంత్రిత్వ శాఖలు కూడా పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై సలహాలిచ్చేందుకు శక్తిమంతమైన బోర్డులను లేదా కమిటీలను నియమించేవి. నేను జౌళి పరిశోధనా నిధుల కమిటీ, జౌళి సలహా కమిటీ, చేనేత బోర్డు, కుటీర పరిశ్రమల బోర్డు, అగ్రికల్చరల్ మెషినరీ కమిటీ, వ్యవసాయ సమాచార కమిటీ, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చి వంటి వాటిలోనూ, వాటి ఉప సంఘాల్లోనూ సభ్యునిగా ఉండి సేవలందించాను. అలాగే చట్టపరంగా రూపొందిన వివిధ ఉత్పత్తుల కమిటీలు ఉండేవి. అటువంటి కమిటీల ఏర్పాటును సమర్థించాను. ఇండియన్ సెంట్రల్ ఆయిల్ సీడ్స్ కమిటీకి వ్యవస్థాపక ఉపాధ్యక్షుణ్ణి నేను. ఆ పదవిలో ఉన్న ఐదేళ్లకాలంలో కమిటీ నాయకత్వం క్రియాశీలంగా ఉంటే పరిశోధనా రంగంలో అది సాధించగలిగిన అభివృద్ధిని నిరూపించగలిగాను. నేను నూనె ఉత్పత్తిదారుల సహకార సంఘాల ఏర్పాటుకు కృషి చేశాను.

అంతర్జాతీయంగా ఏర్పడిన ఎఫ్ఎఒ జాతీయ స్థాయిలో ఎఫ్ఎఒల జోన్ కమిటీలు ఏర్పాటుచేసుకోవాల్సిందిగా సభ్య దేశాలకు సూచించింది. మేము మూడేళ్లపాటు పోరాడిన తర్వాతగానీ భారతదేశంలో అటువంటి కమిటీ ఏర్పాటుకాలేదు. 1950-57 మధ్యకాలంలో ఆ కమిటీకి పార్లమెంట్ నన్ను ఎన్నుకున్నది. కేంద్ర వ్యవసాయ శాఖామంత్రి దానికి అధ్యక్షత వహించేవారు. ఆయన లేనిసమయంలో ఆ స్థానంలో నేనుండేవాణ్ణి. మంత్రిత్వ శాఖ యథాతథ ధోరణి వల్ల మేము పెద్దగా చొరవ తీసుకోలేకపోయాం. అయితే ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ స్టాటిస్టీషియన్స్ విషయంలో మాత్రం నేను మార్గదర్శకంగా ఉండగలిగాను. దానికి అప్పటి వ్యవసాయ

శాఖామంత్రి రాజేంద్రప్రసాద్ గారు అధ్యక్షులు. నా అనుభవాన్ని పురస్కరించుకుని నన్ను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. రెండేళ్ల నా పదవీకాలంలో వ్యవసాయ ఖర్చులపై సర్వేలు చేయించాను. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, ఆదాయాలు, కూలివంటి అంశాలపై సూచీలను తయారుచేయించగలిగాను.

పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీకి అనేక కమిటీలను నియమించడం ఆనవాయితీగా మారింది. వాటిల్లో పార్లమెంట్ సభ్యుల్ని నియమించడం జరిగేది. వాటి పనులు అంత పకడ్బందీగా జరగకపోయినా ఎంతోకొంత ప్రయోజనం చేకూరేది. 1955-59 మధ్యకాలంలో అటువంటి అనేక కమిటీలకు నన్ను నియమించి కాంగ్రెస్ నా సేవల్ని బాగా వినియోగించుకుంది.

జవహర్‌లాల్‌జీ నన్ను విదేశాంగ శాఖకు చెందిన కమిటీకి కన్వీనర్‌గా వుండమన్నారు. ఆ కమిటీ విదేశాంగ మంత్రిగా ఉన్న ప్రధాని నుండి సమాచారాన్ని వివరంగా రాబట్టడం కంటే పెద్దగా చేసేదేమీ ఉండదు. జవహర్‌లాల్‌జీ దృక్పథాన్ని వివరించి చెప్పడమే దాని పని. 1959 వరకూ సర్దుకుపోయానుకానీ ఆ తర్వాత **ఆయన అలీన విధానంలోని చాందసాన్ని ప్రశ్నించసాగాను.**

మొత్తంగా చూస్తే పార్లమెంట్ అధిక సంఖ్యలో కమిటీలను నియమించాల్సి వుంది. తద్వారా మంత్రిత్వ శాఖల్ని అదుపు చేయవచ్చు. మార్గదర్శనం గావించవచ్చు. సహాయపడవచ్చు. అయితే కమిటీలకు మరింతగా అధికారాలను అప్పగించాల్సి వుంది. వాటిలో ప్రాతినిధ్య సభ్యుల సంఖ్యా బలం పెరగాల్సి ఉంది. దీనివల్ల మంత్రుల ప్రాబల్యం తగ్గకుండానే వాళ్లకు సహకారం అందించే అవకాశం ఉంది. అటువంటి సంఘాలు మంత్రిత్వ శాఖల అపజయాలు, లోపాలను సకాలంలో పార్లమెంట్‌కు నివేదించే అవకాశం లభిస్తుంది. అది సభ్యుల సాహసం, అనుభవాల వల్ల సాధ్యపడుతుంది. కేబినెట్ నిర్ణయాలకు అనుగుణంగానే చట్టాల పరిధి లోపలే శక్తిశాలురు, అనుభవజ్ఞులు, సాహసోపేతులైన సభ్యులు ప్రభుత్వాన్ని, ప్రభుత్వ శాఖలను ప్రభావితం చేయగలరని నా అనుభవం నాకు నేర్పింది.

ఇటువంటి కమిటీలకు మరిన్ని అధికారాలు ఉండాలని, ఈ కమిటీలకు అనధికార సభ్యులు అధ్యక్షులుగా ఉండాలని ప్రతిపక్షాలన్నీ కలసికట్టుగా 1967 సాధారణ ఎన్నికల తర్వాత డిమాండ్ చేయడం జరిగింది.

10

రైతు విద్యాలయం నుండి అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ వరకూ :1934-36

రమ-నీడు విద్యాలయంలో అఖిలభారత రైతు సంస్థ తరఫున 1934 ఏప్రిల్‌లో తొలి సదస్సు నిర్వహించడం ఒక గొప్ప అభివృద్ధిదాయక పరిణామం. నేను దానికి వ్యవస్థాపక ప్రిన్సిపాల్‌ను. సోదరులు జి.ఎల్.నారాయణ స్థానిక సంరక్షకుడు. భారతీదేవీజీ హాస్టల్ వార్డెన్. సోదరులు జి.వి.అప్పయ్య, సమీప బంధువు ఎన్.వి.సుబ్బయ్యలు భజన కార్యక్రమాలు చూసేవాళ్లు.

ఆ విద్యాలయంలోని విద్యార్థులకు దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక సమస్యలను వివరించేందుకు ఆంధ్రదేశంలోని ప్రముఖులైన సామాజిక, రాజకీయ నాయకులను ఆహ్వానించాం. ఆంధ్ర ప్రాంతం నుండి మొత్తం 75 మంది విద్యార్థులు చేరారు. విద్యార్థులను చేర్చడంలో స్థానిక కాంగ్రెస్ నాయకుల సహకారం లభించింది. అయితే కాంగ్రెస్ నాయకుల్లో కొందరు అడ్డుతగిలినవారూ లేకపోలేదు. **విద్యార్థుల్లో అధికులు సవర్ణ మధ్యతరగతి రైతు కుటుంబాల నుండి వచ్చినవారు. అయితే పలువురు హరిజన విద్యార్థులు కూడా ఉన్నారు.** కిసాన్ పబ్లికేషన్స్ సంపాదకులు ఎన్.వి.సుబ్బయ్య గారు రైతు భజనావళి నుండి పాటలను ఎంపిక చేసి వాళ్లతో పాడించేందుకు సాయపడ్డారు.

ఆ విధంగా మేము ఈ సంస్థ ద్వారా భారత జాతీయతకు విప్లవాత్మక రైతు విధానాలను జత చేయసాగాం. దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు గారు ఆంధ్ర పత్రిక ద్వారా మా కార్యక్రమాలకు బహుళ ప్రచారాన్ని సమకూర్చారు.

ఇంటూరుకు చెందిన పాత్రికేయులు పి.నాగేశ్వరరావు గారు రైతు విద్యాలయానికి కార్యదర్శి. ఆయన తర్వాత 'వాహిని' వార పత్రిక సంపాదకులుగా ఉన్నారు. తర్వాత ప్రముఖ తెలుగు దినపత్రిక ఆంధ్ర పత్రిక సంపాదకులయ్యారు.

తొలి విడత విద్యాలయంలో శిక్షణ పొందినవారు ఆంధ్ర రాజకీయాల్లో ఉన్నతులైనవారయ్యారు. ఉదాహరణకు **కందుల ఓబులరెడ్డి** గారు ప్రొవెన్షియల్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రి పదవిని చేపట్టారు. శ్రీకాకుళం జిల్లాలో **డి.ఎస్.రెడ్డి** ప్రముఖ నాయకులుగా వెలుగొందారు. **ప్రగడ కోటయ్య** శాసనసభ్యులు, చేనేత నాయకులు. **జి.శ్రీమన్నారాయణ** పి.బి.ఎన్. కళాశాల ప్రిన్సిపాల్. **కె.పాపయ్య** హరిజన సేవకు అంకితమైన సేవాధురీణుడు. **గొర్రెపాటి వెంకట సుబ్బయ్య** జిల్లా బోర్డుకు అధ్యక్షులయ్యారు.

మేమొక సాహసోపేత ప్రయోగాన్ని చేపట్టాం. **మేము పాఠశాల విద్యార్థులందరికీ సహపంక్తిభోజనాలు ఏర్పాటుచేశాం.** అదృష్టవశాత్తూ ఈ విషయంలో నాకు మా కుటుంబ సభ్యుల తోడ్పాటు లభించింది. అలా గాంధీ మార్గాన్ని అనుసరించి కులరహిత ధోరణికి మా సంస్థను ఒక ఉదాహరణగా నిలిపాం. నిదానంగా గ్రామస్థుల సహకారం కూడా ఈ విషయంలో లభించింది. ప్రభుత్వం మరో చిక్కు తెచ్చిపెట్టింది. 1933 ఏప్రిల్ నుండి నా కదలికలను కేంద్ర గూఢచారి శాఖకు చెందిన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఒకరు గమనించసాగారు. ఒక హెడ్‌కానిస్టేబుల్ ఆయనకు తోడుగా ఉండేవాడు. వాళ్లు నా ప్రసంగాలను యథాతథంగా తమ నివేదికల్లో చేర్చి పంపేవాళ్లు. రైతు ఆందోళనల సందర్భంగా రెండు పర్యాయాలు స్థానిక అధికారులు నన్ను నిర్బంధించే ప్రయత్నం చేశారు. విద్యాలయానికి ప్రిన్సిపాల్‌గా నా ఆరు వారాల సేవలు వాళ్లకు కంటగింపుగా మారాయి. అయితే నేను నిత్యం ఐదు లేదా ఆరు గంటలు ప్రిన్సిపాల్‌గా ఏమి బోధిస్తున్నానేది వాళ్లకు తెలియరావడంలేదు. ప్రధానమైన రాజకీయ అంశాలపై నా పాఠాల వివరాలు వాళ్లకు తెలియరావడంలేదు. ఆ వివరాలు కావాలంటే ఎవరైనా విద్యాలయంలో ప్రవేశం పొందాల్సిందే. ప్రభుత్వానికి చిర్రెత్తుకొచ్చింది. గూఢచారి శాఖ వాళ్లను నేను చెప్పేది రాసుకోనివ్వకపోతే విద్యాలయాన్ని మూసివేయాల్సి

వస్తుందన్నారు. అయితే వాళ్లు రావచ్చుకానీ నోట్స్ రాసుకుని నివేదికలు పంపడానికి అంగీకరించనన్నాను. నేను దేనికైనా సిద్ధమవడాన్ని చూసి ప్రభుత్వం మెత్తబడింది. ఆ విధంగా ప్రభుత్వ నిషేధానికి దూరంగా విద్యాలయం తన కృషిని కొనసాగించింది. అయితే అక్కడ శిక్షణ పొందేవాళ్లకు ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయనే ఆశ ఉండేదికాదు. అందుకు కారణం ఆ శిక్షణా సంస్థ, నేనూ ప్రభుత్వానికి కొరకరాని కొయ్యలుగా మారడమే. మాకు కాంగ్రెస్ నాయకుల ఆశీర్వాదాలు కొరవైనందున వారివల్లా లబ్ధి చేకూరేదికాదు.

మా సంస్థ తొలి శిక్షణా శిబిరాన్ని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంపాదకులు కె.సంతానం గారు ప్రారంభించారు. ఆ సభకు అధ్యక్షత వహించినవారు **దేశభక్త కొండా వెంకటప్పయ్య** పంతులు. అప్పుడు నేను పంతులు గారికి అంకితం చేసిన గ్రంథాన్ని **(మోడరన్ పాలిటికల్ ఇనిస్టిట్యూషన్స్)** బహుకరించాను. గుంటూరులో శారదా నికేతన్ స్థాపకులు **ఉన్నవ లక్ష్మీనారాయణ**, వినయాశ్రమం స్థాపకులు **సీతారామ శాస్త్రి** ఆశీస్సులందించారు.

సంవత్సరానికి ఒక పర్యాయమో, రెండు పర్యాయాలో నిడుబ్రోలులో శిక్షణా శిబిరాలు నిర్వహిస్తూనే ఉండేవాళ్లం. వాటితోపాటు రాయలసీమ (1936-37), మదనపల్లె (1938), విశాఖపట్నం (1938), శ్రీకాకుళం (1938-39), కడప, గుంటూరు జిల్లాల్లో (1940-41), కృష్ణా జిల్లాలో (1947-48), ఖమ్మం, హైదరాబాద్‌లో (1949), చల్లపల్లి (1952), రంగా గ్రామ్ (1947), తిరుత్తణి (1953), మదనపల్లిలో తిరిగి 1965లో శిక్షణా శిబిరాలు నిర్వహించాం. ఇక్కడ శిక్షణ పొందిన పలువురు వారి వారి తావుల్లో వారాంతపు సమావేశాలు నిర్వహించేవారు. వాటిల్లో కొన్నింటికి నేను హాజరయ్యేవాణ్ణి. కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్య స్థాపనకు రాజకీయ, ఆర్థిక ప్రాముఖ్యాన్ని గురించి ప్రసంగించేవాణ్ణి.

ప్రజల్లో చైతన్యాన్ని రగిలించేందుకు బుర్ర కథలు, జంగం కథలు, వీర గాథలు, ఏకపాత్రాభినయాలు ఎంతగా తోడ్పడతాయో సోదరులు **వెంకటప్పయ్య** సూచిస్తూ వుండేవారు. మేము ప్రత్యేకంగా తయారుచేయించిన పాటలు, పద్యాలు, వీరగాథలు ప్రదర్శన యోగ్యం చేయడంలో ఎన్.వి.రామానాయుడు, ఎన్.వి.సుబ్బయ్య ఎంతగానో తోడ్పాటునందించారు. ఈ పద్ధతి 1935 నుండి బహుళ ప్రచారం పొందింది. ప్రజానురంజకమైంది. తర్వాత ఈ పద్ధతిననుసరించే కమ్యూనిస్ట్‌లు, కాంగ్రెస్ వారు వారివారి ప్రచారాలకు మెరుగులు దిద్దుకుని శక్తిమంతంగా ప్రదర్శించారు.

రాజకీయ, సామాజిక సమస్యలపై రచనలు చేసే రచయితల్ని, కవుల్ని సన్మానించేందుకు పూనుకున్నాం. **1920లోనే మాకొద్దీ తెల్ల దొరతనం అనే పాట రాసిన గరిమెళ్లసత్యనారాయణ, అదవి బాపిరాజు, శ్రీ స్వామి-శివశంకర, గుర్రం మల్లయ్యమొదలైనవారు మా విద్యాలయం సత్కారాలను అందుకున్నవారిలో ఉన్నారు.** అది మరికొందరిని రాజకీయ అంశాలపై కవిత్వం రాసేందుకు పురికొల్పింది. ఈ స్ఫూర్తినందుకుని రైతు సమస్యలపై సర్వశ్రీ **ఏటుకూరి వెంకట నర్సయ్య, కొండవీటి వెంకటకవి, పల్నాటి కవి వీరభద్రాచారి** కవితలల్లారు. ప్రఖ్యాత కర్షక కవి **సెట్టిపల్లి** 1934 నుండి 1939 వరకూ ఏటా స్ఫూర్తిదాయకంగా నిలిచే పాటల్ని ఒకటి, రెండు సృజించి శిక్షణా సంస్థకు సమర్పిస్తూ ఉండేవారు. రైతు భజనావళి వంటివి విద్యార్థుల హృదయాలను కదిలించేవి. ఆయన 1939లోనే 26 యేళ్ల లేత వయస్సులో కన్నుమూశారు. ఆయనకు నివాళిగా ఆయన రచనలన్నింటినీ ఎ.జి.స్టాక్ గారి ముందు మాటతో ముద్రించాం.

ఆంధ్ర ప్రాంతమంతటా 1934, 1935ల్లో సాగిన రైతు యాత్రలు విజయభేరి మోగించాయి. దాంతో తమిళనాడు, మలబారు, దక్షిణ కెనరా ప్రాంతాల్లో విజయవంతంగా అవి సాగాయి. తహసీల్‌దార్లు, కలెక్టర్లు వాళ్లవాళ్ల తావుల్లోనే రైతు యాత్రలు జరిగే రోజుల్లో ఉండి రైతులు చెప్పేది శ్రద్ధగా విని ప్రభుత్వానికి నివేదికలు అందించాల్సిందిగా ఆదేశాలు అందాయి. రైతు ఉద్యమానికి చెందిన ఈ విద్యా సంస్థ సమయ పాలనకు, క్రమశిక్షణకు మారుపేరుగా ప్రభుత్వం గుర్తించిందికానీ ప్రొవెన్షియల్ కాంగ్రెస్ పెద్దలకు మాత్రం అది మింగుడుపడలేదు.

1934లో తొలిసారిగా నేను మలబారులో పర్యటించా. అది స్థానిక కార్యకర్తలకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. కేరళకు **తర్వాత కాలంలో కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రిగా ఉన్న శ్రీ శంకరన్ నంబూద్రిప్రసాద్‌కు నా పర్యటన బాధ్యతలను అప్పగించారు. అక్కడి ప్రజల వేదరికాన్ని, హరిజనుల సామాజిక న్యూనతను, ఆర్థికంగా శక్తిహీనతను చూసి చలించిపోయాను. అస్పృశ్యతకు వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు, జమీందారీ విధానానికి వ్యతిరేకంగా కిసాన్ ఉద్యమానికి ఊపునిచ్చే ప్రసంగాలు చేశాను.** 1940 వరకూ అక్కడి రైతు ఉద్యమాన్ని పటిష్టపర్చేందుకు ఆయన నా పర్యటనలను బాగానే వాడుకున్నారు. అయితే ఆయన అప్పటికే కమ్యూనిస్ట్ కాదల్చుకున్నారు కనుక **ఆ ప్రవాహపు శక్తంతా కమ్యూనిస్ట్‌లపరమైంది.** తమిళనాడులో కూడా నా పర్యటనల వల్ల లాభపడింది కాంగ్రెస్సేకానీ రైతు సంఘాలు కాదు.

1934లో సాధారణ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతున్న తరుణంలో

రాయలసీమలో అప్పుడప్పుడూ తొంగిచూసే కరవు తీవ్రరూపం దాల్చింది. ఆ సమయంలో భారతీదేవీగారు అనారోగ్యంపాలైంది. కోలుకోవడం కష్టమంటున్నారు వైద్యులు. అటువంటి విషాద ఘడియల్లో 'రాయలసీమలో కరవు రక్కసి అవతరించింది' అంటూ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశాను. అది ఆంధ్ర ప్రాంత రైతుల్ని సాయం అందించేందుకు కార్యోన్ముఖుల్ని చేసింది. ఒక నెల రోజులు మంచంలో ఉండి కోలుకున్న భారతీదేవీజీ నన్ను వెంటనే రాయలసీమకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టమన్నది. వెంటనే నేను కందుల ఓబులరెడ్డి గారితో కలసి కరవు పీడిత ప్రాంతాలైన కర్నూలు, బళ్లారి, అనంతపురం, కడప జిల్లాల్లో పర్యటించా. ఆ ప్రాంతపు కాంగ్రెస్ నాయకులంతా నాకు సహకరించారు. అందుకు కారణం నేను అత్యధిక మెజార్టీతో కేంద్ర శాసనసభకు ఎన్నిక కావడమే. **'పచ్చదనం నిప్పచ్చరం'** అనే నా భావన ఆనాటి హిందూ సంపాదకీయంలో చోటు సంపాదించుకుంది. 1926 ప్రాంతాల్లో ఒంగోలు ప్రాంత కరవు సందర్భంగా చేపట్టిన చర్యలు ఇక్కడ కూడా బాగా ఉపకరించాయి. వ్యక్తుల సాయం సరే ప్రభుత్వం సాయం అందించేటట్లు చూడాల్సిన అవసరం ఉంది. నా అభిప్రాయాలను రాయలసీమ కాంగ్రెస్ నేతలు అందిపుచ్చుకున్నారు.

పంటల స్థితిని బేరీజు వేస్తూ కరవు వచ్చిందా, రాలేదా అనే మీమాంసలో పడి ప్రభుత్వాన్ని కాలయాపన చేయవద్దని వాదించాను. కరవు తీవ్ర రూపం దాల్చిన తావుల్లో వెంటనే సహాయక చర్యల్ని చేపట్టమన్నాను. జనం పనులులేక పస్తులుండాల్చి వచ్చిన తావుల్లో స్థానిక బోర్డుల్ని పనులు కల్పించే కార్యక్రమాలను చేపట్టమన్నాను. సమీప అడవుల్లోని పచ్చికలో పశువుల్ని మేపుకునేందుకు అనుమతించ మన్నాను. వరిగడ్డి ఇతర ప్రాంతాల నుండి కొని తెచ్చి ఇక్కడ ఉచితంగా పంచమన్నాను. చౌక ధరల్లో ధాన్యం అమ్మే షాపుల్ని ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయమన్నాను. అవసరమైతే ధాన్యాన్ని కోస్తా ప్రాంతం నుండి కొని తరలించమన్నాను. శిస్తు వసూళ్లను నిలిపి వేయమన్నాను. తక్కావి, సహకార రుణాలను తక్కువ వడ్డీ రేట్లతో విరివిగా మంజూరుచేయమన్నాను. 1966-67 నాటికి ఇటువంటి చర్యలన్నింటినీ బీహార్, ఒరిస్సాల్లో సంభవించిన కరవు సందర్భంలో ఆయా ప్రభుత్వాలు తీసుకోగలిగాయి. వీటన్నింటికీ మించిన నా సలహా **'అఖిలభారత క్షామ భీమా నిధి**ని 1920లో వున్నట్లుగా పునరుద్ధరించడం. ఆ నిధికి కేంద్రం, ప్రోవిన్స్‌లు నిధులు సమకూరుస్తాయి. అవసరమైనప్పుడు కేంద్రం ఆ నిధులతో క్షామ పీడిత ప్రాంతాల్లో ప్రొవెన్షియల్ ప్రభుత్వాలకు అండగా నిలుస్తుంది.

ఈ ప్రతిపాదన మద్రాస్ పాత్రికేయులకు నచ్చిందికానీ ప్రభుత్వాలకు పట్టినట్టులేదు. స్వరాజ్యానంతర భారతదేశంలో **అతివృష్టి, అనావృష్టి సంభవించినప్పుడల్లా నిధుల కోసం వెదుకులాట తప్పడంలేదు.** లక్షలమంది కరవుపీడితుల ఆక్రందనలు విని బరువెక్కిన హృదయాలతో తిరుగు ప్రయాణంలో ఉండగా కంబం మిషన్ కాంపౌండ్ వద్ద మేము ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. అది ఓబులరెడ్డి గారి సొంత పట్టణం. ఆయనకు బాగా గాయాలయ్యాయి. ఎడమ కన్ను కోల్పోయే పరిస్థితి త్రుటిలో తప్పింది. **పాల సర్వోత్తమరావు** గారు దిగ్భ్రాంతికి లోనయ్యారు. నాకు ముక్కుకు బాగా దెబ్బ తగిలింది. ఓబులరెడ్డి గారికి పూర్తిగా గాయాలు మానేందుకు నెలకు పైగా పట్టింది. ఇలా రాయలసీమ సంక్షోభానికి మా క్షోభ తోడైంది.

నేను తర్వాత ఐదు మాసాలకాలం ఢిల్లీ చట్ట సభలోనూ, ఆంధ్రాలోనూ క్షామ సహాయక చర్యల్లో మునిగితేలాను. శ్రీ **ఫ్రాంక్ నోయిస్** అనే మంత్రి అన్నదేమంటే **ప్రొఫెసర్ రంగా రాయలసీమ రైతులకు సహాయం అందించేందుకు కనబర్చే ఆందోళన అభినందనీయమే. అయితే ఆయన మమ్మల్ని ఇతర అంశాల్ని పట్టించుకునేందుకు కూడా తగిన వ్యవధిని ఇవ్వాలిగా'.** కనుక నేను వాళ్లను ఆ విషయంలో ఎంతగా పట్టిపీడించానో తెలియవస్తుంది. అదృష్టవశాత్తూ కీ.శే. **గోపాలస్వామి అయ్యంగార్** ఫామిన్ కమిషనర్ అయ్యారు. ఆయన నుండి ఎంతో సహకారం లభించింది. కేంద్రం నుండి పెద్దగానే సహాయం పొందడం జరిగింది. ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వం కోస్తా జిల్లాల నుండి వరిధాన్యాన్ని తరలించింది. క్షామ నిధి నుండి పెద్ద మొత్తాలనే విడుదల చేసింది. **ఇదే క్షామ అని తుంగభద్ర ప్రాజెక్ట్ కోసం నేను ఒత్తిడి పెంచాను.** అలా తరతరాలుగా క్షామంతో వేధించే కొన్ని రాయలసీమ ప్రాంతాలను సస్యశ్యామలం చేయగలిగాననే తృప్తి నాకు కలిగింది. **స్వతంత్రభారతంలో నాకంటే చిన్నవారు నన్ను చూసి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం నేర్చుకున్నారు.** వాళ్లు మంత్రులైనప్పుడు అటువంటి పథకాలకు చేయూతనిచ్చేవాళ్లు అయితే పరాయి పాలనలో ప్రభుత్వంపై అటువంటి ఒత్తిడిని పెంచడం సాధ్యమేగాని మన ప్రభుత్వంపై వత్తిడి చేయడానికై ప్రజల్లో విశ్వాసాన్ని ప్రోది చేయడం ఎంతో కష్టసాధ్యమైన విషయం. అందుకు మనలోనూ ఎంతో ఆత్మవిశ్వాసం ఉండాలి. ప్రజల సహకారమూ కలిగి ఉండాలి. అటువంటిదంతా మేము ప్రదర్శించగలిగాం. అందుకు క్రియాశీలురైన కొందరు రాయలసీమ మంత్రులు ముందడుగు వేయడాన్ని కొనియాడాల్సి ఉంది.

అలాగే **బిగువ** భవానీ ప్రాజెక్ట్ విషయంలో మా రైతు ఉద్యమం ప్రజాందోళన కార్యక్రమాలను చేపట్టింది. మద్రాస్‌లోని స్వరాజ్య మంత్రుల సహకారంతో సేలం ప్రజలను మున్ముందు కరవు బారినపడకుండా కాపాడాం. రైతు రక్షణ కమిటీలు ఆర్థిక సంక్షోభం నుండి రైతులకు ఊరట కలిగించాయి. అవి మారటోరియం విధింపునకు తగిన వాతావరణాన్ని సమకూర్చగలిగాయి. కాని అటువంటి విప్లవాత్మక చర్యలకు అప్పటి ప్రభుత్వం సిద్ధంగా లేదు. 1930లోనూ, 1933లోనూ ప్రపంచ ద్రవ్యోల్బణం యుద్ధానికి సంబంధించిన అత్యయిక స్థితేనని నేనన్నమాటను ఆ ప్రభుత్వం చెవికెక్కించుకోలేదు. ఎప్పుడైతే రూజ్‌వెల్ట్ తరహా పాలన మారటోరియం విధించడమే కాక మద్దతు ధర కార్యక్రమాన్ని చేపట్టిందో అప్పుడు నా రైతు రక్షణ కార్యక్రమాలకు ప్రభుత్వ మద్దతు లభించింది. ఆ మద్దతు వెనక ఎంతో కృషి, పోరాటం దాగి వున్నాయి.

ఈ వ్యవహారాన్ని నేను కేంద్ర విధాన సభకు తీసుకెళ్లా. ఈ డిమాండ్లపై మేము తీర్మానాలను ప్రవేశపెట్టాం. ప్రభుత్వం మారటోరియం, మద్దతు ధర ప్రతిపాదనల్లో ఏ ఒక్కదానికి కూడా అంగీకారం తెలిపే స్థితిలో లేదు. అయినా సయామీ నుండి దిగుమతి చేసుకునే బియ్యం వల్ల భారతదేశం రైతులు పోటీకి తట్టుకోలేకపోతున్నారు, కనుక వాళ్లకు రక్షణ కల్పించాలనే నా వాదనను **సర్ గిరిజాశంకర్ బాజ్‌పాయి** అంగీకరించాల్సిన అవసరం ఏర్పడింది. **కాంగ్రెస్, నేషనలిస్ట్, జిన్నా పార్టీ ఎమ్మెల్యేల అందరి మద్దతు కూడగట్టాను.** వాళ్ల ప్రశ్నలతో, నా అనుబంధ ప్రశ్నలతో బడ్జెట్ డిమాండ్లపై కట్ మోషన్స్‌తో. ప్రైవేట్ సభ్యుల తీర్మానాలతో, ప్రభుత్వ ప్రతిపాదనలకు సవరణలతో ప్రభుత్వానికి శాంతి కరవయ్యేటట్లు చేయగలిగాం. ప్రభుత్వం దిగి వచ్చింది. తొమ్మిది మాసాల సుదీర్ఘ చింతన తర్వాత సయాం నుండి దిగుమతి చేసుకునే నూకలపై మణుగుకు అర్ధ రూపాయి దిగుమతి సుంకం విధించింది. అప్పుడు రెండు మణుగుల ధాన్యం బస్తా ధర రెండున్నర రూపాయల నుండి మూడున్నర రూపాయల వరకూ వుండేది. దిగుమతి సుంకం కారణంగా అది నాలుగు లేదా నాలుగున్నర రూపాయలకు పెరిగింది. దీన్ని భారతదేశంలోని రైతులందరూ వరంగా భావించారు. అదేవిధంగా గోధుమను పండించే రైతులకు కూడా లబ్ధి చేకూరేటట్లు చేశాం. అయినా వరి పండించే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వరి పంట లాభసాటిగా ఉండదంలేదని, అందువల్లనే వ్యవసాయ కూలీలకు గిట్టుబాటు కూలి లభించడంలేదని వాదించసాగాను.

ధాన్యానికీ, గోధుమలకు, జనపనార, పత్తివంటి వాటికి కనీస ధరలు ప్రకటించాలని నేను

వాదించాను. ప్రభుత్వం తరఫున మాట్లాడేవారు ఆ అవసరాన్ని ఎన్నడూ కాదనలేదు కానీ ఆ విషయంలో ప్రభుత్వ నిస్సహాయతను ప్రకటించేవాళ్లు. ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయం కోసం 1955 వరకూ వేచి ఉండాల్సి వచ్చింది.

రైతుల్ని ఆదుకునేందుకు కేవలం కాంగ్రెస్ మీద ఆధారపడినందువల్ల ప్రయోజనంలేదని తెల్సుకున్నాను. కాంగ్రెస్ నాయకత్వానికి రైతుల పట్ల ప్రత్యేక శ్రద్ధలేదు. నా కృషిని మెచ్చుకునేందుకు అది సిద్ధంగానూ లేదు. నా కృషికి దన్నుగా నిలిచేందుకు ఇతర పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు సిద్ధంగా ఉన్నారని తెలుసుకున్నాను. పైగా కొందరు నామినేటెడ్ ప్రతినిధుల మద్దతు కూడా లభిస్తుందని తెలుసుకున్నాను. కనుక రైతు పక్షం వహించే ప్రతినిధులందరినీ కూడగట్టాం. ఆ విధంగా **ఆల్ ఇండియా అగ్రేరియన్ పెజెంట్స్ ఫ్రంట్** (అఖిలభారత విధాన సభ రైతు పక్ష కూటమి) ఆవిర్భవించింది.

1935-36 సంవత్సరాల్లో నేను విధాన సభలో చేసిన ప్రసంగాలు **మోడరన్ ఇండియన్ పెజెంట్** అనే గ్రంథంలో అచ్చయ్యాయి. **నేను కేవలం రైతు సమస్యలనేకాక ఇతర సమస్యలను కూడా పట్టించుకున్నాను.** గ్రామీణ ప్రాంతాలకు తంతి తపాలా సౌకర్యాలను కల్పించాలన్నాను. రైళ్లల్లో మూడో తరగతి ప్రయాణీకులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని పోరాడాను. కాఫీ, తేయాకు తోటల్లో పనిచేసే శ్రామికులకు, కర్మాగారాల్లో పనిచేసే శ్రామికులకు రక్షణ కావాలన్నాను. వ్యవసాయ కూలీల అవస్థలను అర్థంచేసుకుని స్పందించమన్నాను. **నా కృషి కారణంగానే వెట్టిచాకిరీ విషయంలో సర్వే నిర్వహించి అటువంటి దౌష్ట్య పద్ధతికి ప్రభుత్వం మంగళం పాడింది.** విధాన సభలో కార్మికుల అంశాలు చర్చకు వచ్చినప్పుడల్లా వి.వి.గిరికి, కే.శే. ఎన్.ఎం.జోషీకి శక్తిమంతమైన తోడ్పాటును అందించేవాణ్ణి. నేను పరిశ్రమల్లో పనిచేసే కార్మికులను పట్టించుకునే తీరుకు సోషలిస్టుల నుండి, ఇతరుల నుండి ప్రశంసలు పొందేవాణ్ణి. సాంఘిక సంక్షేమానికి తగినంతగా నిధులు సమకూర్చాలని చేసిన ప్రసంగం ప్రొఫెసర్ కె.టి.షాకు నచ్చింది. రైతుల, సోషలిస్టుల దృక్కోణం నుండి ప్రభుత్వంపై నిశిత విమర్శలు గుప్పించేవానిగా గుర్తింపబడ్డాను. నేషనలిస్ట్ పార్టీ నాయకుడు ఎం.ఎస్.ఎనీ, కాంగ్రెస్ పక్ష ఉప నాయకులు జి.బి.పంత్ చర్చల్లో నేను పాల్గొనే తీరును మెచ్చుకుంటూ నన్ను నిరంతరం ప్రోత్సహిస్తూ ఉండేవారు. **నా పార్లమెంటరీ సేవలకు గుర్తింపుగా 1936లో ముఖ్యమైన పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ సభ్యునిగా ఎన్నుకున్నారు.** నేను బయట కూడా చాలా క్రియాశీలంగా ఉండేవాణ్ణి. దక్షిణభారత రైతుకూలీ సంఘటనను ఏర్పాటుచేయడంలో

ముందున్నాను. తర్వాత అక్టోబర్ 1935లో మద్రాస్‌లో **అఖిలభారత రైతుకూలీ సదస్సు**ను కూడా నిర్వహించాం. గిరి నన్ను అధ్యక్షత వహించమని కోరారు. అందులో సామాజిక న్యాయం ప్రస్తావన ఉన్నందున సోషలిస్ట్‌లు కూడా స్వాగతించారు. శ్రీమతి కమలాదేవి ఆ సదస్సును ప్రారంభించారు.

దురదృష్టవశాత్తూ స్వామి సహజానంద సరస్వతి ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ప్రాంతీయ శాఖలను ఏర్పాటుచేయకుండా రైతులకు అఖిలభారత స్థాయిలో వేదికను ఏర్పాటుచేయడం సమంజసమా అని ప్రశ్నించారు. నా నాయకత్వంలో రైతు ఉద్యమం ఎలా రాజకీయ ఆర్థిక వేగాన్ని పుంజుకుంటుందో గమనించి **కమ్యూనిస్ట్‌లు అందులో ప్రవేశించి అంతటా వ్యాపించి చివరకు దాన్ని చిన్నాభిన్నం గావించాలనుకున్నారు.** కనుక నాయకత్వంలో వాళ్లకూ వాటా కావాలన్నారు. ఆ విధంగా కలగూరగంపగా ఒక ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటుచేశాం. నేను దానికి అధ్యక్షుణ్ణి. నేను అలహాబాద్, కటక్, బెనారస్, కలకత్తావంటి ప్రదేశాలకు వెళ్లి అక్కడి కాంగ్రెస్ సోషలిస్ట్ నాయకులను కలిసినప్పుడు కేవలం రైతు సమస్యల ఆధారంగా వేదిక నిర్మాణాన్ని వాళ్లు ప్రశ్నించారు. ఆ వేదిక నిర్మాణానికి వాళ్లు విముఖులుగా కనిపించారుకానీ దాన్ని కబళించేందుకు మాత్రం సిద్ధంగా ఉన్నట్లు తట్టింది. వాళ్లు నన్ను వాళ్ల ప్రతినిధితో కలసి మీరట్ సమావేశం వరకూ ఉద్యమానికి జాయింట్ కన్వీనర్‌గా విధులు నిర్వర్తించమన్నారు.

1936లో జరిగిన మీరట్ సమావేశంలో నేనొక్కణ్ణే పార్టీ రహితంగా ఉద్యమ నిర్మాణాన్ని కోరినవాణ్ణి. మిగతా అందరూ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ వాళ్లే. ఆ సభకు అధ్యక్షత వహించిన శ్రీమతి కమలాదేవి నాకు మద్దతు ప్రకటించింది. నా పట్ల సానుభూతిని ప్రకటించింది. స్నేహపూరిత వాతావరణంలో సభను నిర్వహించుకున్నాం. లక్నోలో జరిగే కాంగ్రెస్ సమావేశాల సందర్భంగా అఖిలభారత కిసాన్ సదస్సును కూడా నిర్వహించాలనుకున్నాం. లక్నో సదస్సులో కాంగ్రెస్ సోషలిస్ట్‌లు చైర్మన్‌గా **స్వామీజీ** పేరును సూచించారు. నేను ఆనందంగా అంగీకరించా. దానివల్ల వ్యతిరేకంగా ఉన్న వ్యక్తిని ఉద్యమంలో భాగం చేయగలుగుతున్నాం అనుకున్నా. ఆ విధంగా సోషలిస్ట్‌లు ఆ సదస్సుకు వీర విధేయులయ్యారు. నేను కనీస కోర్కెల పత్రాన్ని తయారుచేశాను. **మెహర్ అలీ** ఒక్కరు మాత్రమే నా కృషిని మెచ్చుకున్నారు. నన్నూ, స్వామీజీని, జయప్రకాశ్ నారాయణ్‌ను కార్యదర్శులుగా ఎన్నుకున్నారు.

11

రాయలసీమ, కళింగాంధ్ర రాజకీయ కార్యకర్తలకు శిక్షణ (1935-40)

ఈ రోజు (అంటే 30.1.1958) బాపూజీ పరినిర్వాణపు దశమ వార్షికం. నా మనస్సు నిండా ఆయన ఆలోచనలే. ఆయన ప్రభావం వల్ల నేను చేసిన నిర్మాణాత్మక పనుల్ని గురించి ఆలోచనలు కొన్ని మదిలో సుడులు తిరగడం సహజమే. అటువంటి మంచి పనుల్లో ఆంధ్ర ప్రాంతంలోని వెనకబడిన జిల్లాల్లో గ్రామీణ యువతకు గమనార్హంగా సమాజ సేవకు తగిన తర్ఫీదునివ్వడం ఒకటి. 1925లో ఇతర జిల్లాలతో పోల్చి చూసినప్పుడు రాయలసీమకు చెందిన ఐదు జిల్లాల్లో, కళింగ ప్రాంతానికి చెందిన రెండు జిల్లాల్లో, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో సమాజ సేవకుల కొరత అధికంగా కనిపించింది. కోస్తా జిల్లాల్లో కూడా మధ్యస్థాయి సామాజిక సేవలందించే నాయకత్వ లేమిని గుర్తించాను. ఆంధ్ర కాంగ్రెస్ నాయకత్వంలో అనైక్యతకు కారణం అవసరానికి మించిన నాయక గణమేనని పత్రికల్లో వార్తలు వస్తూ ఉండేవి. అది నాకు వింతగా తోచేది. ఆ రెండు అంశాలకు పొంతన కుదరడంలేదు.

నాయకత్వంలో క్రమశిక్షణ కొరవడింది. పరస్పర సహకారం, విశ్వాసం అడుగంటుతున్నాయి. సమాజ సేవకులందరూ కేవలం రెండు, మూడు కులాలకే

పరిమితం అవుతున్నారు. కనుక ఈ లోపాలను సవరించే దిశగా నిర్మాణాత్మకంగా ఏమైనా చేయాలనుకున్నాను. ఈ విషయాన్ని నేను గాంధీజీతో చర్చించాను. స్కాండినేవియా దేశాల్లోని ఫోక్ స్కూల్స్ చేపట్టిన మంచి కార్యక్రమాలను వివరించాను. వీలైనంత త్వరగా, వీలైనంత ఎక్కువగా గ్రామీణ యువతను చేరదీసి వాళ్లకు సమాజ సేవలో శిక్షణ ఇచ్చి వాళ్లను 'నిజమైన ప్రజా సేవకులుగా' తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నాను. ఆయన సరే అన్నారు. దాని ఫలితంగానే రమ-నీడు విద్యాలయం అనే భారత రైతు శిక్షణా సంస్థ నిడుబ్రోలులో ఆవిర్భవించింది. బాపూజీ దాన్ని 1933 డిసెంబర్‌లో ప్రారంభించారు.

నేను ఆంధ్ర ప్రాంతంలో అన్ని జిల్లాల నుండి, అన్ని కులాల నుండి అభ్యర్థులకు ప్రవేశాన్ని కల్పించేవాణ్ణి. **ఈ విద్యాలయానికి నిధులు మా పాలాల మీద వచ్చే ఆదాయంలో నుంచి కొంత మా దంపతులిరువురం సమకూర్చేవాళ్లం. ఇక నా అసెంబ్లీ అలవెన్స్‌లను కూడా ఇందు నిమిత్తమే వాడేవాణ్ణి.** 1940 నాటికి రాయలసీమ, కళింగ ప్రాంతానికి చెందిన అన్ని జిల్లాల్లో కలిపి వందలమందికి శిక్షణ ఇచ్చి ఉంటాం. అభివృద్ధి చెందిన జిల్లాలకు సంబంధించి శిక్షణ పొందినవారి సంఖ్య ఇంకా అదనంగానే ఉంటుంది. వెనకబడిన జిల్లాల్లోని యువత సౌలభ్యం కోసం శిక్షణా తరగతుల్ని వాళ్లవాళ్ల జిల్లాల్లోనే ఏర్పాటుచేయసాగాను. అంతకుముందు శిక్షణ పొందినవారిని వారాంతపు శిక్షణగానీ, ఒక వారంపాటు శిక్షణగానీ వారివారి తావుల్లో ఏర్పాటుచేయమనేవాణ్ణి. అటువంటి సందర్భాల్లో ఒక రోజు అక్కడకు నేనూ చేరుకునేవాణ్ణి. అది వాళ్లకు స్ఫూర్తిదాయకంగా ఉండేది. చేబ్రోలులో సత్యాగ్రహం చేసిన అనుభవశాలురైన మహిళలతో సంప్రదించి దేవీజీ మహిళల కోసం ఒక ప్రత్యేక రాజకీయ పాఠశాల నిర్వహించమని కోరింది. **1945లో శ్రీమతి రాజ్యలక్ష్మీదేవి గారు నిర్వాహకులుగా చేబ్రోలులో రాజకీయ పాఠశాల నడిపారు. యాభైమంది బాలికలు మూడు వారాలపాటు శిక్షణ పొందారు.** నేను, దేవీజీ చెరి పన్నెండు ప్రసంగాలు చేశాం ఆ మూడు వారాల్లో.

రైతుల, యువజనుల, విద్యార్థుల, వెనకబడిన వర్గాల, చేనేత పనివారల, హరిజన సదస్సులు తాలూకా, జిల్లా స్థాయిల్లో నిర్వహించడాన్ని మేము ప్రారంభించాం. అలా శిక్షణ పొందినవారిని స్వాగత కమిటీ చైర్మన్లుగానో, అధ్యక్షులుగానో, వక్తలుగానో తిరిగి జరిగే సదస్సుల్లో వ్యవహరించేందుకు ప్రోత్సహించేవాళ్లం. నేను స్వయంగా అక్కడ వక్తగా ఉండి స్థానిక శ్రోతలకు ఆ యువతను రానున్న తరం నాయకులుగా

పరిచయం చేసేవాణ్ణి. సొంత ఖర్చులకుగానీ, సదస్సులకు ఖర్చు పెట్టేందుకుకానీ వాళ్లకు కొద్ది మొత్తాలను అందిస్తుండేవాణ్ణి. రైతు ప్రచురణలు ప్రచురించే పుస్తకాల అమ్మకాల ద్వారా లభించే మొత్తాన్ని పలువురు ఖర్చుల కింద వాడేవాళ్లు. నేను చాలా **పాదానీదాగా ఉండేవాణ్ణి - బట్టలు ధరించే విషయంలోగానీ, ప్రయాణ సాధనాల విషయంలోగానీ. అందుకు కారణం వేరే ప్రాంతాలకు నేను వెళ్లినప్పుడు అది అక్కడి వారికి భారం కారాదనేది ఒకటి. గాంధీ మార్గంలో జీవితం కొనసాగించాలనేదొకటి.** ఆ విధంగా అలా శిక్షణ పొందిన యువత గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించేవారు. గ్రామీణులు వాళ్లకు నాయకత్వం అందించేందుకు సిద్ధంగా ఉండేవాళ్లు. 1930కి ముందు గ్రామాల్లో ఇటువంటి వెసులుబాట్లు లేవు. 1940లో ఈ విధమైన అభివృద్ధిని గురించి నివేదిక సమర్పించినప్పుడు ఆయన తృప్తి చెందడం సహజమేగా.

ఈ అభివృద్ధి ప్రత్యేకత ఏమిటంటే జాతీయోద్యమం అంతకుముందు స్పృశించని కులాల నుండి, మారుమూల గ్రామాల నుండి నాయకత్వం ఉద్భవించింది. అలా రైతు కుటుంబాల్లోని, వాడిజన, గిరిజన వర్గాల్లోని యువత ఆత్మవిశ్వాసంతో సమాజ సేవకు, రాజకీయ కార్యావళికి, ప్రజా నాయకత్వానికి నడుంబిగించారు. రాజకీయ నాయకత్వం ప్రజా సేవాకాదన్ని అన్ని స్థాయిల్లో అంటి పెట్టుకుని సాగినప్పుడు ప్రజాస్వామ్యపు మనుగడ ఫలప్రదంగా సాగగలదని అప్పుడే నాయకత్వం విశ్వసనీయంగా, సత్య సమ్మతంగా సేవా నిరతితో భాసిల్లగలదని నేను విశ్వసిస్తా. **ఇది నేను జాతికి అందించిన మహోపకారంగా నాకు గర్వకారణమైంది.**

దురదృష్టవశాత్తూ ఇక్కడొక బలహీనత వెల్లడైంది. నేనిలా రైతుల్లోకి చొచ్చుకుపోయే వరకూ ఇతర రాజకీయ పక్షాలేవీ వాళ్లను ప్రజా జీవనంలోకి లాక్కురాలేకపోయాయి. మాడైతే నేను కొందరిని ప్రజా సేవకు సమీకరిస్తానో, కొంత వాళ్లకు శిక్షణ ఇస్తానో అంతలోపు ఇతర పార్టీలవాళ్లు వాళ్లతో చెలిమి చేసి మరో పక్క నాతో ఉంటున్నట్లు నాటకమాడిస్తూ వాళ్ల ముఠాల్లో చేరిపోయేటట్లు చూసేవాళ్లు. అప్పట్లో కాంగ్రెస్‌వారు కొందరు యునైటెడ్ ఫ్రంట్ కామ్రేడ్ల గొడుగు కింద ఉండేవారు. వాళ్లంతా నేను శిక్షణ ఇచ్చిన యువతతో సంప్రదింపులు జరిపి వాళ్లతో కలగలిసి తిరిగి చివరకు వాళ్లు వాళ్ల గిరిలోకి లాక్కుపోయేవారు. 'ఇదేం పని' అని నేను ఏనాడూ హెచ్చరించింది లేదు. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ ఇటువంటి పనులకు బహిరంగంగానే ఒడిగట్టేది. కమ్యూనిస్ట్ పార్టీ లోపాయకారిగా చేసేది. ఇదంతా 1934-40 సంవత్సరాల మధ్య

స్థితి. అందువల్లనే నేడు **ఆంధ్ర ప్రాంతంలో ఏ పార్టీలో చూసినా నాయకుల్లో సీనియర్లలో అధికులు మా వద్ద శిక్షణ పొందినవారే. వారు ఏ పార్టీలో పనిచేసినా సమర్థులుగానే ఎదిగారు.** అందుకే ఈ దిశగా నన్ను ప్రోత్సహించినందుకు నేను గాంధీజీకి రుణపడి ఉంటా.

రాయలసీమ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా వేదిక కోసం నేను ప్రత్యేక శ్రద్ధ చూపాను. ఉదాహరణకు మేము రాయలసీమ ఆర్థికాభివృద్ధి సదస్సు, రాయలసీమ రైతు సదస్సు. రాయలసీమ అటవీ రైతు సదస్సు, రాయలసీమ ఉపాధ్యాయ సదస్సు, రాయలసీమ రైతు శిక్షణా సంస్థ, రాయలసీమ విద్యార్థి సదస్సు, రాయలసీమ యువజన సదస్సు. రాయలసీమ అభ్యుదయ రచయితల సదస్సు, రాయలసీమ పత్తి రైతుల సదస్సు. రాయలసీమ నూనె గింజల సదస్సు, రాయలసీమ కరవు సహాయక సదస్సు, రాయలసీమ నీటి వనరుల అభివృద్ధి సదస్సువంటివి ఎన్నో ఏర్పాటుచేయడం జరిగింది. ప్రతి సదస్సుకూ తోడ్పాటునిచ్చా. సందేశాలు అందించా.

ఇటువంటి కృషినే కళింగ ప్రాంతంలోని రెండు జిల్లాల్లో చేపట్టాను. ఎందువల్లనంటే అది జమీందారుల దోపిడీకి గురైన ప్రాంతం. అందువల్లనే అధిక తోడ్పాటు అవసరమైంది. ఆ విధంగా నేను గ్రామీణవాసులకు వెన్నుదన్నుగా నాయకత్వాన్ని ఆంధ్రదేశమంతటిలోనూ మరీ ముఖ్యంగా రాయలసీమ, కళింగ ప్రాంతాల్లోనూ రూపొందించాను. అయితే కాంగ్రెస్‌లోని సనాతనవాద నాయకులకు ఈ విధంగా నాయకత్వం ఒక ముంపుగా రావడం నచ్చలేదు. వాళ్ల ఆధిపత్యానికి అది అడ్డుకట్ట వేయగలదని తలపోశారు. నిజమైన నాయకత్వం నగరాల నుండి పల్లెలకు తరలివెళ్లడం వాళ్లు కళ్లారా చూశారు.

సంవత్సరానికి ఒకసారి వీటి సాధకబాధకాలన్నీ బాపూకు వివరించేవాణ్ణి. ఆ సేవల భవిష్యత్తును గురించి చర్చించేవాళ్లం. ఆయన నా వెన్ను తట్టేందుకు ఎల్లవేళలా సిద్ధమే. చింతించాల్సిన అంశమేమంటే **ఇటువంటి కృషి ఉత్తరభారతదేశంలో ఎవ్వరూ చేపట్టలేదు.** అందువల్లనే అక్కడి రైతుల్లో రాజకీయంగా ఆ వెనకబాటుతనం. బాపూ, నేనూ నడుస్తూ వెళుతున్నప్పుడు చెప్పాను 25 కుటుంబాలకు కలిపి కనీసం ఒక సుశిక్షితుడైన నాయకుడైనా కావాలి' అని. 'శెహభాష్ రంగా' అని ఆయన మెచ్చుకున్నారు. దురదృష్టవశాత్తూ ప్రజలు కోరుకునే నీతిని, క్రమశిక్షణను గ్రామ స్థాయి కార్యకర్తల్లో పెంపొందింపజేసేందుకు మన మధ్య బాపూ లేరు.

12

రైతుల కార్యకలాపాల్లో వ్యవసాయ కూలీల పాత్ర

రైతుల్ని, కూలీలను రెండు వర్గాలుగా విడగొట్టి ఎదురెదురుగా నిలపాలన్న భారత కమ్యూనిస్ట్ పార్టీ (భా.క.పా.) వ్యూహాన్ని ముందుగానే పసిగట్టి మేము **సౌత్ ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ పెజెంట్స్ అండ్ అగ్రికల్చరల్ వర్కర్స్**ను 1935లో నెలకొల్పి కనీస కోర్కెలను రూపొందించడం జరిగింది. నా దృష్టిలో ఆ రెండు వర్గాలూ కలసికట్టుగా కృషి చేయాలేకానీ వాటి మధ్య వర్గ వైషమ్యాలు చొరబడరాదనే ఆలోచనతోనే ఈ రంగంలో నేను 1923 నుండి కృషిని కొనసాగిస్తున్నా. ఆ విశ్వాసంతోనే నేను **వ్యవసాయ కూలీల** [illegible] **కోర్కెలను 1928-29లో రూపొందించి రాయల్ కమిషన్ ఆన్ లేబర్ ముందుంచగలిగాను.**

1936 -38 మధ్యకాలంలో ఆంధ్ర కమ్యూనిస్ట్‌లు నెల్లూరు, గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాల్లో శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య, శ్రీ జొన్నలగడ్డ రామలింగయ్యల నేతృత్వంలో సమ్మెలు నిర్వహించే ప్రయత్నం చేశారు. నేను వాళ్ల తీరును ఖండించాను. ఈ రెండు వర్గాల మధ్య ఘర్షణ పెంచే పని మంచిది కాదని, అప్పుడు చేయాల్సిందల్లా

కనీస వేతనాలు వ్యవసాయ కూలీల విషయంలోనూ రూపొందించమని, రైతు కూలీలు సమాన సంఖ్యలో ఉండే ట్రేడ్ బోర్డులు నెలకొల్పేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొద్దామన్నాను. వాళ్లు లెనిన్ విధానాన్ని అనుసరించేందుకే మొగ్గు చూపారు. అటువంటప్పుడు కిసాన్ కాంగ్రెస్ వారు, కమ్యూనిస్ట్‌లు సిగపట్లకు దిగడం సహజమే. ఆ విధంగా కిసాన్ ఉద్యమంలో యునైటెడ్ ఫ్రంట్ చీలిక అనివార్యమైంది.

ఆ తరుణంలో **కె.జి.శివస్వామి** సహకారం పొందగలిగాను. వారు సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీకి చెందినవారు. ఆయనకు గ్రామీణ ఆర్థిక సర్వేల పట్ల ప్రీతి మెండు. ఆ విధంగా ఆయన మా పరిశోధకుల్లో ఒకరయ్యారు. ఆయన పరిశోధన ద్వారా వెల్లడైనదేమంటే తిరుచునాపల్లి, తంజావూరు, మద్రాస్ జిల్లాల్లో రైత్వారి పట్టాదార్లు వందలాది ఎకరాలున్న భూస్వాములు. వాళ్ల భూముల్లో కౌలుదార్లు సేద్యం చేసేవారు. లేకుంటే సేద్యగాళ్లను పెట్టుకుని పంటలు పండించేవాళ్లు. **ఆ కౌలుదార్ల పేదరికాన్ని చూసి మేము నిర్ఘాంతపోయాం.** కౌలుదార్లను రక్షించాలనుకున్నాం. **కౌలు కాలం కనీసం ఐదు సంవత్సరాలైనా ఉండాలని కోరాం. కౌళ్లు తగ్గించాలన్నాం. కౌళ్లు నిర్ణయించేందుకు ట్రిబ్యునళ్లు ఏర్పాటుచేయమన్నాం. కూలీలకు కనీస వేతనాలు నిర్ణయించమన్నాం.**

తమిళనాడులో వ్యవసాయం విషయంలో 1937-39 నాటి సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధమైన దూరదృష్టిని ఉపయోగించలేదు. **రుణ సహాయక చట్టం ద్వారా లభించే లబ్ధి అంతా మిరాసీదార్లకే (భూమి యజమానులకే) దక్కింది. వాస్తవంగా వ్యవసాయం చేసిన వాళ్లకు దక్కలేదు. అప్పుడు శివస్వామికి కమ్యూనిస్ట్ పంథాలో సమ్మెలు చేయడమే శరణ్యమనిపించింది.** మా కిసాన్ కాంగ్రెస్ పెద్దలు కొందరు ఆయన్ను కమ్యూనిస్ట్‌లతో చేతులు కలపమని ప్రోత్సహించారు. రైతులకు కూలీలను ఎదురు నిలపమన్నారు. ఆ విధంగా ఆయన మా రైతు కూలీ ఉద్యమానికి దూరమయ్యాడు.

జమీందారులకు వ్యతిరేకంగా, రైతు కూలీ సంఘటనకు మాకు అండగా నిలిచిన మరో మిత్రుడు నెల్లూరుకు చెందిన **వి.రాఘవయ్య.** ఆయన 'క్రిమినల్ ట్రైబ్'గా ముద్ర వేయబడిన యానాదులను సంఘటితపర్చి వ్యవసాయ కూలీలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. వాళ్లకు ఆ ముద్ర నుండి విముక్తి కలుగజేయాలనుకున్నాడు. **ఆయనకు యానాదుల్ని కొల్లగొట్టే సవర్ణ రైతులంటే కోపం. ఆయన కూడా సమ్మెబాటపట్టి కమ్యూనిస్ట్‌లకు చేరువయ్యాడు.** అలా అని చెప్పకపోయినా ఆయన సుందరయ్య గారి మనిషే.

నా పంథాను ఆయన వర్గ భాగస్వామ్యంగా భావించాడు. అందుకు కారణం

ఆయన రైతుల్ని, కూలీలను రెండు విభిన్న వర్గాలుగా భావించడమే. అదీ వైరి వర్గాలుగా భావించడం. నేను అనేదేమంటే **బీడు భూములుగా ఉన్నవాటిని వ్యవసాయ కూలీలకు పంచి వాళ్లను రైతులుగా మార్చినందువల్ల వర్గ వైషమ్యాలకు తావుండదని. అది ఆయనకు రుచించలేదు.** నేను ఈ విషయాలన్నింటినీ కూలంకషంగా చర్చిస్తూ 1938లో **'కిసాన్ హ్యాండ్ బుక్'** అనేదాన్ని ప్రచురించాను. అంతటితో ఆగక సర్కారు జిల్లాలన్నింటిలో అగ్రికల్చరల్ లేబర్ కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటుచేసి కనీస కోర్కెలను బాగా ప్రచారంలోకి తెచ్చాను. అలాగే రైతు కూలీ ఐక్యత కోసం పాటుపడ్డాను.

నేను నెల్లూరు జిల్లాలోని ఒవ్వేరులో వెయ్యి ఎకరాలకు పైగా కొత్తగా సాగులోకి తెచ్చిన ప్రభుత్వ భూమిని పేదలకు పంచేటట్లు చేయగలిగాను. ఇప్పుడా భూమి ఎకరం ఐదు వేలు పలుకుతోంది. (ఇది 1968 నాటి మాట). ఇంతలో **'యుద్ధం కారణంగా ఎక్కువ ఆహారాన్ని పండిద్దాం'** అనే పథకం అమలులోకి రావడంతో హరిజనులకు, వ్యవసాయ కూలీలకు ఖాళీగా ఉన్న వ్యవసాయ భూముల్ని పంచేటట్లు చూశాం. నేను కేంద్ర విధాన సభలో వాదించాను రైల్వే లైన్ల పక్కన ఉన్న ఖాళీగా ఉన్న భూముల్లో వ్యవసాయ కూలీలను సేద్యం చేసుకోనిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని. దానికీ ప్రభుత్వం యుద్ధ సమయంలో సానుకూలంగా స్పందించింది. యుద్ధ సమయంలోనూ, తిండి గింజల కొరత ఏర్పడిన తర్వాత కిసాన్ కాంగ్రెస్ పెద్దలు పెద్ద రైతుల్ని వాళ్ల వద్ద నిల్వ ఉన్న తిండి గింజల్లో కొంత భాగాన్ని చౌకధరలకు వ్యవసాయ కూలీలకు, ఇతర పేదలకు ఇవ్వమని విజ్ఞప్తి చేశారు. **కృష్ణా, గోదావరి జిల్లాల్లో లంక భూముల సేద్యానికి హరిజన సహకార సంఘాలను నెలకొల్పాం.** యుద్ధ సమయంలోనూ, తర్వాత కలిపి దాదాపు వందకు పైగా అటువంటి సంఘాలు పనిచేయసాగాయి. అయినా అవి వాటి కృషిలో సఫలత పొందలేకపోయాయి. వీటి విషయంలో కే.శే. **సత్యనారాయణ** సహకారం ఎన్నదగినది.

వ్యవసాయ కూలీలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఎంత అవసరమో నాకు తెలుసు. కిసాన్ కాంగ్రెస్ వారిని ఈ విషయంలో చిన్న చిన్న కాలనీల ఏర్పాటుకు సాయమందించమన్నాను. లచ్చన్న బారువా పంచాయతీకి అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత ఆధునిక పద్ధతిలో అక్కడ ఒక మంచి కాలనీ నిర్మించడం జరిగింది. అలాగే **జియ్యరుదాసు** అనే ఆయన హరిజన నాయకునిగా హరిజనుల కాలనీలు అనేకం వచ్చేటట్లుగా కృషి చేశారు. గరికపాడులో నా పేరిట ప్రత్యేకంగా ఒక గ్రామాన్ని యానాదులకు నిర్మింపజేశారు. అలాగే చిత్తూరు జిల్లాలో శాసనసభ్యులుగా ఉన్న **రాజగోపాలనాయుడు** గారు అటువంటి

కాలనీలు కొన్ని నిర్మింపజేశారు. ఆ విధంగా మేము ప్రభుత్వ సహాయంతోనూ, ప్రభుత్వ సహాయం లేకుండానూ ప్రజలకు ఇళ్లు కట్టించి మిగతా సామాజిక కార్యకర్తలకు మార్గదర్శనం గావించాం. అయినా ఇప్పటికీ (1967) స్వరాజ్ ప్రభుత్వం ఈ దిశగా ముందడుగు వేయలేదు.

లక్షలమంది శ్రమ జీవులు వాళ్లను **'నేర జాతులు'**గా ముద్ర వేసి క్రిమినల్ ట్రైబ్స్ చట్టాన్ని తమ నెత్తిన రుద్దినందుకు నిరాశకు గురయ్యారు. **నేను ఆ చట్టానికిప్రతిపాదించిన సవరణలను చట్టసభ స్వాగతించలేదు. రాఘవయ్య, మరికొందరం కలసి దాదాపు రెండు దశాబ్దాలపాటు ఆందోళనలు నిర్వహిస్తూ వచ్చాం. ఎట్టకేలకు స్వరాజ్య ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దు చేసింది.** ఒక్క కలంపోటుతో వాళ్ల బతుకుల్లో కాంతులు వెల్లివిరిశాయి. వాళ్ల ప్రవర్తనలో మార్పు వచ్చింది. వాళ్లకు అందరి మాదిరిగానే కూలి దొరికేది. వాళ్లను విముక్త జాతులన్నారు. అలాగే అస్పృశ్యతను కూడా అంతమొందించగలిగితే హరిజనుల్లో సంప్రదింపుల సామర్థ్యం పెరుగుతుందని అస్పృశ్యతకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టాను. నా పర్యటనల్లో వీలైనంతవరకూ హరిజనవాడలకు వెళ్లేవాణ్ణి. సహపంక్తి భోజనాలను ప్రోత్సహించేవాణ్ణి. 1945 నాటికి కిసాన్ కాంగ్రెస్ వారంతా హరిజనులకు బాగా దగ్గరయ్యారు. మెల్లగా హరిజనుల ఆర్థిక స్థితి మెరుగు కాసాగింది. **ఈ దిశగా కమ్యూనిస్టులు కూడా విశేషమైన కృషి సల్పారు. అయితే వాళ్లు రాజకీయంగా ఎదుగుతున్న హరిజనుల్ని తమ పార్టీ వైపునకు తిప్పుకున్నారు.** ఆ విధంగా వాళ్ల ఘన విజయం సాధించారు.

యుద్ధ సమయంలో వ్యవసాయ కూలీల కూలి రేట్లు బాగా పెరిగాయి. కిసాన్ కాంగ్రెస్ వాళ్లు దాన్ని స్వాగతించారు. ఆ రేట్లు తిరిగి పడిపోకుండా వృద్ధి చెందేలా మేము కృషి చేశాం. కంట్రోళ్ల రాజ్యంలో కూలీలు మానవులుగా మనుగడ సాగించే విధంగా కూలిరేట్లు పెంచాలని కోరాం. అలాగే కూలిరేట్లు పెంచినందువల్ల ఒనగూడే లాభాలను రైతులకు చెప్పేవాళ్లం. రైతులు కూలి పెంచి తమ ఉత్పత్తులకు తగిన ప్రతిఫలాన్ని పొందాలని కోరేవాళ్లం. ఆ విధంగా రైతులు, కూలీలు లబ్ధి పొందాలని చూసేవాళ్లం. అయితే కమ్యూనిస్టులు మా వైఖరికి కువ్యాఖ్యానాలు చేసి మాపైకి వ్యవసాయ కూలీలను రెచ్చగొట్టేవాళ్లు. దేవీజీ, జి.ఎల్.నారాయణ, గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, మరికొందరు దాన్ని అరికట్టాలని చూశారుకానీ ప్రభుత్వం, క్రైస్తవ మత సంస్థలు కమ్యూనిస్టుల కోపు కాయడంతో అది సాధ్యపడలేదు.

13

భారత జాతీయత

యునైటెడ్ ఫ్రంట్ (1936-40)

1936-40 మధ్య ఐదేళ్లకాలం ప్రపంచంలోని సోషలిస్ట్‌లు, కమ్యూనిస్ట్‌లు సంఘటితమై నియంతృత్వ వ్యాప్తిని అడ్డుకునేందుకు ముస్సోలినీ, హిట్లర్‌ల సామ్రాజ్యవాద కార్యకలాపాలను నిరోధించేందుకు సంసిద్ధులైన కాలమది. నెహ్రూ, బోస్‌లు ఇరువురూ ఐరోపాలోనే ఉన్నారు. వాళ్లు ఐరోపా ఆలోచనా ధోరణిని గమనిస్తూనే ఉన్నారు. ఇరువురూ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించేవారే. అయితే భారతదేశపు స్వాతంత్ర్య సంగ్రామం విషయంలో గమ్యం ఒకటే అయినా దారులు వేరు.

పండిట్‌జీ భార్య శ్రీమతి కమలా నెహ్రూ మరణం కారణంగా యావత్ భారతం ఆయనకు సాంత్వనలు పలుకుతోంది. 1936 డిసెంబర్‌లో లక్నోలో జాతీయ కాంగ్రెస్ సదస్సుకు ఆయన్ను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. అదే సమయంలో ఆయన ఆత్మకథ కూడా అచ్చయ్యింది. అది గొప్ప సాహిత్య గ్రంథంగా ప్రజాదరణ పొందింది. ఆయన ఉత్తరప్రదేశ్, బీహార్ ప్రాంతాల్లోని సోషలిస్ట్ భావాలు గల మిత్రుల్ని ఒక ప్రత్యేక మార్గంగా కాంగ్రెస్‌లో కొనసాగమని ప్రోత్సహించాడు. ఆయనకూ, బాపూజీకి మధ్య కాంగ్రెస్ తాత్వికతపై సాగిన ఉత్తర ప్రత్యుత్తరాలు పుస్తక రూపంలో 'విధర్ ఇండియా'

(భారతదేశం ఏ దిశగా) అనే పేరుతో ప్రచురించారు. 1922 నుండి సోషలిస్టులం ఉన్న మేము, రైతుల, శ్రామికుల కోసం పాటుపడే మేము ప్రజల్లో పనిచేసే [illegible] పుస్తకాన్ని అదనపు సమాచార శక్తిగా భావించాం. 1934లో అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సదస్సులో కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ ఆవిర్భవించింది. **సోవియట్ రష్యా సాధించిన విజయాన్ని పురస్కరించుకుని దానివల్ల ప్రభావితులైన వారందరూ ఆ పార్టీలో చేరసాగారు. మా యువ జాతీయవాదుల్ని లోపాయకారిగా వాళ్లు చేరదీసే క్రమంలో కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ వాళ్లకు ఎదురునిలిచింది.** కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ అనే పేరే వాళ్లకు నచ్చలేదన్నారు. దాని సిద్ధాంతాలు కూడా నచ్చలేదన్నారు. అది చేపట్టే కార్యక్రమాలూ నచ్చలేదన్నారు. అయితే ఈలోగా ఫాసిస్ట్ నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ప్రతి దేశంలోనూ ప్రగతిశీల సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల్ని కూడగట్టమని సోవియట్ రష్యా నుండి వాళ్లకు ఆదేశాలు అందాయి. అందువల్ల 1934వ సంవత్సరం ముగిసేనాటికి వాళ్లు కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో చేరి ఆ వేదికను కొల్లగొట్టాలని నిర్ణయించుకున్నారు.

పండిట్‌జీ కూడా జాతీయవాద, సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్య సంఘటన వైపే మొగ్గు చూపుతున్నారు. ఎందుకంటే ఆయనకు నియంతృత్వమంటే హడల్, కాంగ్రెస్‌లో వామపక్షవాదుల్ని కూడగట్టాలనే ఆత్రుత. దాని ఫలితంగానే 1936లో కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీకి చెందిన ముగ్గురు నాయకుల్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోకి తీసుకున్నారు. వాళ్లు – **జయప్రకాశ్ నారాయణ్, ఆచార్య నరేంద్ర దేవ్, అచ్యుత పట్వర్ధన్.** నేను కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ వాణ్ణికాదు, కమ్యూనిస్ట్‌నూ కాదు. నేను దక్షిణదేశానికి చెందినవాణ్ణి. రైతుల కోసం పాటుపడుతున్నవాణ్ణి. కొత్తగా ఎదుగుతున్న రాజకీయ శక్తుల ఆవరణకు ఆవలివాణ్ణి. అయినా సరే చలనశీల దేశ స్థాయి రాజకీయాల దిశగా సాగుతున్నవాణ్ణి. నేను ఇతరులవలేకాక రైతు ఉద్యమాన్ని అఖిలభారత రాజకీయ శక్తిగా మలచదలిచా. దాన్ని ఎవరూ అశ్రద్ధ చేసేందుకు వీలులేదు. అందరూ దాని కోసం పాటుపడాల్సిందే. ఈ నూతన శక్తిని స్వాగతించే బదులుగా పాశ్చాత్య ప్రభావానికి లోనైన శక్తులు. పార్టీలు – అంటే **కాంగ్రెస్ సోషలిస్ట్, కమ్యూనిస్ట్ పార్టీలు భారతీయ రైతు ఉద్యమాన్ని ఎంతగా అరికట్టేందుకు వీలుంటుందో అంతగా అరికట్టగలిగారు.** పైగా సంప్రదాయ కాంగ్రెస్‌వాదులు రైతులకు ప్రత్యేక వేదిక ఉండాలనే గ్రహింపు కలవారు కాదు. వాళ్లకు కాంగ్రెస్సే అత్యున్నత రైతు సంస్థ. కిసాన్ కాంగ్రెస్ కనుక అది ఒక వర్గంగా, రాజకీయేతర

సంస్థగా అయినా సరే ప్రజానురంజకమైతే – కాంగ్రెస్ అధికారాన్నీ ప్రజాదరణనీ కోల్పోతుందని వాళ్ల భయం. అందుకే నేను అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ విషయంలో చేస్తున్న కృషికి వాళ్లు చిరచిరలాడసాగారు.

అయితే, 1936 డిసెంబర్‌లో ఫయాజ్‌పూర్‌లో నా అధ్యక్షతన ద్వితీయ అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ నిర్వహించే సమయానికి కమ్యూనిస్ట్‌లు, కాంగ్రెస్ సోషలిస్ట్‌లు నన్ను వ్యతిరేకించి లాభం లేదనుకున్నారు. ఈ శక్తిమంతమైన వేదికను అదుపులోకి తెచ్చుకునేందుకు ఇరు వర్గాలు ఆత్రుతగా పోటీకి దిగాయి. అయితే అందులో కీలక స్థానాల్లో ఉన్న వాళ్లంతా నా వంటి అభిప్రాయాలు కలవారే. శక్తి సామర్థ్యాల్లో ఈ సంస్థకు పోటీగా నిలువగలిగేది కాంగ్రెస్ మాత్రమే.

పండిట్ నెహ్రూ అఖిలభారత కాంగ్రెస్ కమిటీలోకి కమ్యూనిస్ట్‌లను ఆహ్వానించారు. దాంగే, మరెందరో కమ్యూనిస్ట్‌లు అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సభ్యులయ్యారు. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ కూడా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో తన స్థానాలను పదిలపర్చుకుంది. కమ్యూనిస్ట్‌లు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలోకి, కాంగ్రెస్ సంస్థలోకి చొచ్చుకుపోయి అన్ని స్థాయిల్లోనూ విస్తరించసాగారు. అలా 'పాప్యులర్ ఫ్రంట్' ఒకటి అన్ని వేదికల్లోనూ పిక్కి చూసింది. నేను కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీల సహకారంతో ఐదేళ్లపాటు కాంగ్రెస్ నాయకత్వంతో సామరస్యపూర్వకంగా మెలగాల్సి వచ్చింది. ఈ యునైటెడ్ ఫ్రంట్ కిసాన్ కాంగ్రెస్ కార్యకలాపాల్లో ఏ మేరకు అక్కరకు వస్తుందనే అంశాన్ని నేను చాలా త్వరగా తేల్చుకోవాల్సి వచ్చింది. నేను **జయప్రకాశ్ నారాయణ్ Why Socialism(సోషలిజం ఎందుకు?) అనే పుస్తకం చదివాను. ఆయన కుటీర పరిశ్రమలను ఎంతగా వ్యతిరేకించేవారో, మార్క్సిజాన్ని ఎంతగా ప్రేమించేవారో గమనించగలిగాను.** నేనేమో చేతివృత్తుల కళాకారుల్ని, వాళ్ల కుటీర పరిశ్రమలను సంరక్షించేందుకు పూనుకున్నా. రాజకీయాల్లో గాంధీ మార్గానికి కట్టుబడినవాణ్ణి. రైతుల పట్ల, మన దేశం పట్ల కమ్యూనిస్ట్‌లు అవలంబించే వ్యతిరేక వైఖరి నాకు ఆమోదయోగ్యంగా ఉండేదికాదు. వాళ్లు స్వామి సహజానంద సరస్వతిలో నూటికి నూరుపాళ్లు రైతు భావన కనిపించేది. అయన కూడా మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని అంగీకరించేవాడు కాదు. **ఇందూలాల్ యాగ్నిక్** మొదట్నుంచీ వ్యక్తివాది. ఆయన కూడా ఆ రెండు పక్షాల్లో దేనిలోనూ ఇమడగలిగేవాడు కాదు. కనుక మేము ముగ్గురం కలసి పనిచేస్తూ ఆ రెండు పక్షాలకు కిసాన్ కాంగ్రెస్ సమదూరాలిగా మారకుండా అడ్డుకోగలిగాం.

అయితే కిసాన్ కాంగ్రెస్‌కు గల ఈ విధమైన స్వేచ్ఛను జిల్లా, ప్రాంతీయ స్థాయిల్లో కాపాడడం అంత తేలికైన పనికాదు. ఆంధ్ర, బీహార్ ప్రాంతాల్లో తప్ప మరే తావులో కేవలం రైతుల కోసమే పాటుపడుతూ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీనికానీ, కమ్యూనిస్ట్ పార్టీనికానీ లెక్క చేయకుండా ఉండగలిగేవాళ్ల సంఖ్య స్వల్పం. కనుక అత్యధిక ప్రాంతాల్లో కిసాన్ కాంగ్రెస్‌పై ఆ రెండు పక్షాల ప్రాబల్యం అధికంగానే ఉండేది. రైతు సంక్షేమమే ఊపిరిగా చేసుకున్న నేనూ, స్వామీజీ అఖిలభారత కాంగ్రెస్ కమిటీ, అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ పనులతో తలమునకలవుతూ ఉండగా స్థానికంగా ప్రబలంగా ఉన్న రాజకీయ పక్షాల నాయకత్వాన్ని స్థానిక రైతు నాయకులు అంగీకరించక వేరే దారిలేని పరిస్థితి ఏర్పడింది. ఇదంతా ఏదో ఒక దశలోని పరిణామం కాదు. అయితే 1939-40 నాటికి నెలకొన్న వాస్తవ స్థితి అది.

ఆంధ్రలో పెత్తనం కిసాన్ కాంగ్రెస్‌వారిదే. వాళ్లంతా రైతు విద్యాలయంలో సుశిక్షితులై ప్రజల మధ్య సేవలందించే నా అనుచర గణం. వాళ్లంతా నాకు విశ్వాసపాత్రులు. ప్రతి సంవత్సరం రైతు విద్యాలయంలో శిక్షణ పొందే రైతులు, చేతివృత్తులవారు, హరిజన యువకులు జిల్లా స్థాయిల్లో, తాలూకా స్థాయిల్లో, గ్రామ స్థాయిల్లో అధికమవుతున్న కిసాన్ కాంగ్రెస్ సంస్థల్ని నిర్వహిస్తున్నారు. ఇదంతా గమనించిన కమ్యూనిస్ట్ పార్టీ మాతో పోటీపడాలంటే పోటీ విద్యాలయాల స్థాపనే లక్ష్యంగా చేసుకుని 1937, 1938, 1939 సంవత్సరాల్లో పోటీగా విద్యాలయాలు, శిబిరాలు నిర్వహించింది. మా వద్ద శిక్షణ పొందేవారిని ఆకర్షించే ఉద్దేశ్యంతో నిడుబ్రోలులో (1937, 1938), మదనపల్లిలో (1938), తునికిపాడులో (1939), ఇడుపులపాడులో (1940), ఇచ్ఛాపురంలో (1939) నిర్వహించిన శిబిరాలకు వాళ్ల యువతలో కొందరిని పంపడం జరిగింది. దానివల్ల ప్రయోజనం లేకపోయినందు వల్ల చివరకు ఆంధ్ర ప్రొవెన్షియల్ కిసాన్ కాంగ్రెస్‌నే వశపర్చుకునే ప్రయత్నం చేశారు.

ఈ విధమైన ప్రయత్నం వాళ్ల రాజకీయ తప్పిదంగా రుజువైంది. ఎందుకంటే అంతవరకూ అంటే 1940 వరకూ కొన్ని కీలక పదవుల్లో కమ్యూనిస్ట్, కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలకు చెందిన కామ్రేడ్లు కూడా ఉండేవాళ్లు. జనరల్ సెక్రటరీగా ప్రముఖ కమ్యూనిస్ట్ 1938-40 మధ్యకాలంలో పనిచేశారు. అధ్యక్షులు కె.ఎస్.ఎన్.మూర్తి మహాత్మాగాంధీకి, నాకూ పరమ విధేయుడైన కిసాన్ కాంగ్రెస్‌వాది. కమ్యూనిస్ట్‌ల్లో అసహనం పెరుగుతోంది. నేషనల్ యునైటెడ్ ఫ్రంట్ కోరిక మేరకు వాళ్లు అన్ని

స్థానాలను కైవసం చేసుకోలేకపోతున్నారు. ప్రతి సంవత్సరం ఎన్నికలు జరిగినట్టే పలాసలో జరిగిన అఖిలభారత కిసాన్ సభ సందర్భంగా ఎన్నికలు జరిగాయి. వాటిల్లో ప్రావెన్షియల్ పదవుల్లో ఎక్కువభాగం వాళ్లకు దక్కాలనే ప్రయత్నంలో వాళ్లున్నారు. కొద్దితేడాతో మాత్రమే వాళ్లు ఓడిపోయారు. అది కిసాన్ కాంగ్రెస్‌వారికి కనువిప్పు అయ్యింది. అలాగే అఖిలభారత స్థాయిలో కూడా యునైటెడ్ ఫ్రంట్ సమర్థనీయంగా ఎన్నికల్లో వ్యవహరించలేదు. 1946 నాటి విషయాన్ని అలాగే వదిలేస్తే కిసాన్ వ్యవహారంలో కమ్యూనిస్టులు పెత్తనం చేస్తారనిపించింది. భారతీదేవి గారు కిసాన్ కాంగ్రెస్‌కు, కమ్యూనిస్టులకు మధ్య ఐక్య సంఘటన ప్రసక్తే వద్దన్నది. ఆ విధంగా కిసాన్ కాంగ్రెస్ వేదికపై ఐక్య సంఘటన అంతరించింది.

అయితే భారతదేశపు రైతుల విషయంలో యునైటెడ్ ఫ్రంట్ చేసిన హాని అంతా ఇంతా కాదు. కాంగ్రెస్ సోషలిస్ట్‌లకు, కమ్యూనిస్ట్‌లకు కిసాన్ కాంగ్రెస్ యుద్ధ భూమిగా మారింది. కిసాన్ కాంగ్రెస్ వారు వారంతటి శక్తిమంతులు కారు. చివరకు చీలిక వచ్చేనాటికి కిసాన్ కాంగ్రెస్ విధ్వంసానికి గురైంది. స్థానిక నాయకులు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకోసాగారు. రాజకీయ వైరి వర్గాలు వాళ్లను తలో వైపునకు లాగసాగాయి. ఏమైనా అదొక విషాద గాథ.

త్వరితగతిన కమ్యూనిస్ట్ పార్టీ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీని కబళించసాగింది. 1940 నాటికి ఆంధ్ర, తమిళనాడు, మలబారు, పంజాబ్ ప్రాంతాల్లో అవి కమ్యూనిస్ట్ యూనిట్లుగా మారాయి. ఆ విధంగా చాలా ప్రాంతాల్లో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి, జిల్లా కాంగ్రెస్ కమిటీలకు 1938, 1939 సంవత్సరాల్లో ఎన్నికలు వేడిగా, వాడిగా జరిగాయి. పండిట్ జీ ఊగిసలాట ధోరణి కొంత వాళ్లకు కలిసివచ్చింది. మేము యునైటెడ్ ఫ్రంట్‌గా కలిసి ఉండడం వాళ్లకే వీలుగా మారింది. ఆంధ్రా ప్రావెన్షియల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి నేను పోటీ చేసినప్పుడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలోని కాంగ్రెస్ సోషలిస్ట్‌లు, కమ్యూనిస్ట్‌లు పరిస్థితిని వాళ్లకు అనుకూలంగా బాగానే మలచుకున్నారు. అధిక సంఖ్యాకులుగా ఉన్న వారికీ, నన్ను బలపర్చేవాళ్లకూ మధ్య కొలతాపాల్ని పెంచి పోషించారు. జనరల్ సెక్రటరీగా పోటీ చేసిన సుందరయ్య గారికి అధ్యక్షునిగా నాకు లభించిన ఓట్ల కంటే తక్కువ లభించగా యునైటెడ్ ఫ్రంట్ మీద మేము విశ్వాసపాత్రంగా లేమని దుయ్యబట్టడంలో వెనకాడలేదు. ఇతర ప్రావిన్స్‌లలోని కాంగ్రెస్ వారి అనుభవాలు కూడా ఇలాంటివే. పండిట్ జీ అధ్యక్షునిగా

ఉన్న రెండేళ్ల కాలంలో యునైటెడ్ ఫ్రంట్‌కు అత్యంత ప్రోత్సాహం లభించింది. ఆయన కాంగ్రెస్ వారిని, కాంగ్రెస్ సోషలిస్ట్‌లను వారి వారి రెండు జెండాలను ఎగరవేసేందుకు-ఒక వేదిక నుండి రెండు భిన్న స్వరాలను వినిపించేందుకు అనుమతించడంతో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, కిసాన్ కాంగ్రెస్‌లు జాతీయ జెండాను, ఎర్ర జెండాను పక్క పక్కనే ఎగరవేయసాగాయి. పైకి అంతా అలా ఐక్యత కనిపించినా వాస్తవానికి అంతంత మాత్రంగానే ఉన్న ఆ రోజుల్లో యునైటెడ్ ఫ్రంట్ విషయంలో సర్దార్ పటేల్, రాజాజీలు నెహ్రూకు ఎదురునిలిచారు.

గాంధీజీ మద్దతు పలకకున్నా పెద్దతరం మద్దతుతో సుభాష్ బాబు రెండో పర్యాయం అధ్యక్షుడు అయినప్పుడు యునైటెడ్ ఫ్రంట్ శకం చరమ దశకు చేరుకున్నది. సుభాష్ బాబు తొలిసారి అధ్యక్షునిగా ఉన్న కాలంలో జవహర్‌లాల్‌జీ విధానాన్నే కొనసాగించారు. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ కాస్త పుంజుకుంది. ఆ పుంజుకోవడం కమ్యూనిస్ట్‌లు ఆ కాస్తా జుర్రుకోవడానికి పనికొచ్చింది. లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ మహాసభలో చైర్మన్‌గా ఎన్నికైన ఎం.ఆర్.మసాని ఆ పొరపాటును గుర్తించి కాంగ్రెస్, సోషలిస్ట్‌లు, కమ్యూనిస్ట్‌ల మధ్య ఐక్య సంఘటనను వ్యతిరేకించాడు. అయినా 1938లో అది అల్ప సంఖ్యాక గళంగానే మిగిలిపోయింది. అయితే సుభాష్‌బాబు అధ్యక్ష పదవికి రెండో పర్యాయం సర్దార్ పటేల్‌తో పోటీకి దిగినప్పుడు కమ్యూనిస్ట్‌లు నిజంగా ఆయనకు మద్దతు పలికారా అన్నది స్పష్టంగా తెలియదు. అయితే ఆయన ఎన్నిక కావడం, గాంధీజీ దాన్ని వ్యతిరేకించడంతో కమ్యూనిస్ట్‌లు రంగంలోకి దూకి చేయాల్సిందంతా చేశారు. అతివాదులకు, మితవాదులకు మధ్య విభేదాలను ఎక్కువచేసి వారి మధ్య దూరాన్ని పెంచారు. జయప్రకాశ్ నారాయణ్, నేనూ కలసి ఏదోవిధంగా రాజీ కుదిర్చాం. అయినా మేము అతివాదుల వైపే మొగ్గు చూపాల్సి వచ్చింది. ఎందరో కాంగ్రెస్‌వాదుల మాదిరిగానే నేనూ సుభాష్ పట్ల మహాత్మా గాంధీ వైఖరి సరైనది కాదనుకున్నాను. దురదృష్టవశాత్తూ జవహర్‌లాల్‌జీ పాత్ర నమ్మదగినదిగా లేదు. ఆయన సుభాష్‌కు మద్దతు పలుకుతున్నారా? సర్దార్ పటేల్‌ను వ్యతిరేకిస్తున్నారా? సరే, చివరకు ఆయన కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాల్సి వచ్చినప్పుడు నేను ఆయన పక్షానే నిలిచాను. అయితే సుభాష్ బాబు ఫార్వర్డ్ బ్లాక్ ఏర్పాటుచేసినప్పుడు ఆయన్ను విమర్శించిన వారిలో కమ్యూనిస్ట్‌లు ముందు వరసలో ఉన్నారు. ఇక నా విషయానికొస్తే 'ఫార్వర్డ్ బ్లాక్' అని నామకరణం చేయడంలో నేను మాట కలిపాను. రైతు కూలీ

రాజ్యం కోసం కృషి చేసే మా పక్షం, ఫార్వర్డ్ బ్లాక్ పరస్పర సహకారంతో పనిచేసుకునేటట్లుగా మా మధ్య అంగీకారం కుదిరింది. లెఫ్ట్ రాయిస్ట్‌లను, సోషలిస్ట్‌లను, కాంగ్రెస్ సోషలిస్ట్‌లను, కమ్యూనిస్ట్‌లను, కిసాన్ కాంగ్రెస్ వాళ్లను, మజ్దూర్ సభ వాళ్లను ఒక తాటిపైకి తెస్తే కమ్యూనిస్ట్‌ల ప్రాబల్యం తగ్గుతుందనుకున్నాం. జయప్రకాశ్ నారాయణ కూడా అదే ఉద్దేశ్యంతో వున్నారని తెలియవచ్చింది. బొంబాయిలో నిర్వహించిన అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సభల సందర్భంగా సుభాష్ బాబు అధ్యక్షతన సమావేశమై వామపక్ష సంఘీభావ కమిటీని ఏర్పాటుచేసి దాని కార్యక్రమాలకు రూపురేఖల్ని రూపొందించాం. అది వామపక్ష ఐక్యతకు చెరగని ముద్రేకానీ అది కాంగ్రెస్ సోషలిస్ట్‌లుగానీ, కమ్యూనిస్ట్‌లుకానీ అంతగా మెచ్చుకునేటట్లు కనిపించలేదు. ఎందువల్లనంటే ఆ ఇరు పక్షాల్లో ఏ ఒక్కదానికి కూడా పెత్తనం చెలాయించే అవకాశం లేకపోవడమే.

ఫార్వర్డ్ బ్లాక్ ప్రారంభోత్సవం కావాస్‌జీ జహంగీర్ హాలులో సుభాష్‌బాబు అధ్యక్షతన జరిగింది. నన్ను ప్రారంభోపన్యాసం ఇవ్వమని కోరి గొప్ప సౌహార్దాన్ని ప్రదర్శించారు. కాంగ్రెస్‌లోని జాతీయవాద కాంగ్రెస్‌కు ఇటువంటి స్వతంత్ర భావాలు గల రాజకీయ నాయకత్వం ఎంతో అవసరమని చెప్పాను. కొద్ది మాసాలకే రెండో ప్రపంచ యుద్ధం మొదలైంది. ఆ యుద్ధంలో బ్రిటిష్ ప్రభుత్వం పాల్గొనడం జరిగితే కాంగ్రెస్ అటువంటి చర్యను ఖండించాల్సిందేనన్నాడు. కాంగ్రెస్ నాయకత్వం బీరాలకు పోయి ఆయన సలహాను పెడచెవిన పెట్టినందువల్ల పెద్ద నష్టమే వాటిల్లింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కాంగ్రెస్ మంత్రులను రాజీనామా లేఖలను సమర్పించమంది. అందుకు కారణం బ్రిటిష్ ప్రభుత్వం ముందుగా మాటమాత్రమైనా తెలియజేయకుండా భారత ప్రభుత్వాన్ని కూడా జర్మనీపై యుద్ధం ప్రకటించేటట్లు బలవంతపెట్టింది. అది **లెఫ్ట్ కన్సాలిడేషన్ కమిటీకి** ఆమోదయోగ్యంగా లేదు. సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం దేశ వ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చాం. మహాత్మాగాంధీ అందుకు అంగీకరించరని మాకు తెలుసు. హింస చోటుచేసుకుంటుందనే అంశం మీదనే ఆయన రగడ అంతా. అది మాకు నచ్చలేదు. దీనివల్ల లబ్ధి పొందబోయేది కమ్యూనిస్ట్‌లే అన్న ఆయన భావాన్ని మేము గ్రహించలేకపోయాం. అయినా ఆయన అంటూనే ఉన్నారు. నువ్వు అహింసావాదివే. కలగూరగంపగా ఉన్న ఆ పార్టీలన్నీ అహింసను పాటిస్తాయనే నమ్మకమేమున్నదని బాపూజీ నన్ను నిలదీశారు. అప్పుడు నేను కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన శ్రీ అజయ్‌ఘోష్‌ను

గాంధీజీతో మాట్లాడేందుకు వార్దా తీసుకెళ్లాను. చివరకు కమ్యూనిస్ట్ పార్టీ సాధ్యమైన మేరకు మాత్రమే అహింసా పద్ధతిని పాటిస్తుందనే మాట విన్న తర్వాత నాకు కనువిప్పు కలిగింది. అప్పుడు బాపూజీ నేను చేయబోయేదేమిటో చెప్పమన్నారు. అప్పుడు నేను సుభాష్‌బాబుకు చెబుతానన్నాను సత్యాగ్రహం లెఫ్ట్ కన్సాలిడేషన్ కమిటీ తరపున చేపట్టవద్దని, ఒకవేళ చేపట్టాల్సివస్తే అందులో కమ్యూనిస్ట్‌ల భాగస్వామ్యం లేకుండా చూడమని. దానికి గాంధీజీ సమ్మతించారు. వెంటనే కలకత్తా వెళ్లి సుభాష్‌బాబుకు ఆ విషయాలన్నీ వివరించి చెప్పాను. అయినా సత్యాగ్రహం నిర్వహించేందుకే సుభాష్‌బాబు నిర్ణయం తీసుకున్నాడు. ఆయన కమ్యూనిస్ట్‌ల ఎత్తుగడ అర్థంచేసుకున్న తర్వాత యునైటెడ్ ఫ్రంట్, లెఫ్ట్ కన్సాలిడేషన్ కమిటీ రద్దుకు చర్యలు తీసుకున్నాడు.

1938లో నాతో కలసి పనిచేసే ఒకరు నా సంక్షిప్త జీవిత చరిత్ర రాశారు. దానికి ముందుమాట కాంగ్రెస్ కమ్యూనిస్ట్ యువ నాయకుడు ఎ.ఎస్.రాజు రాశారు. దానివల్ల నా అనుయాయులు కొందరు వాళ్ల మిత్రులవుతారనుకున్నారు. అయితే 1939లో వాళ్ల అసలు రంగు బయటపడింది. కమ్యూనిస్ట్ ధోరణిలో కొనసాగే జనరల్ సెక్రటరీ ప్రొవెన్షియల్ కిసాన్ సభలో సమర్పించిన తన నివేదికలో కావాలనే నా పేరుగానీ, దేవీజీ పేరుగానీ, జి.ఎల్.నారాయణ పేరుగానీ, రైతు విద్యాలయం గ్రాడ్యుయేట్ల పేర్లుగానీ కిసాన్ వుద్యమ అభివృద్ధికి కృషి చేసిన వారి జాబితాలోకి రాకుండా చూశాడు. అది కిసాన్ వుద్యమంలోని కాంగ్రెస్ వాదులకు కనువిప్పు కలిగించింది. దానితో అది కమ్యూనిస్ట్‌ల కుతంత్రమని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి దాడికి దిగారు. 1936 వరకూ ఆంధ్ర ప్రాంతపు కమ్యూనిస్ట్ నాయకులు నిరంతరం రైతు ఉద్యమాన్ని నీరుగార్చుతూనే ఉన్నారన్నారు. అడ్డుతగులుతూనే ఉన్నారన్నారు. గేలి చేస్తూనే వున్నారన్నారు. అసలు కిసాన్ ఉద్యమం ద్వారా ఏ విధమైన విప్లవాన్ని తీసుకురావడం జరగదని బహిరంగంగా అవహేళనకు దిగారన్నారు. **వల్లభరావు** అనే ఆయన 1934లో సెంట్రల్ అసెంబ్లీలో నేను పోటీ చేసిన సందర్భంగా కమ్యూనిస్ట్‌లు లోపాయకారిగా ఏమేం చేసిందీ వెల్లడించారు.

నేను లెనిన్, గాంధీజీ బోధనలను బేరీజు వేసి చూసి గాంధీజీ బోధనలు, కార్యక్రమాలు భారతదేశ పరిస్థితులకు ఎక్కువ అనుకూలమని రైతు విద్యాలయంలో బోధించేవాడిని. అలాగే పత్రికల్లో తెలుగులో రాసే వ్యాసాల్లో కూడా రాసేవాణ్ణి. అది కమ్యూనిస్ట్‌లకు కంటగింపుగా ఉండేది – మరీ ముఖ్యంగా ఎ.ఎస్.రాజు గారికి. దాంతో ఆయన నేను

గాంధీ వాదాన్ని బలోపేతం గావించేందుకే యునైటెడ్ ఫ్రంట్‌ను వాడుకుంటున్నానని ఆరోపించసాగాడు. యునైటెడ్ ఫ్రంట్ కొనసాగుతున్నా నేనూ, నా అనుచరులూ మా కార్యకర్తలపై కమ్యూనిస్ట్‌ల ప్రభావం అధికం కాకుండా చూసుకునేవాళ్లం.

సోవియట్ వరిణామాల ప్రాముఖ్యం బయట ప్రపంచానికి ఎలా అవగతమవుతున్నదీ, అసలు సోవియట్ రష్యాలో ఏమి జరుగుతున్నదనే విషయాలను కర్షంచేసుకోవడంలో దాదాపు పది సంవత్సరాల వ్యత్యాసం కనిపిస్తూ ఉంది. **సోవియట్‌లో రైతుల అణచివేత, రైతులనూ, పల్లెవాసులనూ సైబీరియాలోని నిర్బంధ శ్రామిక శిబిరాలకు తరలించడంవంటి విషయాల ఆనుపానులు గ్రహించడంలో ఇంగ్లీష్, అమెరికా మేధావులు, రాజకీయ నాయకులు చాలా మందకొడిగా ఉన్నారు.** ఆసియావాసులమైన మేము వాళ్ల విషయాలను గ్రహించి వివరించబూనేటప్పటికి వాళ్ల పట్ల గల మా పక్షపాత వైఖరి వల్ల, వాళ్ల సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తున్నందువల్ల, స్వేచ్ఛ, సామాజిక న్యాయం విషయంలో వాళ్ల రెండు నాల్కల ధోరణి వల్ల వాళ్లను మేము నమ్మే స్థితిలో లేము. వెబ్ రాసిన పుస్తకం **'సోవియట్ కమ్యూనిజం'** సోవియట్ సాధించిన విజయాల పట్ల ఉత్సాహభరితుల్ని చేసేది. రవీంద్రనాథ్ పర్యటన అనుభవాలు, మోదరన్ రివ్యూలో వచ్చిన వ్యాసాలు, జవహర్‌లాల్‌జీ అనుభవాలు చదివితే సోవియట్ భూమిలో సరికొత్త నాగరికత అత్యద్భుతంగా విలసిల్లుతున్నట్లు తెలియవచ్చేది. కనుక భారతదేశ రైతుల వంక్షేమం కోసం కృషి చేసే మాకు సోవియట్ రైతులకు చేకూరే లబ్ధిని గురించి అనుకూలంగాగానీ, వ్యతిరేకంగాగానీ తెలియరాలేదు. అయితే పౌర స్వేచ్ఛపై, నియంతృత్వపు ఘాతుకాలపై శక్తిమంతమైన ప్రమాద ఘంటికల్ని నేను 1932లో వెల్లూరు జైలులో రాసిన 'ఆధునిక రాజకీయ సంస్థలు' అనే పుస్తకం ద్వారా వినిపించాను. అయితే 1934లో 'రైతు గీతాలు' ప్రచురించేటప్పుడు అక్కడి రైతుల స్థితిగతులు అసలేమీ తెలియకున్నా సోవియట్ రష్యా అద్భుత ప్రయోగాలు చేసిందని, అదొక ప్రగతిదాయక సమాజాన్ని నిర్మించిందనే అభిప్రాయాన్ని వ్యక్తంచేశాను. యునైటెడ్ ఫ్రంట్‌తో తెగతెంపులు చేసుకున్న తర్వాతనే రష్యాపై వచ్చిన సాహిత్యాన్నంతా మేము పునఃపరిశీలన చేయసాగాం. కమ్యూనిస్ట్‌లను విశ్వసించకుండా మహాత్మాగాంధీ ఎప్పుడూ తన ఆలోచనా ధోరణిలో పైస్థాయిలోనే ఉండేవారు. కమ్యూనిస్ట్‌ల రచనల నుండే రైతులకు అనుకూలంగా కనిపించని సమాచారాన్నంతా పోగుచేసి 1945లో **రైతులు-కమ్యూనిస్ట్‌లు'** అనే గ్రంథాన్ని ప్రచురించాను. అది 1938లో ప్రచురించిన

'రైతులు-కాంగ్రెస్' అనే దానికి కొనసాగింపే.

అధికారంలో ఉన్న కాంగ్రెస్ ముఠా జిల్లా బోర్డు ఎన్నికల సందర్భంగా ఒక దురదృష్టకర అనుభవాన్ని బలవంతంగా నాకు పంచింది. అది 1936లో. అప్పటివరకూ జిల్లా బోర్డు సంప్రదాయక మోతుబరి కుటుంబాల ఆధీనంలోనే ఉండేది. అప్పటి అధ్యక్షులు **జాగర్లమూడి కుప్పస్వామి** అందరికీ తెలిసిన రైతు. సంపన్న రైతు కూడా. ఆయన సాధారణ ఎన్నికల్లో నాకు తోడ్పాటునందించారు కనుక – అదేదో కాంగ్రెస్‌కు సంబంధించని తోడ్పాటైనట్లు – నేను బోర్డు పగ్గాలు చేపట్టేందుకు దాని ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బాగా తోడ్పాటు అందించడంలేదని ఆరోపణ. అప్పుడు ఆ నిందను పోగొట్టుకునేందుకు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడానికి విజృంభించి పనిచేయాల్సి వచ్చింది. అలా మా వాళ్లే మాకు హాని తలపెట్టేవాళ్లు. 1934 ఎన్నికల్లో వాళ్లు నన్ను ఓడించడానికి కృషిచేసినా నేను వెళ్లి కేంద్ర అసెంబ్లీలో కూర్చోగలిగాను. ఆంధ్ర ప్రాంతానికి ఆవల కూడా ఆదరణ పొందసాగాను. నేను నాయకత్వం వహిస్తున్న జమీందారీ వ్యతిరేక ఉద్యమాన్ని ఖండించేటట్లు గాంధీజీకి నచ్చచెప్పడంలో కూడా వాళ్లు విఫలులయ్యారు. చివరకు ఇక్కడ ఇలా జిల్లా బోర్డు ఎన్నికల బురద పూద్దామనుకున్నారు. అదీ పడలేదు. మాకు స్థానిక రాజకీయాలు అంతగా పట్టలేదు. అందువల్ల వాళ్లు మా ఉరకలు వేసే ఉత్సాహానికి పెద్దగా గండి కొట్టలేకపోయారు. అయినా అప్పటి జిల్లా బోర్డు అధ్యక్షులు అంతగా మా ప్రణాళికలను స్వీకరించి వాడుకున్న దాఖలాలు లేవు. 1933లో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో రైత్వారీ పట్టాదారుల్లోని పెద్ద రైతులందరూ కలిసి వాళ్ల కోర్కెల సాధన కోసం ఒక రైతు సంఘాన్ని స్థాపించదలిచారు. నేను దాన్ని వ్యతిరేకించాను. **ఆ పెద్ద రైతులకు, వాళ్ల నాయకులకు తోడ్పాటునందించనన్నాను.** అయితే 1955–65 మధ్య కాలంలో నేను ల్యాండ్ సీలింగ్‌కు, సహకార వ్యవసాయానికి, కంట్రోళ్లకు వ్యతిరేకంగా ఉన్నందు వల్ల కమ్యూనిస్ట్‌లు నన్ను నిందించారు. అది సమంజసమేనా?

1935లో దక్షిణ భారత రైతు కూలీల ఐక్య సంఘటనను ఏర్పాటుచేయడంలో మేము సఫలీకృతులయ్యాం. మేము రూపొందించిన కనీస కోర్కెల పత్రం తర్వాత కాలంలో రైతులకు, వ్యవసాయ కూలీలకు, చేనేత కార్మికులకు, మిగతా వారికి వాళ్ల వాళ్ల సంఘాల ఏర్పాటులో దాన్ని వారు బాగా ఉపయోగపడేటట్లు చేసుకున్నారు. రైతులు, కూలీలు కలసికట్టుగా పనిచేస్తేనే ఉభయ వర్గాలకూ ప్రయోజనం చేకూరుతుందని

నేను 1923 నుండి చెబుతూనే వస్తున్నా. ఎందుకో బీహార్ ప్రాంతంవారికి అది నచ్చలేదు. జయప్రకాశ్‌నారాయణ్ సహకారంతో 1938లో అఖిలభారత కిసాన్ కాంగ్రెస్‌లో అది ఆమోదం పొందేటట్లు చూడగలిగాం. అసలు 1936లో నిడుబ్రోలు రైతు విద్యాలయంలో నిర్వహించబడిన ఆంధ్ర కిసాన్ ఉద్యమ చరిత్రలో అది ఓ మైలు రాయి. కనీస కోర్కెల పత్రానికి తొలి ఆమోద ముద్ర పడింది అక్కడే. కౌలు రైతుల సంక్షేమానికి కూడా తొలిసారిగా బీజాలు పడింది అక్కడే. రైతుల్ని కూడా గ్రామీణ ప్రాంత నియోజక వర్గాలకు అభ్యర్థులుగా పరిశీలనలోకి తీసుకోవాలని తొలిసారిగా నినదించింది కూడా అక్కడే. **కమ్యూనిస్ట్‌లు రైతుల్ని మూడు వర్గాలుగా విభజించసాగారు- పేద రైతులు, మధ్య తరగతి రైతులు, సంపన్న రైతులు. వారు కిసాన్ కాంగ్రెస్ కార్యకలాపాలను కేవలం మధ్యతరగతి, పేద రైతులకే పరిమితం చేయాలన్నారు. నేను దానికి అంగీకరించలేదు. నేను అందులోని ప్రమాదాన్ని గ్రహించి రైతులంతా ఒకే వర్గమని వాదించసాగాను.**

యునైటెడ్ ఫ్రంట్ పనిచేస్తున్న కాలంలో నన్ను రెండు పర్యాయాలు ఆంధ్రప్రదేశ్ ప్రొవెన్షియల్ కాంగ్రెస్ కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేపించే ప్రయత్నం జరిగింది - ఒకసారి ప్రకాశం పంతులు గారితో, రెండోసారి పట్టాభి గారితో. కాని నేను పోటీ చేసేందుకు ఒప్పుకోలేదు. దాన్ని అవకాశంగా తీసుకుని కాంగ్రెస్‌లోని వామపక్షీయులతో కలసి నా అనుచరులపై తమ ప్రభావాన్ని చూపే పనికి పూనుకున్నారు. నేను తెప్పరిల్లుకుని గాంధీజీకి స్పష్టంచేశాను- అటువంటి పోటీకి నేనెప్పుడూ దిగనని.

ఆ రోజుల్లో బ్రిటిష్ వారి శక్తికంటే గాంధీ గారిలోని పట్టుదలే మమ్మల్ని ఎక్కువగా ఆందోళనకు గురిచేసేది. ఏదైనా విషయంలో మా వైఖరి సరైనదిగా కనిపించి గాంధీజీది అందుకు భిన్నంగా కనిపిస్తే ఆయన్ను ఎదిరించే నైతిక శక్తి మాకు ఉండేది.

కాంగ్రెస్ మితవాదులు, కమ్యూనిస్ట్‌లు కలసి సుభాష్‌బాబు కారణంగా నాకూ, గాంధీజీకి మధ్య పొరపొచ్చాలు ఏర్పడ్డాయని కుచ్చిత బుద్ధితో ప్రచారానికి పూనుకున్నారు. అయితే వారి మాటలను ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. ఒక వ్యక్తిగా, ఆదర్శ పురుషునిగా నాకు గాంధీజీ ఆదర్శప్రాయుడు. నాకు ఆయన పట్ల నమ్మిక, వాత్సల్యం ఉన్నాయి. నేను విధేయుడనైన సహచరుణ్ణి, చిత్తశుద్ధి గల రైతు వాయకుణ్ణి. ఆ గుణాలే మేమిద్దరం మరింత దగ్గర కావడానికి కారణంగా చెప్పొచ్చు. 1944 నాటి ఉదంతమే అందుకు తార్కాణంగా చెప్పొచ్చు.

14

కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా జాతీయవాదుల కూటమి (1944-46)

1944లో నేను జైలు నుండి విడుదలయ్యేటప్పటికి ఆంధ్ర దేశ రాజకీయాల్లో ప్రజా పోరాటపు నినాదంతో కమ్యూనిస్టుల ప్రచారం సుడులు తిరుగుతూ ఉంది. మే **1944లో కమ్యూనిస్టులు విజయవాడలో అఖిలభారత కిసాన్ సభ నిర్వహించారు.** సభకు శ్రోతల్ని పెద్దయెత్తున తరలివచ్చేటట్లు చేశారు. ప్రతి జిల్లా నుండి రైతులు రావడం జరిగింది. కరపత్రాలు పంచారు. పుస్తకాలు అచ్చు వేశారు. క్రమశిక్షణ పెద్దయెత్తున పాటించారు. వాళ్లు కాంగ్రెస్‌ను రాజకీయంగా సామ్రాజ్యవాద అనుకూల పార్టీగా చిత్రీకరించి సామాజికంగా అభివృద్ధి నిరోధకులు అంటూ ఉంటే విజయవాడకు చెందిన **అయ్యదేవర కాళేశ్వరరావు** గారొక్కరే ఎదురు తిరిగి మాట్లాడే సాహసం చేశారు. ఇక నాపై, కిసాన్ కాంగ్రెస్‌పై కమ్యూనిస్టులు విరుచుకుపడ్డారు. అప్పుడు కాంగ్రెస్, కిసాన్ కార్యకర్తలు పలువురు జైళ్లల్లో ఉన్నారు.



నేను జైలు నుండి తిరిగి వచ్చిన తర్వాత కాంగ్రెస్, కిసాన్ ఉద్యమాల తరపున కమ్యూనిస్ట్‌ల ప్రజా పోరాట ఎత్తుగడలను చిత్తు చేసేందుకు సిద్ధమయ్యాను. బాపూజీ ప్రజాస్వామిక కిసాన్ మజ్దూర్ పార్టీ ఆశయాలను స్వాగతించి నన్ను ఆశీర్వదించారు. ఆయన కూడా తమ నిర్మాణాత్మక కార్యక్రమాన్ని విస్తృతపర్చి సమస్త ఉద్యమాలు, సకల వర్గాలు, అన్ని వయస్సులవారిని కలుపుకుపోయే రీతిగా మలుచుకోవాలనే అభిప్రాయానికి వచ్చారు.

పాత ముఠా కాంగ్రెస్ నాయకులకు నా ఉద్యమం కమ్యూనిస్ట్‌ల దేశభక్తిరహిత కార్యక్రమాలకు వ్యతిరేకంగా అనేది అర్థమయ్యేటట్లు చేశాను. ఆ విధంగా మేము గాంధీజీ నిర్మాణ కార్యక్రమాన్ని, కమ్యూనిస్ట్ వ్యతిరేక రాజకీయ ప్రచారాన్ని కొనసాగించాం. అటువంటి తరుణంలో కూడా సనాతన కాంగ్రెస్‌వాదులు కిసాన్, చేతివృత్తుల పనివారల సంఘాలకు మద్దతు పలికేందుకు సిద్ధంగా లేరు. వాళ్లు తమకు గాంధీ గారి నుండి ఆ మేరకు ఆదేశాలు అందాల్సిందేనన్నారు. వారు గాంధీ గారిని కలిశారు. పూర్తి తోడ్పాటును అందించమని ఆయన వారితో చెప్పారు. చివరకు ఎలాగైతేనేం సర్దార్ పటేల్ వ్యవస్థాపక అధ్యక్షుడిగానూ, గుర్జారీలాల్ నందా జనరల్ సెక్రటరీగానూ వ్యవహరిస్తున్న సంస్థ హిందుస్థాన్ మజ్దూర్ సేవా సంఘ్, మా కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం ఆశయాలను సొంతం చేసుకోగలిగింది. ఆ సంస్థ గాంధీ గారు స్థాపించిన అహ్మదాబాద్ మజ్దూర్ సంఘ్‌కు తాత్విక కేంద్రం.

అయ్యదేవర కాళేశ్వరరావు

1944లో విజయవాడలో, 1945లో తెనాలిలో కమ్యూనిస్ట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సభలకంటే మిన్నగా గోవాడలో కిసాన్ కాంగ్రెస్ సభల్ని నిర్వహించేందుకు పూనుకున్నాం. చివరకు ఎలాగైతేనేం ఎంతోకాలంగా నాకు కాంగ్రెస్‌లో ప్రత్యర్థులుగా ఉన్నవారు సైతం నాతో సహకరించారు. దాని కారణంగా గోవాడ సదస్సుకు నలభై వేలమంది రైతులు హాజరయ్యారు. నేను

ఆ సదస్సుకు అధ్యక్షత వహించాను. తర్వాత మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన **భక్త వత్సలం** గారు దాన్ని ప్రారంభించారు. శ్రీ అయ్యదేవర కాళేశ్వర రావు గారు ప్రత్యేక ప్రసంగం చేశారు. సదస్సు మొత్తం కమ్యూనిస్ట్‌ల రైతు వ్యతిరేక, దేశభక్తి వ్యతిరేక కార్యకలాపాలను దుయ్యబట్టడానికి, రైతులకు గిట్టుబాటు ధరలను కోరేందుకు కంట్రోళ్లను ఎత్తివేయమని ఎలుగెత్తి చాటేందుకు ఉద్దేశించబడినదిగా రూపుదాల్చింది. దానితో కమ్యూనిస్ట్‌లు చాలావరకు ఖంగుతిన్నారు. సదస్సు తర్వాత రాత్రి రైతులు వారి వారి గ్రామాలకు తిరిగి వెళ్లే తరుణంలో కాంగ్రెస్ రైతు నాయకులపై కమ్యూనిస్ట్‌లు దాడికి దిగారు. అమృతలూరులో జరిగిన దాడిలో కొందరు తీవ్రంగా గాయపడ్డారు. అమృతలూరుకు చెందిన **సీతారామయ్య** గారిని, మరికొందరిని తెనాలి ఆసుపత్రిలో చేర్చాల్సి వచ్చింది. కమ్యూనిస్ట్‌ల ఇటువంటి హింసాయుత ప్రదర్శన మమ్మల్ని శక్తిహీనుల్ని గావించకపోగా మరింతగా శక్తిమంతుల్ని గావించింది. వాళ్లకు హింసాయుత మార్గంపైనే మక్కువ ఎక్కువ అని మేము చేసే ప్రచారాన్ని రుజువు చేసినట్లయ్యింది.

కిసాన్ ఉద్యమాన్ని గాడిలో పెట్టిన తర్వాత **సుందరరావు, అమ్మయ్య**ల సాయంతో విద్యార్థి కాంగ్రెస్‌పై దృష్టి మళ్లించాను. **'జాతీయ పోరాటంలో విద్యార్థుల పాత్ర'** అనే నా చిరుపొత్తం కమ్యూనిస్ట్‌లు నడిపే విద్యార్థి ఫెడరేషన్‌కు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. 1944 డిసెంబర్‌లో మచిలీపట్నంలో నిర్వహించిన ఆంధ్ర విద్యార్థి సమ్మేళనానికి వేలాదిగా విద్యార్థులు, యువత హాజరయ్యారు. జాతీయ స్థాయిలో దాన్ని నిలిపేందుకు జనరల్ సెక్రటరీ **డి.సెక్రకర్** దేశమంతా పర్యటించి ఉత్తర హిందూదేశంలో ప్రాంతీయ శాఖల్ని తిరిగి క్రియాశీలం గావించారు. అఖిలభారత విద్యార్థి కాంగ్రెస్ విషయంలో సోషలిస్ట్‌లు, కాంగ్రెస్ వారు మాతో బాగా సహకరించారు. అదేవిధంగా యువజన కాంగ్రెస్ కూడా గుర్తింపు పొందింది. సేవా దళాలు, రాజకీయ శిక్షణా శిబిరాలు నిర్వహించింది. 1945 వేసవి నాటికి మేము బొంబాయి, లాహోర్, కలకత్తా, నాగపూర్, మద్రాస్‌లో నగరాల్లో **సిటిజన్‌షిప్ కాలేజెస్** (పౌరసత్వ కళాశాలలు) నిర్వహించగలిగాం. **ఎస్.కె.పాటిల్** కూడా కమ్యూనిస్ట్‌ల ప్రజా పోరాట ప్రచారాన్ని తిప్పికొట్టడంలో ఎంతగానో సహకరించారు. అలాగే **రామచంద్రన్, ప్రబోధ చంద్ర**లు కూడా సిటిజన్‌షిప్ కాలేజెస్‌కు ఎనలేని సహకారం అందించారు. సిటిజన్‌షిప్ కళాశాలలకు, విద్యార్థుల రాజకీయ శిబిరాలకు, కిసాన్ పాఠశాలలకు పాఠ్య ప్రణాళికను సవివరంగా రూపొందించాను. తర్వాత 1946లో మద్రాస్ స్టూడెంట్స్ కాంగ్రెస్ వారు **'కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం'**

పేరుతో దాన్ని ప్రచురించారు.

సోదరులు జి.వి.అప్పయ్య జంగం కథలు, పద్యాలు, పాటల రూపంలో అనేక రచనలు కమ్యూనిస్ట్‌ల జాతీయ వ్యతిరేకవాద వైఖరిని ఎండగడుతూ రూపొందించారు. అనేక సాంస్కృతిక దళాలు రంగంలోకి దిగి ప్రదర్శనలిచ్చాయి. అయితే యుద్ధ సమయంలో మేము జైళ్లకెళ్లిన సందర్భంగా కమ్యూనిస్ట్‌లు వీటిని బాగా ఉపయోగించుకున్నారు. కమ్యూనిస్ట్‌లు వీరేశలింగం గారిని కామ్రేడ్ వీరేశలింగం అంటూ ఒక పుస్తకం కూడా రాశారు. అయితే కొందరి కమ్యూనిస్ట్‌ల అస్తవ్యస్త వ్యవహారాలను గేలిచేస్తూ ఈమనికి చెందిన శివయ్య గారు **కామ్రేడ్ మంగమ్మ** అనే నవల రాశారు.

యుద్ధ సమయంలో ఆలిండియా ట్రేడ్ యూనియన్ వేదికను కూడా కమ్యూనిస్ట్‌లు తమ వశం చేసుకున్నారు. తిరిగి దాన్ని గాడిలో పెట్టడం కష్టమని చెప్పినా **వి.వి.గిరి, వందా** గార్లు వినలేదు. చివరకు వాళ్లు 1946-47లో అసలు విషయం గ్రహించిన తర్వాతనే **ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్** స్థాపన సాధ్యపడింది. 1948 నాటికి అది ప్రముఖ శ్రామిక సంఘంగా రూపొందింది. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ కూడా దాన్ని గుర్తించింది.

అటువంటి తరుణంలోనే మేము ఎర్ర సైన్యం వాయువ్య దిశగా భారతదేశంలోకి ప్రవేశించి శక్తిహీనమైన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఓడించి ఎలా భారత కమ్యూనిస్ట్ పార్టీకి



అప్పగించనుందో, తర్వాత వారు కార్మిక నియంతృత్వాన్ని ఎలా స్థాపించదలిచారో వివరించాం. ఇంతలో భారత కమ్యూనిస్ట్ పార్టీ జనరల్ సెక్రటరీ పి.సి.జోషి గారు గాంధీజీకి లేఖ రాస్తూ జాతీయవాద పంథాను వాళ్లు విడనాడలేదని, కాంగ్రెస్ ఆదర్శాలకు అనుగుణంగానే కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలియజేశారు. దానితో మేము కమ్యూనిస్టులతో గత పదహారు మాసాలుగా కష్టనష్టాలకోర్చి అలా ఎడతెగని పోరాటం ఎందుకు చేస్తున్నామో బాపూజీ అర్థంచేసుకోగలిగారు.

ఆ సమయంలో నేను పంజాబ్, బొంబాయి, బెంగాల్, ఒరిస్సా, తమిళనాడు, కేరళ, హైదరాబాద్, మధ్యప్రదేశ్‌లలో పర్యటించాను. విద్యార్థులకు, యువతకు, రైతులకు, చేతివృత్తులవారికి సంబంధించిన అనేక సదస్సుల్లో పాల్గొన్నాను. లాహోర్‌లో నిర్వహించిన సదస్సుకు ఇరవై ఐదు వేలమంది హాజరయ్యారు. కలకత్తాలో నిర్వహించిన బెంగాల్ యువజన కాంగ్రెస్ సభకు పదిహేను వేలమంది హాజరయ్యారు. ఎక్కడకు వెళ్లినా దేశభక్తుల, ప్రజల మనోభావాలను కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం ఆశయాలు ఆకర్షిస్తూనే ఉన్నాయి. అప్పుడే ఇందూలాల్ యాగ్నిక్, స్వామి సహజానందలు కమ్యూనిస్టుల నుండి విడిపోయారు. అయినా కిసాన్ ఉద్యమానికి వారి సేవలు వుపయోగపడతాయని మేము భావించలేదు. **తర్వాత గాంధీజీ నన్నూ పటేల్‌నూ కూర్చుని నిర్మాణ కార్యక్రమాలపైన, కిసాన్ కాంగ్రెస్ పునర్నిర్మాణ విషయంలోనూ మనసు విప్పి మాట్లాడుకోమన్నారు.** ఆయా రంగాలకు చెందిన నాయకులను, కార్యకర్తలను నాతో సంప్రదించమనేవారు. నేను ఆయన మనస్సునెరిగి మసలుకునే వ్యక్తిగా గుర్తింపుపొందాను. ఆ హోదాను నేను ఆయన జీవిత పర్యంతం అనుభవించాను.

కంట్రోల్ రాజ్యం కారణంగా ప్రజల ఇబ్బందుల్ని నేను గాంధీ గారి ముందుంచాను. దాని కారణంగా ప్రబలిన అధికారిక అవినీతి, బ్లాక్ మార్కెట్ విధానం వల్ల బాపూజీపై కమ్యూనిస్టులు బురదజల్లడం ఆయన దృష్టికి తీసుకురాగలిగాను. 1946లో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా నన్ను ఎన్నుకున్న తర్వాత కాంగ్రెస్ వాదుల, పత్రికా రంగంలోని వారి సహకారాన్ని క్రియాశీలంగా వాడుకుంటూ కమ్యూనిస్టుల ప్రచారాన్ని, బెదిరింపుల్ని, హింసను తిప్పికొట్టగలిగాను.

15

వామపక్ష సారస్వత ప్రభావం : 1930-40

యునైటెడ్ ఫ్రంట్ కొనసాగుతున్న కాలంలో మా అందరికీ వామపక్ష సాహిత్యం పట్ల మోజు మెండుగా ఉండేది. లండన్‌కు చెందిన **లెఫ్ట్ బుక్ క్లబ్** వారి ప్రచురణలు, సోవియట్ సాహిత్యం, **జాన్ స్ట్రాచీ**, జవహర్‌లాల్‌జీ, **ఎడ్గర్ స్నో, మాక్సిం గోర్కీ, జి.డి.హెచ్ కోల్** వంటి వారి రచనలకు మంచి ప్రజాదరణ లభించేది. చైనాకు సంబంధించిన సాహిత్యంలో మరీ ముఖ్యంగా **లిన్ యు టాంగ్, పెరల్‌బక్**, ఎడ్గర్ స్నోల (ప్రత్యేకించి **రెడ్‌స్టార్ ఓవర్ చైనా**) స్థానం వాటిదే. **'ప్రపంచాన్ని కుదిపిన ఆ పది రోజులు' (టెన్ డేస్ దట్ షుక్ ది వరల్డ్)**, సోవియట్ యూత్, సోవియట్ ఉమెన్, మరీ ముఖ్యంగా సోవియట్ కమ్యూనిజం ప్రభావం సుదీర్ఘమైంది. **జాన్ గంథర్** గ్రంథాలు కాలక్షేపం కోసం బాగానే ఉన్నాయి. 'ఇన్‌సైడ్ ఏసియా', 'ఇన్‌సైడ్ యూరప్', 'ఇన్‌సైడ్ లాటిన్ అమెరికా' వంటివి సమాచార ప్రధానంగా ఉండి ప్రజాస్వామిక పద్ధతులకు, సామ్రాజ్యవాద వ్యతిరేక రీతులకు అవి

వెన్నుదన్నుగా నిలిచేవి. **అప్టాన్ సిన్‌క్లెయిర్** పుస్తకాలు, ప్రత్యేకించి సహకార రంగానికి చెందినవి మా అందరికీ స్ఫూర్తిదాయకాలు. పాశ్చాత్య పెట్టుబడిదారీ సమాజాన్ని ప్రజాస్వామిక పునర్నిర్మాణం గావించే నిమిత్తం **రూజ్‌వెల్ట్** తరహా ప్రయోగాలు ఏమేమి ఉన్నాయో దాదాపుగా అన్నింటినీ అధ్యయనం చేసే ప్రయత్నం చేశాను. ఆయన పాలనా కాలంలో ఆర్థిక సంక్షోభం సంభవిస్తే ఆయన వ్యవసాయాన్ని, రైతులను రక్షించిన తీరు నన్ను ఆకర్షించింది. ఆయన మారటోరియం ప్రకటించారు. మధ్యేమార్గ పద్ధతిని అవలంబించారు. **'న్యూ డీల్'** పట్ల బ్రిటిష్ సోషలిస్ట్ రచయితల అరకొర అసంపూర్ణ విమర్శలను నేను సమ్మతించను. **'వాట్ మార్క్స్ రియల్లీ మెంట్'** (మార్క్స్ వాస్తవంగా చెప్పిందేమిటి?), **'ట్వెల్వ్ స్టడీస్ ఆఫ్ ది సోవియట్'** అనే గ్రంథాల్లో జి.డి.హెచ్ కోల్ చెప్పిన వాటిలో చాలా భాగంతో నాకు ఏకీభావం కుదిరేది. అలాగే పెంగ్విన్ పుస్తకం–**'ది గాడ్ దట్ ఫెయిల్డ్'**. అసలు మేమెంతగా సోవియట్ వామపక్ష వాదం పట్ల ప్రభావితమైంది, అటు వైపు మొగ్గుచూపింది నేను ప్రచురించిన **'రైతు గీతాలు'**, **'రైతు భజనావళి'** వంటి పుస్తకాల వివిధ ముద్రణలు చూస్తే తెలియవస్తుంది.

ఏది ఏమైనా నేను గాంధీవాదానికి, రైతు జీవన శ్రేయస్సుకే కట్టుబడి ఉన్నా. 1936 డిసెంబర్‌లో ఫయాజ్‌పూర్ కిసాన్ కాంగ్రెస్‌లో నేను చేసిన అధ్యక్షోపన్యాసం సందర్భంగా గాంధీవాదులు, సోషలిస్ట్‌లు ఇరువురూ నన్ను ప్రశంసించడం అప్పటి



'కాన్‌టెంపరరీ ఇండియా'లో చూడొచ్చు. అది నెహ్రూ సిద్ధాంతానికి పరిపూరకంగా నిలిచింది. ఆగ్రా నుంచి ప్రచురించబడి బహు జనాదరణ పొందుతున్న హిందీ దినపత్రిక ప్రత్యేకంగా రైతుల కోసం నా సంపాదకత్వాన ఒక అనుబంధాన్ని ప్రచురించింది. అది భారతదేశంలో వామపక్ష రాజకీయాల్లో రైతుల పాత్రను సూచించింది. అయితే మన రైతుల్ని మేము ఏ మేరకు సోవియట్ వామపక్షం దిశగా నడపగలిగామన్నది చిక్కు ప్రశ్నే. ప్రముఖ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ తమ

మాత్రా విశేషాల ద్వారా, జవహర్‌లాల్ నెహ్రూ తమ గ్రంథం **'సోవియట్ రష్యా'** అన్న దానిలోనూ అది విశేషంగా కొనియాడబడింది. అయితే సోవియట్ యూనియన్‌లో ఏం జరుగుతున్నదో అవగాహన లేకుండా మనకున్న అరకొర జ్ఞానంతో భారతదేశ రైతుల్ని మనం హద్దులు దాటించరాదన్నది నా వాదన. నా అధ్యయనం వల్ల, నా అంతర్బుద్ధి వల్ల, **పాట్, స్లోమన్, కోల్, వెబ్, షాలఖోవ్‌ల** వంటి రచయితల రచనల అంతరార్థాన్ని గ్రహిస్తూ పోవడం వల్ల రష్యాలో రైతులకు అన్యాయం జరుగుతున్నదనిపించింది. కనుకనే నేను రైతులకు మన ప్రణాళికలన్నింటిలో తగిన ప్రాధాన్యతను ఇవ్వాల్సిందేనని ఎల్లప్పుడూ కోరుతూ ఉంటాను. అందుకే నేను ముందుగా **'కిసాన్ మజ్దూర్ రాజ్'** తర్వాత **'కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం'** నినాదాన్ని చేపట్టాను.

అయితే **ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థతో తులతూగే సోవియట్ యూనియన్ ప్రయోగాలు నాకు ఆమోదయోగ్యంగా కనిపించాయి.** అవి నక్రమ మార్గంలో పయనిస్తున్నాయి అనిపించింది. వాళ్ల 'పంచవర్ష ప్రణాళికలు' నన్ను బాగా ఆకర్షించాయి. వి.వి.గిరి, నేనూ కలసి ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థను చేపట్టమని కోరేవాళ్లం. అయితే బ్రిటిష్ ప్రభుత్వం నిధుల కొరతను సాకుగా చూపసాగింది. డాక్టర్ **హెచ్.డాల్టన్** తన పుస్తకం 'డెఫిసిట్ బడ్జెట్స్'లో చూపినట్లుగా కనీసం పాక్షికంగానైనా నిరుద్యోగ సమస్యకు పరిష్కారం కనుగొనాల్సి ఉందని నేను చట్టసభల్లో చెప్పేవాణ్ణి. **సర్ తేజ్ బహదూర్ సప్రూ** కూడా దానినే తన నివేదికలో పొందుపర్చారు. **ఇనుము, ఉక్కు, యంత్ర పరికరాలు, కైండజ్లు, వ్యాగెన్ల తయారీవంటి పరిశ్రమల స్థాపనకు తగు చర్యలు అభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రారంభించాలని, రష్యా మాదిరిగా దాని కోసం జాగ్రత్తగా విదేశీ పెట్టుబడులను ఆహ్వానించాలని మేము కోరాం.** 1937లో ప్రచురించిన **'కిసాన్ స్పీక్స్'** అనే నా పుస్తకాన్ని అంతర్జాతీయ కార్మిక సంస్థ అధికారులు, బ్రిటిష్ లేబర్ పార్టీ వారు భారతదేశం ఎటువంటి సాయంతో ప్రగతిని సాధించగలదో చెప్పే గ్రంథంగా కొనియాడారు. ప్రత్యేకించి 'పంటల ప్రణాళిక', 'కుటీర పరిశ్రమలు', 'లంచగొండితనం నిర్మూలన', 'నీటిపారుదల', 'అభివృద్ధి', 'నిరక్షరాస్యత' వంటి అధ్యాయాలు దేశంలోనూ, విదేశాల్లోనూ మెప్పును పొందాయి.

ఆ కీలక సమయంలో రష్యాలోని రైతుల వాస్తవ స్థితిగతులను గూర్చిన సమాచారం కోసం అర్రులు చాచాం. దానిపై నిష్పక్షపాత సమాచారం కొరకు నేను 1942-44 వరకూ వేచి ఉండాల్సి వచ్చింది. అప్పుడు తెలియవచ్చింది సోవియట్ రష్యాలో రైతులు ఎంత నిరాక్షిణ్యపు అణచివేతకు గురయ్యారో. తర్వాత నేను 1955లో భారత పార్లమెంటరీ

ప్రతినిధుల బృందంతో కలసి రష్యా, యుగోస్లావియాల్లో పర్యటించాను. నేను నా నివేదికలో పొందుపర్చిన పరిశీలనలు, చేసిన విమర్శలు, వ్యక్తపర్చిన భయాలను అప్పటి సోవియట్ కమ్యూనిస్ట్ పార్టీ కార్యదర్శి కృశ్చేవ్ సమర్థించారు. **వాస్తవానికి 1940-55 మధ్యకాలంలో స్టాలిన్ పాలనా కాలంలో అక్కడ నిర్దయగా రైతులను అణచివేయడాన్ని వ్యతిరేకిస్తూ వచ్చాయో దానికి మించి కృశ్చేవ్ 1956 నాటి 20వ సోవియట్ కమ్యూనిస్ట్ కాంగ్రెస్‌లో ఆ దుశ్చర్యలను ఖండిస్తూ మాట్లాడడం జరిగింది.**

జాతీయ ప్రణాళికా సంఘం (నేషనల్ ప్లానింగ్ కమిటీ) ఏర్పాటులో సుభాష్ బాబు చొరవ తీసుకుని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను దానికి చైర్మన్‌గా ఉండమని కోరారు. ప్రఖ్యాత ఆర్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె.టి.షా దానికి కార్యదర్శి అయ్యారు. 'కిసాన్ స్పీక్స్' అనే గ్రంథంలో నేను రూపొందించిన ప్రణాళికలు ఆయనకు నచ్చాయి. అయితే **జవహర్‌లాల్ దృష్టి భారీ పరిశ్రమలు నెలకొల్పడం, శీఘ్ర గతిన పారిశ్రామికీకరణాన్ని చేపట్టడం వంటి విషయాల వైపు మళ్లింది.** ఆయన అప్పటికింకా వ్యవసాయం, మధ్యతరహా కుటీర పరిశ్రమల ప్రాముఖ్యాన్ని గుర్తించలేదు. అందువల్ల ఆయన నా ఆలోచనలను గానీ, మరో గాంధేయవాది కే.శే. **డాక్టర్ జె.సి.కుమారప్ప** ఆలోచనలనుగానీ స్వీకరించే స్థితిలో లేరు.

జాతీయ ప్రణాళికా సంఘం నా సిద్ధాంత వ్యాసాల్లో రెండింటిని మాత్రమే పరిశీలనలోకి తీసుకుంది. **1) భూమి శిస్తు సంస్కరణలు 2) వ్యవసాయ కూలీలు.** అయితే చిత్రమేమిటంటే స్వాతంత్ర్యానంతరం గాంధీజీ సలహా మేరకు జవహర్‌లాల్ ఎకనామిక్ ప్రోగ్రాం కమిటీలోకి మా ఇరువురినీ ఆహ్వానించాల్సి వచ్చింది. జవహర్‌లాల్ నన్ను వ్యవసాయ ఉపసంఘం కన్వీనర్‌గా, డాక్టర్ కుమారప్పను కుటీర పరిశ్రమల ఉప సంఘం కన్వీనర్‌గా నియమించారు. క్రమేపీ ప్రధాని మా నివేదికలను ఆమోదించడం, వాటిని నేషనల్ ప్లానింగ్ కమిషన్ అమలుపర్చిన తీరును మెచ్చుకోవడం జరిగింది.

16

పలాస సదస్సు (మార్చి 1940)

1940 వరకూ ఆంధ్ర రైతు ఉద్యమంలో భాగంగా నిర్వహించిన ప్రజా ప్రదర్శనల్లోకెల్లా పెద్దది అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ పలాసలో నిర్వహించిన సదస్సు. ఆంధ్రా జిల్లాలన్నింటి నుండి మరీ ముఖ్యంగా జమీందారుల ప్రాబల్యంలో ఉన్న విశాఖ, శ్రీకాకుళం జిల్లాల నుండి లక్షకు పైచిలుకు రైతులు చేరుకున్నారు. వేలమంది మహిళా రైతులు భారతీదేవిని సొంత తల్లిగా భావించసాగారు. కీ.శే. **శ్యాంసుందరరావు, గౌతు లచ్చన్న, డి.ఎస్.రెడ్డి, హరికృష్ణ చౌదరి** వంటివారు తమ నిర్వహణా సామర్థ్యాలు

సర్దార్ గౌతు లచ్చన్న

చాటుకోగలిగారు. కమ్యూనిస్ట్‌లకు, మాతో సహకరించని స్థానిక కాంగ్రెస్ నాయకులకు ఆ కోలాహలం బేజారును కలిగించడం సహజమే. కాంగ్రెస్ సోషలిస్ట్‌లకు, ఫార్వర్డ్ బ్లాక్‌వారికి, మాకూ అటువంటి ప్రజా మద్దతు ఉండడం ముచ్చట కలిగించింది.

ఇదే అదనుగా తీసుకుని ఆంధ్రా కమ్యూనిస్ట్‌లు కిసాన్ కాంగ్రెస్‌లో మమ్మల్ని ఓడించాలని చూశారుకానీ వారి ప్రయత్నం ఫలించలేదు. అయినా కిసాన్ కాంగ్రెస్‌లో వాళ్లదే పైచెయ్యిగా ప్రవర్తించసాగారు. అటువంటి హేయమైన ప్రవర్తన కిసాన్ కాంగ్రెస్‌లో మా కార్యకర్తల్ని వారి నుండి దూరం చేసింది. అప్పటి నుండి కిసాన్ కాంగ్రెస్ వారికి యునైటెడ్ ఫ్రంట్ అంటే చిర్రెత్తుకొచ్చేది.

విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతపు జమీందారులు తమ ప్రాంత రైతులు పలాస సదస్సుకు హాజరుకాకుండా చూసేందుకు చేయాల్సిందంతా చేశారు. ఎందుకంటే అక్కడి అఖిలభారత స్థాయి సదస్సులో ఒకసారి కనుక రైతులు స్ఫూర్తిపొంది చైతన్యవంతులైతే వాళ్లకు పట్టపగ్గాలుండవని, అణచివేతకు ప్రతిగా వాళ్లు సత్యాగ్రహానికి దిగుతారని జమీందార్ల భయం. దాన్ని మేము ఒక సవాలుగా స్వీకరించి సదస్సుకు రైతుల్ని సమీకరించేందుకు రైతు యాత్రలు గొలుసుకట్టుగా నిర్వహించాం. ఆ విధంగా అది ఒక బ్రహ్మాండమైన రైతుల సమాహారంగా వెలుగొందింది.

స్థానిక పోలీసులు జమీందారులతో చేతులు కలిపి సదస్సు నిర్వాహకులతో పోట్లాటకు దిగారు. అది చిలికి చిలికి గాలివానైతే సభను నిషేధించాలని చూశారు. అయితే మావాళ్లు అటువంటి పరిస్థితిని తలెత్తనివ్వలేదు. రైతులు ఊరేగింపుగా జమీందారీ విధానపు దిష్టిబొమ్మతో వెళ్లి దాన్ని దహనం చేసే కార్యక్రమాన్ని తలపెట్టారు. పోలీసులు దాన్ని నిషేధించామన్నారు. రైతులు రెచ్చిపోయారు. నిషేధాన్ని వ్యతిరేకించి ఊరేగింపు జరిపి దిష్టిబొమ్మను తగలబెట్టారు. ఉవ్వెత్తున లేచిన ప్రజాగ్రహాన్ని చూసి పోలీసులు సహనం పాటించారు.

భారతీదేవి, నేనూ సదస్సు ముగియగానే పలాస వదలివెళ్లాం. తర్వాత రెండు రోజులకు మందస జమీందారీకి చెందిన రైతులు వాళ్ల ఊర్లకు చేరుకున్న తర్వాత పోలీసులు వాళ్లతో గొడవకు దిగారు. అనుమతి లేకుండా అడవి నుండి కలప తరలించారనే అభియోగం మోపి కొందరు స్థానిక రైతు నాయకుల్ని నిర్బంధింపజూశారు. అయితే వాళ్ల నాయకుల్ని నిర్బంధించేందుకు వీల్లేదని రైతులు ఎదురు తిరిగారు. ఆ గందరగోళంలో **గున్నమ్మ** అనే రైతు మహిళా నాయకురాలు సబ్‌కలెక్టర్‌ను నమ్మక

ద్రోహి అని శాపనార్థాలు పెట్టింది. దాంతో పోలీసులు ఆమెపై తుపాకి ఎక్కుపెట్టి మూడు తూటాలు కాల్చారు. అయినా శివంగిలా ఆమె పోలీసు అధికారి పైకి దూకి తుది శ్వాసవరకూ పోరాడుతూనే ఉంది. అనేకమంది రైతులను ఆ విధంగానే మట్టుపెట్టారు. కొందరికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఆ పాశవిక చర్యతో సంతృప్తి చెందక ప్రభుత్వం నా మీద, మరో నాలుగొందలమంది రైతుల మీద తప్పుడు కేసులు బనాయించింది. మేము రైతుల్ని తిరగబడాల్సిందిగా ప్రోత్సహించామని మా మీద అభియోగం మోపారు.

అదృష్టవశాత్తూ ప్రభుత్వం మాపై పెట్టిన కేసు న్యాయస్థానంలో ఘోరంగా వీగిపోయింది. అయినా అనేకమంది రైతులు రెండు, మూడేళ్ల పాటు నిర్బంధాలను అనుభవిస్తూ ఉండాల్సి వచ్చింది. అమాయకులైన రైతులపై అలా జమీందారులు పిచ్చుకలపై బ్రహ్మాస్త్రాల మాదిరివి సంధిస్తూనే ఉన్నారు. అయినా వాళ్ల అణచివేత చర్యలు రైతుల్లోని ప్రతిఘటనను అడ్డుకోలేకపోయాయి. **వీర గున్నమ్మ బలిదానపు వార్షికోత్సవం సందర్భంగా ఆమెకు నివాళులర్పించేందుకు భారతీదేవి అక్కడకు వెళ్లగా లక్షమందికి పైగా రైతులు చేరుకున్నారు.** నేను ఎప్పుడు అక్కడకు వెళ్లినా వేలమంది రైతులు గున్నమ్మకు నివాళులర్పించేందుకు అక్కడకు చేరుకునేవారు. గున్నమ్మ బలిదానపు చర్య జమీందారీ విధానపు రద్దుకు ప్రబల నిదర్శనం.

అప్పటి నుండి అక్కడ ఏ సార్వత్రిక ఎన్నికలు జరిగినా సర్దార్ లచ్చన్నతోసహా ఏ రైతును పోటీకి దింపినా అది కృషికార్ లోక్‌పార్టీ తరపున కానివ్వండి, యునైటెడ్ కాంగ్రెస్ తరపున కానివ్వండి లేదా స్వతంత్ర పార్టీ తరపున కానివ్వండి మందస ప్రాంత రైతులు నిండు మనస్సుతో **నారాయణ** నాయకత్వం కింద తమ మద్దతును అందిస్తూనే వస్తున్నారు.

17

మా దాంపత్య జీవితం



భారతీదేవి రంగ

1930లో మద్రాస్‌లోని కళాశాలలో వేతనంపై పనిచేస్తున్న నేను ఆ ఉద్యోగాన్ని వదలివేయడం వల్ల నా జీవితం ఓ ముఖ్యమైన మలుపు తిరిగింది. అలాగే జాతి మనుగడకు సంబంధించిన విధి విలాసం మనల్ని మనం పాలించుకునే అవకాశాన్ని కల్పించిన 1946-47 వ సంవత్సరంలో కూడా నా జీవితంలో అంతే ముఖ్యమైన మలుపు తిరిగింది. ఆ రెండు మలుపుల మధ్య 16 సంవత్సరాల కాలం మా దాంపత్య జీవితంలో దేవీజీ నిర్వహించిన పాత్ర ప్రాముఖ్యం ప్రత్యేకమైనది.

మేము మా వ్యక్తిగత జీవితాన్ని, ప్రజా జీవితాన్ని కూడా ఆదర్శమయం చేసుకోవాలనుకున్నాం. చాలావరకూ మేము కృతకృత్యులమయ్యాం. అయినా ఆ క్రమంలో మేము చాలా ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది.

1930లో పూర్తికాలం ప్రజా సేవకులుగా జాతీయ ఉద్యమంలోకి దుమికే సందర్భంలో మద్రాస్ కళాశాలలో ఉద్యోగానికి రాజీనామా సమర్పించేందుకు నేనూ, దేవీజీ కలసి ఎటువంటి నిర్ణయం తీసుకున్నామో ఇంతకుముందే చెప్పాను. మాకు తెలుసు భారతదేశంలో ప్రజా సేవకులకు సాదాసీదా జీవనానికి సరిపడినంతగా కూడా ఏ సంస్థా సామాజిక ఆనవాయితీననుసరించిగానీ, వ్యవస్థాగతమైన వెసులుబాటు ద్వారాకానీ చెల్లింపులు చేయరని. అలా చెల్లించింది నాకు తెలిసి రెండే రెండు సంస్థలు ఒకటి -**సర్వెంట్స్ ఆఫ్ ఇండియా** (గోఖలే గారు స్థాపించింది), రెండోది -**సర్వెంట్స్ ఆఫ్ పీపుల్స్ సొసైటీ** (లజపతిరాయ్ గారు స్థాపించింది). కనుక నాకు వారసత్వంగా వచ్చిన మూడు తాలూకూ ఆదాయానికి అనుగుణంగా నా జీవన ప్రమాణాన్ని సాదాసీదాగా మార్చుకోవాల్సి వచ్చింది. 1930-34 నాటి ఆర్థిక సంక్షోభం మా జీవన ప్రమాణాన్ని నెలకు 250 రూపాయల ఖర్చు నుండి 125 రూపాయల ఖర్చుకు దిగజార్చింది. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిందేమంటే మేము మద్రాస్‌లో ఉండగా నెలకు 1500 రూపాయలు ఖర్చు చేస్తూ ఉండేవాళ్లం. **అనతికాలంలోనే 1500 రూపాయల ఖర్చు నుండి నెలకు 125 రూపాయల ఖర్చుకు జీవన ప్రమాణాన్ని కుదించడం ఎంత కష్టమో, దేవీజీ ఎంతగా ఇబ్బందిపడి ఉంటుందో ఎవరైనా ఇట్టే గ్రహించగలరు.**

మేము ఊరి మధ్యలో ఉంటున్న ఇంటిని వదిలేసి ఊరికి బయట రెండు ఫర్లాంగుల దూరంలో తోటలో ఉన్న చావిడికి మారదలిచాం. అది సాహసోపేత నిర్ణయమే. తోటలోని చావిడికి మారేందుకు ఇంట్లో పెద్దవాళ్లెవరూ అంగీకరించలేదు. గ్రామీణ రాజకీయాల ప్రభావం నుండి ఈ మాత్రమైనా దూరంగా ఉండడం మంచిదనుకున్నాను. ఆ

నిర్మానుష్య ప్రదేశంలో ఉండేందుకు దేవీజీ అంగీకరించింది.

మా చావిడి తోటలో ఉంది. తోటకు రెండు వైపులా వరి పాలాలు. పాములు, తేళ్ళు దోమలు లెక్కలేనన్ని. పురుగులు, కప్పలు, పక్షుల సంగతి ఇక వేరే చెప్పక్కర్లేదు. అటువంటి ప్రదేశంలో నివసించడం ఎంత ఆనందదాయకమో అంత దు:ఖదాయకం కూడా. అది దేవీజీ విషయంలో మరీను. నేనంటే పర్యటనలతో కాలం గడుపుతూంటా. కనుక దేవీజీ ఒక్కతే అక్కడ ఉండాల్సి వచ్చేది. **1945 వరకూ ఊళ్లో నుండి మేము నివసించే తావుకు కంకరరోడ్డయినా లేదు.** వర్షాకాలం బురదలో పడుతూ లేస్తూ పోవాల్సిందే. రాత్రిపూట అనేక పర్యాయాలు ఆ బురదలో జారిపడేవాణ్ణి. వర్షాకాలంలో ఒకరోజు జయప్రకాశ్ నారాయణ్ అక్కడకు రావడం జరిగింది. జీవితంలో ఆ ప్రయాణాన్ని ఎన్నటికీ మరచి ఉండరు! మేముండే తావును **'గోభూమి'** అని పిలుచుకోసాగాం.

పడమర వైపు వరండాలో ఒక చిన్న గది ఉండేది. అదే దేవీజీ సొంత గది అనుకోవాలి. ఎండాకాలం చూడాలి ఆ పడమటి గదిలో వేడి. హాలు విశాలంగానూ, శుభ్రంగానూ ఉండేది. అదే కార్యకర్తలకు, అతిథులకు, మాకూ విశ్రాంతికి నిర్దేశించిన స్థలం. వంటగది అనబడేది పూరిపాకలో ఉండేది. తడికలే దానికి గోడలు. మద్రాస్‌లో మేడలు వదలి, ఊర్లో ఉన్న పూర్వీకుల పెద్ద ఇల్లు వదలి ఇలా కనీస సౌకర్యాలులేని ఈ చావిట్లో తలదాచుకోవడం దేవీజీకి వీరోచిత కార్యమే. ఆ వీరోచిత కార్యాన్ని ఆమె 1930 నుండి 1945 వరకూ కొనసాగించింది. **అది నిరాడంబరంలో గాంధీ తరహా తపస్సు తప్ప వేరొకటి కాదు.**

అదృష్టవశాత్తూ మాకు దొంగల భయంలేదు. ఆమెను చూస్తే కన్నాలేసేవాళ్లకు సైతం జాలి, సానుభూతి కలిగేవి కాబోలు. దేవీజీకి పాములంటే భయంలేదు. ఆ నిర్భీతి ఆమెకు వంశానుగతంగా సంక్రమించింది. ఆమె తండ్రి కీ.శే.సుబ్బయ్య గారు ఆగు అని కేకవేస్తే ఎంత పెద్ద పాము అయినా ఆగిపోయేదట. అప్పుడు దాన్ని ఆయన చంపేసేవాడట. దేవీజీ కూడా పాముల్ని వెతికి వెతికి వేటాడేది. అయితే అది 1948 వరకే సాగింది. 1948లో ఒక ప్రాత:కాలాన ఆమె ఒక విషపు పాము కాటుకు గురైంది. దాని దుష్ఫలితాలను అప్పటి నుండి అనుభవిస్తూనే ఉంది. అప్పటి నుండి పాములంటే హడల్. మా వంట గది తాటాకుల పైకప్పులో గూళ్లు కట్టేవి కందిరీగలు . అవి కూడా ఆమెను కుట్టేవి. ఆమె అనారోగ్యానికి అవి కుట్టడం కూడా కారణమేనంటారు పలువురు డాక్టర్లు.

దేశభక్త కొండా వెంకటప్పయ్య, దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు గారు, ప్రకాశం పంతులు గారు, జయప్రకాశ్ నారాయణ్, ఇందూలాల్ యాగ్నిక్, భరతన్ కుమరప్ప, వి.వి.గిరి వంటి జాతీయ స్థాయి నాయకులు గోభూమికి వచ్చి చూసి దేవీజీ ఐరోపాలోనూ, ఢిల్లీలోనూ గడిపిన విలాసవంత జీవితం ఎక్కడ, ఈ సాదాసీదా జీవితం ఎక్కడ అని విస్తుబోయేవాళ్లు. ఆమె త్యాగాన్ని, పొదుపరితనాన్ని కొనియాడేవారు. వేలమంది రైతు విద్యాలయం గ్రాడ్యుయేట్లు, సంఘ సేవకులు, నాతో కలసి వివిధ రంగాల్లో పనిచేసే నాయకులు అక్కడికి వచ్చి వెళుతూ ఉండేవారు. దేవీజీ ఆ ఇరుకు ఇంట్లోకి వాళ్లందరినీ ఆహ్వానించి ఆదరించి అన్నంపెట్టి పంపేది. అంతేకాదు మాతోపాటు చర్చల్లో కూడా పాల్గొనేది. ఒక్కోసారి వాటికి అంతూ దరీ ఉండేదికాదు. అవి కొన్నిసార్లు రెచ్చగొట్టేవిగానూ, విసిగించేవిగానూ ఉండేవి.

మా మామగారు 1941లో మరణించారు. అంతకుముందు కొన్ని సంవత్సరాలపాటు నా బలవంతం మీద ఆయన మాతో ఉండేందుకు అంగీకరించారు. గోభూమి నిర్వహణకు నిధులుండేవికావు. భార్యను అడవిలా ఉన్న తావున అలా ఒంటరిగా వదలి వారాలేమిటి నెలల పర్యంతం నేను పర్యటనలంటూ దేశమంతా తిరుగుతూ ఉండడం చూసి ఆయనకు ఆశ్చర్యమేసేది. అంత నిర్దయగా ఎలా వుండగలుగుతున్నాడా అని అనుకునేవారు. అయితే మేము గాంధీ మార్గంలో నిరాడంబరంగా జీవించడం, మాకు ఉన్నదాంట్లోనే సరిపుచ్చుకుని బతకడం పట్ల ఆయనకు సానుభూతి ఉండేది. సేవ చేయాలనే నా తపనను ఆయన మెచ్చుకునేవారు. కుమార్తెలో ఆత్మత్యాగం, స్వయం సమృద్ధి, ఉదాత్తత వంటి గుణాల సామర్థ్యం ఆచరణయోగ్యంగా కనిపించింది. కనుక ఆయన జీవితపు చరమాంకంలో మా బాధల్ని, ఆందోళనలను పంచుకుంటూ మాతోనే ఉండిపోయారు.

మేము మాంసాహారం భుజించడం మానేశాం. కేవలం శాకాహారులుగా మారిపోయాం. శాకాహారం చౌకమాత్రమే కాక అందులో ఒక సౌలభ్యం కూడా వుంది. మనింటికి నిరభ్యంతరంగా బ్రాహ్మణ అతిథుల్ని ఆహ్వానించవచ్చు. అలాగే మాకు అతిథ్యమిచ్చేవారికి కూడా మేము శాకాహారులమైతే వారిపై ఆర్థికభారం తగ్గుతుంది. గజం ఖాదీగుడ్డ ఎక్కువ ఖరీదైనా మొత్తంమీద అది పొదుపుకే దారి తీస్తుంది. మిల్లుగుడ్డల విషయంలో చేయాల్సిన్నన్ని మార్పులు చేర్పులూ ఉండవు. పైగా ఆడంబరం అన్నది ఖాదీ సంస్కృతికి బయట మాట. ఖాదీ ధరించే విషయంలో నేనెటువంటి ఇబ్బందికీ గురికాలేదు. అది

ఏ రకంగా చూసినా నాకు సంతృప్తినే మిగిల్చింది. చీరల ఎంపిక చేసే విషయంలో దేవీజీది అందె వేసిన చెయ్యి. అందువల్లనే ఆమె ఖాదీ చీరలకు కూడా డిజైన్లు కొత్త కొత్తవి సూచించేవారు. కొన్ని చీరల డిజైన్లు ఆమె పేరిటే చెలామణి అయ్యాయి. వాటికి మంచి గిరాకీ ఉండేది. ఆమె ఖాదీ చీరల్లో అందంగానూ, ఎక్కువ హుందాగానూ కనిపించేవారు. అయితే వేసవిలో ఆ ముదురు చీరల్లో ఆమెకు ఎంత అసౌకర్యంగా ఉండి ఉండేదో నాకెలా తెలుస్తుంది.

రైళ్లల్లో మేము మూడో తరగతిలోనే ప్రయాణించేవాళ్లం. అవసరమైతే బస్సుల్లో కూడా ప్రయాణించేవాళ్లం. ఆ విధంగా జాగ్రత్తగా పొదుపును పాటించేవాళ్లం. ఈ విధమైన ప్రయాణాల వల్ల జనంతో సంప్రదించే అవకాశం పెరిగేది. అయితే ఆమెవరకూ ఎందుకు నా వరకు నాకే కిక్కిరిసి ఉండే మూడో తరగతి పెట్టెల్లో ప్రయాణం అసౌకర్యంగానే ఉండేది. ఇక యుద్ధ సమయంలోనూ తర్వాత అటువంటి ప్రయాణాల్లోని ఇబ్బంది అంతా ఇంతా కాదు. మరీ ముఖ్యంగా దేవీజీకి. దీన్నంతటినీ దృష్టిలో ఉంచుకుని మూడో తరగతి ప్రయాణాలకు సౌకర్యాలు పెంచాలని చట్టసభలోనూ, వెలుపల ఆందోళన చేపట్టాను. **సంజీవరాయణం** వంటి స్నేహితులతో సహకరించి దేశంలో రైలు ప్రయాణీకుల సంఘాలను నెలకొల్పాం. వాళ్లకు రైల్వే సలహా సంఘాల్లో సభ్యత్వం లభించేది. ఇప్పుడు వాటిని రైల్వే యూజర్స్ కౌన్సిల్స్ అంటున్నారు.

1935 నాటికి దేవీజీ వ్యవసాయ పనుల్ని సంబాళించడంలో కూడా తగినంత ధైర్యాన్ని కూడగట్టుకుంది. **అది మగవాళ్ల పని అని భావించకుండా మాకున్న పొలంపై అజమాయిషీ చేపట్టింది.** మా కుటుంబ బడ్జెట్ ఎప్పుడుచూసినా లోటు బడ్జెట్టే. పొలంలో వచ్చే ఫల సాయంతో పాత బాకీలు తీర్చసాగింది. ఆమె కొంత పొలం అమ్మి బాకీ తీర్చకపోతే 12 శాతం లేదా 18 శాతం వడ్డీ కారణంగా మేము దివాళా తీయాల్సి వచ్చేది. అయితే పొలం విలువ పడిపోసాగింది. ఎకరం మూడు వేలు చేసేది కాస్తా 750 రూపాయలకు పడిపోయింది. అలా మా పొలం అంతా అమ్మినా చాలాని దశ వచ్చేసింది. అప్పుడు ఆమె అప్పు ఇచ్చినవాళ్లను పిలిచి మా స్థితిని వివరించి వడ్డీ రేటు ఆరు శాతానికి తగ్గించమని కోరింది. ఆ విధంగా మా వార్షిక ఖర్చులు తగ్గాయి. ఆమె నగలు చాలావరకూ అమ్మేసి పీడించేవాళ్ల బాకీ కొంతవరకూ తీర్చింది.

అదిగో **అటువంటి కీలక సమయంలో 1934 సాధారణ ఎన్నికలు వచ్చాయి.** ఎన్నికల

కోసం నిధులు వెతుక్కోవలసి వచ్చింది. అప్పులిచ్చేవారు కనిపించలేదు. నా ప్రత్యర్థులు నేను పోటీ చేసేందుకు నా వద్ద డబ్బులు లేవని ప్రచారం మొదలుపెట్టేవారు. ఆ విధంగా నన్ను కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపిక కాకుండా చూడాలనుకునేవారు. **అదృష్టవశాత్తూ సోదరి లక్ష్మీదేవి నన్ను ఆదుకున్నది.** ఆమె సొంత పూచీకత్తు మీద అప్పుచేసి ఆ డబ్బు నాకు ఇచ్చింది. అందువల్లనే దేవీజీ లక్ష్మీదేవి పట్ల కడవరకూ ఎంతో ఆదరణ చూపేది. **ఆమె అప్పగా తీసుకుని నాకు ఇచ్చిన ఈ కొత్త అప్ప తీర్చేందుకు ఆరేళ్లు పట్టింది.** నేను సెంట్రల్ అసెంబ్లీకి ఎన్నికైనందున నా పర్యటనలకు డబ్బు సమకూర్చాల్సిన అవసరం దేవీజీకి లేకుండా పోయింది. నాకొచ్చే ఆదాయంలో ఢిల్లీలో ఖర్చులు పోగా కొంత భాగం ఎన్నికల కోసం అప్పు తీర్చేందుకు, ఇంకా మిగిలినదాన్ని ప్రజా సేవకు వినియోగించాలనుకున్నాం. పొలంలో వచ్చే ఆదాయంలో మిగిలినదాన్ని కుటుంబ అప్పులు తీర్చడానికి, గోభూమి నిర్వహణ, అభివృద్ధి పనులకు, పొలంలో ఎరువుల ఖర్చుకు వాడదల్చుకున్నాం. ఆమె తన సదుపాయాల కోసంగానీ, సుఖాల కోసం గానీ ఏనాడూ చూడలేదు.

భారతీదేవి అంతూ దరీలేని బాధలతో విసిగిపోతున్నది. పోలీసుల సోదాలు, అజ్ఞాతంలో ఉండే కార్యకర్తలు, కమ్యూనిస్ట్‌ల కుతంత్రాలు, ఇక నా నిరంతర నిర్బంధ జీవితం సరేసరి. 'గోభూమి' విస్తరణ కార్యక్రమం కోసం, వేసవి వేడిని తట్టుకునేందుకు, తనకు కొంత ఏకాంతం కోసం భవన నిర్మాణ కార్యక్రమం చేపడితే బాగుంటుందా అని నాకు లేఖ రాసింది. మధ్యప్రదేశ్ జైల్లో ఉన్న నాకు జవాబు పంపాలంటే కొంత సమయం తీసుకుంటుంది. ఇంతలో దేవీజీకి జబ్బు చేసింది. ఏదిఏమైనా గోభూమి పునర్నిర్మాణం 1951 నాటికి గానీ పూర్తికాలేదు. **ఆమె గృహప్రవేశ కార్యక్రమాన్ని చేపట్టలేదు. వైతుల్ని రుణగ్రస్తుల్ని చేసే ఇటువంటి సాంఘిక ఆచారాలకు ఎదురునిలిచి తన ఆదర్శాన్ని ఆమె చాటుకుంది.**

ఈ బాధ్యతలు చాలవన్నట్లు సోదరులు జి.ఎల్.నారాయణ, దేవీజీ పొలాలపై వచ్చే నికర ఆదాయాల్లో నాల్గో వంతు విరాళంగా ప్రకటించారు. మిగతావాళ్లు మాట తప్పారుకానీ వాళ్లిద్దరూ వాగ్దానానికి కట్టుబడి ఉన్నారు. ఇదంతా నేను నిర్బంధంలో ఉన్నకాలంలోనే జరిగింది. **మద్రాస్ నుండి వెలువడే 'వాహిని' వారపత్రిక అప్పుల్లో కూరుకుపోయింది. ఆ అప్పులు తీర్చేందుకూ వాళ్లు అంగీకరించారు.**

అసెంబ్లీ సమావేశాల కాలంలో మేము ఢిల్లీలోనూ, సిమ్లాలోనూ పొదుపు

పాటించేవాళ్లం. చాలా సమావేశాలప్పుడు నేను ఒంటరిగా కారోనేషన్ హోటల్‌లోనే ఉండిపోయేవాణ్ణి. అదంతా పొదుపు కోసమే. నిరాడంబర జీవితం నాకు నచ్చేది. కిసాన్, ఇంకా ఇతర జాతీయ స్థాయి ఉద్యమాల్లో కృషి చేసేవారు నాకు అతిథులుగా వచ్చినప్పుడు అటువంటి నిరాడంబరత్వం ఇతరులకు దుస్సాధ్యం అనేవారు. అసెంబ్లీలోని కొందరు ఐసిఎస్ చేసినవారు, ఆంగ్ల మంత్రులు, ఆక్స్‌ఫర్డ్‌లో చదివిన నేను స్వచ్ఛందంగా అంతటి పేదరికాన్ని ఎలా భరించగలుగుతున్నానా అని విస్తుపోయేవారు. ఎవరో బాపూకు నా ఈ జీవన విధానం సంగతి చెప్పారు. ఆయన పలుమార్లు ఆర్థిక సాయం కావాలా అని అడిగేవారు. గాంధీ జీవన విధానం, భారతీదేవి పొదుపు పద్ధతి వల్ల నాకు కావాల్సిన దానికంటే ఎక్కువ ఉన్నదనే అభిప్రాయం కలుగుతున్నదని చెప్పేవాణ్ణి. ఆయన ఆనందం మా బాధల్ని మరిపించేవి.

ఘంటశాల, గోవాడ, బుర్రిపాలెంకు చెందిన కొన్ని రైతు కుటుంబాలు మా ఇద్దరికీ ఖాదీ వస్త్రాలు బహుకరించేవారు. అవి దాదాపుగా ప్రతి సంవత్సరం అందుకుంటూండేవాళ్లం. మా పర్యటనల్లో అనేక రైతు కుటుంబాలు అటువంటి వ్యక్తిగత బహుమతులు ఖాదీవి ఇవ్వసాగారు. ప్రజల నుండి అటువంటి అనురాగాన్ని పొందగలుగుతున్నందుకు మేము ఆనందపడేవాళ్లం.

ప్రజల ఉమ్మడి అవసరాలకు రైతులు కొంత డబ్బును విరాళంగా ఇవ్వడం ఎంత కష్టమో నాకు తెలుసు. కుటుంబాల్లోని తీరని కోరికలు, వారి మీద ఆధారపడేవారి వల్ల దారిద్ర్యపు పెరుగుదల అందుకు కారణంగా చెప్పొచ్చు. అందువల్ల వారి నుండి విరాళాలు సేకరించేందుకు నేను అంగీకరించేవాణ్ణికాదు. అయితే కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అనుమతించేవాణ్ణి – సదస్సులు నిర్వహించే సమయంలో, రైతు విద్యాలయంలో తరగతుల నిర్వహణ సందర్భంగా, 'జమీన్ రైతు, 'వాహిని' పత్రికల చందాల విషయంలో. **ఉద్యమం బాగా ఊపందుకున్న సమయంలో, సదస్సుల సందర్భంగా రైతులు, విద్యార్థులు, యువకులు, చేనేతపనివారు నాకు పర్సు బహుకరించేవారు.** అయితే ఆ డబ్బును తిరిగి ఆ ప్రాంత అభివృద్ధికే వెచ్చిస్తూ వుండడంతో 'పర్సుల' బహూకరణ పెరగసాగింది. దీనివల్ల దుబారా తగ్గింది. నిధులు దుర్వినియోగమవుతాయనే బెంగ లేకుండాపోయింది. వాళ్ల ప్రాంతం డబ్బు వాళ్ల ప్రాంతానికే తిరిగి ఇచ్చివేయడంతో ప్రత్యేకించి లెక్కలు రాయాల్సిన శ్రమ తప్పింది. ఆ విధంగా నాకు నెల్లూరు, చిత్తూరు, జమీందారులున్న ప్రాంతాల రైతులు అందించిన పర్సులు అధికంగా 'జమీన్ రైతు.

'వాహిని' పత్రికలను ఆదుకునేవి. అలాగే నాకు లభించిన ధనం నుండి పలు చేనేత గ్రామ స్థాయి యూనిట్లకు, స్టూడెంట్ కాంగ్రెస్ యూనిట్లకు అందించేవాడిని. నిడుబ్రోలులోని బియ్యపు మిల్లుల యజమానులు మేము సదస్సులు నిర్వహించే సందర్భంలో బియ్యం ఉచితంగా ఇచ్చేవారు. పాలు, పెరుగు, కూరగాయల రూపంలో గ్రామస్థుల సహకారం ఉండేది. అలా వాళ్లు మా భారాన్ని కొంత తగ్గించేవారు.

మేమిద్దరం అలా మా డబ్బుతో మాత్రమే మేము జీవించడం, ప్రజల నుండి చమకూరే డబ్బును ఆశించకపోవడం, కనీసం అటువంటి డబ్బును మేము మా వ్యక్తిగత అవసరాలకు కూడా వాడకపోవడం, పైగా మేము కూడబెట్టింది కూడా ప్రజా ప్రయోజనాల కోసమే వెచ్చించడం వల్ల ప్రజలకు మాపై విశ్వాసం పెరిగింది. మా నిజాయితీపై నమ్మకం ఏర్పడింది. మాలోని నిజాయితీ వాళ్లు అందించే పర్సుల సంఖ్యను పెంచింది. మాపై ఉంచిన అటువంటి విశ్వాసానికి వాళ్లకు సదా మేము కృతజ్ఞులం.

అయితే దురదృష్టకరమైన విషయం ఏమిటంటే మాలాగా మా శిష్యుల్ని అనుచరుల్ని ప్రజా సేవల్ని గౌరవించే విధంగా తీర్చిదిద్దలేక పోయాం.

18

సౌందర్య పిపాస - ఆనందోపాసన - సత్యాన్వేషణ

నేను చేసే పర్యటనలన్నీ శక్తినంతా లాగేసుకునేవిగానో లేదా సాంస్కృతిక విద్యారహితమైనవిగానో, సంతృప్తిని ఇవ్వనివిగానో ఉండేవికావు. నేను ఐరోపాలో పర్యటించే సందర్భాల్లో ఎలా అయితే ఆయా ప్రాంతాల్లో ఖ్యాతిగాంచిన చర్చి, అసెంబ్లీ లేదా పార్లమెంట్ భవనాలు, కళా కేంద్రాలు, చిత్రశాలలు, అందమైన దృశ్యాలుండే తావులను సందర్శించేవాణ్ణో అదే విధంగా అటువంటి సుందర ప్రదేశాలను భారతదేశంలో పర్యటించేటప్పుడు కూడా సందర్శించేవాణ్ణి. జవహర్‌లాల్‌జీ తమ **'డిస్కవరీ ఆఫ్ ఇండియా'** గ్రంథంలో సూచించినట్లు భారతదేశంలో 1947 వరకూ ఆంగ్లం అధ్యయనం చేసే యువకులు భారతదేశ చరిత్రకు సంబంధించికానీ, దాని సాంస్కృతిక వైభవాన్ని గురించి కానీ, రాజ్యపాలనా తీరుతెన్నుల గురించికానీ, ఆలోచనా రీతుల్ని గురించికానీ ఐరోపా నాగరికత గురించి చదివినదాంట్లో సగం కూడా చదవరు. అయితే **నేను చిన్న వయస్సులోనే జాతీయోద్యమ ప్రభావానికి గురికావడం, రామకృష్ణ**

ఎల్లోరా గుహల్లో బుద్ధ విగ్రహం

పరమహంస, వివేకానంద, రామతీర్థ, తిలక్, గాంధీజీల ఆలోచనలను అధ్యయనం చేసే అవకాశానికి నోచుకున్నాను. అయినా నేను ఇంగ్లండ్‌కు వెళ్లే ముందు నాకు భారతదేశపు కట్టడాల నిర్మాణ శైలిని గురించికానీ, కళాపరమైన సంస్కృతీ వైభవాల గురించికానీ తెలిసింది బహు స్వల్పం. అందుకు కారణం వాటికి సంబంధించిన పుస్తకాలు చాలా తక్కువగా లభించడమే. భారతీయ కళలపై హావెల్ గ్రంథాలు చదివిన తర్వాతే ప్రపంచ సంస్కృతిలోని ప్రాచ్య విధానాలు నాకు తెలిశాయి. నేను 1931లో లేపాక్షిలోని దేవళపు పైకప్పుపై గల భిత్తి చిత్రాలను చూసే వరకూ లండన్‌లోని ఆల్బర్ట్ మ్యూజియంలో తిలకించిన మొగల్ చిత్రకళకు మించిన చిత్రకళ లేదనుకునేవాణ్ణి. ఎందువల్లనో రవివర్మ చిత్రాలపై నాకు అంతగా మనసుపోలేదు.

1937లో నేను అజంతా గుహలను దర్శించాను. అప్పుడు అనిపించింది మైఖేలాంజిలో చిత్రాలపై, రోమన్ చర్చి అద్భుత కట్టడాలపై అంతగా మనసు పారేసుకోవాల్సిన అవసరం ఏమీలేదని. అజంతా చిత్రాల్లోని సోగ కనులు, ధనువుల్లా వంగిన కనుబొమలు, గుసగుసలుపోయే కనురెప్పల నిర్మాణం చూసి **తమ పేరులైనా చెక్కుకోని ఆ శిల్పుల పనితనానికి భారతీదేవి గారు ముగ్ధురాలయ్యేవి.** అవి చూసి ముప్పయ్ సంవత్సరాలు దాటినా ఆ చిత్రాలు నా కనుల ముందు అప్సరసల్లా, దేవతా కన్యల్లా కదలాడుతూనే ఉన్నాయి.

అజంతా చిత్రాల్లోని సాంస్కృతిక మూలాలు, వర్ణ వైభవం, ఒంపు సొంపులు, రూపురేఖా రాసిక్యం అంతా విశ్వ జనీనమే. అటువంటి చిత్రాలనే నేను సింహళంలోని సిగిరియాలో చూశాను. **ఐరోపా చిత్రకళకు విశ్వజనీనత కలదనుకుంటే భారతీయ చిత్రకళ అంతకు తీసికట్టేమీకాదు.** ఆసియా దేశాల్లోని బౌద్ధ కళాకారులందరూ తమ కుంచెలకు పని కల్పించినవారే. అటువంటివారి కళా రమణీయతకు నిలువెత్తు నిదర్శనం అజంతా చిత్రకళ.

మొగలులు ఈ రంగంలో సాధించింది కూడా కడు ప్రశంసనీయమే. వాళ్లు మసీదులు, సమాధులు, కోటలు, నీటి ఊటలు, ఉద్యానవనాలు తదితర రమణీయ దృశ్యాలను మనకు వదలివెళ్లారు. రాజపుత్ర స్థానపు కళాకారులు మొగలాయీ చిత్రకళకు భారతీయతను అద్ది ఎన్నో కొలనులను సుందరంగా తీర్చిదిద్దారు. తాజ్‌మహల్, జమ్మా మసీదు వంటివి ప్రపంచ ప్రఖ్యాతినార్జించిన కట్టడాలే. అందులో ఏమాత్రం అతిశయోక్తిలేదు. అయితే పల్లె పట్టుల్లో తెల్లగా మెరిసే వాళ్ల నిర్మాణాల శిఖరాలు

కూడా మన ప్రకృతి రమణీయతను ఇనుమడింపజేసేవే. ఈ సందర్భంగా కొత్త [illegible] రూపశిల్పి **ల్యూటెన్స్**కు మనం కృతజ్ఞతలు చెప్పకుండా ఎలా ఉండగలం? ఆ [illegible] నగరం బ్రిటిష్ వారి నగరంగా మెత్తని వెన్నెల్లో మొగలాయీ సంస్కృతిని వెదజల్లుతూ నిలిచి ఉంటుంది. నేను ఇటీవల మధ్య ఆసియా, సోవియట్ రిపబ్లిక్కులు, [illegible] ఈజిప్ట్ ప్రాంతాల్లో పర్యటించి వచ్చిన తర్వాత తెలియవచ్చిందేమంటే భారతీయ భవన శిల్పులు ఈజిప్ట్‌ల శిథిల మమ్మీలకు, ముస్లింల పూజా మందిరాలకు మించి ఎంతగానో కళా రమణీయతను ప్రపంచానికి పంచారని. స్వర్ణ శిఖరాలు, అంచులకు అందంగా అమరే పత్రదళాలు, ఆకుల వంటి జింకలు గల ముస్లింల కట్టడాలు, రాతిపైన చలువరాతిపైన, టేకు చెక్కపైన చెక్కిన పద్మాలవంటి అనేక సుందర ఆకృతులు భారతీయుల సొత్తే!

దక్షిణాది దేవళాల నుండి అటు భువనేశ్వర్ వరకూ చాటిచెప్పే ఆ హిందూతనం, ప్రాకృతిక సౌందర్య సంపద, భవన నిర్మాణ శిల్పంతో దట్టింపబడిన కళాత్మకతాస్థానికి సాటి రాగలవి ఏమున్నాయి? మనం వివరించలేని ఆ కళాత్మకతకు ఆనంద కుమారస్వామి అద్దంపట్టడం జరిగింది. ఒక్కొక్క దేవళం ఆయా కాలాలకు చెందిన సంస్కృతిలోని మార్పులకు ఒక వస్తు ప్రదర్శనశాలగానో, అధ్యయనానికి అనువైన శాస్త్రీయ గ్రంథాలయంగానో రూపుదిద్దుకున్నది. చలనశక్తినంతా తమలో నింపుకుని ముందుకు దుముకుతున్నట్లుగా సింహాల ఏకశిలా శిల్పాలు మనకు రామేశ్వరం, మధుర, శ్రీరంగం, కాంచీపురం దేవళాల్లో కనిపిస్తాయి. నేను వెళ్లిన ప్రతిసారీ మద్రాస్‌లోని కపిలేశ్వర్, తిరువొత్తుయార్, తిరుచునాపల్లి, శ్రీరంగంలోని దేవళాలేకాక కంచికామాక్షి మధుర మీనాక్షి దేవళాలు మిన్నంటుతున్నట్లు కనిపిస్తుంటే తదేకంగా చూసేవాడ్ని. శిలలపై సౌందర్యపు రాగాలు పలికించిన ఆ విశ్వకర్మల కృషిని మననం చేసుకుంటూ అబ్బురపడిపోతూ ఉంటాను. **రాళ్లను ఆ ఎత్తుకు ఎత్తిన శ్రామికులకు, వారు పడిన బాధలకు, చేసిన త్యాగాలకు సానుభూతిని ప్రకటించకుండా ఉండలేం.** అటువంటి భవన నిర్మాణ సృజనలో నా ప్రాంతానికి చెందిన శిల్పులు కూడా తమ వంతు కృషిని అందించారు. కాకతీయుల తరానికి చెందిన **రామప్ప దేవాలయం, హంపీ, నెల్లూరు, పెనుకొండ, తాడిపత్రి, ఒంటిమిట్ట, సింహాచల దేవాలయాలను** పరిశీలించినప్పుడు విజయనగర రాజుల కాలానికి చెందిన విశ్వ బ్రాహ్మణులు చోళ-పాండ్య సంప్రదాయాలను ఆంధ్ర ప్రాంతపు దేవాలయాల నిర్మాణంలోకి ఎంతగా జొప్పించిందీ, భారతీయ నాగరికత ఎంతగా

భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించిందీ తెలియవస్తుంది.

కాకతీయుల తర్వాత **పెూయసొలులు** అదే రీతిలో **పలబేడు, మాల్కోటే**లలో దేవళాలు నిర్మించుకున్నారు. నేను గ్రీకు, రోమన్ సంస్కృతులకు చెందిన భారీ విగ్రహాలను చూడకపోలేదు. వాటి అందానికి ముగ్ధుణ్ణికాకపోలేదు. అయినా ఇక్కడ వందలాది వందులు, వేలాది అపురూప లావణ్యవతుల నృత్య భంగిమలు, ఏనుగులు, సింహాలు, లెక్కకు మిక్కిలి అలంకరణ ఫలకాలు ఈ దేవళాలపై తిలకిస్తూ అవాక్కయ్యేవాణ్ణి. అటువంటివి ఎన్ని చూసినా నాలోని సౌందర్య తృష్ణ తీరేదికాదు.

నేను మంగళగిరిలో రాజ్యలక్ష్మీదేవి విగ్రహం చూశాను. ముత్యంలా ముచ్చటగొలిపే సరస్వతీ దేవి విగ్రహాన్ని మద్రాస్‌లోని వివేకానంద కళాశాలలో చూశాను. అలాగే ఒంటిమిట్టలో మిరుమిట్లు గొలిపే శ్రీరాముని విగ్రహాన్ని చూశాను. శ్రీరంగంలో నల్ల చేవతో చేసినట్లుండే విశ్రాంతి ముద్రలో ఉన్న రంగని దర్శించాను. మైసూరు ప్రాంతపు శ్రీరంగపట్నంలో కూడా అదే విధంగా ఉంది. పొన్నూరు భావన్నారాయణ దర్శనం పరలోక మాధుర్యాన్ని పంచుతుంది. మీనాక్షి, కన్యాకుమారి వంటి దేవతల సౌందర్యాన్ని వర్ణించి చెప్పేదెలా? ఆ శిల్పుల సృజనకు ఎవరైనా ముచ్చటపడాల్సిందే. ఇటీవల (1965లో) **మహాశిల్పి జక్కన**పై కన్నడంలోనూ, తెలుగులోనూ సినిమాలు వచ్చాయి. అలాగే 1954లో **గీత్‌గాయా పత్తరోంనే** అనే హిందీ చిత్రం వచ్చింది. అది రాతిపై బుద్ధుని జీవితాన్ని ప్రతిఫలింపజేసిన చిత్రం. ఇవన్నీ అందాన్ని, శిల్పుల పనితనాన్ని మనం కొద్దో గొప్పో మెచ్చుకోవడానికి సహాయపడతాయి. వాటివంటివికానీ, వాటితో సరితూగేవికానీ అసలు నాకు పశ్చిమదేశాల్లో ఎక్కడైనా కనిపించాయా? ఏడు శతాబ్దాలుగా ముస్లిం పాలకులు ఉత్తర భారతంలో శిల్పాలకు, కట్టడాలకు ఎంతగా నష్టం కలుగజేసినా ఆ విధ్వంసపు తెరమాటున దాగిన ఆ ఖండిత శిల్పాల అద్భుత సౌందర్యం తొంగిచూస్తూనే ఉంది. చూపరులకు కనువిందు కలిగిస్తూనే ఉంది.

అయితే గుహల్లా ఉండే గుళ్లల్లో ఊపిరాడని స్థితి ఉండేది. మసక చీకట్లతో నిండి ఉండే దేవళాలు నాకు నచ్చేవి కావు. దక్షిణదేశమంతా తీర్థయాత్రలు చేసిన మంగమ్మ అమ్మ మద్రాస్‌లో విశాలంగా ఉండే సెయింట్ థోమ్ కెతెడ్రల్‌కు తీసుకెళితే ఆమె బాగా ఊపిరిపీల్చుకుని ఎంతగా ఆనందించిందో. రామకృష్ణ మఠానికి చెందిన బేలూరు దేవాలయం, న్యూ ఢిల్లీలోని శ్రీ నారాయణ మందిరం ఎంతగానో సంవర్ధనం గావింపబడిన మందిరాలు.

1958లో నేను వరంగల్‌లో **వెయ్యి స్తంభాల గుడి**, కోట, రామప్ప దేవాలయాలను దర్శించాను. అవి 12, 13 శతాబ్దాలకు చెందిన కాకతీయ పాలనా కాలపు నిర్మాణాలు. వెయ్యి స్తంభాల గుడి వద్ద నునుపుదేలిన శిల్పాలను మలచిన తీరు చూస్తుంటే అవి నిన్ననో, మొన్ననో పూర్తిచేసినట్లుగా ఉండి ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. వాటి అందాలు, మంచు వంటి సుతిమెత్తని సోయగాలు నన్నెంతగానో ఆకట్టుకున్నాయి. అక్కడ రాతితో నిర్మించిన ప్రవేశ ద్వారాల తోరణాలు కాకతీయుల కాలంనాటివే అయినా సాంచీలోని ప్రవేశ ద్వార తోరణాలను తలపునకు తెచ్చాయి. నా దృష్టిలో ఆ శిల్పులే వీటిని కూడా సృజించి ఉంటారు. చోళుల కాలపు శిలాఫలకాల్లో చెప్పిన ప్రకారం **శిల్పులు ఒక ప్రాంతం నుండి వేర్వేరు ప్రాంతాలకు వలసలు వెళ్లేవారు.** పల్లవుల కాలంలో గోదావరి, కృష్ణా తీర ప్రాంత శిల్పులను, నర్తకులను, కళాకారులను దక్షిణ ప్రాంతం ఆకర్షించిందనీ, అందువల్లనే వారు చోళుల పాలనలోని తంజావూరు, మధురై, మేల్కోట్, కాంచీపురం మొదలైన తావులకు వలస వెళ్లారని తెలుస్తోంది. కాకతీయ పాలనకు చెందిన వరంగల్ ప్రాంతపు శిల్పుల నుండి హంపీ, పెనుకొండ, తాడిపత్రి, వెల్లూరు, మేల్కోటే శిల్ప రీతులు అనేకం అందిపుచ్చుకున్నాయి.

విజయనగర చక్రవర్తి కృష్ణదేవరాయల కాలంనాటి, కాకతీయ గణపతి దేవుని కాలంనాటి శిల్పకళా చాతుర్యం ఎన్నదగినది. ఈ శిల్పాలు శతాబ్దాలకు పూర్వంనాటివే అయినా అవి శిల్పకళా వైభవంలో 1955లో స్టాలిన్‌గ్రాడ్ వద్ద నేను చూసిన స్టాలిన్ విగ్రహంతో సరిపోల్చినప్పుడు ఇవే మెరుగ్గా కనిపించాయి. అమెరికావారు కొండలపై చెక్కిన పెద్ద పెద్ద రాతి శిల్పాలను గొప్పవిగా భావిస్తారుకానీ నిజానికి నిత్యనూతన సౌందర్యంతో తొణికిసలాడే ఏడు పగోడాలలోని ఏకశిలా విగ్రహాలకు, ఎలిఫెంటా గుహల్లోని త్రిమూర్తి శిల్పంతో, లేపాక్షి వద్ద గల పెను సర్పంతో, బాంకాక్‌లో విశ్రాంతి పొందుతున్నట్లుండే బుద్ధుని విగ్రహానికి, అలాగే అజంతాలోని బుద్ధుని విగ్రహాలకు, బెలగోల శిల్పాలకు అవి సాటిరావు. అటువంటి ఆంధ్ర శిల్పులకు, కళా విమర్శకులకు నేనూ రుణపడి ఉన్నా. మరీ ముఖ్యంగా అడవి బాపిరాజు గారికి, డాక్టర్ సత్యనారాయణ గారికీ. వారిద్దరూ కవులేకాకుండా కళాకారులు కూడా. దేవీజీ కూడా ఆమె స్థాయిలో ఓ కళాకారిణే. ఎల్.వి.బి.చౌదరి గారు గొప్ప కళాభిమాని. శిల్పాలను, చిత్రాలను సేకరించేవారు. అలాగే చిత్ర. **వీళ్లందరూ నాలో కళాభిమానం నెలకొనేందుకు, దాన్ని పెంచి పోషించేందుకు ఎంతగానో సాయపడ్డారు.** అయితే బాపూ భారతదేశపు సాధారణ గృహిణి

అసలైన అందం ఎక్కడ ఉంటుందో తెలుసుకునే కిటుకును బోధించారు. అది సాదాసీదాగా, పరిశుభ్రంగా, నూతనంగా నిర్మించిన కుటీరాల్లో, ఆమె అందం దాగి ఉంటుందని అన్నారు. మరీ ముఖ్యంగా కేరళ, బెంగాల్, ఆంధ్ర, అస్సాం ప్రాంతాల్లోని రైతుల కుటీరాల్లో ఉంటుందని అన్నారు. దానివల్ల సహజసిద్ధమైన ఆనందం వెల్లివిరుస్తుందని, ఆ కుటీరాలపై గొడుగుల్లా అమరి ఉండే కొబ్బరి తాటిచెట్లు, చిరునవ్వులు చిందిస్తున్నట్లుండే అరటి మొక్కలు, ఎర్రని పూలతో నిండిన మోదుగ చెట్లు, వెదురు పొదలు, నిరంతరం నవ్వుతున్నట్లుండే వేప, మామిడి చెట్లు, ఆ చెట్లపై నుంచి వినిపించే పిట్టల మధుర సంగీతం వీటన్నింటి మధ్య అందం దాగి ఉంటుందని బాపూ అన్నారు.

మొహంజదారో, ఏథెన్స్, రోమ్, అలెగ్జాండ్రియా, ఢిల్లీ, లండన్, పారిస్, వరంగల్, శ్రీకాకుళం వంటి ప్రదేశాల్లో తర్వాత తరాలకు ఏమైనా చారిత్రక అందాలు మిగిలి ఉంటాయా అనిపిస్తూ ఉంటుంది, ఎందుకంటే వాటికి గత కీర్తి కొరవడుతున్నది. రానున్న నాగరికతలు వాటిని మూలకు నెట్టేస్తాయి. అటువంటి శిథిలాల పక్కనే తిరిగి రాజధానులు నిర్మించాలని చూడడం దేనికి? పురాతన ఇంద్రప్రస్థం చుట్టుపక్కల **వదికి** పైగా నగరాలు ఎందుకు నిర్మించాల్సి వచ్చింది. వేల సంవత్సరాలుగా స్మశానాలుగా మారిన ఢిల్లీ ప్రాంతంలో నేటికీ నూతనంగా నిర్మాణాలు చేపట్టాలని ఎందుకు కోరుకుంటున్నాం? **సోక్రటీస్‌ను, పెరిక్లస్‌ను, ప్లేటోను, అరిస్టాటిల్‌ను స్మరించుకునేందుకు విజ్ఞులు, విద్యార్థులు ఏథెన్స్‌కు వెళ్లాలా? గర్వపోతులైన చక్రవర్తుల్ని, యుద్ధప్రీతి గల ప్రేక్షకులతో నిండిన కొలీజియంలను చూసేందుకు రోమ్ వెళ్లాలా? వేల సంవత్సరాలుగా భారతీయుల కురుక్షేత్రాన్ని సందర్శించేది దేనికి? దాయాదులైన కురుపాండవుల కుమ్ములాటలో అసువులు బాసిన వీరులకు శ్రద్ధాంజలి ఘటించేందుకా? ఈ ప్రశ్నలకు నాకు సంతృప్తికరమైన సమాధానం లభించడం లేదు.**

అయినా నాకు ఇటువంటి ఆలోచనలంటే ఎంతో ఉత్సుకత. అవి నాకు చారిత్రాయకాలు అటువంటివన్నీ క్షణికాలైనా సరే, నిరంతర పరిమళభరితాలైనా [illegible] లోపల దహించివేసే అంశాలైనా సరే. అవి మానవ జీవితాన్ని సంపూర్ణం చేసుకోవాలనే లక్ష్యంతో, సారాన్ని గ్రహించాలనే తలంపుతో ముందుకు సాగే [illegible]మంది లక్ష్య సాధకులు సంపూర్ణ తృప్తిని పొందజాలని బలమైన కోరికలు [illegible].

ఉత్తములను ఆనందపర్చేది ఏది? కండబలం కాదు, గొప్పతనం కాదు, భోగభాగ్యాలు కావు. అధికారం కాదు, దర్పంకాదు, శృంగారం కాదు, కీర్తికాదు, తన వెంట పదిమంది పోగుకావడంకాదు, దీర్ఘాయువు కాదు, చివరకు ఆత్మాహుతి కూడా కాదు. ఉత్తములు పైవాటన్నింటికీ అతీతంగా బాధల్లో ఉన్నవారికి వారి బాధలు తగ్గి ఆనందం పొందే మార్గాలను సూచించి అందరి ఆనందంలోనే తమ ఆనందముందని గుర్తిస్తారు. ఈ ఆలోచనలను ప్రజలు ఇబ్బడిముబ్బడిగా గుర్తించేటట్లు చేసేందుకే భారతదేశపు భవన శిల్పులు, కళాకారులు వారి వారి శక్తియుక్తుల మేరకు కృషి చేశారు. వాటిని తిలకించినప్పుడల్లా వాళ్ల పట్ల నాకు భక్తిభావం కలుగుతుంది.

మన దేవతలకు శిల్పులు అన్ని చేతుల్ని, తలల్ని కల్పించడాన్ని చూసి నేను అందరిమాదిరిగానే అలా చేయడమెందుకు అని ఆశ్చర్యపోయే వాణ్ణి. అయితే నాకు నృత్య భంగిమల విషయంలో అవగాహన ఏర్పడిన తర్వాత అలా చేతులూ, తలలూ తీర్చిదిద్దడంలో నాకు అసహజత్వం ఏమీ కనిపించలేదు. **గోధూమికి స్టాక్ సోదరీమణులు బహుకరించిన నటరాజ విగ్రహంపైకి ఒక ముస్లిం మిత్రుడు టార్చిలైట్ వెలుగును కిందకీ పైకీ కదుపుతూ ఒకేసారి మనకు రెండు చేతులు మాత్రమే కనిపిస్తాయని రుజువు చేశాడు.**

నేను భారతదేశమంతా చుట్టి వస్తూ పది లక్షల యేళ్ల నాగరికతా అవశేషాలను తిలకిస్తూ వస్తున్న కొలదీ **వేదాంత బోధనల పట్ల విశ్వాసం బలీయం కాసాగింది.** ధర్మాన్ని ఆచరణలో పెట్టడం, సత్యానికి కట్టుబడి ఉండడం, జీవితం పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవడం, సేవా తత్పరులు కావడం, స్వేచ్ఛ పట్ల విశ్వాసం, సమస్త జీవుల పట్ల పవిత్ర భావాన్ని పెంపొందించుకోవడం చేయగలిగితే అంతకంటే పవిత్ర కార్యం వేరొకటి ఉంటుందని నేననుకోవడంలేదు. ఘనులైన మొగలుల, హైందవ మహారాజుల కట్టుదిట్టమైన కోటలు మట్టి దిబ్బలుగా మారాయి. వేలాది దేవాలయాల్లోని సంపదలను కొల్లగొట్టారు. దేవళాలను నేలమట్టం గావించారు. అయినా సరే ఆ కళాకారుల మనో మందిరాల్లోని భక్తి మాత్రం పదిలమే. **మానవుడిలోని సౌందర్యపిపాస, సత్యాన్వేషణ, ఆనందోపానన ఆచంద్రతారార్కమే. అటువంటి ఆశాజనక ప్రమాణాలను భద్రపర్చి భారతీయులు ప్రపంచానికి అందజేశారు.**

19

పర్యటనల అనుభవాలు

1933 నుండి 1967 వరకూ ప్రతి సంవత్సరం నేను ఆంధ్ర ప్రాంతపు జిల్లాల్లో పర్యటించేవాణ్ణి. జిల్లాకు ఒక వారం చొప్పున కేటాయించేవాణ్ణి. సాధారణంగా నేను చాలుగేళ్ల కాలంలో రెండు పర్యాయాలకు మించి ఏ గ్రామానికీ వెళ్లేవాణ్ణికాదు. రోజూ నేను నాలుగు నుండి పది గ్రామాల వరకూ పర్యటించేవాణ్ణి. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమయ్యే నా పర్యటన అర్ధరాత్రి పన్నెండు గంటలకో లేదా ఒంటి గంటకో ముగిసేది. సభలకు వేలాదిమంది పోగయ్యేవారు. సభకు ముందు ఊరేగింపులుండేవి. అవి ఒకటి రెండు మైళ్లు గ్రామంలోనో, గ్రామం బయట నుండో సాగేవి. సభ సాధారణంగా గంట నుండి మూడు గంటల సమయంలో ముగింపు కొచ్చేది. నేను అరగంట నుండి గంట వరకూ మాట్లాడాల్సి వచ్చేది. 1939 వరకూ మైకులు కనిపించేవి కావు. వాటి అవసరమూ ఉండేదికాదు. అటువంటి సభల్లో స్థానిక, గ్రామీణ, ప్రాంతీయ వాయకుల్ని ప్రసంగించేందుకు ప్రోత్సహించేవాడిని. సభ అనగానే స్వాగతం పలకడం ఉండేది. అందులో నా సేవలను, నా సహచరుల సేవలను, కిసాన్ ఉద్యమ ఫలితాలను

కమలా దేవి చటోపాధ్యాయ్

కీర్తించేవారు. అక్కడి ప్రజలు తమ అవసరాలను, ఫిర్యాదులను, ఆకాంక్షలను వెల్లడిచేసేవారు.

ప్రతి ఊరేగింపు సందర్భంగా బ్యాండ్ మేళమో, సన్నాయి మేళమో ఏర్పాటు చేసేవారు. వాటిని ఆయా ట్రూపుల వారు కొందరు స్వచ్ఛందంగా వాయించి వెళ్తే వారు కొందరు డబ్బులు తీసుకునేవారు. అదంతా నాకు బాధ కలిగించేది. అయితే జనాల మధ్య నిరంతరం గడపడం ఆనందంగా ఉండేది.

అయితే **ప్రజల బాధల్ని గురించి ఆలోచించినప్పుడు, వాళ్లను పీల్చిపిప్పి చేసే పేదరికాన్ని పరిశీలించినప్పుడు నాకు ఆవేదనగా ఉండేది.** ఆర్థిక, సామాజిక అసమానతల నుండి వాళ్లను కాపాడలేని దయనీయమైన నా అధికార లేమికి, నా నిస్సహాయతకు బాధపడుతూ ఉండేవాణ్ణి. నేను ఆ సభలను వయోజన విద్యకు వేదికలుగా మలుచుకుని ప్రయోజనకరమైన అనేక వర్తమాన అంశాల పట్ల అవగాహన కల్పించి వాళ్ల వాళ్ల సంస్థలను అభివృద్ధిపర్చుకునేందుకు తగిన ప్రోద్బలాన్ని కల్పించేవాణ్ణి.

ప్రజలకు ఆ సభలు శక్తిదాయకాలుగా ఉండేవి. స్ఫూర్తిని పొందేటట్లు చేసేవి. నేను ఆ ప్రాంతానికి చేరడంవల్ల ఆ గ్రామానికీ, ఆ గ్రామ సముదాయాలకూ చెందిన ప్రజలకు ఆత్మస్థయిర్యం కలిగేది. మానసిక బలం వచ్చేది. జరిగిన ప్రచారం వల్ల, స్థానికంగా జరిగిన చర్చల వల్ల, తీసుకున్న నిర్ణయాల వల్ల సభలు నిర్వహించిన చోట ప్రజలు ఆ విధమైన అనుభూతిని పొందేవారు. ఆత్మిక శక్తిని, ఆత్మ విశ్వాసాన్ని కలిగించి సాయం అందించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపేవాళ్లు.

అలా నేను పర్యటించే సందర్భాల్లో రైతుల్లో మేధావుల్ని కలిసేవాణ్ణి. వాళ్లల్లో కొందరు ప్రజా సేవకులు కూడా ఉండేవారు. వారిలో కొందరిని మా ఉద్యమంలో పాలుపంచుకోమని కోరేవాణ్ణి. మా ఉద్యమం ఊపును నిలబెట్టేందుకు, రైతుల్లో రాజకీయ చైతన్యాన్ని ప్రోది చేసేందుకు నా పర్యటనలను ఈ విధంగా సద్వినియోగం చేసుకునేవాణ్ణి. ఈ విధమైన అవగాహన లేకుంటే ఆ పర్యటనలు అలసటను కలిగించేవిగానూ, ఖర్చుతో కూడినవిగానూ కన్పించి ఉండేవి.

1935 నుండి నేను భారతదేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా పర్యటించసాగాను. 1935 వసంత రుతువులో నేను పంజాబ్‌లోని లైలాపూర్, జలంధర్, లాహోర్, అమృత్‌సర్ ప్రాంతాల్లోని పల్లె పట్టుల్లో పర్యటించాను. పంజాబీ రైతుల కష్టసుఖాలు తెలుసుకునేందుకు నాకు పంజాబీ భాష రాకపోవడం అడ్డుగా నిలువలేదు. అదే

సంవత్సరం చలికాలంలో తమిళనాడు, మలబార్‌లలో పర్యటించాను. అప్పటికే నా పేరు పత్రికల ద్వారా, అక్కడి కాంగ్రెస్ నాయకుల ద్వారా, రైతు కార్యకర్తల ద్వారా ప్రాచుర్యంలోకి రావడం జరిగింది.

పంజాబ్‌లో లాలాలజపతిరాయ్ స్థాపించిన **సర్వెంట్స్ ఆఫ్ పీపుల్ సొసైటీ** సంఘ సేవా కార్యక్రమాల్లో నిమగ్నమైన తీరు నన్ను బాగా ఆకట్టుకుంది. 1936లో తిరిగి నేను ఆంధ్ర, తమిళనాడు, మలబారు, కర్నాటక, పంజాబ్ ప్రాంతాల్లోని గ్రామాల్లో పర్యటించాను. నేను కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ, కాంగ్రెస్ నాయకులనేగాక బిడియంగా, దూరందూరంగా ఉండే రైతు కార్యకర్తలను కూడా కలుసుకోగలిగాను. 1935 చివరలోనూ, **1936 ప్రారంభంలోనూ బెంగాల్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్థానిక కాంగ్రెస్ నాయకులను కలసి అఖిలభారత కిసాన్ సమ్మేళన్ ఏర్పాటుకు వారి తోడ్పాటు కావాలని కోరాను.** ఫైజ్‌పూర్ కిసాన్ కాంగ్రెస్‌కు మహారాష్ట్ర గుండా ఉప్పెనలా వచ్చిన రైతు యాత్రను స్వాగతించి వారిని జవహర్‌లాల్‌జీకి పరిచయం చేస్తూ అన్నాను : 'గంగా యమునలు సముద్రంలో కలిసేందుకు వచ్చినట్లు ఈ యాత్రలు రైతుల, కార్మికుల ఇళ్ల నుండి కాంగ్రెస్‌లో కలిసేందుకు రాసాగాయి. వాళ్ల నుండి ఏమాశించాలో కాంగ్రెస్ నిర్ణయించుకోవాల్సి ఉంది. కాంగ్రెస్ అధ్యక్షా, నీకు ఇదొక సవాల్'.

1938లో తిరిగి గుజరాత్‌లోని హరిపురాలో రైతు యాత్రను మేము నిర్వహించాం. ఆ విధంగా మేము సర్దార్ కోటలో సందు చేసుకున్నాం. సుభాష్ బాబు మా రైతు యాత్రలను స్వాగతించారు.

1938లో తమిళనాడులోని రాజపాలయంలో నిర్వహించిన రైతు సదస్సుకు నేను అధ్యక్షత వహించాను. 1937, 1938, 1939లో జరిగిన రైతు యాత్రలన్నింటిలో వాడాపుగా ఒకేవిధమైన అనుభవాలు పునరావృతమైనా నేను రాజస్థాన్, హైదరాబాద్, మైసూరు, ఒరిస్సా, తూర్పు బెంగాల్, అస్సాం, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌వంటి మిగతా ప్రాంతాలకు కూడా వెళ్లగలిగాను. 1937లో జరిగిన కాన్పూర్ సదస్సు ఓ ప్రత్యేకతను సంతరింపజేసుకుంది. నేను అప్పుడు అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుణ్ణి. అక్కడ దేవీజీ రైతు మహిళలు విరివిగా పాల్గొన్న సభల్లో పాల్గొని ప్రసంగించింది. ఆంధ్రేతర ప్రాంతాల్లో నా పర్యటనల శక్తిని గ్రహించి అప్పటి నుండి మా సమయాన్ని, వనరులను వాటిపై అధికంగా వెచ్చించడం ప్రారంభించాం. ఈ పర్యటన సందర్భంగానే ప్రజలు నన్ను **'కిసాన్ రాష్ట్రపతి', 'రైతు ఉద్యమపిత'** అని

పిలువసాగారు. శ్రీమతి కమలాదేవి ఛటోపాధ్యాయ (1930నాటి బొంబాయి ఉద్యమ వీర వనిత) నన్ను దక్షిణ కెనరాలో పర్యటించేందుకు 1938లో ఆహ్వానించారు. మేము ఐదు రోజులపాటు కలసి పర్యటించాం.

తమిళ రైతుల క్రమశిక్షణ ప్రత్యేకమైనది. వాళ్లు సమావేశమైన తీరు, ఆహ్వానించే తీరు, పుష్పమాలలు సమర్పించే తీరు అంతా ప్రత్యేకమే. వివిధ గ్రామాలకు చెందిన నాయకులందరూ ఒక్కొక్కరుగా వేదిక మీదకు వచ్చి సేనలోని వారు శపథం చేస్తున్నట్లుగా ఒక భంగిమలో నిల్చి నా ఆశీర్వాదం పొంది నాకు దండవేసి వేదిక ఎక్కినప్పటి క్రమశిక్షణతో వేదిక దిగివెళ్లేవాళ్లు. సభల్లో కూడా శ్రద్ధగా, మౌనంగా వినేవారు. అంతా ఏదో మతపరమైన ప్రశాంతత అలుముకున్నట్లుగా ఉండేది.

పంజాబీ సిక్కులు, జలంధర్, రోటక్ జిల్లాలకు చెందిన జాట్లు తలపాగాల విన్యాసాలు, పెరిగిన గడ్డాలు, ఎరుపు రంగు, బంగారు రంగు మేని ఛాయలు, కళ్లల్లో కనిపించే విశ్వాసంతో వెలుగొందేవాళ్లు. వాళ్లంతా ఇటీవల కాలంలో స్వతంత్ర కిసానులుగా సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. (1959-65).

వాళ్లతో రాజాజీ ఇలా చెప్పేవారు: **'నేను విశ్వామిత్రుడ్ని. రామచంద్రునికి తర్ఫీదునిచ్చినట్లు మీ రంగాకు శిక్షణ ఇస్తున్నాను'**. అది విని వాళ్లెంతో ఆనందించేవారు.

బెంగాల్ రైతులు జమీందారుల దాష్టీకానికి గురైనవాళ్లు. వాళ్ల బట్టలు, శుష్కించిన దేహాలు వాళ్ల పేదరికానికి ప్రత్యేక సాక్ష్యాలు. వాళ్ల కుటీరాలు కేరళలో మాదిరిగా అందంగా నిర్మించినవేకానీ జీర్ణ కుటీరాలు. అయితే కేరళలో మాదిరిగానే బెంగాల్‌లో కూడా గ్రామాలు ప్రకృతి రమణీయతతో ఓలలాడేవి.

మహారాష్ట్ర రైతులు మన రాయలసీమ రైతుల్ని పోలి ఉండేవారు. వాళ్ల పాదయాత్రలు తమిళుల పాదయాత్రల్లా ఉండేవి. వాళ్లు నినాదాలిచ్చే తీరు నాకు మొగలులను వ్యతిరేకించిన వీర శివాజీ హూంకరింపులను తలపునకు తెచ్చేవి. వారు భూస్వాముల పైకంటే అనిశ్చిత వాతావరణంపై ఎక్కువగా పోరు సల్పేవారు. **వారి ముఖ్య సమస్యలు అధిక వడ్డీలూ అధిక శిస్తు వసూళ్లూ.**

ఈ ప్రాంతాలన్నింటిలో పర్యటిస్తూ నేను గాంధీజీకి నచ్చజెప్పేందుకు చూసేవాణ్ణి. ఈ రైతుల పూర్వీకులే అలెగ్జాండర్‌కు, మహ్మదీయులకు, మొగలులకు వ్యతిరేకంగా నిలిచి పోరాడి భారత స్వాతంత్ర్యాన్ని శతాబ్దాలుగా కాపాడుకున్నారు. శివాజీ, రాణా ప్రతాప్, రంజిత్ సింగ్ పిలుపునందుకుని ఉత్తర భారతంలోనూ - కాకతీయుల,

విజయనగర రాజుల పిలుపునందుకుని దక్షిణ భారతంలోనూ కదన రంగానికి కదలి వచ్చిన వీరులు స్వరాజ్య భారతాన్ని షావుకార్ల, పూజారుల, అధికారుల పెత్తనం కింద కొనసాగడాన్ని సహించరని చెబుతూ ఉండేవాణ్ణి.

1935 వరకూ నేను రైతు-కూలీ రాజ్యం కోసం పోరాడాను. ఇప్పుడు నేను ప్రజాస్వామిక రైతు, కూలీ, వృత్తిదార్ల, బుద్ధి జీవుల రాజ్యం కోసం పోరాడతాను.

ఆంధ్ర, మహారాష్ట్ర, కర్నాటక, పంజాబ్, తమిళనాడు రైతుల్లో అధిక శాతంమంది తమ తమ భూములపై పూర్తి యాజమాన్య హక్కులు కలిగి ఉన్నారు. శతాబ్దాలుగా వాళ్లు యజమానిగా రైతు హోదాను అనుభవిస్తూ వస్తున్నారు. వాళ్ల కష్టాలన్నీ వాళ్లకు కావాల్సినవి లభించకపోవడమే. దానివల్ల వారికి అధిక భూమి శిస్తు, నీటి వనరుల కొరత ఏర్పడింది. అప్పులు కూడా పెరిగాయి. వాళ్లంతా ఎంతగానో ఆత్మ గౌరవాన్ని ప్రదర్శిస్తారు. వాళ్లంతా కోరుకునేది వర్గపరమైన ఆర్థిక ప్రయోజనాలను కాదు స్వరాజ్యం.

నేను పాల్గొన్న సభలు అందరం ఒకచోట కలిశాం అనుకునే యోగ సమాచారపు ముచ్చట్లుగా ఉండేవికావు. అలా అని ఎల్లప్పుడూ ప్రతిఘటనా ప్రదర్శనలుగానూ లేవు. రైతుల, వృత్తిపనివారల, ఉద్యమ ఆశయాలను ఆ సభల్లో వివరించడం జరిగేది. వాళ్ల అవసరాలు, కోర్కెల నేపథ్యంలో జాతీయోద్యమంలో వాళ్ల పాత్ర ఏమిటనేది స్పష్టంచేసేదిగా ఉండేది. నా పర్యటనలను నేను రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలపై యదార్థమైన వయోజన విద్యా ప్రచార కార్యక్రమాలుగా తీర్చిదిద్దేవాణ్ణి.

1939లో నేను శ్రీమతి భారతీదేవి గారితో కలసి మూడు వారాలపాటు బర్మాలో పర్యటించాను. అటువంటి పర్యటనల సందర్భంగా నేను ఏ దేశంలో అయినా నా సేవల్ని బాగా అందించగలననే నమ్మకం ఆమెకు ఏర్పడింది. వాళ్ల పగోడాలను రోమన్ల పార్థనా మందిరాలతో పోల్చి చూశాను. అక్కడ బౌద్ధ సన్యాసులకు ఇక్కడ మన పేద పాండాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. బర్మాలో నా ప్రసంగాలు ఆంగ్లం నుండి హిందీ, బర్మా భాషల్లోకి అనువదించి చెప్పేవారు. నేను బర్మావారిని సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడమనేవాణ్ణి. ఆర్థికంగా వాళ్లెలా దోపిడీకి గురవుతున్నదీ వివరించి చెప్పేవాణ్ణి. అందువల్ల రంగూన్ డైరీ **'గజెట్' అనే పత్రిక నా ప్రసంగాలను తీవ్రంగా ఖండించేది. నన్ను జైల్లో పెట్టాలని కోరేది. అయితే భారతీదేవి గారి ప్రసంగ కౌశల్యాన్ని, పాండితనాన్ని అదే పత్రిక మెచ్చుకునేది.**

మేము బర్మాలో **డాక్టర్ థైన్‌మాంగ్**కు అతిథులం. అంతకుముందు ఆయనా, నేనూ

కేంద్ర అసెంబ్లీలో కలసి పనిచేశాం. అంతకుపూర్వం ఆయన మంత్రి. ఒక సభకు వాళ్ల ముఖ్యమంత్రి డాక్టర్ బామా అధ్యక్షత వహించారు. ఆయన ఆంగ్ల ప్రసంగం అందరినీ బాగా ఆకట్టుకుంటుంది. అలాగే మిస్టర్ రవూఫ్ కూడా నా సభకు అధ్యక్షత వహించారు. ఆయన స్వతంత్ర భారతావనికి, జపాన్, కెనడాలకు రాయబారి. రంగూన్‌లో పేరెన్నికగన్న లాయర్. ఆయన భారతదేశంలో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, బోస్‌వంటి అగ్రశ్రేణి నాయకులేకాక నావంటి పటిమ గల, బాధ్యతాయుత, శక్తిమంతమైన జాతీయశ్రేణి నాయకత్వం ఉన్నందుకు సంతోషించారు. **నేను అఖిల బర్మా శ్రామిక సభకు అధ్యక్షత వహించాను.** బర్మా, భారతదేశ శ్రామిక సంఘీభావం దిశగా కనీస కోర్కెలను రూపొందించాను.

తర్వాత కాలంలో నేను కారాగారవాసం అనుభవిస్తూ ఉండగా దేవీజీ ఆంధ్ర కిసాన్ కాంగ్రెస్ నిర్వహణా బాధ్యతలు చేపట్టేందుకు ఆమెకు బర్మా అనుభవాలు బాగా ఉపయోగపడ్డాయి. అంతేగాక అఖిలభారత కిసాన్ కాంగ్రెస్‌లోని కమ్యూనిస్ట్‌ల ఎత్తుగడలను అధిగమించడంలో, యుద్ధ సమయపు ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కోవడంలో ఈ అనుభవాలు ఉపయోగపడ్డాయి.

ఇలా పర్యటనలు ఎడతెగకుండా చేసినా అవి ప్రణాళికాబద్ధంగా ఉండడం వల్ల ప్రజల్లో నూతనోత్సాహాన్ని నింపి వాళ్లల్లో స్వయంగా సత్యాన్ని గ్రహించే శక్తిని పాదుగొల్పి స్వయంగా అభివృద్ధిని సాధించేటట్టుగా ఉండేవి. కనుక ఈ పర్యటనలు కూడా 1934 నుండి నేను రాసిన పుస్తకాలవలే, నేను పార్లమెంట్‌లో చేసిన కృషి మాదిరిగానే గ్రామీణ ప్రజానీకానికి, రైతులకు ప్రయోజనకరమే.

ఎటుచూసినా రైతు యాత్రలే

నేను శక్తిమంతమైన రాజకీయ ఆయుధంగా రైతు యాత్రలను మలిచాను. దాన్ని బీహార్‌లో స్వామి సహజానంద పెద్దయెత్తున ఉపయోగించుకున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని కాంగ్రెస్‌వాదులు కూడా వాటిని ఉపయోగించుకున్నారు. ఇదంతా 1938 నాటి మాట. అటువంటి యాత్రల్లో ఒకటి పాట్నా రైతు యాత్ర. ఆ యాత్రలో లక్షమందికి పైగా రైతులు పాల్గొన్నారు. అలాగే ఉన్నావ్ నుండి బిశాంబర్, బి.త్రిపాఠి నిర్వహించి లక్నో దిశగా నడిపిన రైతు యాత్రలో కూడా దాదాపుగా లక్షమంది రైతులు పాల్గొన్నారు. **హరిపురా రైతు యాత్ర సర్దార్ పటేల్‌కు కనువిప్పు కలిగించింది.** దీంతో కాంగ్రెస్ హైకమాండ్

ఎక్కువగానే కలవరపాటు చెందింది. అందులోని వారు ఆ యాత్రలు సాగకుండా చూసేందుకు విఫలయత్నం చేశారు. చివరకు రైతు యాత్రల సందర్భంగా చేసిన అనేక విజ్ఞప్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టక తప్పలేదు.

వెయ్యి మైళ్ల పాడవునా రైతు యాత్ర

ఆ ఉద్యమానికి కొనసాగింపుగా **ఇచ్చాపురం నుండి మద్రాస్ (చెన్నై) వరకూ వెయ్యి మైళ్ల రైతు యాత్రను తలపెట్టాం. ఆంధ్ర తీర ప్రాంతం వెంబడి ఒక కొస నుండి మరో కొస వరకూ** అనేక గ్రామాల గుండా ఆ యాత్ర సాగింది. **రైతు యాత్రను జాగృతికి, తిరుగుబాటుకు, ప్రజా బోధనకు కరదీపికగా ఉపయోగించుకున్నాం.** ప్రతి జిల్లాలోనూ స్థానిక కిసాన్ కాంగ్రెస్ నాయకులు రైతు యాత్ర సాగని మారుమూల ప్రాంతాల నుండి ఈ యాత్రలు ప్రధాన యాత్రను చేరుకునేటట్లుగా ఏర్పాట్లు చేశారు. కొన్ని ప్రధాన కూడళ్లలో ప్రదర్శనలు నిర్వహించాం. 1938లో నేను ఆ రైతు యాత్రను ఇచ్చాపురంలో ప్రారంభించాను. నేనూ, భారతీదేవి రైతు యాత్రలో మధ్య మధ్యలో పాల్గొంటూ వచ్చాంకానీ **తొలి నుండి తుది వరకూ ఆంధ్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కీ.శే. కె.ఎస్.ఎన్.మూర్తి గారు రైతు యాత్రలో పాల్గొన్నారు.** నేనొక చిన్న కరపత్రం తయారుచేశాను. అందులో రైతుల ప్రధాన అవసరాలు, సాధకబాధకాలు, కోర్కెలు అన్ని జిల్లాలకు సంబంధించినవి ఉన్నాయి. అది అప్పటి మద్రాస్ ముఖ్యమంత్రి రాజగోపాలాచారికి సమర్పించడం జరిగింది. మా సోదరులు, రైతు శిక్షణా కేంద్రం నుండి తర్ఫీదు పొందిన వారిలో ప్రముఖులు లచ్చన్న, శ్యాంసుందరరావు, కె.ఓబులరెడ్డి, డి.ఎస్.రెడ్డి, మహానంద, గొర్రెపాటి మొదలగువారు ఈ యాత్ర వల్ల ప్రముఖులయ్యారు. శెట్టిపల్లి రాసిన విప్లవ గీతాలను అప్పారావు, ఎన్.వి.సుబ్బయ్య, తిమ్మారెడ్డి వంటివారు గానం చేసి రైతు యాత్రలో పాల్గొన్నవారికి , వారిని చూడడానికి వచ్చినవారికి స్ఫూర్తిని పంచారు.

1922-26 మధ్యకాలంలో ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన అంతర్జాతీయ కార్మిక సముదాయంలో నాతో కలసి పనిచేసిన మిస్ స్టాక్ రష్యా, చైనాల గుండా భారతదేశాన్ని చేరుకుంది. ఆమె ఆక్స్‌ఫర్డ్‌లో నాతో కలసి చదువుకుంది. **ఆమె రైతు ఉద్యమాన్ని చాలా దగ్గరగా అధ్యయనం చేస్తూ ఒక మాసం మాకు, రైతు విద్యాలయానికి అతిథిగా మెలిగింది. దేవీజీతో కలసి చుట్టుపక్కల గ్రామాలనెన్నింటినో సందర్శించింది.** నేను ఆమెను సేవాగ్రామ్‌కు తీసుకుని వెళ్లి మహాత్మాగాంధీకి పరిచయం చేశాను. ఆమె సామ్రాజ్యవాద వ్యతిరేక

ధోరణి మాకు నచ్చింది. ఆమె భారత స్వాతంత్ర్య ఉద్యమానికి తోడ్పాటునందించింది. ఆమె భారతదేశంలోని అనుభవాలను పురస్కరించుకుని **రైతు యాత్రలు** అనే పుస్తకాన్ని రాసి నా **'కిసాన్ కరదీపిక' (కిసాన్ హ్యాండ్ బుక్)**లో ప్రచురించేందుకు అనుమతి తీసుకుంది. మరో 30 సంవత్సరాల తర్వాత రైతు జన సంక్షేమం విషయంలో నా సేవల్ని కొనియాడుతూ ఒక చిరుపొత్తం రాసింది. ఆమె 1948-65 మధ్యకాలంలో భారతదేశంలోనూ, పాకిస్థాన్‌లోనూ, కలకత్తా, ఢక్కా, రాజస్థాన్ విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్‌గా పనిచేసింది. ఆమె నాకెంతో తోడ్పాటునందించేది.

వయోజన విద్యా ఉద్యమం

1936లో ఢిల్లీలో తొలి అఖిలభారత సదస్సును వయోజన విద్యపై నిర్వహించడం జరిగింది. ఆ సందర్భంగా ఏర్పాటైన భారత వయోజన విద్యా సొసైటీ వ్యవస్థాపకుల్లో నేనొకణ్ణి. తొలిగా దాని కార్యదర్శుల్లో ఒకనిగా ఎన్నుకున్నారు. తర్వాత ఉపాధ్యక్షుణ్ణి చేశారు. అలా ఆ సొసైటీతో నాకు ఎడతెగని అనుబంధం ఏర్పడింది.

వయోజన విద్య ప్రాధాన్యతేమిటో తెలియకముందునుంచే దానిపట్ల నాకు ఆసక్తి ఏర్పడింది. **విద్యపట్ల నాకు ఆసక్తి ఏర్పడుతున్న తరుణంలో అంటే 1914లోనే వయోజన విద్యపట్ల కూడా ఆసక్తి ఏర్పడింది.** 1916-20 మధ్య కాలంలో అయ్యంకి వెంకటరమణయ్య గారు గ్రంథాలయ ఉద్యమాన్ని ఒక క్రియాశీల ప్రజానురంజక వుద్యమంగా తీర్చిదిద్దుతున్న తరుణంలో దాని పట్ల ఆకర్షితుణ్ణయ్యాను. మా చుట్టుపక్కల గ్రామాలన్నింటా గ్రామీణ గ్రంథాలయాల ఏర్పాటుకు నేను చేయగలిగినంత చేశాను. 1920-26 ప్రాంతాల్లో నేను ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకుంటున్న రోజుల్లో శ్రామిక విద్యా సంఘం కార్యకలాపాల్లోనూ, వయోజన విద్యా సంఘాల్లోనూ, శ్రామిక కళాశాలల్లోనూ నేను క్రియాశీలంగా వ్యవహరించేవాణ్ణి. అందువల్ల భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత కూడా గ్రామీణ గ్రంథాలయ ఉద్యమం, రాత్రి పాఠశాలలు, నిరక్షరాస్యత నిర్మూలనా కార్యక్రమాలను శక్తిమంతంగా నిర్వహించేందుకు నా వంతు కృషి నేను చేశాను. అవన్నీ ఆనాటి స్వాతంత్ర్యోద్యమంలో భాగాలుగానే ఉండేవి.

1926-30 మధ్యకాలంలో వైఎంసిఎ సాధారణ సంఘ సేవా కార్యక్రమంగా వయోజన విద్యను చేపడితే విద్యార్థి, యువజన సంఘాలు రాజకీయ సానుకూలతలపై కూడా దృష్టి పెట్టడం జరిగింది. నేను మద్రాస్‌లో కళాశాలలో బోధన చేపట్టిన

కాలంలోనూ, ఆ తర్వాత కాలంలో కూడా నేను ఈ ఉద్యమపు విభిన్న అంశాల అభివృద్ధికి ఎంతో సమయాన్ని వెచ్చించేవాణ్ణి. **సామాజికంగా అణగారినవారి అభ్యున్నతిని బలంగా కోరుకునేవాళ్లమయితే వారినందరినీ కేవలం అక్షరాస్యుల్ని చేయడమేకాక వాళ్లను నిజమైన అర్థంలో విద్యావంతుల్ని చేయాల్సి ఉంది.** ఇటువంటి కోరికతోనే నేనూ, అయ్యదేవర కాళేశ్వరరావు మాతృభాషలో ప్రామాణిక గ్రంథాలను వెలువరించసాగాం. 1931-32 మధ్యకాలంలో వెల్లూరు కారాగారంలో ఉండగా నేను పన్నెండు పుస్తకాలకు పైగా రాశాను. అలాగే 1943-44 మధ్య కాలంలో కూడా. అయితే వాటిల్లో నాలుగు మాత్రమే ప్రచురించబడ్డాయి. **1)హరిజన నాయకుడు 2) ఆధునిక రాజకీయ సంస్థలు** (Modern Political Institutions) **3) రైతులు, కమ్యూనిస్ట్‌లు** (Kisans and Communists) **4) పాకిస్థాన్.** తర్వాత **ఈ రంగంలో ఆంధ్రగ్రంథాలయ సంఘానికి చెందిన పాతూరి నాగభూషణం గారి కృషి నిరుపమానం.** ఆయన వ్యవసాయ విషయాలపై **జోగరాజు గారి** అనేక గ్రంథాలు ప్రచురించారు. అలాగే పశువులకు సంబంధించిన ఆయుర్వేద విజ్ఞానంపై తెనాలి నుండి **శ్రీరాములు గారు** పది పుస్తకాలకు పైగా రాశారు. నా మిత్రులు, సమర్థ హిందీ ప్రచారకులు **ఎం. సత్యనారాయణ** తెలుగులో విజ్ఞాన సర్వస్వాన్ని



పన్నెండు భాగాలుగా ప్రచురించారు. తణుకుకు చెందిన జగ్గన్న శాస్త్రి గారు రాజకీయ అంశాలపై ఓ ఇరవైకిపైగా అనువాదాలు అందించారు. విజయరాజ్ కుమార్ నా పుస్తకాలను, రాజాజీ పుస్తకాలను కొన్నింటిని అనువదించారు. 1930 నుండి కొన్ని ప్రాంతాల్లో కొన్ని సంస్థలు ప్రముఖులను తీసుకొచ్చి అనేక ప్రసంగాలు చేయించేవారు.

పూనాలోని **'స్ప్రింగ్ లెక్చర్స్'**, వేటపాలెం వారి **'సాహిత్య అకాడమీ'** ఆ కోవకు చెందిన సంస్థలే. నేను 1938, 1957 సంవత్సరాల్లో వేటపాలెంలోనూ, 1939లో పూనాలోనూ ఆయా సంస్థల్లో ప్రసంగించాను. అటువంటి అవకాశం లభించడం గౌరవప్రదమే. **అయితే ఈ ఉద్యమానికి ప్రభుత్వ తోడ్పాటు అంతగా లభించలేదు.** అయితే మైసూరులో కార్యాచరణ కొంత మెరుగ్గా ఉంది. అక్కడ ఉపాధ్యాయులు చురుగ్గా పాల్గొన్నారు. అనేక పుస్తకాలు ప్రచురించబడ్డాయి. నేను 1946లో అప్పటి విద్యా శాఖామాత్యులు అవినాశలింగం చెట్టియార్‌తో సంప్రదించి **గాడిచర్ల హరిసర్వోత్తమరావు** గారి సహకారంతో దక్షిణాది రాష్ట్రాల్లో వయోజన విద్యా కృషిలో సమన్వయం సాధింపజూశాను. అయినా **ఇంతటి మహత్తర ఉద్యమం జాతి అవసరాల్లో కనీసం నూటికి ఒక వంతు కూడా తీర్చలేకపోయింది.** నిరక్షరాస్యత నిర్మూలించబడలేదు. కమ్యూనిస్ట్ చైనా, రష్యాలు తొలి దశాబ్దంలోనే అంతటి ప్రగతిని సాధిస్తే మరి స్వాతంత్ర్యం సాధించి 17 ఏళ్లయినా భారతదేశం ముందడుగు వేయలేకపోవడానికి కారణమేమిటి? 1947కు ముందు ఆదరించినట్లు విద్యార్థులు, యువత ఈ ఉద్యమాన్ని ఎందుకు ఆదరించడం లేదు? ఈ ఉద్యమానికి అనుబంధంగా ఉన్న అనేక సంస్థలకు ప్రభుత్వం సాయం అందిస్తూనే ఉంది. అరకొర జీతాలతో మూడు ప్రణాళికల కాలాన్ని నెట్టుకొచ్చిన ఉపాధ్యాయుల నుండి అంతకుమించి సహకారాన్ని పొందడం కుదరదేమో! యువత స్వరాజ్యానంతరం ఉద్యోగాల వేటలో ఉండిపోతున్నారుకానీ స్వచ్ఛంద సేవ పట్ల మక్కువ చూపడంలేదు. ఇక దేశ నాయకుల్లో అత్యధికులకు పదవుల వెంపర్లాటేకానీ విద్యార్థుల్ని, యువతను ఈ ఉద్యమం వైపుగా పయనింపచేద్దామనే ఉద్దేశ్యమే లేదు. నా వరకూ నేను భారత రైతు విద్యాలయం, దాని శాఖలు, వేటపాలెంలోని సరస్వతీ నికేతనం, ఆంధ్ర గ్రంథాలయ సంఘం ద్వారా నా వంతు కృషి కొనసాగిస్తూనే వస్తున్నా.

ఈ వయోజన విద్యా ఉద్యమానికి శాశ్వత స్థాయి కల్పించాలనే ఉద్దేశ్యంతో నేనూ, కీ.శే. ఎస్.సుబ్బారావు, గరిమెళ్ల సత్యనారాయణ, బి.హెచ్.సత్యనారాయణ 1934లో **ఆంధ్ర వయోజన విద్యా సంఘం** అనేదాన్ని నెలకొల్పాం. అది 1947 వరకూ బాగానే

వడిచింది. అయితే సుబ్బారావు గారి మరణంతో అది మూలబడింది. ఈ ఉద్యమ ప్రాశస్త్యం భారతదేశమంతటా ప్రచారం కావాలనే ఉద్దేశ్యంతో **'ఆల్ ఇండియా అడల్ట్ ఎడ్యుకేషన్ మూవ్‌మెంట్', 'ఎడల్ట్ ఎడ్యుకేషన్ ఫర్ సౌత్ ఇండియా'** అనే పుస్తకాలు రాశాను. వాటికి పత్రికల్లో మంచి సమీక్షలు వెలువడ్డాయి. మన భారతదేశంలోనే కాకుండా బర్మా, మలయా, సింహళంలో కూడా పేరొచ్చింది. పలు రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాధికారులకు నా పుస్తకాల ప్రతులను పంచింది. 1939లో బర్మా విద్యావేత్త భారతీదేవి గారిని ఈ రంగంలో చేసిన కృషికి సన్మానించినప్పుడు మా సేవలు వృధాకానందుకు ఆమె ముచ్చటపడింది. పైగా రంగూన్‌లోని ఒక లైబ్రరీలో నేను రాసిన పుస్తకాలున్నాయి. వాటిపై నా సంతకం తీసుకున్నారు. 1954లో కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర విశ్వవిద్యాలయానికి విస్తరణ విద్యా కోర్సుల నిర్వహణకుగాను ఆర్థిక సాయం అందించింది. **ఆగ్నేయ ఆసియాలోనూ, భారతదేశంలో వయోజన విద్యావ్యాప్తికి యునెస్కో కృషికి నా సహకారాన్ని అందిస్తూ ఉండేవాడిని.**

ప్రచురణలు

ఈ ఐదేళ్ల కాలంలో (1936-40) నేను రైతు ఉద్యమానికి సంబంధించి కొన్ని ముఖ్యమైన పుస్తకాలు ఆంగ్లంలో రచించాను. దేవీజీ సహకారంతో 1936లో మద్రాస్ నుండి తెలుగు వారపత్రిక 'వాహిని' అనే దాన్ని ప్రచురించసాగాం. 1936లోనే **'అధునిక భారత రైతు'** ప్రచురించాం. 1938లో **'కిసాన్ స్పీక్స్', 'కిసాన్ ఉద్యమ చరిత్ర', కాంగ్రెస్-రైతులు', 'కిసాన్ కరదీపిక'** గ్రంథాలు ప్రచురించడం జరిగింది. రైతు పోరాట యోధుడు, కవి శెట్టిపల్లిపై ఒక స్మృతి సంచికను వెలువరించాం. **'వాహిని'** సంపాదకులే పైరచనలన్నింటికీ సంపాదకునిగా వ్యవహరించారు. రైతు గీతాలను ఆంగ్లంలోకి నేను అనువదించాను. వాటిని కాన్‌టెంపరరీ ఇండియాలో ప్రచురించారు. 1938లో నా సంపాదకత్వాన **'సైనిక్'** పత్రిక రైతులపై ప్రత్యేక సంచికను ప్రచురించింది. ఇవన్నీ రైతు ఉద్యమాన్ని బాగా ప్రచారంలోకి తెచ్చాయి. కమ్యూనిస్ట్‌ల వల్ల అటు రష్యాలోనూ, ఇటు ఇతర దేశాల్లోనూ రైతులకు పొంచి ఉన్న ప్రమాదాన్ని వెల్లడిస్తూ **'కిసాన్ అండ్ కమ్యూనిస్ట్స్'** అనే ఆంగ్ల గ్రంథం రాయగా దాన్ని 1946లో తెలుగులోకి అనువదించడం జరిగింది.

20

భారతీయ శాస్త్రజ్ఞులతో భావ వినిమయం

కొద్ది సంవత్సరాల తర్వాత అహ్మదాబాద్‌లో నెలకొల్పబోయే అణు విద్యుత్తు కేంద్రం నుండి ఎంత చౌకగా విద్యుత్తును తయారుచేసి ఆ పట్టణానికి అందించవచ్చో పార్లమెంట్ సభ్యులకు **డాక్టర్ భాభా** 1957 లో వివరించారు. ఆ సందర్భంగానే ఆయనతో నాకు తొలి పరిచయం ఏర్పడింది. ఆ వివరణ విన్నప్పుడు ఆయనలోని వ్యాపార దక్షత కూడా అర్థమైంది. 1955లో మా పార్లమెంట్ సభ్యుల బృందం రష్యాకు బయలుదేరే ముందురోజు పండిట్ నెహ్రూ గారి ఇంటిలో **సరోజినీ నాయుడు గారి చిత్తరువు** చూశాను. అది నన్నెంతగానో ఆకర్షించింది. అది డాక్టర్ భాభా చిత్రించిన చిత్రమని నెహ్రూ గారి కుమార్తె శ్రీమతి ఇందిరా గాంధీ చెప్పింది. నేను ఉబ్బితబ్బిబ్బవుతుంటే ఆమె ఇంకా ఏమన్నదో తెలుసా – 'మీకు తెలియదా? **ఆయన వీణ ఎంత బాగా వాయిస్తారో!**'. కనుక ఆయన బొంబాయి నుండి కైరో వరకూ మా విమానంలోనే పయనించడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. కైరో విమానాశ్రయంలో మేము అనేక విషయాలపై మాట్లాడుకున్నాం. ఆయన విమాన ప్రమాదంలో మరణించినప్పుడు

విజ్ఞాన ప్రపంచానికి అంతులేని నష్టం వాటిల్లింది. వైజ్ఞానిక, పారిశ్రామిక పరిశోధనా విభాగాన్ని రెండుగా విభజించడం జరిగింది. 1) అణు పరిశోధన 2) శాస్త్రీయ పరిశోధన. ఆ రెండు విభాగాలు కలసి ఉన్నప్పుడు ఆ విభాగాధిపతి పేరెన్నికగన్న శాస్త్రజ్ఞుడు డాక్టర్ **శాంతి స్వరూప్ భట్నాగర్**. ఆయన పంజాబ్ రాష్ట్రానికి చెందినవాడు. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో అనేక కేంద్ర పరిశోధనా సంస్థలు నెలకొల్పేందుకు ఎంతో సాయం అందించాడు. **కరైకుడిలో నెలకొల్పిన విద్యుత్తు-రసాయనిక**

పరిశోధనా సంస్థకు నేను ప్లానింగ్ కమిటీ సభ్యుణ్ణి. ఆయన భావనా పటిమను ప్రేరేపించి, వ్యాపార ఉత్సుకతను రేకెత్తించి చివరకు శాస్త్రీయ ఉత్సాహాన్ని ప్రదర్శించి **డాక్టర్ అలగప్ప చెట్టియార్**ను ఆ సంస్థకు వ్యవస్థాపకునిగా చేసి ఆయన దానికి ఆనాడు ఇరవై లక్షల రూపాయలు, వంద ఎకరాల పొలం విరాళంగా ఇచ్చేటట్లు చేశారు. తర్వాత ఆ సంస్థ కార్యకలాపాల్లో అలగప్ప జోక్యం ఇసుమంతైనా లేకుండా చూడగలిగారు. ఆయన గారి ఈ పోకడల్ని చూసి గొప్ప పరిపాలనా దక్షుడనుకున్నా. ఒక పర్యాయం ఆయన ప్రసంగం విన్నాను. శాస్త్ర, సాంకేతిక విషయాల్లో నావంటి ఏమీ తెలియనివాళ్లకు కూడా జటిలమైన విషయాలను వివరించి చెప్పగల ఆయన శక్తికి ఆశ్చర్యపోయాను.

ఆయనతో వాక్‌పటిమలో సరితూగగల మరో శాస్త్రజ్ఞుడు **డాక్టర్ సి.వి.రామన్.** ఆయన్ను 1928లో పచ్చయప్ప కళాశాలలో విద్యార్థి సంఘ వేదుకల్లో పరిచయం చేస్తూ తొలిసారిగా కలిశాను. ఆయన రామన్ ఎఫెక్ట్ అనే దాన్ని కనుగొనడం ద్వారా బాగా కీర్తి గడించాడు. నాకు **రామన్ ఎఫెక్ట్** అంటే ఏమిటో అసలేమీ అర్థంకాలేదు. అయినా అది నేడు ఒక శాస్త్రీయ ఆవిష్కరణగా గుర్తింపు పొందింది. అణు ఆవిష్కరణతో శాస్త్ర జ్ఞానానికి మనం సాష్టాంగ నమస్కారం చేయాల్సి ఉంది. ఆయన తలపాగా కూడా ఆయన ప్రసంగమంత బాగా నచ్చింది.

1950 ప్రాంతాల్లో మేమిద్దరం బొంబాయి నుండి మద్రాస్ వరకూ కలసి ప్రయాణం చేశాం. పచ్చయప్ప కళాశాల సభ తర్వాత మేము చాలా ఎదిగాం–ఆయన శాస్త్రజ్ఞునిగా, నేను పార్లమెంట్ సభ్యుడిగా, కాంగ్రెస్ వాదిగా. ఆయన చెప్పేది అర్థమైనా కాకపోయినా ఆయన గొంతు వినసొంపుగా ఉండేది. అయితే ఆయన అనవసరపు భయాందోళనకు గురవుతూ రైలు పెట్టెలో నుండి ఎవరైనా పడిపోతారేమోనని మాటిమాటికీ ఎవరో తొంగిచూస్తున్న తలుపును మూసిరావడం నాకు చిత్రంగా తోచింది. ఎంత గొప్ప శాస్త్రజ్ఞులైనా ఇటువంటి వింత ప్రవృత్తులకు అతీతులు కాదు కాబోలు! మర్చేపోయా–ఆయన కుమారుడు కమ్యూనిస్ట్ కార్యకలాపాల్లో నిమగ్నమైన కారణంగా మాతో పాటు జైల్లో ఉన్నాడు. **రామన్‌కు కూడా వాళ్ల వృత్తిలో ఎక్కువమంది మాదిరిగానే ఇతర శాస్త్రజ్ఞులంటే అంతగా గిట్టేదికాదు.** అయితే దాన్ని ఆయన దాచుకునే ప్రయత్నం చేయలేదు. గణిత శాస్త్రజ్ఞుడు **రామానుజం ఒక్కడే ఇతరులను గురించి ఏ ఇబ్బందీ వెలిబుచ్చనివాడు.** అందుకే ఆయన ప్రాయంలో ఆయన మాకు ఆదర్శప్రాయుడు. తమిళనాడు నాయకులు కే.శే. **పుత్తరంగ ముదలియార్**, నేనూ కలసి బెంగుళూరులోని డాక్టర్ రామన్స్ ఇన్‌స్టిట్యూట్‌కు

ఆర్థిక సాయం అధికంగా అందేలా చూశాం. బెంగుళూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు టాటా సంస్థ అందించిన ఆర్థిక సాయం వల్ల మరిన్ని జాతీయ సంస్థలు అటువంటివి నెలకొల్పేందుకు స్ఫూర్తిదాయకమైంది. ఢిల్లీలోని నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ **ఎం.ఎస్.కృష్ణన్‌ను కరైకుడె సంస్థ మీటింగ్ సందర్భంగా ఒకసారి కలిశాను.** ఆయన ఒక గొప్ప సంస్కృత పండితునిగా నాకు కనిపించారు. ఆయన డాక్టర్ రామన్‌కు పూర్తిగా భిన్నం. అయినా ఆయన తన గురువు కనిపెట్టిన 'రామన్ ఎఫెక్ట్' శాస్త్రీయంగా గొప్పతనాన్ని, ప్రాముఖ్యాన్ని వివరించాడు. ఆయన నాకు ఉపనిషత్తుల కాలంనాటి గురుకుల శిష్యునిగా కనిపించేవాడు.

తోళ్ల పరిశ్రమకు చెందిన పరిశోధకులు, **శేషాచలం**, ఆయన సహోద్యోగి **శివయ్య**లు నాకు 1921 నుండి మంచి మిత్రులు. క్రోమ్ లెదర్ అన్నది వాళ్ల కృషి ఫలితమే. ఇటీవల కాలంలో ఈ రంగంలో **డాక్టర్ నాయుడమ్మ** కృషి ఎన్నదగినది. ఆయన ఎలవర్రు గ్రామానికి చెందిన రైతు బిడ్డ. అది మా నిడుబ్రోలు గ్రామానికి పొరుగునే ఉంది. 35 యేళ్ల వయస్సుకే ఆయన మద్రాస్‌లోని నేషనల్ లెదర్ ఇనిస్టిట్యూట్‌కు డైరెక్టరయ్యారు. **ఈ ముగ్గురు శాస్త్రజ్ఞుల ప్రత్యేకత ఏమిటంటే ముగ్గురూ కూడా రైతు బిడ్డలే. పల్లె ప్రాంతాల నుండి వచ్చినవారే.**

నేను ఢిల్లీలో మరొక ఆంధ్ర శాస్త్రజ్ఞుని కలుసుకున్నా. ఆయన పేరు **స్వామిరాజు**. సన్యాసం పుచ్చుకున్నాడు. ఉపనిషత్తులలోని వైజ్ఞానిక సత్యాలను అధ్యయనం చేశాడు. యుద్ధకాలానికి పూర్వపు జర్మను శాస్త్రజ్ఞులను బాగా ఆకర్షించాడు. ఆయన నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ డిప్యూటీ డైరెక్టరయ్యాడు. ఆయన కనుగొన్నదేమిటో నాకు ఖచ్చితంగా తెలియకపోయినా ప్రతి గొప్ప శాస్త్రజ్ఞుణ్ణి మనం గౌరవించాల్సి ఉందనేది చాలు నేను ఆయన పట్ల ప్రదర్శించే ఆదరానికి. మరో ఆంధ్ర శాస్త్రజ్ఞుడు, పెన్సిలిన్ ఆవిష్కర్త కీ.శే. **ఎల్లాప్రగడ సుబ్బారావు** గారు. ఆ ఆవిష్కరణ వార్తను మేము యుద్ధ సమయంలో ఖైదీలుగా ఉండి విని సంబరపడ్డాం. తర్వాత కాలంలో **డాక్టర్ కామేశం** (రామన్ విద్యార్థి), పురాతత్వ శాస్త్రాన్ని అధ్యయనం చేసిన **కె.సూర్యనారాయణ** గార్లతో పరిచయం లభించింది. వాళ్లు నాకు పచ్చయప్ప కళాశాలలో ఉద్యోగం చేసిన రోజుల నుండీ తెలుసు.

దురదృష్టమేమంటే కావాల్సినంతగా భారతీయ భాషల్లో విజ్ఞాన సాహిత్యం లభించడంలేదు. ఈ శతాబ్దపు తొలి రెండు దశకాల్లో కొద్దిమంది శాస్త్రజ్ఞులు తెలుగులో మంచి గ్రంథాలు బాగానే వెలువరించారు. అవి బాగా ప్రచారంలోకి వచ్చాయి. ఆధునిక విజ్ఞానం గురించి

ప్రాథమిక జ్ఞానాన్ని పంచాయి. అయితే కొద్దిమంది శాస్త్రజ్ఞులు మాత్రం మన భాషలో పుస్తకాలు రాసేందుకు అసలు పూనుకోలేదు. **కె. కొండయ్య** అనే లెక్చరర్ బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో పనిచేసేవాడు. ఆయన తెలుగులో ఒక మంచి వైజ్ఞానిక పత్రిక నడిపేవాడు. **జోగిరాజు** గారనే వ్యవసాయ శాస్త్రవేత్త తెలుగులో వైజ్ఞానిక పత్రికను నడిపేందుకు తగిన సమయాన్ని, ధనాన్ని వెచ్చించే వాడు. ఆయన వ్యవసాయ శాస్త్రానికి సంబంధించిన కొన్ని పుస్తకాలను తెలుగులో రాశాడు. ఇటీవల కాలంలో శాస్త్ర జ్ఞానానికి చెందిన విజ్ఞాన సర్వస్వాలు తమిళం, తెలుగు, మరాఠీ, హిందీ భాషల్లో లభిస్తున్నాయి. భారతీయుల్లో అధ్యయనం, శాస్త్ర జ్ఞానం పట్ల జిజ్ఞాస పెరగాల్సి ఉంది. **సోవియట్ రష్యాలో మాదిరిగా మన శాస్త్రజ్ఞులకు, ఇంజనీర్లకు గౌరవప్రదమైన వేతనాలు ఏనాటికి లభిస్తాయో.** అయితే పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ శాస్త్రీయ పరిశోధనల పట్ల, శాస్త్రజ్ఞుల పట్ల చూపుతున్న శ్రద్ధ కొనియాడదగింది. **డాక్టర్ కె.ఎల్.రావు గారితో నా మైత్రి వృధా కాలేదు. అలాగే గొప్ప ఇంజనీర్ డాక్టర్ ఖోస్లా గారితో కూడా నా మైత్రి వృధా కాలేదు.** వీరిద్దరూ నాగార్జున సాగర్ నిర్మాణంలో పోషించిన పాత్ర నిరుపమానం. స్వతంత్ర భారతంలో అనేక నీటిపారుదల ప్రాజెక్టులు, వరద నిరోధక ప్రాజెక్టులు సమకూరాయి.

విశ్వవిద్యాలయ డిగ్రీలు సంపాదించుకున్నా నిత్య పరిశోధకునిగా భూ రసాయన శాస్త్రంలో నిమగ్నమై **డాక్టర్ బి.వి.నాథ్** ఎంతో ఎత్తుకు ఎదిగారు. జాతీయ పరిశోధనా సంస్థకు డైరెక్టర్ అయ్యారు. ఆయనకు **వి.పి.మీనన్** మాత్రమే సాటి అనే పేరు తెచ్చుకున్నారు. వి.పి.మీనన్‌కు డిగ్రీలు లేకపోయినా పరిపాలనా దక్షునిగా మంచి పేరు సంపాదించుకున్నారు. నాకు వ్యవసాయం పట్ల గల శ్రద్ధ కారణంగా ఒకరు, సర్దార్ పటేల్‌తో నాకున్న సాన్నిహిత్యం కారణంగా మరొకరు నాకు చేరువయ్యారు.

స్వతంత్ర భారతదేశంలో విజ్ఞాన పరిశోధనకు కావాల్సినంత ప్రోత్సాహం లభిస్తున్నది. శాస్త్రజ్ఞులను మెచ్చుకోవడం జరుగుతున్నది. మరీ ముఖ్యంగా స్పుత్నిక్ యుగం ప్రారంభం నుండి భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ నూతన ప్రయోగాలు, ఆవిష్కరణలను ప్రజలు అర్థంచేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి ఉత్సుకత భారతీయ మేధావుల విషయంలో సర్వ సాధారణమే. అయితే రామానుజం, జె.సి.బోస్, పి.సి.రే, మేఘనాథ సాహా, రామన్ వంటి ఆధునిక శాస్త్రజ్ఞులు హఠాత్తుగా రంగంలోకి దిగడంతో ఆ ఉత్సుకతకు కొత్త ఊపు లభించినట్లయ్యింది.

ఇంగ్లీష్‌లోనూ, స్థానిక భాషల్లోనూ ప్రచురితమయ్యే దిన పత్రికలు శాస్త్రజ్ఞుల

నివేదికలు, చర్చలు విజ్ఞాన శాస్త్రం గురించి, శాస్త్రవేత్తల గురించి మేలైన సమాచారాన్ని వ్యాప్తి చెందేటట్లు చేస్తున్నాయి. అది శాస్త్ర జ్ఞాన అవగాహనకు ఎంతగానో దోహదపడుతున్నది. అయితే తనకు అధికంగా వేతనం రావాల్సి ఉందని, ప్రమోషన్ దక్కాల్సింది దక్కలేదని ఆత్మహత్యకు పాల్పడ్డ వ్యవసాయ శాస్త్రజ్ఞుడు **డాక్టర్ జోసెఫ్**ను గురించి తెలుసుకున్న తర్వాత భారతదేశం తన శాస్త్రజ్ఞుల్ని గౌరవించడం మాట అటుంచి వాళ్లను కనీసం పట్టించుకోవడంలేదని తెలియవస్తుంది. వాళ్ల పట్ల ఉదారంగా వ్యవహరిస్తున్నదా అనే సందేహాలు పొడచూపక మానవు. మాటిమాటికీ మంత్రులు, అధికారులు పరిశోధకుల రోజువారీ వేతనాలు, ప్రమోషన్లు వంటి విషయాల్లో ఎంతగా కల్పించుకుని, ఎంతగా విసిగించేదీ ఫిర్యాదుల రూపంలో పార్లమెంట్ ముందుకు వస్తూ ఉండేవి.

నేను అప్పుడప్పుడూ రేడియం కనిపెట్టిన **క్యూరీ దంపతుల గురించి, ఐన్‌స్టయిన్ గురించి చదువుతూ ఉంటాను. డాక్టర్ నార్లికర్** కూడా **న్యూటన్, ఐన్‌స్టీన్** సిద్ధాంతాల మధ్య సమన్వయాన్ని తెచ్చినందుకు 30 సంవత్సరాల వయస్సుకే రామానుజం అంతగా కీర్తి గడించాల్సింది. ఉపనిషత్తుల కాలంనాటి భారతీయ శాస్త్రజ్ఞులు ఈ ప్రపంచంలో జీవాణువులేని పదార్థమంటూ ఏదీలేదని విశ్వసించే వారు. అటువంటి భావనలైనే అహింసపై జైనుల విశ్వాసం ఆధారపడిందనేది నా ఆలోచన. వృక్షాలు కూడా స్పందిస్తాయనేది **జె.సి.బోస్** వాదన. మహాత్మాగాంధీ అహింసా వ్రతం కూడా అటువంటి జీవన సూత్రానికి అనుగుణంగానే ఉంది. ఈ విశ్వమే సర్వానికి మూలం, అదే సర్వస్వమూ అన్న ఆలోచనే వేలమంది రుషుల, సన్యాసుల నమ్మిక. దాన్ని సాధించే తపస్సులోనే వారి జీవితాలను ధారపోశారు.

21

గాంధీజీ -యునైటెడ్ ఫ్రంట్ యుగం

యునైటెడ్ ఫ్రంట్ కాలంలో (1936-40) గాంధీజీతో నా సంబంధాలు సామరస్య పూర్వకం గా ఎప్పటిలాగే కొనసాగడమే కాకుండా అవి మరింతగా పెనవేసుకుపోయాయి. **జయప్రకాశ్‌జీ** తన గ్రంథం "Why Socialism" అనే పుస్తకంలో వ్యక్తపరచినట్టుగానే నేను గాంధీజీ పక్షానే నిలిచాను. అఖిలభారత కిసాన్ కాంగ్రెస్‌కు నేను జనరల్ సెక్రటరీగా వ్యవహరిస్తున్న రోజుల్లో ఆ సంస్థ అధ్యక్షులు స్వామి సహజానంద అహింసా సిద్ధాంతాన్ని రైతు పోరాటాలకు అన్వయింపజేయడాన్ని ఎదుర్కొనే రోజుల్లో నేను గాంధీజీ పక్షాన నిలవడానికి కారణం ఆయన నా పట్ల చూపుతున్న ఆదరణే. కాంగ్రెస్ మంత్రి వర్గాలు అనేక పర్యాయాలు కిసాన్ కాంగ్రెస్‌కు ఎదురునిలిచాయి. కాంగ్రెస్ మంత్రి వర్గాలను గాంధీజీ బలపరుస్తున్నారు. అందువల్ల ఆయనకు కిసాన్ కాంగ్రెస్ అవరోధంగా కనిపించసాగింది. **రైతులోకానికి మంత్రి వర్గాలు సహాయం అందించే తీరు నత్తనడక చందంగా ఉంది.** ఉదాహరణకు జమీందారీ వ్యతిరేక చట్టం వస్తుందేమోనని జమీందార్లు అనేకమంది కౌలు రైతుల్ని వాళ్ల భూముల నుండి బయటకు వెళ్లగొట్టారు. ముఖ్యంగా ఈ పరిస్థితి ఉత్తరప్రదేశ్, బీహార్, ఆంధ్ర ప్రాంతాల్లో

నెలకొని ఉంది. పెద్దయెత్తున రైతుల్ని అలా జమీందారులు బయటకు పంపే పద్ధతిని ప్రభుత్వం అరికట్టాలని మేము కోరాం. ప్రభుత్వం దాన్ని పెడచెవిన పెట్టింది. జమీందారీ విధానం రద్దుకు స్పష్టమైన చర్యలు చేపట్టమని మేము కోరాం. అయితే మంత్రి వర్గాలు కంటి తుడుపు చర్యలతో సంతృప్తి చెందసాగాయి. **మోయలేని రుణ భారం నుండి రైతులకు రక్షణ కల్పించేందుకు అప్పుల వసూళ్లపై మారటోరియం విధించమన్నాం.** అప్పటి మద్రాస్ రాష్ట్ర ప్రీమియర్ రాజాజీ ధైర్యంగా ముందుకొచ్చి మారటోరియం విధించడం జరిగిందికానీ దాన్ని ఆయన విరమించుకోవాల్సి వచ్చింది. ఎవరు చెల్లించాల్సిన రుణమైనా వడ్డీతో కలిపి అప్పుగా పుచ్చుకున్న అసలుకు రెండు రెట్లకు మించరాదన్న ఆయన పరిష్కారం రైతులకు బాగానే ప్రయోజనాన్ని చేకూర్చిపెట్టింది. ఈ విషయంలో కిసాన్ కాంగ్రెస్ బాగానే సంతృప్తి చెందింది. అయితే శిస్తు వసూళ్లను అంతగా తగ్గించలేదు. ఏదిఏమైనా గమనించదగిన మేరకు కాంగ్రెస్ మంత్రి వర్గాలు రైతులను కష్టాల నుండి గట్టెక్కించాయనే తలంపులో అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ తరపున నా నైతిక మద్దతును ప్రకటించాను. అప్పటికే రాజకీయంగా ఐక్య సంఘటన ఈ విషయంలో విభేదించి నందున నేను అఖిలభారత కమ్యూనిస్ట్ పార్టీతో ఘర్షణకు దిగాల్సి వచ్చింది. అదేవిధంగా అటువైపు మొగ్గుచూపే స్వామీజీతో కూడా.

నేను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశం జరిగినప్పుడల్లా గాంధీజీని కలుస్తూ ఉండేవాణ్ణి. అర్నెల్లకొకసారైనా ఆయన్ను కలసి రైతుల సమస్యలను, ఇతర సమస్యలను చర్చించాలని కోరారు. ఒక పర్యాయం ఏడు మాసాలైనా ఆయన్ను కలిసేందుకు కుదరలేదు. సరే, నేను హుటాహుటిన ఢిల్లీలో ఆయన ఎక్కిన రైలు పెట్టెను చేరుకున్నాను. ఆయన చిరునవ్వులు చిందిస్తూ ఉన్నారు. నన్ను ఆ విధంగా ఎత్తిపొడుస్తున్నారనుకున్నా. అయితే తర్వాత తెలిసింది అది ఆయన మౌనవ్రతం పాటిస్తున్న సందర్భమని. మా మనసులు ఆ విధంగా ఎంతగానో పెనవేసుకుపోయాయి. వెంటనే నేను సేవాగ్రామ్‌కు బయలుదేరి వెళ్లాను. అప్పుడు నాతో **దీనాస్టాక్** కూడా ఉన్నారు. అప్పుడు రాజకీయ విషయాలు, రైతుల విషయంలో, శ్రామిక రంగాల్లో యునైటెడ్ ఫ్రంట్ వల్ల ఏర్పడే చిక్కులు, ప్రమాదాల గురించి మనస్సు విప్పి మాట్లాడుకున్నాం. అప్పుడు ఆయన నాకు హెచ్చరికలు జారీ చేసినట్లుగా చెప్పారు **–మనం మన ప్రజా సంస్థలను సత్యాగ్రహం, అహింసాత్మక దేశభక్తి ప్రపూరిత విధానాలతో జోడించనట్లయితే మన అంతర్గత ఆత్మను కోల్పోయే ప్రమాదం వాటిల్లుతుందని.**

1938లో గాంధీజీ వద్దకు నాపై ఫిర్యాదు వెళ్లింది. వర్కింగ్ కమిటీ నాపై మోపిన నిందారోపణ ఏమంటే కృష్ణా జిల్లాలో ఒక జమీందారుకు వ్యతిరేకంగా నేను రైతుల్ని హింసాత్మక చర్యలకు పురికొల్పు తున్నానని.

'ఈ అభియోగంలో వాస్తవ ముందా?' అన్నారు గాంధీజీ

'ఉంది' అన్నాను.

'మరి దీన్ని మీరెలా సమర్థిం చుకుంటారు?'

'హింసాత్మక చర్యలకు పాల్పడింది రైతులు కాదు, జమీందారే. నేను వాళ్లు గౌరవప్రదంగా బతిక డానికి తలవంచాల్సిన పనిలేదన్నాను. అటువంటిది పునరావృతం కాకుండా చూసుకోమన్నాను'

ఆయన పెద్దగా నవ్వి అన్నారు: **'మొత్తంమీద రంగా అంటే అది, రైతుల మీద ఈగ వాలనివ్వదు'** తర్వాత సాగిన మందలింపు :

'కాంగ్రెస్ తరహా అహింసా విధానం అది కాదు'

'అలా అయితే కాంగ్రెస్ పద్ధతిలో అహింసా విధానాన్ని కొనసాగించాలంటే దాన్ని అర్థంచేసుకునేందుకే రైతులకు ఏండ్లూ పూండ్లూ పడతాయి'

చివరకు గాంధీజీ ఎంతో ప్రేమతో తన వేలును నాకు చూపుతూ అద్దంగా ఊపసాగాడు.

గంటసేపు సాగిన చర్చలో సుభాష్‌బాబు కూడా అక్కడే ఉన్నారు. నా సాహసానికి, సచ్ఛీలతకు ఆయన నుండి ప్రశంసలు పొందాను. నేను గాంధీజీ విశ్వాసాన్ని, ప్రేమను అంతగా ఎందుకు చూరగొనగలిగానన్నది తర్వాత ఎన్నడూ సుభాష్‌బాబుకు ఆశ్చర్యదాయకంగా కనిపించలేదు.

22

దేవీజీ సేవలు. సామ్రాజ్యవాదులు, కమ్యూనిస్ట్‌లతో కలహం (1940-44)

నేను కారాగారంలో ఉన్నందువల్ల నాకు కొన్ని ఊరడింపులు లభించేవి. కారాగారం వెలుపల ఉన్న దేవీజీని అనేక సమస్యలు చుట్టుముట్టేవి. ఉదాహరణకు జైలు వెలుపల విశ్వవిద్యాలయాల్లోని విస్తరణ విద్యా తరగతుల్లా 1944లో తంజావూరు జైల్లో నాతోపాటు బందీలుగా ఉన్న మూడొందలమంది అనుభవజ్ఞులైన, కాకలుతీరిన స్వాతంత్ర్య సమరయోధులకు ఎన్నో మాసాలపాటు నేను క్లాసులు నిర్వహించాను. వాళ్లకు బోధించింది దాని సారాంశం ఈ కింది పుస్తకాల్లో లభిస్తుంది.

1) World Role of National Revolution **(జాతీయ విప్లవంలో ప్రపంచ పాత్ర).** 2) Outlines of National Revolutionary Path **(జాతీయ విప్లవ పథ రూపురేఖలు).** 3) Why Four Crore Artisans Hail Gandhian Plan) **(నాలుగు కోట్ల చేతివృత్తులవారు గాంధీ పథకాన్ని ఎందుకు ఆహ్వానిస్తున్నారు).** 4)Pak [illegible]

పాకిస్థాన్). ఇవిగాక ఇంకా అచ్చుకాని నా పరిశోధక రచన "Manifestations of America and USSR and Beware of their Struggle for World Domination" **(అమెరికా, రష్యాల అభివ్యక్తీకరణలు - ప్రపంచ ఆధిపత్యం కోసం పెనుగులాట - తస్మాత్ జాగ్రత్త)**

అనేక చారిత్రక అంశాలను పరిశీలిస్తూ, సోవియటిజమ్‌ను అధ్యయనం చేస్తూ, అనుభవజ్ఞులైన వాళ్లతో చర్చిస్తూ ఉండడం వల్ల, వాళ్లిచ్చిన సలహాలను పరిగణనలోకి తీసుకోవడం వల్ల నా భావాలు సరైనవా, కావా అని నిగ్గుతేల్చుకోగలిగేవాణ్ణి. నాతో జైలులో ఉన్నవాళ్లంతా అనుభవజ్ఞులైన సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులు. వాళ్లు ఆనాటి సువిశాల మద్రాస్ ప్రెసిడెన్సీలోని నాలుగు భాషా ప్రాంతాలకు చెందినవారు.

1940 మార్చి 30వ తేదీ నుండి నవంబర్ 1944 వరకూ జైలులోనే ఉన్నా. (1942లో కొద్దికాలం తప్ప) ఆ సుదీర్ఘ కాలంలో నాకేమయ్యింది, నా ఆలోచనలు ఎలా ఉండేవన్నది విపులంగానే నేను రాసిన పుస్తకం **'రాజకీయ ఖైదీ జీవితం, ఆలోచనలు'** (Life and Thoughts of a Political Prisoner) లో పేర్కొన్నాను. అందులోని కొన్ని విషయాలు మాత్రమే మీ ముందుంచదలిచాను.

అతి ముఖ్యమైన అంశమేమంటే నేను క్రమబద్ధంగా, విమర్శనాత్మకంగా చేసిన మార్క్సిస్ట్ సిద్ధాంత అధ్యయనమేకాక పెట్టుబడిదారీ విధానానికీ, సామ్రాజ్యవాదానికీ, మార్క్సిస్ట్ సిద్ధాంతాలకు సంబంధించిన **నా ముఖ్య సిద్ధాంత గ్రంథమైన 'ప్రపంచ రైతుల లక్ష్యం' అనే దాన్ని తయారుచేయడం.**

నా ఈ కింది పుస్తకాలన్నీ ఆ సిద్ధాంతాన్ని బలపర్చేందుకు రాసినటువంటివే. అవన్నీ 1947-57 మధ్యకాలంలో ప్రచురించడం జరిగింది. ఆ పుస్తకాలేవంటే 1) Revolutionary Peasant (తిరుగుబాటు బాటలో రైతు) 2) Kisan and Communists (రైతులు, కమ్యూనిస్ట్‌లు) 3) Colonial and Coloured Peoples (వలస దేశాల తెల్లవారు కాని ప్రజలు) 4) The Credo of World Peasantry (ప్రపంచ రైతుల లక్ష్యం)

నాకు నేను నచ్చచెప్పుకోగలిగాను. **20వ శతాబ్దపు అతి పెద్ద సమస్య ప్రపంచ కార్మిక కొరతని అరికట్టడంకాదు. అంతకు మించిన రైతుల దోపిడీని అరికట్టాలి. ప్రపంచంలోని మిగిలిన వాళ్లందరూ కలసి రైతుల్ని పట్టపగలే నిట్టనిలువునా దోచేస్తున్నాయి.**

కనుక విప్లవకారులందరూ దాన్ని అరికట్టేందుకు కలసికట్టుగా కృషి చేయాల్సి ఉంది. నా దృష్టిలో కేవలం సోషలిస్ట్ ప్రభుత్వాలు ఏర్పర్చి వాటిని నిర్వహించినందువల్ల ప్రపంచ శాంతి చేకూరదు. ఆ సోషలిస్ట్ ప్రభుత్వాలు మూల ఉత్పత్తిదారులైన రైతుల దోపిడీని అరికట్టి వాళ్లపై నమ్మకం ఉంచి ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ, సహకార సంస్థల్లోనూ స్వేచ్ఛాయుత భాగస్వామ్యాన్ని కల్పించినప్పుడే అది సాధ్యం.

నిజమే, జైలు జీవితం వల్ల నేనూ చాలా ఇబ్బందులకు గురయ్యాను. అయితే ఇటువంటి ఉత్తేజమయ ఆలోచనలు, ఆసక్తిదాయక ప్రసంగాలు, ఆకట్టుకునే అధ్యయనాలు నేను చేయగలుగుతున్నాననే నాలోని భావనాపరమైన అమృతగుళికలు నాకు ఎంతో ఆనందాన్ని పంచేవి. అయితే భారతీదేవి గారికి ఇటువంటి నష్టపరిహారక అంశాలు అందుబాటులో లేవు. అందువల్లనే ఆమె మరింతగా క్షోభించేది.

నన్ను జైలుకు పంపిన తర్వాత తొలి ఆరు మాసాల కాలంలో ఆంధ్ర ప్రాంతంలో కిసాన్ ఉద్యమాన్ని నిలబెట్టేందుకు ఆమె ఒంటరి పోరాటమే చేయాల్సి వచ్చింది. 1940లో పోలీసు కాల్పులకు గురైన మంథస బాధిత రైతుల పట్ల ప్రజాభిప్రాయాన్ని, సానుభూతిని ప్రోది చేయాల్సి వచ్చింది. వాళ్లకు రక్షణగా నిలవాల్సి వచ్చింది. విరాళాలు పోగుచేసి బాధితుల్ని ఆదుకోవాల్సి వచ్చింది. ఈ పనులన్నీ చక్కబెడుతున్న శ్యాంబాబు కదలికల్ని తన పట్టణమైన ఇచ్ఛాపురానికే పరిమితం చేశారు. కొద్దివారాలకే అకస్మాత్తుగా ఆయన కన్ను మూశారు. లచ్చన్న గారి కదలికలు బారువ గ్రామానికే పరిమితం అయ్యాయి. ఆ విధంగా కార్యభారమంతా ఈమే మోయాల్సి వచ్చింది. రైతు రక్షణలో ఆమెతో చివరకు సహకరించగలిగింది **వల్లభరావు** గారే. ఆయన ఇప్పుడు జీవించిలేరు.

ఆమె విరాళాలు పోగుచేసి ఇడుపులపాడులో రైతు శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిబిరం నిర్వహించేందుకు ఎంతగా ఇబ్బందులకు గురికావాల్సి వచ్చిందో. తర్వాత 1941లో ఆమె మరో శిబిరాన్ని కడప జిల్లాలోని చెన్నూరులో నిర్వహించాల్సి వచ్చింది. దానికి **ఆర్.ఎన్.రెడ్డి** గారు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఆయన భారతదేశపు సామాజిక ఆర్థిక సమస్యలపై తమ సిద్ధాంత గ్రంథం **'ఇండియాస్ డెస్టినీ'** వెలువరించారు.

అదే సమయంలో ప్రభుత్వ రాజకీయ ఖైదు ఉత్తర్వులకు తలవొగ్గి నన్ను జైలు నుండి బయటకు రావాల్సిందిగా గాంధీజీ ఆదేశం. నేను కాంగ్రెస్ క్రమశిక్షణను వుల్లంఘించినట్లుగా ఆయన తాత్కాలికంగా అపార్థం చేసుకోవడం జరిగింది. ఇది రైతు కూలీలకు బాగా కోపం తెప్పించిన అంశం కావడంతో ఆమె ఎంతగానో

బాధపడింది. **సనాతన కాంగ్రెస్‌వాదులు గాంధీజీ దయారహితంగా నాపై చేసిన విమర్శలకు మురిసిపోతున్నారు.** దీనివల్ల గాంధీజీతో నా సంబంధాల్లో ముఖ్యమైన ప్రతిబంధకం ఏర్పడింది. దీని కోసమే వాళ్లింతో కాలంగా ఎదురుచూస్తున్నారని నాకు తర్వాత తెలిసింది. ఇదంతా మా కార్యకర్తలకు కోపం తెప్పించింది. అందువల్ల వీళ్లంతా ఇక కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకోవాల్సిందే అంటున్నారు. దేవీజీ ఇదంతా భరిస్తూ కాంగ్రెస్‌తో మా సహకారాన్ని, భాగస్వామ్యాన్ని కొనసాగించాల్సి వచ్చింది. గాంధీజీ తలపెట్టిన వ్యష్టి సత్యాగ్రహానికి సత్యాగ్రహుల్ని సమీకరించడం ఆగిపోకుండా చూడాల్సి వచ్చింది. ఇతర కాంగ్రెస్‌వాదులు ఎంతగా చీల్చే ప్రయత్నాలు చేసినా, గాంధీజీ ఎంత బాధాకరమైన తప్పుడు విమర్శలు గుప్పించినా బ్రిటిష్‌వాదులు తలపెట్టిన యుద్ధ ప్రయత్నాలను అడ్డుకునేందుకు తలపెట్టిన సత్యాగ్రహ సమరం కొనసాగాల్సిందేనని మేమిద్దరం కోరుకున్నాం. ఈ విధమైన కార్యక్రమాన్ని చేపట్టేందుకు మా కార్యకర్తల ఆమోదం కొరకు ఆమె కృషి చేయాల్సి వచ్చింది.

అనారోగ్య కారణాలపై సోదరులు జి.ఎల్.నారాయణ జైలు నుండి విడుదలయ్యారు. కాని ఆయన కదలికలు నిడుబ్రోలుకే పరిమితం కావడంతో ఆ ఆరు మాసాల కాలం ఆయన దేవీజీకి సహకారాన్ని అందిస్తూ ఉండేవాడు.

ఈలోపు దేవీజీ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని వరద బాధిత రైతుల్ని ఆదుకోవాల్సి వచ్చింది. ఆ కార్యక్రమంలో కొండ జాతుల సేవకు అంకితమైన పి.కోదండ రామయ్య, వల్లభరావు ఆమెకు ఆ కార్యక్రమంలో తమ చేయూతనిచ్చారు. అటువంటి మానవీయ సేవా కార్యక్రమానికి కూడా పలువురు కాంగ్రెస్ నాయకులు దూరంగా ఉన్నారు. అయినా ఆమె ప్రజల మద్దతును కూడగట్టి నిధులను, ఆహార ధాన్యాలను పోగుచేసి వరద బాధితుల్ని ఆదుకోగలిగింది. దీనివల్ల ఆమె పలు రాజకీయ పక్షాలు ఆమోదించే ప్రజా నాయకురాలిగా మారింది.

ఆమెకు ఆంధ్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్ష స్థానం దక్కింది. అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ కార్యదర్శుల్లో ఒకరు. నేను జైలు నుండి బయటకు వస్తే తనకు వెసులుబాటుగా వుంటుందని భావించి ఐదు వందల రూపాయల జరిమానా చెల్లించింది. **ప్రభుత్వం నన్ను విడుదల చేసినట్టే చేసి అదే రోజు మళ్లీ బైదు చేశారు.** నన్ను తిరుచునాపల్లి కారాగారం నుండి వెల్లూరు జైలుకు మార్చారని తెలిసి ఎంతగా నిరాశకు గురైందో.

కిసాన్ కాంగ్రెస్ అంతర్గత విభేదాలను చవిచూడాల్సి వచ్చింది. అది ఆంధ్రలో

కిసాన్ కాంగ్రెస్, కమ్యూనిస్టులు, బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ ఫార్వర్డ్ బ్లాక్ కలసికట్టుగా ఒక వైపున, మరో వైపున భారత కమ్యూనిస్ట్ పార్టీ. అయితే ఈమె మాత్రం యుద్ధం విషయంలో జాతీయ కాంగ్రెస్ వైఖరికి అనుగుణంగా కిసాన్ కాంగ్రెస్‌ను తీర్చిదిద్దాల్సి వచ్చింది. భారత కమ్యూనిస్ట్ పార్టీ 'ప్రజా యుద్ధం' నినాదం ఇస్తున్న సమయానికి కొంచెం ముందుగా ఈమె అఖిలభారత కిసాన్ కాంగ్రెస్‌కు అధ్యక్షురాలైంది. బెంగాల్, బీహార్, మధ్యప్రదేశ్ పర్యటనల్లోనూ, వామపక్షాల వారితో సంప్రదింపుల్లోనూ జి.ఎల్.నారాయణ తోడుగా నిలిచారు. **'ప్రజా యుద్ధం'** నినాదానికి కిసాన్ కాంగ్రెస్ వేదిక కాకుండా శాయశక్తులా కృషి చేశారు. అయినా అదంతా ఆమెకు ఒక కొత్త అనుభవం. ఆమె మూడు నెలలకు ఒకసారి మాత్రమే నన్ను జైల్లో చూడగలిగేది. అప్పుడు కూడా మా మాటల్ని రహస్యంగా వినేవారు. అయినా ఆమె సంయమనం పాటించగలిగేది.

చివరకు నేను విడుదలైన తర్వాత ఆమె చేసిన అప్పులు నా దృష్టికి తీసుకురావడం జరిగింది. నేను అరెస్ట్ కావడానికి ఎనిమిది మాసాల ముందు నుండే (1940లో) **నేను చేయాల్సి వచ్చిన విస్తృత పర్యటనల కోసం కొత్తగా అప్పులు చేయసాగాను. నేను నిర్బంధంలో ఉన్న సమయంలో 'గోభూమి అఖిలభారత, ఆంధ్ర కిసాన్ కాంగ్రెస్ కార్యకలాపాలకు కేంద్రంగా మారిపోయింది. అందువల్ల ఆమె ఎక్కువగా పర్యటించి ప్రచారం చేయాల్సి వచ్చింది. దాంతో పెద్దమొత్తంలో అప్పు చేయాల్సి వచ్చింది.** దానికితోడు 'వాహిని', 'క్రాంతి', 'గోభూమి' పత్రికా నిర్వహణలో వాటిల్లే నష్టంలో తన వంతు వాటా భరించాల్సి వచ్చింది. చివరకు అప్పులు తీర్చి ఆ ప్రెస్‌ను మా గ్రామం చేర్చేటప్పటికి తడిసిమోపెడయ్యింది. అంతగా అప్పులు ఎలా చేయగలిగింది? అన్ని ప్రజా కార్యక్రమాలను ఎలా నిర్వహించిందన్నది ఓ అద్భుతం. **ఈ కారణంగా జి.యల్.నారాయణ కూడా ఆర్థికంగా నష్టాలను భరించాల్సి వచ్చింది.** నేను విడుదలైనందువల్ల ఆర్థిక భారం పెరిగిందేకానీ తగ్గలేదు. కమ్యూనిస్ట్‌ల ప్రజా పోరాటాన్ని నిలిపేందుకు మేము ఆలోచనాపరంగా, ఆర్థికంగా పెద్ద బరువునే నెత్తికి ఎత్తుకోవాల్సి వచ్చింది.

1942 నవంబర్‌లో పది వారాల అజ్ఞాతవాసం తర్వాత నన్ను మళ్లీ నిర్బంధించడంతో దేవీజీ కొత్త బాధ్యతలు స్వీకరించాల్సి వచ్చింది. చేనేత కాంగ్రెస్‌ను, కిసాన్ కాంగ్రెస్‌ను పటిష్టపర్చేందుకు ఆమె బాగా కృషి చేసింది. తర్వాత రెండు సంవత్సరాల కాలంలో దేవీజీ అనేకమంది అజ్ఞాత జీవితం గడిపే కార్యకర్తలకు ఆశ్రయం

కల్పించే అసాధ్య బాధ్యతను నెరవేర్చాల్సి వచ్చింది. పోలీసుల కన్నుగప్పి వాళ్లను రక్షించుకోవాల్సి వచ్చింది. ఆమె చేనేత కాంగ్రెస్‌ను, కిసాన్ కాంగ్రెస్‌ను పటిష్టపర్చేందుకు గట్టిగా కృషి చేసింది. యుద్ధ సమయంలో ప్రభుత్వం ఆహార ఉత్పత్తులపైన, వస్త్రాలపైన దారుణంగా కంట్రోళ్లు విధించసాగింది. దాంతో మాటిమాటికీ ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తులు పంపడం, సదస్సులు నిర్వహించడం, తద్వారా చేనేత వారికి, రైతులకు అనుకూలంగా అభిప్రాయ సేకరణకు పూనుకోవడం చేయాల్సి వచ్చేది. అధికారుల దాష్టీకాల నుండి కూడా రైతులను రక్షించాల్సి వచ్చేది. దీనివల్ల ఆమెకు పలుకుబడి పెరిగింది. దీంతో మద్రాస్‌లోని ఉన్నతాధికారులు కూడా ఆమె సలహా స్వీకరించాల్సిన అవసరం ఏర్పడేది. ధాన్యం సేకరణ ధర నిర్ణయించే విషయంలో కూడా ఈమె మాటకు విలువనిచ్చేవారు. కాయినా రైతులు తమ మిగులు ఉత్పత్తుల్ని లాభసాటికాని ధరలకే విక్రయించాల్సి వచ్చేది. విద్యార్థి కాంగ్రెస్ కార్యకలాపాలను పర్యవేక్షించడంలో కూడా ఆమె శక్తి అనిరుపమానం. వి.ఎల్.సుందరరావు, జి.ఎల్.నారాయణ ఈ విషయంలో ఆమెకు ఎంతో సహకారాన్ని అందించారు. గుంటూరులో విద్యార్థి కాంగ్రెస్ ప్రాంతీయ సదస్సులో ఈమె చేసిన ప్రసంగం విద్యార్థి ఫెడరేషన్‌లోని కొందరిని విద్యార్థి కాంగ్రెస్ వైపునకు మళ్లేటట్లు చేసింది. ఆ సదస్సు తర్వాత అనేకమంది విద్యార్థి కాంగ్రెస్ నాయకులు నిర్బంధించబడి కారాగారవాసం అనుభవించారు.

జాతీయ స్థాయిలో యువజన ఉద్యమాన్ని నిడుబ్రోలుకు చెందిన **కె.అమ్మయ్య** నిర్వహించసాగారు. ఆయన రైతు శిక్షణా సంస్థలో తర్ఫీదు పొందినవారే. దానికీ దేవీజీ మద్దతు పలికింది. ఈమె విషయంలో ప్రజాదరణ ఎంతగా పెరగసాగిందంటే ఏదో ఒక మిష మీద నిర్బంధించలేనంతగా.

ఈమె కారణంగా కమ్యూనిస్ట్‌ల ప్రజా పోరాట ఉద్యమానికి గట్టి దెబ్బే తగిలింది. ప్రభుత్వానికి చెందిన ఖాళీ భూముల్ని పేద రైతులు సాగుచేసుకునేందుకు అనుమతించాలని కూడా ఈమె పోరాడింది. రాయలసీమ కరవు నివారణ కోసం, తుంగభద్ర ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఆమె ప్రజా ఉద్యమాన్ని ముమ్మరం చేసింది. అధిక ఆహార సాధన దిశగా ప్రభుత్వం అడుగులు వేయక తప్పలేదు.

తమాషా ఏమంటే కిసాన్ కాంగ్రెస్ ఈ విధంగా గాంధీజీ నిర్మాణ కార్యక్రమానికి ఒక ఆచరణాత్మక రూపాన్ని సంతరింపజేస్తూ ఉంటే అధికార వాంఛాపరులైన కాంగ్రెస్‌వారు, జైళ్లలో ఉన్నవారు, బయట ఉన్నవారు దాన్ని కేవలం రాజకీయేతర

సంస్కరణాత్మక కార్యక్రమంగా ముద్రవేసి బలహీనపర్చాలని చూసేవారు. 1943-45 మధ్యకాలంలో ఆంధ్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా గొర్రెపాటి వెంకట సుబ్బయ్య దేవీజీకి కొంత వెసులుబాటు కల్పించారు.

దేవీజీ మరో ప్రత్యేక బాధ్యతను తలకెత్తుకుంది. అది మేము ఆదర్శంగా స్వీకరించిన ప్రజాస్వామిక రైతు కూలీ, కళాకారుల, బుద్ధి జీవుల రాజ్యస్థాపన, దాని కోసం నేను చేస్తున్న అధ్యయనంలోని అభివృద్ధిని రైతుల, చేతివృత్తులవారి ఉద్యమాలను చేపట్టినవారందరికీ వివరించాలని సంకల్పించాం. ఆర్థిక దోపిడీని అరికట్టేందుకు మార్క్సువాదం చూపిన మార్గమొక్కటే చాలదని, స్వేదంకార్చేవాళ్లల్లో రైతులకు మించి దోపిడీకి గురయ్యేవారు వేరొకరు ఉండబోరనే సత్యాన్ని మార్క్సిజం గుర్తించలేక పోయిందన్నప్పుడు ఆమెలోనూ, మా కార్యకర్తల్లోనూ పెల్లుబుకిన ఆనందానికి అవధులులేకుండాపోయాయి. అది బయట స్వేచ్ఛగా తిరుగాడే కార్యకర్తలకేకాక జైళ్లల్లో మగ్గుతున్నవారికీ ఆనందాన్నే పంచింది. నా ఉత్తరాల ద్వారా, జైలు వద్ద సందర్శనల సందర్భంగా వెల్లడించేవాడ్ని.

జాతి పితతో కిసాన్ ఉద్యమ పిత

రైతు స్వయం ఉపాధి కోసం తన భూమిని తాను స్వయంగా దున్నుతూ పాటుపడుతూ వేరెవ్వరినీ ఆ సందర్భంగా దోపిడీకి గురికాకుండా చూడగలిగితే పెట్టుబడిదారులు, మార్క్సిస్ట్‌లు వాడే సామాన్య అర్థంలో అది సొంత ఆస్తి కాబోదు. ఎ శ్చ ము దే శా ల వా ర ు భావించినట్లు పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థలో సోషలిజం

సాధిస్తే సరిపోదు. వ్యవసాయదారులకు, మిగతా ప్రజలకు మధ్య సమత సమకూరాలి. అలాగే ప్రపంచంలోని వ్యవసాయ ప్రధాన దేశాల మధ్య, పారిశ్రామిక ప్రధాన దేశాల మధ్య సమతను సాధించాలి. వాణిజ్య రంగంలో వ్యవసాయదారులకు, వ్యాపారవేత్తలకు ఒకే విధమైన గుర్తింపు ఒనగూడాల్సి ఉంది. ఈ సూత్రం తాలూకూ పూర్తి ప్రాముఖ్యాన్ని ఈమె గుర్తించి మా కార్యకర్తలందరికీ వివరించి చెప్పసాగింది.

ఇవేగాక ఈమెను ఆందోళనకు గురిచేసే అంశాలు ఇంకా ఉన్నాయి. ఈమె మా వ్యవసాయం సంగతి పట్టించుకోవాలి. అందులో ఆర్జించినదే కుటుంబ ఖర్చులకు, ఈమె పర్యటనలకు, నా జైలు ఖర్చులకు అవసరమైన మేరకు వాడాల్సి ఉంది. నేను జైలు వెలుపల ఉన్నా ఇంటిపట్టున ఉండేది తక్కువే కదా. కనుక అప్పుడూ ఆ కార్యభారాన్ని ఈమే మోయాల్సి వచ్చేది. ఆ పాత్రను ఈమె చాలా సమర్థవంతంగా, హాందాగా నిర్వర్తించగలిగారు. **అందుకే సేవాగ్రామ్‌లో పలువురికి గాంధీజీ ఈమెను ఆదర్శ మహిళగా చూపగలిగారు. ఆయన ఆర్థికంగా సాయం అందించాలని చూసినా స్వీకరించేది కాదు. ఆమె గుణం బాపూకి బాగా నచ్చింది.** జయప్రకాశ్ నారాయణ్ తమ సోషలిస్ట్ మిత్రులు రాజకీయంగా ఆమె తోడ్పాటును అందుకోలేకపోవడం గొప్ప తప్పిదంగా భావించినట్లు జైలు నుండి రాసిన లేఖ ప్రభుత్వం చేతికి చిక్కినట్లు చెబుతారు.

ఈమె పర్యటనలు, ప్రసంగాలు ఉత్తేజదాయకంగా ఉండేవి. ప్రముఖులైన గాంధీవాదులంతా జైలులో ఉన్న సమయంలో ఈమె బయట ఉండి సానుకూల ప్రజాభిప్రాయాన్ని కూడగట్టగలిగింది.

23

బాపూజీ నిర్మాణాత్మక కార్యక్రమాలు (1925-45)



ఇది జాతీయ విస్తరణ యుగం. పంచాయతీరాజ్, బ్లాక్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా ఎనలేని కృషి జరుగుతున్నది. ఇక్కడ గాంధీజీ తలపెట్టిన గ్రామీణ ప్రజా వుద్యమంలో పలు దశాబ్దాలపాటు కేవలం స్వచ్ఛందంగా, గౌరవప్రదంగా వేతనాల ప్రస్తావన లేకుండా భుజం భుజం కలిపాం. రాజకీయ, సామాజిక వాతావరణంలో నెహ్రూ పదిహేడేళ్ల పాలనా కాలంలో సంభవించిన పెనుమార్పుల కారణంగా సంఘ సేవకులు సైతం వేతనాలను, భత్యాలను గ్రామ సేవకుల, బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారుల స్థాయిలో కోరడం ప్రారంభించారు.

మేము ఇన్ని దశాబ్దాలుగా కొనసాగించిన శ్రమ ప్రస్తుత దేశ వ్యాప్త విస్తరణ కార్యక్రమాలకు దృఢమైన, శ్రేష్ఠమైన పునాదుల్ని నిర్మించింది. గాంధీజీకానీ, ఆయన అనుయాయులుకానీ, 1925 నుండి చేపట్టిన కిసాన్ కళాకారుల ఉద్యమాలుకానీ స్పృశించని ఆర్థిక, సామాజిక అభివృద్ధికి సంబంధించిన అంశాలు లేనేలేవు. జాతీయ విస్తరణ, పంచాయతీరాజ్ కార్యక్రమాలకు అవి ప్రజలను సంసిద్ధుల్ని చేశాయి. కనుక గాంధీజీ తలపెట్టిన నిర్మాణాత్మక కార్యక్రమాలకు సంబంధించిన జ్ఞాపకాలను కొన్నింటిని మీ ముందుంచుతాను.

మహాత్మాగాంధీ రూపొందించిన 'హిందూ స్వరాజ్యం'లో ఆయన స్పష్టంచేసిందేమంటే భారతదేశం పరాజయం పాలవ్వలేదు. అది తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయింది. అది తన ఆర్థిక, సామాజిక సంపద, నిర్మాణాత్మక శక్తిపై ఆధారపడే తెలివితేటలను క్రమేపీ కోల్పోయింది. కనుక స్వాతంత్ర్యం సిద్ధించేవరకూ నిర్మాణ కార్యక్రమాలను అలా నిలిపి ఉంచదల్చలేదు. 1920-22 నాటి సహాయ

నిరాకరణోద్యమంలోని కొన్ని సకారాత్మక అంశాల ద్వారా వాటిని ప్రవేశపెట్టాడు. ఖాదీ, స్వదేశీ ఉద్యమాలు, జాతీయ విద్య, గ్రామ పంచాయతీలు, పంచాయతీ న్యాయస్థానాలు, అస్పృశ్యతా వ్యతిరేక ఉద్యమం, అణగారిన జాతుల సామాజిక, ఆర్థిక పునరావాసం, జాతీయ భాషవంటివి అందులోకొన్ని. వేలమంది ఆయన శిష్యగణం ఈ కార్యక్రమాలకు, వాటి లక్ష్యాలకు అంకితమైపోయారు. ఈ నిర్మాణాత్మక కార్యక్రమాలకు అంకితమైన కార్యకర్తలకు సత్యాగ్రహాలు చేయడం, జైళ్లకు వెళ్లడంవంటి పనుల నుండి రాయితీ లభించేది. కొన్ని సందర్భాల్లో అయితే అటువంటి నిర్మాణ కార్యక్రమాల కొనసాగింపునకు, అవసరమైతే కాంగ్రెస్ కార్యక్రమాలకు, బంధనాలకు దూరంగా జరగమన్నాడు. ఆయన ఆశీర్వాదాల ఫలితంగా ఇటువంటి స్వచ్ఛంద సేవకులు జైళ్లకు వెళ్లినవారితోపాటుగా గౌరవాన్ని పొందేవారు.

1936లో ఆనాటి రాష్ట్రాల్లో (ప్రోవిన్సెస్) కాంగ్రెస్ మంత్రి వర్గాలు ఏర్పడగానే గాంధీజీ మౌలిక విద్యా సదస్సు (బేసిక్ ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్) ను వార్ధాలో నిర్వహించి తమ భావాలను ఆ సదస్సు ముందుంచారు. అవన్నీ గాంధీజీ, జాకీర్ హుస్సేన్ (తర్వాత కాలంలో ఆయన అలిగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా పనిచేశారు. భారత రాష్ట్రపతి పదవిని అధిష్టించారు), సేవాగ్రామ్‌లోని బేసిక్ ఎడ్యుకేషన్ సెంటర్ వ్యవహారాలు 1967లో ఆయన మరణించే వరకూ పర్యవేక్షించిన ఆర్యనాయగమ్ చేసిన ప్రయోగాల నుండి ఉద్భవించినవే. చర్చల అనంతరం ఆ దిశగా రూపొందిన సిద్ధాంతమే బేసిక్ విద్యా ఉద్యమంగా రూపుదాల్చింది. **'ది లెటెస్ట్ ఫాడ్' అనే గ్రంథం ద్వారా ఆచార్య కృపలానీ ఆ సిద్ధాంత రూప కల్పనకు ప్రచారాన్ని జోడించారు.**

నేను ఆ నిర్మాణాత్మక కార్యక్రమానికి త్వరితగతిన మద్దతు పలికాను. అప్పటి బొంబాయి ముఖ్యమంత్రి బి.జి.ఖేర్, బీహార్ ముఖ్యమంత్రి శ్రీకృష్ణ సిన్హాలు పెద్దయెత్తున ప్రయోగాత్మక అమలుకు పూనుకున్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో కూడా పని బాగానే జరిగింది. తరతరాలుగా వస్తున్న విద్యలోని అణగగొట్టే పద్ధతిపోయి ఈ నూతన విద్యావిధానం బాలలకు ప్రయోజనకారి కాగలదనే భావన వల్ల నేను దానికి బాగా దగ్గరయ్యాను. 1936 నుండి ఈ రంగంలో సాధించిన ప్రగతిని సమీక్షించేందుకు, 1945 జనవరిలో సేవాగ్రామ్‌లో సదస్సు నిర్వహించినప్పుడు యుద్ధకాలంనాటి బ్రిటిష్ పాలనలో కొన్ని రాష్ట్రాల్లో పని సజావుగానే సాగిందని, కొన్ని ప్రాంతాల్లో మాత్రం అడ్డంకులు ఏర్పడ్డాయని తెలియవచ్చింది. గాంధీజీ నన్ను కూడా ఆ సదస్సుకు ఆహ్వానించారు.

అయితే 1920-34 మధ్యకాలంనాటి నిర్మాణాత్మక కార్యక్రమాలన్నీ కాంగ్రెస్ రాజకీయంగా పుంజుకోవడం, శక్తిహీనంకావడంవంటి ప్రభావాలకు లోనుకావల్సి వచ్చేది. కనుక బాపూజీ నిర్మాణ కార్యక్రమాలను వేరే ప్రాతిపదికన నెలకొల్పదలచాడు. కాంగ్రెస్ రాజకీయ ఆటుపోట్లు వాటికి తగలకుండా చూడదల్చాడు. కాంగ్రెస్ క్రియాశీల కార్యకర్తలు నిర్మాణ కార్యక్రమాల్లో పాలుపంచుకునేందుకు గాంధీజీ అభ్యంతరం చెప్పలేదుకానీ వాళ్లకు నిర్మాణ కార్యక్రమం ప్రధానాంశం కావాలని కోరుకున్నాడు. కనుకనే బొంబాయి కాంగ్రెస్‌లో 1934లో అఖిలభారత గ్రామీణ ఉద్యోగ సంఘం రూపుదాల్చింది. దానికి డాక్టర్ జె.సి.కుమారప్ప కార్యదర్శి. ఆ సంఘం అఖిలభారత చేనేత సంఘంతో కలసి పనిచేయాలి. దానికి నా సంపూర్ణ మద్దతును అందించాను. అలాగే మా కృషి విద్యాలయం పట్టభద్రులంతా కూడా ఈ నిర్మాణ కార్యక్రమాల్లో భుజం భుజం కలిపారు. అలాగే స్వామీ సీతారాంగా వినుతికెక్కిన, వినయాశ్రమానికి చెందిన సీతారామ శాస్త్రి, శారదా నికేతన్ వ్యవస్థాపకులు ఉన్నవ లక్ష్మీనారాయణ, శరణు రామస్వామి చౌదరి, గ్రంథాలయోద్యమానికి చెందిన పాతూరి నాగభూషణం, దక్షిణ భారత హిందీ ప్రచార సభకు చెందిన మోటూరి సత్యనారాయణ, ఆయనతో కలసి పనిచేసే అనేకమంది ప్రచారకులు, హరిజన సేవక్ సంఘ్ కార్యకర్తలు అందరూ మా మద్దతు పొందినవారే. భారతీదేవి, కనకమ్మ, చుక్కమ్మ, దుర్గాబాయి, లక్ష్మీ బాయి మహిళా రాజకీయ, సామాజిక ఉద్యమాలను పెంపొందింపజేశారు.

దీనితోపాటుగా మేము పశు వైద్యంలో ఆయుర్వేద పద్ధతి ప్రచారానికి పూనుకున్న డాక్టర్ యేజెండ్ల శ్రీరాములు గారికి, ప్రకృతి చికిత్సాలయాల అభివృద్ధికి, దంపుడు బియ్యం వినియోగానికి కృషి సల్పేవారికి మద్దతు పలికాం. నా పర్యటనల్లో నాకు ఏ గ్రామానికి చెందినవారైనా డబ్బు ఇస్తే దాన్ని ఆ గ్రామంలో ఇటువంటి కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడే విధంగా తిరిగి వారికే ఇచ్చేవాణ్ణి. ఆ స్వచ్ఛంద సంస్థలోని కార్యకర్తలు కొందరు తమ పూర్తి సహాయాన్ని అందిస్తూ వాటి అభివృద్ధికి ఎటువంటి ధనాన్ని తీసుకోకుండానే పనిచేసే వారు. కొందరు మాత్రం స్వల్పంగా గౌరవ వేతనం స్వీకరించేవారు.

గాంధీజీ మధ్యప్రదేశ్‌లో మలేరియా ప్రాంతంలో సేవాగ్రామ్ నెలకొల్పి అక్కడ వుండడాన్ని స్వాగతించాను. దానివల్ల మలేరియా నిర్మూలనకు విశేషంగా ప్రాచుర్యం లభించింది. ఆరు బయలు మరుగుదొడ్లకు సంబంధించిన నిరుపయోగ పదార్థాన్ని

కంపోస్ట్ ఎరువుగా మార్చే ప్రణాళిక పట్ల గాంధీజీ శ్రద్ధ చూప సాగారు. మేము పంచాయతీ ఉద్యమంలో పనిచేస్తున్నాం. మేము ఆయన ప్రచారం చేస్తున్న మరుగుదొడ్ల వాడకంతోపాటు కందకం తరహా మరుగుదొడ్లు, **కీపిహాల్ మరుగుదొడ్ల** వాడకాన్ని ప్రచారం చేయసాగాం. ఇలా మేము ఒక అడుగు ముందుకు వేయడంతో ఆయన ప్రశంసలు మాకు లభించేవి.

1945లో కంట్రోళ్ల పాలన చాలాకాలం కొనసాగేటట్లుగా కనిపించింది. దాన్ని పూర్తిగా రద్దు చేసేందుకుకానీ లేదా దాని ప్రభావాన్ని కొంతమేరకు తగ్గించేందుకుకానీ అవసరం ఏర్పడింది. దాని కోసం వివిధ స్థాయిల్లో, వివిధ రంగాల్లో కృషి చేస్తున్న సంఘాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాల్సి వచ్చింది. దాని కారణంగా మేము గ్రామీణ ప్రజా సంఘాల ఐక్య సంఘటనకు పూనుకోవాల్సి వచ్చింది. అలా ఆవిర్భవించిందే ఫెడరేషన్ ఆఫ్ రూరల్ పీపుల్స్ ఆర్గనైజేషన్. దానికి నేను అధ్యక్షుణ్ణి. ఎన్.వి.నాయుడు, సి.ఎల్.పటేల్ జనరల్ సెక్రటరీలు. దానికి అనుబంధంగా ఉన్న ప్రముఖ సంస్థలు **-భారత్ కిసాన్ సమ్మేళన్, ఆలిండియా హ్యాండ్లూమ్ వీవర్స్ కాంగ్రెస్, భారత్ గ్రామోద్యోగ సమ్మేళన్.**

నేను వ్యవసాయ ఉత్పత్తిదారుల ప్రథమ, ద్వితీయ, చతుర్థ ప్రపంచ సదస్సులకు హాజరైన భారత బృందానికి నాయకునిగా ఫైఫెడరేషన్ తరపున హాజరయ్యాను. ఈ ఫెడరేషన్‌కు ప్రపంచ స్థాయి ఫెడరేషన్ పాలకమండలిలో ప్రాతినిధ్యం లభించింది. అఖిలభారత స్థాయి ఫెడరేషన్ కార్యకలాపాల కారణంగా 1952లో కంట్రోళ్లు తొలగిపోయాయి. అయితే 1959-60 ప్రాంతంలో నెహ్రూ గారి కాలంలో తిరిగి అవి ప్రవేశపెట్టబడ్డాయి. భారతదేశపు ఆర్థిక ఐక్యత చిన్నాభిన్నమైంది. దానివల్ల కోటి టన్నుల మేరకు ఆహార ధాన్యాల కొరత ఏర్పడింది.

రూరల్ పీపుల్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి, రాజకీయేతర వేదికగా సమర్థవంతంగా కృషి చేయసాగింది. 1962లో మరణించే వరకూ సి.ఎల్.పటేల్ గారే దానికి ఆనరరీ జనరల్ సెక్రటరీ. అటువంటి విధేయతను ప్రదర్శిస్తూ నమ్మకమే సొమ్ముగా బతుకుతూ సమర్థవంతంగా కృషి చేయగల సహనాయకులు నాకు లభించారు. ఈ పటేల్ గారిది కూడా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ గారి గ్రామమే.

24

నెహ్రూతో నా సంబంధాలు ఎంత దగ్గరో అంత దూరం (1939-45)

సిద్ధాంతరీత్యా నాకూ, జవహర్‌లాల్‌జీకీ మధ్య మరింత దగ్గరగా ఆనందమయ స్నేహం నెలకొనాల్సి ఉన్నా మా సంబంధాలు అంతటి అదృష్టానికి నోచుకోలేదు. సెప్టెంబర్ 1931లో బొంబాయిలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సదస్సులో ప్రాథమిక హక్కులపై క్లాజుల వారీగా చర్చలు జరిగిన సందర్భంలో దురదృష్టవశాత్తూ ఆయనా, నేనూ మా తప్పిదం ఏమీ లేకుండానే చెరొక పక్షాన నిలిచినట్లయ్యింది. రైతుల హక్కుల్ని పటిష్టపరుస్తూ జమీందారుల హక్కులను తగ్గిస్తూ అనేక సవరణలు చేయాల్సిన అవసరం నాకు కనిపించింది.

జమీందార్లవి స్వార్థ ప్రయోజనాలు. సాలీనా 30 కోట్ల రూపాయలకు పైబడి

రైతుల నుండి వసూలుచేస్తూ ఆనవాయితీగా వస్తున్న హక్కుల్ని సైతం కాలరాస్తూ వాళ్లకు భూమిపై హక్కు మాట అటుంచి కనీసం వాళ్లు శాశ్వతంగా అందులో సేద్యం చేసుకునే హక్కు కూడా లేదు పొమ్మంటున్నారు. కాంగ్రెస్ జోక్యం చేసుకునే స్థితిలోలేదు. జవహర్‌లాల్‌జీకి కూడా బహుశా మాకున్న అభిప్రాయాలే ఉండి ఉండొచ్చు. కాని ఆయన వర్కింగ్ కమిటీ తటస్థ వైఖరికి వంతపాడాల్సి వచ్చింది. అందువల్ల ఆయన మా సవరణలన్నింటినీ వ్యతిరేకించాల్సి వచ్చింది. అటువంటి సందర్భంలో మా మధ్య వేడీవాడీ చర్చ సమంజసమే. ఆ చర్చలో నేను ఒక సందర్భంలో ఆయన్ను విమర్శిస్తూ కొద్ది సంవత్సరాల క్రితం **ఐరోపాలో ఆయన నాయకత్వం కింద నడిచిన సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరికి, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి అడుగులకు మడుగులొత్తుతూ జమీందారులకు ఎదురునిలిచేందుకు సిద్ధంగాలేని వైఖరికీ పొంతన లేదని చురక వేశాను.** దానితో ఆయనకు చిర్రెత్తుకొచ్చింది. బహుశా అదే తర్వాత 32 సంవత్సరాలు కాంగ్రెస్‌లోనూ, పార్లమెంట్‌లోనూ, దేశ రాజకీయాల్లోనూ **మా మధ్య సంబంధాల్లో ధీ అంటే ధీ అనే ధోరణికి కారణమై ఉండొచ్చు.** అలాగే అయ్యుంటుందని పసిగట్టిన బాపూ ఆ రాత్రి నేను ఆయన్ను కలిసినప్పుడు జవహర్‌లాల్‌జీకి ఎదురునిలువకుండా జాగ్రత్తపడమని సలహా ఇవ్వడం జరిగింది.

నేనూ, మార్పును కోరని మరికొందరం 1933లో చట్టసభల్లోకి ప్రవేశించేందుకు కాంగ్రెస్‌కు అదే అనువైన సమయమని భావించి అటువంటి నిర్ణయానికి వచ్చిన తరుణంలో జవహర్‌లాల్‌జీ కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ వారికి చట్టసభల్లోకి ప్రవేశించడాన్ని నిరాకరించమని హితవు పలుకుతున్నాడు. రైతుల కోసం గత నాలుగు సంవత్సరాలుగా చట్టసభల వెలుపల పోరాటం చేస్తూ నేను విసిగి వేసారి ఉన్నాను. **కాంగ్రెస్ చట్టసభలకు దూరంగా ఉన్నందునే జమీందారులు పేట్రేగిపోతున్నారు. వాళ్లకు ఎదురునిల్వాలంటే కాంగ్రెస్ చట్టసభల్లోకి ప్రవేశించాలనే వైఖరి నాది.** చివరి నిమిషంలో (బహుశా నెహ్రూ గారి సలహాపై కావచ్చు) కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ తన సభ్యుల్ని చట్టసభల్లోకి వెళ్లవద్దని ఆదేశించినా నేను కేంద్ర చట్టసభలోకి ప్రవేశించాను. ఇది ఆయనకు నిరాశను కలిగించి ఉండొచ్చు. అయితే అటువంటి పనే ఆయన కేంబ్రిడ్జి స్నేహితుడు శ్రీప్రకాశ్ చేస్తే అది మాత్రం తప్పుగా అనిపించలేదు. పైగా ఆయన తన చెల్లిని, కే.శే. అహ్మద్ కిద్వాయ్‌ని, మరికొందరు కాంగ్రెస్‌వాదులతో కలసి 1937లో ఉత్తరప్రదేశ్ మంత్రి వర్గంలో చేరమని జవహర్‌లాల్‌జీ ప్రోత్సహించడం నాకు చిత్రంగా

తోచింది. ఎందుకంటే 1936లో లక్నో, ఫయాజ్‌పూర్ కాంగ్రెస్ సభల్లో మంత్రి పదవుల్ని అంగీకరించే విషయాన్ని తీవ్రంగా ఖండిస్తూ పోట్లాడింది ఆయనే. అటువంటి సంగతిని పెంచి పోషించే నాయకత్వం పట్ల నాకు ఏపాటి గౌరవం ఉంటుంది? ఆయనకు వామపక్ష రాజకీయాల పట్ల, రాష్ట్ర రాజకీయాల పట్ల శ్రద్ధతో తాను సూచించిన వారు మంత్రి వర్గంలోకి ప్రవేశించడం ఇష్టమైనప్పుడు రైతుల క్షేమం కోసం కాంగ్రెస్ ఆదేశానుసారం నేను చట్టసభలోకి ప్రవేశించడాన్ని ఎలా తప్పుపడతారు?

1936 డిసెంబర్‌నాటి ఫయాజ్‌పూర్ కాంగ్రెస్‌లో నన్ను ఆయన సరిగా పట్టించుకోలేదు.

అఖిలభారత కిసాన్ కాంగ్రెస్‌కు నేను అధ్యక్షుణ్ణి అయినా, అఖిలభారత కిసాన్ కాంగ్రెస్‌పై విశ్వాసాన్ని ప్రకటిస్తూ బ్రహ్మాండమైన రైతు ప్రదర్శన నిర్వహించినా నేను పదిమందిలో ఒకడినని సూచించేందుకు కాబోలు ఆయన అలా ప్రవర్తించారు. అందరూ ఆ సభలో ఆయన కనుసన్నల్లో మెలుగుతున్నా నేనొక్కణ్ణే ఆయన్ను ఎదిరించి సభను మిరిమిట్లు గొలిపేటట్లు చేశాను. నేను ఆయన నివేదికను వ్యతిరేకించగా ఆయన ఓ అనుల్లంఘనీయ సవాల్‌ను కోపంగా విసిరాడు: 'ఒక్క నిమిషంలో నీ సవరణను ప్రతిపాదించు' అన్నాడు. నేను మెల్లగా సమాధానం చెప్పాను : 'మీరు నియంతలా ప్రవర్తించరాదనేది మీరు గుర్తించవలసి ఉంది. నేను సవరణను ప్రతిపాదించడానికి తగిన సమయం ఇవ్వాలి కదా'. దాంతో ఆయన స్థానం ఆయనకు తెలియవచ్చింది.



సుభాష్‌చంద్రబోస్ తదితరులతో ఆచార్య రంగ

ఓ కుచ్చితపు నవ్వు నవ్వాడు. ఇదంతా సభకు వినోదాన్ని పంచింది. అయినా ఆయనకు కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీకి చెందిన వామపక్షీయులంటేనే ఇష్టం. అందుకే లక్నో సదస్సులో వాళ్లను వర్కింగ్ కమిటీలోకి తీసుకున్నాడు. ప్రజల్లో వాళ్లకు బలంలేదు. నాతో అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీపడిన వాళ్ల నాయకుడు ఘోర పరాజయం పాలయ్యాడు. కనుక వాళ్లేపాటి శక్తిమంతులో ఆయనకు తెలియకకాదు. తర్వాత సర్దార్ పటేల్ రైతుల హక్కుల పత్రానికి అసమ్మతిని తెలిపి దాన్ని వెనక్కు తీసుకోవాల్సిందిగా కోరినప్పుడు కూడా కాంగ్రెస్ క్రమశిక్షణకు భంగం వాటిల్లుతున్నదని తెలిసినా ఆయన కిసాన్ కాంగ్రెస్‌కు మద్దతు పలికే ప్రయత్నమూ చేయలేదు. ఆ సంక్షోభంలో నాకు సానుభూతినీ అందించలేదు.

1938-42 మధ్యకాలంలో నేను మద్దతు పలికిన విద్యార్థి కాంగ్రెస్ విప్లవాత్మకంగా వ్యవహరించడం కూడా ఆయనకు రుచించలేదు. బీహార్‌లో స్వామీజీ నిర్వహించే 'కిసాన్ దండా'నూ ఆయన మెచ్చుకోలేదు. పైగా నేను స్వామీజీకి దూరంగా జరగనందుకు విస్తుపోయాడు. కాంగ్రెస్ కమిటీల్లో రైతు సంస్థలకు ప్రాతినిధ్యం ఇవ్వాల్సిందేనన్నాను. రైతు సమస్యలకు తగిన ప్రాధాన్యం ఇవ్వమన్నాను. కమ్యూనిస్టులు కూడా ఈ విషయంలో ప్రదర్శనలు నిర్వహించడంతో చిర్రెత్తుకొచ్చి ఉంటుంది.

ఇలా మరికొన్ని కలసి గాంధీ గారి వైపు నుండి లభించే ఆప్యాయత ఆయన వైపు నుండి లభించేదికాదు. ఇదంతా నాకూ, నేను చేపట్టిన సమస్యల పరిష్కారానికీ దురదృష్టం పట్టినట్లయ్యింది.

సుభాష్‌బాబు పట్ల త్రిపుర సభలో ఎన్నిక సందర్భంగా నెహ్రూ చూపాల్సినంత విధేయత చూపకపోవడం వల్ల మహాత్ముని తర్వాత జాతీయ స్థాయి నాయకునిగా ఆయన్ను చూడాల్సి వస్తే అది నన్ను నిరాశకు గురిచేసింది. 1940-44 మధ్యకాలంలో నేను నిర్బంధంలో ఉన్న కాలంలో ఆయన నాయకత్వం పట్ల నా విశ్వాసాన్ని పెంచేందుకు పనికి వచ్చింది. ఆయన స్వీయ చరిత్ర, మరిన్ని రచనలు చదివి సంతృప్తి చెంది శక్తిని కూడగట్టుకున్నాం. అంతటి స్ఫూర్తిదాయక రచయిత ఆయన.

25

సర్దార్ పటేల్‌తో సంబంధాలు (1936-48)

సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆయన జీవించి ఉన్నప్పటికంటే జీవించి ఉండి ఉంటే ఫలానా తప్పిదాన్ని జరగకుండా చూచి ఉండేవాడని పార్లమెంట్ సభ్యులు, పాత్రికేయులు జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఉంటారు. కొందరు మరణానంతరమే కీర్తి ఎక్కువగా గడిస్తారు. ఆ కోవకు చెందినవాడే సర్దార్ పటేల్.

చాలా సంవత్సరాలు సర్దార్ పటేల్‌తో నాకంత సఖ్యత లేదు. అందుకు కారణం ఆయన దక్షిణాది మిత్రులు రాజాజీ, డాక్టర్ పట్టాభి. మూడో మిత్రుడెవరికీ అవకాశం ఇచ్చి ఉండకపోవచ్చు. ఆయన ప్రతిద్వంద్వి, ఆయన చేతిలో దెబ్బతిన్నవాడైన ఇందూలాల్ యాగ్నిక్‌ను నేను కిసాన్ కాంగ్రెస్ నేతగా స్వీకరించాను. వాళ్లిద్దరకు పడదనే విషయం అప్పటికి నాకు తెలియదు. **ఆయనకు కిసాన్ కాంగ్రెస్ అంటే అయిష్టానికి కారణం ఇందూలాల్‌జీతో నా మైత్రే. నాకు సుభాష్‌బోస్ అంటే అమితమైన ఇష్టం.** అందుకు కారణం ఆయన భారతీయులు కోరే స్వాతంత్ర్యాన్ని బ్రిటిష్ వారు ఇచ్చేందుకు అంగీకరించలేదు కనుక వాళ్లతో యుద్ధానికి తొడగొట్టాడు. సర్దార్ పటేల్ అందుకు భిన్నంగా భారతదేశానికి మరిన్ని అధికారాలు లభించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలపై కాంగ్రెస్ పట్టు సాధించాలని

ఆక్షుత చెందేవాడు. సుభాష్ సిద్ధాంతాల పట్ల ప్రతికూలత పెరుగుతున్నకొద్దీ నా రాజకీయాల విషయంలో సర్దార్ పటేల్‌కి అయిష్టత పెరగసాగింది. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ బొంబాయిలో జరుగుతున్న తరుణంలో తొలి అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ సదస్సును నేను ప్రారంభించడంపై ఆయన కోపాన్ని అణచుకోలేకపోయారు. మరుసటిరోజు ఉదయం మేమిద్దరం రాజేంద్రప్రసాద్ గారి గదిలో కలుసుకున్నప్పుడు ఆయన నిర్మొహమాటంగా అడిగారు: 'మీరు కాంగ్రెస్ నుండి ఎప్పుడు రాజీనామా చేస్తున్నారు?' అని అడిగారు.

'నేనెందుకు రాజీనామా చేయాలి? కాంగ్రెస్ ఎవరి సొత్తు? మీదా?' అంటూ వెంటనే అడిగేశాను. శాంతిని ప్రేమించే రాజేంద్ర ప్రసాద్ గారు మా ఇద్దరినీ శాంతింపజేసే ప్రయత్నం చేశారు. 'సర్దార్, రంగాలో మరో సర్దార్‌ను నువ్వు గుర్తించలేదా? అది విన్న సర్దార్ పటేల్ మనసారా నవ్వుకున్నారు. 'అయినా రంగా, నిజం చెప్పు, మీరు ఫార్వర్డ్ బ్లాక్‌లో చేరినప్పుడు కాంగ్రెస్‌లోనే ఎందుకు కొనసాగాలనుకుంటున్నారు? నేను వెంటనే ఇలా బదులు పలికాను: 'సర్దార్ జీ, నేను ఫార్వర్డ్ బ్లాక్‌లో చేరానని మీకెవరు చెప్పారు? వాళ్లు జరుపుకునే ఉత్సవాన్ని నేను ప్రారంభించాను, అంతే'. అది ఆయన కోపాన్ని ఉపశమింపచేయగలిగిందికానీ నా పట్ల గల అసంతృప్తిని మాత్రంకాదు.

అదీ స్థిరత్వం కలిగిన, ధైర్యశాలి అయిన సర్దార్ తీరు. ఎంతోకాలంగా ఎడమొహం పెడమొహంగా ఉంటూ వస్తున్న మేము గాఢ మైత్రితో ఎలా ఒకటి కాగలిగామా అన్నది ఆరితేరిన కాంగ్రెస్‌వాదుల్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. మహాత్మాగాంధీ అంతరంగికులు ఎవరైనా ఉంటే వాళ్లను తన అంతరంగికులుగా మార్చుకోవడం విధేయుడైన సర్దార్‌కు ఎక్కువకాలం పట్టదనే విషయం వాళ్లకు తెలియదు. జీవితంలో చిట్టచివరి ఐదు సంవత్సరాల కాలంలో ఆయన తన మైత్రిని, విశ్వాసాన్ని, సలహాలను ఎంతోకాలంగా తన సహచరులుగా ఉన్న వాళ్ల కన్నుకుట్టేంతగా పంచాడు. ఒక పర్యాయం ఒక కాంగ్రెస్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ కమిటీలోకి నన్ను తీసుకోదల్చలేదు. మేమ లేకుండా సర్దార్ కాంగ్రెస్ కమిటీలో సభ్యునిగా ఉండదల్చలేదు. దాని కారణంగా వర్కింగ్ కమిటీ నిర్మాణం పూర్తికాకుండా ఆరు వారాలు అలాగే ఉండిపోయింది. చివరకు అధ్యక్షునికి దిగిరాక తప్పలేదు. నేను సభ్యుణ్ణి అయ్యాను. సర్దార్ సహకారం కొనసాగింది. ఆయన ఒకసారి నమ్మితే అంతే. అటువంటి మద్దతే లభిస్తుంది. ఆయన

దేశ ప్రజల సేవకు నన్నెంతగానో ప్రోత్సహించాడనేది నేను బహిరంగంగా అంగీకరించే సత్యమే. స్నేహితుల్ని పైకి తీసుకురావడంలో అటువంటి శక్తిశాలి సర్దార్ పటేల్.

పాకిస్థాన్ తన ఆదివాసీలను కాశ్మీర్ ఆక్రమణకు సమాయత్తం చేసి పంపినప్పుడు భారతదేశం సెక్యూరిటీ కౌన్సిల్‌కు తన వాదన వినిపించాలనే తెలివితక్కువ తొందరపాటును చూసి ఎంతగా గర్జించాడో. ఆయన అన్నాడు : 'క్రిమినల్ కేసులు వాదించే ఏ న్యాయవాదినడిగినా చెబుతాడు ఫిర్యాదిగా ఉండడం కంటే ప్రతివాదిగా ఉండడమే మేలని'.'మీరు పనిచేసింది క్రిమినల్ లాయర్‌గానేగా' అన్నాను నేను. ఆయన కళ్లు మిలమిలా మెరిశాయి. ఆయన కాశ్మీర్ సమస్యపై తన మనోవ్యధను పలు పర్యాయాలు వ్యక్తపర్చడం జరిగింది.

హైదరాబాద్‌లోని ఒకటీ ముప్పాతిక కోట్ల హిందువులు తమ జీవన స్థితిగతులు దారుణంగా క్షీణించడం చూసి అమితంగా ఆందోళన చెందసాగారు. అందుకు కారణం రజాకార్ల నియంతృత్వ పోకడలే. కేంద్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరి చూసి మేము ఆంధ్రులం ఓర్పువహించ లేకపోయాం. అప్పట్లో నేను ఆంధ్ర ప్రాంత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుణ్ణి. అందువల్ల నేను తరచుగా నెహ్రూ, సర్దార్ పటేల్, మౌలానా ఆజాద్‌వంటి వారిని కూడా కలసి స్వయంగా వాళ్లు చొరవ చూపి రాష్ట్రంలోని తెలుగువారిని కాపాడాల్సిందిగా కోరాను. దురదృష్టవశాత్తూ గుండెపోటు కారణంగా పలు మాసాలపాటు అస్వస్థతకు గురయ్యారు సర్దార్ పటేల్. ఒక పర్యాయం నేను కేంద్ర ప్రభుత్వ వైఫల్యం కారణంగా ప్రజల్లో చెలరేగిన అసంతృప్తిని ఆయన దృష్టికి తేగా ఆయన ఎంతో బాధగా అన్నాడు: 'మీ మిత్రుడు జవహర్‌నడుగు' అని. ఏదో గొప్ప పని కొద్ది రోజుల్లో జరగబోతున్నట్లుగా చెప్పి ముస్సోరీ నుండి నన్ను రప్పించారు. పక్షం రోజులనుండీ చూస్తున్నాను. ఫలితం శూన్యం. ఇప్పుడు పార్లమెంట్ సమావేశాల హడావుడి.

పాకిస్థాన్, బ్రిటిష్ టోరీలలోని కొందరు కలసి రజాకార్లకు ఆయుధాలు అందజేస్తున్నారని, ఆయుధాలను, మందుగుండు సామాగ్రిని ఉత్పత్తి చేసే పలు కేంద్రాలు హైదరాబాద్‌లో నెలకొన్నాయని మరోసారి నేను ఆయనకు నా భయాందోళనలు తెలియజేశాను. ఆయన వెంటనే నాతో నమ్మబలికారు : 'భయపడకు. ఒక పగలు రెండు రాత్రుళ్లలోనో, మరో పూటతోనో పూర్తవుతుంది. మన మిలిటరీ నిపుణులను సంప్రదించాం. ఇక మన మిత్రుడే ఓ నిర్ణయానికి రావాల్సి ఉంది.

సర్దార్ హైదరాబాద్‌లో భారత ప్రభుత్వ ప్రతినిధిగా తనకు నమ్మకస్తుడైన మిత్రుడు కె.ఎం.మున్షీని నియమించాడు. నేను మున్షీ గారికి సరిహద్దు గ్రామాలు తిప్పి చూపాను.

సర్దార్ నాతో ఇంతకుముందు చెప్పిన విషయాన్ని ముస్లీ ధృవీకరించాడు. చివరకు పోలీస్ చర్య ప్రారంభంకాగానే సర్దార్ అంచనాలు సరైనవేనని రుజువయ్యాయి. **హైదరాబాద్ సంస్థానం కేంద్రంతో విలీనమయ్యేందుకు రెండు మూడు రోజులకంటే పట్టలేదు. నెహ్రూ టిబెట్ పట్ల ప్రదర్శించిన నమ్మక ద్రోహాన్ని సర్దార్ వ్యతిరేకించాడు.**

రాజాజీ హాలును ప్రారంభించి ఆయన నిలువెత్తు చిత్రపటాన్ని ఆవిష్కరించేందుకు సర్దార్ మద్రాస్‌కు వెళ్లే విమానంలో పక్కనే నేనూ ఉన్నా. ఆ రోజు ఉదయం ఢిల్లీలో విమానం ఎక్కబోయే ముందు ఆయన సహాయకులు దినపత్రికలు అందించి చెప్పారు: 'గత రాత్రి తారాసింగ్‌ను నిర్బంధించారు' అని. ఏమైనా అల్లర్లు చెలరేగాయా? అని ఆయన అడిగారు. లేవని బదులు పలికారు. ఆయన నా వైపు తిరిగి 'శుభ్రంగా పూర్తిచేశారు' అన్నారు. అయితే అలా శుభ్రంగా పని పూర్తి చేయడం జరిగిందికానీ పంజాబ్ సమస్యను పూర్తిగా పరిష్కరించలేకపోయాం.

ఆ సంఘటనాత్మక పర్యటనలో ఆనాడు మద్రాస్‌లో వల్లభాయ్ పటేల్ రెండు మంచి ప్రసంగాలు చేశారు. ఆయన రాజాజీని ఘనంగా కీర్తించడంతో ఆయనకూ, రాజాజీకి మధ్య విభేదాలు లేవన్నంతగా ఆ ప్రసంగం సాగింది. మహాత్మాగాంధీ ఇష్టపడే వ్యక్తుల్లో రాజాజీ కూడా ఒకరు. నా విషయంలో జరిగింది నాకు తెలుసు కనుక ఆయన రాజాజీకి నివాళులర్పించడంలోని చిత్తశుద్ధి నేనెరిగినదే.

అదే రోజు నన్ను అనేకమంది పాత్రికేయులు మరీ ముఖ్యంగా ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా విలేకరి పదే పదే ప్రశ్నించసాగాడు. 'మీరు కేంద్ర కేబినెట్‌లో చేరనున్నారని పుకారు బయలుదేరింది. అది సరైన పుకారేనా?' అంతకు ముందు అటువంటి ప్రశ్నలకు దూరంగా జరిగిపోతూ ఉండేవాణ్ణి. సర్దార్ జీ పక్కనే ఉండడంతో అలా చేయడం కష్టమైంది. మేము విమానంలో తిరుగు ప్రయాణంలో ఉండగా నాకు నెహ్రూ మంత్రి వర్గంలో చేరడం ఇష్టంలేదని తెలియజేశాను. నెహ్రూ ప్రతిపాదనలు ఏవైనా దేశానికిగానీ, ప్రజలకుగానీ ప్రయోజనకరంగా లేవని భావించి ఏదైనా ప్రత్యామ్నాయాన్ని సూచిద్దామంటే అది వర్కింగ్ కమిటీ కావచ్చు, పార్లమెంటరీ పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ కావచ్చు లేదా హైపవర్ కమిటీ ఏదైనా కావచ్చు నాకు మద్దతు పలికేందుకు ఒక్కరూ ముందుకు రాగలిగేవారుకాదు. కనుక అటువంటి మరో మండలిలో చేరి దేశ ప్రియతమ నాయకుల్లో ద్వితీయుడికి ఎదురునిలిచి హృదయ వేదనను పెంచుకుని ప్రయోజనం ఏమిటని నేను సర్దార్‌ను అడిగాను. 'ఒకసారి ప్రయత్నించి చూడొచ్చుగా' అన్నది

ఆయన సమాధానం. **'నేను ఆయన దయకు పాత్రుణ్ణి కాదల్చుకోలేదు. నాకు తెలుసు అయన కంట్రోళ్లను ఎత్తివేసేందుకు అంగీకరించడు.** ఆహార ధాన్యాల సేకరణను ఆపజాలడు. అటువంటి విషయాల్లో మరి నేను రాజీపడను'.

అంతకుపూర్వం నేను నెహ్రూ, రాజన్ బాబుగార్లను ఆహార ధాన్యాలపై కంట్రోళ్లను ఎత్తివేయమని కోరిన సందర్భాల్లో వల్లబ్ భాయీజీ నాతో ఏకీభవించేవారు. చివరకు కంట్రోళ్లను ఎత్తివేసిన సందర్భంగా ఆయన ఉప్పొంగిపోయారు. తిరిగి జవహర్‌లాల్‌జీ కంట్రోళ్లను విధించినప్పుడు ఆయన తన నిస్సహాయతను ప్రకటించాడేకానీ కంట్రోళ్ల రద్దుకు నేను చేపట్టిన ఉద్యమానికి మద్దతు పలకలేక పోయారు. ఆయన రాజకీయ వ్యూహం అటువంటిది. అసెంబ్లీలో, పార్లమెంట్‌లో అధిక సంఖ్యాకుల మాదిరిగానే ఆయన కూడా రెండు సందర్భాల్లో ప్రజాభిప్రాయానికి ఎదురీదాడు. దేశభక్తి గల యువరాజుల నుండి వాళ్ల రాజ్యాలను కేంద్రంలో కలిపేందుకు ఒక అంగీకారానికైతే తీసుకురాగలిగాడుకానీ అది ప్రభుత్వం ప్రీవీపర్సులు ఇచ్చేందుకు ఒప్పించే పూచీకత్తు మీద. అదే విధంగా ఐసిఎస్ అధికారులకు వాళ్ల వేతనాలు, ఇతర మినహాయింపులు కొనసాగుతాయని హామీని ఇవ్వదలిచారు. పలువురు సభ్యులు అభిప్రాయపడేదేమంటే

వల్లభాయిజీ ఏ విషయానికైనా అంగీకారాన్ని తెలియజేస్తే అటువంటి మార్పును జవహర్‌లాల్‌జీ ఆహ్వానించి తీరుతారని. సర్దార్ యువరాజులకు, ఐసిఎస్ అధికారులకు ఇచ్చిన మాటను నిలబెట్టదల్చుకున్నారు. అందువల్ల ఆయన సభ్యుల అభిప్రాయాన్ని అడిగీ అడగగానే కరతాళ ధ్వనులు హోరెత్తాయి. అన్ని విషయాల్లో నేను ఆయన మౌనాన్నిగానీ, వాగ్దానాలనుకానీ ఆమోదించలేను. అటువంటి సందర్భాల్లో ఆయన నా భుజం మీద తన ఎడమ చేతితో మెల్లగా తడుతూ 'అన్నీ అవే సర్దుకుపోతాయి. ఆత్మగత సందేహాలను విడనాడు' అనేవారు. అటువంటి ఆత్మీయతను పంచుతూ, ధైర్యాన్ని ప్రదర్శిస్తూ ప్రజా జీవితంలో ఉన్న మా వంటి వారి హృదయాలను కొల్లగొట్టాడు. అలాంటి వారిలో నా మిత్రులు **వి.పి.మీనన్, సి.సి.దేశాయ్, శంకర్, బెనర్జీ**వంటి అనుభవజ్ఞులున్నారు.

నా అదృష్టంకొద్దీ రాష్ట్రాల విలీనంలో ఆయన అభిమాన సహచరుడు వి.పి. మీనన్, ఆయన కుమారుడు శ్రీదహ్యాభాయ్ పటేల్, వల్లభాయ్ పటేల్ విశ్వవిద్యాలయ నిర్మాత బైలాల్ భాయ్ పటేల్‌వంటి వారందరూ ఈ 'స్వతంత్ర' భారత ఉద్యమంలో నాతో అడుగు కలిపి నడుస్తున్నారు. సర్దార్ మిత్రులు అనేకమందిని మాతో చేర్చిన ఈ చారిత్రక ఉపాయానికి ముగ్ధులవుతున్నారు. **సర్దార్ చాలా గంభీరుడని అందరి అభిప్రాయం. ఆ అభిప్రాయం సరైంది కాదంటాను** 1960లో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరిస్తూ రాజాజీ: ఢిల్లీలో ఆయన అస్వస్థతగా ఉన్న సమయంలో ఆయనను చూసేందుకు వెళితే కన్నీరు కార్చారని చెప్పారు. మా పట్ల ఆయన ప్రేమ అంత అపారం.

ఒక కీలక ప్రదేశంలో సర్దార్‌జీ విగ్రహం నెలకొల్పేందుకు ఇష్టపడడంలేదని తెలియవచ్చింది. సర్దార్‌ను గౌరవిస్తూ ప్రజాందోళనలు కొనసాగాయి. 1965లో నెహ్రూ చేపట్టిన 17వ సవరణకు వ్యతిరేకంగా నా ఆధ్వర్యంలో సాగిన చారిత్రక రైతు యాత్ర పార్లమెంట్ వీధికి చేరుకోగానే విగ్రహానికి గులాబీ మాలలు, బంతి పూలదండలు వేసి గౌరవాన్ని చాటుకోవడం జరిగింది. ఆ రైతు యాత్ర రాజ్యాంగానికి 17వ సవరణ వల్ల రైతులు తమ భూమి హక్కు కోల్పోతారని, అందువల్ల ఆ సవరణను వ్యతిరేకిస్తూ సాగిన రైతు యాత్ర అది. అప్పటి నుండి అటుగా ఏ ఉద్యమ ఊరేగింపు సాగినా సర్దార్‌కు నివాళి అర్పించి పోవాల్సిందే. నిజంగా అదొక ప్రత్యేక గౌరవం.

26

కిసాన్ మజ్దూర్ ప్రజా రాజ్య ఆవిర్భావం సుభాష్ బాబు ఆదర్శపూరిత ప్రభావం

భారత రైతు సంస్థకు కేంద్ర కార్యాలయంగా ఉన్న నిడుబ్రోలులోని రమ-నీడు భవనంలో 23.1.1967న నేతాజీ జన్మదినం జరుపుకుంటున్న సందర్భంగా నేను నా ప్రసంగంలో ఈ కింది విషయాలు చెప్పాను:

1940లో సుభాష్‌బాబు మద్రాస్‌లో వాహిని కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా మిగతా ప్రఖ్యాతిగాంచిన నాయకుల వలేగాక సుభాష్‌బాబు సంపాదకీయ కార్యాలయంలో, ప్రెస్ విభాగంలో పనిచేసే వారందరినీ కలుసుకున్నారు. నా వైపు తిరిగి 'తిరుగుబాటుదార్లను తయారుచేసే నీ కర్మాగారం ఇదేనన్నమాట'. కార్మికుల్లో ఎవరో అందుకుని 'నిడుబ్రోలులోని కేంద్ర కర్మాగారానికి ఇది అనుబంధం మాత్రమే' అనగానే ఆయన సర్దుకుని 'అవును, అక్కడి రైతు విద్యాలయం నాకు గుర్తుంది' అన్నారు.

ఆ సాయంత్రం మెరీనా బీచ్‌లో దేశోద్ధారక ఫూట్ వద్ద ఆయన్ను అభినందించేందుకు వచ్చిన జనంతో కిటకిటలాడింది. ఆ సభకు నేను అధ్యక్షుణ్ణి. **సుభాష్‌బాబు ప్రధానంగా రెండు వర్గాలతో పోరాడాల్సి వస్తుందన్నాను. 1) మంత్రి వర్గాలకై**

1939లో తమిళనాడు ప్రాంతీయ కిసాన్ సదస్సులో సుభాష్‌బాబు ప్రసంగిస్తూ అత్యంత నిజాయితీపరుడైన, ప్రముఖ భారత రైతు నాయకునిగా పేర్కొని తనకు సన్నిహిత మిత్రుణ్ణి అని కూడా చెప్పారు.

భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించిన తర్వాత దేశానికి ఎటువంటి రాజకీయ నాయకత్వం అవసరం అనే విషయంపై మేము కరాచీ కాంగ్రెస్ (1931) నాటినుండి సుదీర్ఘంగా చర్చిస్తూనే ఉన్నాం. కమ్యూనిస్ట్‌లు అలా ఎంతగా తిట్టిపోసినా ఆయన సామ్రాజ్యవాది కాదు. స్వతంత్ర భారతంలో కార్మికులకు, కర్షకులకు రాజకీయ నాయకత్వంలో వారి వాటా వారికి లభించాల్సిందేననే నా వాదనకు మద్దతు పలుకుతూనే, మా 'కిసాన్ మజ్దూర్ రాజ్' నినాదాన్ని అంగీకరిస్తూనే మధ్యతరగతి ప్రజల విషయాన్ని కూడా విస్మరించరాదనే సలహా ఇచ్చారు (మార్చి 1939 రామ్‌ఘర్ సమావేశం). 'రంగాజీ, మీరు మీ నినాదాన్ని మరింత స్ఫూర్తిదాయకం గావించేటట్లుగా విస్తరింపజేయాలి. కిసాన్ మజ్దూర్ రాజ్ అనే నినాదం బాగానే ఉంది. అయితే కావాల్సినంత విశాలంగా లేదు. మన జాతీయ తిరుగుబాట్ల సందర్భాల్లో మధ్యతరగతి యువత పాత్ర మరువరానిది'.

ఆయన వాదనలోని సామర్థ్యం నాకు తెలియవచ్చింది. ఆయన వ్యధ నాకు అవగతమైంది. దాంతో 1940-41 మధ్యకాలంలో వెల్లూరు, తిరుచ్చి కారాగారాల్లో ఉండగా ఆ నినాదాన్ని, ఆశయాలను మరింతగా విస్తృతపర్చడం ఎలాగా అని ఆలోచించసాగాను. అందులోకి ప్రజాస్వామ్య భావనలతో తులతూగేవారిని, ప్రగతివాదుల్ని, సామాజిక విప్లవకారుల్ని, మధ్యతరగతి ప్రజల్ని చేర్చడం ఎలా అని ఆలోచించసాగాను. ఫాసిస్ట్, నాజీ తరహా సిద్ధాంతాలను విశ్వసించేవారు ప్రజాస్వామ్యంపై, మార్క్స్ వాదనపై తిరుగుబాటు ఎందుకు చేశారో తడివి చూశాను. మధ్యయుగాలనాటి పట్టణ మధ్యతరగతి ప్రజల పాత్రను మదింపు చేయసాగాను. ఈ ప్రయత్నంలో **'వాట్ మార్క్స్ రియల్లీ మెంట్'** అనే కోల్ రాసిన పుస్తకం బాగా ఉపకరించింది. అలాగే **జాన్‌స్టూచీ** మధ్యతరగతి ప్రజల విషయాన్ని అంతగా ఎందుకు పట్టించుకున్నదీ అధ్యయనం చేశాను. **1929లో మధ్యతరగతి ప్రజల మద్దతు లేకుండా బ్రిటిష్ లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉండేదికాదని తెలియవచ్చింది.** ప్రజల ప్రజాస్వామిక వాంఛకు మధ్యతరగతి ప్రజలే మార్గం సుగమం చేసింది. కనుక నా నినాదాలు,

ఆశయాలు మధ్యతరగతి ప్రజలను ఆకర్షించి వారి విశ్వాసాన్ని, మద్దతును కూడగట్టే విధంగా మలచాలని చూశాను. ఈ అధ్యయన తపస్సు రెండు సంవత్సరాలకు పైగా కొనసాగింది. దాని ఫలితమే **'కిసాన్, కళాకార్, మజ్దూర్, బుద్ధిజీవుల రాజ్యం'** అనే పదం వెలుగులోకి వచ్చింది. దాని సంక్షిప్త నామమే **'కిసాన్ మజ్దూర్ ప్రజా రాజ్యం'**. ఇక్కడ ప్రజలనే పదం సమస్త శ్రమ జీవులకు అన్వయిస్తుంది.

స్వతంత్ర భారతంలో ఏర్పాటుచేసుకునే రాజ్యం ముమ్మాటికీ ప్రజాస్వామికం కావాలనే కోరుకున్నాను. అందువల్ల మా నినాదం 'ప్రజాస్వామిక కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం'గా నిలిచిపోయింది.

మేము వెల్లూరు, డామన్ జైళ్లల్లో ఉండగా ఇటువంటి ఒక సంపూర్ణ నినాదాన్ని రూపొందించగలిగినందుకు ఎంతటి హృదయానందాన్ని అనుభవించామో వివరించి చెప్పలేను. 1942లో నేను విడుదలయ్యాను. క్రిప్స్ రాయబారం విఫలమైంది. బాపూజీ రెండో స్వాతంత్ర్య సంగ్రామం కోసం రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ప్రజల వైపునకు చూస్తున్నాడు. ఆ సమయంలో నేను బాపూజీని వార్ధాలో కలిశాను. ఆయనకు కష్టజీవులందరినీ ఒకే తాటిపైకి తీసుకురావాల్సిన ఆవశ్యకతను మా సుదీర్ఘ చర్చల్లో వివరించాను. సుభాష్ బాబు అభిప్రాయాన్ని కూడా తెలియజేశాను. కమ్యూనిస్టులు రైతుల గురించి ప్రత్యేక శ్రద్ధ పెట్టకపోవడాన్ని సూచించాను. మన పార్టీలు, నాయకులు స్వాతంత్ర్యం లభించిన తర్వాత రైతుల్ని పట్టించుకోరేమోనని భయంగా ఉందన్నాను. సరైన సమయంలో ఈ ఆలోచనలకు పూర్తిగా మద్దతు పలకగలనని మాట ఇచ్చాడు మహాత్ముడు. ఈ విషయంలో నెహ్రూజీని కూడా కలిశాను. ఎట్టకేలకు 1942లో బొంబాయి అఖిలభారత కాంగ్రెస్ సదస్సులో జాతీయ ప్రభుత్వంలో రాజకీయ అధికారం సహజంగానే పొలాల్లో, కర్మాగారాల్లో, మిగతా తావుల్లో శ్రమించేవారికే దక్కుతుందనే తీర్మానాన్ని ఆమోదించింది.

1944 నవంబర్‌లో నా కోరిక మేరకు గాంధీజీ **'డెమోక్రాటిక్ కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం'**కు జయం కలుగుగాక అని దీవించారు. అప్పుడు నవ్వుతూ అడిగారు : 'రంగా, ఇప్పుడు సంతోషమేనా?'. అప్పుడు లెక్కకు మిక్కిలిగా ఉన్న రైతు మృతవీరులేగాక సుభాష్‌బాబు ఆశయ సాధనకు కృషి చేశాననే ఆలోచన నాలో మెదిలింది. అప్పటికే సుభాష్ బాబు 'నేతాజీ'గా కీర్తి గడించాడు.

27

కిసాన్ మజ్దూర్ ప్రజా రాజ్‌కు బాపూ దీవెనలు

స్వతంత్ర భారతదేశంలో కిసాన్ రాజ్యం ఏర్పాటు విషయంలో నా ఆశయం సిద్ధిస్తుందని 20వ శతాబ్దపు 30వ దశకంలోని రైతు బిడ్డలైన కాంగ్రెస్‌వాదులు ఆశించారు. కర్షకులను, కార్మికులను ఏకంచేసి రాజ్యాన్ని సాధించే విషయంలో నాతో సహకరించి పనిచేస్తున్న సోషలిస్ట్‌లు, కమ్యూనిస్ట్‌లకు కూడా ఎంతగానో నచ్చచెప్పాల్సి వచ్చింది. **ఎట్టకేలకు 1938లో కిసాన్ కాంగ్రెస్ గయలో నిర్వహించిన సదస్సులో కార్మిక, కర్షక రాజ్యపు సిద్ధాంతాన్ని అంగీకరించడం జరిగింది. ఆ సదస్సుకు కీ.శే.ఆచార్య నరేంద్రదేవ్ అధ్యక్షత వహించారు.** ఆయన కూడా కిసాన్ మజ్దూర్ రాజ్ సిద్ధాంతాన్ని స్వాగతించారు. అప్పటి కాంగ్రెస్ అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్ కిసాన్ కాంగ్రెస్‌కు ఆశీర్వాదాలు అందించేందుకు సిద్ధంగానే ఉన్నాడుకానీ కిసాన్ మజ్దూర్ రాజ్ సిద్ధాంతం విషయంలో తటపటాయిస్తున్నాడు. ఆ సిద్ధాంతానికి కిసాన్ కార్యకర్తల్లోని కమ్యూనిస్ట్‌లు ఎంతగా



విముఖంగా ఉన్నారో అంతే విముఖంగా సనాతన పట్టణ ప్రాంత కాంగ్రెస్‌వాదులు సైతం ఉన్నారు. అందుకు కారణం రాజకీయంగా గుర్తింపును కోల్పోయి సామాజికంగా నిండా మునిగిన వర్గం అధికారంలోకి రావడం సాధ్యంకాదని. నాకేమో వాళ్లను ప్రగతిదాయకమైన, ఆనందదాయకమైన వర్గంగా తీర్చిదిద్దాలనే తపన. నేను ఎల్లప్పుడూ బాపూజీ ఆశీర్వాదాల కోసం ఎదురుచూసేవాణ్ణి. దానివల్ల అవసరమైన పారలౌకిక కదలిక రాజకీయ చలామణిలో లభించి ప్రజల హృదయాల్లో స్థానం పదిలపర్చుకుంటుందనే ఆత్రుత నాకుండేది.

ఈ సిద్ధాంతపు బాగోగులు మా జైలు సదస్సుల్లో, రోజువారీ సంభాషణల్లో చర్చకు వచ్చేవి. తంజావూరు జైలులోని వాళ్లయితే బాపూ కనుక అంగీకరిస్తే మనం కమ్యూనిస్టుల సవాల్‌ను తట్టుకోగలుగుతాం. మనం యువతను, విద్యార్థుల్ని ఆకట్టుకోగలుగుతామనే ఆశతో ఉన్నారు. 1944లో నేను కారాగారం నుండి విడుదలయ్యే సందర్భంలో లోపల ఉన్న ఖైదీలు బాపూజీతో నా చర్చలు ఫలప్రదం కావాలని కోరారు. నేను **రైతుల** పక్షాన సరిగా నచ్చజెప్పగలిగితే మా సిద్ధాంతానికి ఆయన ఆశీర్వాదాలు లభించి తీరుతాయి. ఆయన చిరునవ్వుతో చెయ్యి ఊపుతూ స్వాగతిస్తుంటే నాకు ఎంతో హాయిగా ఉండేది. **నవంబర్‌లో మా సిద్ధాంతానికి బాపూ ఆమోదముద్ర లభించింది. అయితే పూర్తి ఆమోదం లభించినట్లా, కాదా అన్నది సందేహంగానే ఉంది. ఆయన కార్యాలయ సిబ్బంది దాన్ని నీరుకారుస్తారేమోననే భయంలేకపోలేదు. ఎన్నోమార్లు ఏదైనా నిలిపివేయడంలోగానీ, వ్యక్తిగతంగాగానీ, రాజకీయపరంగాగానీ ఆయనలోని పక్షపాత వైఖరిని గమనించి నేను విస్మయం చెందుతూ ఉంటాను.** అయితే మరుసటి రోజు నేను మళ్లీ కలవగానే కె.యం.పి.రాజ్ విషయంలో ఇంకేం కావాలని అడగడంతో నేను ఉప్పొంగిపోయాను. ఆశతో ఉత్తేజితుణ్ణయ్యాను. ఆయన మా సంభాషణలోని ముఖ్యాంశాలను రాయమన్నారు. ఇంకేమైనా సందేహాలుంటే అవి కూడా రాయమన్నారు. సాయంత్రం కలసినప్పుడు మాట్లాడుకుందామన్నారు.

దాదాభాయి నౌరోజీ మనుమరాలు, గాంధీ గారి కార్యదర్శుల్లో ఒకరైన కుర్షీద్ బెన్ నా ప్రశ్నల తయారీలో సహకారాన్ని అందించింది. గాంధీలోని గొప్పదనం ఏమంటే తనను నమ్మి వచ్చినవారితో కలసి ఆయన మౌనంగానూ, మాటల ద్వారా భగవంతునితో మాట్లాడగలడు. 1925 నుండి 1948 జనవరిలో జరిగిన దురదృష్టకరమైన ఆ రోజు వరకూ అటువంటి ప్రార్థనల ద్వారా నైతిక శక్తిని పొందేవాణ్ణి.

1944లో ఆ రెండు సాయంత్రాలు నేను ఆయనతో కలసి ప్రార్థనల్లో పాల్గొని స్ఫూర్తిదాయక స్పందనలు పొందాను. అటువంటి సందర్భాల్లో ఆయన మనకెంతో సన్నిహితంగా, దగ్గరగా కనిపిస్తూనే అందనంత దూరంలో ఉన్నట్లుగా ఉంటారు. ఆయన ఏకాగ్రత, స్వయంనియంత్రణ శక్తి అటువంటిది. అటువంటి ప్రార్థనా సమయంలో, ఆ శీతాకాలపు సాయం సమయంలో సేవాగ్రామ్‌లోని తన కుటీరానికి దక్షిణపు భాగాన గల బహిరంగ ప్రదేశంలో ఆయన **డెమోక్రాటిక్ కిసాన్ మజ్దూర్ కళాకార్ బుద్ధిజీవి రాజ్** సిద్ధాంతానికి అంగీకారాన్ని తెలియజేయడంతో నా భుజాలపై మరింత బాధ్యతను మోపినట్లయ్యింది. మా సిద్ధాంత సందేశాన్ని భారతదేశంలోనూ, విదేశాల్లోనూ వ్యాప్తిచేసేందుకు నాకు అవసరమైన నైతిక శక్తి లభించినట్లయ్యింది. ఆయన ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి చేసే ప్రచారం వల్ల వృత్తికళాకారులంటే ఆయనకు ఎంతటి ఆదరణో మనకు తెలియవస్తుంది. అందువల్ల **స్వాతంత్ర్యప్రియులై, కల్లలెరుగక, దోపిడీ చేయక, సహకార భావనలో తులతూగుతూ సామాజిక స్పృహ కలిగిన అతి పురాతన సంతతికి చెందిన కష్టించి బతికే శ్రామిక తరగతికి చెందిన రైతుల పట్ల ఆయనకు ఎంతటి అంకితభావమో నాకు తెలియవచ్చింది.** వాళ్లు స్వయంపోషకులై వాళ్లపై ఆధారపడి జీవించేవారికి వారు పండించేదానిలో భాగంపంచి ఇవ్వడాన్ని ఆయన ఎంతగానో మెచ్చుకునేవారు.

ఆయన దృష్టిలో జాతీయ ఉద్యమానికి ఒక అర్థవంతమైన ప్రాముఖ్యం ఉంది. ఆయనకు గ్రామీణ నాగరికత పట్ల ప్రీతి మెండు. పట్టణ జీవన విధానపు చెడుగులకు, పారిశ్రామికీకరణ సాంద్రతకు దూరంగా ప్రతి వ్యక్తి చేతులతో, మేధతో పనిచేస్తూ వేరొకరికిగానీ, రాజ్యానికిగానీ బానిసలా ఊడిగం చేయకుండా స్వేచ్ఛామయ, ఆనందమయ జీవనం గడిపే అవకాశం ఉందని నేను విశ్వసించాను. భారతదేశంలో 'డెమోక్రాటిక్ కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం' సిద్ధాంతానికి మద్దతు పలకడమే కాకుండా తెల్లవాళ్లు కానివారి ఉద్యమాలకు గాంధీజీ మద్దతివ్వడం చూస్తే ఆయన్ను మరెంతగానో ఉన్నతంగా అర్థంచేసుకునేందుకు అవకాశం కలిగింది.

బాపూ ఆశించే ఏ విధమైన సామాజిక వ్యవస్థలో అయినా నియంతృత్వానికి తావులేదు. ఆయన గాంధీయిజం అనేదాన్ని ఎవరిపైనా రుద్దలేదు. గాంధీ మార్గం ప్రజల జీవన విధానంగా రూపుదిద్దుకుంది. ఇటువంటి విషయాలన్నీ మనసులో సుడులు తిరుగుతూ ఉండగా హృదయం మానవ సేవకు, శాంతిని కాంక్షించే గాంధీజీ మహోన్నత

ఆశయాలకు, స్ఫూర్తిదాయక నాయకత్వానికి కూడా అంకితం కాసాగింది.

ఆయన ప్రార్థనా సమావేశం తర్వాత తిరిగి రాత్రికి మాట్లాడుకుందామని పిలిచారు. ఆయన బాగా అలసిపోయినట్లు కనిపించారు. అందువల్ల అప్పటికి చర్చలు విరమించి నేను వెళ్లేందుకు అనుమతి కోరాను. ఫర్వాలేదంటూ ఆయన చర్చలు కొనసాగించమన్నారు. అదీ ఆయన అనుయాయుల విషయంలో చూపే శ్రద్ధ. ఆయన అటువంటి సందర్భాల్లో తన వ్యక్తిగత అసౌకర్యాన్ని లెక్కచేసేవారు కాదు.

ప్రజా సేవకులకు వెనువెంటనే శిక్షణ అందించాలనే విషయంలో గాంధీజీతో మాట్లాడాను. ఆయన 1934లో నిడుబ్రోలులో ప్రారంభించిన భారత రైతు సంస్థ ఫలితాలను వివరించాను. అటువంటి విద్యా సంస్థల్లో క్రియాశీల కార్యకర్తల శిక్షణ అఖిలభారత స్థాయిలో నిర్వహించాలన్నారు. అహ్మదాబాద్ మజ్దూర్ సంస్థ నిర్వహించే శిక్షణా సంస్థ పనితీరును నన్ను అధ్యయనం చేయమన్నారు. సర్దార్ పటేల్ అధ్యక్షుడిగా, గుర్జారీలాల్‌నందా కార్యదర్శిగా పనిచేస్తున్న హిందూస్థాన్ మజ్దూర్ సేవక్ సంఘ్‌ను కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం సిద్ధాంత ప్రచారాన్ని కూడా చేపట్టమన్నారు. అనతికాలంలోనే అఖిలభారత విద్యార్థి కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, కిసాన్ కాంగ్రెస్ ఆశయాలను అందిపుచ్చుకున్నాయి.

తర్వాత **'గాంధీజీ అండ్ కిసాన్స్'** అనే ప్రత్యేక కరపత్రాన్ని అహ్మదాబాద్‌లోని నవజీవన్ ప్రెస్ ప్రచురించింది. అందులో బాపూకు, నాకూ మధ్య జరిగిన చర్చల సారాంశం ఉంది. మహాత్మునిపై ఎనిమిది సంపుటాలు ప్రచురించిన టెండూల్కర్ ఆ వివరాలను ఆరో సంపుటిలో మరింత విపులంగా పేర్కొన్నారు. ఆ సంపుటాలను నవజీవన్ ప్రెస్ 1953లోనూ, భారత ప్రభుత్వం 1962లోనూ ప్రచురించాయి.

28

యుద్ధ సమయపు రాజకీయ ఖైదు

30. 3. 1940న నన్ను నిర్బంధిస్తూ పంపిన ఉత్తర్వుల్లో నేను గ్రామందాటి వెళ్లనని హామీ ఇస్తే జైలుకు వెళ్లే పనిలేదని తెలియజేశారు. గాంధీజీ అటువంటి హామీనిచ్చి ఆయన నన్ను కారాగారం నుండి విడుదల కావాల్సిందిగా కోరారు. అటువంటి దురదృష్టకరమైన, పొరపాటు సలహా గాంధీజీ నుండి నాకు చేరే సమయానికి రెండు



రోజుల ముందే నాకు ఒకటిన్నర సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించాడు. ప్రభుత్వ ఆజ్ఞలను నేను ఉల్లంఘించడమే అందుకు కారణం. **బ్రిటిష్ ప్రభుత్వం ముందు నన్ను మోకరిల్లమని బాపూ సలహా ఇవ్వడమంటే ఆయనలో చేవ సన్నగిల్లినట్టే. అటువంటి తలవంపు ఎటువంటి స్వాతంత్ర్య యోధునికీ ఎదురుకాకూడదు.** ప్రభుత్వం నన్ను విడుదల చేసేందుకు సిద్ధంగానే ఉంది. నేను సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తేందుకు సిద్ధంగా లేను.

అంతటి నిర్దయగా గాంధీజీ ఎందుకు ప్రవర్తించినట్టు? నేను కాంగ్రెస్ క్రమశిక్షణకు విఘాతం కలిగించినట్లుగా ఆయన భావించి ఉండొచ్చు. మేము గాంధీ గారిదిగానీ, కాంగ్రెస్‌దికానీ అంగీకారం పొందకుండా నేను, సుభాష్‌బాబు మా అంతట మేమే పోరాటానికి పథకం పన్నామని ఆయన భావించి ఉండొచ్చు.

పత్రికల ద్వారా నన్ను నిర్బంధించిన వార్త తెలుసుకుని ఉత్తరప్రదేశ్, బెంగాల్, బీహార్ లలోని ఎందరో ప్రజలు చట్టాన్ని ధిక్కరించి జైళ్లకు పోసాగారు. **దీనివల్ల నేను ఇతర వామపక్షాలతో కలసికట్టుగా సాగించాలనుకునే స్వతంత్ర సత్యాగ్రహ సమరానికి శ్రీకారంచుట్టినట్టు కనిపించి ఉంటుంది.** అందువల్లనే ఆయన అటువంటి అనుచిత ఆదేశం ఇవ్వడం జరిగింది. ఈ విషయంలో ఆయన కావాల్సినంత ఆలోచన చేయలేదు. ఆయన తన విషయంలోనే నా నుండి లొంగుబాటును కోరకుండా బ్రిటిష్‌వాళ్లకు తలవంచమని కోరడం ఆయనను పునరాలోచించేటట్లు చేసి ఉంటుంది. అందువల్లనే ఆయన నా సాహసం గురించి, నా అధ్యయనం గురించి, బాధ్యతాయుత నాయకత్వం గురించి అలా మంచిగా చెప్పడం జరిగింది. జయప్రకాశ్ నారాయణ్ గారితోకంటే స్నేహంలో నేనే దగ్గరని చెప్పాలి. (మహాత్మునిపై టెండూల్కర్ పుస్తకం, వాల్యూమ్-3, పుట 276).

మద్రాస్ ప్రభుత్వం గాంధీ మహాత్ముని ప్రకటన కారాగారంలో ఉన్న నాకు పంపి ఆయనకు సమాధానం పంపేందుకు అంగీకరించింది. నేను 25 పుటల సమాధానం రాశాను. అందులో నా చర్యను సమర్థించుకున్నాను. **అది స్వతంత్రించి గాంధీ గారికి సంబంధంలేని మరో పోరాటం కాదని వివరించాను.** అదంతా వర్కింగ్ కమిటీ పోరాటం విషయంలో చేసిన తాత్సారం ఫలితమేనన్నాను. అందువల్ల మనం విలువైన సమయాన్ని పోగొట్టుకోవడం జరిగిందన్నాను. తగిన సమయంలో స్పందిస్తే మహాత్ముని నాయకత్వాన అంతా అహింసా పద్ధతిలో ఉద్యమం కొనసాగి ఉండేదని తెలియజేశాను.

ఆ సమాధానం గాంధీజీకి ఊరట కలిగించింది కానీ ప్రభుత్వం మాత్రం అగ్గి మీద గుగ్గిలమైంది. కనుక ప్రభుత్వం మందస కొట్లాటలో ఇరికిస్తూ నా మీద మరో కేసు బనాయించింది. 1940లో పలాసలో నిర్వహించిన అఖిలభారత కిసాన్ కాంగ్రెస్‌లో నేను మందస రైతుల్ని రెచ్చగొట్టానట. కనుక మందస రైతులు తర్వాత చేపట్టిన చర్యలకు నేనే బాధ్యుణ్ణట. మహాత్ముడు దానికి నన్ను ప్రతివాదిని కమ్మన్నాడు. నాలుగు వారాల మహాత్మునితో గొడవకు తెరపడింది. ప్రభుత్వం నా శిక్షను మరో సంవత్సరం పెంచింది. గాంధీజీ అంతర్గత క్రమశిక్షణ విషయంలో నాపై ఫిర్యాదును ఉప సంహరించుకున్నారు.

అదృష్టవశాత్తూ సుభాష్‌బాబు కూడా నాకు మద్దతుగా నిలిచాడు. ఆయన 'ఫార్వర్డ్ బ్లాక్' పత్రికలో ఘాటుగా సంపాదకీయం ప్రచురించాడు. నాకూ, గాంధీజీకీ మధ్య అనవసరంగా పుల్లలు పెట్టజూచిన కాంగ్రెస్‌లోని ఆ వర్గంవారి పల్లికిలింతలను తూర్పారబట్టాడు. గాంధీజీని ధిక్కరించేది రంగా కాదనీ, కాంగ్రెస్‌వాదులేనని గాంధీజీకి వివరించాడు. ఆ ఎనిమిదివారాల కష్టకాలంలో శ్రీమతి భారతీదేవి, జి.యల్.నారాయణ, శ్యాంబాబు, గొరైపాటివంటి నాయకులేకాక రైతులంతా కూడా నాకు విధేయత ప్రకటించారు. ఆ రోజుల్లో బ్రిటిష్ వాళ్ల అధికారంకాదు మమ్మల్ని గజగజలాడించింది. గాంధీజీ శక్తికే మేము గడగడలాడేవాళ్లం. అయితే ఎప్పుడైనా మా నిర్ణయాలు సరైనవిగా ఉండి గాంధీజీ పొరపాటుపడితే అది వివరించేందుకు వెనకాడేవాళ్లంకాదు. అటువంటి నైతిక శక్తి మాలో ఉండేది.

మిగతా గొప్ప నాయకుల మాదిరిగానే **ఇటు గాంధీజీకి, అటు సుభాష్‌బాబుకు విధేయునిగా ఉండడం గాంధీజీకి నచ్చేదికాదు.** అయితే సుభాష్ బాబు స్వచ్ఛందంగా దేశం వదలి వెళ్లడంతో గాంధీజీ నాకూ, నావంటి వారందరికీ ఎప్పటి మాదిరిగానే ప్రేమను పంచసాగాడు. 1944 నుండి మరణం వరకూ ఆయన ఆ ప్రేమను అలా పంచుతూనే ఉండేవాడు.

నాకూ, గాంధీజీకి మధ్య అభిప్రాయభేదాలకు కాంగ్రెస్ సంప్రదాయవాదులు, కమ్యూనిస్ట్‌లు కూడా చంకలెగరేశారు. అయితే వాళ్ల పప్పులుడకలేదు. ఆయన నేతాజీ గొంతు రేడియోలో విన్నానని, మా మధ్య ఆత్మిక సంబంధం కొనసాగుతూనే వుంటుంది అనే భరోసా ఇచ్చారు. ఔను, ఆయన నాకు నిలువెల్లా ప్రేమమూర్తే.

29

వలస ప్రజల స్వాతంత్ర్య కూటమి (1940)

ద్వితీయ ప్రపంచ మహా సంగ్రామం సందర్భంగా మన జాతీయ విధానం ఎందరో బ్రిటిష్ సోషలిస్ట్‌ల, కార్మిక సంఘాల వారిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఫాసిస్ట్ నాజీల ఓటమితో యుద్ధం ముగిసినా 1946లో నేను వ్యవసాయ ఉత్పత్తిదారుల తొలి ప్రపంచ సదస్సుకు వెళ్లినప్పుడు వారిని కలసి మాట్లాడినప్పుడు వాళ్లు నాతో ఏకీభవించలేదు. బ్రిటిష్‌వాళ్లు వాళ్ల సామ్రాజ్యవాద పాలనను భారతదేశంలో కొనసాగిస్తున్నా యుద్ధంలోకి మమ్మల్ని నెట్టిన విషయంలో మేము స్వతంత్ర దేశంగానే భావించుకుంటున్నాం. యుద్ధం విషయంలో మా వైఖరిని నిర్ణయించుకునేందుకు అమెరికా, రష్యాలెంతో మేమూ అంతే. 1939లో ఆ యుద్ధ సమయంలో ప్రజాస్వామిక దేశాలు అనుకుంటున్నవి, 1935 నుంచీ ఫాసిస్ట్ శక్తులకు అందదండలు అందిస్తున్నవి. మా ఆమోదం పొందకుండానే మమ్మల్ని యుద్ధంలోకి లాగాయి. స్పెయిన్, ఇటలీల ఫాసిస్ట్‌లు నాజీల సాయం పొందారు. ఇంగ్లండ్ ఏ పక్షంలోనూ చేరలేదు. జపాన్ విషయంలో ఐరోపా నిర్ధయ వైఖరి సుస్పష్టమే. ముస్సోలినీ సామ్రాజ్యవాద సైన్యాలు అబిసీనియా స్వాతంత్ర్యాన్ని మట్టుబెడుతుంటే

ఎం ఎన్ రాయ్

ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికాలు శక్తిహీనంగా ఉన్న అబిసీనియాకు సాయం ఏ మేరకు అందించాయి? ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు జెకొస్లోవేకియాను త్యాగం చేసేందుకు సైతం సిద్ధంకాలేదా? పెరల్‌వ్యాలీ సందర్భంగా యుద్ధంలో ఒక పక్షంలో చేరేవరకూ నాజీ వ్యతిరేక దేశాలతో జత కట్టేందుకు అమెరికా తటపటాయించలేదా? రష్యా నాజీ జర్మనీతో శాంతి ఒప్పందం ఎందుకు చేసుకుంది? దానివల్ల హిట్లర్ పోలెండ్‌ను సగం వరకూ ఆక్రమించుకోలేదా?

మరో దిశగా మేమేం చేశాం? మేము మిగతా సామాజిక విప్లవ శక్తులతో చేతులు కలిపాం –అదీ దురాక్రమణకు గురైన వాళ్లతో– స్పెయిన్, అబిసీనియా, సూడాన్ ప్రజలతో. చైనాపై జపాన్ దురాక్రమణను ఖండించాం. రిపబ్లికన్ స్పెయిన్‌కు మేము ఆహార ధాన్యాలు ఒక ఓడ నిండా పంపాం. మా స్వాతంత్ర్యాన్ని బ్రిటిష్ గుర్తించి జాతీయ ప్రభుత్వ ఏర్పాటును అంగీకరించే వరకూ మా జాతీయ ఉత్సుకతలను మేము కాపాడుకుంటూ తటస్థంగా ఉండదలిచాం. జాతి చారిత్రక సంపదకు ముప్పువాటిల్లే సందర్భంలో మా స్పందన అద్వితీయమే. పారిస్ నేలమట్టంగావించబడినప్పుడు సరోజినీ నాయుడు కవితా హృదయం కన్నీరుకార్చింది. అయినా సరే మేము మా జాతి ప్రయోజనాలను విస్మరించం.

బ్రిటిష్‌వాళ్ల వైపు నుండి చూస్తే భారతదేశంలోని అన్ని పార్టీలు యుద్ధ సమయంలో బ్రిటిష్‌వాళ్లకు మద్దతు పలుకుతున్నాయి. అయితే వాళ్లు మాత్రం జాతీయ ప్రభుత్వ ఏర్పాటుకు అంగీకరించడంలేదు. ఇతర కాంగ్రెస్ వాదుల వలే నాజీయిజాన్ని తుదముట్టించాలి అనుకోవడంలో బ్రిటిష్‌వాళ్లకంటే వెనుకంజలో లేము. అయినా జాతి విషయంలో మా పట్టింపు మాది.

సుకర్నో

నా ఐరోపా సోషలిస్ట్ మిత్రులు భారత జాతీయ వైఖరిని,

తప్పనిసరి పరిస్థితిని, అందులోని న్యాయాన్ని, దానికి నా మద్దతును అవగాహన చేసుకుని అభినందించారు. యుద్ధంలో విజేతలెవరైనాకానీ వలస ప్రజల, తెల్లవాళ్ళు కానివారి ఐక్య సంఘటన కొనసాగాల్సిందేననే తలంపుతో గాంధీజీ ఆశీర్వాదాలతో మిత్రుల కోసం స్నేహహస్తాలు సాచాం.

ఎం.ఎన్.రాయ్ యుద్ధానంతరం పశ్చిమ ప్రజాస్వామిక శక్తులు ధీలాపడిపోతాయని చేసిన హెచ్చరికలో వాస్తవం లేకపోలేదు. అందువల్లనే ఆయన ఫాసిస్ట్ వ్యతిరేక శక్తులకు మద్దతు పలకమన్నాడు. అయితే గాంధీవాదులమైన మేము భారత కమ్యూనిస్టులు మాదిరిగానో, ఇండోనేషియాకు చెందిన సుకర్నో మాదిరిగానో ప్రవర్తించదలచలేదు. **ఆ యుద్ధం వల్ల శుష్కించిన పశ్చిమ శక్తుల నాయకుడు అట్లీ. ఫ్రాన్స్‌కు చెందిన డీగాల్, అమెరికాలోని యుద్ధానంతరం అంతర్జాతీయ సమితి సామ్రాజ్యవాద వ్యతిరేక వాతావరణం అన్నీ కలసి ఆసియా, ఆఫ్రికా, కరేబియన్ దీవుల్లోని వలస ప్రజల విముక్తికి దారి సుగమం చేశాయి. అయితే దురదృష్టవశాత్తూ సామ్రాజ్యవాదం ఒకటి రష్యా కమ్యూనిస్ట్ నియంత్రణ విస్తరణలో భాగంగా విస్తరించి ఆగ్నేయ ఐరోపా దేశాలను చుట్టుముట్టింది.** అయినా జాతీయత కోసం ప్రతిఘటనలు ఆగలేదు. అవి నిరోధింపజాలనివి, అణచివేయజాలనివి. ఆ విషయాలను నా గ్రంథాలైన **'వరల్డ్ రోల్ ఆఫ్ నేషనల్ రివల్యూషన్, బౌండరీస్ ఆఫ్ నేషనల్ రివల్యూషన్'**లలో వివరించాను.

యుగోస్లావియా 1948లో స్టాలిన్ నియంతృత్వం నుండి విముక్తి పొందింది. హంగరీ, పోలెండ్‌లు రష్యా కమ్యూనిస్ట్ పెత్తనానికి ఎదురు తిరిగాయి. దాంతో కమ్యూనిస్ట్‌ల నయా జాతీయవాదం సోవియట్ రష్యా వైఖరిని మెత్తబడేటట్లు చేసింది. అందువల్లనే పోలెండ్, రుమేనియా, ఆల్బేనియా దేశాలు కమ్యూనిస్ట్ సామ్రాజ్యవాదం నుండి స్వాతంత్ర్యాన్ని కోరాయి. స్పుత్నిక్ అనంతర దశాబ్దం మావోయిస్ట్ చైనా సామ్రాజ్యవాదం చైనాతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కనుక స్వేచ్ఛా ప్రేమికులు నిరంతర జాగరూకులై కొత్త ముసుగులో ఉన్న సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించాలి.

30

బాపూజీ అంతిమ సందేశం: కాంగ్రెస్‌ను రద్దుపర్చడం

కాంగ్రెస్‌ను రద్దుపర్చడంలో విఫలం చెందితే అది శాంతియుతంగా అనుభవశాలుర్ని నిర్వీర్యం చేస్తుంది. **స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్‌ను రద్దుచేయడం భారత స్వాతంత్ర్య ఉద్యమ లక్ష్యం.** అది బాపూజీ పథకం. దాని స్థానంలో లోక్‌సేవా సంఘ్‌ను ఏర్పాటుచేయాలనుకున్నాం. అది చివరి వర్కింగ్ కమిటీలో చర్చకు వచ్చింది. కాంగ్రెస్‌వాదులు వారి వారి సామాజిక, ఆర్థిక విశ్వాసాలననుసరించి, సిద్ధాంతాలననుసరించి వివిధ రాజకీయ శిబిరాల్లోకి వెళ్లే అవకాశం కల్పించాలని బాపూజీ సూచించారు. స్వాతంత్ర్యం సిద్ధించింది కనుక ఇక కాంగ్రెస్ సంఘటిత రాజకీయ పక్షంగా కొనసాగాల్సిన పనిలేదన్నారు. అయితే కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ, కిసాన్ కార్మిక నాయకుల వాదన ఏమంటే అందరికీ ఉమ్మడి వేదిక అయిన కాంగ్రెస్

కొనసాగింపు ఫలప్రదమైన, ప్రగతిదాయక ప్రజాస్వామిక పార్లమెంటరీ జీవనం కొనసాగింపునకు ఎంతగానో అవసరమన్నారు. ప్రజల త్యాగాలతో ముడిపడ్డ కాంగ్రెస్‌ను రద్దుచేసి రాజకీయంగా ఏకఛత్రాధిపత్యం వహించే ముఠా అల్ప సంఖ్యాకుల గోడు పట్టించుకోదన్నారు. వాళ్ల వాదనలో న్యాయం ఉందని ఆయన గ్రహించాడు. పైగా అలవాటుపడిన వాళ్లు కాంగ్రెస్‌ను అలాగే అంటిపెట్టుకుని ఉంటారనుకున్నాడు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ద్వారా పాలనాపరమైన లబ్ధిని ప్రజలు పొందగలరు అనుకున్నాడు.

చివరకు దేశ విభజన జరిగిన తరుణంలో విశ్వాసపాత్రమైన రాజకీయ సంస్థగా నిలదొక్కుకున్న భారత జాతీయ కాంగ్రెస్‌ను రద్దు చేయడం వివేకవంతమైన పనికాదని గాంధీజీకి మద్దతు పలుకుతూ నిర్మాణ కార్యక్రమాలకు ప్రత్యేక వ్యవస్థలను రూపొందించుకుందామన్నారు. ఈ విషయమై బాపూ మరింతమంది కార్యకర్తలను సంప్రదించకముందే దురదృష్టం ఆయన్ను మన మధ్య నుండి లాక్కుపోయింది. వర్కింగ్ కమిటీ తననుగానీ, తన మాతృ సంస్థనుగానీ రద్దు గావించుకోలేకపోయింది. అలా గాంధీజీ తన మరణానికి ముందు ఆరోగ్యకరమైన ప్రజాస్వామిక పక్ష రాజకీయాలను ప్రజలకు అందించాలనుకుంటే భారతదేశంలో వేళ్లూను కున్న ప్రజాస్వామ్యపు సృజనశీల అవసరాల పట్ల అవగాహనలేని నాయకులు దాన్ని దుర్వినియోగం గావించారు.

నా దృష్టిలో భారతదేశం గనుక భారసామ్యాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగాలంటే కేంద్రంలో స్వరాజ్య ప్రభుత్వాలు, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా, నిజాయితీతో, విశ్వాసపాత్రంగా అభివృద్ధి పథంలో పయనించాలంటే పార్లమెంట్ విధానంపై విశ్వాసం కలిగి, అహింసా పద్ధతిలో, రాజ్యాంగబద్ధంగా రాజకీయ చర్యలను తీసుకుంటూ ముందుకు సాగాలంటే రెండు, మూడు సమ ఉజ్జీలైన రాజకీయ పక్షాలు ఉండి అవి తమ తమ విభిన్న అభిప్రాయాలకు అనుగుణంగా మన సామాజిక ఆర్థిక విధానాన్ని రూపొందించడం ఎలాగో వెల్లడిస్తూ ఉండాలి. కాంగ్రెస్‌లోని ఎక్కువమంది అసహనాన్ని, ముఠా తత్వాన్ని, సామాజిక ప్రతికూలమైన చేదు అనుభవాలను చవిచూడడమే కాకుండా అంతే మోతాదులో జగడాలమారుల్ని, అసహనపరుల్ని, తమ వాదాన్నే నెగ్గించుకోజూసే చిన్న ముఠాలను గురించిన అవగాహన కూడా నాకుంది. ఇదంతా చూసిన తర్వాత స్వరాజ్ ఇండియాలో అటువంటి పోటీ రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా ప్రజాస్వామిక పంథాలో నడుచుకోవాల్సిన అవసరం ఉ

ందనిపించింది. కనుక గాంధీజీ కోరిన విధంగా కాంగ్రెస్‌ను రాజకీయ పక్షంగా రద్దు చేయడమే మంచిదనిపించింది. అయితే దేశ విభజనానంతర సమస్యలు దాన్ని అంగీకరించి అమలుపర్చేందుకు 1947-50 సంవత్సరాల మధ్యకాలం ఆచరణ సాధ్యంకానిదిగా తయారైంది.

1950లో కాంగ్రెస్‌లోని కుమ్ములాటలు నాకు నచ్చలేదు. గాంధీజీ ఆశయానికి అనుగుణంగా అలా కలిసుండి కుమ్ములాడుకునే కంటే రెండు లేదా మూడు పార్టీలుగా విడిపోవడం మంచిదనిపించింది. ఆంధ్ర ప్రాంతపు కాంగ్రెస్ రాజకీయాల్లో ముఠాతత్వం పెచ్చరిల్లింది. దాన్ని అదుపు చేసే అధికారాలు నా వద్ద ఏమీలేవు. కనుక నేను పలు పర్యాయాలు కాంగ్రెస్‌లోని ముఠా రాజకీయాల విశృంఖలత్వాన్ని వర్కింగ్ కమిటీ ముందు ఉంచాను. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలు ధైర్యంగా ముందుకొచ్చి బాపూజీ సలహాను పాటించాలని కోరాను. అయితే సభ్యుల్లో అత్యధిక సంఖ్యాకులు కాంగ్రెస్‌ను రద్దు చేసేందుకు ఇష్టపడలేదు. అయితే మెజార్టీ ముఠా ఆశీర్వాదాలతో మైనార్టీ గ్రూపువాళ్లం మరో రాజకీయ పక్షాన్ని ఏర్పాటుచేద్దామన్నాను. అయినా అదీ భారతదేశపు ప్రజాస్వామ్యానికి నిర్మాణాత్మక పంథాగా గుర్తించడం జరగలేదు. అలా **కోడిపందాలవంటి ముఠా తగాదాలకు కాంగ్రెస్ నిలయమైంది. పోనీ, అప్పుడైనా మధ్యవర్తిత్వం వహిస్తూ కాంగ్రెస్ ఐక్యత కోసం కృషి చేసిందా అంటే అదీ లేదు. అది ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలను సమన్వయపర్చాల్సిందిపోయి కొన్ని ముఠాలకు దేవతగా, కొన్ని ముఠాలకు మెడ మీద కత్తిగా తయారైంది.**

1948లో కాంగ్రెస్ అధ్యక్షుని ఎన్నిక సమయంలో వర్కింగ్ కమిటీ ఎంతటి శక్తిహీనమైందో బహిర్గతమైంది. పోటీ డాక్టర్ పట్టాభి, పురుషోత్తమ్ దాస్ టాండన్‌ల మధ్య. అది నిజానికి నెహ్రూకు, సర్దార్ పటేల్‌కు మధ్య పోటీ. ఆ అభ్యర్థులిద్దరూ వీరి తరపున బరిలోకి దిగారు. నాకు లోలోపల ఏం జరుగుతుందో తెలియక మన ఆంధ్రుడు అధ్యక్షుడైతే బాగుంటుందనుకున్నా. అయితే ఆ అభ్యర్థి మంత్రి పదవుల్లో ఉన్నవారి అభ్యర్థి. ఆ వర్గం వారికి మేమంటే పడదు. కనుక మేము డాక్టర్ పట్టాభికి మద్దతు పలకమని అనుకున్నారు. అయితే మద్దతు పలకడం ద్వారా సందేహాలను పటాపంచలు చేసి ముఠాతత్వం రూపుమాపేటట్లు చూడాలనుకున్నాను. నేను డాక్టర్ పట్టాభికి మద్దతు పలికాను. మా ఓట్లే కీలకం. డాక్టర్ పట్టాభిని అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టగలిగాం.

డాక్టర్ పట్టాభి చేపట్టిన తొలి చర్య ఏమిటో తెలుసా? ఆంధ్ర రాష్ట్ర మంత్రి వర్గం

నుండి ఒకరిని జనరల్ సెక్రటరీని చేయబూనడం. ఆయన మమ్మల్ని వ్యతిరేకించే ముఠాకు చెందినవాడు కావడం వల్ల కీ.శే. కళా వెంకట్రావు రెవెన్యూ మంత్రి పదవిని వదలుకుని జనరల్ సెక్రటరీ అయ్యాడు. మమ్మల్ని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నుండి బయటకు పంపాలనుకున్నాడు. ఇక రెండోది, నన్ను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నుండి బయటకు పంపడం. అందుకు కారణం వర్కింగ్ కమిటీలో ఆంధ్రుల సంఖ్య మూడుకు పెరుగుతున్నందు వల్లనట. అయితే నా సభ్యత్వం వర్కింగ్ కమిటీలో కొనసాగించాల్సిందేనని సర్దార్ పటేల్ పట్టుబట్టడంతో ఈ విషయంలో వాళ్లకు చుక్కెదురైంది. ఇక మూడోది, కొత్త వర్కింగ్ కమిటీ ముందుకు కిసాన్ కాంగ్రెస్ సంస్థలన్నీ కాంగ్రెస్ నుండి విడిపోయి కార్యకలాపాలు కొనసాగించాలని. అయితే ఈ విషయాన్ని చర్చించేందుకు వర్కింగ్ కమిటీ అనుమతించలేదు. ఆ విధంగా 1931 నుండి నన్ను, నా అనుయాయులను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ పక్షంలోని ఆంధ్ర నాయకులు డాక్టర్ పట్టాభి, ఆయన జనరల్ సెక్రటరీ మాతో రాజకీయంగా గొరిల్లా పోరాటాన్ని వాళ్లు అధికారంలో ఉన్న రెండేళ్లకు పైగా సమయంలో కొనసాగించారు. అటువంటి స్థితిలో నేను స్నేహపూర్వకంగానే కాంగ్రెస్ నుండి వైదొలగడంకన్నా చేయగలిగింది ఏముంది?

తర్వాత జరిగిన అధ్యక్ష ఎన్నికకు కూడా అటువంటి పోటీనే. అయితే అది బహిరంగం కాకుండా లోలోపలే జరిగిపోయింది. అది ఇద్దరు పెద్ద నాయకుల మధ్య పోటీ–ఆచార్య కృపలానీ, పి.డి.టాండన్. పోటీలో నెగ్గినవారి పేరు ప్రకటించేవరకూ ఎవరు ఎక్కువ ఓట్లు సంపాదించుకున్నారన్నది సందేహాస్పదమే. పోటీ అంత తీవ్రంగా ఉంది. ఇద్దరి మధ్య ఓట్ల తేడా అంత స్వల్పంగా ఉంది. ఫలితాల ప్రకటనకు ముందు రాత్రి ఢిల్లీలో ఎన్నెన్ని ఊహాగానాలో! టాండన్‌జీ గెలిచినట్లు ప్రకటించారు. అది జవహర్‌లాల్‌జీని బాగా నిరుత్సాహానికి గురిచేసింది. ఇంకా తమాషా ఏమంటే డాక్టర్ పట్టాభిని వర్కింగ్ కమిటీ నుండి తొలగించారు. అతని ఆశ్రితుడైన కళా వెంకట్రావును జనరల్ సెక్రటరీగా కొనసాగించారు. కొత్త అధ్యక్షుడి ఎన్నిక తర్వాత కొద్ది మాసాలకు నెహ్రూజీకి కార్యదర్శులకు పడలేదు. అందువల్ల వాళ్లు రాజీనామా చేయాలన్నాడు. అధ్యక్షుడు టాండన్ అందుకు అంగీకరించలేదు. అప్పుడు జవహర్‌లాల్‌జీనే వర్కింగ్ కమిటీ సభ్యత్వానికి రాజీనామా చేశాడు. జవహర్‌లాల్‌జీ అసహనం వల్ల టాండన్‌జీకి జరిగిన అన్యాయానికి ఎ.ఐ.సి.సి. ఎటువంటి అభ్యంతరమూ తెలుపలేదు. నెహ్రూను

సంతృప్తిపర్చేందుకు టాండన్‌జీ అధ్యక్ష పదవికి రాజీనామా సమర్పించాల్సి వచ్చింది. ఆ విధంగా **నెహ్రూని అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టారు.** పనికిరారనుకొన్న వాళ్లనుకున్న కార్యదర్శుల్ని తొలగించారు. అందులో వెంకట్రావూ ఉన్నాడు. ప్రధానిగా ఉన్న నెహ్రూ పార్టీ అధ్యక్షుడవుతూ ఉంటే కాంగ్రెస్ నాయకులుగానీ, పార్లమెంట్ సభ్యులుగానీ కిమ్మనలేదు. అది మరి కాంగ్రెస్‌కు సుఖాంతమో లేక దు:ఖాంతమో. ఈ విధంగా జవహర్‌లాల్‌జీ కాంగ్రెస్‌కు తలమానికమయ్యాడు. **పార్టీ మీద, మంత్రివర్గం మీద ఎంతగా పట్టుబిగించాడంటే అది భారతీయ తరహా ప్రజాస్వామిక నియంతృత్వంగా మారిపోయింది.** ఆయన తర్వాత అధ్యక్ష స్థానానికి ఒక చిన్న రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రిని ఎంచుకున్నాడు. ఆయన కాంగ్రెస్ అగ్రశ్రేణి నాయకుడు కాదు. ఆయన ప్రధానికి ఏ విధంగానూ సాటికాకపోవడం సరే ప్రధానికి సలహాలివ్వగలిగిన స్థితిలో కూడా లేదు. ఆయన తన స్థానాన్ని గుర్తుచేసుకుని తల ఎగరేసేంతలో నెహ్రూ కూతురు అధ్యక్ష స్థానంలో కూర్చుంది. ఈ పరిణామం ఆయనకు నచ్చలేదని చెబుతారుకానీ ఒకటిమాత్రం నిజం– **తనకు ఎదురు నిలిచి నిలదొక్కుకోగలిగిన వాళ్లనెవర్నీ ఆయన అధ్యక్షునిగా ఆహ్వానించేవాడుకాదు.** ప్రధాని కూతురు అధ్యక్ష స్థానంలో ఉండడం ఆ పదవికి వన్నె తెచ్చింది. మోతీలాల్ నెహ్రూ అధ్యక్ష స్థానాన్ని తన కుమారునికి అప్పగించడంలో తప్పులేనప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ తన కూతురుకు అప్పగించడంలో తప్పేమున్నదని జవహర్‌లాల్ అనుయాయులు తీగ పాకం లాగారు. అలా నెహ్రూ కుటుంబం గద్దెను మూడు తరాలుగా అలంకరించింది. తాత, మనుమరాలి మధ్యకాలంలో శక్తిమంతమైన ఆ పదవి శుష్కించిపోయింది. **సర్వాధికారాలుగల ప్రధానికి వంతపాడే పదవిగా దాన్ని దిగజార్చారు.**

నెహ్రూ కుమార్తె తర్వాత అప్పటి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి సంజీవరెడ్డి అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు. ఆయన జాతీయ రాజకీయాలకు కొత్త. అయినా కొత్త పదవిలో అమితంగా పర్యటించే అవకాశాలకు ఉవ్విళ్లూరాడు. అప్పుడేమనుకున్నారంటే ఆయన 1951 నుండి నన్ను వ్యతిరేకిస్తూ వస్తున్నాడు కనుక జవహర్‌లాల్‌జీ ఆయన్ను కోరుకున్నాడని . నేను స్వతంత్ర పార్టీలో నాయకత్వం వహిస్తున్నాను కనుక ఆయన్ను పిలిపించి ఉంటాడనేది నా ఊహ. ఏదిఏమైనా సంజీవరెడ్డికి ఆ పదవి ప్రాముఖ్యం లేదుగా కనిపించడంతో రాజీనామా చేసి తిరిగి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా వెళతానని జవహర్‌లాల్‌జీకి చెప్పడం జరిగింది. ముఖ్యమంత్రిగా వున్న యువ హరిజన నాయకుణ్ణి

కాంగ్రెస్ గద్దె నెక్కించి సంజీవరెడ్డిని తిరిగి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిని చేశాడు. సంజీవయ్య యువకుడు కనుక మరెన్నో అవకాశాలు ముందుంది లభిస్తాయని కాంగ్రెస్ పార్టీ పదవిని చేపట్టడంలో సిగ్గుపడాల్సిన పనిలేదని చెప్పడంలోనే కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎంతగా ఆకర్షణను, ప్రతిష్టను కోల్పోయిందో అర్థంచేసుకోవచ్చు. తర్వాత సంజీవయ్య కేంద్ర కేబినెట్‌లో కార్మిక శాఖా మంత్రి పదవిని చేపట్టారు. **రానురాను జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కేంద్ర కేబినెట్‌లో చేరేందుకు ఒక మెట్టుగా మారింది.**

సంజీవయ్య స్పష్టంగా, ధారాళంగా విషయాన్ని వ్యక్తంచేయగల వక్త. చాలామంది కాంగ్రెస్‌వాదులు అధికారాన్ని అడ్డంపెట్టుకుని సంపదను మూటగట్టారని చెప్పగలిగిన ధైర్యాన్ని కూడగట్టుకోగలిగాడు. తర్వాత మద్రాస్‌కు చెందిన **కామరాజు నాడార్ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు. మౌనమే ఆయన బలం. అంతగా మౌనం వీడితే ఆయన చెప్పేది ఒక్క ముక్కే-పార్ కలామ్-అంటే చూద్దాంలే అని.** ఆయన బడిలో చదవకపోయినా హిందీ, ఇంగ్లీష్ ఎక్కువగా చదవకపోయినా అధికారం ఎక్కడ ఉంటుందో, దాన్ని అదుపు చేయడమెలాగో బాగా తెలుసు. తమిళనాడు కాంగ్రెస్‌లో ఆయన తిరుగులేని నేత. ఆయన్ను 'కింగ్ మేకర్' అనేవారు. **1952లో మద్రాస్ రాజకీయాల్లో కమ్యూనిస్ట్‌ల ప్రాబల్యం పెరిగినప్పుడు ఆయన రాజాజీని ముఖ్యమంత్రిగా ఉండి రాష్ట్రాన్ని కమ్యూనిస్ట్‌ల బారినుండి కాపాడమని కోరినవాడు. ఆ అవసరం తీరిన తర్వాత తాను 'కింగ్ మేకర్' పాత్ర పోషించడం**



మానేసి మద్రాస్ రాష్ట్రానికి మహారాజయ్యాడు.

జవహర్‌లాల్‌జీ తర్వాత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షునిగా ఏకగ్రీవంగా కామరాజ్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ అధ్యక్షునిగా అంతకుమించి ఆయన గొప్పేమీలేదు. ఆయన కాలంలో పార్టీలో అన్నీ లుకలుకలే. ఒకచోట సరిజేయబూనితే మరోచోట ఖరాబు. అన్ని రాష్ట్రాల్లో అసమ్మతివాదుల్ని బుజ్జగించాల్సి వచ్చింది. **అందువల్లనే 1963లో కామరాజ్ పథకాన్ని ప్రవేశపెట్టాడు. అయితే ఇప్పుడది అమలులో లేదు. ఆ పథకం కింద దెబ్బతిన్న మొరార్జీదేశాయ్, జగజ్జీవన్‌రామ్‌లు అధికారం కోసం అర్రులు చాస్తూనే ఉన్నారు.** సాదాసీదాగా ఉండే కాంగ్రెస్ అధ్యక్షుడు మాటలకన్నా చేతలే మిన్నగా భావించేవాడు. స్వార్థరహిత సేవకు కాంగ్రెస్‌వాదుల్ని పురికొల్పలేకపోయాడు. ఇంతకూ కాంగ్రెస్‌లో చివరకు కానవచ్చిందేమంటే కొందరు సాహసోపేతులైన కాంగ్రెస్ అసమ్మతివాదులు. మాలో చాలామందిమి 1951లో, 1959లో కాంగ్రెస్‌కు దూరమైనట్లు కొందరు ఇప్పుడు దూరంగా జరిగేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ పోలికను ఇక్కడే ఆపాలి. మేము కాంగ్రెస్‌ను వీడింది సిద్ధాంత ప్రాతిపదిక మీద. ఇప్పుడు వీళ్లు కాంగ్రెస్‌ను వీడేది మంత్రి పదవుల ద్వారా అధికారం చేజిక్కించుకోలేక. వాళ్లు ఓటర్ల ముందుకు వెళ్లేది కాంగ్రెస్‌కు భిన్నమైన కార్యక్రమాలను చేపడతామనికాదు. కాంగ్రెస్ పథకాలనే చిత్తశుద్ధితో చేపడతామని. వాళ్లకు విడిగా రాజకీయ పక్షాలను నిర్వహించి కాంగ్రెస్‌ను ఓడించ గల అనుభవంలేదు. పోనీ కాంగ్రెస్ నుండి విడిపోయిన ఇతర పక్షాలను చూసి నేర్చుకుంటారా అంటే అదీ లేదు. అటువంటి శక్తిహీన రాజకీయ పక్షాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చినందున ప్రజాస్వామిక ప్రతిపక్షం బలహీనమయ్యే ప్రమాదం ఉంది.

1951-52 ఎన్నికల సందర్భంగా నెహ్రూ కాంగ్రెస్ అధ్యక్షునిగానూ, ప్రధానిగానూ ఉన్న సమయంలో కాంగ్రెస్ పవిత్రత విషయం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. **పంచదార మిల్లుల వాళ్లు ఉత్తరప్రదేశ్‌లో మణుగుకు ఇంత అని పార్టీ నిధిని సమకూర్చడాన్ని నెహ్రూ సమర్థించారు.** పార్లమెంట్‌లో వెల్లడించిన ప్రకారం ఒక పరిశ్రమవాళ్లు పది లక్షల రూపాయలు విరాళమిస్తే మరో కంపెనీవారు 25 లక్షల రూపాయల విరాళాన్ని 1957 నాటి ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌కు సమర్పించుకున్నారు. 1948 నాటి వర్కింగ్ కమిటీకి 1951 నాటి వర్కింగ్ కమిటీకి మధ్య తేడా స్పష్టంగా కనిపించింది. కాంగ్రెస్ కూడా అన్ని రాజకీయ పక్షాల మాదిరే మరో రాజకీయ పక్షంగా మారిపోయింది.

అంతకుముందున్న ఉద్యమ స్ఫూర్తి మాయమైంది. దానికి అంతరాత్మ అనేది లేకుండాపోయింది. **ఇటువంటి మార్పు చెందుతున్న తరుణంలో ఆంధ్ర కిసాన్ ఉద్యమానికి చెందిన మేము విభేదించి బయటకు వచ్చి కృషికార్ లోక్‌పార్టీ అనే రాజకీయ పక్షాన్ని ఏర్పాటుచేసుకున్నాం.**

1947-51 మధ్యకాలంలో వర్కింగ్ కమిటీ కాంగ్రెస్ విధాన సభా పార్టీల్లోనూ, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీల్లోనూ అంతర్గత పొరపొచ్చాల్ని తీర్చలేక విఫలమైన తరుణంలో సిద్ధార్థ శంకర్ ఎస్.రే 24.3.1958లో మంత్రి పదవికి రాజీనామా చేస్తూ చెప్పింది గుర్తుకుతెచ్చుకుంటే పరిస్థితి ఎలా ఉందో తెలియవస్తుంది.

'వాళ్లంతా ఒక రాజకీయ వక్షం మద్దతు పలికే పరిపాలన కింద ఉన్నారు. దాని అధికార శ్రేణులకు మన జాతి జీవనాన్నుండి అవినీతిని తరిమికొడదామనే ఆలోచన లేదు. వాళ్లు పనిచేస్తున్నది అవినీతి కొనసాగాలని కోరుకునే గొడుగు కింద'.

పూనా కాంగ్రెస్ సందర్భంగా 9 జూన్ 1960 నాటి ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో డి.ఆర్.మంకేకర్ కాంగ్రెస్ విఫలమైన తీరును వివరిస్తూ ముఖ్యంగా మూడు విషయాలను ప్రస్తావించాడు.

1) అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశాలు ఆత్మగత పరిశీలనా సదస్సులుగానో, వ్యధాపూరిత పున:పరిశీలనా వేదికలుగానో మారుతున్నాయి.

2) హైకమాండ్ అవినీతికి తావిస్తున్నది. యువతకు నాయకత్వంలో చోటు లభించడంలేదు. పార్టీలోని అంతర్గత క్రమశిక్షణను కట్టుదిట్టం చేయలేకపోయింది. బోగస్ సభ్యత్వాలను అరికట్టలేకపోయింది. సిద్ధాంతపరంగా రెండు నాల్కల ధోరణిని అవలంభించింది.

3) నేడు కాంగ్రెస్ వైపునకు ఆకర్షింపబడినవారు అధికారం, హోదా పట్ల వ్యామోహం కలవారు. అది కాంగ్రెస్‌లో ఉన్నవారిని నిరాశా నిస్పృహలకు గురిచేస్తున్నది. ఇదే కాంగ్రెస్‌వారిలో క్రమశిక్షణా రాహిత్యానికి, అనైక్యతకు, నిరాశకు దారితీస్తున్నది.

1965 నాటికి ఈ జబ్బు బాగా ముదిరింది. కులపరమైన, భాషాపరమైన విభేదాలు అనేక రాష్ట్రాల్లో పెచ్చరిల్లాయి. అసమ్మతివారు కాంగ్రెస్ నుండి వైదొలగి వేరే పార్టీలు పెట్టుకోకుండా కాంగ్రెస్‌లోనే ఉంటూ అసమ్మతివాదులుగా మారి ఏదోరకంగా అధికారం చేపట్టాలనే తహతహ. ఎన్నికలప్పుడు మాత్రం అంతా ఒక్కటై ఓటర్లను అయోమయంలో పడేస్తారు. ఓటర్లను నిరక్షరాస్యులుగానే ఉంచుతారు. మూడు పంచవర్ష ప్రణాళికలు

గడిచినా ఇదే స్థితి. **ఓటర్ల నిరక్షరాస్యతలో కాంగ్రెస్ స్వార్థ ప్రయోజనాలను వెతుక్కుంటున్నట్లుగా ఉంది.**

అటువంటి అవినీతిమయ, ఊపిరి నలపని రాజకీయ వాతావరణంలో నేను ఇమడలేకపోయాను. కనుక 1951లో మాదిరిగా అవకాశాలు లభించినప్పుడు, పరిస్థితులు అనుకూలించినప్పుడు ఆ వేదికను వదిలేసి గాంధీ ఆశయాలను, ఆదర్శాలను ప్రజల మనస్సుకు పట్టించేందుకు కృషి చేశాను. రాజాజీ నాయకత్వంలో ఒక ప్రత్యామ్నాయ ప్రజాస్వామిక సమాజాన్ని సమకూర్చుకోగలరని ఆశిస్తా.

గాంధీ సేవా దృక్పథంలో పుట్టి పెరిగి పెద్దవారైన కొందరు కాంగ్రెస్ నాయకులు ఈ విధంగా ఈ మేరకు కాంగ్రెస్‌ను ఎందుకు భ్రష్టు పట్టించారో తెలియదు. ఈ పద్దెనిమిది సంవత్సరాల రాజకీయ మదాంధకారం ప్రజాస్వామిక సున్నితత్వాలకు, గాంధీ మార్గపు ప్రజాపరమైన నీతికి వాళ్లను దూరంగా ఉంచాయి. కాంగ్రెస్‌తో విభేదించిన మేము కాంగ్రెస్‌ను వీడి ఓటర్లకు ప్రతిపక్షాల అభ్యర్థులకు ఓటు వేసే సౌలభ్యాన్ని మూడు సాధారణ ఎన్నికల్లో కల్పించాం. దురదృష్టవశాత్తూ ప్రతిసారీ ధనాన్ని, స్వచ్ఛంద సేవకుల్ని, ఓట్లను అందించి ప్రజలు కాంగ్రెసుకే పట్టంగట్టారు. అయినా రాజకీయ అలవాట్లుగా మారిన సరికొత్త చెడుగులకు దూరంగా ఉండి, మరచిపోయిన గాంధీ లక్ష్యాలకు చేరువై, రాజకీయ ప్రమాణాలను కాంగ్రెస్ నెలకొల్పలేకపోయింది.

అంతటి నిరాశామయ రాజకీయ వాతావరణంలో స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా కాంగ్రెస్‌కు ఎదురునిలిచాను. నన్ను, నా పార్టీవాళ్లను గెలిపించమని ప్రజలను కోరాను. ప్రజలు నిరక్షరాస్యులైన కారణంగా నన్నూ, మిగతా పార్టీ అభ్యర్థులను ఓడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మత్తుమందులా అందించిన బడ్జెట్ వ్యయాలకు రాజాజీ నాయకత్వం కూడా విరుగుడుకాలేకపోయింది. మరి అటువంటప్పుడు కాంగ్రెస్ రాజకీయం అవినీతి, లంచగొండితనం, బాధ్యతారాహిత్యంలో మరింతగా కూరుకుపోవడంలో ఆశ్చర్యపోవాల్సిందేముంది?

31

దేశ విభజన - అటు పిమ్మట

ముస్లింలీగ్ దేశ విభజన జరగాలంటున్నది. మేమంతా దాన్ని వ్యతిరేకించాం. దేశ విభజన ఎంత దారుణంగా ఉంటుందో మన దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ **'ఇండియా డివైడెడ్'** (1945–46) అనే పరిశోధనాత్మక గ్రంథంలో వివరించారు. నేను నా సిద్ధాంత గ్రంథం **'పాకిస్థాన్'** అనే దాన్ని లీగ్, కమ్యూనిస్ట్‌ల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు తెలుగులో రాసి 1945లో ప్రచురించాను. **ఎవరెంతగా కృషి చేసినా దేశ విభజన జరిగింది.** పూర్వం నుండి దేశ విభజనను వ్యతిరేకిస్తూ వస్తున్న అగ్రశ్రేణి నాయకులంతా బరువెక్కిన హృదయాలతో దాన్ని ఆమోదించాల్సి వచ్చింది.

ఈ దురదృష్టకరమైన నిర్ణయం జరిగినప్పుడు నేను ఇంగ్లండ్‌లో ఉన్నాను. తిరిగి వచ్చిన తర్వాత నా అసంతృప్తిని బాపూజీకి వెల్లడించాను. నా అసంతృప్తిని ఆయన పంచుకుని తన నిస్సహాయతను వెల్లడించాడు. నలుగురు కాంగ్రెస్ పెద్దలు -సర్దార్ పటేల్, మౌలానా ఆజాద్, రాజన్‌బాబు, జవహర్‌లాల్ నెహ్రూ చెప్పినదాన్ని తోసిపుచ్చలేకపోయానన్నారు. సంకీర్ణ ప్రభుత్వ ప్రయోగం కూడా కలకత్తా, ఢిల్లీ, పంజాబుల్లో జరిగిన దొమ్మీలను నిలువరించలేకపోయింది. గవర్నర్ల ద్వారా శాంతి సాధనకు కృషి చేయమన్న నా

జిన్నా, నెహ్రూ, గాంధి

సలహాను లార్డ్ పెథిక్ లారెన్స్ పెడచెవినపెట్టాడు. అటువంటి పరిస్థితుల్లో భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆజాద్ గారు దేశ విభజన సందర్భంగా తన బాధ్యతను విస్మరింపబూనడం తప్పిదమే.

దేశ విభజన సందర్భంగా ముస్లింలు, హిందువులు ఒళ్లు తెలియని ఆవేశంలో కొట్లాటలకు దిగారు. బెంగాల్, పంజాబ్, సింధ్, ఈశాన్య రాష్ట్రాల్లో పరిస్థితులు మారణహోమానికి దారితీసి వేలాది కుటుంబాలను రాత్రికి రాత్రే నిర్వాసితుల్ని చేశాయి. అటువంటి దారుణకాండల్ని ఊహించడంగానీ, వివరించడంగానీ మానవ హృదయాలకు కుదిరే పనికాదు.

లక్షలాదిమంది వీరులైన సిక్కులు, జాట్లు, గుజ్జార్లు, శాంతి కాముకులైన పట్టణాల్లోని హిందువులు ఈశాన్య రాష్ట్రాల నుండి, పశ్చిమ పంజాబ్ నుండి, సింధ్ నుండి, తూర్పు బెంగాల్ నుండి భారత భూభాగంలోకి విసిరివేయబడ్డారు. స్వతంత్ర భారతం వాళ్లను బాధలకు దూరంగా పెద్దగా ఉంచలేకపోయినా దేశభక్తి భావనతో వాళ్లు మాత్రం వుదాత్తంగా మెలిగారు.

ఢిల్లీ, తూర్పు పంజాబ్, ఉత్తర ప్రదేశ్, బీహార్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లోని **ప్రతి పట్టణం నిర్వాసితులతో నిండిపోయింది.** ఈ పట్టణాల్లోని ప్రజలు వాళ్లు నిలబడడానికి ఏదోవిధంగా ఇంత నీడనిచ్చారు. వాళ్లకు ఆశ్రయం కల్పించాల్సిందిగా ప్రధాని నెహ్రూ ఇళ్ల యజమానులకు పిలుపునిచ్చారు. ఖాళీగా ఉన్న ఇళ్లను ఆక్రమించుకోవచ్చునన్నారు. పార్లమెంట్ సభ్యులు ఢిల్లీలో తమ బంగళాలను కొన్నింటిని అలా నిర్వాసితులకు ఇవ్వడం జరిగింది. నేను అలా రెండు పంజాబీ కుటుంబాలను ఆదుకోగలిగాను. నిర్వాసితులందరూ అలా గౌరవప్రదంగా జీవించేందుకు సిద్ధపడ్డారు.

ఆ రక్త తర్పణం, ఆ ద్వేషం, ఆ పునరుజ్జీవం అంతా చూస్తుంటే మనుషుల్లోని మంచి చెడులు వర్ణింపనలవికానివిగా తయారయ్యాయి. వాటిని వివరించాలంటే ఏ కాళిదాసో, టాగూరో కావాల్సిందే. **మనం మన దేశ స్వాతంత్ర్యాన్ని శాంతియుతంగానే సాధించుకోగలిగాంకానీ దానికి మూల్యం ఈ విధంగా చెల్లించుకోవాల్సి వచ్చిందనిపించింది.** స్వతంత్ర భారతం పెద్దరికాన్ని, బాధ్యతను వహించేందుకు సిద్ధమవుతున్న పద్ధతి కనిపించింది.

బాపూ మన జాతికి యోగివంటి తండ్రి. అధికార దుర్గాలకు దూరంగా ఆయన అవసరం ఎక్కడుంటే అక్కడకు తిరగసాగాడు. తన ప్రేమతో వాళ్ల గాయాలను

మాన్పసాగాడు. ఆయన పాపుల మధ్య తిరుగుతూ పాపిష్టి పనులు మానుకోమన్నాడు. బాధితుల మధ్య తిరుగుతూ భయపడొద్దు భగవంతుడున్నాడని భరోసా ఇవ్వసాగాడు.

మహాత్ముని హత్య అప్పడే స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్న దేశానికి అశనిపాతంలా మారిపోయింది. నాలుగు దశాబ్దాలుగా ఆయన్ను ఆరాధించిన ప్రజలు ఆ బాధను. దు:ఖాన్ని దిగమింగుకోలేకపోయారు. నావంటి ప్రజా సేవకులకు ఇదొక వ్యక్తిగత విషాదభరిత అంశం.

కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ ఏర్పాటుచేసిన నిర్వాసిత కేంద్రాలకు ఆపద్ధర్మ పార్లమెంట్, ప్రభుత్వం సాధ్యమైనంతగా నిధులను అందించ సాగింది. నిర్వాసితుల శిబిరాలను ఏర్పాటుచేసి వారికి ఆశ్రయం కల్పించారు. వాళ్లకువాళ్లు తెప్పరిల్లుకునే వరకూ మాసాలు, కొందరి విషయంలో సంవత్సరాల కాలం సాయం అందించారు. ఈలోగా వాళ్లకు ప్రత్యేక కాలనీలు ఉత్తరభారతదేశంలో నిర్మించి ఇచ్చారు. నిర్వాసితుల అవసరాలు తీర్చడంలో కొంత అలసత్వం అక్కడక్కడా కనిపించినా యాభైలక్షలమంది నిర్వాసితుల సమస్యలను తీర్చడంలో సఫలత పొందిందనే చెప్పాలి. ప్రపంచపు మెప్పు లభించిందని విదేశీయులు సైతం కొనియాడారు. (హెరేస్ అలెగ్జాండర్ పూజా పునస్కారాలు పాటించని ఆంగ్లేయుడు. ఆయన్ను 1922 నుండి నేనెరుగుదును. ఆయన పుస్తకంలో భారతదేశాన్ని మెచ్చుకున్నాడు.)

టాండన్‌జీ, మేమూ కలసి నిర్వాసితులకు ప్రభుత్వం కొంత ధన సహాయం చేయాలని కోరాం. రెండేళ్లపాటు నెహ్రూజీ దీన్ని వ్యతిరేకిస్తూ వచ్చాడు. ఇది ప్రభుత్వానికి మోయజాలని బరువవుతుందని భావించాడు. అయితే ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. 1951-52 సాధారణ ఎన్నికల ప్రభావం కారణంగా ధన సహాయాన్ని పొందగలిగారు.

ఇక తూర్పు పాకిస్థాన్ విషయంలో ఇప్పటివరకూ మా దిగులు అలాగే వుండిపోయింది. నిర్వాసితుల వరద ప్రవహిస్తూనే ఉంది. అది చూసి సర్దార్ పటేల్ గర్జించడంతో పాకిస్థాన్ యుద్ధానికి సిద్ధంకాసాగింది. దానికి తగిన సమాధానమే ఇచ్చాడు సర్దార్ పటేల్. ఇరుదేశాల ప్రధానులు తర్వాత శాంతియుత ఒప్పందానికి రావాల్సిన అవసరాన్ని గుర్తించడంతో నెహ్రూ-లియాఖత్ ఒప్పందం రూపుదాల్చింది. మళ్లీ ఒక సంవత్సరం తర్వాత పరిస్థితి పూర్వంలాగే తయారైంది. తూర్పు పాకిస్థాన్ నిర్వాసితుల కోసం దండకారణ్య ప్రాజెక్టును ప్రారంభించారు. అదీ సఫలీకృతం కాలేదు. ఆ సమస్యకు తగిన పరిష్కారం ఈనాటికీ లభించలేదు.

ఉత్తర హిందూ దేశంలో మాదిరిగా దక్షిణ భారతదేశంలో మతమౌఢ్యం పెచ్చరిల్లలేదు. పరమత సహనం కొనసాగుతూనే ఉంది. దేశ విభజనకు ముందు దేశం విభజింప బడాలనే వాదనకు ఇక్కడి ముస్లింలు మద్దతు పలికినా వాళ్లు హింసను ప్రోత్సహించలేదు. దక్షిణ భారతదేశపు ముస్లింలపై మౌలానా ఆజాద్ గట్టి పట్టును సాధించాడు. ఇటు మహాత్ముని మత సహనపు ప్రభావం హిందువులపై ఉండనే వుంది. అందువల్లనే దేశంలో అత్యయిక స్థితి నెలకొన్నప్పుడు దక్షిణభారతదేశ ప్రజలు జాతీయ నాయకత్వానికి కొండంత అండగా నిలిచారు.

హైదరాబాద్ రజాకార్లుగా పిలువబడిన కాశిం రజ్వీ అనుయాయుల తీరు భిన్నంగా ఉంది. మౌలానా ఆజాద్ మాత్రం మాతో కలసి హైదరాబాద్‌ను ప్రత్యేక రాష్ట్రంగా చేయాల్సిన అవసరంలేదన్నాడు. రజాకార్లు నాజీ పద్ధతులు పాటించసాగారు. వారిది నియంతృత్వ ధోరణిగా తయారైంది. రాష్ట్రంలో ముస్లింల శాతం పదిహేనే అయినా ప్రత్యేక హక్కుల కోసం పోరాటం సాగించారు. జవహర్‌లాల్‌జీ, మౌలానా ఆజాద్‌లు నిజాంతో సంప్రదింపులు జరపడాన్ని అలుసుగా తీసుకున్న కారణంగా రజాకార్లు రెచ్చిపోయారు. పాకిస్థాన్ సరిహద్దుల్లో మాదిరిగా నైజాం సరిహద్దుల్లో కూడా పరిస్థితులు తయారయ్యాయి. రజాకార్ల నియంతృత్వ ధోరణికి అడ్డుకట్ట వేయడంలో ప్రధాని నెహ్రూ తటపటాయింపు ధోరణే కారణమని నేను గొంతు పెంచాను. రజ్వీ మాటలు విని నవాబు అనేకమంది ప్రధానుల్ని నియమించి తొలగించాడు.

హైదరాబాద్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని నవాబు పాకిస్థాన్‌తో సంప్రదింపులు ప్రారంభించాడు. దానికి అంతర్జాతీయ గుర్తింపు కోసం కూడా ప్రయత్నించసాగాడు. పాకిస్థాన్‌లో నైజాం ప్రతినిధిని నియమించే వరకూ వెళ్లింది వ్యవహారం. అప్పుడు దృఢమైన నాయకత్వం కోసం పటేల్ వైపునకు చూశాం. అప్పట్లో ఆయన గుండెపోటుకు గురై కోలుకుంటున్నా పోలీస్ చర్య తీసుకునేందుకు కేంద్రం అనుమతి కోసం శక్తిని కూడగట్టుకున్నాడు. **ఇదంతా చెప్పడం ఎందుకంటే ప్రజలు మాత్రం మత సహనాన్ని పాటిస్తున్నారని చెప్పేందుకే.**

32

భారత రాజ్యాంగ రచనపై సంగ్రహావలోకనం

స్వతంత్ర భారత రాజ్యాంగ రచనలో మరీ ముఖ్యంగా గుర్తించదగిన వాస్తవం ఏమంటే ఆ పనిని న్యాయ శాఖామంత్రికి అప్పగించారు. అప్పటి న్యాయ శాఖామంత్రి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్. ఆయన బొంబాయికి చెందిన అఖిలభారత హరిజన నాయకుడు. రాజ్యాంగ రచన పూర్తయ్యేందుకు చాలాకాలం పట్టింది.

డాక్టర్ అంబేద్కర్ పండితుడు. వాక్పటిమ గల వక్త. శక్తిసంపన్నంగా చర్చ చేయగలిగినవాడు. ప్రజ్ఞాశాలిగా పేరొందిన న్యాయవాది. శతాబ్దాల కాలంగా కులప్రధానమైన, వేద ప్రామాణికమైన భారతదేశంలో మనువు నుంచి శుక్రాచార్యుల వరకూ రూపొందించిన ధర్మశాస్త్రాల వల్ల హరిజనులకు జరిగిన అన్యాయాన్ని అరికట్టేందుకా అన్నట్లుగా స్వతంత్ర భారత రాజ్యాంగ రచనకు ప్రధాన అర్చకత్వం వహించే అవకాశం డాక్టర్ అంబేద్కర్‌కు అప్పగించబడింది. సామాజిక న్యాయాన్ని కోరుకునే కాంగ్రెస్ అనుభవశాలురందరూ ఈ విధమైన నిర్ణయానికి గర్వపడ్డారు.

1935 నాటి పార్లమెంట్ చట్టం ప్రకారం ఆమోదించిన ఓటింగ్ నియమావళి ప్రకారం 1946లో ఏర్పాటైన ప్రాంతీయ చట్ట సభలు (ప్రొవెన్షియల్ అసెంబ్లీస్) మమ్మల్ని రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నుకున్నారు. భారతదేశంలోని రాజవంశీకులు ప్రజా మండళ్లు ఉన్న తావుల్లో వాళ్ల ప్రతినిధుల్ని వాటి సాయంతో ఎంపిక చేసుకున్నారు. భీష్ముని మాదిరి గాంధీ గారు అసెంబ్లీలో చేరనన్నారు. రాజకీయ నాయకత్వం పెద్దయెత్తున కాంగ్రెసుదే అయినా ముస్లిమేతరుల విషయంలో అది కాంగ్రెస్

సభ్యులుకాని ప్రతిభాన్వితులైన న్యాయశాస్త్ర కోవిదుల్ని, దేశ భక్తుల్ని, రాజకీయ నాయకులుకాని ప్రముఖుల్ని సభ్యులుగా ఎంపిక చేయడం జరిగింది. **ఒక్క కమ్యూనిస్ట్‌లకు తప్ప ప్రధానమైన జాతీయ పక్షాలన్నింటికీ ప్రాతినిధ్యం దక్కింది. తొలినాళ్లలో ముస్లింలీగ్ కూడా రాజ్యాంగ పరిషత్తు సమావేశాల్లో పాలుపంచుకుందికానీ తర్వాత అది పరిషత్తు సమావేశాలను బహిష్కరించింది.**

దేశ విభజన తర్వాత రాజ్యాంగ పరిషత్తు చురుగ్గా పనిచేయడం ప్రారంభించింది. కొన్ని మాసాలపాటు ఏ ప్రాతిపదికపై స్వతంత్ర రాజ్యాల ప్రతినిధులు మాతో కలసి పాల్గొంటారనేది ఇదమిద్దంగా తెలియలేదు. బ్రిటిష్ పాలనాకాలంలోని చివరి రెండు దశాబ్దాల కాలంలో రక్షణ, వాణిజ్యం, విదేశాంగ వ్యవహారాల్లో మాత్రమే అఖిలభారత స్థాయి ఫెడరేషన్‌గా రూపొందాలనే ఆలోచన చేశారని చెబుతారు.

పాకిస్థాన్ ఆవిర్భావంతో కొందరు ప్రభువులు భారత ప్రభుత్వానికి బాగా సహకరించడం ప్రారంభించారు. **తిరువాన్కూర్, మైసూరు వంటి రాజ్యాలు వాటికి స్వతంత్ర ప్రతిపత్తిని కోరుతున్నాయి. ప్రజల రాజకీయ చైతన్యం, జాగరూకత తోడుకాగా వల్లభాయిపటేల్ సంప్రదింపుల ద్వారానో, బుజ్జగించో, భయపెట్టో ఒకదాని తర్వాత ఒకటిగా సంస్థానాలన్నింటినీ విలీనం చేయసాగాడు. 1950 నాటికి వాటి విలీనం పూర్తయ్యింది.** అటువంటి శాంతియుత విప్లవం స్వతంత్ర భారతం సాధించిన ఒక అపూర్వ విజయంగా నిలిచింది. అది ఆయా సంస్థానాధీశుల దేశభక్తికి ఒక ఉపహారం.

అలా సంస్థానాల విలీనం తర్వాత రాజ్యాంగాన్ని తయారుచేసే వారి వైఖరిలో కీలకమైన మార్పు వచ్చింది అది మరీ ముఖ్యంగా కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య సంబంధాల విషయంలో. **తొలుత బలహీనమైన కేంద్రం బలమైన రాష్ట్రాల ప్రాతిపదికన ముసాయిదా రాజ్యాంగంలో పొందుపర్చాలని భావించినా కేంద్రం దేశ విభజన సందర్భంగా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించిన తీరు, విభజన వల్ల ఉత్పన్నమైన మరికొన్ని సమస్యలను బయట ప్రపంచం వేలెత్తి చూపనిరీతిలో పరిష్కరించుకోవడం వల్ల కేంద్రంలోని సర్దార్ పటేల్, నెహ్రూజీల నాయకత్వం పట్ల విశ్వాసం ఏర్పడింది.** పైగా రాష్ట్రాల్లోని నాయకత్వం అంతర్గత విభేదాల వల్ల శక్తిహీనం కావడం మొదలైంది. కంట్రోళ్ల విషయంలో అవినీతి అక్రమాల పట్ల ప్రజలు విసిగివేసారిపోయారు. ఇదంతా కేంద్ర నాయకత్వం మరింత చొరవ చూపి దృఢమైన నిర్ణయాలు చేసేందుకు అవకాశం కల్పించాయి. అలా రాజ్యాంగ రచన జరిగిన మూడు సంవత్సరాలకు కొంచెం తక్కువ కాలంలో శక్తిమంతమైన

రాష్ట్రాల నుండి శక్తిమంతమైన కేంద్రం దిశగా వైఖరి రూపాంతరం చెందింది. వీటన్నింటికీ మించి జాతీయ స్థాయిలో ప్లానింగ్ కమీషన్, పంచవర్ష ప్రణాళికల రూపకల్పన అంతా కలసి కేంద్ర ప్రభుత్వానికి లోబడి రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయాల్సిన విధంగా విధాన రూపకల్పన జరిగింది.

మనపై అమెరికా, బ్రిటిష్ రాజకీయ వ్యవస్థాగతమైన ప్రభావం అధికంగానే వుండేది. ప్రాథమిక హక్కుల రూపకల్పనలో ఐరిష్, వైమర్ రాజ్యాంగాల ప్రభావం ఉంది. కమ్యూనిస్ట్ ఉద్యమ ప్రభావం. రష్యా విజయ సాధనల ప్రభావాన్ని మనం మన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల అధ్యాయంలో చూడొచ్చు. ప్రాథమిక హక్కుల్ని రాజ్యాంగంలో చేర్చాలని మున్షీగారు పట్టుబట్టడం నన్ను బాగా ఆనందింపజేసింది. ఆస్తి హక్కులకు సంబంధించిన క్లాజ్-31 జవహర్‌లాల్‌జీకి తలనొప్పి కలిగించింది. ఏ పౌరుడైనా ప్రాథమిక హక్కుల ఉల్లంఘన విషయంలో సరాసరి సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకునే అవకాశాన్ని మన రాజ్యాంగం కల్పించింది. ఇది అసాధారణమైన అంశం. అయితే చివరకు ఏమైంది? రాజ్యాంగం అమలులోకి వచ్చిన పదేళ్లలోపే పార్లమెంట్ దాన్ని ఛిన్నాభిన్నం చేసింది. దీనికి కారణం రైతులు భూమికి సొంతదారులు, హక్కుదారులు అనే విషయంలో కమ్యూనిస్ట్‌ల వైఖరికి దగ్గరగా జరగాలనే కాంగ్రెస్ తహతహే కారణం.

మేమంతా సార్వజనీన ఓటు హక్కు విషయంలో ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించాం. ఆ విషయంలో నేను 1925 నుండి కృషి చేస్తూనే ఉన్నా. సకల విధాలైన స్వేచ్ఛలు - పత్రికా స్వేచ్ఛ, వ్యక్తిగత స్వేచ్ఛ, వేదికలు, ప్రసంగాలు అన్నీ చర్చకు వచ్చాయి అంతర్జాతీయ సమితి సూచించిన మానవ హక్కులు కూడా. ఆ విధంగా మేము 19వ శతాబ్దానికి చెందిన ఉదారవాదులు, సమతావాదులు, మానవతావాదులు చెప్పిన వాటి సారాన్ని మన రాజ్యాంగ స్ఫూర్తిలోకి చొప్పించగలిగాం.

మనం అధ్యక్షుడు తలమానికంగా ఉండే సర్వసత్తాక గణతంత్ర రాజ్యాన్ని కోరుకున్నాం. అయితే అమెరికా అధ్యక్షునికి గల అధికారాలు మన అధ్యక్షునికి వుండవు. మన అధ్యక్షుని హోదా ఫ్రెంచి అధ్యక్షుని హోదా వంటిది. మొదట రాష్ట్రాలకు గవర్నర్లను ఎన్నికల ద్వారా నియమించాలనుకున్నాం. అయితే చివరకు కేంద్ర ప్రభుత్వం సలహాపై అధ్యక్షుడుని నియమించాలన్నాం.

ఇదంతా ఎన్నికల వ్యయం తగ్గించేందుకు, కేంద్రానికి మరింత శక్తిని సమకూర్చేందుకని అనుకున్నాం. రాష్ట్రపతికి రాష్ట్రాల్లోని మంత్రి వర్గాలను రద్దుచేసి

అత్యయిక స్థితిని ప్రకటించే అధికారాన్ని అప్పగించాలని నిర్ణయించాం. అదంతా కమ్యూనిస్ట్ నియంతృత్వం రాకుండా అరికట్టేందుకు అనుకున్నాం. అయితే దురదృష్టవశాత్తూ కేంద్రంలోని కాంగ్రెస్ పాలకులు ఈ అధికారాన్ని పక్షపాత వైఖరితో దుర్వినియోగ పర్చారు.

కేంద్రంలో రెండు అంచెల పార్లమెంట్‌ను ఏర్పాటుచేసుకున్నాం. అయితే రాష్ట్రాల్లో రెండో సభ అవసరం ఏమిటో తెలియరాక వాటి ఏర్పాటు విషయాన్ని ఆయా రాష్ట్ర అసెంబ్లీలకు వదిలేశాం. ప్రజాభిప్రాయానికి ప్రాముఖ్యాన్ని ఇవ్వాలనే తలంపుతో 'రిఫరెండం' (ప్రజాభిప్రాయ సేకరణ) 'రీకాల్' (వెనక్కు పంపడం) స్విట్జర్లాండ్ వంటి పద్ధతుల్ని చట్టసభల్లో ప్రవేశపెట్టాలని నేనూ, కీ.శే.టంగుటూరి ప్రకాశం గారూ ప్రయత్నం చేశాం. ఈ ప్రతిపాదనలో మాకు సోషలిస్ట్‌లు మద్దతు పలికారు. అయితే దాన్ని చట్టసభలో చర్చకు వచ్చేటట్లు మేము చేయలేకపోయాం.

మేము జమీందారీ విధానం రద్దు విషయంలో బాగా ఆసక్తిని చూపుతున్నాం. వాళ్లకు నష్టపరిహారం పూర్తిగా ఇవ్వకపోతే రానున్న ప్రమాదాలను పసిగట్టాం. కనుక మేము యేళ్లతరబడి నష్టపరిహారం ఏ మేరకు ఇవ్వాలనే విషయంలో మల్లగుల్లాలుపడ్డాం. దురదృష్టవశాత్తూ రాజ్యాంగంలో సోషలిస్ట్ పంథాను జొప్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయడం జరిగింది.

బ్రిటిష్ తరహా పార్లమెంటరీ పాలన పట్ల మేమెంతగానో ప్రభావితులమయ్యాం. అందువల్ల అమెరికా పద్ధతినిగానీ, స్విట్జర్లాండ్ పద్ధతినిగానీ అందులో చొరబడనివ్వలేదు. మేము మంత్రుల ఎంపికను గవర్నర్లకు వదిలేశాం. తొలి దశకంలోనే మేమెంత సంకుచిత దృష్టితో ఆలోచించామో అర్థమైపోయింది. ఏ పార్టీకీ మెజార్టీ లేనందువల్ల ఆయా రాష్ట్రాల పరిపాలనా పగ్గాలు గవర్నర్ల చేతుల్లోకి పోయాయి.

ఆదివాసీలకు వాళ్ల వాళ్ల పరిమిత పరిధుల్లోనే రాజకీయ స్వయంపాలనాధికారాన్ని కల్పించి రెండు కోట్లమంది ఆదివాసీలకు త్వరితగతిన సామాజిక ఆర్థిక ప్రగతి సాధించేటట్లు భారత రాజ్యాంగంలో పొందుపర్చడం జరిగిందని చెప్పవచ్చు. ఆదివాసీలకు కూడా అందరి మాదిరిగానే దామాషా ప్రకారం పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం సమకూర్చడం జరిగిందికానీ స్వతంత్ర ప్రతిపత్తి గల రాజకీయ యూనిట్ల ద్వారా వాళ్లకు సాయం అందిందెక్కడ? రాజ్యాంగం పేదవారికి, గొప్పవారికీ, రకరకాల సంస్కృతుల నుండి వచ్చిన వారికి కలసిమెలసి బతకడం ఎలాగో మార్గదర్శనం చేసిందని అనొచ్చుగానీ

మనం నాగాలను, మిజోలను, మిగతా కొండజాతుల వారిని మనకు చేరువ చేసుకోలేకపోయాం. కనుక వాళ్లు మన పౌరులుగా మనగలిగేటట్లు చేయడం ఎలా అన్నది మన రాజ్య పాలనా పద్ధతికి ఇబ్బందికరమైన అంశమే.

భారతీయ సంస్కృతిపై అస్పృశ్యత మాయని మచ్చ అని, దాన్ని తొలగించేందుకు నాలుగు దశాబ్దాలుగా కృషి చేస్తూనే ఉన్నాం. దానికనుగుణంగానే అస్పృశ్యత నేరమని, చట్టం ముందు, రాజ్యం ముందు పౌరులందరూ సమానమేనని, కుల-వర్గ తేడాలుండరాదని రాజ్యాంగం పేర్కొంది.

వెనకబడిన తరగతుల రక్షణకు, అభ్యున్నతికి చర్యలు చేపట్టాలని పేర్కొనడం జరిగింది. అయితే ఈ దిశగా హరిజనులు పెద్దగా లబ్ధి పొందింది లేదు. మరీ ముఖ్యంగా వెనకబడిన తరగతుల వారు కూడా సామాజికంగా, ఆర్థికంగా వెనకబాటుతనం నుండి ముందుకు జరిగిందిలేదు. క్రిమినల్ ట్రైబ్స్ అనే మాటపోయి 'విముక్త జాతి' అనే కొత్త మాట వచ్చింది.

మన రాజ్యాంగం న్యాయ పాలనకు పవిత్రతను జత చేసింది. దాన్ని పరిరక్షించే బాధ్యత న్యాయస్థానాలకు అప్పగించాం. కనుక సుప్రీం కోర్టు ప్రాథమిక హక్కులకు, ఇతర రాజ్యాంగ హక్కులకు సంరక్షక బాధ్యతను స్వీకరించింది. దీనికి అమెరికా సుప్రీంకోర్టును ఆదర్శంగా తీసుకున్నాం. దురదృష్టవశాత్తూ తర్వాత పదిహేడు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ పార్టీ కోర్టులకు గల ఈ అధికారాన్ని బద్దలుకొట్టింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తుల్లో అధికులు అభిప్రాయపడినట్టు పార్లమెంట్ ప్రాథమిక హక్కులకు సవరణలు చేయరాదు. అటువంటి తీర్పును పార్లమెంట్ గౌరవిస్తుందా?

ఇక భాష లేదా భాషల విషయానికొస్తే సుదీర్ఘంగా బాధాకరమైన చర్చలు జరిగాయి. భారతదేశపు రాజకీయ, సాంస్కృతిక ఐక్యతను పెంపొందించేందుకు మనకు ఒకే ఒక జాతి భాష ఉండాలి. హిందీయే అందుకు తగిన భాష అని ఒక వైపు, మరో వైపు వెయ్యేళ్లకు పైగా సంపూర్ణంగా వృద్ధి చెందుతూ వచ్చిన ప్రాంతీయ భాషలు ఉండాలని మరో వైపు చర్చ జరిగింది. కొందరు ఆంగ్లాన్నే జాతీయ భాషగా నిలిపేటట్లయితే అది ఉత్తరాదికీ, దక్షిణాదికేగాక భారతదేశానికీ, ప్రపంచంలోని ఇతర దేశాలకూ అనుసంధాన భాషగా ఉండ గలదని భావించారు. కొందరు ఉర్దూ ప్రాముఖ్యాన్ని పోగొట్టదల్చలేదు. అది మన సాంస్కృతిక ఐక్యతను చాటి చెప్పడమేకాక భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య

అవగాహనను పెంచగలదన్నారు. ఈలోగా ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు తమ రాష్ట్రాల్లో హిందీని అధికార భాషగా అభివృద్ధి చేయసాగాయి. ఆయా రాష్ట్రాల ప్రతినిధులు కేంద్ర చట్టసభలో పి.డి.టాండన్ గారి నాయకత్వంలో హిందీని దేశ భాషగా చేయాలనే ఒత్తిడిని పెంచసాగారు. అది ఇంకా అభివృద్ధి చెందుతూ ఉన్న తరుణంలో దాన్ని అధికార భాషగా స్వీకరించడం జరిగింది. అయితే ఆ భాషను అలా స్వీకరించడం పెద్దగానే విమర్శను ఎదుర్కోవలసి వచ్చింది. దక్షిణాది రాష్ట్రాలు, బెంగాల్, అస్సాం, బొంబాయి ప్రాంతాలవారు హిందీ కోసం ఆంగ్లాన్ని వదులుకోదల్చలేదు. పెద్ద ఉద్యోగాలు ఉత్తరాదివాళ్లకు పోతాయన్న కారణం కూడా లేకపోలేదు. ఇటువంటి క్లిష్టమైన అంశంపై ఒక స్పష్టమైన దారిని రాజ్యాంగం చూపలేకపోయింది.

భాషా విషయంగా మైనార్టీ వర్గాలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఏర్పడింది. భారతదేశం అంతటికీ ఒకే పౌరసత్వం కనుక రాష్ట్రాల్లో నివసించే ప్రజల్లో స్థానికులు, బయట నుంచి వచ్చినవాళ్లు అనే వ్యవహారం తొంగిచూస్తుందని భావించాం. అన్ని భాషల వాళ్లకు సమాన హక్కుల్ని సమకూర్చలేకపోయాం. ఈ విషయంలో భారతీయ పాలకులు దారుణంగా పరాజయం పాలయ్యారు. ప్రాంతీయంగా, భాషాపరంగా, కులాలవారీగా విడిపోయే ప్రమాదం భారతీయ ఐక్యతపై బుసలుకొట్టసాగింది.

సోషలిస్ట్ పార్టీకి చెందిన హెచ్. వి. కామత్, మరికొందరు ప్రతిపాదించే సవరణలు ఆలోచింపదగినవిగా ఉండేవి. అవి సామాజిక, ఆర్థిక కార్యకలాపాల్లో రాష్ట్రాలకు అధికంగా అధికారాలు అవసరమని తేల్చి చెప్పేవి. వాళ్లు ఇచ్చే సలహాలు ప్రజాస్వామ్యాన్ని విస్తృతపర్చేవిగా ఉండేవి. వాళ్లు అభిప్రాయ సేకరణ, రిఫరెండం, రీకాల్, దామాషా పద్ధతిన ప్రాతినిధ్యం అనే అంశాలను ప్రతిపాదించారు.

మన రాజ్యాంగం 1950 నుండి అమలులోకి వచ్చింది. కాని పెత్తందారీ పద్ధతి పోలేదు. జవహర్‌లాల్‌జీ తనకు ఇష్టమొచ్చినరీతిలో సవరణలు చేసుకుంటూపోతున్నాడు. అలా చేసిన సవరణల్లో పదిహేడో సవరణ భూసేకరణ చట్టానికి సంబంధించినది. దానివల్ల ప్రజోపయోగానికి ఎవరిదైనా భూమిగానీ, చివరికి ఉండే ఇంటినిగానీ ప్రభుత్వం స్వాధీనపర్చుకోవచ్చు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు పూర్తికాలేదు. పొట్టిశ్రీరాములు మరణానంతరంగానీ ఈ దిశగా పరిపాలకులు కళ్లు తెరవలేదు.

అప్పటికి కేంద్ర చట్టసభ కార్యక్రమాలన్నీ స్టీరింగ్ కమిటీ ద్వారా జరుగుతూండేవి. దానినిండా అల్లాడి కృష్ణస్వామి, బి.ఎన్.రావు, గోవింద వల్లభ్‌పంత్, కె.ఎం.మున్షీ

స్థాయి గల న్యాయవేత్తలుండేవాళ్లు. వాళ్లంతా పశ్చిమ ప్రజాస్వామిక దేశాల ఉదారవాదం పట్ల ఆకర్షితులైనవారు. అగ్రశ్రేణి రాజకీయ నాయకులు వాళ్లల్లో వాళ్లకు పొసగని అంశాలు కాంగ్రెస్ పార్టీ ముందుంచేవారు. కాంగ్రెస్ పార్టీ సమావేశాలు అప్పుడు రాజ్యాంగ భవన్‌లో జరుగుతూ ఉండేవి. 1947 నవంబర్ వరకూ ఆ సమావేశాలకు పార్టీ అధ్యక్షుడు జె.బి.కృపలానీ అధ్యక్షత వహిస్తూ ఉండేవారు. పార్టీలతో ప్రమేయంలేని డాక్టర్ కుంజ్రూ తదితర నాయకులు చెప్పేది ఆ చర్చల్లో బాగానే పట్టించుకునేవారు. నిర్ణయాలకు ఒక స్వరూపాన్ని దిద్దడంలో అధ్యక్షులు కృపలానీ కీలకపాత్ర పోషించారు. అయితే గాంధీ మార్గంలో పయనించే ఆయన కేంద్ర ప్రభుత్వ అధికారాలను తగ్గించి స్థానిక సంస్థలకు స్వయంప్రతిపత్తిని విస్తృతపర్చడం, సివిల్ సర్వీస్ అధికారుల అధికారాన్ని తగ్గించడం, పెద్ద పెద్ద అధికారుల వేతనాలను కుదించడం వంటివి ఎక్కువమంది కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులకు నచ్చేవి కావు. అధికారాన్ని చేజిక్కించుకుని చెలాయించేందుకు ఆత్రుతగా ఉన్నవారికి అటువంటివి నచ్చకపోవడం సహజమే.

వేదనామయ భూభాగమైన నౌఖాలీలో బాపూ తిరుగుతున్నాడు. రాజ్యాంగం తయారవుతున్న తరుణంలో ఆయన పాల్గొనని లోటు స్పష్టంగా తెలియవస్తున్నది. అది మా మనసులను విచారగ్రస్తం చేసింది. ఆయన లేనందువల్ల మాకు కాలూ, చెయ్యీ ఆడేదికాదు. ఆయన కనుక అక్కడ ఉండి ఉంటే గ్రామ పంచాయతీలకు, జిల్లా పరిషత్తులకు మరిన్ని అధికారాలు దక్కి ఉండేవి. అవి రాజకీయాలకు దూరంగా అభివృద్ధి చెందేవి. కాన్‌స్టిట్యూయెంట్ అసెంబ్లీలో అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ ప్రసంగాలు పాండిత్య శోభితాలు, అనునయపూర్వకాలు. సర్దార్ పటేల్, రాధాకృష్ణన్, జవహర్‌లాల్‌జీలవి ప్రోత్సాహదాయకాలు. అల్లాడి కృష్ణస్వామి, డాక్టర్ అంబేద్కర్, బి.ఎన్.రావు, మున్షీలు ముసాయిదా రాజ్యాంగ రచనలో ప్రయోజనకరమైన తోడ్పాటునందించారు. అప్పటి తొలి భారతీయ గవర్నర్ జనరల్ రాజాజీ దేశ నాయకులకు తెర వెనక నుండి సలహాలను అందిస్తూ కీలక పాత్రనే పోషించారు.

మానవతా వాదం చిప్పిల్లుతూ తరతరాలుగా కొనసాగే ఉదారవాదాన్ని నింపుకుంటూ తయారైన రాజ్యాంగం భారతదేశపు సిగలో పువ్వే అయినా అది జవహర్‌లాల్‌జీకి రుచించలేదు. తన సోషలిజాన్ని అందులో జొప్పించేందుకు వీలుపడదేమోననే భయం ఆయనది. పదిహేడు సంవత్సరాల కాలంలో దానికి పదిహేడు సవరణలు రావడానికి ఆయన కారణభూతుడు. అమెరికా ప్రజలకు వాళ్ల

రాజ్యాంగం పట్ల ఎంత గౌరవమో తెలుసా - 170 సంవత్సరాల కాలంలో వాళ్ల రాజ్యాంగానికి సవరణలు తెచ్చింది కేవలం ఆరు పర్యాయాలే.

దేశ విభజన జరగగానే మన పార్లమెంట్ మనం ఏర్పాటుచేసుకోవాల్సి వచ్చింది. కాన్‌స్టిట్యూయెంట్ అసెంబ్లీ ప్రొవిజనల్ పార్లమెంట్‌గా రూపాంతరం చెందింది. ప్రధానమైన మార్పు ఒకే ఒక్కటి. రాష్ట్ర అసెంబ్లీల్లో కూడా సభ్యులైనవారు ప్రొవిజనల్ పార్లమెంట్ సభ్యులుగా ఉండరాదు. రాజేంద్ర ప్రసాద్ గారిలోని జాతీయ ఐక్యత, గాంధీజీతో సాన్నిహిత్యం, బౌద్ధానికి చెందిన కరుణ వంటి భావనల కారణంగా ఆయన అందరికీ చేరువయ్యాడు. ముఖర్జీ అనే క్రైస్తవ నాయకుడు ఉపాధ్యక్షునిగా రాణించాడు. పార్లమెంట్‌కు స్పీకర్‌గా ఎన్నికైన మావ్లాంకర్ ఆ పదవికి వన్నె తెచ్చారు. 1956లో ఆయన మరణించినప్పుడు భారత జాతి యావత్తూ ఆయనకు నివాళులు అర్పించింది. ఆయన పార్లమెంటరీ విధి విధానాలకు పునాదులు వేయడం జరిగింది.

1950 జనవరి 26న భారత్ రిపబ్లిక్‌గా అవతరించింది. రాజన్‌బాబు దానికి తొలి అధ్యక్షులయ్యారు. ఉపాధ్యక్షులు డాక్టర్ రాధాకృష్ణన్. రాజన్‌బాబు 1962లో విశ్రాంతి పొందిన తర్వాత డాక్టర్ రాధాకృష్ణన్ అధ్యక్షులయ్యారు. చిత్రమేమంటే సర్వసత్తాక సంపూర్ణ స్వాతంత్ర్యానికి శూరునిగా నిలిచిన జవహర్‌లాల్‌జీ భారతదేశం కామన్‌వెల్త్ రాజ్యాల్లో ఒకటిగా ఉండేందుకు మనల్ని ఒప్పించాడు. బ్రిటీష్ రాణి కామన్‌వెల్త్‌కు ప్రతీక. చరిత్ర మనపై అలా పగతీర్చుకుంది. కాన్‌స్టిట్యూయెంట్ అసెంబ్లీ సమయంలో నేను వేరే పనుల్లో నిమగ్నమై ఉన్నాను. మద్రాస్ రాష్ట్ర రాజకీయాల్లోనూ, ఆంధ్ర కాంగ్రెస్ కమిటీ రాజకీయాల్లోనూ, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కార్యక్రమాల్లోనూ తలమునకలై ఉన్నా. అనేక అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొనాల్సి ఉంది. అయితే వర్కింగ్ కమిటీల్లోనూ, కాంగ్రెస్ సమావేశాల్లోనూ, చర్చల్లోనూ చురుగ్గా పాల్గొనడం, వెనకబడిన తరగతులు, కొండజాతుల వారి ఉద్ధరణ కోసం వారి తరఫున మద్దతు కూడగట్టడం, అసెంబ్లీలో నా ప్రసంగాలు మూలంగా నేను కూడా రాజ్యాంగ రూపకర్తల్లో ఒకరినైనందుకు గర్విస్తున్నా.

33

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ : విచారణలు - విపత్తులు (1946-51)

1935 వరకూ కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల్లో నాకెటువంటి ఆసక్తిలేదు. ఆంధ్ర ప్రాంతంలో ప్రకాశం పంతులు గారికి, డాక్టర్ పట్టాభి సీతారామయ్య గారికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. 1930లో నేను పూర్తికాలం సేవకునిగా కాంగ్రెస్‌లోకి ప్రవేశించినప్పుడే ఏ పక్షానికీ నేను దగ్గరకు జరగకుండా జాగ్రత్తపడుతున్న సమయంలోనే ఇరు వర్గాల విరోధానికి ఎలా గురైందీ ఇంతకుముందే తెలియ జేశాను.

పొట్టి శ్రీరాములు

1933లో దేశోద్ధారక, అయ్యదేవర కాళేశ్వరరావు గారు మరికొందరు కలసి ఆంధ్ర ప్రొవెన్షియల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులపై అవిశ్వాస తీర్మానం ప్రకటించారు. దాంట్లో కూడా నేను పాలుపంచుకోదల్చుకోలేదు. ఆ అధ్యక్ష, కార్యదర్శులు మా జమీందారీ వ్యతిరేక ఉద్యమాన్ని నీరుగార్చే బాపతు అని తెలిసి కూడా మిన్నకున్నాను. అయితే 1936 నాటికి వాళ్లు జిల్లా బోర్డుల్లోను, మద్రాస్ అసెంబ్లీకి ప్రతినిధుల్ని ఎంపిక చేసే విషయంలోను కిసాన్ కాంగ్రెస్ వర్గానికి చెందిన వారి పట్ల శీతకన్ను వేయడం నన్ను బాగా బాధించింది. అలాగే 1937-38 నాటి కాంగ్రెస్ మంత్రుల పాలనలో కిసాన్ సమ్మేళనానికి వ్యతిరేకంగా వాళ్లు వ్యవహరించారు. ఆ విధంగా కిసాన్ కార్యకర్తలకు కాంగ్రెస్ ప్రభుత్వ అండదండలు లేవని చూపదల్చారు. కనుక 1938లో నేను కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేశాను. స్వల్ప తేడాతో నేను ఓడిపోయాను. నాపై పోటీకి నిలిచిన డాక్టర్ పట్టాభి సీతారామయ్య గెలుపొందారు.

ఎన్నికలైన వెంటనే పి.సి.సి మంత్రి వర్గం, కిసాన్ సమ్మేళనం లేవనెత్తే సమస్యలకు ముఠాతత్వాన్ని అవలంభించింది. ఈ విషయాన్ని నేను గాంధీజీ దృష్టికి తెచ్చాను. నేను కాంగ్రెస్ నాయకత్వాన్ని తన్నుకుపోతాననే భయమే వాళ్లతో అటువంటి పనులు చేయిస్తున్నదని ఆయన నాకు చెప్పారు. కనుక ఆయన నాకు ఇచ్చిన సలహా ఏమంటే నేను కాంగ్రెస్ నాయకత్వాన్ని కాంక్షించడం లేదనేది స్పష్టంచేస్తే కిసాన్ సమస్యలు వాటి యోగ్యతనుబట్టి పరిష్కరించబడతాయని. రైతులుగానీ, రైతుల పక్షాన పాటుపడేవాళ్లుకానీ రాజకీయ నాయకత్వాన్ని ఆశించరాదన్న ఆంక్షలు సమంజసంకాదని నేను హెచ్చరించాను. ఏది ఏమైనా నా వరకూ నేను అటువంటి త్యాగానికి సిద్ధమని, నేను తిరిగి పిసిసి ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించాను.

అయితే నేను 1946లో పిసిసి అధ్యక్షుణ్ణి ఎలా అయ్యాను? 1946లో నేను ఇంగ్లండ్‌కు బయలుదేరి వెళ్లేముందు పిసిసిలో రెండు ముఠాలున్నాయని నాకు తెలుసు. ఒకటి టంగుటూరు ప్రకాశం గారికి అనుకూలం, రెండోది ఆయనకు వ్యతిరేకం. చివరకు ఎలాగైతేనేం జిల్లా కాంగ్రెస్ కమిటీ వారు కిసాన్ కార్యకర్తలను కూడా కాంగ్రెస్ సభ్యత్వాలకు ఆహ్వానిస్తున్నారు. మహాత్ముడు చెప్పినా వినకుండా పోటీకి దిగిన ప్రకాశం ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. ఆయన పట్టాభి ముఠా వాళ్లను మంత్రి వర్గం లోపలకు తీసుకోలేదు. పిసిసికి ప్రతినిధులను ఎంపిక చేయాల్సిన సమయం ఆసన్నమయ్యేటప్పటికి కిసాన్ కార్యకర్తలు కీలకమైన మూడో ముఠా అయ్యింది.

మాకెలాగూ గెలిచే అవకాశం ఉండదు కనుక రైతు సమస్యలను తీర్చేందుకు వచ్చే ముఠాకు మద్దతు పలకాలని నా అనుయాయులకు చెప్పాను. నేను ఐరోపా వెళ్లిన తర్వాత కందుల ఓబులరెడ్డి ఏమని భావించారంటే ప్రకాశం పంతులు ముఖ్యమంత్రి అయిన తర్వాత మరో పెద్ద నాయకుడు వాళ్లకు లేకపోవడంతో నన్ను పిసిసి అధ్యక్షుడ్ని చేయాలని. పట్టాభితో విసిగి వేసారిన ఆయన ముఠా వాళ్లకు కూడా వ్యతిరేకమే కనుక మా వాళ్లు అధ్యక్ష పదవికి నా పేరు ప్రతిపాదిస్తే వాళ్లు తమ మద్దతునిస్తామన్నారు. పైగా ప్రకాశం, డాక్టర్ పట్టాభి మాదిరిగా నేను అప్పటివరకూ కాంగ్రెస్‌లో పదవులు అధిష్ఠించినవాణ్ణికాను. అలా నేను అక్కడ లేకుండానే నా పరోక్షంలో నన్ను పి.సి.సి. అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు అదీ పట్టాభి ముఠాను ఓడించి. అలా మంత్రి వర్గంలోనూ, పిసిసిలోనూ చోటు దక్కనందుకు ఆ ముఠా కారాలూ మిరియాలూ నూరటం సహజమే కనుక పిసిసి పంపిన ప్రతిపాదనలను వర్కింగ్ కమిటీ ద్వారా కాదనిపించే ప్రయత్నానికి డాక్టర్ పట్టాభి దిగాడు. వీలైతే పిసిసి కార్యవర్గాన్ని రద్దు చేయించే ప్రయత్నం కూడా చేయసాగాడు. అంతకుముందు కార్యవర్గం ఎన్నికల్లో చేసిన తప్పులకు ఈ కార్యవర్గాన్ని తొలగించాలట.

సర్దార్ పటేల్, డాక్టర్ పట్టాభి ఆప్త మిత్రులు. వారిద్దరూ కలసి ప్రకాశం ముఖ్యమంత్రి కాకుండా చేయలేకపోయినందుకు ఎంతగానో అసంతృప్తితో రగిలిపోతున్నారు. పైగా పిసిసి అధ్యక్ష పదవికి డాక్టర్ పట్టాభి పోటీకి నిలిపిన పల్లంరాజు ఓడిపోయాడు. కనుక ఎపిసిసి కార్యవర్గాన్ని కూలదోసేందుకు రంగం సిద్ధంచేశారు. ప్రకాశం గారిని ముఖ్యమంత్రి పదవిని చేపట్టవద్దని స్వయంగా చెప్పినా వినలేదని మహాత్మా గాంధీ కినుక వహించాడు.

ఎన్నికైన ఓ నెల రోజులకు నేను ఐరోపా నుండి తిరిగి వచ్చాను. గాంధీ గారిని ఢిల్లీలో ఒక పారిశుద్ధ్య కార్మికుల కాలనీలో కలిశాను. సాయంత్రం పూట ప్రార్థనా సమయం ముగిసిన తర్వాత నన్ను రెండు విషయాల్లో అభినందించారు. ఒకటి -ఐరోపాలో మన స్వాతంత్ర్య సిద్ధికి, గాంధీజీ ఆశయాల వ్యాప్తికి బాగా ప్రచారం చేసినందుకు. రెండు-ఎపిసిసికి అధ్యక్షునిగా ఎన్నికైనందుకు. త్వరలో జరగబోయే అఖిలభారత కిసాన్ సమ్మేళనానికి ఆయన ఆశీస్సులు కోరాను.

ఆయన మెల్లగా భుజం తట్టి 'పిసిసి అధ్యక్షుడైన తర్వాత కూడా నువ్వు నీ కిసాన్ సమ్మేళనాన్ని మర్చిపోలేదన్న మాట' అన్నాడు బాపూజీ. 'ఈ హోదాలన్నీ

అర్థవంతమయ్యేదెప్పుడంటే అవి నేను రైతులకు, వృత్తిపనివారికి మరింతగా సాయపడేందుకు అవకాశం కల్పించినప్పుడే' అని బదులు పలికాను. ఆయన అమితానందం పొందాడు. దాన్ని ఆసరాగా తీసుకుని ఆయన్ను కిసాన్ సమ్మేళనానికి బాహాటంగా మద్దతు పలకమన్నాను. 'ఇప్పుడు పరిస్థితులు నీకూ, నాకూ అందరికీ సానుకూలంగా మారుతున్నాయి. నేను నీకు సాయపడగలను' అన్నారు. తర్వాత పిసిసి విషయం మాట్లాడారు. మద్రాస్‌లోని కాంగ్రెస్ మంత్రి వర్గం కాంగ్రెస్ ప్రచారం చేసే పథకాలను అమలుపర్చేటట్లు చూడమన్నారు. రాజకీయ పక్షపాతానికీ, లంచగొండితనానికీ పరిపాలన దూరంగా ఉండేటట్లు చూడమన్నారు.

నేను ఆంధ్ర ప్రాంతానికి పిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాను. పిసిసి చేపట్టాల్సిన నిర్మాణాత్మక క్రియాశీల కార్యక్రమాన్ని గురించి చర్చించడం ప్రారంభించాను. బ్రిటిష్ రాజకీయ పక్షాల నుండి పార్టీ నిర్వహణా విషయంలోనూ, ప్రచారం విషయంలోనూ నేను నేర్చుకున్నదాన్ని ప్రయోగించే పనిలో పడ్డాను. ప్రజలతో మమేకమయ్యే క్రియాశీల, ప్రగతిశీల రాజకీయ పక్షంగా కాంగ్రెస్‌ను తీర్చిదిద్దేందుకు నా అనుయాయులు అందరినీ నాతో సహకరించమన్నాను. పిసిసి తొలి కార్యవర్గ సమావేశం నిడుబ్రోలులోని రమ-నీడు విద్యాలయంలో నిర్వహించడం జరిగింది. పిసిసి జనరల్ సెక్రటరీ కందుల ఓబులరెడ్డి, సంయుక్త కార్యదర్శి జి.లచ్చన్న భారతీయ రైతు విద్యాలయం నుండి శిక్షణ పొందినవారే. పార్టీ నిర్వహణ, పునశ్చరణ విషయంలో అందరూ అంగీకారాన్ని తెలియజేశారు. మేము కాంగ్రెస్ కార్యకర్తలకు గౌరవ వేతనం ఇవ్వాలనుకున్నాం. రోజువారీ ఖర్చులకు వెతుక్కోకుండా కార్యకర్త తమ కృషిని కొనసాగించేందుకు అది తోడ్పడుతుందనుకున్నాం.

అసలు 1923 నుండి నాకు అలా చేస్తే కాంగ్రెస్‌వంటి సంస్థకు నిరంతరాయంగా సేవలందించే కార్యకర్తలు లభిస్తారని అనిపించేది. నాకు బ్రిటిష్ లేబర్ పార్టీ నిర్వహణా తీరు చూసిన తర్వాత ఆ అభిప్రాయం ఏర్పడింది. గాంధీజీ కూడా కార్యకర్తలకు అలాంటి గౌరవ వేతనం చెల్లించాలని వాదిస్తూనే ఉన్నారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ వాళ్ళ పూర్తికాలపు కార్యకర్తలకు అటువంటి గౌరవ వేతనం (అదెంత స్వల్పమైనా సరే) చెల్లించడం వల్ల వాళ్లకు స్వచ్ఛందంగా, క్రమశిక్షణతో సేవలందించే కార్యకర్తలు అయ్యారు. కనుక ఎపిసిసి కార్యవర్గం నా ప్రతిపాదనను అంగీకరించడం నాకెంతో సంతోషాన్ని కలిగించింది.

అయితే త్వరలోనే అది అపార్థానికి తావిచ్చింది. ఎదురు ముఠావాళ్లు నేనా ఏదో కాంగ్రెస్‌లో మెజార్టీ గ్రూపును పటిష్టపర్చేందుకు చేపట్టిన చర్యగా వక్రీకరించారు కనుక మా నాయకత్వాన్ని తొలగించాలంటూ పత్రికలకెక్కారు.

1947 జూలైలో బొంబాయిలో జరిగిన ఎఐసిసిలో పండిట్ నెహ్రూను కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. మౌలానా ఆజాద్ రాజీనామా సమర్పించిన ఖాళీలో నెహ్రూ అధ్యక్షుడయ్యాడు. 1940-46 మధ్యకాలంలో మౌలానా సాహెబ్ కాంగ్రెస్‌కు పటిష్ట ప్రతిష్టలు సమకూర్చి పెట్టారు. నేను ఎపిసిసి అధ్యక్షుణ్ణి అయినందుకు నెహ్రూ అభినందిస్తారనుకున్నాను. ఆయనకు తెలుసు -కాంగ్రెస్ ఉద్యమ సుదీర్ఘ చరిత్రలో రైతుల పక్షాన వీరోచితంగా ముందుకొచ్చిన బహుకొద్దిమందిలో నేనూ ఒకడినని. పైగా దేశ స్వాతంత్ర్యం ముంగిట నిలిచి ఉంది. నన్ను అభినందించకపోగా పండిట్ నెహ్రూ గుంటూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ వ్యవహారాలపై విచారణ జరిపేందుకు శ్రీమతి కమలాదేవిని నియమించారు. విషయాన్ని నేను అర్థంచేసుకునేందుకూ, విడమర్చి చెప్పేందుకుగానీ అవకాశాన్ని ఇవ్వలేదు. నేను అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన ఒక నెల రోజులలోపే ఇలా చేయడం కిరాతకపు చర్యగా భావించాను.

అసలా విచారణ ఆంధ్ర కాంగ్రెస్‌లో నా పరువును మంట గలిపేందుకే. కమలాదేవి రావడంతో ఆంధ్రలోని అన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ వాళ్ల ఫిర్యాదుల స్వీకరణకు వచ్చినట్లు కనిపించింది. గత సంవత్సరంలో సంస్థాగతంగా కాంగ్రెస్‌లో ఏమి జరిగిందో దానిపై ఫిర్యాదులు ఉన్నాయి. ఎవరికైతే కాంగ్రెస్ టిక్కెట్లు దక్కలేదో వాళ్లల్లో పలువురు అసంతృప్తి చెంది మా కార్యవర్గంపై నిందలు మోపారు. అదంతా పనికిమాలిన వ్యవహారమే అయినా కాంగ్రెస్ పనితీరు గ్రహించేందుకు అది నాకు లోచూపును అందించినట్లయ్యింది. కనుక విచారణ మొత్తాన్నీ రాజకీయ అధ్యయనంగా నేను భావించాను. నేను అన్ని ముఠాల సహకారంతో కాంగ్రెస్‌ను పటిష్టపర్చేందుకు చేపట్టబోతున్న చర్యల గురించి విని ఆమె సంతృప్తి చెందింది. అలా అయితేనే సుశిక్షితంగా ముందుకు పోతున్న కమ్యూనిస్ట్‌లను తట్టుకుని కాంగ్రెస్ నిలబడగలిగేదని ఆమె గ్రహించింది. ఆమె విచారణ పూర్తయిన తర్వాత పట్టాభి ముఠా మా రాష్ట్ర కార్యవర్గం వర్కింగ్ కమిటీ చెప్పుచేతల్లో ఉండాలని కేకలేశారు.

పిసిసి సంస్థాగత నిర్మాణంతో దాని పనితీరును గత నెలరోజులుగా ఎంతో దగ్గరగా గమనించే అవకాశం కలిగింది. కమలాదేవి చేపట్టిన విచారణ సమయంలో చేసిన

ఫిర్యాదులు, ప్రతి ఫిర్యాదుల వల్ల ముఠా వ్యవహారాలు జిల్లా, తాలూకాలకేకాక అనేక గ్రామాలకు కూడా పాకిందని తెలుసుకున్నాను. 1939 వరకూ కాంగ్రెస్ కమిటీలు పట్టణ ఉన్నత వర్గాల అజమాయిషీలో ఉండేవి. ఇప్పుడు నాయకత్వానికి పల్లెల నుండి కూడా పోటీపడసాగారు. పిసిసి ఏర్పాటైన ఈ మూడున్నర దశాబ్దాల కాలంలో గ్రామీణ ప్రాంతం నుండి ఎన్నికైన వాళ్లల్లో నేను రెండోవాణ్ణి. మా కార్యదర్శులు ముగ్గురూ గ్రామీణులే. అదే పెద్ద ప్రజాస్వామిక పరివర్తన.

పైగా 1934 నుండి యువత రాజకీయంగా ముందుకు రాసాగింది. సరికొత్త యువ నాయకత్వం కేవలం కాంగ్రెస్‌కేగాక కమ్యూనిస్ట్, సోషలిస్ట్ పార్టీలకు కూడా లభించింది. కాంగ్రెస్ నాయకత్వంలో వాళ్ల స్థానం వారికి దక్కాలనడంతో పాత తరం ముఠాలు రెండింటిలోనూ ఈర్ష్య చోటుచేసుకుంది. కులం కూడా కొంచెం సిగ్గు కనబర్చుతూనే త్వరితగతిన కాంగ్రెస్ నాయకత్వంపై పట్టు సాధించింది. కళ్లెదుట కనిపించే కాంగ్రెస్ మంత్రి వర్గం, త్వరలోనే సాధించబోయే స్వాతంత్ర్యం జస్టిస్ పార్టీ వాళ్లను, ఇతర గ్రామ, తాలూకా స్థాయి నాయకులను కాంగ్రెస్‌లోకి చేరేటట్లు చేశాయి. కాంగ్రెస్ పదవులు చేపట్టినవారిలో స్వార్థ త్యాగానికి బదులుగా వైరాలు, అవకాశవాదం పెచ్చరిల్లాయి.

కాంగ్రెస్ కమిటీల బాధ్యులు ప్రతికూల వ్యక్తిత్వం గలవారిని సభ్యత్వానికి, ఎన్నికలకు, కమిటీల నాయకత్వానికి దూరంగా ఉంచేందుకు అనేక జిత్తులు ప్రయోగించేవారు. కాంగ్రెస్‌లో స్థానం సంపాదించేందుకు, నాయకత్వం వహించేందుకు, కాంగ్రెస్‌ను అంటిపెట్టుకుని ఉండేందుకు , ప్రతిపక్షంవాళ్ల గెలుపును అరికట్టేందుకు ఏం చేసేందుకైనా సంకోచం ఉండేదికాదు. గాంధీజీ నైతికత్వం అడ్డొచ్చేది కాదు. అందువల్లనే సభ్యత్వ రుసుం చెల్లించినా సభ్యత్వం రాలేదని, ఎదుటి పక్షంవాళ్లకు సభ్యత్వం ఇవ్వలేదని, ఎన్నికల ప్రకటనలు జారీ చేయలేదని, ఒకవేళ జారీ చేసినా అవి తగిన సమయంలో జారీ చేసినవి కాకపోవడంగానీ, బనాయించినవి కావడంగానీ అయ్యుండటం, ఎన్నికలు నిజాయితీగా నిర్వహించలేదని ఇలా ఎన్నో ఫిర్యాదులు. ఒకరిపట్ల ఒకరికి విశ్వాసం లేకుండా శత్రుత్వంతో వాళ్లంతా గాంధీజీకి మద్దతు పలుకుతూ స్వాతంత్ర్య సముపార్జనకు ఎలా తోడ్పడగలరని విస్తుపోయేవాణ్ణి. ఇటువంటివే మరికొన్ని ఇబ్బందికి గురిచేసే వాస్తవాలను చూసినప్పుడు రష్యా రాజకీయాల గురించి టాల్‌స్టాయ్ 'రిస్సరెక్షన్'లో వర్ణించింది గుర్తుకొచ్చేది. నేను నా అధ్యక్ష పదవీకాలంలో

వాళ్లల్లో పెక్కుమందిని ఒక తాటిమీదకు తీసుకురావాలని, కాంగ్రెస్ కమిటీల్లోని వాళ్లందరికీ ప్రాతినిధ్యం కల్పించాలని, అలా తిరిగి వాళ్లందరినీ ఒకటిగా చేయాలని కోరుకునేవాణ్ణి.

అయితే పిసిసి ఎన్నికల్లో ఓడిన వాళ్లందరూ, వాళ్ల నాయకులు నాకు కోపు కాసేవాళ్లల్లో ముఠాతత్వం గలవారిని బలపర్చి కిసాన్ కాంగ్రెస్‌వాదుల్ని, ప్రకాశం ముఠాను గెలిపించేందుకు చేయకూడని పనులన్నీ చేశారు. ఇలా ఒకరిపై ఒకరు కత్తులు దూసుకునే రెండు వైరి వర్గాల మధ్య నేను కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఐదేళ్లపాటు గడపాల్సి వచ్చింది.

కమలాదేవి నివేదిక నా నెల రోజుల నిర్వహణలో ఎటువంటి లోపాలనూ ఎత్తిచూపలేదు. కాంగ్రెస్ స్థితిని ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు నేను చేసిన ప్రతిపాదనలను తప్పుబట్టలేదు. నాకు ముందు అధికారంలో ఉన్న నాయకత్వాలపై కొన్ని ఆక్షేపణలు పొందుపర్చడం జరిగింది. అందులో రెండు ముఠాల నాయకులున్నారు. అలా డాక్టర్ పట్టాభి వర్కింగ్ కమిటీతో మాపై పెత్తనం చేయించలేకపోయాడు.

ఎపిసిసి ఖాతా పుస్తకాల తనిఖీకి ఎఐసిసి ఒక ఆడిటర్‌ను పంపింది. నేను అధ్యక్షుడ్ని అయిన నాటినుండి లెక్కలన్నీ సక్రమంగానే ఉన్నాయని గ్రహించాడు. అయితే పండిట్ నెహ్రూ మా కమిటీ పట్ల అటువంటి విరోధ భావాన్ని ఎందుకు పెంచుకున్నట్లు? మేము బాధ్యతలు స్వీకరించి రెండు మాసాలు కూడా గడవకముందే, మేము విషయాన్ని అవగాహన చేసుకుని వివరించే అవకాశం ఇవ్వకుండానే ఇటువంటి విచారణ ఇంతకుపూర్వం ఎన్నడూ చేపట్టిన దాఖలాలు లేవు.

మా కార్యకర్తలు, నాయకులు అందరూ నెహ్రూ ఆ విధమైన కోపాన్ని లేదా పక్షపాత వైఖరిని మా పిసిసి పట్ల చూపడానికి కారణమేమిటా అని విస్తుబోయారు. బహుశా యుద్ధానికి ముందు కాంగ్రెస్ హైకమాండ్‌తో నా ముఖాముఖి వ్యవహారం అయివుండవచ్చునేమో అనుకున్నారు. వాళ్ల అనుమానాలు బలం పుంజుకోసాగాయి. గుంటూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎన్నికలను పక్కన పడేశారు. ఎఐసిసి సచివాలయం ద్వారా ఏడు వందల స్థానాలకుపైగా కొత్తగా ఎన్నికలు జరపమని మా కమిటీకి ఆదేశాలు పంపడం జరిగింది. నాకు అనిపించిందేమంటే నా ప్రజా సేవకు సంబంధించిన వివరాలు కాంగ్రెస్ పార్టీ నిర్వహణ వేలెత్తి చూపలేనివి కనుక మా కమిటీ వ్యవహారంలో ఓ చూపు చూడాలనుకున్నాడు. కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం

పట్ల నా తపన, మన దేశ రాజకీయ జీవితంలో, నాయకత్వంలో రైతుల, వృత్తికళాకారుల పాత్ర ఆయన ఎరిగిందే కనుక నా క్రియాశీల ఉద్యమ స్ఫూర్తి కాంగ్రెస్ వ్యవస్థాగత రాజకీయాల్లో పలు మార్పులు తెచ్చే అవకాశం ఉన్నది. నా విశ్వసనీయతకు అన్ని వైపుల నుండి పరీక్ష పెట్టి నిగ్గుదేల్చదలిచాడు.

కాంగ్రెస్‌లోని మా ఎదురుముఠావాళ్లకు నెహ్రూ ద్వారానూ, వర్కింగ్ కమిటీ ద్వారానూ మమ్మల్ని ఇరుకున పెట్టే పనిలో పప్పులు ఉడకనందున ఇక బాపూజీ మనస్సు మార్చే ప్రయత్నానికి పూనుకున్నారు. ఎందుకంటే ఆయనే మాకు అటు సంస్థాగతంగానూ, ఇటు నైతికంగానూ సర్వశ్రేష్ఠ నిర్ణయాధికారి.

కాంగ్రెస్ పనిచేస్తున్న తీరుపై నన్ను ఒక నివేదిక పంపమని కోరిన గాంధీజీ నన్ను వాస్తవాలనే రాయమని తనను సంతృప్తిపర్చేందుకు అది చాలునని ముక్తాయింపునిచ్చారు. కనుక నేను ఆయనకు ఒక సుదీర్ఘ నివేదిక పంపాను. అది పరిశీలించిన ఆయన తప్పుబట్టలేదు సరికదా కాంగ్రెస్‌కు ఏది ప్రయోజనకరమో అది చేస్తూ ముందుకుసాగమన్నారు. అయితే వైరి వర్గాల సహకారాన్ని కూడా సాధ్యమైన మేరకు పొందాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. సరే, వైరి వర్గం అలా పై నుండి మమ్మల్ని ఏమీ చేయలేక కింద నుండి మాయోపాయాల ద్వారానో, మంత్రుల అధికారాన్ని అడ్డంపెట్టుకునో భయోత్పాతానికి గురిచేయాలని చూసింది.

ప్రకాశం పంతులు గారి కాంగ్రెస్ మంత్రి వర్గాన్ని పడిపోకుండా నిలబెట్టడం ఆయనకుగానీ, మద్రాస్ కాంగ్రెస్ అసెంబ్లీ పార్టీకి చెందిన ఆయన మిత్రులకుగానీ ఆంధ్ర ప్రొవెన్షియల్ కాంగ్రెస్ కమిటీకిగానీ సాధ్యపడేటట్లులేదు. ప్రకాశం గారు గాంధీజీ సలహాను కూడా పెడచెవినపెట్టి పార్టీ నాయకత్వానికి పోటీపడి కాంగ్రెస్‌లోనే ఎదురి వర్గాన్ని ఓడించగలిగాడుకానీ ఢిల్లీ నాయకత్వం నుండి తన వైరి వర్గం ద్వారా వచ్చే నిరంతర ఒత్తిడికి గురవుతున్నాడు. గాంధీజీయేమో నేను ఆ త్రాసులోని రెండు సిబ్బెల్ని సమానంగా నిలిపే విధంగా చర్యలు చేపట్టాలని చూస్తున్నాడు. నేను మే 1946లో ఐరోపా పర్యటనకు వెళ్లే ముందు ప్రకాశం గారికి మద్దతు పలుకుతున్నది ఆయనకు తెలుసు కనుక ప్రకాశం గారి నాయకత్వానికి ఎదురవుతున్న అభ్యంతరాలను తుడిచివేసేందుకు చర్యలు తీసుకోమని ఆయనకు చెప్పాలన్నమాట.

గాంధీ గారి మాటలు నన్ను ఆశ్చర్యపడేటట్లు చేశాయి. ఆయన నిర్మాణ కార్యక్రమాలను ఒకదాని వెంట ఒకటి చకచకా ప్రజాదరణ పొందేవాటిని

ప్రవేశపెడుతూనే ఉన్నాడు. ఆయన ఖాదీ అభివృద్ధి కోసం కోటి రూపాయలు, హరిజనోద్ధరణకు మరో కోటి రూపాయలు కేటాయించారు. ఆయన ఉత్పత్తిదారుల, వినియోగదారుల సహకార సంఘాలను ఏర్పాటుచేసి దళారీ వ్యవస్థను రూపుమాపదల్చాడు. ఇటువంటి సామాజిక-ఆర్థిక రక్షణ కవచాల కోసం మేము 1923 నుండి ఎదురుచూస్తున్నాం. ఆయన, ఆయన అనుయాయులు కలసి జోగన్నపాలెంలో ప్రారంభించిన (1939) గ్రామీణ స్వయం సమృద్ధి పథకం ప్రభుత్వం ద్వారా నిర్వహించే (1946) ఫిర్కా అభివృద్ధి ప్రణాళికకు దారితీసింది. అది జాతీయ విస్తరణ పథకానికి భవిష్య సూచకంగా నిలిచింది. కనుక ప్రకాశం గారి ఈ పథకాన్ని చూసి మేము మా కలలు సాకారం కాబోతున్నాయని సంబరపడ్డాం.

ప్రకాశం గారిని ఇరుకునపెట్టిన పథకం సంవత్సర కాలంలో రాష్ట్రమంతటా మద్యనిషేధాన్ని అమలుచేయడం. సిద్ధాంతరీత్యా మేము దానికి కట్టుబడి ఉన్నాం. గాంధీజీ నిర్మాణ కార్యక్రమాల్లో అది ప్రధానమైనది. అయితే ఆర్థికపరమైన చిక్కులు మమ్మల్ని భయపెట్టాయి. అది మద్రాస్ ప్రెసిడెన్సీ అంతటా అమలుచేయాలి. పది లక్షలమంది గౌడులు లేదా కల్లుగీత కార్మికులు పనిని కోల్పోతున్నారు.

ఇటువంటి వాటి వల్ల, మంత్రి వర్గపు నిర్మాణాత్మక చర్యల వల్ల ఆయన మంత్రి వర్గాన్ని పటిష్టపర్చాల్సిన అవసరం ఏర్పడిందనుకున్నాను. అయితే ఆయన ఎదురుచూసింది వాళ్లకు కాంగ్రెస్ ఐక్యంగా ఉండడంకానీ, గాంధీజీ ఆదర్శాలుగానీ, జాతీయ శ్రేయస్సుకానీ పట్టవు. వాళ్లకు కావాల్సిందల్లా మంత్రి పదవులే. అందువల్ల వాళ్లలో నలుగురైదుగుర్ని మంత్రి వర్గంలోకి తీసుకోవాల్సిందిగా సలహా ఇచ్చాను. అలా వాళ్లను ఆహ్వానించడానికి ఆయన సిద్ధంగా లేడు. ఎదురుచూసిన వాళ్లు ఎన్నికలప్పుడు ప్రకాశం గారికి ఎదురునిల్చినా వాళ్లూ కాంగ్రెస్‌వాళ్లే. వాళ్లూ లాఠీ దెబ్బలు తిన్నవాళ్లే. జైలు జీవితం అనుభవించినవాళ్లే. కనుక అటువంటి పదవులు పొందే హక్కు వాళ్లకూ వుందనిపించింది. ఆయన నా సలహాను అంగీకరించి ఇద్దరికి మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తాననేటప్పటికి చాలాకాలం గడచిపోయింది. దాంతో వాళ్లు మంత్రి వర్గంలో చేరబోమని చెప్పారు. మంత్రి వర్గాన్ని పడగొట్టేందుకు కృషి చేశారు.

పిసిసి అధ్యక్షుడిగా నేను చూస్తూ కూర్చోవడానికి వీలులేదు. ఎదురుతిరిగిన మునుపు మంత్రి వర్గంతో సహకరించమన్నాను. అయితే వాళ్లు ఢిల్లీ వెళ్లి ప్రకాశం మంత్రి వర్గాన్ని పడగొట్టేందుకు తమకు మద్దతు పలకమని సర్దార్ పటేల్‌ను, ఢిల్లీ నాయకులను

కోరారు. అది మంచి పనికాదని నేను సర్దార్ పటేల్‌తోనూ, నెహ్రూతోనూ, వర్కింగ్ కమిటీ సభ్యులతోనూ వాదించాను. ఈ విషయంలో నాకు దేశభక్త కొండా వెంకటప్పయ్య తోడ్పాటు బాగా లభించింది. అభియోగాలేమీ నిర్ధారణకు రాకుండానే తాత్కాలికంగా మెజార్టీ సభ్యులు ఒక పక్షాన నిలిచారని, మంత్రి వర్గాలను కూల్చడం అప్రజాస్వామికమని చెప్పడం జరిగింది. వెంకటప్పయ్య ఎంతగా గొంతు విప్పినా ప్రయోజనం లేకపోయింది. అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలకవద్దని ఆంధ్ర ప్రజా ప్రతినిధులందరికీ చెప్పదల్చాను. వాళ్లు ప్రకాశం గారు తమకు నచ్చలేదనే మాట తప్ప మరొకటి మాట్లాడడంలేదు. వాళ్ల నిర్ణయంలోని ప్రమాదాన్ని నేను గుర్తించాను. తర్వాత వాళ్ల గురి నా మీదనే. ఏదైతేనేం చివరకు ఎదురుముఠావాళ్ల ఆ ఎత్తుగడతో కేంద్రం మద్దతుతో ముందుకు సాగి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి ప్రకాశం గారిని దించి ఒ.పి.రామస్వామి రెడ్డియార్ అనే ఆయన్ను నూతన నాయకుడిగా ఎన్నుకున్నారు. ఆయన తమిళనాడు కిసాన్ ఫ్రంట్‌కు చెందిన నా మిత్రుడు. 1932లో మేమిద్దరం వెల్లూరు కారాగారంలో ఉన్నాం.

ఇటువంటి కీలకమైన ఘటనలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రదర్శించిన సంకుచిత దృష్టి, ముఠాతత్వం వల్ల అఖిలభారత కాంగ్రెస్ నాయకత్వంలో ఇది సాధారణ విషయం కారాదని, అలా కాకుండా అరికట్టేందుకు నేను గట్టిగా కృషి చేయాలని భావించాను. అయితే దాన్ని భుజానికి ఎత్తుకునేందుకు ధైర్యం చాలడంలేదు. ఎందుకంటే వర్కింగ్ కమిటీకి ఒకసారి స్వేచ్ఛనిచ్చిన తర్వాత బాపూజీయే ప్రకాశం గారి విషయంలో నిస్సహాయంగా ఉండిపోవాల్సి వచ్చింది. నన్ను వర్కింగ్ కమిటీలోకి తీసుకోవడంతో నేను సాధ్యంకాని పనికి ఎదురునిలిచాననిపించింది.

నేను ఆంధ్ర ప్రొవెన్షియల్ కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షుడిగా ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో దానినొక సమర్థవంతమైన రాజకీయ పక్షంగా తీర్చిదిద్దేందుకు నా ప్రయత్నం నేను చేశాను. అది యువతను, విద్యార్థుల్ని ఆకర్షించాలని ఆత్రుతపడ్డాను. అదొక శక్తిమంతమైన ఎన్నికల రాజకీయ ఆయుధం కావాలనుకున్నా. దానికి నిర్మాణాత్మక కార్యక్రమాల ద్వారా, ప్రజలను వివేకవంతుల్ని చేసే కార్యక్రమాల ద్వారా ప్రజలను ఉత్సాహభరితంగా ఉంచే శక్తిని సమకూర్చాలనుకున్నా. రాజకీయ కార్యకర్తల్లో ఆచరణాహనను పెంచి రకరకాల ఆనందదాయక, స్ఫూర్తిదాయక కార్యక్రమాల్లో దాన్ని విమగ్నమయ్యేటట్లు చేసి దైనందిన జీవితాల్లోని అవసరాలకు, భావనలకు దగ్గరగా

చేర్చాలనుకున్నాను. అది తప్పక ఆర్థికంగా ఫలప్రదమవుతుందనుకున్నా. అది [illegible] సంచుల ప్రలోభాలకు అందనంత దూరంగా ఉండి తీరుతుంది.

అప్పట్లో (1946-51) నేను సాధించిన వాటిని ఇంతకాలానికి (1967) [illegible] రచించుకున్న ప్రణాళికను సంపూర్ణంగా పూర్తిచేయగలిగానా లేక నేను [illegible] కోరుకున్న మేరకైనా పూర్తి చేయగలిగానా అని అంటే ఆనాటి పరిస్థితుల్లో నా శక్తిమంతా లేకుండా కృషి చేశాననే చెప్పాల్సి వస్తుంది. ఎపిసిసి బాధ్యతలు నిర్వహిస్తూనే పలుమార్లు ఇంగ్లండ్‌కు వెళ్లిరాగలిగాను. (1946, 1947, 1948, 1949). నేను బ్రిటిష్ [illegible] పార్టీ ఎలా పనిచేస్తున్నదో అధ్యయనం చేశాను. అలాగే అమెరికన్ డెమోక్రాటిక్ [illegible] పనితీరును ప్రత్యేకంగా అధ్యయనం చేశా. అది రూజ్ వెల్ట్ ప్రవేశపెట్టిన కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తుంది. అది నాకు నచ్చింది. అలాగే కెనడాకు చెందిన కో-ఆపరేటివ్ కామన్‌వెల్త్ పార్టీని కూడా అధ్యయనం చేశాను. మా పార్టీ నిర్వహణలో ఆ అనుభవాలను పొందుపర్చి అభివృద్ధిపర్చవచ్చునేమోనని పరిశీలించాను.

అయితే స్వాతంత్ర్య సమరంలో ఎన్నో ఇబ్బందులకు గురై ప్రజలతో సత్సంబంధాలను నెలకొల్పుకుంటూ గ్రామస్థుల్ని ఒకతాటిపైకి వచ్చేటట్లుగా చేసి వీరా సభలకు వెలుపల కాంగ్రెస్ సంస్థకు, కాంగ్రెస్ మంత్రి వర్గాలకు మధ్య సయోధ్య నెరపుతూ శ్రమించే కాంగ్రెస్‌వాదుల ఆశల్ని మాత్రం వమ్ముచేసినట్లుగా కనిపించింది. 1936-39 మధ్యకాలంనాటి కాంగ్రెస్ మంత్రి వర్గాల అనుభవాలే అటువంటివి జరుగుతుందనే హెచ్చరికలను జారీచేశాయి. అయితే 1946-47లో కాంగ్రెస్ కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ అధికారంలోకి వచ్చిన తర్వాత యుద్ధ సమయంనాటి బాధల్ని తలచుకుని బాపూ ఆశించినదానికి అనుగుణంగా మనం నడుచుకుంటూ ఆయన మరణం తర్వాతనయినా మన హృదయాలు శుద్ధి అవుతాయన్న ఆశావహ దృక్పథం ఏదో తళుక్కుమన్నది. అయితే కాంగ్రెస్‌వాదులు తిరిగి ముఠాల కుమ్ములాటల్లో కూరుకుపోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు. బీహార్, ఉత్తరప్రదేశ్‌వంటి రాష్ట్రాల్లో రెండు ముఠాలకు పిసిసిలోనూ, మంత్రి వర్గంలోనూ ప్రాతినిధ్యం దక్కేటట్లు చూశారు. రాజస్థాన్, ఒరిస్సా, బొంబాయి, మద్రాస్ వంటి రాష్ట్రాల్లో పెద్ద ముఠా చిన్న ముఠాను పైకి రానివ్వలేదు. మంత్రులు పిసిసి నాయకత్వాన్ని ఇబ్బందిపెట్టకుండా రెండు వర్గాలకు చెందిన వారైనా ఒకరికొకరు సహకరించుకుంటూ ఉంటే అంతగా హాని జరగకపోను. దురదృష్టవశాత్తూ ప్రజామోదం కోసం రెండు ముఠాలు ఒకదానితో ఒకటి

పోటీపడసాగాయి. అటువంటి సందర్భాల్లో ఫలితాలు ఆనందమయం కాజాలవు. ఇరు వర్గాలూ సహకార భావనతో ప్రజలకు సేవలందించడంలో పోటీపడక ప్రజలను చీల్చి నాయకత్వం విషయంలో వాళ్లను అయోమయంలో పడవేసే పనిలో పడిపోయాయి.

ఆంధ్రలో నేను దాదాపుగా ప్రజలతో సత్సంబంధాలను ఏర్పాటుచేసుకుంటూ మనస్ఫూర్తిగా కాంగ్రెస్ సంస్థకు, మంత్రి వర్గానికి మధ్య ప్రగతిదాయక సయోధ్యను కుదిర్చేందుకు కృషి చేస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాను. అదంతా నేను నా సిద్ధాంత గ్రంథం 'వరల్డ్ రోల్ ఆఫ్ నేషనల్ రివల్యూషన్' లో పొందుపర్చాను. దాన్ని 1946లో ప్రచురించడం జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి ప్రకాశం గారు ప్రవేశపెట్టిన ప్రగతిదాయక ప్రణాళికలు, కార్యక్రమాలు నాకు నచ్చాయి. అయినా మంత్రి పదవులు ఆశించి విఫలురైన మూడో వర్గం వికృత స్వరంతో గొడవలకు దిగి సహాయ నిరాకరణకు దిగడంతో నిర్మాణ కార్యక్రమాలకు సంభవించబోయే కీడును ముందుగానే సూచించినట్లయ్యింది.

మంత్రి వర్గం కనుక స్థానిక ఎన్నికల్లో తలదూర్చిందంటే తమ పలుకుబడితో ఏదో ఒక ముఠాకు ప్రయోజనం కలిగేటట్లు చూస్తారు. స్థానిక సంస్థలకు, సహకార సంఘాలకు ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాల్సి ఉంది. ప్రభుత్వ అధికారులు ఎటువైపూ మొగ్గు చూపకుండా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే వాస్తవానికి అధికారులు త్వరగా పదోన్నతి పొందాలనో, బదిలీ కోసమో మంత్రి వర్గపు ముఠా కోపు కాసేవారు. అటువంటి సందర్భాల్లో అది మంచా, చెడ్డా, వాళ్ల అధికారాన్ని దుర్వినియోగపరుస్తున్నామా లేదా అని చూసేవారు కాదు. మెజార్టీ ఓట్లను కూడా తారుమారు చేసిన సందర్భాలు లేకపోలేదు. అప్పుడు న్యాయస్థానాలను ఆశ్రయించినా ప్రయోజనం ఉండేదికాదు. కాంగ్రెస్ సంస్థకు చెందిన ముఠాలకు సంబంధించి వాళ్లకు సంబంధించిన సహకార సంఘాలను రిజిస్టర్ కూడా చేసే వాళ్లు కాదు. ఇటువంటి విషయాలకు సంబంధించిన విషయాన్ని 1957లో జవహర్‌లాల్‌జీయే స్వయంగా వెలిబుచ్చాడు. మంత్రి వర్గానికి అనుకూలంగాలేని స్థానిక సంస్థల ప్రెసిడెంట్లకు, చైర్మన్లకు సంబంధించిన పనులు జరిగేవి కావు. అందరూ కాంగ్రెస్‌కు విధేయులే అయినా మంత్రి వర్గానికి అనుకూలురు, మంత్రి వర్గానికి వ్యతిరేకులు అనే రెండు ముఠాలుగా చీలిపోవడం జరిగింది. అలా 1967లో అసమ్మతి వర్గాలు పుట్టుకొచ్చాయి.

రాజకీయ బాధితులకు ఐదెకరాల ఎర

అప్పట్లో రెవెన్యూ మంత్రిగా ఉన్న కళా వెంకట్రావు గారి ముఠా పైకి అభ్యంతరకరంగా కనిపించని పన్నాగం ఒకటి పన్నింది. నిర్మాణాత్మక కార్యక్రమాలకు వెన్నుదన్నుగా నిలిచే ఆరితేరిన కార్యకర్తల్ని మా వైపు నుండి వాళ్ల వైపునకు తిప్పుకునే పన్నాగమది. ప్రభుత్వ భూముల్లో నుండి ఒక్కొక్క స్వాతంత్ర్య సమరయోధునికి మాగాణి భూమి అయితే ఐదెకరాలు, నీటి సౌకర్యంలేని మెట్టభూమి అయితే పదెకరాలు పంచిపెడతామన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నిజమైన రాజకీయ బాధితుడు ఎవరో నిర్ధారించేది ఎపిసిసి, అతని దరఖాస్తును పరిశీలించేది ప్రభుత్వం ఏర్పాటుచేసే జిల్లా కమిటీలు. జిల్లా కాంగ్రెస్ కమిటీల ప్రమేయంలేదు.

రాజకీయ బాధితులకు సాయం అందించే విషయంలో ఎపిసిసికి ఎటువంటి అభ్యంతరంలేదు. అయితే దాన్ని ధన రూపంలో పింఛనుగా చెల్లించమంది.

ఉత్తరప్రదేశ్‌లో మాదిరిగా అది అవసరం ఉన్నవాళ్లకే చెల్లించమంది. భూమి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి పొందడం అనేది ఎంత ఇబ్బందితో కూడిన పని తెలియజేసింది. అయినా ప్రభుత్వం భూముల్ని పంచేందుకే సిద్ధపడింది.

గౌరవప్రదంగా జీవించేందుకు తగిన వనరులున్న వారికి అటువంటి భూములను కేటాయించాల్సిన అవసరం లేదని సూచించాను నేను. కాదన్నది ప్రభుత్వం. వాస్తవానికి అప్పటి ఆర్థిక శాఖామాత్యులు వారికి, వారి కుటుంబ సభ్యులకు కేటాయించేటట్లు చూసుకున్నారు. వారికి గల ఆస్తుల్లో అది పెద్ద లెక్కలోది కాదు. అయితే వారి తరాత తరాలకు, వాళ్ల కుటుంబాలకు, దేశానికి చేసిన సేవలకు అది ఒక జ్ఞాపికగా నిలిచిపోతుందన్నారు. అది నిస్సహాయులైన దేశ భక్తులకు అందించాల్సిన సదుపాయం అన్న విషయం మరుగునపడిపోయింది. నేను, దేవీజీ, జి.యల్.నారాయణ, మా సోదరుడు ఆ సహాయానికి దరఖాస్తు చేయలేదు. మా జీవనాధారానికి తగిన భూవసతి మాకున్నది. కిసాన్ ఉద్యమ ప్రధాన ఆశయం ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్ని భూవసతిలేని పేద రైతులకు పంచాలని. ఆ తర్వాత వినోబాజీ ఆరేళ్లకు ప్రారంభించిన భూదానానికి ఇది మార్గదర్శకంగా నిలిచింది. మరికొందరు కాంగ్రెస్‌వాదులు కూడా మాకు మాదిరిగా ఆర్థిక వనరులు ఉన్నవారు భూముల్ని కోరలేదు. అయితే కొందరు కాంగ్రెస్ మంత్రులు, వారి ఆశ్రితుల్లోని సంపన్నులు నిస్సిగ్గుగా ప్రభుత్వ భూముల్ని

అలా కాజేశారు.

మూడు, నాలుగు సంవత్సరాల తర్వాత రాజకీయ బాధితుల్లో అధిక సంఖ్యాకులు ఈ భూముల కోసం దరఖాస్తులు పెట్టుకున్నవారు ప్రభుత్వ బాధితులుగా రూపుదాల్చారు. పైగా హరిజనులు గ్రోమోర్ ఫుడ్ పథకం కింద దున్నుకుంటున్న భూముల్ని కేటాయించిన చోట్ల వాళ్లతో ఘర్షణలు. అలాగే కొన్ని గ్రామాల్లో వాళ్ల ఉమ్మడి చెరువుల్ని, పశువుల మేతకు వినియోగించే బీడు భూముల్ని ఇచ్చేందుకు ఆయా గ్రామాల ప్రజలు ముందుకురాలేదు. నేటికి కూడా (7.11.1967) ఎటువంటి లబ్ధిపొందని స్వాతంత్ర్య సమరయోధులు అలాగే ఉండిపోయారు. మే 1960లో ఈ దుర్మార్గపు పథకాన్ని తెలంగాణలోని రాజకీయ బాధితులకు వర్తింపజేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది.

ఇదంతా ఒక ఫార్సుగా తయారైంది. అనేకమంది స్వాతంత్ర్య సమరయోధుల స్థాయిని దిగజార్చింది. దీనివల్ల ఏమి సాధించారంటే స్వాతంత్ర్య సమరయోధులు వాళ్లల్లో వాళ్లు గొడవలుపడి మంత్రుల పంచనచేరి దాసోహమనడం.

అంతకుమించిన గర్హనీయమైన మరో అంశమేమంటే కాంగ్రెస్ నాయకుల్లో రాజకీయ ప్రమాణాల్లో, నైతిక ప్రవర్తనలో దిగజారుడుతనం. ఎఐసిసి పూర్వాధ్యక్షుడు ఒకాయన కేంద్ర కేబినెట్ మంత్రి అయ్యారు. ఆయనకు కేటాయించిన పదెకరాల భూమి నగరం పక్కనే ఉంది. దానికి ఎంత విలువ కడదాం? ఆయన అంత పెద్ద స్థానానికి ఎదిగినా ఆ భూమిని వదలుకునేందుకు సిద్ధపడలేదు. పిసిసి పూర్వ అధ్యక్షుడు ఒకాయనకు ఊరు ఉమ్మడి పొలం ఐదెకరాలిస్తే ఆయన అనుయాయి, డిసిసి ప్రెసిడెంట్‌కు ఒక్కొక్కటి పదెకరాల చొప్పున మూడు గ్రాంట్లు లభించాయి. తనకు ఆ భూమిని కేటాయించిన కొద్ది మాసాల్లోనే మాగాణి భూమిగా మార్చివేశాడు. కొందరైతే వ్యవసాయానికని గ్రాంట్ చేసిన భూమిని మరింత ఆదాయం కోసం వేరే రకంగా వాడుకోవడం జరిగింది. అలా వాళ్లు విడివిడిగా యాభై వేల నుండి లక్షా యాభై వేల రూపాయల విలువ చేసే భూముల్ని పొందారు. అటువంటప్పుడు ప్రజల్లో కాంగ్రెస్‌వాదుల పట్ల విశ్వాసం సన్నగిల్లకేం చేస్తుంది? దీనికి వ్యతిరేకంగా ప్రకాశం గారు ఎంతగా పోరాడినా ఫలితం లేకుండాపోయింది. **ఇటువంటి హీన స్థితిని మేమంతా అలా చూస్తూ ఉండిపోయాం. అప్పటి ఈ నేరస్తులే ఇప్పటి భూదాన్ ఉద్యమ వస్తాదులు. అయినా ఎవసిసిగానీ, వినోబాజీగానీ వాళ్లు అడ్డదారిలో సంపాదించినదాన్ని తిరిగి ఇచ్చివేయమనలేదు.**

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రోద్యమం

ఆంధ్ర ప్రాంత ఉద్యమ ఒడిలో నేను 1911 నుండి ఎలా ఎదుగుతూ వచ్చింది మీకు ఇంతకుముందే తెలియజేశాను. అదేవిధంగా ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు నేను ఏ విధంగా ఎదురుచూసిందీ వెల్లడించాను. నేను ఎపిసిసి అధ్యక్షుణ్ణి అయినప్పుడు అటు పట్టణ ప్రజలు, ఇటు గ్రామీణ ప్రజలు కూడా నేను ఆ సమస్యను కూడా పట్టించుకుని ప్రత్యేక ఆంధ్ర నిర్మాణానికి తీవ్రంగా కృషి చేయాలని కోరుకున్నారు. కనుక ఈ ఉద్యమానికి కూడా తగిన సమయాన్ని కేటాయించసాగాను.

ఈ ఉద్యమంలోని ఒక గొప్ప సన్నివేశం 1948లో మద్రాస్‌లో ఎపిసిసి ఏర్పాటుచేసిన ఆంధ్రా సదస్సు. ఆ సభకు దుగ్గిరాల బలరామకృష్ణయ్య గారు అధ్యక్షత వహించారు. అధ్యక్షుణ్ణి ప్రకాశం గారు ఊరేగిస్తూ తీసుకెళ్లడం ఎంతగానో ఆకట్టుకుంది. యాభై వేలమందికి పైగా ఆ సభలో పాల్గొన్నారు. అలా అది విజయవంతమైన దశలో మంత్రివర్గ ముఠా కొత్త పన్నాగం పన్నింది. రాయలసీమకు ప్రత్యేక రాష్ట్రం అనే అంశాన్ని తెరపైకి తెచ్చింది. చిన్న చిన్న ప్రతి క్రియలు ఒక్కోసారి ఎంతటి ఊహించని పరిమాణాలకు దారితీస్తాయో చెప్పలేం. ప్రకాశం పంతులు గారు ప్రవేశపెట్టిన ప్రత్యేకాంధ్ర తీర్మానానికి రాయలసీమ యువకులు సవరణను ప్రతిపాదించారు. దానిపై చర్చ జరిగింది. ప్రకాశం గారి తీర్మానం సభ ఆమోదం పొందింది. రాయలసీమ యువత ప్రదర్శనకు దిగింది. దాన్ని ప్రకాశం గారు అనుమతించలేదు. వర్షం జోరుగా కురుస్తోంది. షామియానాల మీద నుండి నీరు శ్రోతలపైకి జారుతోంది. ఆ వర్షంలో ప్రకాశం గారి హడావుడి నిర్ణయాలకు రాయలసీమ యువతకు చిర్రెత్తుకొచ్చి వాళ్లు పత్రికలవారిని కలిశారు. అది రాయలసీమకు తీరని అవమానమంటూ వివరించారు. మంత్రి వర్గం ముఠావాళ్లను ప్రోత్సహించింది. రాయలసీమ సదస్సు నంద్యాలలో నిర్వహించేందుకు సాయం అందించింది. నీలం సంజీవరెడ్డి ఆ సభకు అధ్యక్షత వహించారు. తర్వాత ఆయన ఎఐసిసికి అధ్యక్షుడయ్యారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఆయనే కారకుడైనట్లుగా చెప్పుకుంటారు. కాని ఆయన అప్పుడు ప్రత్యేక రాష్ట్ర ఆలోచనే సరైంది కాదని ఉద్ఘోషించారు. ఒకవేళ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు అనేది జరిగితే రాయలసీమ అందులో భాగం కాదన్నారు లేదా దాన్ని ఇంకో రాష్ట్రం చేయాలన్నారు. అది ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రమిచ్చే విషయంలో జాప్యం చేసేందుకు ఢిల్లీ నాయకులకు బాగా

ప్రయోగపడింది. ప్రకాశం గారూ, నేనూ అసెంబ్లీలోనూ, ఆంధ్ర ప్రాంతీయ పార్టీలోనూ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోనూ ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావాన్ని అంగీకరింపజేయడానికి కేంద్ర నాయకత్వంపై ఒత్తిడి పెంచే విషయంలో ఎంతగానో కృషి చేశాం. అయినా ఫలితం లేకపోయింది.

ఆంధ్రోద్యమానికి మా విధేయత

డాక్టర్ పట్టాభి కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్న సమయంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం గట్టిగా ప్రయత్నం చేశాడు. ఇతర విషయాల్లో ఆయన నాకు వ్యతిరేకంగా వున్నా, మంత్రి వర్గం ముఠాకు ఆయన మద్దతు పలుకుతున్నా ఈ విషయంలో మాత్రం నాతో సహకరిస్తున్నాడు. త్రిసభ్య కమిటీ ఏర్పాటుకు మా ఇద్దరి కృషి కారణమని నేను చెప్పగలను. ఆ ముగ్గురూ జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, డాక్టర్ పట్టాభి సమర్పించిన జె.వి.పి. రిపోర్టు, చేసిన సూచన ప్రకారం ఆంధ్ర రాష్ట్రం ఏర్పడితే మద్రాస్‌పై హక్కును వదలుకోవాలి. నేను ప్రకాశం గారికి దాన్ని అంగీకరించమని సలహా ఇచ్చాను. అందుకు ఆయన ఒప్పుకోలేదు. కనుకనే మద్రాస్‌లేని ఆంధ్ర రాష్ట్రం కావాలా లేక అదను కోసం వేచి చూడాలా అనే ఊగిసలాటలో పడాల్సి వచ్చింది. కయితే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం అంశంపై పొట్టిశ్రీరాములు ఆత్మార్పణం జరగకుండా ఉండి ఉంటే ఆంధ్ర రాష్ట్రమే కాదు, భాషా ప్రయుక్త రాష్ట్రాలు మరికొన్ని ఏర్పడి వుండేవికావు.

పొట్టిశ్రీరాములు ప్రశాంతంగా, విశ్వాసపాత్రునిగా చెప్పింది చేసే, గాంధీ మార్గంలో పయనించే వ్యక్తి. కొంతకాలం ఆయన గాంధీ గారి ఆశ్రమంలో ఉన్నారు. అందువల్లనే ఆ ఆశ్రమ జీవిత నిరాడంబరత, సామాజిక క్రమశిక్షణ అలవడి ఆయన్ను అవి అంటిపెట్టుకుని ఉన్నాయి. ప్రతి నెలా 30వ తేదీన హరిజన సేవా దినోత్సవాన్ని జరిపేందుకు ప్రభుత్వాన్ని ఒప్పించింది ఆయనే. దీర్ఘకాలం నిరాహార దీక్ష నెరపగల శారీరక, మానసిక దారుఢ్యాలు ఆయనకున్నాయి. ఆయన పలుమార్లు హరిజనుల దేవాలయ ప్రవేశం కోసం, వాళ్ల బావుల్లో నీళ్లు తోడుకునే విషయంలో నిరశన దీక్షలు పూనినవాడు. అటువంటివాటి వల్లే రంగనాయక ఆలయ ప్రవేశం హరిజనులకు సాధ్యమైంది. నేను ఆంధ్ర ప్రాంతంలో పర్యటించే సందర్భంగా ఒకసారి ఆయన నాతో ఉన్నారు. ఆయన ప్రసంగాలు ముక్తసరిగా ఉండేవి. ప్రభావశీలంగానూ వుండేవి.

గాంధీ పద్ధతిలో ప్రశాంతంగా కనిపించినా అది ధారాళంగా సాగేది. మేము మంచి మిత్రులమయ్యాం. ఆయన ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం నిరాహారదీక్ష చేపట్టాడని నేను కెనడా నుండి రాగానే తెలియవచ్చింది. నేను వెంటనే ఆంధ్రులను హెచ్చరించాను. ఆయన మాట తప్పని మనిషి. ఈ దెబ్బతో నెహ్రూ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకైనా అంగీకరించాలి లేదా మనం శ్రీరాములు గారి ఆత్మ త్యాగానికి సంసిద్ధులమై వుండాలి. ఆంధ్ర రాష్ట్రం ఇచ్చేందుకు నెహ్రూ అంగీకరించలేదు. మరో మానవమాత్రుడు ఊహించలేనన్ని రోజులు నిరాహారదీక్షలో ఉన్నందువల్ల పొట్టి శ్రీరాములు తుది శ్వాస విడిచారు. 1948లో గాంధీజీ మరణించినా ఆయన స్ఫూర్తి ఇంకా జీవించి వుందనడానికి ఇంతకుమించిన దాఖలా ఏం కావాలి? కేంద్ర ప్రభుత్వం తన నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. రైల్వే ఆస్తులు ధ్వంసమయ్యాయి. నెహ్రూ ఆగమేఘాల మీద ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావానికి అంగీకరించాడు. 1960 నాటికి భాషల ప్రాతిపదికన రాష్ట్రాల పునర్విభజన జరిగింది. అదే పొట్టిశ్రీరాములు గారికి బ్రహ్మాండమైన స్మారక చిహ్నం.

వివిధ రకాలైన సామాజిక, రాజకీయ అభివృద్ధితో కూడిన ప్రాంతాల్లో ఒకే భాష మాట్లాడే ప్రజలున్నారు. వారిని కలిపే ప్రక్రియకు నేను వ్యతిరేకం. ఉదాహరణకు అప్పటి ఆంధ్రా, తెలంగాణాలు, మధ్యభారత్ ఛత్తీస్‌గఢ్ మొదలైనవి. అందువల్లనే డాక్టర్ చెన్నారెడ్డి ప్రత్యేక తెలంగాణ ప్రతిపాదనను నేను బలపర్చాను. ఈ పదేళ్లలో ప్రజాస్వామ్యం ఎన్ని ఇబ్బందులకు గురైందీ మనం చూస్తూనే ఉన్నాం.

భాషా ప్రయుక్త రాష్ట్రాలు దేశ సమైక్యతను ప్రోది చేయాల్సిందిపోయి జాతి ఐక్యతకు సవాల్‌గా మారడం జరిగింది. మన త్యాగాలు ఏ మేరకు దేశ ఐక్యతను పెంపొందించేందుకు ఉపయోగపడతాయా అని ఆలోచించేటట్టు చేస్తున్నాయి.

34

కాంగ్రెస్‌లో ఐక్యత కోసం నా విఫల యత్నాలు

క్రమేపీ కాంగ్రెస్ రాజకీయాలు గ్రూపు తగాదాలుగా క్షీణించడం చూసి నేను ఎంతగానో కలత చెందాను. ఈ జాఢ్యం అన్ని రాష్ట్రాల్లోనూ ప్రబలడం నేను చూశాను. బీహార్‌లో భూమిదార్లు, క్షత్రియుల మధ్య తగాదాలుండేవి. అటువంటి ముఠా తగాదాలు ఆంధ్రలో లేకుండా చేయాలని చూశానుగానీ నా ప్రయత్నం ఫలించలేదు. 1949లో జిల్లా బోర్డు ఎన్నికలొచ్చాయి. ఆంధ్ర ప్రాంతంలో పదకొండు బోర్డులున్నాయి. అందులో మేము ఎనిమిదింటికి అభ్యర్థుల్ని నిలబెట్టాలనుకున్నాం. నేను అమెరికా, కెనడాల పర్యటనల్లో ఉండగా ఎపిసిసి ఎప్పటిమాదిరిగానే ముఠాతత్వంతో మెజార్టీ ముఠాకు చెందిన అభ్యర్థులకు పోటీ చేసే అవకాశం కల్పించాలనుకుంది. ఇంతలో నేను తిరిగి వచ్చి ఆ విధానాల్ని మార్చమన్నాను. జిల్లా కాంగ్రెస్ కమిటీల్లో వారికున్న బలాబలాల దామాషాలో అభ్యర్థుల్ని కేటాయిద్దామన్నాను. ముఠాలన్నీ కలసికట్టుగా పనిచేయాలన్నాను. ప్రకాశం పంతులు గారితో విభేదించడం బాధగానే ఉంది. చివరకు

షేక్ అబ్దుల్లా, ప్రకాశం పంతులు, రంగా దంపతులు, స్వామి రామానంద తీర్థ తదితరులు



పట్టాభి సీతారామయ్య

స్వతంత్ర అభ్యర్థులుగా ఎదురు ముఠాకు చెందినవాళ్లు పోటీకి నిలబడ్డారు. ఆ విధంగా నా శ్రమను వాళ్లు నీరుగార్చారు. ఓటర్లు అయోమయంలోపడ్డారు. ఒక రకంగా విసిగిపోయారు. ఫలితంగా కాంగ్రెస్ కార్యకర్తల్లో ధైర్యం సన్నగిల్లింది. ప్రజలపై వాళ్ల పట్టు సడలింది. అధ్యక్ష స్థానాలకు అభ్యర్థుల్ని ఎంపిక చేసే సందర్భంలో కూడా ముఠాల మధ్య ఐక్యత కోసం ప్రయత్నించా. అయినా మంత్రి వర్గం కోపుకాసే ముఠావాళ్లు పడనివ్వ లేదు.

ఎన్నికలైన వెంటనే ఇక మంత్రుల నిర్వాకం చూస్తే నాలో అసంతృప్తి పొంగిపొర్లింది. అయినా 1948లో కాంగ్రెస్‌లోని మూడు ముఠాలను (ప్రకాశం ముఠా, నా ముఠా, మంత్రుల ముఠా) కలిపే ప్రయత్నం మరోసారి చేశా. అయినా నా ప్రయత్నం ఫలించలేదు. మంత్రుల ముఠా వ్యతిరేకిస్తున్నా ప్రకాశం గారి సాయంతో ఏదోవిధంగా నెట్టుకొస్తున్నా. 1967 నాటికి ముఠాతత్వపు జబ్బు బాగా ముదిరింది. ఆధిక్యత సాధించేందుకు సిగ్గువిడిచి గొడవలు పడ్డారు. ఆ గొడవలు అన్ని రాష్ట్రాల్లో ఉన్నా మరీ ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, మైసూర్, పంజాబ్, మధ్యప్రదేశ్, బీహార్, కేరళ, ఆంధ్ర ప్రాంతాల్లో పెచ్చరిల్లాయి.

35

1951లో ఆంధ్రలో కాంగ్రెస్ పరాజయం

స్వతంత్ర భారతదేశంలో పార్టీ రాజకీయాల్లో రాష్ట్ర ప్రభుత్వాలకు, స్థానిక సంస్థలకు మధ్య ఒక ఖచ్చితమైన అధికార బాంధవ్యం ఉంది. అది ఆయా వ్యవస్థల్లో మనుగడ సాగించే పార్టీ పనితీరుపై ప్రభావం చూపేది. స్వాతంత్ర్యానికి పూర్వమైతే ఏ స్థానిక సంస్థలో అయినా అధికారంలో ఉండే పార్టీ మంత్రుల రాజకీయ లేదా వ్యక్తిగత పక్షపాత వైఖరులకు అనుగుణంగా నడుచుకునే అవసరం ఉండేదికాదు. అయితే స్వాతంత్ర్యానంతరం స్థానిక సంస్థల్లో అధికారంలో ఉన్నవారు రాష్ట్ర కేబినెట్, దాని నాయకత్వానికి అనుకూలంగా ప్రభావితం కావాల్సి వచ్చింది. అందుకు కారణం ప్రధానంగా రాష్ట్రాల్లోనూ, స్థానిక సంస్థల్లోనూ కాంగ్రెస్సే అధికారంలో ఉండడం.

ప్రకాశం పంతులు

వాస్తవానికి పలు స్థానిక సంస్థలు కాంగ్రెస్‌లోని కె.ఎం.పి.రాజ్ ముఠా నాయకత్వంలో ఉండేవి. వాళ్లు మంత్రులు వేసే ఎరలకు దూరంగా ఉండాలి. దురదృష్ట వశాత్తూ వాళ్లల్లో మరీ ఎక్కువ మంది మంత్రుల మాయల్లో పడిపోయారు. కనుక వారు మా ముఠాను వీడి మంత్రుల ముఠాలో చేరేవారు. కనుక కె.యం.పి. రాజ్‌కు చెందిన అనేకమంది ప్రతినిధులు రహస్యంగా మంత్రులతో పరిచయాలు పెంచు కున్న స్థానిక సంస్థల అధ్యక్షుల ద్వారా అటు వెళ్లిపోయేవారు.

అలా వాళ్ల అవసరం మాకు బాగా ఏర్పడిన సందర్భాల్లో వాళ్లు పోయి మంత్రి వర్గం ముఠాలో కనిపించేవారు. ఇది ప్రజల మనోభావాలను దెబ్బతీసింది. కాంగ్రెస్‌ను నిట్టనిలువునా అపఖ్యాతిపాల్జేసింది. ఆ విధంగా ఢిల్లీ నుండి మారుమూల గ్రామాల్లోని గల్లీల వరకూ అవినీతి పాకిపోయింది. క్రమశిక్షణ అన్నమాటే లేకుండాపోయింది. ఆ విధంగా గాంధీజీ పేరు చెప్పుకుని బేరసారాలు సాగిస్తున్నారు.

ఎవరా మంత్రి వర్గపు ముఠావాళ్లు? వాళ్లందరిపై ప్రకాశం గారు ప్రజాధనం, ప్రభుత్వాధికారం దుర్వినియోగం చేశారనే అభియోగాలపై మండిపడ్డారు. వాళ్లంతా కోటాల రాజ్యంలో రాజకీయంగా అవినీతి మార్గాలు అనుసరించినవారు. వాళ్లే ప్రకాశం గారిపై అవిశ్వాస తీర్మానం కారణాలు చూపకుండానే ప్రవేశపెట్టి మరికొందరిని వాళ్ల వైపు తిప్పుకునేందుకు ఆయన్ను పదవీచ్యుతుణ్ణి చేశారు.

ప్రకాశం గారి మంత్రి వర్గం ప్రవేశపెట్టిన నిర్మాణాత్మక కార్యక్రమాలను దాదాపుగా నిలిపివేసి ప్రజాగ్రహానికి గురైంది వాళ్లే. ఉదాహరణకు వాళ్లు ఉత్పత్తిదారుల, వినియోగదారుల సహకార సంఘాలను ఛిన్నాభిన్నం చేశారు. ఖాదీ అభివృద్ధి పథకాన్ని చిన్నచూపు చూశారు. ఫిర్కా అభివృద్ధి పథకంపై శీతకన్ను వేశారు. కంట్రోల్ వస్తువుల సేకరణ పంపిణీ ఒక కుంభకోణంగా మారింది. కనుక ఆ ముఠాపై కె.యం.పి.రాజ్ ముఠా తిరుగుబాటు ప్రజాస్వామికంగా ప్రజల మద్దతు కూడగట్టుకున్నదిగా ప్రచారం పొంది గత్యంతరం లేని పరిస్థితుల్లో 11.4.51 నాటి పాపం మూటగట్టుకున్న మంత్రి వర్గపు ముఠా కుతంత్రంగా పరిగణించడం జరిగింది. అప్పటి నుండి గాంధీ మార్గంలో నీతిదాయకంగా జీవించాలనుకునేవారికి ప్రజా జీవితం కంటకమయంగానూ, ఎంతటి అవినీతికైనా పాల్పడే మంత్రి వర్గపు ముఠా వారికి లాభసాటిగానూ తయారైంది. ఆ విధంగా సహకార సంఘాలు, గ్రామ పంచాయతీలు, మిగతా ప్రభుత్వ సంస్థలు రెండు ముఠాలకు రాజకీయ సమర ప్రదర్శనశాలలుగా మారిపోయాయి. ప్రభుత్వాధికారులు మంత్రి వర్గపు ముఠాలకు ధారాదత్తమై మిగతా వాళ్లను క్షోభపెట్టేవిగానూ తయారయ్యాయి. ప్రభుత్వంలో ఏ చిన్న పనిపడినా అది వ్యక్తిగతమైనదిగానో, ముఠాకు చెందినదిగానో చూడబడేది. కె.ఎం.పి.రాజ్ ముఠాకు చెందినవారిని పనిగట్టుకుని వేధించేవారు. ఈ విధమైన పరిపాలనను బ్రిటిష్ పాలనతో సరిపోల్చి చూసినప్పుడు బ్రిటిష్ వారి పాలనే మెరుగ్గా ఉండేది. సరే, ఆ అభిప్రాయం ఇప్పటికీ స్థిరపడిపోయిందనుకోండి.

డాక్టర్ పట్టాభి అధ్యక్షుడయ్యేందుకు నేను సాయపడడాన్ని ఎందరో తప్పుపట్టారు. ఎందువల్లనంటే ఆయన అధ్యక్షుడిగా ఉన్న కాలంలోనే మంత్రి వర్గపు ముఠా వల్ల కాంగ్రెస్ బలహీనపడింది. పార్టీ ఎన్నికలు నిర్వహించే అర్హతను పిసిసి పోగొట్టుకున్నది. సంస్థాగతమైన అరాచకత్వాన్ని పెంచి పోషించి పిసిసికి కార్యకర్తలు ఎదురుతిరిగేటట్లు చేసింది. అటువంటప్పుడు సర్దార్ పటేల్ గ్రూపు ఆకాంక్షల్ని కూడా తోసిపుచ్చి పట్టాభికి ఎందుకు మద్దతు పలికినట్టు? ఎందుకంటే కనీసం ఇప్పుడైనా ఒక ఆంధ్రునికి కాంగ్రెస్ అధ్యక్ష పదవిని అధిష్ఠించే అవకాశం వచ్చింది కనుక. అటువంటి అవకాశం ఆయనకు వచ్చినందువల్ల, తన అభీష్టం నెరవేరినందువల్ల మద్దతు పలికా. పదవికి తగినట్టుగా హూందాగా మెలుగుతూ, ముఠా తత్వాన్ని దూరంగా పెట్టి కార్యకర్తల మధ్య సత్సంబంధాలను నెలకొల్పగలడనుకున్నా. అయితే అలా చేయవద్దని మిత్రుల్లో చాలామంది సలహా ఇచ్చారు. అయితే పట్టాభి మెచ్చే గాంధీ ఆశయాల పట్ల ఆయనకు గల వల్లమాలిన అభిమానాన్ని నేను విశ్వసించడం జరిగింది.

పట్టాభి ముఠా భయమేమిటంటే ఎన్నికల వరకూ కాంగ్రెస్ యంత్రాంగమంతా మా చెప్పుచేతల్లో ఉంటే వాళ్ల ముఠాకు మంత్రి పదవులు దక్కకుండా పోతాయేమోనని. కనుక మంత్రుల ముఠావాళ్లు కాంగ్రెస్ సంస్థలో కూడా ఏ విధంగానైనా సరే తిష్టవేయదల్చారు. వారికి ఇష్టమైన కాంగ్రెస్ అభ్యర్థులను ఎన్నికల్లో పోటీకి నిలపదల్చారు. కె.ఎం.పి. రాజ్‌కు చెందిన హేమాహేమీలను సైతం పక్కకు నెట్టదల్చారు. ఆ విధంగా తమ మంత్రి వర్గపు అధికారాలను కొనసాగించ దల్చారు. వాళ్ల భయం ఏమిటంటే వాళ్ల గాంధీ వ్యతిరేక కార్యకలాపాలను నిలిపివేసి రైతుల, వృత్తిపనివారల కోసం మేము గాంధీ మార్గంలో పాటుపడతామని.



జవహర్‌లాల్ నెహ్రూ

దురదృష్టవశాత్తూ ప్రకాశం గారు రాజకీయ అవినీతిని అంతమొందిం

చేందుకు దిక్కుతోచని దశలో గైకొన్న సంప్రదాయబద్ధంకాని చర్యల వల్ల కాంగ్రెస్ హైకమాండ్‌కు మా అందరిపై మంత్రి వర్గపు ముఠా చాడీలు చెప్పే అవకాశం లభించింది. ఆరు నూరైనా నేను ప్రకాశం గారికే మద్దతు పలకడం, కాంగ్రెస్ అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ పక్షపాత ధోరణులను బహిరంగపర్చడం నెహ్రూకు చిరాకు కలిగించింది. వర్కింగ్ కమిటీలోని అధిక సంఖ్యాకులు నా వైఖరి సరైనదేనని భావించారు. గాంధీ ప్రజాస్వామ్యం పట్ల, కాంగ్రెస్ రాజకీయాలు హుందాగా ఉండడం పట్ల గాంధీజీ నెలకొల్పిన ప్రమాణాలను పాటించాల్సిందేనన్నారు. అయితే కాంగ్రెస్ గౌరవం సన్నగిల్లుతుందేమోననే భయం కూడా లేకపోలేదు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ తప్పు చేసినా, ఒప్పు చేసినా రాజేంద్రప్రసాద్ గారి నుండి లభించే మద్దతు వల్ల ఆంధ్రలో మా స్థితిని మరింతగా దిగజార్చేందుకు కాంగ్రెస్ అధ్యక్షునికీ, జనరల్ సెక్రటరీకి వరాలుగా మారాయి. టాండన్ అధ్యక్షుడై జనరల్ సెక్రటరీగా తిరిగి కొనసాగుతున్న తరుణంలో నా అభ్యంతరాల వల్ల ఒనగూరే ప్రయోజనం కూడా ఏమీలేదు.

ఏ దశలో కూడా జవహర్‌లాల్‌జీ పూర్తి సత్యాన్ని గ్రహించే ప్రయత్నం చేయలేదు. ఆంధ్రలో త్వరితగతిన దిగజారుతున్న కాంగ్రెస్ విషయంలో నేను చేసిన హెచ్చరికలను సైతం పట్టించుకోలేదు. మంత్రి వర్గపు ముఠా నడిపే రాజకీయ అవినీతిని అరికట్టలేదు. ఆయన పక్షి రెక్కల్ని చూసి పరవశించిపోయాడుగానీ అది మరణం అంచుకు చేరుతోందన్న గ్రహింపు ఆయనకు లేదు. ఆయన నిష్పక్షపాత వైఖరిని మా కార్యకర్తలు అంగీకరించే స్థితిలో లేరు. ఆయన అసలు మా ఓటమిని కోరుకుంటున్నారేమోనని భావించసాగారు. దానివల్ల అటు కాంగ్రెస్‌లోనూ, ఇటు మంత్రి వర్గంలోనూ ఆయన మిత్రుల పెత్తనం సాగుతోంది. మమ్మల్ని మించి ఆయన ఎఐసిసి జనరల్ సెక్రటరీకి మద్దతు పలకసాగాడు.

ఈ జనరల్ సెక్రటరీ ఎవరు? తర్వాత వచ్చిన అధ్యక్షుడు టాండన్‌జీ విషయంలో ఆయన గాంధీజీ మార్గంలో నడవకుండా వేసే రాజకీయ ఎత్తులు, జిత్తులు చూసి నెహ్రూ తొలగించిన వ్యక్తే అతను. అయితే అంతకుముందు నెహ్రూ ఆ జనరల్ సెక్రటరీని కొన్ని మాసాలపాటు విచ్చలవిడిగా ప్రవర్తించనీయడంతో అది 11.4.1951నాటి విధ్వంసానికి దారితీసింది.

మంత్రి వర్గం ముఠా దాదాపు అన్ని జిల్లాల్లో మైనార్టీ స్థాయికి పడిపోయింది.

కనుక వారు ఎఐసిసిలోని వాళ్ల పెద్దల్ని కలుసుకున్నారు. అంతకుముందు ఎన్నికలు నిర్వహించే అధికారం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీది. దాన్ని తొలగించేందుకు పూనుకున్నారు. వర్కింగ్ కమిటీ కూడా ఎఐసిసికి వంతపాడింది. వాళ్లు అలా మమ్మల్ని అప్రజాస్వామిక, నియంతృత్వ ధోరణిలో బయటకు పంపే ప్రయత్నాలను చూసి నేను వెంటనే రాజీనామా చేయాలని ఎంతగా కోరుకున్నానో! అయితే కోపోద్రిక్తులైన ఆంధ్ర ప్రజలు రాజ్యాంగబద్ధమైన ఆ పోరాటం సంస్థలోనే కొనసాగుతూ నిర్వహించాలని కోరుకున్నారు. అందువల్ల నా రాజీనామాను నేను 11.4.1951 వరకూ చేయలేదు.

ఆంధ్ర ప్రాంతీయ కాంగ్రెస్‌కు 11.4.1951 దుర్దినం. రాజకీయాల్లో గాంధీ మార్గాన్ని అనుసరిస్తూ కృషికార్ మజ్దూర్ ప్రజారాజ్యం పట్ల విశ్వాసం ప్రకటించేవారిని దాని నాయకత్వం నుండి తొలగించిన హేయమైన గాధ అది. మాకు ఐదు ఓట్లు తక్కువ లభించినందు వల్ల ఓడిపోయామట. మా ఓటర్లలో వాళ్ల ప్రతినిధుల ద్వారా న్యాయబద్ధంగా ఎన్నుకోబడిన ఓ ఆరుగురిని ఏదో సాంకేతిక లోపాలను సాకుగా చూపి ఎన్నికల అధికారి ఎస్.కె.పాటిల్ వారికి ఓటు హక్కు కల్పించలేదు. మంత్రుల ముఠా కోర్టుకెక్కిన కారణంగా గుంటూరు జిల్లాకు చెందిన 25 మంది ప్రతినిధులు ఎన్నికల్లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయారు. రాజకీయ పార్టీల ఎన్నికల్లో ఉత్సుకత చూపడంకానీ, జోక్యం కల్పించుకోవడంకానీ చేయరాదని కోర్టులు పాటించే మర్యాదను అతిక్రమించడం జరిగింది. అలాగే మంత్రి వర్గ ముఠా నాయకులు జాతీయ వర్కింగ్ కమిటీకి ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారు. ఆ విధంగా మాకు ఓ ఇరవై ఓట్లకు పైగా ఆధిక్యం ఉన్నా మాకు ఐదు ఓట్లు తక్కువ లభించాయని ఎన్నికల అధికారి ప్రకటించాడు. ఇందులో మా తప్పు ఏమీలేదు. తను తేల్చిన మెజార్టీ సాంకేతికపరంగా సరైనదేనట.

మంత్రి వర్గం ముఠా కోర్టుకు ఎందుకెళ్లినట్లు? అంతకుముందెన్నడూ అలా ఎవరూ చేయలేదే? కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పట్టాభి, జనరల్ సెక్రటరీ కళా వెంకట్రావు వాళ్ల అనుయాయుల్ని కోర్టుకెక్కడాన్ని ఆపలేకపోయారని, సజావుగా జరిగే ఎన్నికలను అడ్డుకున్నారని నేను కాంగ్రెస్ కమిటీలో హెచ్చరించాను. జనరల్ సెక్రటరీ కాంగ్రెస్‌వాదులు ఎన్నికల సమయంలో కోర్టుకెక్కే చర్యలను అడ్డుకుంటానన్నారు. కాంగ్రెస్ సంస్థాగత క్రమశిక్షణ కోర్టుల పరిధికి పైనే ఉండేటట్లుగా కృషి చేస్తానన్నాడు.

వర్కింగ్ కమిటీ కోర్టుకెళ్లడాన్ని తప్పుబడుతూ తీర్మానించింది. అయినా మంత్రి

వర్గ ముఠా కోర్టుకెక్కింది. మా ప్రతినిధులు కోర్టు జోక్యం వల్ల, ఎన్నికల అధికారి చూపిన సాంకేతిక కారణాల వల్ల ఎన్నికల్లో ఓటు వేయలేకపోయారు.

ఎన్నికల అధికారి ప్రకటనను మేము అంగీకరించేది లేదని చెప్పాం. అది కాంగ్రెస్‌వాదానికీ, గాంధీ మార్గానికి అనుగుణంగా లేనందు వల్ల మేము ఒప్పుకోవడం లేదన్నాం.

11.4.1951 నాటి దుర్ఘటనతో మేము రాజీపడలేకపోవడానికి మరో కారణం కూడా ఉంది. **కాంగ్రెస్ జాతీయ నాయకత్వం మంత్రుల్ని క్రమశిక్షణలో పెట్టకపోవడాన్ని ప్రకాశం పంతులు గారు తీవ్రంగా ఖండించారు.** మంత్రుల అధికార దుర్వినియోగంపై, ఆశ్రిత పక్షపాతంపై, తప్పుడు ప్రవర్తన విషయంలో బహిరంగ విచారణ నిర్వహించకపోవడం విచారకరం అన్నారు పంతులు గారు. వారిని తీవ్రంగా ఖండించకుండా వాళ్ల అవిశ్వాస తీర్మానానికి తలవంచుకుపోనన్నాడు. మేము అనేక పర్యాయాలు సమావేశమై విషయాలు చర్చించాం. **వర్కింగ్ కమిటీ దక్షిణాది రాష్ట్రాల పట్ల చూపుతున్న ఉదాసీన వైఖరిని చర్చించాం.** మరి అటువంటి విమర్శల్ని నెహ్రూజీ తట్టుకోగలరా? అటువంటప్పుడు వర్కింగ్ కమిటీ ప్రకాశం గారి పట్ల ఏకపక్ష నిర్ణయాన్ని మాత్రం ఎలా సహిస్తారు?

పట్టాభి సీతారామయ్య

ఆ దురదృష్టకర దినాన (11.4.1951) యాభై వేలమందికి పైగా ప్రజలు అందులో ఎక్కువగా రైతులు, వృత్తిపనివారు, మిగతా శ్రామికులు విజయవాడలో వాళ్ల కె.ఎం.పి.రాజ్ ముఠాకు ఏమి జరగబోతున్నదో చూద్దామని వచ్చారు. ఏయే శక్తులు లేదా ప్రభావాలు లేదా మనోద్వేగాలు సుదూర ప్రాంతాల నుండి, మారుమూల గ్రామాల నుండి ప్రజలు అక్కడికి వచ్చేందుకు ప్రేరేపించాయో లేదా లాక్కొచ్చాయో అందరికీ తెలుసు. ముట్నూరి కృష్ణారావు గారి సంపాదకత్వాన

వెలువడే కృష్ణా పత్రిక ఆ జనవాహినిని చూసి పేర్కొన్నదేమంటే ప్రజలు కె.ఎం.పి.రాజ్ ఆదర్శాన్ని దాని కార్యకర్తలు, నాయకులు తమ బాగు కోసం ప్రచారం గావించినందున; వాళ్లను కంట్రోళ్ల పాలనకి, అవినీతికి దూరంగా జీవించేటట్లు చేయాలని చూసినందున; కమ్యూనిస్ట్‌ల హింసను అరికట్టచూసినందున; మంత్రుల ముఠావాళ్ల మాయోపాయాల వల్ల; మా ముఠా ఓడిపోరాదనుకున్నారు. ఆ ఏకపక్ష ఎన్నికల్లో కూడా వాళ్ల నాయకులే నెగ్గుతారనుకున్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో వాళ్ల నాయకులు కనుక నెగ్గేటట్లయితే వారు కాంగ్రెస్‌కు ప్రచారం చేయవచ్చుననుకున్నారు. మంత్రి వర్గం కె.ఎం.పి.రాజ్ వారితో ఏర్పాటవుతుందనుకున్నారు. ఆ విధంగా వాళ్లు అవినీతిమయ కంట్రోళ్ల పాలనను అంతమొందించవచ్చుననుకున్నారు. గాంధీ వ్యతిరేక దుష్టభావాలైన ఆశ్రితపక్షపాతం, కులపక్షపాతం, రాజకీయ అధికార దుర్వినియోగం వంటి వాటిని అరికట్టవచ్చు ననుకున్నారు.

ఊహించని ఫలితం వెలువడగానే కృష్ణా పత్రిక పేర్కొన్నట్లు ఆ ప్రజా సమూహం రాజకీయంగా మరణించినట్లుగా భావించడం జరిగింది. భరించరాని విపత్తు వాళ్లకూ, దేశానికీ సంభవించిందనుకున్నారు. ఒక్కరు కూడా అక్కడ గెలిచినవారిని అభినందించలేదు. పలువురు కన్నీరుకార్చారు. మరింతమంది రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయాన్ని ఊహించుకున్నారు.

రోజులు వారాలు గడిచేటప్పటికి గెలిచామని భావించుకుంటున్నవారు ప్రజల వైముఖ్యాన్ని చవిచూశారు. మంత్రి వర్గం ముఠా ఆగడాలకు నిరసనలు పెల్లుబికాయి. కొందరు జిల్లా బోర్డు అధ్యక్షులు ప్రజాస్వామిక ఉన్నత విలువలతో, ప్రజా జీవనంలో ఉదాత్త ఆశయాలతో కె.ఎం.పి.రాజ్ అధ్యక్షుడుగా నిలిచి సహకరించకపోతే జిల్లా బోర్డు అధ్యక్షులుగా ఎంపికయ్యేందుకు

అభ్యర్థులుగా తమకు అవకాశం వచ్చి ఉండేదే కాదన్నారు. మంత్రి వర్గ ముఠాకు వ్యతిరేకంగా ప్రజల ప్రతి క్రియ ఎంత ఎక్కువగా ఉన్నదంటే కాంగ్రెస్ మంత్రులు, వారి మద్దతుదారులు మా మీద ఆ ప్రతి దాడికి వుసిగొల్పినవారికి 1954లో తిరిగి బహిరంగ సభలు జరిపేందుకు మొహంచెల్లనంతగా.

నేను అదృష్టవంతుణ్ణి. రాజకీయంగా చైతన్యవంతులైన వారిలో ఎక్కువమంది ఆంధ్రుల్లో కమ్యూనిస్టులు కానివారు నన్ను అసలైన గాంధేయవాదిగా, ప్రజా సేవకు గాంధీ రాజకీయ సిద్ధాంతాలను అమలుపర్చాలనుకునే చిత్తశుద్ధి గల నాయకునిగా, మంత్రుల ముఠా మోసాలకు గురైన నాయకునిగా గుర్తించారు. అదే నాకు బహుమతి.

మంత్రి వర్గపు ముఠా ఆ విధంగా నాయకత్వాన్ని మా నుండి లాక్కుపోయిన తర్వాత వర్కింగ్ కమిటీలో 19 స్థానాల్లో 9 స్థానాలు మాకు కట్టబెడతామన్నా మాకూ, వాళ్లకూ మధ్య మైత్రి పొసగేదెలా? కనుక వాళ్లు ప్రతిపాదించిన దానికి మేము అంగీకరించలేదు.

కాంగ్రెస్ కమిటీ ఆత్మ శోధనకు సిద్ధపడలేదు. అందువల్ల మేము కాంగ్రెస్ నుండి బయటకు రావాలని నిర్ణయించుకున్నాం. మంత్రుల ముఠాల పట్ల శక్తిని చూపలేక మా పట్ల అధికార మదపు అంధత్వాన్ని ప్రదర్శించే జాతీయ నాయకత్వంతో తెగతెంపులు చేసుకున్నాం. జవహర్‌లాల్‌జీ కూడా ఆ ఏకపక్ష ముఠాతత్వపు చర్యలను ఆమోదించారని ఎన్నో వర్గాల ప్రజలు కూడా భావించారు. ఎందువల్లనంటే కొత్తగా ఎన్నుకున్న ఎపిసిసి అధ్యక్షుణ్ణి వర్కింగ్ కమిటీ సభ్యునిగా తీసుకోవడమేకాకుండా శక్తిమంతమైన పార్లమెంటరీ బోర్డులో కూడా ప్రవేశం పొందేటట్లు చేశారు- అదంతా మా పట్ల ద్వేషాన్ని వెళ్లగక్కేందుకు, ఆయన్ను ఆంధ్రలో ప్రత్యామ్నాయ నాయకునిగా పెంచి పోషించేందుకు.

అటువంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ అధ్యక్షుడైన టాండన్‌జీకి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ముఖ్యాతి ముఖ్యుడు-టాండన్‌జీ తర్వాత అధ్యక్షుడయ్యే జవహర్‌లాల్‌జీకి నా రాజీనామా లేఖల్ని పంపించాను. టాండన్‌జీ తర్వాత ఆయనే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడయ్యారు. ఆ వివరాలన్నీ నేను **'రంగా కాంగ్రెస్‌కు ఎందుకు రాజీనామా సమర్పించాడు'** అనే నా పుస్తకంలో వివరించాను. ఆ పుస్తకం 4.6.1959న స్వతంత్ర పార్టీ ఆవిర్భావం నాడు ఆవిష్కరించాం.

36

వర్కింగ్ కమిటీ గవాక్షం నుండి అఖిలభారత కాంగ్రెస్ వ్యవహారాలు

భారత జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ధోరణులు, ప్రతి క్రియలు, విజయాలు, అపజయాల అనుభవాలు 1947 నుండి గ్రహిస్తూనే ఉన్నా. అందుకు గాంధీజీ వర్కింగ్ కమిటీలోని ముగ్గురు పెద్దలు సర్దార్, జవహర్‌లాల్, రాజన్‌బాబులపై ఒప్పించే ఒత్తిడి పెంచాల్సి వచ్చింది. అందుకు ఆయనకు నేను రుణపడి ఉన్నా. నాకు అటువంటి అవకాశాన్ని కల్పించేందుకు 1946లోనే రంగం సిద్ధమైంది. అయితే అత్యున్నత స్థాయి నాయకుల్లో ఒకరు అంగీకరించనందున ఆగిపోయింది. పండిట్‌జీ నాయకత్వ కాలంలో నేను చేయగలిగిందల్లా నాపై సంధించిన ఆయుధాల నుండి నన్ను నేను కాపాడుకోవడమే. **ఆచార్య కృపలానీ అధ్యక్షులుగా ఉన్న కాలంలో (1947) వర్కింగ్ కమిటీ చర్చల్లో పాల్గొనే అవకాశం లభించేటట్లు గాంధీజీ చేయగలిగారు.** ఆ చర్చలు ఆయన సలహా



అవసరమైన సందర్భాల్లో ఆయన సమక్షంలోనే జరుగుతూ ఉండేవి. 1948 జనవరి 30నాటి ఆయన మరణం జాతికి తీరని లోటు. నన్ను శూన్యం ఆవరించినట్లయ్యింది. మహాత్మాగాంధీ వర్కింగ్ కమిటీలో ఉంటే నేను మంచి అనుభవం గడించేవాణ్ణి. ఆయన వర్కింగ్ కమిటీలో ఉంటే చాలు అమితమైన ప్రభావాన్ని చూపగలిగేవాడు. ఆయన చర్చల ఫలితంగా జీవితాలు ఎంతగా నైతిక పథంలో ఉన్నత దశకు చేరుకుంటాయో తెలుసుకోగలిగేవాణ్ణి. ఆయన చర్చల్ని ఎంతగా నైతికంగా ఉన్నతీకరించగలిగేవారో బాగా తెలిసివచ్చేది. వర్కింగ్ కమిటీ సభ్యులు జవహర్‌లాల్, మౌలానా, సర్దార్‌లతో సహా కాంగ్రెస్ రాజకీయాలను హూందాగా తీర్చిదిద్దేందుకు ఎలా ప్రయత్నించేవారో చూడగలిగేవాణ్ణి. ఆయన మరికొంతకాలం జీవించి ఉండి ఆ చర్చల్లో పాల్గొని ఉంటే అదంతా నేను చూడగలిగేవాణ్ణి.

ఇంతకుపూర్వం మీకు తెలియజేసినట్లుగా 1944 నుండి నేను మహాత్మాగాంధీతో కిసాన్ కాంగ్రెస్, ఇతర ప్రజా సంస్థల విషయం మాట్లాడుతూ ఉండేవాణ్ణి. మా మధ్య అరమరికలు ఉండేవికావు. అందుకు నేను ఆయనకు కృతజ్ఞుణ్ణి. ఆయనతో అంత చనువు ఏర్పడి ఆనందంగా గడపడం వల్ల నేనెంతగానో నేర్చుకున్నాను. అయితే వర్కింగ్ కమిటీలో సామర్థ్యం గల క్రియాశీల సభ్యునిగా పాల్గొంటూ అభిప్రాయ భేదాలు తీవ్రంగా ఉన్నప్పుడు ఆయన అభిప్రాయం సేకరిస్తూ ఉండేవాణ్ణి. ఇది నా అదృష్టంగా భావించా. బాపూ మా జ్ఞాపకాల్లో పదిలం. అన్ని సంవత్సరాల కాలంలో ఆయన పలు కోణాల్లో కనిపించిన తీరు మా మనో నేత్రాల ముందు సాక్షాత్కరించేది. బాపూజీ వ్యక్తిత్వంలోని ప్రతి అంశం మమ్మల్ని ఆకట్టుకుని స్ఫూర్తిని పంచేది. మేము మా వర్కింగ్ కమిటీ చర్చల్లో మునిగితేలుతూ ఉండగా బాపూ మెత్తగా ఉండే తెల్లని బాలీసులపై కూర్చొని చర్కా తిప్పుకుంటూనో, ఉత్తరాలు చదువుతూనో, దక్షిణ భారతదేశానికి సంబంధించిన ఏదో ఒక లిపిని నేర్చుకుంటూనో కనిపించేవారు. బాపూ అనేక పర్యాయాలు నా మనో ఫలకంపై నిలవడం నాకెంతో ఆనందదాయకంగా ఉండేది. ఆయనకు నడుముకు పైభాగంలో ఎటువంటి అచ్ఛాదనా ఉండేదికాదు. ఆయన వక్షస్థలం అంత విశాలమైనది కాకపోయినా ప్రపంచమంత విశాలంగా ఉండి దానినిండా హాయిని నింపుకున్నట్లుగా కనిపించేది. సాయంకాలపు నీరెండలో ఆయన చర్మం నిగనిగలాడేది. ఫాల భాగం శోభాయమానంగా ఉండేది. ఆయన తన పనిలో పూర్తిగా నిమగ్నమైనట్లు కనిపిస్తూ ఉండేవాడు. అయితే జవహర్‌లాల్ స్వరం పెంచాల్సిన

అవసరం ఏర్పడినప్పుడో, కృపలానీ అతి కష్టం మీద సమాధానం చెప్పాల్సి వచ్చినప్పుడో, నేనేదైనా తీవ్రంగా ప్రకటించే సందర్భంలోనో లేదా మౌలానా ఏదైనా గహరమైన ప్రస్తావన చేసినప్పుడో ఆయన కళ్లు కొద్దిగా మా వైపునకు తిప్పేవాడు. క్షణంలో అంతా గ్రహించినట్లు కనిపించేవాడు. తిరిగి తన ప్రపంచంలో తాను మునిగిపోయేవాడు. మేమెవరమైనా ఆయన విషయంలో జోక్యం చేసుకుని సలహా ఇవ్వమని కోరే సాహసం చేస్తే ఆయన మా వైపు తదేకంగా చూసేవాడు. అప్పుడు ఆ ఉషోదయ వేళ సూర్యుని వెలుగు రేఖలు మాపై ప్రసరిస్తున్నట్లుగా ఉండేది. సాధారణంగా చర్చల సారాంశాన్ని అందించే పని జవహర్‌లాల్‌జీది. అప్పుడు ముందుగా ఆయన ఉత్తరీయాన్ని సరిజేసుకునేవాడు. అది ఛాతీని కప్పీకప్పనట్లుగా ఉంచేది. మొత్తానికి ఎంతో కొంత కప్పినట్లుగా ఉండేది. మా వైపునకు కొద్దిగా తిరిగేవాడు. అదేదో వర్కింగ్ కమిటీకి ఆయన గౌరవం కల్పిస్తున్నట్లుగా వుండేది. ఒక్క నిమిషం మౌనంగా ఉండి తన అభిప్రాయాన్ని ప్రకటించేవాడు. కమిటీ ఏదో ఒక నిర్ణయానికి వచ్చిన తరుణంలో గాంధీజీ తనలోకి తాను జారిపోయేవాడు. ఆయన మైళ్ల దూరం మా నుండి సాగిపోయినట్లుగా తట్టేది. ఆయనకూ, మాకూ మధ్య ఎంతో మందంతో కూడిన తెరలు అడ్డంగా కట్టినట్లు అనిపించేది. ఆయన ఉపస్థితి కమిటీని ఉద్దరించేదిగా, అంతర్మథనం గావించేదిగా ఉండేదనడంలో ఆశ్చర్యానికి తావుండదు.

ఆయన మరణానంతరం ఏమైనా సమస్యల్ని తుది తీర్పు కోసం వర్కింగ్ కమిటీ ముందుకు తెస్తే ప్రజా సేవ, వ్యవస్థాగత ఐక్యత వంటి విషయాల్లో అది ఆనాటి ప్రమాణాలను నిలబెట్టలేకపోయింది. ఉండడానికి ముఠాలు కాంగ్రెస్‌లో 1920 నాటి నుండే ఉన్నాయి. వాటిని రూపుమాపడం బాపూ వల్ల కూడా కాలేదు. 1937-38 నాటి నారిమన్-ఖరేల మధ్య గొడవను సంతృప్తికరంగానూ, నిర్ధయగానూ అందరూ కోరుకున్న విధంగా సమసిపోయేటట్లు చేయలేకపోయారు. అయితే అటువంటి గొడవల్ని ఎదుర్కోవలసి రావడమే ఆయన మరణించిన రెండు మూడేళ్లకే దిగజారుడుతనానికి దారితీసింది. ముఠాతత్వం పేట్రేగింది. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత భారతదేశంలో కాంగ్రెస్ పతనం ప్రారంభమైంది.

పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్ **బి.సి.రాయ్** ప్రభుత్వం ప్రజాదరణ విషయంలో ఘోరంగా విఫలమైంది. కమ్యూనిస్ట్‌లు, కాంగ్రెసేతర వర్గాల వారు రాజకీయంగా బలపడసాగారు. సేన్ గుప్తా, సుభాష్‌బాబుల స్పర్ధ కారణంగా ఇతర రాష్ట్రాలకు మించి ముఠాలు,

గొడవలు అధికం కాసాగాయి. నిజాయితీకి మారుపేరైన గాంధీవాది **పి.సి.ఘోష్**ను ముఖ్యమంత్రి పదవి నుండి తప్పించారు. ఆయన స్థానంలో డాక్టర్ బి.సి.రాయ్ ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటినుండి ముఠా గొడవలు మరింతగా పెరిగాయి. సుభాష్ బాబు సోదరుడు, నాకు మంచి మిత్రుడూ అయిన శరత్‌బాబు కాంగ్రెస్ అభ్యర్థిని ఘోర పరాజయం పాలయ్యేటట్లుగా చేయగా కాంగ్రెస్‌లోని లుకలుకలేమిటో తెలుసుకునేందుకు జవహర్‌లాల్‌జీ కలకత్తాకు ప్రయాణం కట్టాల్సి వచ్చింది. ఆయన విషయాలు తెలుసుకుని సాధారణ ఎన్నికలు త్వరలో నిర్వహించాలని, ఈలోగా బెంగాల్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీని పునర్నిర్మించాలన్నారు. ఆయన అభిప్రాయాలను ఖరారు చేసేందుకు వాటిని వర్కింగ్ కమిటీ ముందుంచాడు. ముసాయిదా తీర్మానం కూడా సిద్ధం చేశారు. అయితే దాన్ని అమలుచేసే సందర్భంగా ఒక చిక్కు సమస్యను ఎదుర్కోవలసి వచ్చింది. దాన్ని లేవనెత్తింది డాక్టర్ రాయ్. అదేమంటే కాంగ్రెస్ అసెంబ్లీ పార్టీ విశ్వాసం మేరకు పనిచేస్తున్న మంత్రి వర్గాన్ని బర్తరపు చేయవచ్చా అనే విషయంలో వర్కింగ్ కమిటీ ఊగిసలాటలో పడింది. సుదీర్ఘ చర్చల తర్వాత జవహర్‌లాల్‌జీ, సర్దార్‌జీ, మౌలానాజీలు డాక్టర్ రాయ్‌ను ఇబ్బందిపెట్ట కూడదనుకున్నారు. మరి ప్రకాశం పంతులు గారి ప్రజానురంజక ప్రభుత్వాన్ని పడగొట్టించిన వర్కింగ్ కమిటీ బెంగాల్ విషయంలో మరో విధంగా ఎందుకు వ్యవహరించాలని నేను ప్రశ్నించాను. ఎవరూ బదులు పలకలేదుకానీ నా ప్రశ్న నాయకులను ఇబ్బందికి గురిచేసింది.

తూర్పు పంజాబ్ ప్రాంతం కూడా పంజాబ్ విభజనకు పూర్వపు ముఠా గొడవల్ని, చిక్కుల్ని పుణికిపుచ్చుకుంది. వర్కింగ్ కమిటీ పక్షాన రాజకీయపరమైన వ్యవహారాలను విభజనకు ముందు, విభజన తర్వాత మౌలానా ఆజాద్ చూడాల్సి ఉంది. ముఖ్యమంత్రిగా భీమ్‌సేన్ సచార్ తగిన వ్యక్తిగా ఆజాద్ భావించారు. అయితే సర్దార్ పటేల్‌కు ముఖ్యమంత్రి పదవికి గోపీచంద్ భార్గవ తగిన అభ్యర్థిగా కనిపించాడు. ఎవరిని నియమించాలనే విషయంలో ఊగిసలాట. వర్కింగ్ కమిటీకి సైతం పూర్తి సమాచారం లేదు. భార్గవను నియమించిన తర్వాత కూడా రెండు ముఠాలవారు ఢిల్లీ చుట్టూ ప్రదక్షణలు చేయసాగారు. కొద్ది మాసాల తర్వాత భార్గవ మంత్రి వర్గాన్ని దింపేశారు. నాయకత్వానికి సచ్చకపోతే అంతే– మంత్రి వర్గం మనజాలదు. అధినాయకత్వంలోని త్రిమూర్తులను కాదని వర్కింగ్ కమిటీ చేయగలిగిందేమీలేదు.

ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికారం చెలాయించే విషయంలో దానికదే సాటి.

1920 నుండి ఆ ప్రాంతం వారు వర్కింగ్ కమిటీలో అధిక సంఖ్యలో వుండేవారు. అధ్యక్షుడో లేక సెక్రటరీనో లేక ఇద్దరూ ఆ ప్రాంతానికి చెందినవారే కావడంతో నాయకత్వపు వారసత్వంలో వాళ్ల మాటే వేదం. పండిట్ మదన్ మోహన్ మాలవ్యా, మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా ఆజాద్, ఆచార్య కృపలానీ వంటి కాంగ్రెస్ అధ్యక్షులందరికీ అది జన్మభూమి లేదా వారు అక్కడ స్థిరపడిపోవడమో జరిగింది. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకత్వమే ఎఐసిసిలోనూ, దాని వర్కింగ్ కమిటీలోనూ మాట చెల్లించుకోసాగింది. కనుక వారు వాళ్ల ప్రాంతీయ గొడవల్ని వర్కింగ్ కమిటీ ముందుకు తీసుకురాకపోవడమే గౌరవప్రదంగా ఉంటుందనుకునేవారు. ప్రాంతీయ గొడవలు హద్దులు దాటని స్థితిలో ఉంటే అంతకంటే కావల్సిందేముంది? కాని దేశానికి స్వాతంత్ర్యం సమకూరిన తర్వాత జవహర్‌లాల్‌జీ కేంద్ర ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత రఫీ అహ్మద్ కిద్వాయ్ ముఠా గోవింద్ వల్లభ్ పంత్ ముఠాకు ఎదురునిలిచి నిలదొక్కుకుంది. పంత్‌జీకి స్థానిక గొడవల్ని సర్దుబాటు చేసే సామర్థ్యం కొరవడింది. అందుకు కారణం బహుశా ద్వితీయ శ్రేణి నాయకత్వం పెద్ద సంఖ్యలో అత్యాశాపరులయ్యారు. అందరి ప్రయత్నమూ మంత్రి పదవి కోసమే. ఇప్పుడు స్వరాజ్యం చేకూరింది కనుక అధికారం కోసం తమ సహజ సిద్ధమైన ఆశల్ని చంపుకోవాల్సిన పని లేదనుకున్నారు.

తొలిసారిగా ఎన్నడూ అనుభవంలోకి రాని పరిస్థితి ఎదురైంది. పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉత్తరప్రదేశ్ పిసిసికి, పంత్‌జీ విధాన సభ నాయకత్వానికి ఎదురు తిరిగారు. స్థానిక అసెంబ్లీ పార్టీ నిర్ణయంపై వారు వర్కింగ్ కమిటీకి ఫిర్యాదు చేశారు. వెంటనే అలా అప్పీలు చేసినవారిని పంత్‌జీ కాంగ్రెస్ పార్టీ నుండి తొలగించారు. అది ప్రజాస్వామ్య విరుద్ధ చర్యగా నేను భావించాను. అయితే దానిపై చర్చ పెద్దగా జరిగిందిలేదు. పంత్‌జీకి సర్దార్ పటేల్ మద్దతుందని, రఫీ సాహెబ్‌కు మౌలానా ఆజాద్, జవహర్‌లాల్‌జీ మద్దతుందనే విషయం అందరికీ తెలిసిందే. కనుక వాళ్ల అనుయాయులకే ఇప్పుడు ఇబ్బందంతా. పంత్‌జీ ఎదురుముఠావాళ్లను స్నేహపూర్వక సహకారాన్ని అందించాల్సిందిగా కోరాడు. అయితే మౌలానాగానీ, జవహర్‌లాల్‌గానీ తమ వైఖరి నుండి కొంచెం కూడా బెసకలేదు. ఒక సాయంత్రం నెహ్రూజీ సమావేశానికి కొంచెం ఆలస్యంగా వచ్చారు. ఇంతలో సర్దార్ పటేల్ రఫీ సాహెబ్‌కు ఒక బహిరంగ విన్నపం చేస్తూ ప్రతిఘటనదారులకు మద్దతు పలకకుండా పంత్‌జీకి సహకరించమని చెప్పారు.

అందులో ఈ గొడవకంతటికీ రఫీ బాధ్యుడన్న ధ్వని ఉండడంతో రఫీ సాహెబ్ నవ్వుతూ అన్నాడు 'అలా అని మీరెలా అనగలరు?' దాని వల్ల అయ్యిందీలేదు, పోయిందీలేదు. ఆ విషయంపై చర్చను వారంతా కలసి వర్కింగ్ కమిటీకి దూరంగా ఉంచదల్చారు. వాళ్లల్లోని గొప్ప గొప్ప నాయకుల మధ్య తలెత్తిన ఆ సంక్షోభాన్ని అధ్యక్షుడుగానీ, ఎవరైనా సభ్యుడుగానీ అందులో చర్చకు తీసుకురాదల్చుకోలేదు. చివరకు ప్రజాస్వామ్యబద్ధంగా వర్కింగ్ కమిటీకి విజ్ఞప్తులు పంపుకున్న ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు దూరం కావాల్సివచ్చింది. అది అన్యాయంగా భావించి నా మిత్రుడు ఎస్.కె.డి.పల్లీవాల్ కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. నాకు అప్పుడు అనిపించింది. బాపూజీ కనుక జీవించి ఉండి మా సమావేశాల్లో పాల్గొని ఉంటే, నేను వేసిన ప్రశ్నలు విని ఉంటే అటువంటి సంక్షోభంలో ఇటువంటి ఏకపక్ష, అన్యాయపూరిత నిర్ణయాలు జరిగి ఉండేవా?

ఎఐసిసి దాని వర్కింగ్ కమిటీ ఎంతగా జోక్యం చేసుకున్నా గుజరాత్ పిసిసి యుపిపిసిసి మాదిరిగా స్తబ్దుగా ఉండిపోయింది. అందుకు కారణం అందులో సాహసోపేతుడైన సర్దార్ సభ్యునిగా ఉండడమే. అంతటికీ నాయకత్వం వహించే బాపూజీ విషయం ఇక చెప్పాల్సిన పనేముంది? ఫలితం మాత్రం అంత సంతృప్తికరంకాదు. అధినాయకత్వం తరఫున పనిచేసేవాళ్లకు పుట్టగతులు వుండేవికావు. సర్దార్ పటేల్ పిసిసి అధ్యక్ష పదవిని త్యజించే సమయంలో తనవలే పెద్ద వయస్సులో ఉన్న అర్హత గల కాంగ్రెస్‌వాదికి దాన్ని అప్పగించాలనుకున్నాడు. యువత స్థానిక నాయకత్వంలో మార్పులు చేర్పులు కోరుకున్నప్పుడు సభ్యుల్ని చేర్పించడం, జాబితాలు తయారుచేయడం, ఎన్నికలు నిర్వహించడం వంటి విషయాల్లో ఎదురయ్యే చిక్కులు బాపూజీ మరణానంతరం కొన్ని సంవత్సరాల తర్వాత నెహ్రూజీ దృష్టికి వస్తే ఆయన వాటిని వర్కింగ్ కమిటీ ముందుంచారు. అయితే సమావేశంలో సర్దార్ పటేల్ ఉన్న కారణంగా అసమ్మతి కాంగ్రెస్‌వాదుల సంగతులు మాత్రమే వెల్లడించారు. నేను కాంగ్రెస్‌ను 1952లో వదలిన తర్వాత గుజరాత్ పర్యటనకు వెళ్లి గ్రామీణ ప్రాంతాల్లో తిరుగుతూ ఉండగా బాపూ, సర్దార్ పటేల్ గార్ల పవిత్ర భూమిలో కాంగ్రెస్ సభ్యత్వం నమోదుకు అవకాశం ఎంత ఇరుగ్గా ఉన్నదో చూడగలిగాను. గుజరాత్‌లో కాంగ్రెస్ ఎంతగా ధ్వంసమైందీ 1957 సాధారణ ఎన్నికలు రుజువు చేశాయి.

బీహార్ 1937 వరకూ బెంగాల్, పంజాబ్‌ల వలే సమస్యాత్మక రాష్ట్రంకాదు అంటే కాంగ్రెస్ స్థానిక ప్రభుత్వాల ఏర్పాటును అంగీకరించేవరకూ. 1937-39

మధ్యకాలంలో అధికారంలో ఉన్న సమయంలో రాజన్‌బాబు ప్రధాన అనుయాయులు, సహచరులు శ్రీకృష్ణ సిన్హా (భూమియార్), అనురాగ్ నారాయణ్ సిన్హా (క్షత్రియ) మధ్య పొరపొచ్చాలు బహిర్గతమయ్యాయి. అది గ్రామ స్థాయి నుండి పాట్నా వరకూ కాంగ్రెస్‌ను రెండుగా చీల్చుకుంటూ పోయింది. అందుకు కారణం అక్కడ కిసాన్ వుద్యమానికి స్వామి సహజానంద సరస్వతి గట్టి పునాదులు ఏర్పాటుచేసినందువల్లనే. కాంగ్రెస్ నాయకులు రైతు సమస్యల్ని పెద్దగా పట్టించుకోకపోవడం వల్ల, ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో మాదిరిగానే జిల్లా కాంగ్రెస్ స్థాయి నుండి ఆపై నాయకత్వమంతా జమీందారీ వర్గంవారిదే కావడం వల్ల రైతు సమస్యల పట్ల వాళ్ల స్పందన రైతుల్ని ఆకట్టుకునేది కాదు. 1946 నాటికి నైతిక సామర్థ్యం సన్నగిల్లింది. పరస్పర విభేదాలు వర్గ వైషమ్యాలకు దారితీశాయి. అలా కాంగ్రెస్‌వాదుల మధ్య ఐక్యత మాయం కాసాగింది. అనురాగ్ బాబు పరిపాలనా సామర్థ్యం వల్ల, రాజన్‌బాబు నాయకత్వం వల్ల 1951 వరకూ ఎలాగొలా నెగ్గుకొచ్చారు. అయితే తుపాను సమసిపోలేదు.

బీహార్‌లో దశాబ్దాలపాటు పిసిసి అధ్యక్షుడిగా రాజన్‌బాబు అందించిన మంచి నాయకత్వం మరింతమంది ఉత్తమ శ్రేణి నాయకులుగా రూపొందేందుకు వుపయోగపడలేదు. ఆయన ఢిల్లీ వెళ్లాల్సిన సమయానికి రాష్ట్రంలో ఆయన స్థానాన్ని ఎవరు భర్తీ చేయాలన్నది సమస్యగా మారింది. ఆయన తర్వాత లెక్కింపబడే ఇరువురు ప్రముఖ నాయకులు మంత్రి వర్గంలో కొనసాగుతూనే ఒకరి పట్ల మరొకరు కత్తులు దూసుకుంటున్నారు. కనుక కాంగ్రెస్ సదనాన్ని సంబాళించేవారు కరువయ్యారు. కాంగ్రెస్ మంత్రి వర్గంపై ఆధిపత్యం చెలాయించే వారిని అదుపు చేయగల కాంగ్రెస్‌వాదులు లేకుండా పోయారు.

జమీందారీ ఎస్టేట్‌కు సంబంధించిన ఎంతో భూమిని కోర్టు సంరక్షణలో వున్నదాన్ని మంత్రులకు ఇష్టమైనవారికి తగిన ధర చెల్లించకుండానే స్వాధీనపర్చిన బాగోతం ఒకటి వెలుగులోకి వచ్చింది. ఫార్వర్డ్ బ్లాక్, ప్రజా సోషలిస్ట్ పార్టీలకు చెందిన ప్రముఖ నాయకుడు, నా మిత్రుడు మహా మాయాప్రసాద్ సిన్హా బహిరంగ విచారణకు పట్టుబడుతూ పెద్ద పెద్ద బహిరంగ సభలు ఏర్పాటుచేస్తున్నాడు. రాజన్‌బాబుకు అది ఎంతటి ఆవేదన కలిగించే అంశమైనా ఆ విషయం వర్కింగ్ కమిటీ ముందుకు రాక తప్పలేదు. అంతకుముందెన్నడూ బీహార్ ప్రభుత్వం అలా దోషిలా నిలిచిన దాఖలాల్లేవు. అందువల్ల వర్కింగ్ కమిటీ కూడా రాజన్‌బాబు ద్వారానే ఆ విషయాన్ని

పరిష్కరించదల్చింది. మరో గత్యంతరంలేక చివరకు ఆ వికృత వ్యవహారాన్ని అధ్యయనం చేసి పరిష్కారం సూచించమని సర్దార్ పటేల్‌ను కోరడం జరిగింది. ఆ దిశగా చేపట్టిన విచారణలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కూడా ఆ భూమిలో కొంత భాగాన్ని పొంది తర్వాత దాన్ని తనకు చెందిన ఆశ్రమానికి సంబంధించిన ట్రస్ట్ భూమిగా మార్చేశాడు. ఆ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆ భూమి మొత్తం సొంతదారులకు తిరిగి ఇచ్చివేయమని చెప్పాలని వర్కింగ్ కమిటీ నిర్ణయించింది. న్యాయపరమైన ఏదో ఒక వంక చూపి వర్కింగ్ కమిటీ సిఫారసు అమలును ఏండ్లూ పూండ్లుగా వాయిదా వేస్తూ వచ్చారు. అది అలా అవినీతికర వాతావరణానికి దారితీసింది.

అప్పటినుండి బీహార్‌లో కాంగ్రెస్‌వారు సఖ్యత నెరుగరు. అక్కడ కూడా మంత్రి వర్గ ముఠా, పిసిసి ముఠా అంటూ కాంగ్రెస్ రెండు ముఠాలుగా చీలిపోయింది. నాయకుడ్ని ఎన్నుకునే చివరి క్షణంలో అనుగ్రహ బాబును రాజన్‌బాబు స్థానంలో నాయకుడ్ని చేసేందుకు అంగీకరించలేదు. చివరకు రాజన్‌బాబే ఆధిక్యాన్ని సాధించారు. ఏదో పేరుకు మాత్రమే బీహార్‌లో అధికారంలో ఉందికానీ వాస్తవానికి అది స్ఫూర్తినివ్వని దశకు ఏనాడో చేరుకుంది. ఆ పరిస్థితుల్లో వర్కింగ్ కమిటీ పట్టు సాధించలేకపోయింది. ఈ విషయాన్ని నేను 1950-51లోనే పసికట్టి చెప్పాను. అయినా గొప్ప గొప్ప వ్యక్తులున్న రాష్ట్రాల్లో మాత్రం కాంగ్రెస్ పక్షవాతం వచ్చినట్లుగా కునారిల్లుతూ కొనసాగుతోంది.

ఆనాటి మద్రాస్ ప్రెసిడెన్సీలో రెండు పూర్తిస్థాయి ప్రాంతీయ కమిటీలు -ఒకటి ఆంధ్ర ప్రాంతానికి మరొకటి తమిళనాడు ప్రాంతానికి పనిచేస్తూండేవి. అవి ఆ రెండు ప్రాంతాల రాజకీయ వ్యవహారాలను చూసేవి. 1940 జనవరిలో కామరాజ్ నాడార్ తమిళనాడు పిసిసి అధ్యక్షులయ్యారు. శ్రీనివాస అయ్యంగార్ రాజకీయాల నుండి తప్పుకున్న తర్వాత రాజగోపాలాచారి, సత్యమూర్తి గార్లు కాంగ్రెస్ రాజకీయాల్లో బాగా ఎదిగారు. వైరాన్ని పెంచుకున్నారు. కామరాజ్‌నాడార్ అప్పటినుండి కాంగ్రెస్ సంస్థలో తన స్థానాన్ని పదిలపర్చుకుంటూ వస్తే కాంగ్రెస్ సందేశాన్ని ప్రజలకు చేర్చేపని సత్యమూర్తి చేపట్టారు. సత్యమూర్తి మరణానంతరం కామరాజ్‌కు అటువంటి మద్దతును 1946 వరకూ ప్రకాశం పంతులు గారు అందించారు. నాడార్ ముఠా తత్వాన్ని దుంపనాశనం చేయాలని మహాత్ముడు సైతం ఎంతగా ప్రయత్నించినా నాడార్ నిలదొక్కుకున్నారు. కామరాజ్‌కు రాజాజీ అంటే అసలు గిట్టేదికాదు. అందువల్లనే

1946లో ప్రకాశం గారికి ఉమ్మడి మద్రాస్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మద్దతు ఇద్దామనుకున్నారు. అయితే ఇది బాపూజీకి, పటేల్‌జీకి తెలిస్తే వారి అసంతృప్తికి గురికావాల్సి వస్తుందని తెరవైకి ముత్తురంగ ముదలియార్‌ను తీసుకురావడం జరిగింది. అయితే ప్రకాశం గారు ఏదోవిధంగా నెగ్గడంతో మంత్రి వర్గ నిర్మాణంలో కామరాజ్ మద్దతు కావాల్సి వచ్చింది. తాను చెప్పినవాళ్లను మంత్రి వర్గంలోకి తీసుకునే షరతు మీద కామరాజ్ తన సహకారాన్ని అందించేందుకు అంగీకరించారు. ప్రకాశం గారు ఒకరిని మంత్రిని చేసే విషయంలో కామరాజ్ సిఫారసును లక్ష్య పెట్టలేదు. ప్రకాశం గారి పతనానికి కామరాజ్ ప్రయత్నించడం ప్రారంభించాడు. ప్రకాశం ముఖ్యమంత్రిగా ఒక సంవత్సర కాలం మాత్రమే పనిచేయగలిగారు.

తర్వాత వచ్చిన ముఖ్యమంత్రి ఒ.పి.రామస్వామి రెడ్డియార్ గారు పాలనా పరంగాగానీ, వ్యవస్థాగతంగాగానీ అంతగా ఆరితేరిన వారు కాదు. కంట్రోళ్లు, లైసెన్స్‌ల కాలంలో ప్రయోజనాలన్నీ తమవాళ్లకే అంటే, కులపరంగాగానీ, ముఠాతత్వంతోగానీ, మిత్రులైన వాళ్లకుగానీ దక్కేటట్లు మంత్రులు చూసుకున్నారు.

ఇదంతా ప్రకాశం గారు గమనిస్తూనే ఉన్నారు. రుజువులతో సహా కొందరు మంత్రులపై అభియోగాల జాబితా తయారుచేసి అఖిలభారత స్థాయి నాయకుల ముందుంచారు. రాజకీయ అధిష్ఠాన త్రయం–సర్దార్, జవహర్‌లాల్, మౌలానా పెదవి విప్పక పోవడంతో ఆయన ఆ విషయాన్ని ఎపిసిసికి సమర్పించి దాన్ని అఖిలభారత స్థాయిలోని వర్కింగ్ కమిటీకి పంపించాల్సిందిగా నన్ను కోరాడు. అది వర్కింగ్ కమిటీ జాగ్రత్తగా పరిశీలించాల్సిన అంశమని నేనూ భావించాను. అయినా నేను ప్రాంతీయ స్థాయిలో ముగ్గురితో ఉపసంఘాన్ని నియమించి వాళ్లతో అధ్యయనం చేయించి కేంద్ర వర్కింగ్ కమిటీకి పంపించదల్చాను. అయితే కేంద్ర వర్కింగ్ కమిటీ దాన్ని చర్చకు తెచ్చే అవకాశం కనిపించడంలేదు. అభియోగం మోపబడిన మంత్రుల్లో కళా వెంకట్రావు అప్పటికి ఎఐసిసికి ఒక జనరల్ సెక్రటరీ. అభియోగం మోపబడిన మిగతా మంత్రులకు అధ్యక్షుడైన పట్టాభి గారు సంరక్షకులు. అయినా ప్రకాశం గారు వర్కింగ్ కమిటీ సభ్యుల్ని ప్రశాంతంగా ఉండనివ్వడంలేదు. కాంగ్రెస్‌లో కొత్త త్రిమూర్తులు (నెహ్రూ, పటేల్, పట్టాభి) నాపై కినుక వహించారు. నేరారోపణలను ముందుగా నన్ను దర్యాప్తు చేయమన్నారు. దాని కోసం కమిటీ నియామకంలో తాత్సారం చేస్తూ రెండేళ్లు గడిపేశారు. చివరకు అభియోగాల్లో పసలేదన్నారు. మంత్రి వర్గం మొత్తంగాగానీ, అభియోగం

మోపబడిన మంత్రులుగానీ రాజీనామా సమర్పించాల్సిన పని లేదన్నారు. ఇలా అయితే అధినాయకత్వం మీద విశ్వాసం నిలిచేదెలా? అలాగే పంజాబ్, ఒరిస్సా ముఖ్యమంత్రుల అవినీతి విషయంలో పార్లమెంట్ అట్టుడికిపోయింది ఇదంతా మేము మోగించిన ప్రమాద ఘంటికలను పట్టించుకోకపోవడం వల్లనే. అటువంటి అభియోగాలే ఉత్తరప్రదేశ్ మంత్రివర్గ సభ్యులపై వచ్చాయి. వర్కింగ్ కమిటీ స్పందించకపోవడంతో ఆగ్రా ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. ఆ మంత్రుల రాకను స్వాగతించలేదు. ప్రజల్లో అసలేమీ పలుకుబడిలేని మంత్రుల్ని చుట్టుముట్టారు. కాంగ్రెస్ మంత్రి వర్గాన్ని మునుపెన్నడూ ఎరుగనిరీతిలో అవమానాలపాలు గావించారు. అయినా సరే మద్రాస్, ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ మంత్రి వర్గాలు కంట్రోళ్ల రాజ్యంలో ఆ వికారపు కౌగిలి వీడలేదు. వర్కింగ్ కమిటీ నిస్సహాయంగా అలాగే చూస్తూ ఉండిపోయింది. ఆ చెడును నిరోధించేందుకు నేను చేసిన ప్రయత్నాలు వృధా ప్రయాసను మిగిల్చాయి.

అహ్మదాబాద్ మిల్ మజ్దూర్ యూనియన్ నాయకుల్లో ఒకరైన ఖందూభాయ్ దేశాయ్ నూలు మిల్లుల యజమానులు కంట్రోళ్ల కారణంగా అమితంగా లాభాలు గడిస్తున్నారని కరపత్రం వేసి అనేక పర్యాయాలు పార్లమెంట్‌లో ప్రసంగించినా ప్రయోజనం లేకపోయింది. టెక్స్‌టైల్ కమీషనర్ పాలనా సామర్థ్యాన్ని మెరుగుపర్చుకోవాలని మేము డిమాండ్ చేశాం. కాంగ్రెస్ జాతీయ నాయకత్వంలోని అంతర్గత అధినేతలు ఆ పెట్టుబడిదారుల్ని ఏమీ అనలేక పోయారు. అసలు కాంగ్రెస్ నాయకత్వం ఏమనగలదు? అటువంటి వారి నుండి కోట్లాది రూపాయలు విరాళంగా పొందుతున్నప్పుడు. విరాళాలు ఇవ్వనివారి చెవులు మెలేస్తున్నప్పుడు.

మద్రాస్‌లోని రాజకీయ అవినీతి పతాక స్థాయికి చేరి ప్రజాస్వామ్యానికే మాయని మచ్చగా మారింది. పంజాబ్ ముఖ్యమంత్రిపై దాస్ కమిషన్ నివేదిక, ఒరిస్సాలో ఇరువురు పూర్వ ముఖ్యమంత్రులపై సిబిఐ నివేదిక, మధ్యప్రదేశ్ పిసిసి అధ్యక్షుడికి వ్యతిరేకంగా హైకోర్టు తీర్పు – అన్నీ కూడా 1948లోనే మేము ప్రారంభించిన వీరోచిత పోరాట ఫలితమే. అవినీతి వ్యతిరేకత విషయంలో సంతానం కమిటీ నివేదిక చూసినట్లయితే మేము తొలుతగా పదిహేడు సంవత్సరాలకు (1965 నాటికి) పూర్వమే మోగించిన ప్రమాద ఘంటికల్ని, నిరసనలను ఖాతరు చేయని కారణంగా భారతదేశపు ప్రజాస్వామ్యం అవినీతికి దూరంగా ఉండలేకపోయిందని తెలియవస్తుంది.

37

కంట్రోళ్ల రాజ్యంలో దుష్టపాలన

యుద్ధ ప్రకటనతో పాలనలో నియంత్రణల పర్వం మొదలైంది. యుద్ధ ప్రకటన జరిగిన తొలి వారంలోనే ధరల నియంత్రణకు సంబంధించిన పత్రికా ప్రకటనలు వెల్లువెత్తాయి. ధరల నియంత్రణ కోసం వాణిజ్య సముదాయాలపై పోలీసుల దాడులు ప్రారంభమయ్యాయి. అప్పటికే స్వాతంత్ర్య సమరానికి సరైన ప్రణాళికా రచన ఆచరణ సారథ్యం, కాంగ్రెస్‌లోని కుమ్ములాటలు, వామపక్షాలు, కిసాన్ కాంగ్రెస్‌వంటి విషయాల్లో తలమునకలయ్యే నాకు ఇదొక సరికొత్త సవాల్.

ప్రథమ ప్రపంచ మహా సంగ్రామం సందర్భంగా రైతు పెద్దలు మరీ ముఖ్యంగా కోస్తా ప్రాంతానికి చెందిన కీ.శే. **కె.వి.చలపతయ్య, దేశభక్త కొండా వెంకటప్పయ్య** గార్లు రైతుల పక్షాన ధైర్యంగా నిలిచి వ్యవసాయ ఉత్పత్తులపై, రవాణాపై నియంత్రణను సడలించే విషయంలో బాగా కృషి చేశారన్న విషయం గుర్తుకొచ్చింది. అయితే దానివల్ల యుద్ధం సాకుగా రైతులు అధిక లాభాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని, పట్టణ వాసుల ఇక్కట్లను పరిగణనలోకి తీసుకోవడంలేదని, మరీ ముఖ్యంగా శ్రామికుల ఇక్కట్లను పట్టించుకోలేదనే విమర్శలు కూడా గుర్తుకొచ్చాయి. అయితే 1922 నుండి

దేశభక్త కొండా వెంకటప్పయ్య

వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఎంత తక్కువగా ఉన్నది, లాభదాయకంకాని మాట అటుంచి, కనీసం నష్టం వాటిల్లని స్థితి కూడా లేదని నాకు తెలుసు. అలాగే 1939లో కూడా ధరలు ఎంత తక్కువగా ఉన్నదీ నాకు తెలుసు. అదే విధంగా యుద్ధ సమయపు ఆర్థిక చర్యల విషయంలో ఎదురయ్యే ఆటంకాలకు ఎంత సున్నితంగా స్పందిస్తారో, కీలక సమయంలో రైతుల డిమాండ్లకు మద్దతు పలికేందుకు కేంద్ర మంత్రిగా ఎంతగా తటపటాయిస్తారో కూడా నాకు తెలుసు.

నేను రైతుల తరపున మాట్లాడేందుకు సిద్ధమయ్యాను. పదిహేను సంవత్సరాలుగా ఆర్థిక సంక్షోభం కారణంగా బాధాకరమైన ఇబ్బందులను రైతులు అనుభవిస్తున్నందున గతించిన కాలపు ఇబ్బందుల నుండి వాళ్లు కోలుకునే ఆసరా అధికారికంగా లభించనందువల్ల ఇప్పటి ఆర్థిక మాంద్యం వాళ్ల పరిస్థితుల్ని మరింత దయనీయంగా మార్చివేసింది. అటువంటి వాదనకు శ్రామిక వర్గం నుండిగానీ, వాణిజ్య వర్గాల నుండిగానీ, పారిశ్రామిక వర్గాల నుండిగానీ, వృత్తిదారుల నుండిగానీ ఎటువంటి అభ్యంతరం ఉండేందుకు వీలులేదు. ఎందువల్లనంటే వాళ్లంతా కూడా వారి వారి వర్గాలకు ఆర్థిక వనరులు ఆ క్లిష్ట సమయంలో సమకూరాలని కోరుకునేవాళ్లే. అయితే పత్రికా రంగానిది నగర పక్షం. నగరాల్లో నివసించే కోటీశ్వరుల ఆధిపత్యంలో అవి నడుస్తూ ఉంటాయి. కనుక అవి రైతుల గోడు పట్టించుకుంటాయనే నమ్మకం నాకు లేదు. కనీసం వ్యవసాయేతర వర్గాలతో పాటుగా వీళ్లు కోరుకునేవరకైనా కంట్రోళ్ల నుండి వీళ్లకు విముక్తి లభించాలని వాళ్లు వాదిస్తారని నేను భావించను.

ఇదంతా ఇలా ఉన్నా నేను కొన్ని ప్రకటనలతో వెనువెంటనే ముందుకు రాదల్చాను. వ్యవసాయ ధరలను అనువుకాని కాలంలో నియంత్రించవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించదల్చాను. ఒకవేళ ధరల నియంత్రణ తప్పనిసరైన తరుణంలో రైతులకు గిట్టుబాటు ధరలను కూడా దృష్టిలో ఉంచుకోవాలని చెప్పదల్చాను. అయితే నా ప్రకటనలను ప్రచురించే విషయంలో పత్రికలు వుత్సాహాన్ని ప్రదర్శింపనప్పటికీ వ్యతిరేకతను మాత్రం చూపలేదు. భారత కమ్యూనిస్ట్ పార్టీ మాత్రం విమర్శనాస్త్రాలను సంధించింది. అది పట్టణాలలో జీవన వ్యయం పెంచేందుకు పన్నిన పన్నాగమది. నేనూ నా వాదనతో తిప్పికొట్టాను. జనాభాలో 70 శాతంమంది ప్రజల అవసరాలకు కూడా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నాను.

యుద్ధం విషయంలో కాంగ్రెస్ వైఖరి ఏమిటో స్పష్టం చేసేందుకు ఎఐసిసి సమావేశం

వార్డాలో నిర్వహిస్తున్నారు. సుభాష్‌బాబు అధ్యక్షతన అదే వారంలో నాగపూర్‌లో సామ్రాజ్యవాద వ్యతిరేక సదస్సు జరగనుంది. రెండింటిలోనూ వామపక్ష ఐక్య సంఘటన ప్రతినిధిగా నా పాత్ర కీలకం. మొదటి సదస్సు ప్రారంభానికి ముందుగానే మంత్రులతో ముచ్చటించాను-కంట్రోల్ విధించేటట్లయితే మనం రైతులకు అందించే రక్షణ ఎలా ఉంటుందని? అలాగే రెండో సభ ప్రారంభంలో కూడా వామపక్ష నాయకుల్ని రైతుల రక్షణ విషయం అడిగాను. మంత్రులు సానుకూలంగానే స్పందించారు. పలువురు వామపక్ష నాయకుల వైఖరి దానికి విరుద్ధంగా ఉంది. ఆహార ధాన్యాలపై కంట్రోల్ విధించవద్దని మంత్రులు కేంద్ర ప్రభుత్వానికి సలహా ఇస్తామన్నారు. అంతకంటే నాకు కావాల్సిందేముంది. నాకు మార్కులు బాగా లభించినట్లే.

అప్పుడు నేను ఢిల్లీ వెళ్లాను. వ్యవసాయ మంత్రిత్వ శాఖాధికారుల్ని కలిశాను. వ్యవసాయ ఉత్పత్తులపై కనీసం కొంతకాలమైనా ధరల నియంత్రణను చేపట్టవద్దని కోరాను. ఖరేఘట్ అనే ఐసిఎస్ అధికారి వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరగడాన్ని నియంత్రించకుండా చూస్తానన్నాడు. 1940 ఏప్రిల్‌లో నేను జైలుకు వెళ్లాల్సి వచ్చినప్పుడు కొంతకాలంపాటైనా రైతులు ఇబ్బందులు పడరనే తృప్తితో ఉన్నా.

నేను జైలుకు వెళ్లేముందు దేవీజీకి ఇచ్చిన సలహా ఏమంటే ధరలను జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉండమని. ఆ యుద్ధ సమయంలో రైతుల నుండి ప్రభుత్వం మరిన్ని త్యాగాలను ఇతర వర్గాలకుమించి కోరకుండా చూడమని.

1942 నాటికి గోధుమల ధరను ప్రభుత్వం నియంత్రించాల్సిన అవసరం ఏర్పడిందనుకుంది. అప్పటి పంజాబ్ ప్రభుత్వంలో మంత్రి పంజాబ్ రైతుల తిరుగులేని నాయకుడు, నాకు మంచి మిత్రుడు కీ.శే.చౌధురి ఛోటూరామ్ ధరను మరీ తగ్గించకుండా, ఆ తగ్గించిన ధరకు రైతుల నుండి ఎక్కువగా సేకరించకుండా చూశాడు. 1943లో మరికొంతకాలంపాటు కేంద్ర ప్రభుత్వం ధరల నియంత్రణను కొనసాగించాలని చూసింది. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు పలికేందుకు సిద్ధంగా లేకపోతే ఆ నియంత్రణ అమలుచేయడం ఎంత కష్టమో కేంద్ర ప్రభుత్వానికి తెలియవచ్చింది. ఇంతలో బెంగాల్‌లో కరవు కాటకాలు. అందువల్ల గోధుమలు, ధాన్యంపై ధరల నియంత్రణ విధించే సాహసం కేంద్ర ప్రభుత్వం చేయగలిగింది.

పంజాబ్‌లో గోధుమ ధర నియంత్రణలో ప్రభుత్వం దూకుడులేకుండా ఛోటూరామ్ చూడగలిగాడు. ఆంధ్ర, ఒరిస్సా రాష్ట్రాల్లో వరి మిగులుపంట. అయితే ఆయా రాష్ట్ర

ప్రభుత్వాలు వరి పండించే రైతుల పట్ల శ్రద్ధ చూపని కారణంగా ప్రభుత్వం నియంత్రించిన ధరలు బాగా పడిపోయాయి. రైతుల నుండి పంటను సేకరించే విధానం కూడా సరిగాలేక అవినీతికి తావిచ్చింది. అధికార గణం రైతులకు కొంత వెసులుబాటు ఏదోవిధంగా కల్పించినా ప్రభుత్వం కొరడా ఝళిపించడంతో రైతులు కుటుంబ అవసరాల కోసం ఉంచుకున్న ధాన్యాన్ని కూడా సేకరించాల్సి వచ్చింది. అప్పుడు పెద్ద రైతులు అధికారుల్ని ఆకట్టుకుని లబ్ధి పొందాలని చూశారు. గ్రామాల్లోని నాయకులు కూడా అదే బాటలో నడిచారు. నష్టపోయింది నిజాయితీపరులూ అమాయకులూ అయిన సన్నకారు రైతులే. భారతీదేవి, బి.రామచంద్రారెడ్డి, జి.ఎల్.నారాయణవంటి వారు పెనుగు లాడారుకానీ అంతగా ఫలితం లేకపోయింది. అందువల్లనే వాళ్లు ఆహార ధాన్యాల ఉత్పత్తిదార్ల మహాసభ ఏర్పాటుచేయాలని నిర్ణయించుకున్నారు.

ఇదిలా ఉండగా నేను జైలు నుండి విడుదలయ్యాను. అదృష్టమేమంటే నేను నిడుబ్రోలు చేరుకునే సమయానికి అక్కడ ఆంధ్ర ప్రాంత ఆహార ధాన్యాల ఉత్పత్తిదారుల సభ తూర్పుగోదావరికి చెందిన రైతు నాయకులు మారెన సుబ్బారావు గారి అధ్యక్షతన జరగనుంది. నేను ఆ సభను ప్రారంభించి ప్రసంగించాను. తగిన ధరలు లభించే విధంగా లేకున్నా, రైతు తన కుటుంబానికి, వ్యవసాయ ఖర్చులకు సరిపడా ధాన్యాన్ని నిల్వ ఉంచుకునే సదుపాయాన్ని తోసిపుచ్చినా వారిని పోరాటానికి సిద్ధంగా ఉండమన్నా. 166 పౌన్ల బస్తా ధర అప్పట్లో పదిన్నర రూపాయలుగా ఉంది. దాన్ని పన్నెండున్నర రూపాయలకు పెంచమని సభ డిమాండ్ చేసింది. అటువంటి నిర్ణయం ఆ కంట్రోల్ రాజ్యంలో సాహసోపేత చర్యే. చాలా చిక్కులతో కూడుకున్నదే. అందులోనూ నాలుగున్నరేళ్లు జైలు శిక్ష అనుభవించి అప్పుడే విడుదలైన నావంటివాడికి మరీను. అటువంటి సాహసోపేత నాయకత్వానికి అదే సరైన సమయం.

నేను ఇంటిపట్టున ఉన్న నాలుగు రోజుల్లో ఆంధ్రలోని వివిధ ప్రాంతాల రైతుల నుండి విజ్ఞప్తులు అందుకున్నా. సముద్రతీర ప్రాంతాల్లో నివసించేవారు వాళ్లు పండించే పంట ఆరు మాసాలకు కూడా చాలదు కనుక వాళ్లకు మరింత ధాన్యం అవసరమంటున్నారు. పట్టణవాసులకంటే కంట్రోల్ బియ్యానికి వారు రెండు రెట్లు అదనంగా చెల్లించాల్సి వస్తుందన్నారు. ధాన్యం ఎక్కువగా పండే ప్రాంతాల నుండి మోయగల మూటల్ని దొంగతనంగా తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. చీరాల, పేరాల, వేటపాలెం ప్రాంతాలకు చెందిన నేతపనివారు కంట్రోళ్లు ఎత్తివేస్తే ఆనందిస్తామన్నారు. కంట్రోళ్ల

ద్వారా లభించే రేషన్లు కుటుంబాలకు సరిపడేంతగా అందవు. ఖరీదు ఎక్కువ, అయినా నాసిరకం. మూటల ద్వారా తెచ్చి అమ్మేవాళ్లకు రెట్టింపు ధర చెల్లించాల్సి వస్తోంది. రాయలసీమకు చెందిన రైతు నాయకులు కూడా వాళ్ల ప్రాంతంలో అధిక ధరలు, తక్కువ సరఫరాలు, నాసిరకం బియ్యం గురించి ఫిర్యాదు చేశారు. దానికితోడు రేషన్ షాపుల్లోనూ, ధాన్యాన్ని సేకరించే అధికారుల్లోనూ సిగ్గూఎగ్గూలేని బహిరంగ అవినీతి. మహాత్ముని ఆదేశం మేరకు సేవాగ్రామ్ బయలుదేరి వెళుతూ కరవు ప్రాంతమైన శ్రీకాకుళం జిల్లాలో కొద్దిరోజులున్నా. అక్కడి స్థానికులు చౌకగా బియ్యం దొరుకుతాయని ఒరిస్సా ప్రాంతానికి వలస వెళ్లడం చూశాను.

కంట్రోల్ వస్తువులు అమ్మేందుకు ప్రభుత్వం అనేక సహకార సంఘాలను నిర్వహించసాగింది. అయితే అవి అధికారుల దాష్టీకాన్ని, అవినీతినీ ఆపలేకపోయాయి. చౌకధరల దుకాణాలు నల్లబజారు చర్యలకు దూరంగా వుండలేకపోయాయి. బియ్యం, గోధుమల నాణ్యత ఎంతగా తగ్గిపోయాయంటే అవి మనుషులు తినడానికి కూడా పనికిరానంతగా. చేనేత సహకార సంఘాలు మాత్రమే వాళ్ల సభ్యులకు కొంత రక్షణ కల్పించగలిగాయి. అయినా వస్త్రాల ధరలు అధికంగానే ఉండేవి. బయట బజారులో కూడా దొరికేవి.

నేను ఈ బాధలన్నింటినీ మహాత్మాగాంధీకి సవివరంగా చెప్పాను. ఆహార పదార్థాలపై కంట్రోళ్లను ఆయన కూడా ఖండించారు. ఆనాటి నుండి ఆయన కూడా కంట్రోళ్లకు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించారు.

నేను కేంద్ర అసెంబ్లీలో ప్రవేశించగానే ఆహార కంట్రోళ్ల అవకతవకల్ని, దుష్పరిణామాల్ని సభ దృష్టికి తీసుకురావడం ముఖ్యమైన పనిగా పెట్టుకున్నాను. నాకు సమయం లభించినప్పుడల్లా నేను వివిధ కోణాల నుండి కంట్రోల్ సమస్యపై మాట్లాడేవాడిని. ఫ్లౌడ్ కమిషన్, థియోడోర్ గ్రెగొరీ 'ఫుడ్ గ్రెయిన్ ఎంక్వయిరీ కమిటీ'లో పాందుపర్చినంతగాకున్నా ఎంతోకొంత రైతులకు అధిక ధరలు చెల్లించాల్సి ఉందనేవాణ్ణి. ఇక రైతు కూలీలకు, పల్లెల్లోని ఇతర కూలీలకు ధాన్యం రూపంలో ఎంత ఇవ్వాలో లెక్కగట్టి అది ఆ గ్రామంలోని రైతుల నుండి సేకరించే ధాన్యంలో మినహాయించి పట్టణాల్లోని పేదలకు చౌకధరల దుకాణాల్లో అందించే ధరలకు అందించాలని వాదించేవాణ్ణి.

ఇదిగాక రైతులకు, ప్రభుత్వానికి మధ్య ధాన్యం మిల్లుల యజమానులు దళారుల

పాత్ర పోషించడం మరో బాధాకరమైన అంశం. వాళ్లు ఆ పరిస్థితిని కొల్లగొట్టారు. రైతుల నుండి ప్రభుత్వ రేట్ల ప్రకారం ధాన్యాన్ని సేకరించేవాళ్లు. దాంట్లో కొంతభాగం మాత్రమే ప్రభుత్వానికి లెక్కలు చెప్పేవాళ్లు. మిగతా భాగాన్ని బహిరంగ మార్కెట్లో అమ్ముకునేవాళ్లు. అదే 'చీకటిబజారు'గా జోరందుకుంది. అందులో ఎక్కువ రేటుకు అమ్ముకునేవాళ్లు. వాళ్లు ఎందరికి మామూళ్ల రూపంలో లంచాలు ముట్టచెప్పినా పెద్దయెత్తున లాభాలు గడించేవాళ్లు.

మిల్లుల వాళ్లు రైతుల నుండి సేకరించే ధాన్యంలో కొంత దాచేందుకు ప్రోత్సహించేవాళ్లు. ఆ ధాన్యానికి బహిరంగ మార్కెట్లో పలికినంత ధర పలకకపోయినా రైతుల నుండి ధాన్యం సేకరించే ధరకంటే ఎక్కువ ముట్టజెప్పేవారు. దీన్ని అరికట్టేందుకు నేను నాతో సహకరించేవారిని సహకార పద్ధతిలో మిల్లులను నిర్వహించమని కోరాను. అయితే మామూళ్లకు అలవాటుపడిన అధికారులు మిల్లులను సహకార పద్ధతిలో నిర్వహించేందుకు సహకరించలేదు. అడుగడుగునా అడ్డుతగిలారు.

అనేక పట్టణాల్లో సహకార సంఘాల ద్వారా దుకాణాలు తెరిచారు. అందులో బియ్యం, గోధుమలేకాక పంచదార, ఎరువులు, కిరోసిన్, వంటనూనెలు కూడా అమ్మసాగారు. అయితే ఆ సహకార సంఘాల్లో పదవుల్లో ఉన్న పెద్దలు పలువురు వాళ్లకు ఇష్టమైన వాళ్లకు , బంధువులకు ఆ పంపిణీని లాభసాటిగా మార్చారు. దాని ఫలితంగా ఈ సహకార దుకాణాల్లో కూడా 'నల్ల బజారు' వ్యవహారం చొరబడిందని అనుమానం.

క్రమేపీ 'నల్ల బజారు' బహిరంగ వ్యాపారంగా మారి అది వేలమందికి వుపాధిగా మారింది. ప్రతి పట్టణంలోనూ, చుట్టుపక్కల కూడా ఇదే వ్యవహారం కొనసాగింది. మనిషి మోయగలిగిన మూటల ద్వారా వ్యాపారం సాగింది. మెల్లగా మిల్లర్లు, వ్యాపారులు కూడా ఆ మూటల కూలీలను తమ వ్యాపారానికి వాడుకున్నారు. దాంతో అందరూ ఈ చీకటి వ్యాపారానికి అలవాటుపడిపోయారు. దానితో కంట్రోళ్ల రాజ్యం ఇక్కట్లను మర్చిపోసాగారు. అటు ఉత్పత్తిదారుల్నిగానీ, ఇటు వినియోగదారుల్నిగానీ నిందించే అవసరం లేకుండాపోతోంది. అసలు కంట్రోళ్లను అరికట్టేందుకు రూపొందించిన చట్టాలు వాళ్ల సామాజిక మనుగడకు అడ్డంకిగా నిలిచాయి. కంట్రోళ్ల వల్ల చెలరేగిన అవినీతి, సామాజిక పతనం విషయంలో, రైతులకు భద్రత కల్పించే విషయంలో నేను నా కృషిని కొనసాగిస్తూనే ఉన్నా.

నేను జైలు నుండి విడుదలయ్యాక నాటి నుండి మహాత్ముని మరణం వరకూ గల నాలుగేళ్ల వ్యవధిలో పెరుగుతున్న ఈ దుర్మార్గాన్ని అరికట్టేందుకు కిసాన్ సమ్మేళనం కృషి చేస్తూనే ఉంది. ఆంధ్రా ప్రొవెన్షియల్ కాంగ్రెస్‌ను కిసాన్ వుద్యమానికి మద్దతు పలకమని కోరాను. అయితే స్వరాజ్య ప్రభుత్వం కంట్రోళ్ల మోజులో పడిపోయిన కారణంగా ఆ దుష్ట విధానాన్ని ఏమీ చేయలేకపోయాం. కంట్రోళ్ల దక్షతపై నెహ్రూకు సిద్ధాంతపరమైన విశ్వాసం. కమ్యూనిస్ట్‌లు కూడా కంట్రోళ్ల విషయంలో ఎంతో హాని తలపెట్టారు.

యుద్ధ సమయంలో వాళ్లు బహిరంగ విపణిని ఎదుర్కొన్నారు. పట్టణ ప్రజలకు వెసులుబాటు కల్పించే పేదల మూటల పథకాన్ని అడ్డుకున్నారు. వాళ్లు ప్రభుత్వాధికారులకు మరింతగా అధికారాన్ని కట్టబెట్టేందుకు మద్దతు పలికారు. రైతుల కుటుంబ అవసరాలకు సరిపోయేటంతగా కూడా పండించిన ధాన్యం మిగలకుండా చేశారు. బహుశా సోవియట్ కంట్రోళ్ల మాదిరి కంట్రోళ్లను రూపొందించాలనే వుబలాటమేమో మరి. ఏదిఏమైనా ఈ విషయంలో ప్రభుత్వ విధానం పట్ల వాళ్ల అత్యుత్సాహం పొరపాటు పనే. వాళ్ల 'ప్రజా పోరాటం' నినాదాన్ని అంగీకరించని ఎవరినైనా సరే చీకటి వ్యాపారం చేస్తున్నట్లుగా చిత్రించి అభియోగాలు మోపేవారు. ఆ విధంగానూ, మరెన్నో విధాలుగా రైతుల్ని వేధించడానికి, వాళ్లు నిరుపేదలుగా మారడానికి సహకరించారు.

అదృష్టవశాత్తూ మహాత్మాగాంధీ ప్రజల గోడు పట్టించుకున్నారు. పట్టణవాసులతో పోల్చితే పల్లెల్లోని రైతులు ఎంతగా దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారో గ్రహించారు. నేను పంపుతున్న సవివరణ నివేదికలపై ఆయన విశ్వాసాన్ని ఉంచారు. నేను పల్లెల్లో అనేక విచారణలు జరిపించి కంట్రోళ్ల తీరు ఎలా ఉందో విపులంగా వివరాలు పంపేవాణ్ణి.

1947కు ముందు భారత ప్రభుత్వ పాలనలో ఆహార అంశం అమలు జరుగుతున్న తీరును జవహర్‌లాల్‌జీ వ్యతిరేకించాడు. అందుకు కారణం అందులో నెలకొన్న అవినీతి. చీకటి బజారు బాగోతాలు. అయితే ఆయన ప్రధాని కాగానే పాత విధానాన్నే కొనసాగించాడు. అలా చేయకపోతే కలకత్తాలో తిరిగి కరవు కాటకాలు తలెత్తుతాయనుకున్నాడు. గాంధీజీకి అటువంటి భయాందోళనలు ఏమీలేవు. అందువల్ల గాంధీజీ మాకు మద్దతు పలికాడు. కంట్రోళ్లు ఎత్తివేస్తే ఆకలి చావులు ఉండవనే

విషయంపై ఆయనకు విశ్వాసం కలిగించాం. దాంతో గాంధీజీ సత్యాగ్రహం ఆయుధంగా ప్రభుత్వాన్ని బెదిరించేందుకు సిద్ధమయ్యాడు. అప్పటి కేంద్ర ఆహార శాఖామంత్రి డాక్టర్ రాజేంద్రప్రసాద్ చివరకు కంట్రోళ్లను రద్దుచేసే నిర్ణయం తీసుకున్నాడు. దాన్ని మేము స్వరాజ్య విజయంగా, మా ప్రజల విజయంగా భావించాం.

అయితే ఆంధ్రాకు సంబంధించినంతవరకూ ధాన్యంపై ధరల నియంత్రణను ఎత్తివేయలేదు. గిట్టుబాటు ధరలకు దిగువ స్థాయిలో ధాన్యం ధరలను నియంత్రించారు. అయినా రైతులు అలజడి చెందలేదు. ధాన్యం సేకరణ మునుపటంత దౌర్జన్యంతో కూడుకున్నదిగా లేదు. నల్ల బజారు ప్రభావం తగ్గిపోయింది. సేకరణ తర్వాత మిగిలిన ధాన్యానికి ఫర్వాలేదనిపించే ధరలు పలికేవి. పంచదార, కిరోసిన్, ఇనుము, సిమెంటు వంటి వాటిపై కంట్రోళ్లు సడలించడంతో ప్రజలు అధికారుల కబంధ హస్తాల నుండి బయటపడ్డారు. అవినీతి తగ్గుముఖం పట్టింది. ప్రజలు ఉపశమనం లభించినట్లుగా స్వేచ్ఛా వాయువులు పీల్చసాగారు. కిసాన్ కాంగ్రెస్ ప్రజా సంఘటనకు ఇలా ఘన విజయం లభించినందుకు నేనెంతగానో ఆనందించాను.

గాంధీజీ మరణించాడో లేదో తిరిగి కంట్రోళ్లను ప్రవేశపెట్టేందుకు ఉపాయం ఆలోచించారు. బహిరంగ విపణిలో పట్టణాల్లోని కార్మికులు అధిక ధరలకు కొనాల్సి వస్తున్నదని అఖిల భారత కమ్యూనిస్ట్ పార్టీ కంట్రోళ్లను కోరుతున్నది. ఇక ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కూడా అదే విధంగా తిండి గింజల కంట్రోళ్లను కోరడాన్ని చూసి నేను అవాక్కయ్యాను. పారిశ్రామిక వేత్తలు ఎక్కువ వేతనాలు, కరవు భత్యాలు చెల్లించలేక కంట్రోళ్లకు మద్దతు పలుకుతున్నారు. శ్రామికులపై భారం తగ్గించుకోవాలని అందరికంటే పెద్ద యజమాని ప్రభుత్వం కూడా చూస్తోంది కదా. జవహర్‌లాల్‌జీ వారందరికీ ఏది కావాలో అది ఇచ్చేశారు. దీన్నిచూసి సోషలిస్ట్‌లు కూడా అదే దారి పట్టారు.

అలా గాంధీజీ మరణించి ఒక సంవత్సరమైందో కాలేదో తిరిగి కంట్రోళ్ల రాజ్యం ఆవిర్భవించింది. తిరిగి నాలుగేళ్ల పోరాటం తర్వాత కంట్రోళ్లు 1952లో రద్దయ్యాయి.

1949లో దేవీజీ జన్మభూమి మాచవరం గ్రామంలో ఆంధ్ర కంట్రోళ్ల నిరోధక సదస్సు నా అధ్యక్షతన నిర్వహించారు. రెండు మణుగులు (165 పౌన్లు) తూగే ధాన్యం బస్తాకు పదిహేను రూపాయలు చెల్లించాల్సిందిగా మేము కోరాం. కంట్రోళ్లు ఎత్తివేయకుండా ఆ ధరకు ధాన్యం సేకరించేందుకు ప్రభుత్వం అంగీకరించింది.

'పెజెంట్స్ అండ్ కంట్రోల్స్' ('రైతులు -ధరల నియంత్రణలు') అనే నా పుస్తకంలో రేషన్ల పంపిణీ ఎలా జరగాలనే విషయంలో సవివరంగా సలహాలు ఇవ్వడం జరిగింది. దేశమంతటా దానికి బాగా ప్రాచుర్యం లభించింది. నేను కంట్రోళ్లపై బాణాలు సంధించే పోరాట యోధునిగా కీర్తిని పొందాను. పట్టణాల నుండి కూడా అనేకమంది యోధులు నా కృషికి వెన్నుదన్నుగా నిలిచారు.

1951లో అఖిలభారత కంట్రోళ్ల వ్యతిరేక సదస్సు ఆగ్రాలో నిర్వహించారు. కీ.శే. సిద్వా అధ్యక్షత వహించారు. సదస్సును నేను ప్రారంభించాను. అప్పుడు నేను అఖిలభారత ప్రగతిదాయక కంట్రోల్ నిరోధక సంఘానికి అధ్యక్షుణ్ణయ్యాను. మేము కంట్రోళ్లకు వ్యతిరేకంగా అఖిలభారత పోరాట దినాన్ని నిర్వహించాం. మేము ప్రారంభించిన కృషికార్ లోక్‌పార్టీకి ఎన్నికల ప్రణాళికల్లో కంట్రోళ్లను ఎత్తివేయడం ఒక ముఖ్య అంశంగా చేర్చాం. మద్రాస్ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు తమంత తాముగా మంత్రి వర్గాన్ని ఏర్పాటుచేసుకునేందుకు తగినంత బలంలేదు. కంట్రోళ్లు కనీసం ఆహార ధాన్యాల మీదన్నా ఎత్తివేస్తామంటే మేము మద్దతిస్తామని చెప్పాం. మా ప్రజల అదృష్టంకొద్దీ సి.రాజగోపాలాచారి ప్రీమియర్ (అప్పట్లో రాష్ట్ర ముఖ్యమంత్రిని ప్రీమియర్ అనేవారు) అయ్యారు. ఆయన అధికారంలోకి వచ్చిన ఆరు మాసాలకే కంట్రోళ్లు ఎత్తివేశారు. కేంద్రంలో అప్పటి ఆహార వ్యవసాయ శాఖామాత్యులు **రఫీ అహ్మద్ కిద్వాయ్** గారు కంట్రోళ్లని దేశమంతటా లేకుండా చేశారు.

ఆహార మంత్రిత్వ శాఖలోని నిపుణుల భయాలన్నీ పటాపంచలయ్యాయి. ధరలు పెరగడానికి బదులుగా బహిరంగ విపణి స్థాయిలోనే నిలిచిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే తగ్గుముఖం కూడా పట్టాయి. పల్లెలు, పట్టణాలు అవినీతి అధికారుల సంకెళ్ల నుండి బయటపడ్డాయి. సరసమైన ధరలకు తిరిగి హోటళ్ల వాళ్లు, గృహ యజమానులు ప్రతి పట్టణంలోనూ విరగని బియ్యాన్ని, గోధుమలను పొందగలుగుతున్నారు. అంతకు మించి రైతుల ఆనందం పట్టలేనిదైంది. ఇహ వాళ్లు క్రయ విక్రయాలవంటి లావాదేవీల్లో నల్లబజారు వాళ్లు అనే నింద మోయాల్సిన పనిలేదు. రైతు లోకంలో దాన్ని నేనొక ఘన విజయంగా భావించాను. ఇదంతా ఇంత వివరంగా ఎందుకు రాయాల్సి వచ్చిందంటే 1943-53 మధ్యకాలంలో కంట్రోళ్ల మూలాన ఎంతగా ఇబ్బందులకు గురైందీ, అవమానాల పాలైందీ, రైతుల, ఇతర వృత్తులవారి ఉద్యమాల ద్వారా ఆర్థిక అణచివేతను ఎదుర్కోగలిగామో ఈ తరంవారు, రానున్న తరాలవారూ తెలుసుకోవాలనే.

చీటికీ మాటికీ ఏ ప్రభుత్వమైనా ఎలా నియంత్రణ విధించే ప్రమాదముందో తెలియజేసేందుకే. కనుక ప్రజలు జాగరూకులై ఉండి సోవియట్ విధానాన్ని మన దేశంలో ప్రవేశపెట్టకుండా స్వేచ్ఛా పోరాటానికి పూనుకోవాల్సి ఉంది. 1964 నుండి తిరిగి ప్రవేశపెట్టిన కంట్రోళ్లను మేము మళ్లీ ప్రతిఘటించసాగాం.

కంట్రోళ్ల రాజ్యంలో చాలా తమాషాలు జరిగేవి. ద్వారాల గుండా, కిటికీల గుండా బియ్యం మూటల్ని రైలులోని అన్ని తరగతుల పెట్టెల్లోకి విసిరేయడం రోజూ సాధారణంగా జరిగే పనే. ఆ హడావుడిలో ప్రయాణీకులు ఒక పక్కకు తప్పుకునేవారు. అంతలో రైలు బయలుదేరేది. మూటలు లోపల వేసినవాళ్లు వేరే పెట్టెల్లో ఎక్కేవాళ్లు. పక్క స్టేషన్లలోవాళ్లు మూటలు భద్రంగా ఉన్నాయో లేదో చూసుకుని పక్క వాళ్లను చూస్తూ ఉండమని కోరేవారు. వాళ్లు చేరాల్సిన స్టేషన్లలో వచ్చి దింపుకునేవారు. జనం కూడా ఆ పేద కూలీలకు రక్షణగా నిలిచేవారు. పలుమార్లు వాళ్లను పట్టుకుని శిక్షించేందుకు కొన్ని స్టేషన్లలో పోలీసులు పొంచి ఉండేవాళ్లు. దొరికినవాళ్లను శిక్షించేవాళ్లు. ఒక్కోసారి పోలీసుల నుండి తప్పించుకుని పారిపోయే మహిళలు, వృద్ధులు, కడుపుతో ఉన్నవారు కిందపడిపోయేవారు. వాళ్ల కూలి, బియ్యం అన్నీ పోతాయనే భయంతో గగ్గోలు పెట్టేవారు. కొన్నిసార్లు ప్రయాణీకులు పోలీసులకు సర్దిచెప్పి ఆ పేదలు చట్టం బారినపడకుండా తప్పించేవారు. ఏదోవిధంగా ఆ పేదవాళ్లు ఆ మూటల్ని ఒక తావు నుండి మరో తావుకు చేర్చి డబ్బు చేసుకునేవారు. వాళ్లను పట్టుకోకుండా వదిలేసినందుకు సంబంధిత అధికారులకు డబ్బులు మామూళ్ల రూపంలో బాగానే ముట్టేవి.

'అధిక ఆహారాన్ని పండించండి' అనే ఉద్యమ ప్రచారం

ప్రభుత్వం చేపట్టిన 'గ్రోమోర్ ఫుడ్' ప్రచారం వల్ల ఆశించినంత కాకపోయినా మంచి ఫలితాలే లభించాయి. నీటిపారుదల సౌకర్యాన్ని పెంచారు. కరవు కాటకాలకు అలా అడ్డుకట్ట వేశారు. రసాయన ఎరువు వాడకం వల్ల వ్యవసాయ ఉత్పత్తులు బాగా పెరిగాయి. నీటి పారుదలకు అధిక సౌకర్యాల వల్ల ధాన్యం వుత్పత్తులు పెరిగాయి. స్వరాజ్ ప్రభుత్వం అన్ని దిక్కుల నుండి ఈ ఉద్యమాన్ని తీవ్రతరం గావించింది. జాతి బాగు కోసం మహాత్మాగాంధీ ఆశీర్వాదాలతో 1942లోనే కిసాన్ సమ్మేళన్ తీసుకున్న చొరవ ఈ విధంగా ఫలవంతమైంది.

వ్యవసాయాన్ని వృద్ధి చేసేందుకు చేపట్టే అత్యంత సమర్థవంతమైన చర్యల్లో ఒకటి

నేల కోతబడకుండా అరికట్టడం. దానికోసం మేము 1937లోనే కృషి చేశాం. స్వరాజ్ ప్రభుత్వం అఖిలభారత భూసంరక్షణ కమిటీని ఏర్పాటుచేసి నిధులను సమకూర్చింది. 1948-51 మధ్యకాలంలో కేంద్ర వ్యవసాయ శాఖామాత్యులు మున్షీగారు అడవుల్ని, భూసారాన్ని కాపాడేందుకు వన మహోత్సవాన్ని ప్రారంభించారు.

ఆహారపు కొరత విషయంలో పెరిగిన అవగాహన, బెంగాల్‌లో మళ్లీ ఆహారపు కొరత ఏర్పడుతుందేమోననే భయం యుద్ధ సమయపు ప్రభుత్వాన్ని నీటిపారుదల సౌకర్యాలను పెంచే విషయంలో తన దృక్పథాన్ని మార్చుకునేటట్లుగా చేసింది. అంతకు పూర్వం ప్రభుత్వం నీటి పథకాల విషయంలో తిరిగి వచ్చే ఆర్థిక వనరుల్ని లెక్కించేది. ఇప్పుడు అలా కాకుండా పంటలను అధికంగా పండించేందుకు ప్రోత్సహించేటట్లుగా చేస్తున్నది. అలా అంతకుపూర్వం ఆర్థికంగా నష్టదాయకమని భావించిన మైనర్, మేజర్ నీటిపారుదల ప్రాజెక్టులు అవి ఎక్కువ పంటలు పండించేందుకు నీరందించేవిగా ఉంటే వాటిని చేపట్టడం జరిగింది. తుంగభద్ర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. రామపాద సాగర్ ప్రాజెక్టు విషయంలో అధ్యయనం ప్రారంభించారు. అలాగే దేశం మొత్తంమీద అనేక నదులపై ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం పూనుకుంది. నాగార్జున సాగర్ నిర్మాణం కోసం మోటూరి సత్యనారాయణ గారు, నేనూ పార్లమెంట్ నుండి - వి.ప్రసాద్, కన్నయ్య, గోపాలకృష్ణయ్య వంటివారు కృష్ణా డెల్టా నుండి నాగార్జున సాగర్ కోసం వుద్యమించాం. 1967లో ఆప్రో ప్రాజెక్ట్ పూర్తయినప్పుడు మా ఆనందానికి అవధుల్లేవు. వేలాది చిన్న చిన్న ఆప్రో ప్రాజెక్టులు దేశమంతా రూపుదాల్చాయి.

కిసాన్ సమ్మేళన్ ప్రాంతీయంగా నీటిపారుదల కమిటీలను ఏర్పాటుచేసింది. అవి నీటిపారుదలతోపాటు మురుగు పోయే కాలువల విషయాన్ని కూడా పర్యవేక్షించేవి. నేను 1926-34 మధ్యకాలంలో పెదవడ్లపూడి కాలువ విషయంలో చేపట్టిన కార్యక్రమాన్ని అన్ని తావుల్లోనూ చేపట్టడం మొదలుపెట్టారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడం కిసాన్ సమ్మేళన్‌కు ఆనందదాయకం.

అయితే అధిక ఆహారాన్ని పండించే విషయంలో కొన్ని అంశాలు మాకు సంతృప్తినివ్వలేదు. బావుల తవ్వకానికి, చెరువుల మరమ్మతులకు ఇచ్చిన రుణాలు సక్రమంగా వినియోగంలోకి రాలేదు. అందుకు రైతులదీ, అధికారులదే బాధ్యత. అప్పుల్లో కొంతభాగాన్ని రైతులు అధికారులకు అర్పించుకోవాల్సి వచ్చింది.

38

ప్రణాళికలు-నేను

1938లో కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రారంభించిన నేషనల్ ప్లానింగ్ కమిటీతో నాకు సంబంధాలున్నాయి. 1947లో మహాత్మాజీ సలహాతో ఏర్పాటుచేసిన తొమ్మిదిమంది కమిటీ సభ్యుల్లో నేనొకణ్ణి. అది ఆర్థిక ప్రణాళికను రచించాల్సి ఉంది. అదే తర్వాత ప్లానింగ్ కమిషన్‌కు స్టాండింగ్ కమిటీగా రూపుదాల్చింది.

ఆ కమిటీ నివేదిక పరిశీలనకు కాంగ్రెస్ ముఖ్యమంత్రులందరినీ (అప్పుడు ముఖ్యమంత్రులందరూ కాంగ్రెస్‌వారే) 1949లో ఢిల్లీలో సమావేశపర్చారు. అది నేషనల్ ప్లానింగ్ కమిషన్ ఏర్పాటును సూచించింది. రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధరలు లభించేటట్లు చూసేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించడం కూడా జరిగింది. మాలో కొందరి సలహా మేరకు అది కంట్రోళ్లను అరికట్టేందుకేననే హెచ్చరికా వినిపించింది. ప్రభుత్వాలు తిరిగి స్వేచ్ఛామయ, ప్రగతిదాయక, సామాజిక, ఆర్థిక విధానాన్ని చేపట్టాలని సూచిం చింది. ఈ విషయంలో నాకు డాక్టర్ పట్టాభి మద్దతు పలికారు.



గుల్జారీలాల్ నందా

ఆ సిఫారసుల కారణంగా అనేక వస్తువులపై విధించిన కంట్రోళ్లను ఎత్తివేశారు. ప్లానింగ్‌కు సంబంధించిన స్థాయీ సంఘం ప్రధాని ఇంట సమావేశమైన సందర్భంగా జరిగిన చర్చల్లో వ్యవసాయానికి సంబంధించి జవహర్‌లాల్‌జీకి నచ్చిన

అంశాలను నందా ప్రతిపాదించ సాగారు. అప్పటివరకూ రైతులు ఏయే పంటలు, ఎన్నెన్ని ఎకరాల్లో వాళ్ల పొలంలో పండించాలి, వాళ్ల కుటుంబ ఉపయోగార్థం ఎంత నిల్వ చేసుకోవాలి? ఎంత అమ్ముకోవాలి? అది ఎవరికి, ఎక్కడ అమ్మాలి అనే విషయాల్లో రైతులకు పూర్తి స్వేచ్ఛ ఉండడం వాళ్లకు ఇష్టమున్నట్లులేదు. దేశ ఉత్పత్తుల్లో దాదాపు సగ భాగమైన వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో ఆర్థిక నియంత్రణ లేకుండా అంత స్వేచ్ఛనివ్వడం వల్ల జాతీయ ప్రణాళికలు ఆర్థిక నియంత్రణలకు లోబడి పకడ్బందీగా రూపొందవనేది ప్రతిపాదించిన వారి అభిప్రాయం. నేను ఆ విషయంలో వారితో ఏకీభవించలేకపోయాను. ప్రధానంగా ప్రోత్సాహకాలు, గిట్టుబాటు ధరలు, మార్కెట్ పోటీల విషయంలో ప్రభుత్వం తక్కువ వడ్డీ రేట్లతో అప్పులు, మేలు రకం విత్తనాలు, పనిముట్లు, ఎరువులు, పురుగు మందులు, పశువుల దాణా, వంటచెరకువంటి వాటిపై వారిని దృష్టి నిలపమన్నాను.

పంటలు పండని సందర్భాల్లో, పశువులకు వ్యాధులు సోకినప్పుడు నియంత్రణల ద్వారా ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతులను ఆదుకోవచ్చు. రైతులే కాదు వ్యవసాయ కూలీలు, కౌలుదార్లు కూడా ఆ పరిధిలోకే వస్తారన్నాను. భూమిపై హక్కు కలిగిన వ్యవసాయదారులను ఎట్టి పరిస్థితుల్లోనూ చిన్నచూపు చూడరాదన్నాను. నందాజీ, జవహర్‌లాల్‌జీల అభిప్రాయం ప్రకారమైతే వ్యవసాయానికి సంబంధించిన అన్ని పనులూ ప్రణాళికా గొడుగు కిందకే తీసుకురావాలని. వాళ్లు ప్రణాళికను సాముదాయికంగా, కుటుంబ ఆధారంగా రచించాలనుకుంటున్నారు. రాష్ట్రం తరఫున గ్రామ మండళ్లు ప్రజల సామాజిక, ఆర్థిక జీవనాన్ని తీర్చిదిద్దుతాయి. అవి భూ వసతి గల, భూ వసతిలేని గ్రామీణులందరి క్షేమాన్ని కాంక్షిస్తాయి. వాస్తవానికి వాళ్లు భూములు ఉన్నవారికీ, లేనివారికీ మధ్య ఉన్న ఆర్థిక వ్యత్యాసాన్ని తొలగించాలని కోరుకుంటున్నారు.

ఈ విషయాలన్నింటిపైనా సుదీర్ఘంగా చర్చ రెండు రోజులపాటు సాగింది. ప్రతి విషయంలో నేనొక్కడినే అంగీకరించనివాడిగా ఒంటరిగా మిగిలిపోతున్నా. మిగతా వాళ్లెవరూ వ్యవసాయదారులుకారు. వాళ్లంతా సోవియట్ తరహా నియంత్రిత ఆర్థిక వ్యవస్థ వైపు బాగా ప్రభావితమైనవారు. అలా నియంత్రిత ఆర్థిక వ్యవస్థకు, స్వయం ఉపాధితో అలరారే రైతుల ఆర్థిక స్వావలంబనకు అనుకూలంగానూ, వ్యతిరేకంగానూ మాట్లాడిన సభ్యులకు, జవహర్‌లాల్‌జీకి మధ్య సంబంధాలు ఎలా ఉండేదీ తేలిపోయింది.

నందా, ఖందూభాయ్ దేశాయ్, సి.డి.దేశ్‌ముఖ్, కేబినెట్‌లోలేని మిగతా సభ్యులు నెహ్రూకు బాగా దగ్గరయ్యారు. నేను నెహ్రూ గారి పదవుల కౌగిలిలో లేను. అందువల్ల తర్వాత పంచవర్ష ప్రణాళికల విషయంలో విమర్శనాత్మకంగా వ్యవహరించగలిగాను. జవహర్‌లాల్ నన్ను రాజీకి అంగీకరించని ఏకైక సభ్య ప్రతిపక్షంగా ఎంచాడు. నేనూ కాంగ్రెస్‌లోనే ఉండి ప్రతిపక్ష పాత్రను ఆనందంగా పోషించసాగాను. ఇది నా పార్లమెంట్ ప్రసంగాల్లో తప్పక ప్రతిఫలించి తీరుతుంది.

నందా కేంద్ర మంత్రిగానేకాక పంచవర్ష ప్రణాళికల ద్వారా సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడంలో కూడా ఒక్కొక్క మెట్టు పైకి ఎక్కసాగాడు. ఆ విధంగా సమిష్టి వ్యవసాయం, సామాజికాభివృద్ధి, పంచాయతీరాజ్, భూపతిపై సీలింగ్‌లు వచ్చాయి. అవన్నీ రైతులు చేపట్టే వ్యవసాయాన్ని తక్కువ అంచనా వేసేందుకు ప్రభుత్వం వాడిన పనిముట్లుగా కనిపించాయి. జమీందార్లకు ఇచ్చినట్లుగానే కొంత నష్టపరిహారాన్ని సీలింగ్‌లో భూములు కోల్పోయిన రైతులకు చెల్లిస్తాం అన్నారు. ఆహార ధాన్యాల వాణిజ్యంలోకి సామాజికీకరణ పద్ధతిని ప్రతిపాదించారు. సహకార సంఘాలపై అదుపు, సహకార బ్యాంకుల డైరెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యం, బియ్యం, పిండి మిల్లుల జాతీయకరణవంటివి రూపుదాల్చాయి. ధాన్యం వ్యాపారంలో అప్పులపై ఆహార ధాన్యాల సరఫరా రాష్ట్రాలకూ రాష్ట్రాలకూ మధ్యే గాక జిల్లాకూ జిల్లాకూ మధ్య బియ్యం, గోధుమల పంపిణీ వంటివి కూడా వాళ్ల నియంత్రణ పథకంలో భాగమయ్యాయి. వీటితో సంతృప్తి చెందక నందాజీ జవహర్‌లాల్ వెంటబడి రాజ్యాంగానికి పదిహేడో సవరణ తెచ్చారు. దీనివల్ల ప్రభుత్వం ఏ రైతు భూమినైనా కొంత నష్టపరిహారం చెల్లించి ప్రజా ప్రయోజనం కోసం పొందవచ్చు. ఆ విధంగా సహకార సేద్యం, సమష్టి సేద్యం పెద్దయెత్తున సాగించవచ్చుననుకున్నారు. రైతులపై అటువంటి విధ్వంసక చర్యలు చేపట్టేందుకు అదనుకోసం చూస్తున్నారు.

ఈ ఇరువురు నాయకులు వీటిని సలహాల రూపంలో గుప్పించింది 1949 నాటి స్థాయీ సంఘ చర్చల్లోనే. ప్రణాళికలు-రైతులు అనే అంశంపై నేను జవహర్‌లాల్‌జీ వాదించుకున్నా తర్వాత తర్వాత మాటల్లో, లేఖల్లో నా వాదనల్లోని వ్యత్యాసం సమసిపోదు. మేము ఒకరికొకరం సంపూర్ణంగా హృదయపూర్వకంగా అవగాహనతో ఉన్నట్లు ఉండేదికాదు.

ప్రణాళికల ప్రారంభం - నా ప్రతిచర్య పరిణామం

ప్రథమ పంచవర్ష ప్రణాళికా నివేదిక ముసాయిదా తయారైంది. అది రైతు వ్యతిరేక విధానాలతో రూపొందిందనే భయాలు సహజమేనని తేలిపోయింది. కనుక 1951లో, 1953లో ఆ నివేదిక చర్చకు వచ్చినప్పుడు నేను నా పార్లమెంట్ ప్రసంగాల్లో ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేయదల్చాను. ప్రభుత్వం గనుక రైతులకు వాళ్ల ఆర్థిక వ్యవస్థను, భూమిపై హక్కును చిన్నాభిన్నం చేయం అనే హామీ ఇవ్వనట్లయితే వాళ్ల తరఫున నేను ప్రణాళికల్లోని ఆ భాగానికి వ్యతిరేకంగా అవిశ్రాంత పోరాటాన్ని చేపట్టేందుకు సిద్ధమవుతాననేది దాని సారాంశం. నా హెచ్చరికలన్నీ నిష్ఫలమయ్యాయి. ప్రభుత్వం తన రైతు వ్యతిరేక విధానాన్ని కొనసాగిస్తూనే ఉంది. అందువల్లనే 1953లో ఎఐసిసికి అదనపు హెచ్చరికను బల్వంతరాయ్ మెహతాకు పంపిన సమాధానంలో జోప్యించాను. ఇదంతా 1959లో నేను ప్రచురించిన చిన్న పుస్తకం 'వై రంగా రిజైన్స్ ఫ్రమ్ ది కాంగ్రెస్' (రంగా కాంగ్రెస్‌ను వీడిందెందుకు?)లో వివరించడం జరిగింది. ప్రభుత్వం ప్రణాళికలోని ఇతర అంశాల విషయంలో ప్రజాభిప్రాయాన్ని అనుకూలంగా కూడగట్టాల్సి ఉన్న కారణంగా తొలి పంచవర్ష ప్రణాళికలో రైతు ఆర్థిక వ్యవస్థను క్షీణింపజేసేందుకుగానీ, తగ్గించేందుకుగానీ పటిష్టమైన చర్యలేమీ తీసుకోలేదు. అయితే రైతుకు భూమిపై హక్కు విషయంలో వినోబాభావే కలిగించిన నష్టాన్ని చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను. భూమిపై హక్కు పాపం అన్నాడాయన. ఇంకేం ఆయన అనుయాయులకు భూదాన్ ప్రచారం కోసం ఆర్థిక సాయం లభించసాగింది. భూదాన్ ప్రచారం వల్ల రైతుల్లో భూమి పట్ల గల ప్రీతి సన్నగిల్లుతుందని నెహ్రూ భావించాడు.

ద్వితీయ పంచవర్ష ప్రణాళిక రచన మరింత సాహసోపేతంగా సాగింది. రైతుల పట్ల వివక్ష మరింత బాహాటంగా సాగింది. రైతు ఆర్థిక విధానం స్థానంలో సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. పట్టణాల్లో వివిధ వృత్తుల వారి ఆదాయాలకు విధించని సీలింగ్ రైతుల ఆదాయానికి విధించారు. నెలకు 300 రూపాయలుగా నిర్ణయించారు. అది ఏకపక్ష నిర్ణయమని నేను తిరగబడ్డాను. అప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన మూల ఆదాయ పరిమితి (100 రూపాయలు)కి మూడు రెట్ల నుండి ఆరు రెట్లకు మించి ఉండరాదనే ఆంక్షను విధించారు. ముస్సోరీలో రాష్ట్రాల సహకార శాఖామాత్యుల సదస్సు నిర్వహించారు. రైతుల స్వేచ్ఛను పోగొట్టి సహకార వ్యవసాయాన్ని

చేపట్టాలనే నందాజీ ఉబలాటంపై సవాల్ విసిరాను. ఆర్.కె.పాటిల్ నాయకత్వాన చైనా వెళ్లే ప్రతినిధి వర్గంలో నన్నూ చేర్చమన్నాను. చివరకు నేను సహకార వ్యవసాయం విషయంలో ప్రయోగాలు చేసేందుకు అంగీకరించాను. అనేక విధాలైన వ్యవసాయక ఆర్థిక వ్యవస్థల్లో అదీ ఒకటిగా ఉండేందుకు అభ్యంతరం లేదన్నాను. సరే, ప్రభుత్వం తమకు కావాల్సిన వాళ్లను చైనా పర్యటనకు ప్రతినిధులుగా పంపుకుంది. వాళ్లంతా కలసికట్టుగా ఒకే అభిప్రాయాన్ని తమ నివేదికలో వెలువరించలేకపోయారు. సహకార వ్యవసాయాన్ని కాదనేవారూ లేకపోలేదు. అయితే వాళ్ల బలం తక్కువుగా ఉంది. ఈ దశలో పరిశోధనల్లో దిట్ట పి.ఆర్.పరుచూరి నాకు సహచరునిగా లభించాడు. మేమిద్దరం కలసి సమగ్రంగా, శాస్త్రీయంగా ద్వితీయ పంచవర్ష ప్రణాళికను విశ్లేషించాం. దాని ఫలితంగానే ప్రణాళికలోని రైతు వినాశక, పట్టణ ప్రోత్సాహక ధోరణితో సాగిన ప్రభుత్వ పక్షపాతాన్ని 'ది ప్లాన్ అండ్ ది పెజెంట్' (ప్రణాళికలు-రైతులు) అనే చిరుపొత్తంలో దుయ్యబట్టాం.

ఐఎఫ్ఏపి, ఐపియులు మా విశ్లేషణను మెచ్చుకుని అందులోని కొన్ని భాగాలను వాళ్ల పత్రికల్లో ప్రచురించుకున్నాయి. లోహియా కూడా మా విమర్శను స్వాగతించాడు. కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖామాత్యుడు మాత్రం రైతులకు వ్యతిరేకంగా ప్రణాళికా ఉద్దేశాలు ఉన్నాయనే మా హెచ్చరికల్ని ప్రతిధ్వనింప జేయడంలో ఇరుకునపడ్డాడు.

1952 నుండి ఎక్కడ సందర్భం లభించినా పంచవర్ష ప్రణాళికల పునాదుల్ని పార్లమెంట్‌లో ప్రశ్నల రూపంలో కదిలించడానికి పూనుకునేవాణ్ణి. అందులో పల్లె ప్రజల బతుకులు తలుక్కుమనేవి. పార్లమెంట్ లోపలా, బయటా భారత కిసాన్ సమ్మేళనం ఈ కోణం నుండి ప్రణాళికలపై నిరసనలను శక్తిమంతంగా గుప్పించేది.

దేశ వ్యాప్తంగా వేదికల మీద, పత్రికల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో, పార్లమెంట్‌లో కూడా ప్రణాళికలకు అనుకూలంగా ప్రచారం హోరెత్తసాగింది. జవహర్‌లాల్‌జీ, ఆయన మంత్రులు, అధికారులు నిరంతరం చేస్తున్న ప్రణాళికా జపం ప్రజల్ని ఉద్ధరించేందుకు తగిన మాంత్రిక శక్తుల్ని అంకిత భావంతో సమకూర్చుకుంటున్నదేమోనని భ్రాంతిని కలుగజేసేది. వారు కోరుకునేది కాంగ్రెస్ ద్వారా లభిస్తున్నందుకు కమ్యూనిస్ట్‌లకు, మార్క్సువాద సోషలిస్ట్‌లకు ఆనందాన్నివ్వడం సహజమే. వినోబాజీ, ఆయన కార్యకర్తలు చేసే విజ్ఞప్తులు కొంత మతపరంగా ఉండి ప్రజలను ప్రణాళికాబద్ధంగావించి వాళ్ల కమతాలపై వాళ్లకు విరక్తి కలిగేలా చేయడం

కూడా ప్రభుత్వ ప్రచారంలో భాగమైంది. అటువంటప్పుడు సొంత పత్రిక లేకుండా, నిధులేమీ లేకుండా రైతు ఆర్థిక విధానానికి మద్దతు పలుకుతూ రైతులకు వ్యతిరేకంగా ఉన్న ఈ ప్రణాళికకు గల నైతిక సమర్థనలను తిప్పికొట్టడం కిసాన్ సమ్మేళన్‌కు ఎంత కష్టమో ఎవరైనా ఊహించగలరు. పైగా అన్ని పార్టీలకు చెందిన అందరు నాయకులూ వినోబా విజ్ఞప్తిని తమకు అనుకూలంగా మలచుకుని రైతుల భూములన్నీ గ్రామ పంచాయతీలకు అప్పగించేటట్లు చేశారు. 1957 అక్టోబర్‌లో మచిలీపట్నంలో నేనీ గ్రామదానం కొనసాగితే మిన్నకుండననీ రైతు సత్యాగ్రహాలకి ఉపక్రమించాల్సి వస్తుందనీ హెచ్చరించాను.

కొందరు కాంగ్రెస్ నాయకులు నేను వాళ్లకు వ్యతిరేకంగా ఏదో కొత్త వుద్యమం ప్రారంభించేందుకు భయపెడుతున్నానని భావించి సంస్థాగత క్రమశిక్షణ పేరిట దుడ్డుకర్రలతో ధ్వజమెత్తారు. వాళ్లు అదంతా పొరపాటుగా ఊహించారు. నేను ప్రవర్తించిన తీరు కొత్తదేం కాదు. నేను రైతుల పక్షాన, వాళ్ల కుటుంబ ఆర్థిక స్వస్థత కోసం కృషి చేసే విషయం 1948-49 నుండి జవహర్‌లాల్‌జీకి తెలుసు. అయితే 1957 ఆగస్ట్‌లో ఎల్వాల్ సదస్సు వినోబాజీ ఏర్పాటుచేయడం దానికి కమ్యూనిస్ట్‌లు, సోషలిస్ట్‌లు జయప్రకాశ్‌జీ, కాంగ్రెస్‌వారు, జవహర్‌లాల్‌జీ నాటకీయ పద్ధతిలో హాజరయ్యారు. మద్దతు పలికారు. అందువల్ల నా దశాబ్దకాలపు ఉద్యమానికి నేను కొత్త ఊపునిచ్చాను.

ఈ విధంగా సమష్టి సహకార వ్యవసాయ క్షేత్రాల్లో తాను యజమాని అయిన తన భూమిలో బానిసగా బతకాల్సి వచ్చే విషయం నుండి రైతుల్ని ఎలా బయట పడేయడమా అని ఇన్నాళ్లుగా నేను ఆందోళన చెందుతూనే ఉన్నా. గతంలో జమీందారుల అణచివేత విధానాలకు వ్యతిరేకంగా పోరాటం కొంత తేలిగ్గానే కనిపించేది. అయితే ఇప్పుడు రైతుల్ని వాళ్ల హక్కుల కోసం చైతన్యపర్చడం, జాగరూకత వహించమని హెచ్చరించడం, వ్యవస్థీకృతం గావించడం, ప్రోత్సహించడం ఎంతో కష్టమైంది. ముసుగులో గుద్దులాటలా సోషలిస్ట్ ప్రణాళిక ఉంది. జాతీయ ప్రణాళిక ఎంతగానో బుజ్జగింపుల్ని, ముసుగు నృత్యాల్ని ప్రదర్శించడమే అందుకు కారణంగా కనిపిస్తోంది. మరీ ముఖ్యంగా కమ్యూనిస్ట్‌లు, సోషలిస్ట్‌లూ ఒక్కటైపోయి దాన్ని ప్రగతిదాయక ప్రణాళికగా అభివర్ణించి కాదన్నవారిని తిరుగుబాటుదారునిగా, ప్రణాళికా వ్యతిరేకిగా ముద్రవేయబూనడం దాన్ని పరాకాష్టకు చేర్చింది. అయినాసరే నేను ఈ బాధ్యతను

భుజానికెత్తుకోవాల్సి వచ్చింది. కనుక ఈ అధ్యయనాలు, రచనల సింహ భాగం ప్రణాళిక కారణంగా రైతుల ఇక్కట్లను వివరించే దిశగా సాగింది. అందువల్లనే రైతు విద్యాలయం ఆ సమయంలో నేను రాసిన ఈ పుస్తకాలను ప్రచురించడం జరిగింది. 1. ది క్రెడో ఆఫ్ వరల్డ్ పెజెంట్రీ (ప్రపంచ రైతుల లక్ష్యం) 2. ది ప్లాన్ అండ్ ది పెజెంట్ (ప్రణాళిక-రైతు) 3. పంచాయత్ ల్యాండ్ లార్డిజమ్ అండ్ పెజెంట్ ఎకానమీ (పంచాయతీల భూస్వామ్యం-రైతుల ఆర్థిక వ్యవస్థ) 4. కోఆపరేటివ్ ఫార్మింగ్ అండ్ ది పెజెంట్ (సహకార వ్యవసాయం-రైతులు) 5. స్టార్మ్ బరస్ట్ ఓవర్ పెజెంట్ (రైతుపై విరుచుకుపడ్డ పెను తుపాను) 6. సెల్ఫ్ ఎంప్లాయిడ్ సెక్టార్ (స్వయంఉపాధి కల్పనా రంగం).

తొలి పుస్తకం తయారీకి నేను రష్యా నుండి తిరిగి వచ్చిన తర్వాత ఒక సంవత్సరకాలం పట్టింది. దాన్ని అంత పకడ్బందీగా తయారుచేయాల్సి వచ్చింది. అది రైతులకు అందివచ్చిన శక్తిమంతమైన శాస్త్రీయ సిద్ధాంతంగా విమర్శకులు పేర్కొనడం ఆనందదాయకం. ఇటువంటి సాహిత్యం రానున్న ఎన్నో తరాల రైతులకు, ప్రజాస్వామ్యవాదులకు మార్గదర్శనం గావించగలదని భావిస్తున్నా.

రైతులు మన దేశం కూడా ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలని కాంక్షిస్తున్నారు. కనుక 1954లో కిసాన్ సమ్మేళన్ ఒక ప్రత్యేక రైలులో దేశంలోని జాతీయ ప్రాజెక్టులను రైతులకు చూపించడానికి ఏర్పాటుచేసింది. అందుకు ఎం.పి. రమణ, అనకాపల్లికి చెందిన రామానాయుడు అభినందనీయులు. ఇక్కడ వీరాచారి, ఇతర రైతు ప్రచారకులు రంగా కిసాన్ స్పెషల్స్ పేరుతో దాదాపు పది ప్రత్యేక రైళ్లను రైతు యాత్రల కోసం నిర్వహించారు. అవి ప్రతి సంవత్సరం ఉత్తర, పశ్చిమ హిందూ దేశాన్ని 1956-64 మధ్యకాలంలో చుట్టివచ్చేవి. 1959లో దక్షిణభారతదేశంలోని విద్యుత్ ఉత్పత్తి, నీటిపారుదల, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రదేశాలను పర్యటించేందుకు ఒక ప్రత్యేక రైలును నిర్వహించడం జరిగింది. వీటి విషయంలో అందరి మాదిరిగాగాని రైతులకు ప్రత్యేక రాయితీలేమీ ఇవ్వలేదు. అప్పటినుండి ఇతర రాష్ట్రాల్లో కూడా ప్రత్యేక కిసాన్ రైళ్లు నడిచాయి. విదేశాల నుండి కూడా ఆర్థిక సహకారం లభించి భారతదేశం ఆర్థికంగా సుస్థిరత్వాన్ని సాధించాలని కిసాన్ సమ్మేళనం కోరుకుంది. అయితే చిత్రమేమంటే కాంగ్రెస్, మరికొన్ని రాజకీయ పార్టీలు కిసాన్ సమ్మేళనమనేది భారతదేశపు ప్రణాళికాబద్ధమైన ప్రగతికి వ్యతిరేకమని దుమ్మెత్తిపోశాయి.

నాకుగా నేను ఓపిగ్గా జవహర్‌లాల్‌జీకి, కాంగ్రెస్ నాయకత్వానికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో నిలబడడం ఎంతవరకు సాధ్యపడుతుందని ఆలోచించసాగాను. జవహర్‌లాల్‌జీని, ఆయన గ్రామ దాన ఉద్యమం, సహకార వ్యవసాయం వంటి ఆకర్షణీయ పథకాలను తట్టుకుని నిలవడం చాలా కష్టమైన పనే. అసలు కాంగ్రెస్‌కు ఎదురు నిలవడమే మానవ శక్తికి మించిన పని. కాంగ్రెస్‌ను, జవహర్‌లాల్‌జీని విడగొట్టి చూడమని కాంగ్రెస్‌వాదులకు చెప్పడం ఎవరితరమూ కాదు. అయినా జవహర్‌లాల్‌జీని వ్యతిరేకిస్తూ నేను కాంగ్రెస్‌లో ఉండి పనిచేయదల్చాను. అయితే ఇటువంటిది యునైటెడ్ కింగ్‌డమ్‌లో సాధ్యపడింది. అనూరిన్ బెవాన్ గైట్‌స్కెల్ విధానాలను వ్యతిరేకించిన సందర్భంలో అది అలా సాధ్యపడింది. భారతదేశంలో అలా కుదరదు. నేను సహకార వ్యవసాయాన్ని వ్యతిరేకించాలంటే జవహర్‌లాల్‌జీని వ్యతిరేకించి తీరాల్సిందే. నేను జవహర్ లాల్‌జీతో విభేదించి ఆయన అధికారానికి ఎదురుతిరిగితే కాంగ్రెస్ నాపై కన్నెర్రజేస్తుంది. మరి ఇలా ఊపిరిసలపనివ్వని రాజకీయ శక్తుల్ని ఎదిరించడం నాకు సాధ్యపడుతుందా?

అయితే మరో ఆశ నాలో తళుక్కుమంది. కాంగ్రెస్ కారణంగా మన సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో పెరుగుతూ పోయే దుర్మార్గాలు నావంటి వాళ్లను కాంగ్రెస్‌పై ఎదురుతిరిగేటట్లు చేస్తాయి. అయితే భారతీయ రాజకీయవేత్తలకు, ప్రజలకు మన ప్రణాళికలు రూపొందించే వారి ఎత్తుగడలను చిత్తుచేసేందుకు, నెహ్రూ విధానాలపై తిరుగుబాటు చేసేందుకు ఇంతకాలం ఎందుకు పట్టిందని ఆశ్చర్యం కలుగకమానదు. నలభై సంవత్సరాలుగా గాంధీ బోధనలు కొనసాగుతున్నా మన రాజకీయ నాయకులు స్వాతంత్ర్యం వచ్చీరాగానే ఆర్థిక ప్రగతి కోసం మన దారుల్ని మనం వెతుక్కోకుండా పశ్చిమ దేశాల వైపు చూడనారంభించారు.

భారతదేశం స్వాతంత్ర్య సముపార్జన తర్వాత తొలి నాలుగేళ్లలో బ్రిటిష్ లేబర్ పార్టీ ప్రభుత్వం బాగా మెజార్టీ సాధించిందనే విషయాన్ని, భారతదేశంలో మాలాంటి వాళ్లు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ఉన్నారని, అలాగే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీలో అధిక సంఖ్యలో ఉన్నారని, మేమంతా చాలాకాలంగా సోషలిస్ట్‌లుగా కొనసాగుతున్నామనే విషయాన్ని ప్రత్యేకించి గుర్తుపెట్టుకోవాలి. కాంగ్రెస్ మంత్రివర్గం భారతదేశ ఆర్థిక వ్యవస్థను సోషలిస్ట్ పంథాలో అభివృద్ధిపర్చేందుకు ఆత్రుత పడుతున్నదనే విషయాన్ని చూసి ఎవరూ ఆశ్చర్యచకితులు కానక్కర్లేదు.

హడావుడిగా జమీందారీ, జాగీర్దారీ వ్యవస్థలు రద్దయి లక్షలమంది రైతులు తాము సాగుచేసుకునే భూమికి హక్కుదారులయ్యారు. వాణిజ్యం రాజ్యాంగపరమై అభివృద్ధిని సాధించాలనే దృక్పథంపై దృష్టి పెట్టారు. చిన్న కర్మాగారం నుండి చిత్తరంజన్ రైలింజన్ల కర్మాగారాల వరకూ, హిందూస్థాన్ మెషీన్ టూల్స్ నుండి ఇండియన్ టెలిఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీస్, హిందూస్థాన్ షిప్ బిల్డింగ్ నుండి ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ వరకూ అన్నీ ప్రభుత్వ అజమాయిషీలో ఉండాలని భావించారు. అటువంటి కోరికలన్నీ కలసి ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను, జీవిత భీమా సంస్థను జాతీయం చేసే వరకూ వ్యవహారాన్ని సాగదీశాయి.

అయితే కంట్రోళ్ల రాజ్యం సాధారణ పరిపాలనలో రైల్వేలోని అసమర్థతను, అవినీతిని పట్టి చూపింది. కాంగ్రెస్ నాయకుల పరిపాలనపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లింది. రాజ్యం తన పాలన ద్వారా ఊహించని ఫలితాలను రాబట్టగలదనే విశ్వాసానికి ప్రజలు దూరం కాసాగారు. అందుకు ఎల్ఐసి, ముంద్రా ఒప్పందాలు, జీపుల, ఎరువుల, ట్రాక్టర్ల, బహుళార్ధ సాధక ప్రాజెక్టుల ఉదంతాలు సాక్ష్యాలుగా నిలిచి ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేశాయి.

కేంద్ర, రాష్ట్ర మంత్రులు పార్టీపరంగా, వ్యక్తిగతంగా ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగపర్చడం, పార్టీలో గ్రూపు తగాదాలు చూసిన తర్వాత గ్రామ పంచాయతీల పట్ల ప్రజలు విశ్వాసాన్ని కోల్పోసాగారు; అది కూడా మరీ ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వపు సాంఘిక సంక్షేమ శాఖలు నిధులతో పొంగిపొర్లుతున్న తరుణంలో.

సిగ్గూ ఎగ్గూ లేకుండా ప్రభుత్వ అధికారాన్ని, న్యాయ వ్యవస్థను కూడా నీతిమంతంగా ఉండనివ్వక ఉద్యోగాల్లో రాజకీయ గురువుల అభ్యర్థుల్నే ఎంపిక చేస్తూ ప్రభుత్వేతర ప్రయోజనాలకు, రాజకీయ లబ్ధికి ప్రభుత్వ నిధులను వుపయోగిస్తూ, నిధులను వృధా చేస్తూ ఉద్యోగుల్ని ఇబ్బడిముబ్బడిగా ప్రభుత్వ సంస్థల్లో నియమించసాగారు.

మంత్రి వర్గ ముఠాకు వ్యతిరేకంగా కృషికార్ లోక్‌పార్టీ ప్రజలకు ఇచ్చిన శక్తిమంతమైన హామీ ఏమంటే –ఈ అసమర్థ, అధిక సంఖ్యాక, అతి ప్రియమైన. అవినీతిమయమైన పాలనా యంత్రాంగాన్ని శుద్ధిచేస్తామని.

యుద్ధ సమయంలోనూ, యుద్ధానంతరం ప్రబలిన ద్రవ్యోల్బణం కారణంగా సమస్త వినిమయ వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. ఎక్సైజ్ సుంకాలు కూడా తడిసి మోపెడయ్యాయి. వీటన్నింటినీ భరించేది ఎక్కువగా మధ్యతరగతి, పేద వర్గాల ప్రజలే.

రైలు ప్రయాణమూ భారంగానే మారింది. రానున్న రోజుల్లో జాతీయం గావించబడిన రోడ్డు రవాణా సేవలు కూడా అధిక రాబడినే అందిస్తాయి. మరి ఇంత ఎక్కువగా పన్నులు వేసి రాబట్టిన రాబడిని ఏంచేస్తున్నారు? పెంచి పోషించే సివిల్ ఉద్యోగుల జీతభత్యాలు అనేక రెట్లు పెరిగాయి. వేతన సంఘాల సిఫారసులు ఉండనే ఉంటాయి. ఇటువంటి బరువు బాధ్యతల నుండి విముక్తి కోసం మధ్య తరగతి ప్రజలు, శ్రామికులు గగ్గోలు పెడుతున్నారు. చదువుకున్న యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని విఫలయత్నం జరుగుతూనే ఉంది. అయితే వేసే ఉద్యోగాలు ప్రభుత్వ అవసరాలకు మించి వుంటున్నాయి. కొత్తగా విధించే పన్నులు అటు వారి జీతాలకు కూడా చాలడంలేదని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆర్థిక అంశాల కమిటీయే అంగీకరించింది. తలాతోకాలేని సంస్కరణలను ప్రవేశపెట్టి రైతులికి, చేతివృత్తుల పనివారికి వాళ్లు మిగుల్చుకున్న దానితోపాటుగా అప్పోసప్పో చేసి తెచ్చుకున్న డబ్బుతో ఉత్పత్తిని పెంచుకునేటట్లుగా ప్రభుత్వం అవకాశాలు కల్పించడంలేదు.

సీలింగ్‌ల వల్ల భూమి ముక్కలుచెక్కలైంది. వ్యవసాయంపై పెట్టుబడులు సన్నగిల్లాయి. సహకార రంగానికి వెలుపల ఉన్న వృత్తిదారులకు ప్రభుత్వ సాయం అందకపోవడంతో చేనేతబోర్డు వారికి శత్రువుగా మారింది. సరికొత్త ఆఫర్లు, రాయితీలు సహకార వ్యవసాయానికి సమకూర్చుతున్నందువల్ల మిగతా రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలను కల్పవృక్షాలుగా, కామధేనువులుగా ఎంతమాత్రం చూడలేకపోతున్నారు. అవి వాళ్ల స్వయం ఉపాధికి, ఆత్మగౌరవానికీ అందివచ్చేటట్లుగా కనిపించలేదు. నెహ్రూ ప్రభుత్వం వల్ల, ఇటువంటి ప్రణాళికల వల్ల జాతి స్వచ్ఛంద కృషిలో, స్వయం సమృద్ధిలో, అభివృద్ధిలో ఎంతగా నష్టపోయిందో ఎవరైనా లెక్కగట్టగలరా? వాళ్లు కలిగించిన నష్టంలో పదిశాతమైనా పూడేందుకు కూడా ప్రణాళికల మొత్తం కేటాయింపులు చాలవు. మొత్తం ప్రణాళికా విధానంలో కాంగ్రెస్ నవీనీకరణకు పూనుకోక తప్పదు.

ఇటువంటి అనేకానేక కాంగ్రెస్ మంత్రుల వైఫల్యాల వల్ల, వాళ్ల విధానాల్లోని వైరుధ్యాల వల్ల ఎంత కష్టమైనా మనం సాధించలేనిది ఏదీ ఉండదని అనిపించింది. తిరిగి కాంగ్రెస్‌లోకి ధైర్యపు రక్తాన్ని ఎక్కించాలి. దాని రక్షణ కవచాన్ని విసిరిపారేయాలి. కేవలం సహకార వ్యవసాయంపైనేగాక మొత్తం కాంగ్రెస్ నాయకత్వ వ్యవహారాలపై, విధానాలపై, కార్యక్రమాలపై, మంత్రి మార్కు రాజకీయాలపై దండెత్తాల్సి ఉంది.

39

ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ - చేతివృత్తులవారు (1943-65)

మేమింకా జైళ్లలోనే ఉన్నాం. బొంబాయి పది వేల కోట్ల ప్రణాళిక యుద్ధానంతర కాలంలో భారతీయ ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థగా రూపొందేందుకు పురిటినొప్పులు పడుతున్నది. అదొక అత్యాశా విధానం. అది జాతీయ ప్లానింగ్ కమిటీ విధానానికి అనుగుణంగా ఉంది.

మేము జైలు నుండి విడుదలైన కొద్ది మాసాలకు మే 1945లో భారతీయ వ్యాపారవేత్త బిర్లా విదేశీ సాయం కోసం మహాత్ముని ఆశీర్వాదాలు కోరారు. బాపూ అందుకు అంగీకరించలేదు. మనమింకా పూర్తి స్వాతంత్ర్యాన్ని సాధించలేదు కనుక అటువంటి పనులు భారతీయ బానిసత్వాన్ని దృఢపర్చే అవకాశం వుంటుందన్నారు.

కే.శే. ఎం.ఎన్.రాయ్ 'పీపుల్స్ ప్లాన్' (ప్రజా ప్రణాళిక) సిద్ధం చేయగా బజాజ్

అల్లుడు, వార్ధాలోని కామర్స్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీమన్నారాయణ్ అగర్వాల్ 'గాంధియన్ ప్లాన్' (గాంధీ ప్రణాళిక) తయారు చేశాడు. బొంబాయి ప్రణాళిక కూడా నెహ్రూ ప్రభుత్వం రూపొందించిన ద్వితీయ పంచ వర్ష ప్రణాళిక మాదిరిగానే ప్రధానమైన పరిశ్రమలు, సేవా పరిశ్రమల అభివృద్ధిపై దృష్టిపెట్టి అసలే క్షీణ స్థితిలో ఉన్న వ్యవసాయాన్ని మరింతగా దిగువ స్థాయికి నెట్టివేసింది. అయితే 'ప్రజా ప్రణాళిక', 'గాంధీ ప్రణాళిక' రెండూ కూడా వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి ప్రాముఖ్యాన్ని గుర్తించాయి. మిగతా ఏ రంగం అభివృద్ధి చెందాలన్నా అవే ప్రధాన వనరులని వెల్లడించాయి.

ప్లానింగ్‌మయమైన వాతావరణంలో భారత ప్రభుత్వం ప్రణాళికా మంత్రిత్వ శాఖను నెలకొల్పింది. బొంబాయి ప్రణాళికను రూపొందించినవాడూ, టాటా పరిశ్రమల్లో వాటాదారూ ప్రణాళికా శాఖామాత్యులయ్యారు. రెండు వేల కోట్ల ముసాయిదా ప్రణాళికకు తుది రూపం ఇవ్వాల్సి ఉంది. దానికోసం ఆయన విధానసభ సభ్యులతో అనేక ఉప సంఘాలను నియమించాడు. అటువంటి రెండు ఉపసంఘాలకు నన్ను ఎన్నుకున్నారు.

ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థను కోరుకునే ప్రజా ప్రతినిధుల్లో నేనొకణ్ణి. అది ఎలా ఉండాలనేది 'కిసాన్ స్పీక్స్', 'నేషనల్ ప్లానింగ్ కమిటీ'కి సమర్పించిన నివేదిక, ఇంకా ఇతర రచనల్లో పొందుపర్చాను. గ్రామీణ భారతదేశం విషయంలో ప్రణాళికా బద్ధమైన సామాజిక, ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా అది ముందుకు సాగాలన్నాను. బొంబాయి ప్రణాళికను మరీ పట్టణ ప్రధానంగానూ, పరిశ్రమలకు పెద్దపీట వేసేదిగానూ ఉంది అని విమర్శించేందుకు పూనుకున్నాను. నేను గాంధీ తరహా ప్రణాళికను సమర్థించాను. గత ఇరవై సంవత్సరాలుగా నేను ఆ దిశగానే పయనిస్తున్నాను గనుక అది నాకు సానుకూలమైనదే. భారతదేశపు ఆర్థికాభివృద్ధి, యుగయుగాలుగా దాని సామాజిక ఆర్థిక స్థితి ఎలా తీర్చిదిద్దబడిందో ఆ మార్గంలోనే సాగాలని నేనెంతగానో కోరుకుంటాను. కనుక కుటీర పరిశ్రమలు, మధ్యతరగతి పరిశ్రమలతోపాటు వ్యవసాయాభివృద్ధి వంటి వాటికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని, వాటి పునరావాసం గురించి, ఆధునీకరణ గురించి కూడా ఆలోచించాలని నేనంటాను. అందుకే నేను గాంధీ తరహా ప్రణాళికకు మద్దతు పలుకుతాను.

అయితే మౌలిక పరిశ్రమల అభివృద్ధిని పట్టించుకోనని మాత్రం అనుకోవద్దు.

అయితే వాటికి భారీగా నిధులు అవసరమవుతాయి. యంత్ర పరికరాల నిర్వహణకు నిపుణుల అవసరం ఏర్పడుతుంది. వాటి కోసం మనం విదేశాల వైపు అర్రులు చాచాల్సి వస్తుంది. దాని కోసం మనం సంపూర్ణ స్వరాజ్యాన్ని సాధించి ఇతర దేశాలతో సంప్రదింపులు జరిపే స్థాయి వరకూ వేచి వుండాలంటాను.

ఈలోగా నేను కుటీర పరిశ్రమల కోసం ఒక ప్రత్యేక ఉపసంఘాన్ని నియమించాలని ఒత్తిడి పెంచాను. కొంతకాలం ఆ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చూసుకోవాల్సిన అంశమని దాటవేశారు. అయితే పట్టువీడని నా కృషి వల్ల, కేంద్ర అసెంబ్లీలోని ఇతర సభ్యులు సహకారం అందించిన కారణాన ప్రభుత్వానికి చర్య తీసుకోక తప్పిందికాదు. కేంద్ర ప్రభుత్వం కుటీర పరిశ్రమల విషయంలోనూ, చేనేత పరిశ్రమ విషయంలోనూ కొంత భారాన్ని మోసేందుకు అంగీకరించింది. మిల్లు యజమానులు ఈ విధానానికి తమ అంగీకారాన్ని 1951 తర్వాతనే ప్రకటించారు.

స్వరాజ్యం సిద్ధించిన తర్వాత పరిశ్రమల శాఖామాత్యులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీని కుటీర పరిశ్రమల బోర్డును నియమించమని కోరడం అంత ఇబ్బందికర విషయం కాలేదు. ఆ బోర్డుకు సహాయాన్ని అందించేందుకు చేనేత కమిటీలను నియమించడం జరిగింది. ఆ బోర్డుకు తొలి అధ్యక్షుడిగా నన్ను ఉండమన్నారు. కుటీర పరిశ్రమలన్నీ హస్తకళలతోసహా ఈ బోర్డు పరిధిలోకి వస్తాయి. ప్రణాళికలను సమాయత్తం చేసేవారిని, నమూనాలను రూపకల్పన చేసేవారిని, చేతివృత్తులవారిని, మిగతా సాంకేతిక వర్గాన్ని ఎంపికచేసి అనేక కుటీర పరిశ్రమలను నిర్వహించేందుకు పనికివచ్చేవారిగా తీర్చిదిద్దేందుకు, శిక్షణా సంస్థలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ కుటీర పరిశ్రమల్లో తయారయ్యే సరుకుల్ని కొనేందుకు రక్షణ, ఇతర మంత్రిత్వ శాఖలతో బోర్డు సంప్రదింపులు జరిపింది. నాగపూర్‌కు చెందిన పౌనీకర్‌ను, నన్ను టెక్స్‌టైల్ సలహామండలి సభ్యులుగా నియమించారు. మేము మా కృషి వల్ల కావాల్సినంత దారం నేతపని వారికి చౌకగా ఇప్పించగలిగాం. చేనేత వస్త్రాల ధరలపై బట్టల మిల్లులవారు కంట్రోళ్లు విధించేటట్లు చేసే ప్రయత్నాలను తిప్పికొట్టగలిగాం. చేనేత పరిశ్రమకు జౌళి పరిశ్రమ ద్వారా కొంత ఎక్సైజ్ పన్నును రాబట్టేందుకు కృషి చేశాం. 1951 తర్వాత మిల్లు యజమానులు అందుకు అంగీకరించారు.

మహాత్మాగాంధీ సమక్షంలో 1947 నవంబర్‌లో సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఎకనామిక్ ప్రోగ్రాం కమిటీని నెలకొల్పింది. జవహర్‌లాల్ నెహ్రూ దానికి

తొలి అధ్యక్షులు. అందులో నేనూ ఒక సభ్యుణ్ణి. వ్యవసాయానికి సంబంధించిన సబ్ కమిటీకి నేను కన్వీనర్‌ను. డాక్టర్ జె.సి.కుమారప్ప కన్వీనర్‌గా ఉన్న కుటీర పరిశ్రమల సబ్ కమిటీలో నేను సభ్యుణ్ణి. ఈ రెండు సబ్ కమిటీలు వార్ధాలో సమావేశమయ్యాయి. మా వ్యవసాయ సబ్ కమిటీ ముసాయిదాలో వ్యవసాయదారులకు, ఇతరులకు, ప్రముఖంగా పరిశ్రమల్లోని వారికి, వాణిజ్య రంగంలోని వారికి మధ్య వ్యత్యాసాలు ఎక్కువగా ఉండరాదని పేర్కొన్నాం. అలాగే వ్యవసాయదారులకు, వ్యవసాయ కూలీలకు పూర్తికాలం పని ఉండేటట్లుగా చేయాలని కోరా. కొన్ని మార్పులతో దాన్ని ఆమోదించడం జరిగింది.

కుటీర పరిశ్రమల ఉపసంఘం కూడా శ్రమ ప్రధాన ఉపాధిని కోరుతున్న కారణంగా, కుటీర మధ్యతరగతి పరిశ్రమలు ఆర్థిక స్వేచ్ఛ, వికేంద్రీకరణలకు తగిన ప్రాధాన్యాన్ని ఇస్తున్న కారణంగా వాటిపై ప్రత్యేక దృష్టిని పెట్టాం. వాటికి పెద్దగా పెట్టుబడులు అవసరంలేదు కనుక, అందరికీ ఉపాధిని చూపించగల శక్తి వాటికి ఉంది కనుక వాటి అభివృద్ధిపై దృష్టిని కేంద్రీకరించాం. ఈ రెండు ఉపసంఘాల నివేదికలను ప్రధాన సంఘం ఆమోదించింది.

నేను 1946లో ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ కోపెన్‌హాగన్‌లో ఏర్పాటుచేసిన సదస్సులో పాల్గొని తిరిగి వచ్చిన తర్వాత అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను, మత్స్యకారులను దళారుల బారినుండి కాపాడేందుకు వారి కోసం సహకార సంఘాల ఏర్పాటు గురించి సంప్రదించాను. అదృష్టవశాత్తూ అనేక రాష్ట్ర ప్రభుత్వాలు నా సలహాను పాటించాయి. మత్స్యకారులకు వలలు వగైరా కొనుక్కునేందుకు, చేపలను ఎగుమతి చేసేందుకు కావాల్సిన ఆర్థిక సాయాన్ని అప్పుగా వాళ్ల సహకార



శ్యాం ప్రసాద్ ముఖర్జీ

సంఘాలకు అందించడం జరిగింది.

అఖిలభారత చేనేత కాంగ్రెస్ ద్వారానూ, అసెంబ్లీ ద్వారానూ 1935 నుండి మేమేమి చెబుతూ వస్తున్నామో – ఆర్థిక కార్యాచరణ కమిటీల నివేదికల్లో ఏమేమి సూచిస్తూ వచ్చామో అవన్నీ కూడా కుటీర పరిశ్రమలకు సంబంధించి చివరకూ ప్రథమ, ద్వితీయ, తృతీయ పంచవర్ష ప్రణాళికల్లో పొందుపర్చడం జరిగిందని చెప్పేందుకు సంతృప్తికరంగా ఉంది. యుద్ధానికి ముందు ఈ పరిశ్రమలకు చెందిన నిధి ఐదు లక్షల రూపాయలుంటే ఇప్పుడది పది కోట్ల రూపాయలకు చేరుకుందంటే దాని ప్రగతికి అంతకుమించిన తార్కాణమేముంటుంది? అదంతా జౌళి ఉత్పత్తులపై ప్రత్యేకంగా విధించిన ఎక్సైజ్ సుంకం ద్వారా లభించింది.

1926లో నా ఆక్స్‌ఫర్డ్ రోజులనాటి నుండి కుటీర పరిశ్రమల విషయంలో నా సిద్ధాంత గ్రంథంలో రాసిన దిశలో కొంత అభివృద్ధి కనిపించింది. చేనేత పనివారలను సహకార సంఘాల వైపునకు నడిపించడంలో నా కృషి కొంత వరకూ సఫలీకృత మైంది. తగినన్ని నిధులతో ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఏర్పడింది. హస్తకళల బోర్డు రూపుదిద్దుకుంది.

చిన్న తరహా పరిశ్రమలు తమ ఉత్పత్తుల ద్వారా పెద్ద పరిశ్రమలకు కావాల్సిన విడి సామాగ్రిని అందజేస్తూ ప్రగతిని సాధించ సాగాయి. చేనేత పరిశ్రమకు చెందిన వారు దళారుల బారినుండి రక్షింపబడి సహకార సంఘాల సభ్యులై వాళ్ల స్వావలంబనను ఆస్వాదిస్తూ, ఉత్పత్తిని పెంచుకుంటూ, అధిక ఆర్థిక వనరుల్ని సమకూర్చుకుంటూ మంచి జీవితాన్ని గడిపేందుకు మార్గం సుగమం చేసుకుంటున్నారు. 1948లో కేంద్ర నూనె గింజల కమిటీ ఆవిర్భవించింది. దాని ఉపాధ్యక్షునిగా గ్రామీణ ప్రాంతాల్లో నూనె తీసే పనిలో అభివృద్ధి సాధించేటట్లు చూశాను. ఇరవై లక్షలమంది పనివారికి ఉపాధి లభించింది. నూనె గింజలు కొనేందుకు, సరసమైన ధర వచ్చేంతవరకూ, నూనెను నిల్వ చేసేందుకు, వాటిని విక్రయించేందుకు అవసరమయ్యే నిధులను సమకూర్చడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రస్తుతం (1964 నాటి మాట) ఖాదీ కమీషన్ నిర్వహిస్తున్నది.

40

ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ దిశగా ప్రయాణం ప్రపంచ ప్రజాస్వామ్యంలో భారతదేశ స్థానం

మహాత్మాగాంధీ అంగీకరించి వర్కింగ్ కమిటీ చేపట్టిన ఉత్తమ అంశాల్లో ఒకటి కాంగ్రెస్ కేంద్రంలో, రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన కారణంగా అది ఆర్థిక, సామాజిక అంశాల విషయంలో తన లక్ష్యాలను, ఆశయాలను ప్రకటించడం. అవి తర్వాత సంవత్సరాల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. కొన్ని రోజులపాటు మేము ఆయన సమక్షంలో ఆ విషయాలపై చర్చించాం. ఆ సందర్భంగా ఆయన విమర్శల వల్ల, సలహాల వల్ల, క్రియాశీల మార్గ దర్శనం వల్ల ఎంతగానో లబ్ధి పొందాం. చివరకు ఆశయాలు, లక్ష్యాలపై మేము తీర్మానాన్ని రూపొందించాం. అది కొద్ది సవరణలతో అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఆమోదం పొందింది. కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీకి చెందిన జయప్రకాశ్ నారాయణ్, కమలా దేవి ఛటోపాధ్యాయ చర్చల సందర్భంగా మాతోనే వుండి ఆ తీర్మానానికి తమ ఆమోదాన్ని కూడా తెలియజేశారు. అప్పుడు ఎఐసిసి ఎకనామిక్ ప్రోగ్రాం కమిటీని నియమించింది. ఆ కమిటీకి అధ్యక్షుడు జవహర్‌లాల్.



జె సి కుమారప్ప

బాపూ కోరిక మేరకు నన్ను అందులో సభ్యునిగా చేర్చారు.

ఎకనామిక్ ప్లానింగ్ కమిటీని మూడు ఉపసంఘాలుగా విభజించడం జరిగింది 1. వ్యవసాయం 2. గ్రామీణ కుటీర పరిశ్రమలు 3. వ్యవస్థీకృత పరిశ్రమలు. వాటికి వరసగా నేనూ, డాక్టర్ జె.సి.కుమారప్ప, జి.యల్.నందా కన్వీనర్లుగా ఉన్నాం. కుమారప్ప తాను ఇచ్చిన సలహాపై పట్టుబట్టాడు. అదేమంటే పంటల ప్రణాళికను నియంత్రించుకుంటూ రైతుల్ని బలవంతంగానైనాసరే వాళ్ల వాళ్ల గ్రామాలను స్వయం సమృద్ధం గావించుకునేటట్లు చేయాలని. నేనుగానీ, మా ఉపసంఘంగానీ అందుకు అంగీకరించలేదు. దానికి కారణం రైతులపై అధికారుల జులుం పెరుగుతుందనే భయం వల్లనే. జయప్రకాశ్ నారాయణ్ కూడా ఒకటి రెండు విషయాల్లో తప్ప మిగతావాటికి పూర్తి సమ్మతిని తెలియజేశాడు. జవహర్‌లాల్ అధ్యక్షతన మొత్తం ఎకనామిక్ కమిటీ సమావేశమైనప్పుడు స్వల్ప మార్పులతో ఆ మూడు ఉపసంఘాల నివేదికల్ని ఆమోదించడం జరిగింది. దాన్ని ఎఐసిసి ఒక చిన్న పుస్తకంగా ప్రచురించింది.

అప్పుడు అది జవహర్‌లాల్‌జీ అధ్యక్షతన ఏర్పడిన శక్తిమంతమైన స్థాయీ సంఘం ముందుకు దాని అమలుకై పంపడం జరిగింది. అందులో కూడా నేను సభ్యుణ్ణే. అప్పటికి కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ కాంగ్రెస్‌ను వదలి వెళ్లడంతో వాళ్ల ప్రతినిధి ఎవరూ ఆ ఉపసంఘంలో లేరు. నేనూ, శంకరరావు దేవ్ క్రియాశీల పాత్ర పోషిస్తూ కాంగ్రెస్ ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటుచేయాల్సిందిగా కోరాం. తద్వారా మరింత విస్తృతమైన నివేదిక తయారుకాగలదని, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వాటి అమలు సులభం కాగలదని భావించాం. కేంద్ర ప్రభుత్వం ద్వారా కోరుకున్నంత స్థాయిలో అభివృద్ధి జరగని కారణంగా జవహర్‌లాల్‌జీ కూడా ఈ ప్రతిపాదనను వెనువెంటనే అంగీకరించారు. సర్దార్ పటేల్ మా ప్రతిపాదనల విషయంలో సంశయాత్ముడేకానీ అయితే మమ్మల్ని ఏదైనా ఒక పిడివాద ప్రణాళికకు కట్టుబడి ఉండమని కోరింది లేదు.

జవహర్‌లాల్‌జీ ఇంట 1948 వేసవిలో సమావేశమైన నేషనల్ ప్లానింగ్ కమిటీ సుదీర్ఘ చర్చలు జరిపింది. రిజర్వ్ బ్యాంక్ పూర్వ గవర్నరైన డాక్టర్ సి.డి.దేశ్‌ముఖ్‌ను కూడా మా చర్చల్లో పాల్గొనేందుకు ఆహ్వానించాం.

మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించేందుకు చేపట్టాల్సిన చర్యల విషయంలో

చర్చించే సమయంలో జి.యల్.నందా కాలయాపన యుక్తిగా పంటల నియంత్రణ, సామాజిక-ఆర్థిక స్వయం పోషకత్వాన్ని గ్రామాల వారీగా సాధించడం అనే అంశాన్ని లేవనెత్తాడు. ఆయన అధికోత్పత్తిపై దృష్టి పెట్టాడు. జవహర్‌లాల్‌జీ వ్యవసాయంపై ప్రతి విషయాన్ని ఆ అభిప్రాయానికి ముడిపెట్టి ఆలోచించసాగాడు. రైతులు తమ చిన్న కమతాల ద్వారా వ్యవసాయోత్పత్తికి పెద్దగా తోడ్పడజాలరని కనుక అధికోత్పత్తిని సాధించాలంటే సహకార వ్యవసాయం, కమతాలను సంఘటితపర్చడం ఒక్కటే మార్గమనే నిర్ణయానికి వచ్చారు. సాగుభూమిని సంఘటితపర్చే విషయం నాకూ సమ్మతమే. ప్రతి గ్రామానికీ కాకుండా ఇంకా కొంచెం పెద్ద స్థాయిలో పంటల ప్రణాళికకు నాకు పెద్దగా అభ్యంతరంలేదు. ఇక సహకార వ్యవసాయం విషయంలో పెను అనుమానాలు నాకున్నాయి. వాటిని వ్యక్తపర్చాను.

స్వయం ఉపాధి ద్వారా అనుభవించే ఆర్థిక స్వేచ్ఛ విషయంలో జవహర్‌లాల్‌జీ అసహనాన్ని ఎంతగానో ప్రదర్శించేవాడు. అది ప్రగతిదాయకం కాదనేవాడాయన. ఆయన వైఖరి పట్ల నేను నా వ్యతిరేకతను ప్రకటించేవాణ్ణి. నా పంథా ఆయనకు ఆనందదాయకం కాదనే విషయం నాకు అర్థమైంది. నా కర్షక సిద్ధాంతం ఆయనకు అర్థమయ్యేదికాదు. మిల్లు కార్మికుల ప్రతినిధి నందాజీ చౌకగా కావాల్సినన్ని తిండి గింజలు మిల్లు కార్మికులకు అందజేసేందుకు ఆత్రుత కనబర్చుతూ ఉంటే రైతులు ఏమైపోయినాసరే జవహర్‌లాల్‌జీ నందా కోరేదానికి సరేననేవాడు. ఆ తర్వాత సంవత్సరాల్లో అటువంటిది మరీ ఎక్కువగా చూడాల్సి వచ్చింది. మిగతా సభ్యులు కంట్రోళ్ల వల్ల ఏర్పడిన ఒత్తిడికి సంతృప్తిచెందక తిండి గింజల ధరల్ని ఏదోవిధంగా కిందకు దింపాలని చూసేవారు. నేను గిట్టుబాటు ధరల గురించి మాట్లాడితే అది వాళ్లకు రుచించేది కాదు. వ్యవసాయదారులకు, మిగతా ప్రజలకు మధ్య వ్యత్యాసాన్ని వారసలు పరిగణనలోకి తీసుకునేవారుకాదు. రైతులు ఆర్థిక బానిసత్వానికి దూరంగా అనుభవించే స్వేచ్ఛా జీవనపు సామాజిక విలువలపై నేను దృష్టి పెట్టేవాణ్ణి. అయితే అటువంటి స్వేచ్ఛ సామాజిక ప్రగతిని హరించేదిగా ఉండరాదని ఆయన రుసరుసలాడేవాడు. ఆ కమిటీలోని తొమ్మిదిమంది అగ్ర నాయకుల్లో నేను ఒంటరివాడినని తేలిపోయింది. మన దేశ జనాభాలో పట్టణ వాసులు, పరిశ్రమలకు చెందిన శ్రామికులు 25 శాతం మాత్రమే. మిగతా ఎనిమిదిమందికి ఆ నాల్గింట ఒక వంతు ఉన్న ప్రజల శ్రేయస్సు మాత్రమే పట్టేది.

శ్రీదేవ్, ఆయన సహాయకుడు ప్రొఫెసర్ మిత్రాలు మా పరిశీలన నిమిత్తం మంచి నివేదికల్నే మా ముందుంచారు. జాతీయ ఆర్థిక ప్రణాళికా సదస్సును ఏర్పాటుచేశారు. అందులో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రులు, వర్కింగ్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడే ఆ సదస్సుకు అధ్యక్షత వహించారు. రెండు రోజులపాటు జరిగిన ఆ సదస్సులో ముఖ్యమంత్రుల్లో అత్యధికులు ఆహారం విషయం పట్ల, కంట్రోళ్ల విషయంలో అధిక శ్రద్ధ కనబర్చారు. పరిశ్రమల అభివృద్ధి పట్ల అమితంగా ఉత్సాహాన్ని చూపారుకానీ మిగతా ముఖ్యమైన అంశాలను అంతగా పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలో శాశ్వత ప్రాతిపదికపై జాతీయ ప్రణాళికా సంఘం ఏర్పాటును మేము ప్రతిపాదించగా దాన్ని సభ మొత్తం స్వాగతించింది.

సదస్సు ముగిసిన కొద్దిసేపట్లోనే పండిట్‌జీ ప్రధానిగా నేషనల్ ప్లానింగ్ కమీషన్ ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దానికి ఆయనే ఛైర్మన్. ఆ దశ దాటిన తర్వాత మళ్లీ ఆయన దేవ్‌జీనిగానీ, నన్నుగానీ సంప్రదించిన పాపానపోలేదు. కాంగ్రెస్ ఆ పంథా అనుసరించేందుకు విశేషంగా కృషి చేసింది మేమిద్దరమే. ఇదంతా చూస్తుంటే నేషనల్ ప్లానింగ్ కమిటీ అధ్యక్ష పదవిని సుభాష్‌బాబు నుండి స్వీకరించి ఆ కమిటీలో ఆయనకు స్థానం కల్పించని విషయం గుర్తుకొచ్చింది. అఖిలభారత కిసాన్ సమ్మేళన్‌కుగానీ, రైతు జనావళితో ఏమాత్రం సంబంధం గల వ్యక్తులెవరూ అందులో సభ్యులుగా లేనేలేరు. ఇటువంటి అసంతృప్తికరమైన అంశాన్ని నా పార్లమెంట్ ప్రసంగంలో బాగా దుయ్యబట్టాను. రైతులకు, మిగతా వర్గాలకు మధ్య ఘర్షణ ఏర్పడే సందర్భాల్లో కోట్లాదిమంది రైతుల్ని సంతృప్తికరంగా సంరక్షిస్తూ, ప్రోత్సహిస్తూ వుండాల్సిన బాధ్యత ప్లానింగ్ కమిషన్‌దే కాగలదని పార్లమెంట్‌ను నేను హెచ్చరించాను.

వర్కింగ్ కమిటీలో మా కృషితోపాటు దేవ్, నేనూ కాంగ్రెస్ పార్లమెంటరీ వర్కింగ్ కమిటీ ద్వారా కూడా ఒక ఖచ్చితమైన ఆచరణాత్మక ప్రణాళిక రూపొందేందుకు కృషి చేశాం. నాతోపాటు అనంతశయనం అయ్యంగార్, శంకర్‌రావ్ దేవ్, ఎఐసిసి జనరల్ సెక్రటరీ మరింతగా మద్దతు పలికారు.

నా దృష్టిలో భారతదేశానికి ముఖ్యంగా కావాల్సింది భారతదేశపు అభివృద్ధేకానీ పిడివాదపు రాజ్య సిద్ధాంతం కానేకాదు. ప్రభుత్వ రంగంలోని పరిశ్రమల నిర్వహణ కోసం ప్రత్యేక ఎకనామిక్ సివిల్ సర్వీస్‌ను ఏర్పాటుచేయాలన్నాను. అయ్యంగార్

గాడ్గిల్ గార్లు ఆ అభిప్రాయాల్ని బలపర్చారు. శ్యామ్ ప్రసాద్ గారు తమ అంగీకారాన్ని తెలియజేశారు.

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ రూపొందించిన ముసాయిదాను స్వల్ప మార్పులతో ఆమోదించింది. అప్పుడు దాన్ని ప్రభుత్వం ద్వారా ప్రొవిజనల్ పార్లమెంట్ ముందుంచారు. దానికి పార్లమెంట్ ఆమోదం లభించింది. ఆ విధంగా స్వరాజ్య ప్రభుత్వానికి అది ఆనాటి నుండి జాతీయ పారిశ్రామిక విధానానికి పునాదిగా నిలిచింది. జైపూర్ నాసిక్ సభల్లో దాన్ని నన్ను వివరించమన్నారు. నేను మిశ్రమ ఆర్థిక విధానపు సూత్రాలను వివరించాను. మిశ్రమ ఆర్థిక విధానంపై ఎం.ఆర్.ముసాని అప్పటికే తమ సిద్ధాంత గ్రంథాన్ని ప్రచురించారు.

ఇక్కడ మనం ఒక విషయాన్ని గమనించాల్సి ఉంది. 1957 నాటి ముంద్రా కుంభకోణం సందర్భంగా జవహర్‌లాల్‌జీ ప్రభుత్వం తరపున ఎకనామిక్ సివిల్ సర్వీస్ ఏర్పాటుకు సంసిద్ధతను తెలియజేసినా అటువంటి సివిల్ సర్వీస్‌ను 1967 వరకూ ప్రభుత్వం ఏర్పాటుచేయలేకపోయింది.

జాతీయ పారిశ్రామిక విధానాన్ని అనుసరించి శ్యామ్‌బాబు రాష్ట్ర ప్రభుత్వాలు, శ్రామిక సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కూడిన త్రైపాక్షిక సమావేశాన్ని ఏర్పాటుచేసి రెండేళ్ల శాంతి ఒడంబడికను పారిశ్రామిక రంగంలో నెలకొల్పి ఉత్పత్తిని పెంచేందుకు అంగీకరింపజేశాడు. ఆ జాతీయ స్థాయి సదస్సులో నేను రైతుల ప్రతినిధిగా పాల్గొన్నాను. నేను పరిశ్రమల్లోని శ్రామికులకు ఎంతోకాలంగా మిత్రుణ్ణే కనుక నేను వాళ్ల కరవు భత్యం, బోనస్ వంటివి పెంచేందుకు, పారిశ్రామిక నిర్వహణలో శ్రామికుల భాగస్వామ్యానికి సంపూర్ణ మద్దతు ప్రకటించాను. పరిశ్రమల శాఖామాత్యుడు శ్యామ్ బాబు పిలుపునకు కమ్యూనిస్ట్, సోషలిస్ట్ ప్రతినిధులు కూడా మనస్ఫూర్తిగా సహకారాన్ని అందించే దిశగా స్పందించారు.

అప్పటి కాంగ్రెస్ అధ్యక్షులు రాజన్‌బాబు డాక్టర్ జె.సి.కుమారప్ప అధ్యక్షులుగా వ్యవసాయ సంస్కరణల కమిటీని నియమించారు. నేను దాని సభ్యుల్లో ఒకణ్ణి. ఆ కమిటీ భూ వసతుల గరిష్ట పరిమితులు విధించాలంది. కౌలుదార్లకు రక్షణ కల్పించాలంది. అయితే పూర్వపు మద్రాస్ ముఖ్యమంత్రి ఒ.పి.ఆర్.రెడ్డి, నేనూ కలిసి మైనారిటీ సభ్యుల తరపున ఒక నివేదికను సమర్పించాం. మేము భూగరిష్ట పరిమితి నిర్ణయించిన మూల పరిమితికి ఐదు నుండి పది రెట్లుగా ఉండాలన్నాం. అయితే

మెజారిటీ సభ్యులు మూడు రెట్లకు మించి ఉండరాదన్నారు. అధ్యక్షుడి ప్రవర్తన నాకు బాధ కలిగించింది. ఆ రోజు మేము రెండు పక్షాలం సరిసమానంగా ఉన్నప్పుడు ఐదు రెట్ల గరిష్ట పరిమితికి అంగీకరించిన అధ్యక్షులు తర్వాత రోజు మరో సభ్యుణ్ణి రాకతో వాళ్ల బలం పెరిగింది. దానితో వాళ్లు మూల పరిమితికి మూడు రెట్లకు మించి గరిష్ట పరిమితి ఉండరాదన్నారు. సేవాగ్రామ్ మాకు అటువంటి ప్రవర్తనను ఎన్నడూ నేర్పలేదు. సభ్యుల్లో ఎక్కువమంది సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టేందుకు బలవంతపు చర్యల్ని సైతం ఆహ్వానించారు. అయితే మేము మాత్రం వ్యతిరేకించాం. మేమిద్దరం కోరిందేమంటే ప్రభుత్వం ఆదుకునేందుకు చేపట్టే చర్యలు కౌలుదార్ల ప్రయోజనాలను కాపాడేవిగా ఉండాలన్నాం. వ్యవసాయ ధరలు నష్టాలురాని రీతిలో ఉండేటట్లు చూడాలనే దానికి అందరి సమ్మతి లభించింది. పంటల, పశువుల బీమా విషయంలో తగినంత రుణం, తక్కువ వడ్డీ రేట్లకు భూవసతి ఉన్నా లేకున్నా సేద్యం చేసేవారికి సేవా దృక్పథంతో ఏర్పాటయ్యే సహకార సంఘాల ద్వారా అందించాలనే విషయంలోనూ అందరి సమ్మతి లభించింది. అయినా జాతీయ ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా వ్యవసాయం అభివృద్ధి చెందలేదు.

విదేశీ సాయం స్వీకరించే విషయంలో ప్రధానికి, మాలో కొంతమందికి ఏకాభిప్రాయం కుదరలేదు. భారతదేశం వ్యవసాయపరంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే అది విదేశీ రుణాలు, సాయం లేకుండా సాధ్యపడదని నేనూ, ఎస్.కె.పాటిల్ విశ్వసించాం. నాకు తెలిసిన మేరకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలోకానీ, వర్కింగ్ కమిటీలోగానీ భారతదేశపు ఆర్థిక వ్యవస్థ ఆర్థిక పురోగమనానికి సానుకూలంగా లేదని గ్రహించిన వాళ్లల్లో నేనే ప్రథముణ్ణి. వాటి వివరాలన్నీ నా పరిశోధనాత్మక రచన 'భారతదేశపు విదేశాంగ విధానానికి ప్రాతిపదికలు' అనే దానిలో పొందుపర్చాను. అది 1948-49లో 'ఈస్టరన్ ఎకనామిస్ట్'లో ప్రచురించారు. తర్వాత అది 'టు వర్డ్స్ వరల్డ్ పీస్' (1952-53) (ప్రపంచ శాంతి దిశగా) అనే నా గ్రంథంలో చేర్చడం జరిగింది.

ప్రజాస్వామ్యయుతంగా మనుగడ సాగించే పాశ్చాత్య దేశాలు సరిపడా మనుషులు, సరకులు, ధనంతో త్వరితగతిన ముందుకొచ్చి సహాయం అందించి దేశాన్ని అభివృద్ధి చెందేటట్లు చేయాలని ఆ గ్రంథంలో పేర్కొన్నా. అప్పుడే అది కమ్యూనిజం ఊరింపులకు దూరంగా జరగగలదు. అయితే అది ప్రధాని నెహ్రూకు రుచించలేదు. మార్షల్ పథకం

వల్ల తన విదేశాంగ నీతి శక్తిహీనమవుతుందని భావించాడు. అయితే మేము అందుకు అంగీకరించలేదు. ఒక్క టిబెట్ విషయంలో తప్ప నా పార్లమెంట్ ప్రసంగాల్లో ఆయన విదేశాంగనీతికి మద్దతు పలుకుతూనే వస్తున్నా. అయితే విదేశీ సాయం మనకు వెనువెంటనే అవసరమనీ, అది లేకుండా దేశంలో ఆర్థికాభివృద్ధి ముందుకు సాగదని ఆయన గ్రహించకపోవడం నాకు అసహనంగానే ఉండేది. మా అసహనం చూసి ఆయనకు చిర్రెత్తుకొచ్చేది. నేనొక పర్యాయం అమెరికా పర్యటనకు వెళుతూ ఆయన్ను అడిగాను – అమెరికా రాజకీయవేత్తలకు విదేశీ సాయం ప్రతిపాదనల విషయంలో ఏమి చెప్పాలని? విదేశీ సాయం ఎటువంటి ఆంక్షలతో కూడుకున్నదీ కానట్లయితే భారతదేశం స్వాగతిస్తుందని స్పష్టం చేయమన్నాడు. అటువంటి హామీ ఆయన ఇచ్చినందు వల్లనే నేను భారతదేశానికి అమెరికా సత్వరమే సాయం అందించాలని కోరాను. ఈలోగా ప్రపంచ రాజకీయాల్లో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి.

నేను 1949 జూన్‌లో అమెరికా చేరుకునేటప్పటికి ఆ ప్రభుత్వం, ప్రజలు, పత్రికలు జవహర్‌లాల్‌జీ అమెరికా పర్యటనను త్వరలో చేపట్టనున్న దృష్ట్యా ఎటువంటి ఆర్థిక సాయం భారతదేశానికి అందించాలనే విషయంలో చర్చ జరుగుతోంది. అమెరికాలోని వ్యవసాయ నేతలు, మరీ ముఖ్యంగా జేమ్స్ పాటన్ అప్పుడే కొత్తగా అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన ట్రూమన్‌ను కలసి భారతదేశపు రైతులు, ఇతర ప్రజలు ఎటువంటి నీటిపారుదల సౌకర్యాలను, వరదల నుండి రక్షణను, విద్యుచ్ఛక్తి పథకాల ద్వారా త్వరితగతిన ప్రగతిని సాధించదల్చారో ఆయనకు వివరించమన్నారు. వాళ్లు ఆయన్ను కలిసే ఏర్పాటు చేశారు. మేమిద్దరం ఉభయ దేశాల మధ్య పరస్పర సహకారం, సాయం విషయంలో వున్న అవకాశాల గురించి అరమరికలు లేకుండా మాట్లాడుకున్నాం. భారతదేశం ఏ శిబిరంలో చేరలేదని విని మెచ్చుకున్నారు. 'మా మిత్రులే మీ మిత్రులు కూడా' అంటూ కామన్వెల్త్ ప్రస్తావన తెచ్చారు. నాకు వాళ్ల దేశంలోని శక్తిమంతమైన వ్యవసాయ కార్మిక సంఘాలతో గల సాన్నిహిత్యాన్ని కొనియాడారు. రానున్న కొద్ది మాసాల్లో ప్రధాని తమ పర్యటన సందర్భంగా ఆర్థిక సాయాన్ని పొందేందుకు రంగం సిద్ధమైందనుకున్నాను.

నేను నా సంప్రదింపుల సారాన్ని విజయలక్ష్మీ పండిట్, బి.ఆర్.సేన్‌లకు నివేదిక రూపంలో అందించాను. అప్పుడు సేన్ నాతో అన్నారు: 'మేము గత రెండేళ్లుగా తిప్పలుపడుతున్నా ఫలితం లేకపోయింది. మీరు వారం రోజుల్లోనే ఎంతో

సాధించగలిగారు' అని. నేను ప్రధానికి, అప్పటి ఆర్థిక శాఖామాత్యునికి అమెరికా విశేషాలను వివరంగా రాసి ఇచ్చాను. వాళ్లను కలసి మాట్లాడాను. ప్రధాని అమెరికా యాత్ర సందర్భంగా చాలా లాభం చేకూరుతుందనుకున్నాను. ప్రధాని అమెరికా వెళ్లారు. వైట్ హౌస్‌లో చర్చలు జరిగాయి. అనుకోని విధంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు చప్పబడ్డాయి. ఆ తర్వాత రెండు సంవత్సరాలు భారతదేశ ప్రగతి కుంటినడకగా సాగింది. అమెరికా వారు భారతదేశానికి సహాయాన్ని అందించేందుకు విముఖంగా ఉండడమే అందుకు కారణం. అది నాకు నిరాశాజనకం కావడం సహజమే. నేను ఎంతగానో కుంగిపోయాను.

అది చాలదన్నట్లుగా భారతదేశం తీవ్ర ఆహార సంక్షోభంలో చిక్కుకుంది. తిరిగి విధించిన కంట్రోళ్లు పట్టణాల్లోనివారికి సరిపడేంతగా నిత్యావసర వస్తువులను అందించలేకపోయాయి. ధరలు ఆకాశాన్నంటాయి. అవినీతి పెచ్చరిల్లింది. ఆ స్థితిలో వాషింగ్టన్‌లోని కొందరు సెనేటర్లు ఇరవై లక్షల టన్నుల గోధుమల్ని బహుకరించేందుకు ముందుకొచ్చారు. అయితే కొందరు మాత్రం భారతదేశపు విదేశాంగ విధానం పట్ల నిరసన వ్యక్తంచేశారు. అటువంటి బహుమానాలను ఖండిస్తామని బెదిరించారు. ఆ రెండు ప్రజాస్వామిక దేశాల మధ్య అభిప్రాయ భేదాలు తొలగించాలనే ఉద్దేశ్యంతో పార్లమెంట్‌లో మాలాంటివాళ్లం కొందరం కలసి అమెరికన్ కాంగ్రెస్‌లోని కొందరిని విషయం అర్థంచేసుకోమని కోరాం. భారతదేశంలో విపత్కర పరిస్థితిని అర్థంచేసుకుని పెద్ద మనస్సుతో అమెరికన్లు కొందరు అందించే సాయాన్ని అడ్డుకోవద్దని కోరాం. ఈ విజ్ఞప్తిని మేము అప్పటి ఆహార శాఖామాత్యునికి, విదేశాంగ శాఖ ఉపమంత్రికి చూపాం. ఆ తర్వాతనే మేము దాన్ని అమెరికాకు కేబుల్ ద్వారా పంపాం. హఠాత్తుగా జవహర్‌లాల్‌జీ చిర్రుబుర్రులాడడు అదీ పార్లమెంట్ సాక్షిగా. అది ఇరుదేశాల మధ్య సంబంధాల విషయంలో కల్లోలాన్ని రేపింది. పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మసానీ ప్రధాని లెక్కలేనితనాన్ని, పెత్తనం చెలాయించే తత్వాన్ని దుయ్యబట్టేవరకూ నడిచిందీ వ్యవహారం. ఇక్కడ సర్దార్ పటేల్ చాణక్య నీతిని ప్రదర్శించి వర్కింగ్ కమిటీలో జవహర్‌లాల్‌జీకి, నాకూ మధ్య పొరపొచ్చాలు చర్చకు రాకుండా చూడగలిగాడు.

అయితే నాకు సంతృప్తిని చేకూర్చే అంశమేమంటే ప్రధాని ఓ ఎనిమిదేళ్ల తర్వాత అమెరికా ఆహార ధాన్యాల అవసరాన్ని గుర్తించి ఆ దేశ ప్రభుత్వంతో ఓ ఇరవై లక్షల టన్నుల గోధుమలు వగైరా బహుమతిగాగానీ, అప్పుగాగానీ, కొంత బహుమతిగా -

కొంత అప్పుగాగానీ ఇవ్వమని, వాటి విలువకు సరిపడా ధనం జాతీయ సేవా పథకాలపై, ఇతర విస్తరణ పథకాలపై వెచ్చించడం జరుగుతుందని హామీ ఇవ్వడం జరిగింది. పోనీలే, అంత విలువైన సమయాన్ని కోల్పోయిన తర్వాతనైనా సరాసరి టిసిఎ ద్వారానో, పాయింట్ ఫోర్ ద్వారానో, ఫోర్డు ఫౌండేషన్ ద్వారానో, పరోక్షంగా కొలంబో పథకం ద్వారానో భారతదేశానికి అమెరికా సాయాన్ని స్వాగతించడం జరిగింది. నేనూ, ఎస్.కె.పాటిల్, మరికొంతమందిమి దశాబ్దకాలంగా చేసిన కృషి వృధాగా పోలేదు.

అటువంటి సాయం వల్ల ద్వితీయ, తృతీయ పంచవర్ష ప్రణాళికలు సుసంపన్నమయ్యాయి. 1948-51 మధ్య మూడు సంవత్సరాల కష్టకాలంలో జవహర్‌లాల్‌జీ హ్రస్వ దృష్టి వల్ల మాలోని దేశభక్తి ప్రపూరిత వైఖరిని పసికట్టలేకపోయాడు. అయినా సర్దార్ పటేల్ మేము ఆ విధంగా దేశభక్తిని ప్రదర్శించడాన్ని చూసి సానుభూతిని గుండెనిండా నింపుకుని మాకు వెన్నుదన్నుగా నిలిచాడు.

అయితే చిత్రమేమంటే అమెరికా, రష్యాలు అటువంటి విదేశీ సాయం భారతదేశానికి ఏమేరకు అవసరమన్నదాన్ని మర్చి భారతదేశాన్ని విదేశీ సాయంతో ముంచెత్తడం జరిగింది. దానివల్ల భారతదేశపు ఆర్థిక వ్యవస్థ ద్రవ్యోల్బణం బారినపడింది. ప్రణాళికలు పక్కదారిపట్టాయి. ప్రాజెక్టుల అభివృద్ధి పెనుభూత రూపం దాల్చింది. వృధాను అరికట్టడం అసాధ్యంగా తయారైంది. దేనికి ప్రాధాన్యమివ్వాలో తెలియకుండాపోయింది. వ్యవసాయం కుంటుపడింది. అవినీతి పేట్రేగిపోయింది. పరిపాలనా రాహిత్యానికి పట్టపగ్గాల్లేవు. మనకు అందే విదేశీ సాయం అంతకుముందు అందినదాని వాయిదాల చెల్లింపులకు కూడా చాలే విధంగా కనిపించడంలేదు. ఆర్థిక మాంద్యం, ధరల పెరుగుదల, పన్నుల సుడిగుండాలు, వాటివల్ల ఏర్పడిన రూపాయి పతనం భారతదేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసే హెచ్చరికలను జారీ చేశాయి. అందువల్లనే రాజాజీ మనకిక విదేశీ సాయం వద్దన్నాడు. అలా మేము 1940లో విదేశీ సాయం కోరడంతో ప్రారంభమైన వలయం ఇప్పుడు వద్దని కోరుకోవడంతో పూర్తయ్యింది. ఔను, అమృతమైనా అవసరాన్ని మించి పుచ్చుకుంటే విషంగా మారిపోతుంది.

41

రెండవ ప్రపంచ యుద్ధం-అనంతర పరిణామాలు - పాత సామ్రాజ్యవాదం స్థానంలో నయా సామ్రాజ్యవాదం

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో మన జాతీయవాదం పలువురు బ్రిటిష్ సోషలిస్ట్‌లను, ట్రేడ్ యూనియన్ నాయకులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఫాసిస్ట్‌లు. నాజీలు ఓటమిపాలై యుద్ధం ముగిసినా వాళ్లు నేను చెప్పేది అంగీకరించే స్థితిలో లేరు. 1946లో తొలి ప్రపంచ వ్యవసాయ ఉత్పత్తిదార్ల సదస్సుకు హాజరైన సందర్భంగా నేను వాళ్లను కలిశాను. నేను వాళ్లకు చెప్పిందేమంటే అమెరికా, రష్యాల మాదిరిగానే భారతదేశం స్వతంత్ర దేశంగా భావించుకుంది. అందువల్ల యుద్ధం విషయంలో దాని వైఖరిని అది అవలంభించే హక్కు దానికి ఉందని భావించింది. 1935 నుండి ఏ దేశం ఎటువంటి వైఖరిని అవలంభించిందో ప్రశ్నించసాగాను. చివరకు స్పెయిన్. అబ్సీనియా, సూడాన్ ప్రజల తరఫున నిలిచింది భారతీయులేనని స్పష్టంచేశాను.

మేము చైనాపై జపాన్ దాడిని ఖండించామని గుర్తుచేశాను. అందువల్ల మా జాతీయ విముక్తి విషయం తేలేవరకూ మేము తటస్థ వైఖరి అవలంబింపదల్చామని చెప్పాను. పారిస్ నేలమట్టమైనప్పుడు సరోజినీ నాయుడు హృదయం ద్రవించిన తీరును గుర్తుచేశాను. ఏదిఏమైనా మా జాతీయత సమస్య మాకు ముఖ్యమని అన్నాను.

చిత్రమేమంటే స్వేచ్ఛను ప్రేమించే బ్రిటిష్ ప్రజలపై యుద్ధం సామ్రాజ్యవాద ఎత్తుగడగా గాంధీజీ భావిస్తూ ఉంటే కమ్యూనిస్ట్‌లు మాత్రం దాన్ని ప్రజా యుద్ధంగా ప్రకటించారు. గాంధీజీ, కాంగ్రెస్ తలపెట్టిన జాతీయోద్యమాన్ని విద్రోహ చర్యగా పరిగణించారు. వెల్లూరు కారాగారంలోని 350 మంది రాజకీయ ఖైదీలు రాత్రికి రాత్రి బ్రిటిష్ వ్యతిరేక డిటెన్యూలు కాస్తా ప్రజా యుద్ధ వీరులయ్యారు. అలా మాస్కో ఎలా చెబితే అలా నడిచే వాళ్లను చూస్తే మాలో కలిగే భీతిని నేను వివరించి చెప్పజాలను.

బ్రిటిష్‌వాళ్ల విషయానికొస్తే వాళ్ల యుద్ధ కృషికి భారతదేశం సంపూర్ణ విశ్వాసం ప్రకటించాలని అక్కడి రాజకీయ పక్షాలన్నీ కోరతాయికానీ భారతదేశానికి మాత్రం స్వాతంత్ర్యాన్ని, స్వయం పాలనను ఇవ్వమని ఎవరూ చెప్పరు. వాళ్లు యుద్ధంలో ఓడినా ఫర్వాలేదుకానీ మన దేశానికి మాత్రం దాస్య విముక్తి కలిగించరు. నేను మాత్రం కాంగ్రెస్‌వాదులందరి మాదిరిగానే బ్రిటిష్‌వారి స్వేచ్ఛను కాంక్షించా. నాజీయిజం అంతమొందాలని కోరుకున్నా.

నా ఐరోపా సోషలిస్ట్ మిత్రులందరిలో ఒక్క దీనా స్టాక్ మాత్రమే భారత జాతీయ వైఖరిని, దానికి నా మద్దతును సరిగా అర్థంచేసుకోగలిగింది. అది అప్పటి స్థితిలో తప్పనిసరని, న్యాయమని ఆమెకు తోచింది. జైలు అధికారులు ఆమె లేఖల్ని నాకు అందనివ్వలేదు. ఆ సంవత్సరాల్లో దేవీజీ నా ఐరోపా మిత్రుల భావనలను తెలియపరుస్తూ వచ్చింది. యుద్ధంలో విజేతలెవరైనా వలస దేశాల, రంగు జాతుల స్వాతంత్ర్య సమాఖ్య ఏర్పడాల్సిన అవసరాన్ని గుర్తించాం. గాంధీజీ ఆశీర్వాదాలతో దాని నిర్మాణం కోసం ముందుకు సాగాం. ఆఫ్రికా, ఆసియా ప్రజల స్వాతంత్ర్యం కోసం మా విజ్ఞప్తికి పెన్నర్ బ్రాకే మద్దతు పలికాడు.

అప్పటి సంఘటనలను ఇంతకాలం తర్వాత సింహావలోకనం చేసి చూస్తే జపాన్ దాడి విషయంలో మా స్పందనలు చాలావరకూ రోగలక్షణ సూచితాలుగా గోచరిస్తాయి. బర్మాలో, మలయాలో బ్రిటిష్‌వారు ఓడిపోతే మాకు ఫర్వాలేదు. అయితే జపాన్‌వారు భారత భూభాగంలోకి వచ్చి వాళ్ల సామ్రాజ్యవాదాన్ని మాపై రుద్దరాదని మేము

కోరుకున్నాం. జపాన్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడం క్రియాశీలంగా లేకున్నా ఫర్వాలేదు అది వాళ్ల ప్రభావానికి లోనుకాకుండా కాపాడగలదు. అదెలాగంటారా? మహాత్మాగాంధీ సూచించిన శాంతియుత పోరాట మార్గం ఉండనే ఉంది. అయితే ఆ స్థాయికి చేరుకోవాలంటే అందరికీ సాధ్యమయ్యే పనికాదని ఎక్కువమంది భావించారని నేననుకోను. అయినా మేము జపాన్‌కు వ్యతిరేకంగా నేతాజీబోస్ వలే ఇండియన్ నేషనల్ ఆర్మీని సమాయత్తపర్చే స్థితిలో లేం. మేము కోరుకునేది మాత్రం బ్రిటిష్‌వారు మా దేశాన్ని వదలివెళ్లాలనే. ఆ తర్వాత తెలిసింది జపాన్‌వారు అస్సాం, బెంగాల్ ప్రాంతాల్లోనేగాక ముఖ్యమైన పారిశ్రామిక కేంద్రాల్లో కూడా బాంబు దాడులు జరపకుండా బోస్‌బాబు ఎలా నిలువరించగలిగింది.

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో రాజాజీ, జవహర్‌లాల్‌లు ఏ విధంగానైనా సరే జపాన్‌వాళ్ల దాడిని నిలువరించాల్సిందేనని వాదించారు. కనుక బ్రిటిష్‌వాళ్లతో ఒక గౌరవప్రదమైన అంగీకారానికి రావాలని తలపోశారు. అయితే బ్రిటిష్ సామ్రాజ్యవాదులు భారతదేశాన్ని జపాన్ హస్తగతం చేసేందుకైనా సిద్ధంగా వున్నారుకానీ జాతీయ ప్రభుత్వ ఏర్పాటుకు భారతీయ నేతలను ఆహ్వానించేందుకు సిద్ధంగా లేరు. ఈ విధంగా యుద్ధ సమయంలో జాతీయత, సామ్రాజ్యవాదం అనే పొసగని రెండు శక్తుల మధ్య స్తబ్దత ఏర్పడింది. అది భారతీయ దేశభక్తుల్ని నిరంతరం ఘర్షణామయ మనోద్వేగాలలో వుంచింది. అది పరిష్కార మెరుగని ఊగిసలాట స్థితిగా తయారైంది.

జవహర్‌లాల్‌జీ తమ గ్రంథం 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ (ప్రపంచ చరిత్ర సంగ్రహావలోకనం) రాసేటప్పుడు ఉద్దేశపూర్వకంగా రాశాడో లేదో తెలియదుకానీ ఒక విషయాన్ని మాత్రం పొందుపర్చాడు. అదేమంటే జాతీయతా భావంతో తొణికిసలాడే భారతదేశం వలస దేశాల ప్రజలందరి స్వాతంత్ర్యాన్ని భారత స్వాతంత్ర్య సంగ్రామంలో భాగమయ్యేటట్లుగా చూడసాగిందనడానికి తగిన ప్రాతిపదిక తయారుచేయడం. భారతీయుల అహింసా పోరాటం వల్ల ప్రజల అందరి స్వాతంత్ర్య సముపార్జనకు కీలక పాత్ర పోషించగలదని మహాత్ముడు మాటిమాటికీ నొక్కి వక్కాణిస్తూనే ఉన్నాడు. ఒక జాతి రాజేసే విప్లవం ప్రపంచంలో ఎటువంటి పాత్రను పోషించగలదనేది నా కళ్ల ముందు కదలాడుతూనే ఉంది. కామింటెర్న్ సామ్రాజ్యవాదానికి ఎంతగా వ్యతిరేకమైనా దాన్ని మాత్రమే వలసవాద ప్రజల విముక్తికి ఏకైక శక్తిగా మలిస్తే ముంచుకొచ్చే ప్రమాదాన్ని కూడా గమనించ గలిగాను. అందువల్ల నేను వెల్లూరు

కారాగారంలో ఖైదీగా 1940-42 మధ్య కాలంలో నా సిద్ధాంతానికి రూపురేఖలు దిద్దసాగాను. చివరకు అది **"కలోనియల్ అండ్ కలర్డ్ పీపుల్"** అనే గ్రంథంగా రూపుదాల్చింది. అది ప్రపంచంలోని ప్రజాస్వామిక దేశాలన్నీ వలస దేశాల ప్రజలందరి స్వాతంత్ర్యాలకు, రాజకీయ స్వేచ్ఛకు కృషి చేయాల్సి ఉందని తేల్చి చెప్పింది.

1942లో కొద్దిమాసాలపాటు నేను జైలు వెలుపల ఉన్నా. అప్పుడు వలస దేశాల, రంగు జాతుల స్వాతంత్ర్య ఐక్య వేదికను ప్రారంభించేందుకు గాంధీజీ ఆశీర్వాదం పొందాను. దాన్ని లండన్‌లో స్థాపించాం. దీనా స్టాక్, నేనూ దానికి కార్యదర్శులుగా వ్యవహరించాం. మా ప్రయత్నం మన సత్యాగ్రహపు ఆశావాదాన్ని పోలి ఉన్నది. ఎందువల్లనంటే నాజీ వ్యతిరేక శక్తులకు అవి ఎంతటి చీకటి రోజులో తెలిసి కూడా మేము అటువంటి విశ్వ వేదిక ఏర్పాటుకు పూనుకున్నాం. అది సామ్రాజ్యవాద పరిధితో పోల్చి చూస్తే అత్యల్పం కావచ్చు, అయితేనేం?

తిరిగి 1942-44 మధ్యకాలంలో నేను జైలులో ఉన్నాను. అప్పుడు మరొక సిద్ధాంత గ్రంథం 'ఔట్ లైన్స్ ఆఫ్ నేషనల్ రివల్యూషనరీ పార్ట్' అండ్ 'వరల్డ్ రోల్ ఆఫ్ నేషనల్ రివల్యూషన్' (జాతీయ విప్లవ పథం రూపు రేఖలు-జాతీయ విప్లవం పట్ల ప్రపంచ వైఖరి)ను సిద్ధంచేశాను. అందులో ప్రపంచంలోని వలస దేశాల ప్రజలెవరూ వాళ్ల జాతీయ పోరాటాల విషయంలో కావాల్సిన సైద్ధాంతికపరమైన మద్దతు కోసం కొమింటెర్న్‌పైగానీ, సోవియట్ రష్యాపైగానీ ఆధారపడాల్సిన పనిలేదని చెప్పడం జరిగింది. వాళ్ల ఉద్యమాలు ప్రగతిని అడ్డుకునేవన్న విమర్శలు వచ్చినా ఓడిపోయామనే భావన కలగాల్సిన పనిలేదు. నేను జైలు నుండి విడుదలైన తర్వాత ఇటువంటి సైద్ధాంతిక మూలాలకే బాపూజీ ఆశీస్సులు లభించాయి. 1945-46లో వాటిని ప్రచురించడం జరిగింది. 1930-40 నాటి కొమింటెర్న్ ఆధిపత్యం నుండి ఆ విధంగా జాతీయ విప్లవకారులకు సిద్ధాంతపరమైన స్వేచ్ఛా భావనలను కావాల్సినంతగా అందించాను.

1942-43 ప్రాంతంలో యుద్ధానంతరం పశ్చిమ సామ్రాజ్యవాద శక్తులు తమ సామ్రాజ్యాలకు తిలోదకాలు ఇచ్చుకోవాల్సినంతగా శక్తిహీనమవుతాయని ఎం.ఎన్.రాయ్ చెప్పడం ప్రారంభించాడు. అప్పుడు మేము ఆయన మాటల్ని అంతగా పట్టించుకోలేదు. అలాగే ప్రధాన సామ్రాజ్యవాద శక్తులకు తమ వలస దేశాలకు స్వాతంత్ర్యాన్ని ప్రకటించి తీరాల్సి ఉంటుందని 1956 వరకూ తట్టనేలేదు. ప్రచ్ఛన్న యుద్ధం, ప్రపంచ రాజకీయ

వాతావరణంలో ఇనుప తెరలు, తర్వాత అణుశక్తిపై రష్యా సాధించిన పట్టు అన్నీ కలసి 1956-65 మధ్యకాలంలో ఆసియా, అమెరికా ఖండాలంతటిలోనూ పాశ్చాత్య సామ్రాజ్యవాదాన్ని మట్టికరిపించాయి.

బ్రిటిష్ లేబర్, కన్సర్వేటివ్ ప్రభుత్వాలు రెండూ అనేమిటి, ఫ్రెంచి గొప్పతనాన్ని వేనోళ్ల కొనియాడే డిగాలే కూడా కొంత సమయం తీసుకున్నా ఆఫ్రికా దేశాలను వలస స్థితి నుండి విముక్తి చేయకతప్పలేదు. నా పూర్వ మిత్రులు జోమో కెన్యెట్టా, కోయినేజి, ములుంబో వంటివారు వాళ్ల వాళ్ల ప్రభుత్వాల్లో అధినేతలు. అలా మా కృషి ఫలించినందుకు మాలాంటివాళ్లం సంతృప్తి చెందాం. అందరినీమించి బ్రిటిష్ పార్లమెంట్‌కు చెందిన మా మిత్రుడు ఫెన్నర్ బ్రాక్వేకు ప్రపంచం కృతజ్ఞతలు చెప్పుకోవాల్సి ఉంది.

ఒక రకమైన సామ్రాజ్యవాదం అలా రూపుమాసిపోతుండగా మరో రకమైన సామ్రాజ్యవాదం మరింత కపటంతోకూడి తేలిగ్గా గుర్తించబడని సామ్రాజ్యవాదం. తన కబంధ హస్తాలను ఎనిమిది లేదా తొమ్మిది ఆగ్నేయ, ఐరోపా దేశాలపై, కొత్తగా విముక్తి చెందిన ఆసియా ప్రజలపై బిగించసాగింది. అదే కమ్యూనిస్ట్ సామ్రాజ్యవాదం. భారతదేశంలో తొలిగా మసానీ, నేనూ దాని విస్తరణకు వ్యతిరేకంగా గళమెత్తాం. విశ్వాసాన్ని మేలుకొలిపాం. జవహర్‌లాల్‌జీ మాత్రం మాతో గళం కలిపేందుకు వెనకాడాడు. ఆయన ప్రధానిగా ఉన్న కారణంగా అలా చేసి ఉండవచ్చు. ఔను, ఓట్ల కోసం పాట్లు పడాల్సినవారు పక్షపాత వైఖరిని విడనాడేందుకు వీలుండదు. అయితే ప్రజాస్వామిక పాలనలను ధ్వంసం చేయడాన్ని అలాగే గ్రీన్ ఇంటర్నేషనల్‌కు చెందిన

రైతు పక్షాలను పోలెండ్, హంగరీ, రుమేనియా, బల్గేరియా, యుగోస్లావియా, జెకొస్లోవేకియాలలో ఇబ్బందులకు గురిచేయడాన్ని చూసి సహించలేకపోయాను. ఎస్తోనియా, లాట్వియా, లిథూనియాల విషయం ఇంకా చెప్పాల్సిన పనేముంది? నేను రూజ్‌వెల్ట్ హ్రస్వదృష్టినీ, చర్చిల్ అల్లీల నిర్ధయత్వాన్ని యాల్టాలోనూ అంతకుముందు జరిగిన సదస్సుల్లోనూ దుయ్యబట్టాను. పోలెండ్ ఉప ప్రధాని మికోలాజెస్కీని 1946లో కోపెన్‌హాగెన్‌లో కలసి మిత్రత్వానికి మాట కలిపాను. ఆయన, హంగరీ ప్రధాని ఫెరెన్స్ నాగీ వాషింగ్టన్‌లో శరణార్థులుగా ఉండగా నేను వాళ్లను 1954లో కలసి కమ్యూనిస్ట్ ఆధిపత్య దేశాల విముక్తికి వారి సరికొత్త వీరోచిత ఉద్యమ స్ఫూర్తికి ఆసియా మద్దతును ప్రకటించాను.

ప్రజాస్వామిక సిద్ధాంతాలకు విశ్వమంతటా విధేయతను ప్రకటించే మావంటి వాళ్లకు హంగరీ కమ్యూనిస్ట్‌ల జాతీయ పోరాటాన్ని సోవియట్ అణచివేస్తుంటే జవహర్‌లాల్‌జీ నోరుమెదపకపోవడం దిగ్భ్రమను కలుగజేసింది. నేను, మసానీ, జయప్రకాశ్‌జీ, సోషలిస్ట్‌లం అందరం కలసి మా పార్లమెంట్ చర్చల్లో హంగరీ వుద్యమం ప్రజా ఉద్యమమని, దాన్ని రష్యా సైన్యం అణచివేయ బూనడం అన్యాయమని జవహర్‌లాల్‌జీతో ఒప్పించగలిగాం. రష్యా జులుం పట్ల ఉపగ్రహ దేశాల జాతీయవాదపు ఒత్తిళ్లు 'వరల్డ్ రోల్ ఆఫ్ నేషనల్ రివల్యూషన్' లోని నా వాదనలకు తార్కాణంగా నిలిచాయి. ప్రపంచ కార్మిక విప్లవం అనే బూజుపట్టిన సిద్ధాంతాలకు అవి ఎదురునిలిచాయి.

భారతదేశం రష్యన్ సామ్రాజ్యవాదం వైపు కోపు కాయనందువల్ల భారీ మూల్యాన్నే చెల్లించుకోవాల్సి వచ్చింది. కమ్యూనిస్ట్ చైనా టిబెట్‌ను తమ వలస రాజ్యంగా పేర్కొంది. మేమందరం గగ్గోలుపెడుతున్నా వినకుండా జవహర్‌లాల్‌జీ కమ్యూనిస్ట్‌లు చెప్పినదానికి ఊకొట్టాడు. అలా రుచిమరిగిన చైనా ఉత్తర కొరియా, వియత్నాం, కాంబోడియా, బర్మా, ఇండోనేషియాలపై కన్నేసింది. జరగకూడదనిపించింది కాస్తా జరిగిపోయింది. అదే 1962నాటి భారతదేశంపై చైనా దాడి. పైగా పాకిస్థాన్‌తో అపవిత్ర బాంధవ్యం. 1922-62 మధ్యకాలంలో పాశ్చాత్య సామ్రాజ్యవాదం అంతమొందిందని అప్పటి వుద్యమకారులం సంతృప్తిచెందుతున్న తరుణంలో మరో సామ్రాజ్యవాదం మేము వృద్ధులమవుతున్న తరుణంలో ముంచుకొస్తున్నది. ఎంతటి సామాజిక సంక్షోభం!

42

విదేశాంగ విధానం-విదేశీ సాయం

విదేశీ వ్యవహారాల విషయంలో టిబెట్, కాశ్మీర్, చైనా, ఇజ్రాయెల్ విషయాలను మినహాయిస్తే 1955-58 మధ్య జవహర్‌లాల్‌జీ కొనసాగించిన విధానాలకు అసమ్మతిని ప్రకటించడం మినహాయించి నాకు తెలిసినంతవరకూ మిగతా వ్యవహారాల్లో నా సమ్మతిని ప్రకటించాను. (చైనా చేతుల్లో చావుదెబ్బ తిన్న తర్వాతకానీ మనం ఆపాదించుకునే అంతర్జాతీయ ఖ్యాతిలోని డొల్లతనం మనకు అర్థంకాలేదు. ఇండో-చైనా వ్యవహారంలో జెనీవా సంప్రదింపుల సందర్భంగా భారతదేశం నిర్వహించిన పాత్ర దేశంలో యుద్ధ విరమణకు దారితీసి జాతీయ స్వేచ్ఛకు మార్గం సుగమం చేసింది.

నవంబర్ 1954లో ఫ్రెంచివారు భారతదేశంలోని వాళ్ల స్థావరాలను వదలివెళ్లడంతో పోర్చుగీస్‌వారు కూడా గోవాను వదలి వెళతారనే ఆశలు మన ప్రజల్లో రేకెత్తాయి. అమెరికా, బ్రిటన్లు అలా హడావుడిగా ఆగ్నేయ ఆసియా సదస్సును



చౌ ఎన్ లై - నెహ్రూ

ఏర్పాటుచేసి సీటో ఒప్పందాన్ని ఇండియా, బర్మా, ఇండోనేషియా సమ్మతి లేకుండానే కుదుర్చుకోవడాన్ని నేను రాజ్యసభలో చేసిన ప్రసంగంలో తీవ్రంగా ఖండించాను. బాండుంగ్ సమావేశ విజయం, పంచశీలలోని సహజీవన విధానం వల్ల మన ప్రధాని మార్షల్ టిటోతో ప్రారంభించి అనేక ఐరోపా, అరబ్బు ప్రభుత్వాధినేతలతో సంయుక్త ప్రకటనలు ఇవ్వగలిగాడు. అది ప్రపంచంలో భారతదేశం తలెత్తుకు తిరిగేటట్లు చేసింది. బాండుంగ్ సమావేశం ప్రపంచ శాంతికి దారితీసిందని విదేశాంగ నీతిలో ఆరితేరిన అమెరికా ప్రముఖ నాయకులు కీర్తించారు.

నేను 'ఇండియా -ఇంటర్నేషనల్ క్వార్టర్లీ జర్నల్'లో పంచశీల ఆవిర్భావం మూడో శక్తికి ఊతాన్నిచ్చిందని, కయ్యానికి కాలుదువ్వే రెండు శిబిరాలకు చెందినవారు పరస్పరం సహకరించుకుంటూ శాంతియుత సహజీవనం కొనసాగించగలరని, ఏ శిబిరానికీ చెందని అలీన రాజ్యాల సంఖ్య పెరుగుతూ పోగలదని చెప్పాను. అఖిలభారత కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా ప్రపంచ రాజ్య సదస్సుకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు జవహర్‌లాల్‌జీని ఒప్పించగలిగానుకానీ ఐక్యరాజ్య సమితిలో చైనా సభ్యత్వానికి మద్దతు పలకకుండా చేసే విషయంలో నేను అశక్తుణ్ణయ్యాను.

అయితే నేను జవహర్‌లాల్ అసంతృప్తికి గురయ్యేందుకు సిద్ధపడ్డాను. 1948 నుండి అంతర్జాతీయ ప్రచారం ప్రత్యేకించి అమెరికా, కెనడా, ఇంగ్లండ్ ఇంకా పశ్చిమ ప్రజాస్వామిక దేశాల్లో జరిగింది. జపాన్‌లో కూడా ప్రపంచంలోని ప్రజాస్వామికవాదులందరినీ చైతన్యపర్చి ప్రజాస్వామ్యాన్ని సంరక్షించాల్సిన బాధ్యత వాళ్లదేనన్నాను. నియంతృత్వం నుండి, కమ్యూనిజం నుండి తూర్పు దేశాలను సంరక్షించాల్సిన బాధ్యత వాళ్లదేనన్నాను. ఆ కృషిని భారతదేశం నుండే ప్రారంభించాలన్నాను. ఐరోపాకు సమకూర్చే నిధులకు మించి ఆఫ్రికా, ఆసియా దేశాలకు సమకూర్చాలన్నాను. వాటి సాయంతో వాళ్లు కనీస సామాజిక వసతులను కల్పించుకుని భారతదేశం వంటి దేశాలకు మౌలిక పరిశ్రమల ఏర్పాటుకు సాయం అందించాల్సిన అవసరం ఉందన్నాను.

పాకిస్థాన్‌తో అమెరికా సైనిక ఒప్పందం కుదుర్చుకునేందుకు సంసిద్ధమైందని తెలియగానే విదేశీ వ్యవహారాల సంఘం అధ్యక్షునిగా అమెరికా రాయబారి ఎల్లెన్‌ను స్వాగతిస్తూ నేనన్నదేమంటే అటువంటి ఒడంబడిక ప్రపంచంలోని రెండు అతి పెద్ద ప్రజాస్వామిక దేశాల మధ్య స్నేహ సంబంధాలకు బీటలు వారేటట్లు చేస్తుంది, రష్యాతో

జతకట్ట చూసేవారిని అది ప్రోత్సహిస్తుంది. ప్రధాని కూడా భారత వ్యతిరేకతను పదే పదే ప్రకటించడం జరిగింది. అయినా సరే మేము భావించిన రీతిగా ఆ ఒడంబడిక ఖరారైంది. అది పాకిస్థాన్‌ను భారత్‌పై యుద్ధానికి కాలుదువ్వేటట్లు చేసింది. అమెరికా మాటిమాటికీ పాకిస్థాన్‌కు తమ దేశం అందించే సైనిక సాయం ఇండియాపై ప్రయోగించేందుకు అనుమతించం అని చెబుతూ వచ్చింది. కాని భారతీయ నాయకులెవరూ దాన్ని నమ్మే స్థితిలో లేరు. (పాకిస్థాన్ సేనలు అమెరికా ఆయుధాలను కచ్ ప్రాంతంలోని దాడిలోనూ, 1965 జమ్మూ-కాశ్మీర్ కల్లోలంలోనూ ఉపయోగించిన దాఖలాలున్నాయి) అయితే చైనా భారత భూభాగాన్ని ఆక్రమించుకునే తరుణంలో భారతదేశం అమెరికా సహాయాన్ని కోరినప్పుడు ప్రెసిడెంట్ కెన్నడీ వెనువెంటనే స్పందించినందున అమెరికా పట్ల విశ్వాసం తిరిగి వెల్లివిరిసింది. దురదృష్టవశాత్తూ కాశ్మీర్ సమస్య అమెరికా, భారతదేశాల మధ్య పూర్తి అవగాహనకు అడ్డంకిగా నిలుస్తూ వస్తున్నది.

ఇటీవల అమెరికా, రష్యాలు భారతదేశానికి పెద్దయెత్తున ఆర్థిక సాయం అందించే విషయంలో ఉత్సాహాన్ని చూపడం ప్రత్యేకంగా సంతృప్తిని కలిగించే అంశమే. అయితే ఈ రకమైన విదేశీ ఆర్థిక సాయం భారతదేశపు ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసే స్థాయికి చేరుకోలేదు. అది మన స్వావలంబనతత్వాన్ని చిన్నబుచ్చలేదు. ఇంతకుముందే చెప్పినట్లుగా 1949లో నేను అమెరికా అధ్యక్షుడు ట్రూమన్‌ను కోరాను. 1952లో అట్టావాలో జరిగిన సిపిఎలో చెప్పాను. 1954లో ఐపియు వేదిక మీద ప్రకటించాను. ఆసియా, ఆఫ్రికా ప్రజలకు ఆర్థిక సాయం అందించడమన్నది అదేదో దయాదాక్షిణ్యాల మీద ఆధారపడిన చర్య కారాదని, అది ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉపకరిస్తూ ప్రపంచ ప్రజాస్వామ్యానికి నీరాజనం కావాల్సి ఉందని. అయితే 1947-56 మధ్య కాలంలో పాశ్చాత్య రాజకీయ వేత్తలుగానీ, వారి ప్రచారకులుగానీ ఇటువంటి పవిత్ర యజ్ఞానికి పూనుకోలేదు. ఒక దశాబ్దంపాటు అమూల్యమైన సమయాన్ని, మహత్తర అవకాశాలను చేజార్చుకోవడం జరిగింది. చిత్రమేమంటే మొద్దు నిద్రపోతున్న భారత ప్రభుత్వం, పిల్లిమొగ్గలేస్తున్న పాశ్చాత్య దేశాలు ఇప్పుడు హడావుడిగా మరో కొసకు చేరుకుని స్వశక్తితో తమ ఆర్థిక సంపదల్ని పదిలపర్చుకునే రైతుల, వృత్తిపనివారల ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందికలిగే పద్ధతిలో ప్రణాళికల రూపకల్పన చేయడం జరుగుతున్నది.

సింహావలోకనం చేసి చూస్తే ఆర్థిక శాస్త్రంలో, వాణిజ్యంలో, విదేశీ వ్యవహారాల్లో

ఆరితేరిన అమెరికా ప్రవీణులు ఆసియా, ఆఫ్రికా దేశాలు కమ్యూనిస్ట్‌ల వలలో పడకుండా చూసే విషయంలో నత్తనడకను ప్రదర్శిస్తున్నారు. 1948-49లో ఢిల్లీలో జరిగిన భారత్-అమెరికా సదస్సుకు నేను ప్రతినిధిని. అది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ వరల్డ్ ఎఫైర్స్, కౌన్సిల్ ఆఫ్ పసిఫిక్ ఎఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహింపబడింది. మిగతా భారతదేశ ప్రతినిధుల్లో సి.పి.రామస్వామి అయ్యర్, పరిపాలనా దక్షుడు వి.టి.కృష్ణమాచారి, రిజర్వ్ బ్యాంక్‌కు చెందిన ప్రసాద్, ప్రముఖ పాత్రికేయులు దుర్గాదాస్ ఉన్నారు. మేమంతా భారతదేశం త్వరితగతిన ఆర్థికంగా పురోగమించాల్సిన అవసరంపై దృష్టి పెట్టాం. అమెరికా ప్రతినిధులు వాళ్ల భయాల్ని వెలిబుచ్చారు. సమతావాదానికి ముక్తి ప్రదాతగా నిలిచే ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ అమెరికా ప్రజలకు నచ్చే అంశమెలా అవుతుందన్నారు. అయితే అదే అమెరికన్ జాతి రూజ్‌వెల్ట్ తరహా కొత్త ఒడంబడిక ప్రకారం వ్యవసాయ ధరల మద్దతుతో శ్రామికులకు సామాజిక భద్రత కల్పిస్తూ ప్రభుత్వ ఆధ్వర్యంలో టెన్నెస్‌వాలీ అభివృద్ధికి తోడ్పడలేదా అని ఆశ్చర్యాన్ని ప్రకటించాను. అటువంటి కృషే ఆసియాలో కమ్యూనిస్ట్ అవగాహనకు చెంపపెట్టుగా ఉండేందుకు ఎందుకు చేపట్టకూడదని అడిగాను. ఇతర భారతీయ ప్రతినిధుల అభిప్రాయాలను కూడా తీసుకుని సరిపడేంతగా ఆర్థిక, పారిశ్రామిక సాయాన్ని ఆసియా, ఆఫ్రికా దేశాల అభివృద్ధికి అందించకుంటే ఆసియా దేశాల రాజకీయ స్థిరత్వానికి కూడా ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని, కమ్యూనిస్ట్ ప్రభావాన్ని అరికట్టడం సాధ్యపడదన్నాను. అయినా అమెరికా, దాని ప్రతినిధులు దాన్ని పెడచెవిన పెట్టాయి.

అయితే మేము వాళ్లను కలవడాలు, చర్చలు, ప్రసంగాల వల్ల ఆసియా పరిస్థితిని మంచిగా అర్థంచేసుకునే అవకాశం ఏర్పడింది. అమెరికా ఆర్థిక సహాయ కార్య ప్రణాళికకు రష్యా ఓ సవాల్‌గా పరిణమించడం వల్ల కూడా ఆసియా పరిస్థితిని అర్థంచేసుకునే అవకాశం ఏర్పడింది. అంతర్జాతీయ రంగంలో భారతదేశపు అలీన విధానం వల్ల అమెరికా వైఖరి కొంత చల్లబడుతూ వచ్చింది. నేను అమెరికా అధ్యక్షుణ్ణి ఎందుకు, ఎలా కలిశాను? దాన్ని ఏ విధంగా ప్రపంచం ప్రస్తుతం గుర్తించసాగింది. దానివల్ల కమ్యూనిస్ట్‌లకు ఎందుకు కోపం వచ్చిందో వివరిస్తాను. మార్షల్ పథకాన్ని అమెరికా, ఆసియాల్లో అమలుపర్చాలని, ముఖ్యంగా భారతదేశానికి ప్రాముఖ్యాన్నిస్తూ అది కొనసాగాలని నేను పోరాటం కొనసాగిస్తున్న అంశాన్ని అమెరికా వ్యవసాయక సంస్థలు, అందులోనూ ప్రముఖంగా నేషనల్ ఫార్మర్స్ యూనియన్ ముందుగా

గుర్తించడం జరిగింది. నా ప్రయత్నం కమ్యూనిజం వ్యాప్తిని అడ్డుకునేందుకేనని వారు గుర్తించారు. నేను అమెరికా అధ్యక్షుడు ట్రూమన్‌ను కలిసేటట్లయితే అది ప్రపంచ ప్రజాస్వామ్య మనుగడకు మద్దతు ఇవ్వగలదని భావించారు.

నేను అమెరికా అధ్యక్షుణ్ణి కలిసినప్పుడు చెప్పిందేమంటే 19వ శతాబ్దంలో ఐరోపా అంతర్గత కలహాల్లో అమెరికా ఏ విధంగా అయితే జోక్యం కలిగించుకోలేదో అదేవిధంగా ప్రచ్ఛన్న యుద్ధం సమయంలో భారతదేశం తటస్థ వైఖరిని అవలంబించడం సహజమేనని. భారతదేశంలో పారిశ్రామిక అభివృద్ధితోపాటు వ్యవసాయ అభివృద్ధి కూడా చకచకా సాగకపోతే సోవియట్ పద్ధతే ఏకైక మార్గమని మా ప్రజలు విశ్వసించే దశ వస్తుందన్నాను. అమెరికా అధ్యక్షులు ట్రూమన్ నా అభిప్రాయాలతో ఏకీభవించారు. తూర్పు దిశలో 'పాయింట్ ఫోర్' ఆర్థికాభివృద్ధిని సాధించే అవకాశం ఉందని సూచించాను. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ద్వారా, యాంత్రిక సాయాన్ని అందించడం ద్వారా అభివృద్ధి చెందని దేశాలకు సహాయపడవచ్చునని ఆయన భావించాడు. నేను చొరవ తీసుకోవడాన్ని చూసి ఆయన మెచ్చుకున్నాడు. నెహ్రూ తన అమెరికా పర్యటన సందర్భంగా కొన్ని నిర్దుష్టమైన ప్రతిపాదనలతో వస్తారనే ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. అప్పుడు నేను కోరినట్లుగా సాలీనా నాలుగు బిలియన్లు కాకున్నా ఎంతోకొంత పెద్దమొత్తమే గ్రాంట్‌గా మంజూరు చేసేందుకు అమెరికన్ కాంగ్రెస్‌ను ఒప్పించే ప్రయత్నం చేస్తామన్నారు. అప్పుడు నేను ఏయే ఉన్నతస్థాయి అధికారుల్ని కలవాలో ఆయన సూచించడం జరిగింది.

అది చాలు కదా అమెరికా మనతో చెలిమికి సిద్ధంగా ఉందని చెప్పేందుకు. నాకు ఎటువంటి ప్రభుత్వ హోదా లేదు. రైతు నాయకునిగా, పార్లమెంట్ సభ్యుడిగా మాత్రమే గుర్తింపుపొందిన నాకు ట్రూమన్, ఆయన సలహాదారులు నా అనధికార ప్రయత్నానికి ఎంతో విలువనిచ్చి ప్రజాస్వామ్య మనుగడకు ఇరుదేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు చాలా అవసరమని భారతదేశాన్ని గరిష్ట స్థాయిలో ఆదుకుంటామని భారత ప్రజలకు భరోసా ఇవ్వడం జరిగింది. అయితే భారత ప్రధాని అమెరికాలో వచ్చిన మార్పునుగానీ, నా ప్రయత్నాన్ని మెచ్చుకునిగానీ ముందుకుసాగే ఉద్దేశ్యం కనబర్చలేదు. అందువల్ల జరిగిన నష్టమెంతో నాలుగేళ్ల తర్వాతగాని నెహ్రూకు తెలిసిరాలేదు. పంచవర్ష ప్రణాళిక లక్ష్య సాధన అమెరికా సహాయం లేకుండా సాధ్యపడదని ఆయనకు అప్పటికి తెలిసివచ్చింది. భారతదేశపు విదేశాంగ విధానానికి

భిన్నంగా పైన చెప్పిన అమెరికా సహాయం అందించేందుకు ప్రభుత్వం మరో నాలుగు ఏళ్లు తీసుకుంది. ఆ ప్రజలకు తిరిగి స్నేహ హస్తం చాచేందుకు మొత్తం ఎనిమిదేళ్లు పట్టింది.

విదేశీ పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం అందసాగాయి. ఆహార ధాన్యాలు వుచితంగా పొందసాగాం. ఆ తర్వాత 1952లో, 1954లో, 1964లో నేను అమెరికా వెళ్లినప్పుడు అక్కడి వారికి చెప్పేవాణ్ణి వారి సాయమంతా అంతర్జాతీయ బాధ్యతగా స్వేచ్ఛాయుత పశ్చిమ రాజ్యాలు భావించాల్సి ఉందని. అమెరికా పాయింట్ ఫోర్ సాయంగానీ, కొలంబో ప్రణాళికగానీ తూర్పు దేశాల అభివృద్ధికి త్వరితగతిన దోహదపడజాలవని కనుక మార్షల్ ప్రణాళిక ప్రకారం సాయం అందించాలనీ అన్నాను. ఇటువంటి ఆనందదాయక వాతావరణం ఏర్పడడానికి అనేకమంది డెమోక్రాట్లు సాయం అందించారు మరీ ముఖ్యంగా లార్డ్ బోయ్డ్ ఓర్, కీర్తిశేషురాలు శ్రీమతి రూజ్‌వెల్ట్, ఢిల్లీలోని అమెరికా రాయబారి చెస్టర్ బౌల్స్ మొదలైనవారు. రాయబారి గారి రెండు గ్రంథాలను కూడా పేర్కొనాల్సి ఉంది. 'ది అంబాసిడర్స్ రిపోర్ట్' (దౌత్యప్రతినిధి నివేదిక), 'న్యూ హొరైజెన్స్ ఫర్ పీస్' (శాంతికి కొత్త దిక్‌చక్రాలు) అనేవి తూర్పు దేశాలకు అమెరికా సాయం అందించేందుకు, తన వైఖరిని తిరిగి అవగాహన చేసుకునేందుకు బాగా ఉపకరించాయి.

అదేవిధంగా మౌలిక పారిశ్రామిక యంత్ర సామాగ్రిని అందించేందుకు రష్యా ముందుకు రావడాన్ని చూసి అందరి మాదిరిగానే నేనూ సంబరపడ్డాను. రష్యా హృదయపూర్వకంగా రుణాలు, ప్రావీణ్యాలు అందించేందుకు ముందుకు రావడం వల్ల, భిలాయ్‌లో భారీ ఉక్కు కర్మాగార నిర్మాణానికి పూనుకోవడం వల్ల, బ్రిటన్ అధికారులు కూడా ఆ దిశగా ముందుకు రావడం వల్ల భారతదేశం తన లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయగలదనే ఆశ జనించింది. ఈ రకమైన వైఖరి వల్ల నిర్దేశిత లక్ష్యాలైన అరవై లక్షల టన్నుల ఇనుము, ఉక్కు ఉత్పత్తులను సాధించగలిగాం. అదనంగా ముప్పయ్ లక్షల టన్నులు ఉత్పత్తిచేసే బొకారో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించడం జరిగింది. పెద్దయెత్తున భూగర్భం నుండి ఇంధనాలను వెలికితీయగలిగాం. తూర్పు, పశ్చిమ సముద్ర తీరాల్లో నౌకా నిర్మాణాన్ని చేపట్టాం.

43

విదేశాంగ విధానం - విదేశీ ప్రయాణాలు

అనుకోకుండా పారిస్ నుండి టెలిగ్రాం వచ్చింది. ఆరోజు అక్టోబర్ 2, 1956. నేను నవంబర్‌లో అంతర్జాతీయ రైతు సంఘం ప్రారంభ సభకు హాజరు కావాలని వచ్చిన టెలిగ్రాం అది. మా గ్రామంలోని పాములపాటి బుచ్చినాయుడు కళాశాలలో ఆనాడు మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్నా. నేను ఆ రాత్రికే మద్రాస్‌కు బయలుదేరి వెళ్లి అక్కడి నుండి ఢిల్లీ వెళ్లేందుకు తగినట్లుగా బట్టలు అవీ సర్ది ఉంచింది భారతీదేవి గారు. 1924 నుండి నా పట్ల ఆమె సహకారం అలాగే ఉంది.

పారిస్ వెళుతూ మార్గమధ్యంలో రోమ్‌లో ఒక రోజు ఆగాను. యుద్ధం వల్ల విచ్ఛిన్నమైన ఆర్థిక వ్యవస్థను ఆ రెండు దేశాలు మార్షల్ పథకం ద్వారా అంది పుచ్చుకుని ఉపయోగించుకోకుండా ఉన్నట్లయితే ఆ రెండు దేశాల్లో కమ్యూనిస్టులు పార్లమెంట్‌లో ఆధిక్యాన్ని సంపాదించి ఉంటే(1948 వరకూ ఆ ఊపు కొనసాగింది) ఆ రెండు దేశాలు పోలెండ్, హంగరీలను మించి అభివృద్ధి పథంలో పయనించగలిగేవా?

భారతదేశపు దౌత్యాధికారి కే.శే. ధివీని ఆయన నివాసంలో రోమ్‌లో కలుసుకున్నాను. అంతర్జాతీయ ఆహార సంస్థకు (ఎఫ్ఎఒ) నా మిత్రుడు డాక్టర్ బి.ఆర్.సేన్‌ను ఎన్నుకునే విషయంలో అమెరికా ఎంతగా సహకరించిందీ ఆయన తెలియజేశాడు. అంతర్జాతీయ సంస్థ దాని అధినేతను అంతగా అభివృద్ధి చెందని

ప్రపంచ భాగం నుండి ఎంచుకుని మంచి పని చేసిందనిపించింది. ఆ అధినేతకు అభివృద్ధి చెందని దేశాల అవసరాలేమిటో అవగాహన అధికంగా ఉన్నందువల్ల వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి సంపన్నదేశాలవాళ్లు సహాయం అందించే దిశగా కృషి బాగా జరుగుతుంది. ఆ సంస్థలో కూడా ఖండాల, జాతీయతలకు సంబంధించిన వైషమ్యాలున్నా బి.ఆర్. సేన్ వాటికి అతీతంగా అందరినీ కూడగట్టుకున్నందువల్ల ఆయన ఆ పదవికి మూడు పర్యాయాలు ఏకగ్రీవంగా ఎన్నికై 1967లో పదవీ విరమణ చేశారు. ఆయన సాధించినదానిలో ప్రముఖమైనది 'ప్రపంచాన్ని ఆకలి బారినుండి రక్షించండి' అనే ఉద్యమం.

అక్టోబర్ 30, 1956 రాత్రికి నేను పారిస్ చేరుకున్నా. అంతర్జాతీయ రైతు సంఘం ప్రతినిధులను సదస్సు నిర్వహింపబడిన గ్రాండ్ హోటల్‌లో నవంబర్ ఒకటిన ఉదయం కలుసుకున్నాను. 1954లో న్యూయార్క్‌లో నిర్వహించిన సభ వాతావరణానికీ, ఇప్పటి వాతావరణానికీ ఎంత తేడా? ఒక వారం ముందు నేను నిడుబ్రోలు నుండి బయలుదేరేటప్పుడు ప్రపంచానికి అక్టోబర్ 30 నుండి ఏం జరగబోతున్నదో తెలియని స్థితి.

అయితే సదస్సు జరిగే సమయంలో ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లు ఈజిప్ట్‌కు తుది హెచ్చరికలు జారీచేశాయి. అవి ప్రెసిడెంట్ నాజర్ సూయజ్ కాలువను జాతీయం చేసిన విషయంలో చేసిన హెచ్చరికలు. కమ్యూనిస్ట్ యువత చేపట్టిన హంగరీ జాతీయ విప్లవం వల్ల సోవియట్ సేనలు ఆక్రమించిన ప్రాంతం నుండి వెనక్కి రప్పించే విషయంలో సఫలీకృతమయ్యేందుకు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. గత దశాబ్ద కాలంగా సాగిన సోవియట్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా హంగరీకి చెందిన విప్లవ యువతలో దేశభక్తికి సానుభూతి లభించింది. ఐరోపాలోని సోవియట్ ఉపగ్రహ రాజ్యాలకు చెందిన ప్రజలందరి విముక్తి విషయంలో ఆశలు చిగురించాయి. కమ్యూనిస్ట్ నియంతృత్వం పదేళ్లపాటు కొనసాగిన తర్వాత కూడా అటువంటి తిరుగుబాటు తలెత్తడాన్ని నేను ఓ దివ్యవార్తగా భావించాను. ఇది కూడా నాలో స్ఫూర్తినింపి భారతదేశపు ప్రజాస్వామ్యానికి సంబంధించిన కొన్ని సందేహాలను పటాపంచలు చేసేటట్లుగా నాలో ఆశలు రేకెత్తించింది. నాలో నేనిలా అనుకున్నాను: భారతదేశపు ఎన్నికల్లో కొన్ని రాష్ట్రాల్లో కమ్యూనిస్ట్‌లు గెలవాలి. అప్పుడు వాళ్ల అధికారం నుండి విముక్తి చెందేందుకు హంగరీకి చెందిన దేశభక్తుల్లా అక్కడి ప్రజలు ప్రతిఘటించి

విముక్తి చెందాలి.'ది వరల్డ్ రోల్ ఆఫ్ నేషనల్ రివల్యూషన్', 'ఔట్ లైన్స్ ఆఫ్ నేషనల్ రివల్యూషనరీ పాత్'లలో హంగరీ ప్రజల త్యాగాలను వివులీకరించాను. కొద్దివారాలక్రితమే పోలెండ్ దేశస్థులు సోవియట్ పెత్తనానికి దూరమై స్థానికంగా కమ్యూనిస్ట్ రాజ్యాన్ని స్థాపించుకున్న వైనాన్ని చూశాను. అటువంటి వాతావరణంలో నా ప్రసంగం బాగా ఆకట్టుకున్నది. వాస్తవానికి హంగరీ విప్లవం నాకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఆంధ్రదేశపు రాజకీయ పతనపు నిరాశ నన్ను వీడింది. జవహర్‌లాల్‌జీ భారతదేశపు రైతుల నెత్తిపై రుద్దనున్న సహకార వ్యవసాయపు భయం వల్ల వాళ్లు నైరాశ్యంపాలవుతారేమోనన్న ఆందోళన మటుమాయం కాసాగింది. ప్రజల తిరుగుబాటు కారణంగానే కేరళలోని కమ్యూనిస్ట్ మంత్రి వర్గం కుప్పకూలింది.

ఇక సుదీర్ఘమైన నా రెండో ప్రసంగంలో నేను ప్రపంచంలోని సకల ప్రజాస్వామిక శక్తులు మానవ హక్కుల పరిరక్షణకు, స్వేచ్ఛకు, స్వేచ్ఛావర్తనులుగా మనుగడ సాగించాలనుకునే వికేంద్రీకృత సామాజిక, రాజకీయ సంస్థల అభివృద్ధికి చేయూతనివ్వాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పి తీసుకోవాల్సిన చర్యల్ని సూచించాను. నియంతృత్వ శక్తులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యవాదులు కలసికట్టుగా పనిచేయాల్సి ఉందని గుర్తుచేశాను.

అప్పుడు సదస్సుకు ఒక హెచ్చరిక చేయడం నా బాధ్యతగా గుర్తించాను: ఏ మూల నుండి ఎటువంటి సామ్రాజ్యవాదం ఎదురైనా దానికి వ్యతిరేకంగా నినదించాల్సిన అవసరం ఉందన్నాను. ఈజిప్ట్‌పై ఆంగ్లేయుల, ఫ్రెంచివాళ్ల దాడులను ఖండించి ప్రపంచంలోని ప్రజాస్వామిక శక్తుల్ని కూడగట్టి సోవియట్, ఫ్రాన్స్, బ్రిటన్‌ల సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాలన్నాను. బాండుంగ్ శక్తుల విషయంలో ఉదాసీనంగా ఉండి తప్పుచేసినట్లే తూర్పు దేశాల విషయంలో కూడా ఉదాసీనంగా ఉండి అటువంటి తప్పుకు తిరిగి అవకాశం కల్పించరాదన్నాను. ఈ అభిప్రాయంతో సదస్సు ఏకీభవించింది. ఈ వివరాలన్నీ 1957 జనవరి నాటి ఐపియు సంచికలోనూ, భారతీయ పత్రికల్లోనూ ప్రచురించడం జరిగింది.

దురదృష్టవశాత్తూ హంగరీ విప్లవం విషాదాంతంగా ముగిసింది. పోలెండ్‌తో కుదుర్చుకున్న ఒప్పందంలాంటిదే హంగరీతోనూ కుదుర్చుకోవడం జరిగింది. హంగరీ నుండి వెనుదిరిగిన బలగాలు తమ ప్రాబల్యాన్ని చాటేందుకు తిరిగి హంగరీలో ప్రవేశించాయి. పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదాన్ని మన్నించగలవారికి తమను విమర్శించే

నైతిక హక్కు లేదన్నాయి. అలా రెండు విభిన్న ప్రాంతాల్లో రెండు విధాలైన సామ్రాజ్యవాదాలు ఏకకాలంలో చర్య, ప్రతిచర్యల రూపంలో ప్రత్యక్షం కావడం శోచనీయం.

నవంబర్ ప్రథమ పక్షంలో నేను లండన్, లాంక్‌షైర్‌లలో ఉన్నాను. హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రతిపక్ష నాయకుని గదిలో నేను హూ గైట్ స్కెల్‌ను కలుసుకున్నాను. మేము ఐరోపా, ఆసియా స్థితిగతుల్ని చర్చించుకున్నాం. ఐరోపావారు తమ సామ్రాజ్యవాద ప్రాబల్యాన్ని ఆఫ్రికాపై వీడనంతవరకూ, ఆసియా, ఆఫ్రికాల్లోని వాళ్ల రక్షణ స్థావరాలను రద్దు చేయని పక్షంలో చైనా, రష్యాలు కూడా తమ చర్యలను కొనసాగించేందుకు ఉత్సుకత చూపే ప్రమాదమున్నదన్న నా భావనతో ఆయన ఏకీభవించారు. లేబర్ పార్టీ అవలంబిస్తున్న సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరి భారతదేశానికి నచ్చుతుందన్న అంశం ఆయన్ను ఆనందపర్చింది. ఆంగ్లేయులు, ఫ్రెంచివారు ఈజిప్ట్‌పై దాడి చేయడాన్ని ఖండించిన జవహర్‌లాల్‌జీ హంగరీపై సోవియట్ హింసాత్మక చర్యల్ని ఖండించకపోవడం ఆయనకు నచ్చలేదు.

మాటల మధ్య ఆయనకు ముందు ప్రధానిగా ఉన్న అట్లీ ప్రస్తావన వచ్చింది. అట్లీ అభిప్రాయం ప్రకారం సామ్యవాదం (సోషలిజం) అనేది జయప్రదం కావాలంటే, అది అభివృద్ధి దిశగా సాగాలంటే దానికి మానవ స్వేచ్ఛ పట్ల, సంపూర్ణ ప్రజాస్వామిక విధానాల పట్ల నిబద్ధత కలిగి ఉండాల్సి ఉంది.

లండన్‌లో ఉన్న ఆ సమయంలో ఫెడరేషన్ ఆఫ్ వరల్డ్ గవర్నమెంట్ (ప్రపంచ రాజ్య సమాఖ్య) నాయకులు క్లెమెంట్ వెబ్, గిల్బర్ట్ మెకాలిస్టర్ వంటివారిని కలిశాను. వాళ్లతో మాట్లాడినప్పుడు అర్థమయ్యింది కాశ్మీర్ విషయంలో భారత వైఖరిని కన్సర్వేటివ్ పార్టీ ఎంతగా అర్థంచేసుకున్నదీ. కన్సర్వేటివ్ పార్టీ పాకిస్థాన్‌ను సమర్థించే వైఖరిని ఎందరో లిబరల్స్, ఇతరులు సమ్మతించారు.

ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ ఎలియన్స్ కార్యాలయాన్ని మరోసారి సందర్శించాను. ప్రపంచవ్యాప్తంగా సహకార ఉద్యమం ఎదుర్కొనే సమస్యల్ని మరీ ముఖ్యంగా తూర్పు దేశాలు ఎదుర్కొనే సమస్యలను అక్కడి డైరెక్టర్‌తోనూ, ఆయన సహాయకులతోనూ చర్చించాను. సహకార సంఘాల నిర్వహణలో ప్రభుత్వాలు పెత్తనం చేయడాన్నిగానీ, జోక్యం కల్పించుకోవడాన్నిగానీ సహకార సంఘాలు అనుమతించడం జరిగితే అది ఆత్మహత్యా సదృశ్యమేనని మేమందరం అంగీకరించాం. భారత రిజర్వ్ బ్యాంక్ రూరల్

క్రెడిట్ సర్వే చేపట్టి నివేదికలో పొందుపర్చిన సిఫారసులలో ఎంతగా ప్రభుత్వ పెత్తనం, జోక్యం ఉన్నదో గమనించి వాళ్లు దాన్ని హర్షించలేకపోయారు. ఆ విషయంలో వాళ్లతో నేను ఏకీభవించాను.

పాట్నాలో జరిగిన అఖిలభారత సహకార సంఘాల సదస్సులో అందరూ ఆ నివేదికనే పరిగణనలోకి తీసుకున్నారు. అధికారుల పెత్తందారీతనాన్ని ఓ ఎనిమిదేళ్లపాటు పెరుగుతూ పోతూ ఉండడాన్ని అనుభవించాం.

అయితే 1958 ఏప్రిల్‌లో ఢిల్లీలో జరిగిన సదస్సులో మాత్రం జవహర్‌లాల్‌జీ ఆ నివేదికలోని కొన్ని సిఫారసులను గుడ్డిగా అమలుచేసి తన ప్రభుత్వం తప్పు చేసిందని అంగీకరించారు. నేను ప్రభుత్వాలను అంటే మంత్రులను, అధికారులను కేవలం సలహా సంప్రదింపులతో సరిపెట్టుకోమన్నాను. వాళ్ల మాట నెగ్గించుకోవాలనో, క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలనో, సహకార సంఘాలను రద్దు చేయాలనో చూడరాదన్నాను. వాటి నిర్వహణ, ఎన్నికలు, లెక్కల తనిఖీలు పక్షపాత రహిత, పార్టీ రహిత, న్యాయాధీశులతో కూడిన ట్రిబ్యునల్ లేదా కమిషన్‌కు అప్పగించాలన్న నా మాటను పట్టించుకోలేదు.

1958లో జార్జి పాద్మోర్ మరణం వల్ల ప్రపంచంలో ప్రజాస్వామ్యం ఒక అసహాయ శూరుణ్ణి కోల్పోయింది. వలస ప్రజల స్వాతంత్ర్యోద్యమాన్ని మరీ ముఖ్యంగా ఆఫ్రికాకు సంబంధించి కొనసాగించేందుకు ఎంతగానో శ్రమించాడు. ఆయన రాసిన గ్రంథాలు ఆఫ్రికా ప్రజల అవసరాల విషయంలో, పాశ్చాత్య దేశాలకు కనువిప్పు కలిగించడంలో ఎంతగానో తోడ్పడ్డాయి. జార్జి గనుక 1965 వరకూ జీవించి ఉంటే నైజీరియా, కెన్యా, ఉగాండా, న్యాజాలాండ్ ఇంకా అనేక ఇతర ఆఫ్రికా దేశాలు స్వాతంత్ర్యాన్ని సముపార్జించుకోవడం చూసి ఎంతగా ఆనందించి ఉండేవాడో.

కాలనీ దేశవాసుల మంచి మిత్రుడు ఫెన్నర్ బ్రాక్వేను హౌస్ ఆఫ్ కామన్స్ వద్ద కలిశాను. ఆయన రాసిన 'కెన్యాస్ స్ట్రగుల్ ఫర్ ఫ్రీడం' అనే గ్రంథం నాకు నచ్చిందని చెప్పాను. భారతదేశపు నాయకులు మొరాకో, టునీషియా స్వాతంత్ర్య పోరాటాలకు మద్దతు తెలిపారని తెలిసి అక్కడి నాయకులు సంతృప్తిని వ్యక్తంచేశారని వెల్లడించాడు. జవహర్‌లాల్‌జీ ఏ విధంగా చైనా తరహా సహకార సేద్యం పట్ల మోజు చూపుతున్నదీ, నేను దాన్ని ఏ విధంగా వ్యతిరేకిస్తున్నదీ వివరించాను.

హెచ్.ఎన్.బ్రెయిల్స్‌ఫోర్డ్ అనారోగ్యంతో ఉన్న కారణంగా కలుసుకోలేక పోయాను.

నాలోని చాలా భావనలకు ఆయన స్ఫూర్తి ప్రదాత. అలాగే కోల్ ఆరోగ్యం కూడా బాగాలేనందున ఆయన్ను కూడా కలుసుకోలేకపోయాను. నేను కలుసుకోవాల్సిన హెరాల్డ్ లాస్కీ ఈ లోకాన్ని వీడాడు.

ఈ పర్యాయం లండన్‌లో ఉన్నప్పుడు సర్ హెూవర్డ్ డి గిల్వేతో నా స్నేహం మెరుగైంది. ఆయన సిపిఎకు సెక్రటరీ జనరల్. సిపిఎ ఆంగ్లంలోనూ, ఇంకా పలు భాషల్లోనూ ప్రచురించదల్చిన పార్లమెంటరీ డెమోక్రసీపై పలుమార్లు చర్చించాం. ఆ పుస్తకం తయారీలో నేను ప్రముఖ పాత్ర వహించినట్లు చెప్పడం ఆయన పెద్ద మనస్సుకు తార్కాణం. ఆయన వల్ల తిరిగి నా మిత్రులు ఆర్థర్ హెండర్సన్, మోర్గాన్, క్లెమెంట్ వెబ్, లార్డ్ హెూమ్‌వంటివారిని కలుసుకోగలిగాను. అటువంటి మంచి మిత్రుడు 1964లో కన్నుమూశాడు.

నేను బ్రిటిష్ హౌస్ ఆఫ్ అగ్రికల్చర్‌ను సందర్శించాను. నేషనల్ యూనియన్ ఆఫ్ ఫార్మర్స్‌కు అది సరికొత్త కేంద్ర కార్యాలయం. అక్కడ సర్ జేమ్స్ టర్నర్, నౌల్స్‌ను కలుసుకున్నాను. మేమంతా 1946 నుండి ఐఎఫ్ఎపిలో కలసి పనిచేశాం. వాళ్లంతా ఐరోపా స్వేచ్ఛా విపణి వల్ల ఎదురయ్యే ఇబ్బందుల పట్ల ఆందోళన చెందారు. అయితే వాళ్ల ప్రభుత్వం చేపట్టే ఏ ప్రతికూల విధానాన్ని అయినా నేషనల్ యూనియన్ ఆఫ్ ఫార్మర్స్ తిప్పికొట్టగలదన్నారు. అయితే భారతదేశపు రైతులకు అంతటి శక్తి లేకున్నా కనీసం జవహర్‌లాల్‌కు నచ్చజెప్పేందుకైనా సంస్థాగతమైన శక్తిని పుంజుకోనందుకు బాధ కలిగింది.

ఆగ్నేయ ఐరోపా లఘు దర్శనం - బల్గేరియా

బల్గేరియా వెళ్లి ఏం ప్రయోజనమబ్బా, అది కమ్యూనిస్ట్ దేశం కదా అనుకుని తటపటాయించాను. ఆ కమ్యూనిస్ట్ దేశంలో వాళ్ల నియంతృత్వ పోకడలకు అది చిరుప్రదర్శనగానే ఉంటుందనిపించింది. అయితే బి.జె.పటేల్ బల్గేరియా వెళ్లేందుకే మొగ్గు చూపుతున్నాడు. నేను సరే అన్నాను. మేము 1957 జూన్ 10న జెనీవా చేరుకున్నాం. స్విట్జర్లాండ్‌లోని ప్రజాస్వామ్యానికి, రష్యాలోని నియంతృత్వానికి ఎంత తేడా! ప్రజాభిప్రాయ సేకరణ, ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల్ని వెనక్కి పంపడం (రీకాల్) వంటి వాటిని భారత రాజ్యాంగంలో పొందుపర్చేటట్లు చేయలేకపోయిన విషయాన్ని వెల్లడించాను. అయినా భారతదేశంలో నెలకొన్న కుల కక్షలు, ఇంచుమించుగా ఒకే

బలం కలిగిన రాజకీయ పక్షాలు వృద్ధి చెందని కారణంగా స్విట్జర్లాండ్‌లో మాదిరిగా మంత్రి వర్గాల్లోకి రాజకీయ పక్షాలు సాధించిన సీట్లకు అనుగుణంగా ప్రాతినిధ్యం కల్పిస్తే బాగుండేది. అయితే అందుకు ఒకరి అభిప్రాయాలు మరొకరు గౌరవించే సంస్కారం కావాల్సి ఉంటుంది. అయితే ఆ విధానం చర్చల్లో జాప్యానికి, సాధ్యమయ్యేదానికి మించిన రాజీ ధోరణికి దారితీసే అవకాశం లేకపోలేదు. జయప్రకాశ్ నారాయణ్ కూడా పార్టీ రహిత లేదా సమస్త పార్టీల ఉమ్మడి నాయకత్వాన్ని మన మంత్రి వర్గ నిర్మాణంలో కోరుకుంటున్నాడు.

ఇటీవల కాలంలో కాంగ్రెస్ పార్టీ ఒరిస్సా, కేరళ, బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్‌లలో పరాజయం పాలైంది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రయోగాత్మకంగా స్విస్ పద్ధతిలో కమిటీ మంత్రి వర్గాలను ఏర్పాటుచేయాలని పదే పదే చెబుతూ వచ్చాను. దురదృష్టవశాత్తూ కాంగ్రెస్ పార్టీ ఒరిస్సాలో దుస్సాహసిక నేతల చేతుల్లోకి వెళ్లింది. కేరళలో అధ్యక్ష పాలన వచ్చింది. ఇదంతా రాజ్యాంగం పేరుతో కాంగ్రెస్ నియంతృత్వ ధోరణిని ప్రదర్శించడమే. మిశ్రమ ప్రభుత్వాల ద్వారా ప్రధాన సమస్యలపై ఏకాభిప్రాయ సాధనకు కృషి చేయడం మేలనిపించింది నాకు. గత పదిహేడు సంవత్సరాలుగా తిరుగులేని అధికారాన్ని మెజార్టీ ఓటు పద్ధతిని బ్రిటిష్ తరహాలో అనుభవించిన కాంగ్రెస్ వారు స్విట్జర్లాండ్ పద్ధతిలో అఖిలపక్ష మంత్రి వర్గ రూప కల్పనకు ఎందుకు ముందుకొస్తారు?

మా ప్రయాణం వియన్నా విమానాశ్రయం మీదగా సాగింది. అక్కడ పలు యూదు కుటుంబాలు పాలస్తీనా ముఖ్య పట్టణం **తెల్ అవివ్**కు తరలివెళ్లడం చూశాం. వాళ్ల పరిస్థితులు దారుణంగా ఉన్నా ఆశలు పెద్దవే. ఆస్ట్రియాకు స్వాతంత్ర్యం సిద్ధించిందిగా, మరి వాళ్లెందుకు పాలస్తీనా దిశగా సాగిపోవడం? పాలస్తీనా వాళ్ల కలల ప్రపంచం. **'ది ఎక్సోడస్'** అనే గ్రంథం చదివితే యోధులైన ఆ వలస ప్రజలు సాధించిన అద్భుతాలు మన కనులముందు నిలుస్తాయి.

11వ తేదీ రాత్రికి సోఫియాకు చేరుకున్నాం. మరుసటిరోజు రెండు వేలమంది ప్రతినిధులున్న ఆ సభలో పాల్గొన్నాం. కమ్యూనిస్ట్‌లు ఎక్కడైనా అంతే, అటువంటి సభలను గొప్పగా నిర్వహిస్తారు. నేను ఆ సదస్సులో భారతీయ సహకార సంఘ నాయకుల సందేశాన్ని వినిపించాను. భారతదేశంలోని సహకార వ్యవస్థలో గల స్వేచ్ఛాయుత ప్రజాస్వామిక అంశంపై దృష్టి పెట్టాను. మా దేశంలో సహకార సంఘాలపై

ప్రభుత్వ అజమాయిషీ ఏమేరకు ఉండాలనే విషయంపై కొత్తగా దృష్టిని సారిస్తున్నామని వెల్లడించాను. భారతదేశంలో స్వయం ఉపాధితో స్వేచ్ఛగా ఆర్థిక జీవనాన్ని కొనసాగిస్తున్న ఇరవై కోట్లమంది రైతులకు సహకార పద్ధతి ద్వారా అభ్యున్నతిని చేకూర్చేందుకు పాటుపడుతున్నామని చెప్పాను. రైతు ఆర్థిక వ్యవస్థకు, సహకార వ్యవసాయ క్షేత్ర ఆర్థిక వ్యవస్థకు మధ్య ఉన్న సానుకూలతలను, ప్రతికూల పరిస్థితులను చర్చించి భారతదేశానికి చెందిన సహకార సంఘాలవారు, రైతు వుద్యమాలు చేపట్టేవారు స్వయంపోషక రైతు ఆర్థిక వ్యవస్థ వైపు మొగ్గుచూపుతున్నారని చెప్పాను. కమ్యూనిస్ట్ నాయకుడు, యుగోస్లావియా పార్లమెంట్ సభ్యుడు, నా మిత్రుడు ఎం.పోపోవిక్ మమ్మల్ని అభినందించాడు. ఆయన కుమార్తె బ్రాంకిక్ దుబాసీగా వ్యవహరించింది.

సోఫియాకు సమీపంలో బల్గేరియా రైతు నాయకుడు ఎం.అలెగ్జాండర్ స్టాంబోలిస్కీ జ్ఞాపక చిహ్నంగా నిర్మించిన మ్యూజియంను చూసేందుకు జూన్ 13న వెళ్లాం. ఆయన 1921-22 మధ్యకాలంలో బల్గేరియాకు తొలి రైతు ప్రధాని. ఆయన్ను ప్రతికూల భూస్వామ్య దొరల వర్గానికి చెందినవారు పార్లమెంట్ హాలులోనే హతమార్చారు. రైతు నాయకులు ఆధునిక ప్రజాస్వామ్యంలో అధికారంలోకి వచ్చి వారికి అనుకూలమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోవాలి అని చాటిచెప్పిన ఆ రైతు నేతకు నివాళి అర్పించాం. జూన్ 14న ఆయన జన్మస్థలికి పయనమయ్యాం. అక్కడ ఆయన జన్మదిన వేడుకల్ని జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నారు. వాటిని తిలకించి ఉప్పొంగిపోయాం. ఎవరో ఉప్పందించారు వాళ్ల హరిత విప్లవంతో మమేకమైన భారతీయ ప్రొఫెసర్ను నేనేనని. ఇంకేముంది పలువురు నన్ను కలిసి అభినందించారు. అయితే వాళ్లంతా మమ్మల్ని హడావుడిగా వదలి వెళ్లడం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. బహుశా వారు కమ్యూనిస్ట్ మంత్రి వర్గాలకు చెందిన వాళ్లయ్యుంటారని, మాతో ఎక్కువసేపు గడపడం ఎవరైనా చూస్తే బాగుండదని వాళ్లు అలా చకచకా వెళ్లిపోయారని నాకు అనిపించింది. ఆ మృతవీరుడు, గొప్ప ప్రధాని జన్మించిన చిన్న కుటీరాన్ని చూశాం. ఆయన్ను పాడిచి చంపిన భవనాన్ని చూశాం. ఆ గ్రామంలో ఆయన జ్ఞాపకార్థం ఒక ఆధునిక పాఠశాల, రంగస్థలం, గ్రంథాలయం నిర్మించారు. ఆ జన్మదినం సందర్భంగా వాటిని ప్రజలకు అంకితమిస్తున్నారు.

ఆ సందర్భంగా అక్కడకు పెద్ద సంఖ్యలో రైతుల్ని సహకార క్షేత్రాలకు చెందిన వాహనాల్లో చేరవేశారు. అప్పుడు నిర్వహించిన సభలో నన్ను ప్రసంగించమన్నారు.

ఆ సమావేశంలో పాల్గొనడం నాకెంతో ఆనందదాయకంగా ఉందన్నాను. వాళ్ల నాయకుడు వాళ్ల నాయకుడుగానే మిగిలిపోడని, అంతర్జాతీయ స్థాయిలో పేరు సంపాదిస్తాడని, ప్రపంచవ్యాప్తంగా రైతులు, వాళ్ల నాయకులు ఆయన్ను కీర్తిస్తారని చెప్పాను. ఆయన ఆశయాలను, సాధించిన విజయాలను, చివరకు ఆయన బలిదానం విషయం కూడా నా గ్రంథం 'ది రివల్యూషనరీ పెజెంట్' అనేదానిలో విపులీకరించినట్లు తెలియజేశాను.

అలెగ్జాండర్ స్తంబోలిస్కీ విశ్వవిఖ్యాత వ్యక్తిగా రూపొంది కీర్తిశేషుడయ్యాడు. ఆయన శత్రువులు మరణించారు. ఆయన మాత్రం ఆచంద్ర తారార్కం అలాగే ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటాడు. అధికార మదాంధులైన భూస్వాముల పటాటోపాలన్నీ కాలగర్భంలో కలసిపోయాయి. ఈ రైతు నేత భావనలు, సేవలు బల్గేరియాలో మాత్రమేకాదు ప్రపంచ వ్యాప్తంగా రైతులు గుర్తుకు తెచ్చుకుంటూనే ఉంటారు. నేటికీ అధికార లాలసులు, అధికారం ఎక్కడుంటే అక్కడ ప్రదక్షణలు చేసేవారు ఆయన్ను చూసి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. కర్షక ప్రజాస్వామ్యం, వ్యవసాయిక సామ్యవాదం, స్వేచ్ఛ అనేవి శాశ్వతం. నియంతృత్వం, దోపిడీ, జిత్తులు క్షణికం. ప్రపంచంలోని కార్మికులందరూ ఏకమైనట్లు కర్షకులు కూడా ఏకం కావాల్సి ఉంది. అప్పుడే స్వేదం చిందించే వాళ్లందరి నిజమైన ప్రజాస్వామ్యం వర్ధిల్లగలదు'.

బహిరంగ సభ తర్వాత ఆడిటోరియంలో చిన్న అంకిత ఉత్సవం నిర్వహించారు. ప్రఖ్యాత నటి మిస్ మార్గరిత దాన్ని నిర్వహించింది. ఆమె పార్లమెంట్ సభ్యురాలు. జాతి కోసం జీవితాన్ని అర్పించిన ఓ నాయకుని కుమార్తె. మాకు ఆశ్చర్యం కలిగించిన అంశమేమంటే కమ్యూనిస్ట్ ప్రభుత్వం తమ మంత్రి వర్గంలోకి రైతుల పార్టీ నుండి ముగ్గురు నాయకుల్ని తీసుకుంది. భోజనానంతర ప్రసంగాల్లో నాయకులందరూ ఆ మృతవీరుని సిద్ధాంతానికి మద్దతు పలికి రైతుల పక్షాన నిలుస్తామని మాట ఇచ్చారు.

జూన్ 15న ఆ పర్వత సానువుల్లో ఉన్న జాతీయ ఆశ్రమాన్ని సందర్శించాం. అది ఒకనాడు బల్గేరియా జాతీయతకు, సాహిత్యానికి ఊయలగా నిలిచింది. కొద్దిమాసాలక్రితమే జైళ్ల నుండి విడుదలైన రైతు నాయకుల్ని కొందరిని కలుసుకున్నాం. ఎందరో రైతు నాయకులు పూర్వపు రైతువాదాన్ని వదలి కమ్యూనిస్ట్ పాలనతో రాజీపడిన స్థితిని అర్థంచేసుకున్నాం.

జూన్ 16న నన్ను రైతు పార్టీ కార్యాలయానికి ఆహ్వానించారు. అక్కడ గోడ మీద

ఓ శిలాఫలకాన్ని చూశాను. జమీందారీ ప్రభువులు పార్లమెంట్‌లో కాల్చిచంపిన మరో రైతు బాంధవుడు రాదిక్ స్మారక చిహ్నమది. వాళ్ల కార్యాలయం బహుళ అంతస్థుల భవనం. ఆడిటోరియంలో ఎందరో రైతు నాయకుల చిత్రపటాలను చూడొచ్చు. రైతుల పార్టీకి చెందిన మంత్రులు, మిగతా నాయకులు ప్రజా క్షేమాన్ని ఆశించి వాళ్లు కమ్యూనిస్ట్‌లతో ఎలా రాజీపడిందీ వివరించారు.

బి.జె.పటేల్, నేనూ కలసి సోఫియాకు దగ్గర్లోని కొన్ని వ్యవసాయ క్షేత్రాలను, సహకార పద్ధతిపై నడిచేవాటిని చూశాం. రైతులు పెద్ద పెద్ద రొట్టెల నుండి ముక్కలను తీసుకుని తింటున్నారు. వాళ్ల దుస్తులు కూడా పేదరికాన్నే ప్రదర్శిస్తున్నాయి. మేము ఆరా తీస్తే మాకు లభించిన సమాచారం ప్రకారం కమ్యూనిస్ట్‌లకు బాగా సానుకూలంగా వ్యవహరించే రైతులకు వేరే తావున పొలాలు కేటాయించారు. వాళ్ల కుటుంబాలు శ్రద్ధపెట్టి పనిచేసి ఆ పొలాల్లో ఎక్కువ ఫలసాయాన్ని సాధించగలరని చెబుతారు. వ్యవసాయంలోకి సాముదాయికత్వం ప్రవేశించినా, అది సహకార పద్ధతిలో సాగినా ప్రోత్సాహకాలు తప్పవని, అవి రైతు ఆర్థిక వ్యవస్థకు పునాదులు వేస్తాయని దానివల్ల మనకు అర్థమవుతుంది. బి.జె.పటేల్ పోలెండ్, జెకొస్లోవేకియాలు సందర్శించి వచ్చిన తర్వాత ఆయన చెప్పినదాని ప్రకారం పోలెండ్‌లో రైతులకు వాళ్ల భూముల్ని తిరిగి ఇచ్చివేశారు. ఆ విధంగా గోముల్కా సహకార పద్ధతిలో అభివృద్ధి సాధ్యంకాదన్న సత్యాన్ని గ్రహించడంతో తిరిగి రైతు ఆర్థిక వ్యవస్థ పుంజుకోసాగింది. అయితే గోముల్కా సంప్రదాయ కమ్యూనిస్ట్‌లకు తలవొగ్గి రాజ్య ప్రోత్సాహంతో సహకార వ్యవసాయానికి ప్రాధాన్యాన్ని ఇస్తే చాలా కమ్యూనిస్ట్ దేశాల్లో వ్యవసాయిక ఆర్థిక వ్యవస్థ తిరిగి విజయవంతంగా నెలకొనగలుగుతుంది. యుగోస్లావియాలో గోముల్కా రైతులకు వాళ్ల భూముల్ని వాళ్లకు తిరిగి ఇచ్చివేసే పద్ధతిని మెచ్చుకున్నారు.

నియంతృత్వ విధానం అమలులో ఉన్న సోవియట్ రాజ్యాల్లో సహకార సంస్థలకుగానీ, వాటి సభ్యులకుగానీ స్వతంత్రంగా వ్యవహరించడం కుదరదు. ఇక్కడ స్వచ్ఛంద సేవా విధానానికి తావుండదు. వాళ్లంతా రాజ్యంతో సమ్మిళితమైనవారు. వారిని రాజ్యం పెత్తనం కిందకు తెచ్చుకునేందుకు అలా ఊరించడం జరుగుతున్నది. సహకార సంఘాలు ప్రభుత్వ పెత్తనాన్ని కొనసాగించే కేంద్రాలు. అవి ప్రభుత్వ పెత్తనాన్ని సరాసరిగాకాక పరోక్షంగా సాగిస్తాయి.

నేను జూన్ 17న ఆ సుందరమైన ప్రదేశం సోఫియా నుండి తిరిగి బయలుదేరాను.

మార్గమధ్యంలో వియన్నాలో ఆగాను. అది యుద్ధానికి ముందు రోజుల్లో సోషలిస్ట్‌ల సుందర నగరం. నేను పార్లమెంట్ భవనానికి వెళ్లాను. అది చాలా పెద్ద ప్రాసాదం. దానిలోని విశాలమైన హాలును కేవలం ఆ దేశానికి చెందిన ఎనభైమంది పార్లమెంట్ సభ్యులు మాత్రమే వాడుకుంటున్నారు. అందులో రెండు పెద్ద కళామందిరాలున్నాయి. అందులో రూబెన్ రూపొందించిన పేరెన్నికగన్న చిత్రాలను తిలకించాను. ముఘుల్ చిత్రాలను మాత్రమే ఉంచిన చిత్రశాలను కూడా సందర్శించాను. అక్కడి భారతీయ రాయబార కార్యాలయ ప్రతినిధులు నాతో అన్నారు: ఆస్ట్రియా సోవియట్ రాజకీయ, ఆర్థిక కట్టడి నుండి వైదొలగిన తర్వాత అక్కడ అభివృద్ధి వేగాన్ని పుంజుకుందని. వియన్నా వారికి సాంకేతిక నైపుణ్యం మెండు. అలాగే యంత్ర సామాగ్రి విషయంలోనూ మెరుగే. వారు వారి నిపుణులను అనేక దేశాలకు పంపే స్థాయికి ఎదిగారు.

ఏథెన్స్ మీదగా ప్రయాణం సాగుతున్నప్పుడు 1955 నాటి పర్యటన విశేషాలను గుర్తుకుతెచ్చుకున్నాను. అప్పుడు మేము అమెరికా, కెనడా, ఇంగ్లండ్, గ్రీస్, భారతదేశం, ఈజిప్ట్ దేశాలకు చెందినవాళ్లం ఉన్నాం. సోక్రటీస్ తర్వాత ఆ దేశానికి పట్టిన గతిని గురించి ముచ్చటించుకున్నాం. ప్రపంచానికి బోధనలు అందించిన ఆ తాత్వికుణ్ణి ఆ దేశంవాళ్లే చేతులారా చంపుకున్నారు. గ్రీస్ ఎవరి ఆధీనంలో ఉండాలనే విషయంలో ఇంగ్లండ్, రష్యాల మధ్య యుద్ధం జరిగింది. ఈ విషయం మా మధ్య చర్చకు వచ్చింది. ఆ పోరాటంలో ఒక పక్క స్థానిక గ్రీకు లిబరల్స్, సోషలిస్ట్‌లు మరో పక్క కమ్యూనిస్ట్‌లు నిలిచి పోరాడారని గ్రీసుకు చెందిన మా మిత్రుడు యం.టేకిస్ వెల్లడించాడు. 1967లో గ్రీస్ తిరిగి సైనిక నియంతృత్వంలోకి ప్రవేశించింది. దానికి కారణం యుద్ధానంతర ప్రజాస్వామ్యం విఫలం కావడమే.

నేను భారతదేశానికి తిరిగి రాగానే అంతర్జాతీయ రైతు సంఘానికి చెందిన ఆప్తమిత్రుడు జార్జి దిమిత్రాయ్‌ను కలుసుకునేందుకు హుటాహుటిన హైదరాబాద్ వెళ్లాను. ఐరోపా పర్యటనకు బయలుదేరేముందు నేను ఢిల్లీ నుండి నిడుబ్రోలుకు చేరుకుంటే ఆయన ఢిల్లీకి చేరుకున్నారు. బల్గేరియాకు బయలుదేరేముందు కేవలం ఒక్కరోజే ఆయనతో కలసి ఉన్నాను. ఆయన దేశానికి నేను వెళుతున్నందుకు వుత్తేజితుడయ్యాడు. పదేళ్లక్రితం వాళ్లు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని దేశం వదలి పారిపోవాల్సి వచ్చింది. అలా వాళ్లు కమ్యూనిస్ట్ పాలన బారినపడకుండా బతికిపోయారు. స్తంబోలిస్కి జన్మస్థలికి వెళ్లాల్సిందిగానూ, వీలైతే ఆయన జన్మదిన వేడుకల్లో

పాల్గొనవలసిందిగానూ సూచించింది ఆయనే.

మేమిద్దరం హైదరాబాద్‌లో రంగా భవన్‌లో కలుసుకున్నప్పుడు ఎన్నెన్నో ఉత్తేజకర, ఉల్లాసమయ కబుర్లు కలబోసుకున్నాం. ఆయన మిత్రులు చాలామంది కమ్యూనిస్ట్ పాలనతో రాజీపడాల్సి రావడం ఎంతో బాధాకరం. ఆయన పంజాబ్, రాజస్థాన్, బొంబాయి, హైదరాబాద్ పర్యటన విశేషాలు తెలియజేశారు. అన్ని తావుల్లోనూ కాంగ్రెస్ మంత్రుల్లో ఒకరిద్దరు తాము గ్రామీణ సమస్యలు, ప్రజల విషయంలో కృషికార్ లోక్‌పార్టీ పంథా అని చెప్పారట. అలా కృషికార్ లోక్‌పార్టీ సిద్ధాంతాలు కాంగ్రెస్‌లోకి చొచ్చుకుపోవడం చూసి ఆయన అమితానందం పొందినట్లు చెప్పారు. నా కాంస్య విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవంలో పాల్గొనడానికే ఆయన విజయవాడ వచ్చారు. కలరా వ్యాధి ప్రబలిన కారణంగా జూన్ 23 నుండి జూలై 12వ తేదీకి వాయిదాపడింది. అయితే ఈలోగా జపాన్ వెళ్లివస్తానన్నవాడు నిడుబ్రోలులోని మా నివాస స్థానం గోభూమికి బయలుదేరాడు. తెనాలి నుండి నిడుబ్రోలుకు కారులో బయలుదేరాం. అది 23 జూన్ 1958. కాలువ మీద వంతెన వద్ద ఊరేగింపు ప్రారంభమైంది. అలంకరించిన ఎద్దులబండి మీద మమ్మల్ని ఊరేగించారు. రైతు విద్యాలయం వద్ద ఆయనకు గొప్ప సన్మాన పత్రం సమర్పించారు. 1934 నుండి రైతు విద్యాలయం పనిచేసిన తీరును ఆ సభలో వివరించారు. డాక్టర్ దిమిత్రాయ్ నిడుబ్రోలును స్తంభోలిస్కి గ్రామం స్లవోత్సతో సరిపోల్చారు. ఆయన ప్రసంగంలో ఇలా చెప్పారు : 'రంగాజీ నినాదం ప్రపంచ కర్షకులారా ఏకంకండి' అనేది పశ్చిమ భూగోళంలో మారుమోగుతోంది. అంతర్జాతీయ రైతు సంఘం, పాశ్చాత్య ప్రజాస్వామిక నేతలు మీ నాయకుడ్ని తమ నాయకుడని కూడా భావిస్తున్నారు'. నేను ఆ సందర్భంగా 'ది క్రెడో ఆఫ్ ది వరల్డ్ పెజెంట్రీ' అనే నా ఆంగ్ల గ్రంథపు తొలి ప్రతిని ఆయనకు బహుకరించాను.

మేము తిరిగి తెనాలి చేరుకునేటప్పటికి ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసాన్ని ప్రకటించే కార్యకర్తలు పలువురు ప్రముఖ న్యాయవాది ఆవుల గోపాలకృష్ణమూర్తి గారి అధ్యక్షతన దిమిత్రోయ్‌ని కలిశారు. కాంగ్రెస్ నాయకత్వంలో ప్రజాస్వామ్యం ఎక్కువకాలం కొనసాగదేమోననే సందేహాన్ని వెలిబుచ్చి భారతీయ రైతులకూ చేతివృత్తులవారికీ ప్రభుత్వంలో భాగస్వామ్యముంటే ప్రజాస్వామ్యానికి ఢోకా వుండదు అనే విశ్వాసాన్ని ప్రకటించారాయన. దురదృష్టవశాత్తూ గోపాలకృష్ణమూర్తి 1966లోనే తుదిశ్వాస విడిచారు. మానవతా వాద ఉద్యమానికి ఆయన మరణం ఓ తీరని లోటు.

1957లో పాకిస్థాన్, శ్రీలంక పర్యటన

7.11.1957లో గుడివాడలో జన్మదిన వేడుకలు జరుగుతూ ఉండగా టెలిఫోన్ సందేశం – ఢిల్లీలో జరిగే కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సుకు భారతదేశ ప్రతినిధి వర్గ సభ్యునిగా హాజరుకావాలని. ఆ సదస్సు ప్రతినిధి వర్గం నవంబర్ 11 నుండి 20 వరకూ పాకిస్థాన్‌లోనూ, 21 నుండి 25 నవంబర్ వరకూ సింహళంలోనూ పర్యటించాల్సి ఉంది.

నేను 10 వ తేదీన ఢిల్లీ చేరుకున్నాను. అక్కడ ఢిల్లీలోని మిత్రులు నా 58వ జన్మదిన వేడుకలు ఆ సాయంత్రం నిర్వహించారు. సహకార వ్యవసాయం ముసుగులో జవహర్‌లాల్‌జీ వినోబాజీల మద్దతుతో తలపెట్టిన సాముదాయికత్వ పోకడలను సాహసోపేతంగా ఎదుర్కొంటున్నందుకు నన్ను వాళ్లంతా అభినందించారు.

మరుసటి రోజు విమానంలో కరాచీ చేరి మా ప్రతినిధి వర్గ బృందాన్ని కలుసుకున్నాను. మేము 11 రోజులపాటు కరాచీ, లాహోర్, హైదరాబాద్, తెట్టా, పెషావర్, ఖైబర్ మార్గాలను చుట్టివస్తూ పాకిస్థాన్‌లో పర్యటించాం. అక్కడ నేను నీటిపారుదల ప్రాజెక్టులు, ఔళిమిల్లులు, పట్టణ ప్రాంతపు గృహ సముదాయాలు సాధించిన అభివృద్ధిని గమనించాను. కెనడా సాయంతో ఆదివాసీ ప్రాంతాల్లో భారీ నీటిపారుదల ప్రాజెక్టును కట్టి ఆధునిక ప్రపంచపు వనరుల్ని వాళ్ల ముంగిటకు చేర్చడాన్ని చూసి ముచ్చటేసింది. మంగళా డామ్ నిర్మాణం వల్ల కాశ్మీర్‌కీ, కొన్ని ఆదివాసీ ప్రాంతాలకూ లబ్ధి చేకూరుతుంది. యువ ఇంజనీర్లు వాళ్ల పనిపట్ల ఎంతో శ్రద్ధ చూపుతున్నారు.

రాజకీయంగా పాకిస్థాన్ అస్థిరత్వాన్ని ఎదుర్కొంటున్నది. వాళ్ల ఆంగ్ల దినపత్రికలన్నీ భారతదేశంపై దుమ్మెత్తిపోస్తున్నాయి. భారతదేశంలోని ముస్లింలు జాతి వైరాన్ని అనుభవిస్తున్నారని కల్లబొల్లి కథనాలను ప్రచురిస్తున్నాయి. వాళ్లల్లో భారతదేశం పట్ల ఉన్న విద్వేషం నన్ను కలచివేసింది. భారతదేశంలో మాత్రం పాకిస్థాన్ వైఖరి పట్ల, వారి అంతర్గత రాజకీయాల పట్ల నిర్లిప్త భావనే ఉంది. పాకిస్థాన్ రాజకీయవేత్తల్లో తొలిసారి సాధారణ ఎన్నికలను నిర్వహించే విషయంలో కూడా ఏకాభిప్రాయం లేదు. ఆ తర్వాత సైనిక నియంతృత్వ ఆవిర్భావం రాజకీయ పార్టీలన్నింటినీ నిషేధించడం చూస్తే అప్పుడు మేము పాకిస్థాన్‌లో రాజకీయ అస్థిరత్వం ఉన్నదని భావించడం

సబబే కదా. కుంటుతున్న పార్లమెంటరీ వ్యవస్థ స్థానంలో మార్షల్ ఆయూబ్‌ఖాన్ గత యేడేళ్ల పాలన పరోక్ష ప్రజాస్వామ్యం దిశగా సాగింది. ఆయూబ్‌ఖాన్ భారత్‌ను ద్వేషించండి అనే నినాదం నుండి దూరంగా జరగలేదు. పాకిస్థాన్ రాజకీయ నేతల ధోరణీ అదే. ఆ ధోరణే 1965లో పాకిస్థాన్‌ను కచ్, కాశ్మీర్‌ల ఆక్రమణలకు పురికొల్పింది. తాష్కెంట్ ఒప్పందం సైతం భారత్ పట్ల వాళ్ల ద్వేషాన్ని దూరం చేయలేకపోయింది.

నేను తిరిగి లాహోర్‌ను, మొఘలులు నిర్మించిన ఆ గొప్ప మసీదును, అందమైన సిక్కుల గురుద్వారాను, ఆకర్షణీయమైన కోటను చూడగలిగాను. ప్రముఖ ఉర్దూ కవి మహ్మద్ ఇక్బాల్ జ్ఞాపకార్థం నిర్మించిన సమాధిని సందర్శించాను. 'సారే జహాసే అచ్చా హిందూస్థాన్ హమారా' అనే గేయాన్ని మనకు అందించింది ఆయనే. జహంగీర్ చక్రవర్తి నిర్మించిన షాలిమార్ ఉద్యానవనంలో తేనేటి విందును ఆస్వాదించాం. బాధాకరమైన అంశమేమంటే దేశ విభజనకు ముందు పంజాబ్ రాష్ట్రానికి చెందిన సమైక్య భారతనేత పాకిస్థాన్ విభజన విషయంలో చాలా సంవత్సరాలు జిన్నా ఆటలు సాగవని చెప్పారు. సికందర్ హయ్యత్ ఖాన్ సమాధిపై నిర్మింపతలపెట్టిన భవన నిర్మాణం పునాదుల మట్టంతోనే నిలిచిపోవడం విశేషం.

శ్రీలంకలో మేము అక్కడి మిశ్రమ మంత్రి వర్గంతో (కమ్యూనిస్ట్ ప్రతినిధులతోసహా) ఘర్షణకు దిగాల్సి వచ్చింది. ఆ ప్రభుత్వం రెండు సంవత్సరాలకుపైగా కొనసాగింది. మేము అక్కడకు చేరినప్పుడు ఆహార ధాన్యాల బిల్లు రాజకీయ దుమారాన్ని రేపుతోంది. వరి పండించే పొలం ఎవరికీ ఐదెకరాలకు మించి ఉండరాదని ఆ బిల్లు కట్టడి చేస్తోంది. కమ్యూనిస్ట్ పార్టీకి చెందని వారంతా దానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. కేబినెట్ సహచరుల మధ్య సమన్వయం సాధించలేక ప్రధాని సతమతమవుతున్నారు.

ప్రధాని బండారు నాయకే నేను ఆక్స్‌ఫర్డ్‌లో చదివే రోజుల్లో నా సహధ్యాయి. ఆయన ప్రాచ్య ప్రపంచంలో అటువంటి మిశ్రమ ప్రభుత్వాల ఏర్పాటును కోరుకున్నవారు. దురదృష్టవశాత్తూ 1959లో ఆయన్ను హత్య చేశారు. అప్పటి నుండి శ్రీలంకలో రాజకీయ అస్థిరత్వమే నెలకొని ఉంది. ఇటీవలి వరకూ (జనవరి 1965) ఆయన సతీమణి శ్రీమతి సిరిమావో ప్రధానిగా రాజ్యపాలన చేసింది. లిబరల్ పార్టీ ఆమె మిశ్రమ ప్రభుత్వాన్ని పడగొట్టి సేనా నాయకే ప్రధానిగా స్వతంత్ర ప్రణాళికా రచనతో ప్రభుత్వ పగ్గాలు చేపట్టింది.

కాండీకి కారులో వెళ్లాం. మార్గమధ్యంలో అందమైన లోయలు, వాటి నిండా నవ్వులు చిందించే వరి పొలాలు, విల్లంబుల్లా వంగిన వెదురు గుబుర్లు, ఆకర్షణీయంగా అరటి తోటలు, తెల్లని దుస్తుల్లో ఆహ్వానం పలికే స్త్రీ, పురుషులు కొబ్బరి బోండాలు అమ్ముతూ చల్లని కొబ్బరి నీళ్లతో సేదతీర్చసాగారు. ఆ గార్డెన్ ఆఫ్ ఈడెన్‌లో మా ప్రయాణం ఎంతో ఉల్లాసంగా సాగింది.

బ్రహ్మాండమైన ఆ కాండీ సరస్సు పాము మెలికలు తిరిగినట్టుగా ఉండి ఆకర్షణీయంగా ఉంది. విశ్వవిద్యాలయ భవనాలు అజంతాలోని పూర్వపు బౌద్ధ గుహల నిర్మాణ శైలిని పోలి ఉన్నాయి. విద్యార్థి వసతి గృహాలు బౌద్ధ విహారాల మాదిరిగా తీర్చిదిద్దారు. ఆ నిర్మాణ శైలి అంతా రోమాంచకంగా ఉండి ఆ బౌద్ధ భూమికి తగినట్లుగా ఉంది. అప్పుడే నాకు భారతీయ నిర్మాణ శైలిలోని గోపురాలు బెనారస్ విశ్వవిద్యాలయానికి చెందినవి గుర్తుకొచ్చి ఎంత బాగున్నాయో అనిపించింది. సిరిగిరియాలోని ఏకశిలా రాజప్రాసాదాన్ని చూసి ముగ్ధులమయ్యాం. అదంతా అజంతా రీతికి చెందిన కళ.

ఆ దేశంలో స్థిరపడిన భారతీయుల పట్ల, ఆ దేశంలో పొట్టబోసుకుంటున్న వలస శ్రామికుల పట్ల శ్రీలంకలోని సకల పక్షాలు ఒకే వైఖరిని అవలంబించడం శోచనీయం. (భారత ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి శ్రీలంకలోని అటువంటి భారతీయుల్ని లక్షలాదిమందిని భారతదేశానికి రప్పించి వాళ్లకు ఆర్థిక సాయం, ఉద్యోగాలు, భూవసతి కల్పించే ప్రయత్నాలు 1967లో చేశారు.)

కాండీ నుండి నేను ముందుకు సాగాను. రామాయణ కాలంనాడు సీత బందీగా ఉన్న తోటను చూసేందుకు వెళ్లా. రవివర్మ చిత్రించినట్లుగా ఆమె ఆ వనంలో ఆ రాతిపై వియోగ భారంతో ఉన్నట్లుగా అద్భుత చిత్రమేదో నా కనులముందు కదలాడ సాగింది. మన మదిలో సీతారాములు ప్రేమమయ జంటగా శాశ్వతంగా నిలిచిపోయేటట్లుగా చేసిన ఆయన ప్రతిభకు ముగ్ధుణ్ణయ్యాను. ఆదర్శ మహిళ, మాతృమూర్తి అయిన సీతాదేవి ఆత్మకు అంజలి ఘటించాను.

శ్రీలంకలో ఉండగానే ఆనారోగ్య ఛాయలు కనిపించాయి. హుటాహుటిన ఢిల్లీకి ప్రయాణమయ్యాను. గొంతు సంబంధ వ్యాధి వచ్చింది. చాలా సంవత్సరాల తర్వాత నేను మంచానపడ్డాను. ఆ జబ్బును నేను లెక్కచేయకుండా వలస దేశాల రైతు సదస్సుకు హాజరయ్యాను. రోగ నివారణకు పెన్సిలిన్ ఇంజెక్షన్లు వాడాను.

1958లో ఢిల్లీలో వలస దేశాల రైతు సంఘ సదస్సు

ఆ సదస్సులో భారతదేశపు ప్రతినిధి వర్గం ద్వారా వలస దేశాల ప్రజల సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాడే విషయంలో అవకాశం నాకు లభించింది. వాళ్లు వెనకబడిన దేశాల సత్వర అభివృద్ధిని నిజంగా కాంక్షించేటట్లయితే ఆయా దేశాలకు రాజకీయ స్వాతంత్ర్యాన్ని మంజూరు చేయాల్సి ఉంటుందని ఆ సదస్సులో నేను కామన్వెల్త్‌కు సూచించాను. జవహర్‌లాల్‌జీ సదస్సును ప్రారంభించిన తర్వాత భారతదేశం తరఫున వెంటనే చర్చల్లో పాల్గొనే అవకాశం నాకు దక్కింది. అగ్ర రాజ్యాల మరో శిఖరాగ్ర సమావేశం జరగాలని గట్టిగా వాదించాను. ఐసన్‌హోవర్ పట్ల కృశ్చేవ్ ప్రదర్శించిన అనాలోచిత వైఖరి వల్ల 1960 నాటి ఆ సదస్సు నిష్ప్రయోజనకరంగా ముగిసింది. ప్రపంచంలోని మిగులు సంపదను వెనకబడిన దేశాలకు పంచాలనే భారతదేశపు విజ్ఞప్తికి గెయిట్ స్కెల్ మద్దతు పలకడం జరిగింది. అభివృద్ధి చెందిన దేశాలు వాటి సాలీనా ఆదాయంలో కనీసం ఒక శాతమైనా అభివృద్ధి చెందుతున్న దేశాల అభివృద్ధి కోసం వినియోగించాలన్న అంతర్జాతీయ సమితి అభిప్రాయాన్ని వలస దేశాల రైతు సంఘ సదస్సు బలపర్చింది.

నేను అణ్వాయుధాలపై నిషేధాన్ని కోరాను. సోవియట్ ఆయుధాల తయారీని నిలిపివేస్తామని ప్రకటించడం కర్రిమబ్బుల్లా కాలుదువ్వే యుద్ధ వాతావరణంలో వెలసిన ఒక ఇంద్ర ధనుస్సులా కనిపించింది. 1958లో తటస్థ రాజ్యాలు ఆ మాట విని ఊపిరిపీల్చుకున్నాయి. అమెరికా, రష్యాల తరఫున 1963లో అణు ప్రయోగ నిషేధ ఒప్పందాన్ని కెన్నడీ, కృశ్చేవ్‌లు కుదుర్చుకున్నారు. రాజాజీ తయారుచేసిన ముసాయిదా ఒప్పందమే అసలు ఒప్పందానికి ప్రాతిపదికగా నిలిచిందని చెప్పేందుకు నాకెంతో ఆనందంగా ఉంది. అమారియన్, బెవాన్, గెయిట్ స్కెల్‌ల తర్వాత విల్సన్ ప్రధాని అయ్యాడు. ఆయన అట్లీ, గెయిట్ స్కెల్, బెవాన్లు రంగుజాతుల వారిని అర్థంచేసుకున్న పరంపరను అందుకోలేకపోయాడు. 1965లో కాశ్మీర్ విషయంలో పాకిస్థాన్ భారతదేశంపైకి దాడికి వచ్చినప్పుడు విల్సన్ చేసిన ఏకపక్ష, తెలివితక్కువ వ్యాఖ్యల వల్ల కామన్వెల్త్ క్లబ్ మనుగడకే ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. 'ఐక్య ప్రపంచం' ఆలోచనలు బీటలువారాయి.

44

కాంగ్రెస్‌కు రాజీనామా (1951) టాండన్, జవహర్‌లాల్ నెహ్రూతో ఉత్తర ప్రత్యుత్తరాలు

ఏప్రిల్ 19, 1951.

ప్రియమైన టాండన్‌జీ,

నేను అఖిలభారత కాంగ్రెస్ కమిటీకి, వర్కింగ్ కమిటీకి, పదవి వల్ల చేకూరిన ప్రాతినిధ్య సభ్యత్వాలకు, జాతీయ కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా సమర్పిస్తున్నాను. దయచేసి అంగీకరించమని కోరుతున్నా.

తొలిగా నేను స్వచ్ఛంద సేవకునిగా 1917లో విద్యార్థి దశలో ప్రవేశించాను. 1923లో ఆంధ్ర ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ సంపూర్ణ సభ్యుణ్ణయ్యాను. ఏదో పేరుకు



టాండన్

అప్పుడప్పుడూ సేవలందించినా ప్రజలకు పూర్తికాలం సేవలు చేసేందుకు గౌరవ ప్రజా కార్యకర్తగా 1930 నుండి పనిచేయడం ప్రారంభించాను. నా క్రియాశీల ప్రజా జీవనంలో, ఇరవై సంవత్సరాలకుపైబడిన నా రాజకీయ మనుగడలో భాగంగా దేశం కోసం మహాత్మాగాంధీ పిలుపు మేరకు కారాగారవాసం అనుభవించి, నిర్మాణాత్మక సేవలు చేశాను. విధేయుడైన కాంగ్రెస్‌వాదిగా ఉన్నాను. కనుక సహజంగానే నావంటి వానికి ఈ సంస్థను వదలివెళ్లడం అంత తేలికైన పనికాదు. ఏవో బలమైన కారణాలు ఉండి వుండాలి.

ఇటువంటి నిర్ణయానికి రావడానికి గల పరిస్థితులను, కారణాలను కొన్నింటిని సూచనప్రాయంగా వెల్లడిస్తాను:

బాపూజీ జీవించి ఉన్న కాలంలోనే కాంగ్రెస్‌లో వర్గపోరును మంత్రి పదవుల్లో వున్నవారు పెంచి పోషించారు. వాతావరణాన్ని కలుషితం చేశారు. ఒక వర్గంలో మంత్రులు, వారి వందిమాగధులు, లబ్ధిదారులు, వాళ్ల మద్దతుదారులు వుండేవారు. వాళ్లను **'మినిస్టీరియలిస్ట్‌లు'** అనేవారు. ఆ ఆకర్షక వర్గం పరిధి వెలుపల మసలుకునే కాంగ్రెస్‌వాదులందరిదీ రెండో వర్గం. ఆ రెండు వర్గాల మధ్య నానాటికీ పెరుగుతున్న వైరుధ్యం చూసి బాపూజీ ఖిన్నుడయ్యేవారు. అంతర్గత కలహాల కారణంగా మైత్రికి దూరమవుతున్న వాతావరణం, ఒకరి పట్ల మరొకరికి విశ్వాసలేమి ప్రబలడం ఆయన్ను బాధించాయి.

మంత్రి పదవులకు అంటకాగేవారిని చూసి మేము అసంతృప్తి చెందేవాళ్లం. తమ విధి నిర్వహణలో వాళ్లు అలసత్వాన్ని ప్రదర్శిస్తూ కాంగ్రెస్ విధివిధానాలను పక్కన పడేసేవాళ్లతోపాటు గాంధీ మార్గంలో గతిశీలంగా చర్యలు చేపట్టేవారు సైతం మా అసంతృప్తి పట్ల బాపూకు ఫిర్యాదును కూడా చేసేవారు. మంత్రులకు యుద్ధ సమయంలో కంట్రోళ్ల కారణంగా సంక్రమించిన అధికారాలను దుర్వినియోగపర్చడాన్ని చూసి మేము దిగ్భ్రాంతికి గురయ్యేవాళ్లం. కనుక నేను జాతీయ స్థాయిలో అఖిలభారత కిసాన్ సమ్మేళన్ పేరుతో కంట్రోళ్లకు వ్యతిరేకంగా, ఆహారా ధాన్యాల సేకరణ విషయంలో, ధరల విషయంలో వుద్యమాన్ని చేపట్టాల్సి వచ్చింది.

ప్రజా విశ్వాసాన్ని చూరగొనేందుకు గాంధీజీ కంట్రోళ్లకు వ్యతిరేకంగా ప్రచారాన్ని చేపట్టారు. కాంగ్రెస్ మంత్రులకు మధ్యమధ్యలో హెచ్చరికలు కూడా జారీచేసేవారు. వాళ్లు కనుక మార్క్సిజంపై ఆధారపడడం మాని మాలోని చాలామందిమాదిరిగా

గాంధియన్ సోషలిజాన్ని అంగీకరిస్తే మనమందరం కాంగ్రెస్‌లోనే ఉండి కాంగ్రెస్ ద్వారానే గాంధియన్ సోషలిజం కోసం కృషి చేయవచ్చును కదా అనీ సోషలిస్ట్‌లు కాంగ్రెస్‌ను వీడివెళ్లాలని ఆలోచించే రోజుల్లో వాళ్లతో నేను వాదించేవాణ్ణి. కాని స్వాభిమానాలు, సామాజిక ప్రతిక్రియలు ఇంత శక్తిమంతంగా, ఇంతటి నీతివంతంగా, విజయాన్ని సాధించేవిగా ఉంటాయని కొంచెం కూడా ఊహించలేకపోయా.

బాపూ బతికుండగానే వర్కింగ్ కమిటీ కాంగ్రెస్ ఆశయాలకు సంబంధించిన తీర్మానానికి రూపురేఖలు దిద్దింది. జయప్రకాశ్ నారాయణ్, నేనూ దానికి మెరుగులు దిద్దుతూ 1947లో ఢిల్లీలో జరిగిన ఎఐసిసిలో అంతిమంగా ఆమోదింపజేశాం.

సోషలిస్ట్ నాయకులు, పండిట్ నెహ్రూతో కలసి నేను కాంగ్రెస్ ఆర్థిక కార్యక్రమాల కమిటీ సభ్యునిగా క్రియాశీల పాత్ర పోషించాను. మావన్నీ ఏకగ్రీవ తీర్మానాలే. ప్రభుత్వపు ఇండస్ట్రియల్ పాలసీ స్టేట్‌మెంట్ (పరిశ్రమల విధాన నిర్ణయ ప్రకటన) చాలావరకూ ఆర్థిక కార్యక్రమాల కమిటీ సిఫారసులకు అనుగుణంగానే ఉండేది. ఆ తర్వాత వర్కింగ్ కమిటీ ప్రణాళికా ఉపసంఘాన్ని నియమించింది. అందులో కూడా నేను సభ్యుణ్ణే. అది కూడా దాదాపుగా ఏకగ్రీవ నివేదికే. దాన్ని ముఖ్యమంత్రులు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులున్న సదస్సు ముందుంచింది. దాన్ని ఆ సదస్సు ఆమోదించింది. నేను వ్యవసాయ సంస్కరణల సభ్యుణ్ణి కూడా. అప్పటి మద్రాస్ ప్రీమియర్ (ముఖ్యమంత్రిని అలా అనేవాళ్లు) ఒ.పి.ఆర్.రెడ్డియార్‌తో కలసి మైనార్టీ నివేదిక తయారుచేశాను. నేటి కాంగ్రెస్ ఆశయాలు, ఆర్థిక సిద్ధాంతాలు, కార్యక్రమాలు అన్నింటిలో తొలిగా నా కృషి వున్నదనే ఆలోచన రాగానే అది నాకు గర్వకారణంగా అనిపిస్తుంది. అవన్నీ కూడా మనల్ని గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా నడుచుకునేటట్లు చేస్తాయి. సోషలిస్ట్‌లు మనల్ని వదలివెళ్లినా మనం ప్రజల కోసం మన సేవల్ని విస్మరించలేదని నేను భావిస్తున్నా. గత నాలుగు సంవత్సరాలుగా మనం సమకూరుస్తున్న ఆచరణాత్మక ధోరణి ద్వారా స్వతంత్ర భారతావనిలో కాంగ్రెస్ ఆశయాలు, కార్యక్రమాలు ముమ్మరంగానే సాగుతున్నాయి.

1935 నాటికే నేను మీతో అలహాబాద్‌లో అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ నిర్మాణం విషయం ముచ్చటించిన సంగతి మీకు గుర్తుండే ఉంటుంది. స్వరాజ్ ఆశయాలకు మించిన ముందుచూపుతో కృషి చేసి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే చెమటోడ్చే రైతులకు తగిన శక్తిని ప్రోదిచేసేందుకు మనం కృషి చేయాలని అప్పటికే నేను

కాంగ్రెస్‌వాదులందరికీ, మరీ ముఖ్యంగా రైతుల కోసం పాటుపడేవారికి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నా. గత ఇరవై ఎనిమిది సంవత్సరాల కాలంలో సోవియట్ రష్యాలో ఒక వర్గం రాజకీయాధికారాన్ని చేజిక్కించుకున్న భావన ప్రజలపై ప్రభావాన్ని చూపుతున్నది. అందువల్లనే రైతుల్ని, కూలీలను శతాబ్దాలుగా అనుభవిస్తున్న సామాజిక, ఆర్థిక వెతల నుండి దూరంగా జరిపి రాజకీయ, సామాజిక సంస్థల్లో వాళ్లకు అందాల్సిన వాటా అందాల్సిందేనని శక్తినంతా కూడగట్టుకుని నా రాజకీయ కార్యక్రమాల ద్వారా కృషి చేయసాగాను. ఈ ఆశయాలను సాధించగలననే ఆశతో కాంగ్రెస్‌లోని సహచరుల సహాయంతో, జవహర్‌లాల్‌జీ, ఇతర జాతీయ నాయకుల సహకారంతో వివిధ రాష్ట్రాల్లోని రైతులను, కూలీలను, చేతివృత్తులవారిని పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేర్చేందుకు కృషి చేస్తూ వస్తున్నా.

ఏది ఏమైనా మన ప్రజలు కేంద్రంలోనూ, రాష్ట్ర ప్రభుత్వాల్లోనూ రాజకీయ అధికారాన్ని సాధించాలంటే – వాళ్ల సామాజిక, ఆర్థిక వైకల్యాలను తొలగించుకుని వాళ్ల జీవన ప్రమాణాలు పెరిగేటట్టు చూడాలంటే కాంగ్రెస్ కమిటీల్లో వాళ్ల మాటకు విలువనివ్వాల్సిన అవసరముంది. ఈ ప్రాథమిక కార్యక్రమాన్ని వాళ్లు చేపట్టిన క్షణమే కాంగ్రెస్‌పై ఇంతకాలం పెత్తనం సాగించి రాజకీయ పట్టును వీడజాలని సామాజిక, రాజకీయ శక్తులతో ఢీకొనాల్సి వుంటుంది. సంఘర్షణ అనివార్యం.

గత ఐదు సంవత్సరాలుగా ఆంధ్ర ప్రాంతపు కాంగ్రెస్‌లో కొనసాగుతున్న సంక్షోభం ఇదే. ప్రొవెన్షియల్ కాంగ్రెస్, వారిని సమర్థించేవారి హస్తగతం కావడంతో సామాజిక, రాజకీయ ఏకఛత్రాధిపత్యానికి అలవాటుపడిన వారితో ఘర్షణగా దీన్ని మనం అర్థంచేసుకోవచ్చు. అలా 1946లో రైతులు, కూలీలు, వారి తరపున నిలిచినవారూ వారి రాజకీయ, సామాజిక విప్లవం దిశగా తొలిగా ముందడుగు వేశారు.

ఈ ఐదేళ్ల ప్రతిఘటనలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో రైతు కూలీ ఆధిక్యతను సాధించిన మేము ఆ వేదిక నుండి గాంధీ ఆదర్శాలను పాటించేందుకు, ప్రమాణాలను నెలకొల్పేందుకు కృషి చేస్తూ ఆంధ్ర కాంగ్రెస్‌ను సంతృప్తిపర్చే దిశగా ప్రయత్నించ సాగాం. కాంగ్రెస్‌లో ఐక్యతకు కృషి చేస్తూనే వచ్చాం. ప్రజలు కోరుకున్నంతగా మేము మంత్రి వర్గ ముఠాను ఢీకొట్టలేదు. ప్రకాశం పంతులు గారు మంత్రుల అక్కృత్యాలను ఎండగట్టినా మేము మాత్రం ఆయన ఆరోపణలపై న్యాయ విచారణ చేపట్టమని వర్కింగ్ కమిటీని కోరాం. వర్కింగ్ కమిటీ, అందులోని నాయకులు మంత్రి వర్గ

సభ్యుల్ని కట్టడి చేయడంలో ఎలా విఫలమైందీ మీకు తెలిసిన విషయమే. ఇంతలో డాక్టర్ పట్టాభి కాంగ్రెస్ అధ్యక్షులు కావడంతో మద్రాస్ మంత్రి వర్గానికి రొట్టె విరిగి నేతిలో పడ్డట్టయ్యింది. ఆంధ్ర కాంగ్రెస్‌లో ఐక్యత పేరిట మేమూ ఆయన్ను బలపర్చాం. మంత్రి వర్గ ముఠాకు నాయకత్వం వహిస్తున్న కళాను ఆయన జనరల్ సెక్రటరీగా తీసుకున్నారు. ఆ ఎన్నికల నాటినుండి డాక్టర్ పట్టాభి, కార్యదర్శి కళా చేసిన మార్పులూ చేర్పులూ కారణంగా ఆంధ్ర ప్రాంత కాంగ్రెస్ కమిటీలో మెజార్టీ వర్గంగా ఉన్న మాకు, ప్రజల తరఫున నిలిచిన మాకు, ఆమోదయోగ్యంకాని అనేక అంశాలను తెరపైకి తెచ్చారు. కళా ఇరవై ఐదు వేల రూపాయలకు సొంత చెక్కు ఇచ్చి లక్ష బోగస్ సభ్యత్వాలు పోగేశాడనే దుమారం చెలరేగింది. (అప్పుడు కాంగ్రెస్ సభ్యత్వం పావలా మాత్రమే) . సర్కులర్ నెం. 26 ద్వారా తొమ్మిది లక్షల కాంగ్రెస్ సభ్యత్వాన్ని ఖరారు చేశాడు. తన అనుయాయులకు రహస్య సందేశాలు పంపడం అందరూ ఎరిగిన విషయమే. కళా ఘనకార్యం వల్ల కోర్టు ఉత్తర్వులను నిలిపివేసింది. పిసిసి ఎన్నికలు నిలిచి పోయాయి. పిసిసి వర్కింగ్ కమిటీ కార్యకలాపాలు ఆగిపోయాయి. పిసిసి ఎన్నికలు పలుమార్లు వాయిదాపడ్డాయి. సాంకేతిక కారణాల సాకుచూపి మా వర్గంలోని 26 మందిని ఓటింగ్‌లో పాల్గొనకుండా చేశారు. మా మిత్రులు అటువంటి ఆటనే తిరిగి ఆడదల్చ లేదు. వర్కింగ్ కమిటీ మాటిమాటికీ కోర్టులకు వెళ్లరాదని చేసిన ప్రకటనలను గౌరవించింది. దాని కారణంగానే కళా నెగ్గుకొచ్చాడు.

కాంగ్రెస్ సాయంతో ఆంధ్ర ప్రాంత ప్రజలకు ఎవరికైతే మనం సేవలందించామో. ఎవరిని ప్రతినిధులుగా మనం భావించుకుంటున్నామో వాళ్లంతా ఇప్పుడు భ్రమల్లో పడిపోయారంటే ఆశ్చర్యపడాల్సిందేముంది? కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం పార్టీ ఏదో సాధిస్తుందనే ఆశను వారు కోల్పోయారు. మనం దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడినప్పుడుకానీ ఇప్పటి సామాజిక విప్లవం కోసం కానీ హింసను ఆశ్రయించిందిలేదు. మన విశ్వాసమంతా ప్రజాస్వామ్య విధానాలపైనే. అయితే వర్కింగ్ కమిటీ విఫలమైనందువల్ల గాంధీ వ్యతిరేక, నీతిరాహిత్య పద్ధతులను మద్రాస్ మంత్రుల ముఠా అనుసరించినందు వల్ల, మేమింకా గాంధీ ఆశయాలను పాటిస్తూ ప్రజాస్వామిక మార్గంలో పయనిస్తున్నందు వల్ల వాళ్లు ఎత్తుగడలతో అధిక్యాన్ని సాధించగలిగారు.

ప్రదేశ్ కాంగ్రెస్‌లోని అల్ప సంఖ్యాకుల్ని కూడా కలుపుకుపోవాలనే ఆశయంతో నేను డాక్టర్ పట్టాభి అభ్యర్థిత్వాన్ని అధ్యక్ష పదవికి బలపర్చాను. అలహాబాద్ తీర్మానం

తర్వాత వెంటనే (1951 జనవరి) నేను మంత్రి వర్గ ముఠా నాయకుల్ని కలిశాను. వాళ్లు కనుక మా మెజార్టీని గుర్తించి కోర్టులో పొందిన తాత్కాలిక ఉత్తర్వులను వెనక్కు తీసుకునే పక్షంలో వాళ్లకు ఆంధ్ర ప్రాంత కాంగ్రెస్ కమిటీలో తగిన ప్రాతినిధ్యం కల్పిస్తానని చెప్పాను. వాళ్లు దాన్ని పెడచెవినపెట్టారు. కష్టజీవుల పక్షాన నిలిచే మమ్మల్ని విస్మరించి కాంగ్రెస్‌పై వారే పట్టు సాధించాలనే సంకల్పానికి వచ్చారు. వాళ్లు తెచ్చిన కోర్టు మధ్యంతర ఉత్తర్వుల కారణంగా మేము ప్రతికూల పరిస్థితుల్లో ఉన్న తరుణంలో ఎన్నికలు జరపాలని పట్టుబట్టారు. దానికి వర్కింగ్ కమిటీ కూడా వత్తాసు పలికింది. మీరూ, రాజాజీ, జగజ్జీవన్‌రాంలు ఆక్షేపణలు తెలిపినా, నేను అసమ్మతిని ప్రకటించినా వారు ఖాతరు చేయలేదు. కొద్దిగా కూడా సందేహానికి తావు లేకుండా ప్రపంచంలోని అందరు స్వార్థపరుల మాదిరిగానే, అందరు అభివృద్ధి నిరోధకుల మాదిరిగానే వాళ్ల ఆధిపత్యానికీ అధికారానికీ అవరోధం కలగనంత వరకే ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉంటారు.

సంస్థాగతంగా బాగా బలపడి, రాజకీయంగా చైతన్యవంతులైన రైతులు కాంగ్రెస్‌కు విధేయతను ప్రకటిస్తూ 1921 నుండి గాంధీ నాయకత్వానికి అనుగుణంగా నడుచుకుంటూ ఉంటే మరివాళ్లు రైతుల్ని, కూలీలను కాంగ్రెస్ వ్యవస్థకు దూరంగా ఉంచడం చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలుగకమానదు.

వాళ్ల పట్ల విశ్వాసం కోల్పోవడమన్నది ఏదో అప్పటికప్పుడు జరిగిన వ్యవహారంగా చూడకూడదు. గాంధీ సిద్ధాంతాలను పూర్తిగా పాటించకుండా, చాణక్య నీతికి సంబంధించిన సాంప్రదాయిక అనుభవాలకు దూరంగా జీవిస్తూ శాంతియుత సామాజిక విప్లవ పోరాటంలో మునిగితేలలేని వీళ్లు విజయాన్ని ఎలా సాధించగలరు?

జైపూర్, నాసిక్ కాంగ్రెస్ సదస్సుల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన నాయకులు స్వరాజ్య సాధన తర్వాత కాంగ్రెస్ సంస్థలో రైతులు పాలుపంచుకోవాల్సిన అవసరం ఏముందని మాట్లాడుతున్నారు. వాళ్ల పట్ల కాంగ్రెస్ నాయకులు ఏవిధంగా పక్షపాతం చూపుతున్నదీ వారు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు ఇక్కడ ఈ ఆంధ్ర ప్రయోగం కూడా విఫలమైంది కనుక కాంగ్రెస్‌తో రైతు కూలీ భాగస్వామ్యం గురించి సమర్థిస్తూ నేను చెప్పగలిగింది ఏమీలేదు.

కంట్రోళ్లు:

కంట్రోళ్ల నిర్వహణ, మరీ ముఖ్యంగా ఆహార మంత్రిత్వ శాఖలు బలవంతంగా అవలంబించే ధాన్య సేకరణ తీరు, పండిన పంటకు మించిన ఫలసాయాన్ని చూపడం, రైతు అవసరాలకు కావాల్సిన ఆహార ధాన్యాన్ని తగ్గించి చూపడం, గిట్టుబాటుకాని ధరలకు రైతుల నుండి ధాన్యాన్ని సేకరించడం, రైతులకు అవసరమయ్యే వ్యవసాయ, వ్యవసాయేతర వస్తువులను తగినంతగా అందించలేకపోవడం, దానివల్ల రైతుల్లో అసంతృప్తి పెరిగిపోవడం, రైతుల అవసరాలను, ఇబ్బందులను నేను మాటిమాటికీ జవహర్‌లాల్‌జీ దృష్టికి తెచ్చి అందుకు ఆయన ఆమోదం పొందడంలో విఫలం చెందడం వంటివన్నీ నా మనస్సుపైన చాలాకాలంగా ప్రభావాన్ని చూపుతున్నాయి. కాంగ్రెస్‌వారంతా రైతు వ్యతిరేక కంట్రోళ్లను ప్రోత్సహిస్తూ పరిపాలనను అవినీతిమయం గావిస్తున్న తరుణంలో ప్రస్తుతం అటువంటి కాంగ్రెస్‌పై ఆశ ఎలా ఉంటుంది?

రైతులకు అనేక రాష్ట్రాల్లో జమీందారీ విధానం రద్దు ద్వారా, సంస్థానాల రద్దు ద్వారా జరిగిన మంచిని నేను మర్చిపోలేదు. అయితే మేము మరింతగా కొన్ని కోరుకుంటున్నాం. కౌలుదార్ల వెతలను తీర్చాల్సిన అవసరముంది. వాళ్లకు కౌలుకిచ్చే కాలాన్ని పెంచాలి. అంతకుముందు వ్యవసాయ పంటలకు నిర్ణయించిన కనీస ధరల ఆధారంగా మగతాను నిర్ణయించాల్సి ఉంది. ప్రస్తుతం పట్టణాల్లో, పల్లెల్లో పౌర సౌకర్యాల కల్పనలో గల వ్యత్యాసాలను తగ్గించాల్సి వుంది. ఈ విషయాల్లో ఇప్పుడు జరుగుతున్న తంతు చూస్తుంటే మా అసంతృప్తి కట్టలు తెంచుకోసాగింది.

దుష్టపూరిత జాగీర్దారీ విధానాన్ని రాజస్థాన్ ప్రభుత్వం రద్దు చేయకపోవడం, పంజాబ్ మంత్రివర్గం పెద్దయెత్తునసాగే కౌలుదార్లను భూముల నుండి తరిమికొట్టే కార్యక్రమాన్ని నిలువరించలేకపోవడం బాధకు గురిచేస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వానికీ పారిశ్రామికవేత్తలకూ మధ్య ఉన్న లాలూచీయే కోటీమంది చేనేతపనివారు అర్ధాకలితో రోజులు వెళ్లదీయాల్సి రావడానికి కారణంగా చెప్పొచ్చు. మన మంత్రులు కుటీర పరిశ్రమలకు చేయూత నివ్వకపోవడం రికార్డ్‌లు వెల్లడించే అంశమే.

పారిశ్రామిక కార్మికులకు పది లక్షల ఇళ్లు నిర్మించి ఇవ్వడం, రోజువారీ కూలి పొందేవారందరికీ సామాజిక భద్రత కల్పించడం, కనీస వేతన నిర్ణయంవంటివి

ఈసుకుపోయాయి.

ప్రజలను దోచుకునేందుకు మంత్రి వర్గ ముఠా పేరాశతో కొత్త కొత్త అవకాశాలకు స్వాగతం పలుకుతోంది. కంట్రోళ్లు, అనేక తావులకు రాజ్య పాలనాధికారాలు చొచ్చుకుపోవడం వాళ్లకు అందివచ్చిన ఫలాలు. కంట్రోళ్లను, కొత్త రాజ్యాధికారాలను దుర్వినియోగపర్చినందువల్ల వాళ్లు ప్రజలను అవినీతిపరులుగా మార్చారు. పరిపాలనకు అపఖ్యాతిని సంతరింపజేశారు. కాంగ్రెస్‌ను, ప్రజా సేవకులను అపఖ్యాతిపాల్జేశారు. ఈ కంట్రోళ్ల బారి నుండి ప్రజలను మేమెంతగా విముక్తి గావించాలని చూసినా మా శ్రమ ఫలించేటట్లులేదు. పలువురు మంత్రులు వాళ్లకు కావాల్సినవాళ్లకు బస్సు రూట్లు మంజూరు చేస్తున్నారు. మంత్రి వర్గ ముఠావాళ్ల అవినీతి చర్యలను అడ్డుకోవడంలో పార్లమెంటరీ బోర్డు విఫలమైనా అయ్యుండాలి లేదా శక్తిహీనమైనా అయ్యుండాలి.

కాంగ్రెస్ మంత్రివర్గాలు:

కాంగ్రెస్ మంత్రి వర్గాల పనితీరుపట్ల వర్కింగ్ కమిటీ వైఖరి అత్యంత అసంతృప్తికరంగా ఉంది. ఇది మద్రాస్ విషయంలోనే కాదు మిగతా రాష్ట్రాల్లోనూ అంతే. తగినవారిని, మంచివాళ్లను పోటీ చేయించే విషయంలోనూ, తర్వాత వాళ్లను పార్టీ కార్యకలాపాల్లో, చట్టసభల్లోనూ మసలుకునే విషయంలో మార్గదర్శనం గావించే అంశంలోనూ, కాంగ్రెస్ మంత్రివర్గాల కూర్పు విషయంలోనూ, వాటిని కట్టడి చేసే విషయంలోనూ కాంగ్రెస్ ప్రజల పట్ల తన బాధ్యతను విస్మరించింది.

పార్లమెంటరీ బోర్డు వైఫల్యాన్ని మేము వర్కింగ్ కమిటీ సమావేశాల్లో బాపూ సమక్షంలోనే ఎండగట్టాం. తర్వాత మద్రాస్, ఉత్తరప్రదేశ్, పంజాబ్ మంత్రి వర్గాలపై అభియోగాలు వర్కింగ్ కమిటీలో చర్చకు వచ్చినప్పుడు సాధారణ పరిపాలనలో తలెత్తే ఒడిదుడుకుల విషయంలో కమిటీ జోక్యం కల్పించుకోరాదని, కేవలం అది విధాన నిర్ణయాలకే పరిమితం కావాల్సి ఉంటుందనే నిర్ణయానికి రావడం జరిగింది. ఈ వైఖరిని నేను పలుమార్లు ఖండిస్తూ వచ్చాను. మీరు కూడా సిద్ధాంతపరంగా వాళ్ల వైఖరిని తీవ్రంగా తిరస్కరించేవారు. ఏది ఏమైనప్పటికీ వర్కింగ్ కమిటీ, పార్లమెంటరీ బోర్డు పాలనా విషయాల్లో మంత్రి వర్గాలకు సంపూర్ణ స్వేచ్ఛనిచ్చారు. దాని ఫలితాలు వినాశకరంగా తయారయ్యాయి. ఉదాహరణకు యుద్ధానంతర కాలంలో పౌరుల రోజువారీ జీవితం అసమర్థ, అవినీతిమయ కంట్రోళ్ల పరిపాలన వల్ల ప్రభావితమైంది.

కాంగ్రెస్ హైకమాండ్ నుండి వారికేవిధమైన రక్షణ లభించలేదు. ముఖ్యమంత్రి కంట్రోళ్ల మూలంగా దోచుకున్నవాటిల్లో కొంత పార్టీకి పంచిపెడుతూ ఉంటే ఏ ఆట అయినా ఆడే స్వేచ్ఛ అతనికుంటుంది. పౌర జీవనంలో ప్రాథమిక స్వేచ్ఛ కూడా ప్రజలకు లభించకుండా చేయవచ్చు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యం:

ఇక కేంద్ర ప్రభుత్వం విషయానికొస్తే జాతి జీవనానికి ముఖ్యమైన అంశాలను చూసే మంత్రి వర్గాలు – ఉదాహరణకు ఆర్థిక మంత్రిత్వ శాఖ, పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వాణిజ్య మంత్రిత్వ శాఖ, ఆహార మంత్రిత్వ శాఖ, పునరావాస మంత్రిత్వ శాఖల వంటివి ఘోరంగా విఫలం చెందాయని నేను నిరసన తెలిపిన సందర్భాలెన్నో. పార్లమెంట్‌లో ఆ మంత్రి వర్గాల పట్ల నాకు నమ్మకం సడలుతున్నదని చెప్పాల్సి వచ్చింది. అందుకు నాయకులు చికాకుపడ్డారు. ఈ విషయం గురించి ప్రధాని నెహ్రూకు ఒక సంవత్సరం క్రితమే రాశాను. ఇటీవల అంచనాల కమిటీ రహస్యంగా వెల్లడించిన విషయం గురించి పార్లమెంట్ చర్చల్లో నా విమర్శలు వినవచ్చాయి. అయినా ఇంకా వెలుగులోకిరాని ఎన్నో గందరగోళాలు, మరెన్నో అప్రతిష్ట తెచ్చే అంశాలు ఉండి వుంటాయి. జీపుల కొనుగోలు, కేంద్ర ట్రాక్టరు సంస్థ, ఎరువుల కొనుగోళ్లు, ప్రభుత్వ గృహ నిర్మాణం, ముందుగా తయారుచేసి బిగించే షెడ్లు, సింద్రీ కర్మాగారం వంటి అనేక విషయాల్లో మంత్రి వర్గ వైఫల్యాలు మనకు కనిపిస్తూనే ఉన్నాయి. ఇవి చాలు ప్రభుత్వ పాలనా తీరుతెన్నుల గురించి వివరించడానికి.

ఇందులో ఏ ఒక్క అంశమైనా చాలు, ఇంగ్లండ్‌లో మంత్రి వర్గాన్ని కుప్పకూల్చేందుకు? మేము ఈ నాయకత్వం పట్ల ఎంతో సహనాన్ని ప్రదర్శిస్తూ వచ్చాం. అయినా ఇప్పటికైనా అవి పునరావృతం కావని హామీ ఇచ్చేవారెవరైనా ఉన్నారా? ఇటువంటి అసంతృప్తి చాలాకాలంగా నా మనస్సులోనూ, ఆంధ్ర ప్రాంతపు ప్రజల మనస్సుల్లోనూ సుడులు తిరుగుతున్నాయి. ఆంధ్రా ఎన్నికలు మా సహనాన్ని ఇంకా నిలుపుకోలేని చివరి ఘట్టం. ఆ విధంగా ఆంధ్రులు కాంగ్రెస్ సంస్థపై నమ్మకాన్ని విడనాడాల్సి వచ్చింది.

మీ నిష్కపటి
ఎన్.జి.రంగ

ప్రియమైన రంగా,

గత నెల 19 నాటి మీ లేఖ 23న మా శాశ్వత కార్యదర్శికి అందించడం జరిగింది. అది ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన వర్కింగ్ కమిటీ సమావేశాల్లో సభ్యుల ముందుంచడం జరిగింది. వాళ్లు ఆ విషయం నన్ను చూడమన్నారు. మీరు గత వర్కింగ్ కమిటీ సమావేశానికి, అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశానికి హాజరుకాకపోవడం నన్ను నిరాశకు గురిచేసింది. ప్రభుత్వ పరిపాలనపై, కాంగ్రెస్ వ్యవహారాలపై మీరు అనేక అభిప్రాయాలు వ్యక్తంచేశారు. ఆ విషయాలన్నీ తిరిగి నేను ప్రస్తావించాల్సిన అవసరంలేదు. నేను వెంటనే పట్టించుకోవాల్సిన అంశం కాంగ్రెస్ సంస్థకు మీ రాజీనామా గురించి. మీరు కాంగ్రెస్ పాలకమండలి సభ్యులుగా ఉండి, ఆ సంస్థ విధానాలను ప్రభావితం చేయగల స్థితిలో ఉండి ఇలా రాజీనామా చేయడం ఏమంత బాగాలేదు. మీ ఫిర్యాదు ఏమంటే మీ అభిప్రాయాలను ఎవరూ ఖాతరు చేయడంలేదని. మీరు కొంచెం ప్రశాంతంగా ఆలోచించండి, మనలో కొంతమంది మీలాగే అనుకుంటున్నారు కదా. ఒక ప్రజాస్వామిక సంస్థలో మనం చేయగలిగింది మన అభిప్రాయాలను నొక్కి చెప్పడం, తర్వాత ఆ సభ్యుల విజ్ఞతకు దాన్ని వదలివేయడం. మీరు హృదయగతంగా ఏ అంశాల విషయంలో ఆవేదన చెందుతున్నారో వాటి సాధన కోసం కాంగ్రెస్‌ను వీడి కొత్త పార్టీ పెట్టడం సమంజసంకాదు. కాంగ్రెస్‌లోనూ, వర్కింగ్ కమిటీలోనూ ఉండి మీరు సాధించాల్సింది సాధించొచ్చు కదా.

కేవలం మీ ప్రాంతంలోని ఘటనలను దృష్టిలో పెట్టుకుని అలా స్పందించడం తగదు. మీరు అధ్యక్ష స్థానానికి కేవలం ఐదు ఓట్ల తేడాతో ఓడిపోయారు. అయినా ఆంధ్ర ప్రొవెన్షియల్ కాంగ్రెస్ కమిటీలో మీ మాటకు విలువ ఉంది. దాన్ని గమనంలోకి తీసుకునే కొత్త అధ్యక్షుడు ఎగ్జిక్యూటివ్ కమిటీలో అధ్యక్షుడుగాక 18 స్థానాలకుగాను తొమ్మిదింటిని మీకు కేటాయించారు. ఈ విధమైన సీట్ల పంపకం మీ రెండు గ్రూపుల మధ్య అవగాహనను పెంచగలదనుకుంటున్నా. ఆ దిశగా ప్రయత్నం చేయడం మంచిదని భావిస్తున్నా. మీ మిత్రునిగా నేను మిమ్మల్ని విషయాన్నంతా మరోసారి ఆలోచించమని కోరుతున్నా. హడావుడిగా ఒక నిర్ణయానికి రావద్దంటున్నా. మీరు ఇక్కడకు వచ్చినప్పుడు మనం స్వయంగా మాట్లాడుకుందాం.

మీ

పురుషోత్తందాస్ టాండన్

ప్రియమైన జవహర్‌లాల్‌జీ,

అలహాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సదస్సులో, వర్కింగ్ కమిటీ సమావేశంలో మా అందరినీ కదిలించే ప్రసంగం చేస్తూ మీ నాయకత్వానికి, ప్రభుత్వానికి, కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా ఉండి శక్తివంచనలేకుండా కృషి చేయమని ఎంతో స్ఫూర్తిదాయకంగా పిలుపునిచ్చారు. నా పద్ధతిలో నేను ప్రతిస్పందించడం ఎలాగా అని తీవ్రంగా ఆలోచిస్తున్నా.

మరీ ముఖ్యంగా ఆహారం, వ్యవసాయం, పరిశ్రమలు, అంతర్జాతీయ రంగం విషయాల్లో ప్రభుత్వంతో నేను ఎంతగా విభేదించినా నేను నా సహకారాన్ని అందించేందుకు, సాయపడేందుకు ఎంతగా కృషి చేస్తున్నదీ మీరెరిగినదే. అందుకు కారణం నేను వాటి విషయంలో అత్యుత్సాహం చూపాల్సిన అవసరంలేదని నాకు నేను సమాధానపడడమే.

బాపూ, సర్దార్ నన్ను మీ ప్రభుత్వంతో మరింత సన్నిహితంగా మెలగమని చెప్పిన సందర్భాలు లేకపోలేదు. అయినా అంగీకరించ లేదు. ఎందుకంటే అలా చేస్తే ఆ వాతావరణంలో నేను మైనార్టీలో పడిపోతాను. నేను వచ్చే సాధారణ ఎన్నికల్లో వయోజన ఓటు హక్కు లభించే వరకూ వేచి ఉండి మీ ప్రోద్బలంతోపాటు పార్లమెంట్‌లో మరింత బలాన్ని ప్రోదిచేసుకోదల్చాను. అందువల్లనే పార్లమెంట్‌లోనూ (ఆగస్ట్-సెప్టెంబర్), మీకు రాసిన లేఖలోనూ నాకు మీ మంత్రి వర్గంలో స్థానం కల్పించవద్దని కోరాను.

దేశ ఆర్థిక స్థితిగతులు దయనీయంగా ఉన్నాయి. మరీ ముఖ్యంగా ఆహారం, పరిశ్రమల విషయంలో ప్రపంచ పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయి. ఈ పరిస్థితులను చూసి నేను ఆందోళనకు గురవుతున్నాను.

మీ
నిష్కపటి
ఎన్.జి.రంగ
7 ఫిబ్రవరి 1951

2, ఫిరోజ్‌షా రోడ్,

న్యూ ఢిల్లీ,

19 మే 1951.

ప్రియమైన జవహర్‌లాల్‌జీ,

భారత జాతీయ కాంగ్రెస్ రాజకీయ నాయకత్వంలో ప్రజాస్వామిక పద్ధతిలో, బాపూ ఆశీర్వాదాలతో కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం రాజకీయ సామాజిక వాతావరణాన్ని సాధించడం కోసం 1930 నాటినుండి నేను ప్రయత్నిస్తూనే వున్నా. అయితే తరచుగా వర్కింగ్ కమిటీ చర్చల్లో గత రెండున్నరేళ్లుగా మీకు తెలియజేసినట్లుగా నేను చాలా ఇబ్బందికరంగా, నిరాశతో మసలుకోవాల్సి వస్తోంది. వర్కింగ్ కమిటీ అన్యాయపు వైఖరి వల్లే ఇదంతా జరుగుతోంది. అదీ ప్రత్యేకించి ఆంధ్ర కాంగ్రెస్, మద్రాస్ మంత్రివర్గపు వ్యవహారాల్లో జరుగుతోందిది. ఇటీవలి సంఘటనలు నాలోని ఆశాభంగాన్ని పతాక స్థాయికి చేర్చాయి.

ఆంధ్ర ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ మంత్రి వర్గ ముఠా కళా వెంకట్రావు నాయకత్వంలో 26 సీట్లకు గుంటూరు జిల్లా, మరికొన్ని తావుల్లో ఎన్నికలు జరగకుండా కోర్టు నుండి ఉత్తర్వులు పొందారు. అది ఆంధ్ర ప్రాంత కాంగ్రెస్ కమిటీ మొత్తం సభ్యుల సంఖ్యలో ఎనిమిదో వంతు. ఆ తర్వాత ఈ 26 స్థానాలకు ఎన్నికయ్యే ప్రతినిధుల్ని వదిలేసి మిగతా తావుల్లో ఎన్నికైన సభ్యులు వివిధ బాధ్యతలను నిర్వహించే అధికార గణాన్ని ఎన్నుకోవాలని నిర్ణయించారు. ఇది అన్యాయమైన నిర్ణయం. ఎస్.కె.పాటిల్ దానికి వ్యతిరేకంగా సలహా ఇచ్చారు. రాజాజీ దాన్ని ఏకపక్ష నిర్ణయంగా పరిగణించారు. ఇబ్బందికి గురైన పక్షం తరఫున నేను తీవ్రంగా నిరసన తెలియజేశాను. పైగా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు అది సరైన పద్ధతి కాదని ఒక వైపున చెబుతున్నా మీరు వాళ్ల వైపునకు మొగ్గుచూపారు. చివరకు ఫలితం ఏమైంది? మంత్రి వర్గపు ముఠా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీని చేజిక్కించుకుంది. అలా ప్రత్యక్షంగా ఎన్నికల్లో గెలవడం ద్వారా కాకుండా ప్రభుత్వ అధికారాన్ని అడ్డంపెట్టుకుని గెలిచింది. శక్తి చాలకనో లేక ఇష్టంలేకనో ఈ విషయంలో తాను తలదూర్చనని చేతులెత్తేసింది అధిష్ఠానం.

వర్కింగ్ కమిటీ ఇటువంటి పరిస్థితుల్లో కూడా కాంగ్రెస్ కార్యకర్తలకు తిరిగి ఆదేశాలు జారీచేసింది –బహిరంగంగా ప్రభుత్వాన్ని విమర్శించరాదని. నేను గనుక ఆ సమావేశానికి హాజరై ఉండి ఉంటే అటువంటి తప్పుడు ఆదేశం జారీ కాకుండా

అడ్డుకునే వాణ్ణి. కాంగ్రెస్ ప్రభుత్వాలు తప్పుచేయకుండా చూడాల్సిన అవసరంలేదా? హైకమాండ్ మంత్రుల ముఠాలు కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ తమ అధికారాన్ని అలా ఆసరాగా చేసుకుని ఎఐసిసిలో తమ పలుకుబడిని అడ్డంపెట్టుకుని అలా కాంగ్రెస్‌ను అడ్డదిడ్డంగా వాడుకుంటూ ఉంటే నోరుమూసుకుని అలా చూస్తూ వుండిపోవాల్సిందేనా? తళ్ళలితంగా ప్రజలు నిస్సహాయులుగా హానితలపెట్టే విధ్వంసకర శక్తుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిపోయే అవకాశం ఉంది కదా.

మీరు కాంగ్రెస్‌వాదులు కీచులాడుకుంటూ, ద్వేషించుకుంటూ ముఠాలుకట్టే అనారోగ్యకర ధోరణికి చిర్రుబుర్రులాడారేకానీ సమస్యకు మూలాలెక్కడ అని పట్టుపట్టి చూడలేదు. ఈ సంఘర్షణలను అధిగమించి ఐక్యతను సాధించే దిశగా సలహాలు ఇవ్వాల్సిందిగా వర్కింగ్ కమిటీ సమావేశంలో మిమ్మల్ని కోరగా అదెలా సాధ్యపడుతుందని అన్నారు. అహ్మదాబాద్ సదస్సులో రాష్ట్రాల్లో కాంగ్రెస్ మంత్రి వర్గాలను తిరిగి ఏర్పాటుచేయాలని నేను సూచించగా మీరు ఆమోదించారు. అందులో అన్ని వర్గాల వారికి ప్రాతినిధ్యం ఉండేటట్లు చూడాలన్నాను. అయితే తదుపరి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మీవంటి జాతీయ స్థాయి నాయకుడు ఉన్న వర్కింగ్ కమిటీ కూడా సంతృప్తికరంగా పరిస్థితుల్ని చక్కదిద్దలేకపోయింది. ఈ విధంగా కాంగ్రెస్ విచ్ఛిన్నమైపోతుంటే వర్కింగ్ కమిటీ ఇలాగే చూస్తూ కూర్చుంటే అది జాతికి ఏకైక నాయకత్వాన్ని అందించే హక్కును కోల్పోతుంది.

నానాటికీ కాంగ్రెస్ వారిలో పెచ్చరిల్లుతున్న క్రమశిక్షణారాహిత్యం, వారు కలిగించే అంతరాయాలు, రాజకీయ అనైతికత్వం వంటి సమస్యలపై మీరు పట్టు సాధించిందీ లేదు. పార్లమెంటరీ పార్టీ, వర్కింగ్ కమిటీలతో స్వేచ్ఛగా, సంపూర్ణంగా చర్చించి నిరంతర క్రియాశీల నాయకత్వాన్ని అందిస్తున్నట్లుగానూ నేను భావించడంలేదు. జాతి అత్యవసరంగా మీ ముందుంచిన గురుతర బాధ్యతలను మీరు భుజాలకెత్తుకున్నట్లుగానూ కనిపించడంలేదు.

కనుక నేను ఏ నిర్ణయానికి వచ్చానంటే ఇప్పుడు రూపుదిద్దుకుంటున్న కాంగ్రెస్ సంస్థ పరిష్కరించలేని గొడవలతో, మంత్రుల చెడ్డ పనులతో ప్రజల జీవన ప్రమాణాలను మరో పదేళ్లకైనా మెరుగుపర్చజాలదు. అంతేకాదు అది కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం ఆదర్శాన్ని అభివృద్ధిపర్చజాలదు.

అందువల్ల నేను గత సంవత్సరకాలంగా వర్కింగ్ కమిటీలోనూ, వ్యక్తిగత చర్చల్లోనూ

సూచిస్తూ వస్తున్నా -కాంగ్రెస్ పార్టీని రెండుగా విడిపోనివ్వండి. ఈ జాతీయ సంస్థ క్రమేపీ విచ్ఛిన్నం చెందుతూ ఉంటే చూస్తూ మిన్నకుండే కంటే అది మేలు. ఈ విధంగా మన నాయకులు, కార్యకర్తలు కొన్ని విషయాల్లో ఒకరి మొహం ఇంకొకరు చూడడం ఇష్టపడనివారు ఇతర విచ్ఛిన్నకర శక్తుల పట్ల ఆకర్షింపబడే వీలులేకుండా చూడొచ్చు. వాళ్ల సేవల ద్వారా ప్రజలను ఆకర్షించిన మన కార్యకర్తలే ప్రతిపక్షంగా ఏర్పడితే దేశానికి మేలు కదా. అదెలా సాధ్యమని నన్ను ప్రశ్నించినప్పుడు నేను చెప్పింది ఏమంటే కాంగ్రెస్ పాలన పట్ల అసంతృప్తిని ప్రకటించేవాళ్లను ప్రతిపక్షంగా నిలవనివ్వండి, అది కూడా మెజార్టీ పక్షం ఆశీర్వాదాలతోనే. అప్పుడు అది ప్రత్యామ్నాయ ప్రజాస్వామిక నాయకత్వాన్ని అందించేదిగా రూపుదిద్దుకుంటుంది. అటువంటి ప్రతిపక్షంలో చేరేందుకు నేను మొగ్గుచూపుతానని గతంలోనే చెప్పా. అది జాతి స్వేచ్ఛ కోసం నిర్వహించిన సుదీర్ఘ పోరాటంలో సుశిక్షితుల్ని గావించిన కాంగ్రెస్ మౌలిక ఆదర్శాలకు దూరంగా జరగకుండా ఉన్నట్లుంటుంది.

మీరు రూపొందించే కొన్ని విదేశాంగ, ఆర్థిక విధానాలు నాకు సరైనవిగా తోచడంలేదు. కనుకనే వ్యక్తిగతంగా మీ పట్ల నా గౌరవభావానికీ నాకు నచ్చని మీ రాజకీయ విధానాలకూ మధ్య నాలో నిరంతర సంఘర్షణ జరుగుతోంది.

నేను పలుమార్లు నా లేఖల్లోనూ, పార్లమెంట్‌లోనూ మీ ప్రభుత్వంతో మరింత చేరువుగా మెలిగే ఉద్దేశ్యం నాకు లేదని తెలియజేశాను. ఎందుకంటే మీకు అతి చనువుగా ఉండే కొద్దిమందిలో నేనూ ఒకణ్ణయి, మీ కంట్రోళ్ల విధానాన్ని, ధాన్యం సేకరణ పద్ధతుల్ని సమర్థిస్తూ రైతుల ప్రయోజనాలకు అడ్డంగా నిలిచే పనులు చేస్తూ వాళ్లకు ఫలవంతమైన సేవల్ని అందించగలనని నేను భావించడంలేదు. నేను మీ ప్రభుత్వ విధానాల్లో చాలావాటితో తీవ్రంగా విభేదిస్తున్నాను. అయితే సుశిక్షిత కాంగ్రెస్‌వాదిగా నేను నిగ్రహాన్ని పాటిస్తూ ఇన్నాళ్లుగా నా భావాలను బయటకు పొక్కనివ్వలేదు. మీ అహ్మదాబాద్ విజ్ఞప్తిని పురస్కరించుకుని ఈ క్లిష్ట సమయంలో దేశ ఆసక్తుల్ని పరిగణనలోకి తీసుకుని నా సహకారాన్ని అందిస్తానని హామీ ఇస్తున్నా.

కనుక మన దేశ రాజకీయ నాయకత్వం మిత్రత్వాన్ని నెరిపే రెండు రాజకీయ పక్షాలుగా విడిపోయి ప్రజారాజ్య స్థాపనే ధ్యేయంగా చేసుకుని వేర్వేరు పద్ధతులతో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాకానట్లయితే మనం జాతీయ నాయకత్వాన్ని కాంగ్రెస్‌కు మాత్రమే అప్పజెప్పి గుత్తాధిపత్యం వహించేటట్లు చేసి

అంతర్గతంగా దాన్ని కుప్పకూల్చి మన దేశాన్ని చైనాలో జరిగిన విధంగా అప్పణంగా కమ్యూనిస్ట్‌లకు అప్పగించాల్సి ఉంటుంది.

కనుక చాలామందిమి ప్రత్యామ్నాయ ప్రజాస్వామిక నాయకత్వాన్ని నిర్మించి మన దేశ ప్రగతిని ముందుతరాలకు సురక్షితంగా ఇవ్వాలనుకుంటున్నాం. అలా మన ప్రజలకు అంతర్గత, బాహ్య నియంతృత్వ శక్తుల బారినపడకుండా రక్షణ కల్పించాల్సి ఉంది. మేము రూపొందిస్తున్న ప్రత్యామ్నాయ నాయకత్వానికి దేశ ప్రజల మద్దతు కూడా ఉంటుందని ఆశిస్తున్నాం.

మీ
నిష్కపటి
ఎన్.జి.రంగ

ప్రియమైన టాండన్‌జీ,

జూన్ 9 సాయంకాలం నా రాజీనామా విషయంలో మన మధ్య సంప్రదింపుల్లో ప్రయోజనకరమైన ఫలితాలు వెలువడక పోవడం దురదృష్టకరం. 13.5.1951 నాటి మీ లేఖలో మీరు కాంగ్రెస్, కాంగ్రెస్ ప్రభుత్వాలకు చెందిన పలు విధానాలు, కార్యకలాపాలపై నా ఫిర్యాదులు ఉన్న కారణంగా మీరు వాటన్నింటినీ మీ జవాబులో పొందుపర్చేందుకు అవకాశం లేకపోయిందన్నారు కానీ నేను 15.5.51న నా జవాబులో ముఖ్యంగా మూడే మూడు అంశాలను ప్రస్తావించాను. అవి –ఈనాటి వరకూ మద్రాస్ మంత్రి వర్గం చేసిన అకృత్యాలపై విచారణ జరపడం, అలాగే మీ కార్యదర్శి వర్కింగ్ కమిటీ ఆదేశాలను పెడచెవినపెట్టి ఎందుకు కోర్టుకు వెళ్లాల్సి వచ్చిందో విచారణ చేయించడం, శాఖలను మార్చుతూ శాసనసభా పక్షం, కాంగ్రెస్‌లోని అన్ని వర్గాలకు మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం కల్పిస్తూ మంత్రి వర్గాల పునర్నిర్మాణానికి పూనుకోవడం. ఈ దిశగా మీరేం చేయదల్చుకున్నారో చెప్పమన్నాను.

మీరెలాంటి చర్యలు తీసుకునే స్థితిలో లేరని తెలిసి ఆశ్చర్యానికి లోనయ్యాను. మీరు చర్యలు తీసుకోకపోవడానికి కారణం అటువంటి విచారణలు అనవసరమని భావించికాదు, అటువంటి విచారణలు సత్ఫలితాలను ఇవ్వవనే భయమే. మంత్రి వర్గ పునర్విభజన విషయంలో కూడా అది సాధ్యపడదనడానికి కారణం అది అనవసరమని

కాదు, మంత్రి వర్గానికి అది నచ్చని పని అని. మంత్రి వర్గాల పట్ల మీ వైఖరి అంతా ఏదోవిధంగా సమర్థించుకునే తీరుగా సాగింది. ఔను, మీరు నిర్మొహమాటంగా చెప్పారు -పార్లమెంటరీ బోర్డు మంత్రి వర్గాలపై విచారణలు నిర్వహించినా, మరేవిధంగా జోక్యం కల్పించుకున్నా అవి ఆగ్రహాన్ని వెళ్లగక్కుతాయని. దానికి నేను 1936-39 మధ్యకాలంలో సర్దార్ పటేల్ ఏమి చేసిందీ గుర్తుచేసి ఆ తరుణంలో పార్లమెంటరీ బోర్డు నిర్ణయాలు, బీహార్ భాటియా భూవివాదం ఎటువంటి మంచిని ప్రోది చేసుకుందో చెబితే ఇటీవలి పంజాబ్ మంత్రి వర్గం విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని వెల్లడించారు. మీ నిస్సహాయత నూటికి నూరుపాళ్లు విశ్వసింపదగినదే. కాంగ్రెస్ మంత్రి వర్గాలను కట్టడి చేసి వాటి దురాగతాల నుండి ప్రజలకు రక్షణ కల్పించడం కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డు ద్వారా జరిగే పనికాదేమోనని భయాలు నిజమయ్యాయి. కనుక కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి మంత్రి వర్గాలను మార్గదర్శనం గావించి వాటిని కట్టడి చేయగల సత్తా ఉంటుందని ప్రజలు పెట్టుకున్న విశ్వాసాన్ని అది వమ్ము చేసింది.

అప్పుడు మీరు మీ సలహాను పునరుద్ఘాటించారు. ఆంధ్ర ప్రొవెన్షియల్ కాంగ్రెస్ కమిటీ కొత్త అధ్యక్షుడు ఆ కమిటీకి గల 18 స్థానాల్లో 9 స్థానాలు మాకు కేటాయిస్తానన్నారు. కనుక దాన్ని అంగీకరించేటట్లుగా నా స్నేహితులకు నచ్చచెప్పమన్నారు. అటువంటి స్థితి ఉత్పన్నం కాదనే విషయాన్ని మీరు గ్రహించలేకపోవడం నాకు చాలా బాధ కలిగించింది. మెజార్టీ మైనార్టీగా ఎలా మారిపోయిందో మీరు గమనిస్తారనుకున్నాను. 26 మంది ప్రతినిధుల్ని కోర్టు వుత్తర్వులు తెచ్చి పక్కన పెట్టడం వల్లనే కదా అలా జరిగింది. మీరు ఎవరినైతే అధ్యక్షుడిగా గుర్తిస్తున్నారో అసలు ఆయన గెలిచేవాడే కాదుకదా. కనుక అలా మైనార్టీని సాంకేతికంగా మెజార్టీగా మార్చిన వ్యక్తి మాకు వర్కింగ్ కమిటీలో సగం సీట్లు ఇస్తామనడం హాస్యాస్పదం. ఇంతకూ అసలు నవ్వు తెప్పించే విషయం ఏమంటే దానికి మీరు సమ్మతించి దాన్ని ఉదార చర్యగా భావించి అందుకు నన్ను ఎగిరి గంతెయ్యమనడం. ప్రజాస్వామిక విలువలన్నీ అలా భ్రష్టుపట్టడానికి కారణం 25.2.51 నాటి వర్కింగ్ కమిటీ అన్యాయపూరిత తప్పుడు నిర్ణయమే. కోర్టు తీర్పు ఎలా ఉన్నా పదవుల కోసం ఎన్నికలు నిర్వహించడాన్ని వర్కింగ్ కమిటీలో ఉన్న మాలో చాలామందిమి ఆ వైఖరిని ఖండించాం. వాళ్ల తప్పిదం ఏమీ లేకుండానే అంతమంది సభ్యుల్ని ఓటు వేసేందుకు అనర్హులుగా ప్రకటించి వారు లేనిసమయంలో సంఖ్యా బలాన్ని తారుమారు చేసి ఒక

వర్గానికి ప్రయోజనం చేకూర్చడం అన్యాయమని చెప్పాం. అయినా వక్రమార్గంలో మెజార్టీ సాధించినవారు వారి మార్గాన్ని వారు ఎంచుకున్నారు. నేను నిరసనను ప్రకటించాను, దీనివల్ల అల్లకల్లోలాన్ని చూడాల్సి వస్తుందని కమిటీకి హెచ్చరిక చేశాను కూడా.

జూన్ 9 నాటి మన చర్చల్లో నాకు అర్థమైందేమంటే మీరూ ఆ ఫలితాలను గర్హించారు. అయితే ఏ మేరకు? అప్పుడు నేను మహాత్మాగాంధీ మనకు మిగిల్చిపోయిన ఉన్నతమైన ఉదాహరణను మీకు గుర్తుచేశాను. 1925లో అహ్మదాబాద్‌లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సదస్సులు కౌన్సిల్ ప్రవేశ విషయం వేడిగా వాడిగా చర్చించినప్పుడు మోతీలాల్ నెహ్రూ, సి.ఆర్.దాస్, మరికొందరు గాంధీ గారి 'మార్పు వద్దు' అన్న వైఖరికి నిరసనగా సభ నుండి నిష్క్రమించారు. అప్పుడు జరిపిన ఓటింగ్‌లో బాపూ ప్రతిపాదన నెగ్గింది. అయితే బాపూ లేచి తన ప్రతిపాదన వీగిపోయినట్లు ప్రకటించారు. ఓటింగ్ సమయంలో మోతీలాల్‌జీ, దాస్ వర్గంవారు సభలో ఉండి వుంటే తన ప్రతిపాదన తప్పక వీగిపోయేది. కనుక ఆయన తాత్కాలికంగా రాజకీయాల నుండి తప్పుకున్నారు. మోతీలాల్ నెహ్రూ, దాస్‌లు కౌన్సిల్ ప్రవేశం కోసం చేసిన ప్రతిపాదనను ఆశీర్వదించారు. వాళ్ల రాజకీయ ప్రయోగాన్ని, నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు సాయపడ్డారు.

ఇవాళ జరుగుతున్నదాన్ని ఆనాటి ఉన్నతస్థాయి ప్రజాస్వామిక ప్రవర్తనతో బేరీజు వేసి న్యాయాన్యాయ విచక్షణకు పూనుకోమంటున్నాను. ఆ విధంగా ప్రస్తుత దయనీయ స్థితి నుండి కాంగ్రెస్‌ను ఓ దరికి చేర్చమంటున్నాను.

ఈ విషయాల సారాంశాన్ని జవహర్‌లాల్ ముందుంచాను. ఆయన కూడా సమయానికి తగిన విధంగా స్పందించడంలో విఫలమయ్యారు. మీ సెక్రటేరియెట్ నుండి ఆంధ్ర ప్రాంతపు కాంగ్రెస్ కమిటీల వరకూ గల దోషుల విషయంలో క్రియాశీలంగా వ్యవహరించలేకపోయారు. వాళ్లంతా వర్కింగ్ కమిటీని తోసిరాజని కోర్టులకెక్కారు. కాంగ్రెస్‌లోని ప్రజాస్వామిక పద్ధతుల్ని పెడతోవ పట్టించారు. దాని ప్రతిష్టను దిగజార్చారు.

నేను తిరిగి వర్కింగ్ కమిటీలోకి వచ్చి ఏం ప్రయోజనం? దాని తప్పుడు నిర్ణయాలు మితిమీరిపోయాయి. ఆ కారణం చేతనే ఈ విషయాలన్నింటినీ నేను హాజరుకాని వర్కింగ్ కమిటీలో చర్చించి మన కోసం కాక కాంగ్రెస్‌కు మంచి పేరు తెచ్చేందుకు

న్యాయం చేయమని కోరాను. ప్రజలంతా వాళ్లను నాయకత్వం వహించమని కోరుకున్నప్పుడు మనం ఉన్నత ప్రమాణాలను పాటించి ప్రజాస్వామిక మర్యాదల్ని, రాజకీయ నిజాయితీని కొనసాగించాల్సిన అవసరముంది. ఆంధ్రలో జరిగినటువంటి కాంగ్రెస్ ఎన్నికల వ్యవహారంలో తలదూర్చడమంటే కొరివితో తలగోక్కున్నట్టే.

ఇదంతా చూస్తుంటే అసలు సిసలైన జీవితపు సారం, నీతిదాయక ప్రమాణాల వాతావరణం, న్యాయ నిర్ణయాలు కాంగ్రెస్ నుండి పలాయనం చిత్తగించాయని అనిపించడంలేదూ? కోర్టు ఉత్తర్వుల్ని అడ్డంపెట్టుకుని మెజార్టీని మైనార్టీగా మసిపూసి మారేడుకాయ చేయడంవంటి పరువు తీసే అనైతికత్వాన్ని ప్రజాస్వామిక ఎన్నికల్లోకి జొప్పించడాన్ని చూసి అధ్యక్షుడు కూడా నిస్సహాయంగా ఉండిపోయిన సందర్భం కదా అది.

ప్రజా జీవనంలో సహజ ప్రమాణాలను పట్టించుకోకుండా ఉండాలనుకుంటే ఆంధ్రా మంత్రి వర్గ ముఠా ఇస్తానన్న పదవుల్ని పుచ్చుకోవడమే సానుకూలంగా వుంటుంది. అప్పుడు కాంగ్రెస్ పదవుల పందారంలో మా వాటా మాకు దక్కుతుంది. మంత్రుల ముఠాతో కలిసి నీతినియమాలను తుంగలో తొక్కి ప్రజలను బాగా దోచుకోవచ్చు. అయితే మేము రాజకీయ కీకారణ్యాన్ని కోరుకుంటున్నాం. కష్టాల్ని, నష్టాల్ని భరిస్తూ పోటీ పార్టీ పెట్టేందుకే మొగ్గుచూపుతున్నాం.

నేను మీ నుండి, కాంగ్రెస్ పార్టీ నుండి దూరంగా జరిగేందుకు మార్గాలను అన్వేషిస్తున్నా. అది మనవాళ్లందరికీ బాధ కలిగించేదిగా ఉండొచ్చు. మనం గాంధీ గారి ప్రోద్బలంతో ఒకనాడు దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలకు పూనుకున్నట్లే ఇవాళ మళ్లీ ఈ గుండెపోట్లను భరించాల్సిందే, త్యాగాలకు పూనుకోవాల్సిందే. ఉన్నత ఆశయ సాధన దిశగా బాపూ సైతం ఆశీర్వాదాలందించిన ప్రజాస్వామిక కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం కోసం పాటుపడాల్సిందే. నేను ఇంతవరకూ ఎవరితోనైతే బాపూజీ ఉత్తేజిత నాయకత్వం కింద పనిచేశానో వారందరికీ స్నేహహస్తం చాచి ఉంటాననే హామీ ఇస్తున్నా.

మీ
నిష్కపటి
ఎన్.జి.రంగ

45

కృషికార్ లోక్‌పార్టీ పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యం

గాంధీ తరహా పార్లమెంటరీ నియమావళి పట్ల నెహ్రూకు ఉదాసీన భావం అన్న విషయం ఆంధ్రులమైన మాకు అర్థమైపోయింది. ఎందువల్లనంటే 1952లో, 1955లో మా మధ్య కుదిరిన పెద్ద మనుషుల ఒప్పందాన్ని గౌరవించడంలో ఆయన అయోగ్యమైన రీతిలో మాట తప్పాడు. ఆడంబరపు అదృష్టం కృషికార్ లోక్‌పార్టీ అందించే అంత్యఖాద్యాల (desserts)ను కూడా గమనించని దశకు తీసుకెళ్లింది. మంత్రిగా పదవీ స్వీకారం చేసి రెండు మాసాలైందో లేదో ఎన్.వి.రామారావు మరణించారు. ఇద్దరు కృషికార్ లోక్‌పార్టీ మంత్రుల్లో ఆయనొకరు. కె.ఎం.పి.రాజ్ కోసం, రైతుల కోసం ఆయన అవిరళ కృషి చేశారు. ఆయన తండ్రి గారు 1920-42 మధ్యకాలంలో పలుమార్లు జైలుజీవితం అనుభవించారు. రామారావు కూడా కిశోరప్రాయంలోనే 1930లో జైలు జీవితాన్ని అనుభవించారు. 1940-44 మధ్యకాలంలో కూడా ఆయన జైలుపాలయ్యాడు. ఆయన న్యాయవాది. ప్రజలను ఏకతాటిపై నడిపించడంలో దిట్ట. 1952-53 గోదావరి వరదల్లో ఆయన అందించిన సేవలు నిరుపమానం. ఆయన మంత్రి పదవిని రెండు పర్యాయాలు తిరస్కరించాడు. అయితే పెద్దిరెడ్డి తిమ్మారెడ్డివంటి పాత్రను ఆయన పోషించలేదు. ఆయన మంత్రిగా ఉన్న నెల రోజుల్లోనే పంటల భీమాకు సంబంధించి ఒక ముసాయిదా పథకాన్ని రూపొందించాడు. దాన్ని కేంద్ర ప్రభుత్వానికి, ప్లానింగ్ కమిషన్‌కు సమర్పించాడు. దాని విషయంలో ఇప్పటికీ (1967)

ప్రభుత్వం ఏమీ పట్టించుకున్నట్లు కనిపించడంలేదు.

కృషికార్ లోక్‌పార్టీ మిత్రులకు ఆయన మరణం ఒక తీరని లోటు. ఆయన స్థానంలో కందుల ఓబులరెడ్డిని నియమించమని సంవత్సరానికిపైగా చెబుతూనే వస్తున్నా. ఆయన్ను రామారావు స్థానంలో నియమిస్తే మంత్రి వర్గ నిర్మాణ సమయంలో ఆయన్ను మంత్రి వర్గంలోకి తీసుకోని తప్పిదం కూడా సర్దుకుపోతుందని చెప్పా. 24 మంది మంత్రులున్న మంత్రి వర్గంలో కె.ఎల్.పి. ప్రతినిధి ఒకే ఒక్కరు. ఆ విధంగా ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన మాట తప్పింది కాంగ్రెస్ పార్టీ. ఒకటిన్నర సంవత్సరాల జాప్యం తర్వాత, లచ్చన్న గారి పలు విజ్ఞప్తుల తర్వాత ఓబులరెడ్డి గారికి మంత్రి వర్గంలో స్థానం కల్పించారు. అదీ యునైటెడ్ ఫ్రంట్ మాటపై గౌరవం ఉంచే తీరు, స్నేహంచేసే తీరు. యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ నిర్మాణానికి తపన పడిన కృషికార్ లోక్‌పార్టీకి ప్రతిఫలంగా ఉత్కృష్ట రాజకీయ నాయకత్వం ప్రదర్శించిన కృతఘ్నతా భావం. ప్రజాస్వామిక ఐక్యత కోసం మేము కాంగ్రెస్‌తో చేయీ చేయీ కలిపిన కారణంగా వారు లబ్ధి పొందిన విషయాలను జవహర్‌లాల్‌జీ సులభంగా మర్చిపోగలిగారు. ఎందుకు? ఆయన 1952లోనూ, 1954లోనూ కాంగ్రెస్‌ను ఓడించినందుకు కృషికార్ లోక్‌పార్టీని శిక్షించాల్సి ఉంది.

ఆంధ్ర ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీకి రాజకీయ సుస్థిరత్వాన్ని చేకూర్చి ప్రజల హృదయాల్లో నిలిచేటట్లుగా చేసేందుకు నన్ను దానికి అధ్యక్షునిగా ఉండమని కోరతారని ఎవరుబడితే వాళ్లు చెప్పుకుంటూనే ఉన్నారు. ఏమైందోకానీ 1955లో అఖిలభారత కాంగ్రెస్ కమిటీ నాయకులు విజయవాడలో కలుసుకుని బెజవాడ గోపాలరెడ్డిని వాళ్ల నాయకునిగా ఎంపిక చేయడంతో సంతృప్తిచెంది నన్ను యునైటెడ్ కాంగ్రెస్‌కు అధ్యక్షునిగా ఆహ్వానించే విషయాన్ని వాయిదావేశారు. కొందరు కాంగ్రెస్‌వాదులు ఆ ప్రస్తావన నా దగ్గర తెచ్చినప్పుడు అన్ని ముఠాలవారు అంగీకరిస్తేనే నేను ఆ బాధ్యతను స్వీకరిస్తానని చెప్పాను. నేను పార్లమెంటరీ బృందంలో ప్రతినిధిగా రష్యా, యుగోస్లావియాల పర్యటనలో ఉండగా కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి నా పేరు ప్రతిపాదించమని కోరుతూ నేనెవ్వరికీ రాతపూర్వకంగా అనుమతిని ఇవ్వలేదు. అయినా నెహ్రూకు ప్రియపాత్రుడైన నీలం సంజీవరెడ్డికి ఎదురు నిలిచిన ఎవరో కాంగ్రెస్‌వాది ఆయనకు సంజీవరెడ్డి గిట్టనందున నా పేరు ప్రతిపాదించాడు.

అప్పుడు అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో శల్యులు, నారదులు ఎంతో చాకచక్యంగా వారి పాత్రల్ని పోషించారు. నా పేరును కాంగ్రెస్‌లోని ఓ ముఠా అలా వాడుకోవడమేకాక సంజీవరెడ్డి ఆ సవాల్‌ను ఒప్పుకునేటట్లుగా అనవసరంగా రెచ్చగొట్టారు. ఎన్నిక జరగడానికి రెండు రోజుల ముందుగానే వాళ్ల ముఖ్యమంత్రి నా అభ్యర్థిత్వానికి బహిరంగంగా మద్దతు పలికేందుకు ఇష్టపడడంలేదని తెలిసినా మరో అభ్యర్థి నా అంత శక్తిమంతుడులేడని వాళ్లు భావించారు. ఎన్నికలనాటి ఉదయం కె.ఎల్.పి. కార్యకర్తలు, రైతు నాయకులు పోటీ నుండి నన్ను తప్పించమని చివరకు ప్రాధేయపడ్డారు. ఓడిపోయినా సరే నా అభ్యర్థిత్వం కొనసాగాల్సిందేనన్నారు. అలా నేను ఓటమిని తట్టుకోగలననే నమ్మకం వాళ్లకు కుదిరింది. వాళ్లకూ, కొందరు ఎఐసిసి నాయకులకూ మధ్య రహస్యంగా నడిచిన సమాచారం ప్రకారం మా గ్రూపులో నేను ప్రత్యేక వ్యక్తినని. అయినా నాకు గ్రూపులేమిటి? ఐక్య కాంగ్రెస్‌లోకి చేరేటప్పుడు నాకు అటువంటి ఉద్దేశాలు లేనేలేవు.

ఐక్య కాంగ్రెస్ పట్ల నా వ్యామోహాన్ని వాళ్లు పూర్తిగా విస్మరించారు. నేను కమ్యూనిస్ట్‌లను ఓడించేందుకు మాత్రమే ప్రజాస్వామిక పార్టీలన్నింటినీ కూడగట్టాలని తహతహలాడాను.

కొందరు పార్లమెంట్‌కు చెందిన ప్రముఖ మిత్రులు ఢిల్లీ నాయకులకు సూచించారట కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోకి నన్ను ఆహ్వానించమని. అందుకు కారణం బాపూ కాలంనుండి నేను అందులో సభ్యునిగా ఉన్నవాణ్ణి కాబట్టి. అయితే దానికి జవహర్‌లాల్ అభ్యంతరం చెప్పడం జరిగిందట. దాన్ని సాధారణ ఎన్నికలకు ముందు కుదుర్చుకున్న రహస్య ఒప్పందంగా తప్పుడు సంకేతాలు వెళతాయని చెప్పారట. అదే నాయకుడు నేను చేరకముందే నాది మరీ స్వతంత్రంగా వ్యవహరించే స్వభావమని, పట్టుదల ఎక్కువని, రైతుల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతానని కూడా చెప్పారట. మరో పక్క నుండి పలువురు శల్యులను కేంద్రంలోనూ, ఆంధ్రలోనూ మంత్రి వర్గంలోకి ఆహ్వానించడం జరిగింది. అనేకమంది 'నారదులు' సంజీవరెడ్డికి, నెహ్రూకు ఆప్తమిత్రులయ్యారు. ఆ విధంగా జవహర్‌లాల్ 1967లో అటు కాంగ్రెస్, ఇటు దేశం పతనమవడానికి కారణభూతుడయ్యాడు.

మే నెలలో నేను రష్యాకు పయనమయ్యే ముందు వాస్తవానికి విమానాశ్రయానికి బయలుదేరడానికి గంట ముందు శల్యుల్లో ఒకరు నా వద్దకు రావడం జరిగింది.

ఆయన రాష్ట్రం తరఫున, ఎఐసిసి నాయకుల తరఫున మాట్లాడేందుకు వచ్చినట్లు చెప్పుకున్నాడు. ఒకవేళ నా పేరును ఎవరైనా ప్రతిపాదిస్తే అందుకు నన్ను అభ్యంతరం చెప్పవద్దని కోరాడు. నేను అంతకుముందు చెప్పినదానికంటే ప్రయోజనకరమైన మాట నేనేమీ చెప్పలేనన్నాను. నేను జూలైలో తిరిగి వచ్చిన తర్వాత ఎఐసిసి నాయకులను నిలదీశాను. నేను లేనిసమయంలో అంతగా గట్టి పోటీ ఉన్నదని తెలిసినప్పుడు నా పేరు ఎందుకు ప్రతిపాదించారని. వాళ్లు పోటీ నామమాత్రమేనని భావించామన్నారు. ఐక్య కాంగ్రెస్‌లో చేరి ఆంధ్రలో తిరిగి కాంగ్రెస్‌కు పట్టంకట్టడంలో ఎంతగానో తోడ్పాటునందించిన నాకు ఎంతటి గుర్తింపునిచ్చారు! వాళ్లు ఏ విధంగా విఫలమైందీ వివరించలేదు. ముఖ్యమంత్రి విషయంలోకానీ, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుని విషయంలోకానీ జవహర్‌లాల్‌జీ స్పందన ఎలా ఉన్నదీ చెప్పలేదు.

ఐరోపా పర్యటనను ముగించుకుని నేను ఆంధ్రకు తిరిగొచ్చిన పిమ్మట నాకు తెలియవచ్చిందేమంటే కృషికార్ లోక్‌పార్టీకి చెందినవారు కాంగ్రెస్‌లోకి తిరిగి వచ్చేందుకు, స్థానిక కాంగ్రెస్ కమిటీల్లో స్థానం సంపాదించేందుకు ప్రయత్నాలు చేస్తుంటే వాళ్లు వివక్షకు గురయ్యారని. నేను రాష్ట్ర కృషికార్ లోక్‌పార్టీ నాయకులకు, వాళ్లకు ఒత్తాసు పలికే శల్యులకు, నారదులకు వాళ్లు ఏ కాంగ్రెస్ కమిటీని లాగేసుకోవాల్సిన అవసరంలేదని, ఇతరులు వాళ్లను కావాలని కోరుకుని ఆహ్వానిస్తేనే వెళ్లమని చెప్పాను. అయితే కాంగ్రెస్ సభ్యత్వం పుచ్చుకున్న కె.ఎల్.పి. మద్దతుదార్ల పేర్లను వాళ్లు నమోదు చెయ్యకుండా జిల్లా, తాలూకా కాంగ్రెస్ కమిటీల్లో దురుద్దేశపూర్వకమైన కార్యక్రమం చేపట్టారు. ఆ విధంగా ఐక్య కాంగ్రెస్ దాని విధులను అది నిర్వర్తించలేదు.

ఈ వాస్తవాలను నేను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ నాయకత్వం దృష్టికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ తీసుకురావడం జరిగింది. రమణ అనే ఒక పార్లమెంట్ సభ్యుడు ఎఐసిసి కార్యాలయంలో సభ్యత్వ రుసుము చెల్లించి స్థానిక కార్యాలయంలో తన పేరును నమోదు చేయించాల్సిందిగా కోరాడు. ఆ పని జరగలేదు. ఆ తర్వాత ఎటువంటి విషాదకర సన్నివేశాలకు దారితీసిందో మనందరికీ తెలుసు. తర్వాత ఆయన పేరును జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి ప్రతిపాదించారు. అయితే ఆయన పేరు డిసిసి సభ్యుల పేర్ల జాబితాలో లేనందున అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు అనర్హునిగా తేల్చాడు ఎన్నికల అధికారి.

జిల్లా కాంగ్రెస్ కమిటీని తిరిగి ఎన్నిక నిర్వహించమని ఎఐసిసి ఆదేశించ

లేకపోయింది. విషయమంతా దాని దృష్టికి వచ్చిన తర్వాత కూడా కాంగ్రెస్ పునర్నిర్మాణ విషయంలో ఎన్నికలప్పుడు చేసిన వాగ్దానాలను అది త్వరగానే మర్చిపోయింది. 1956 ఏప్రిల్ నాటికి కృషికార్ లోక్‌పార్టీ ఆదర్శాల పట్ల విశ్వాసం ప్రకటించే కార్యకర్తలు, ప్రజలు ఆంధ్ర కాంగ్రెస్ కమిటీలకు అవసరంలేదని తేలిపోయింది. 1955 ఉత్తరార్ధంలో కృషికార్ లోక్‌పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో కొనసాగుతూ కిసాన్ సమ్మేళన్ నిర్మాణానికి కృషి చేయడమేమిటనే ప్రశ్న తలెత్తింది. కిసాన్ సమ్మేళన్ కాంగ్రెస్‌ను వ్యతిరేకించే సంస్థ అన్నారు. అది కిసాన్ కార్యకర్తలను దిగ్భ్రమకు గురిచేసింది. అసలు తామెందుకు కాంగ్రెస్‌లో విలీనమైనట్లు అని ప్రశ్నించుకోసాగారు. కిసాన్ ఆలోచనా ధోరణిని కాంగ్రెస్‌వాదులు కలిగి ఉండడాన్ని చివరకు మహాత్మాగాంధీ కూడా తప్పుపట్టలేదు. కిసాన్ సమ్మేళనాన్ని ఒక వర్గ వ్యవస్థగా కాంగ్రెస్‌లో రూపొందే హక్కును ఆయన అంగీకరించారు.

కిసాన్ సమ్మేళనం విషయంలో కృషి చేసే నన్ను తీవ్రంగా వ్యతిరేకించే సర్దార్ పటేల్ కూడా నన్ను జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ఉండేటట్లు చూసి రైతు సంస్థ అవసరాన్ని గుర్తించి సర్దుకుపోయారు. కె.ఎల్.పి. సహకారంతో తిరిగి అధికారాన్ని చేజిక్కించుకున్న ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రముఖులు కె.ఎల్.పి. ఐక్య కాంగ్రెస్‌లో చేరాలనే నిర్ణయానికి రాగానే వాళ్లు 35 సంవత్సరాలుగా పెంచి పోషించిన కిసాన్ సమ్మేళనాన్ని రద్దు చేయమన్నారు. అసలు వాళ్లు ప్రజల్లోకి చొచ్చుకుపోగలిగింది వాటి ద్వారానే కదా.

ఇదంతా నదిని దాటగానే తెప్పను తగలేసినట్లుగా తయారైంది. ఇది రైతు బాంధవులకు నచ్చలేదు. పరిణామాలేమైనా ఆ వైఖరిని ఖండించదల్చారు. వాళ్లిక కాంగ్రెస్‌లో ఏమాత్రం కొనసాగమని తేల్చిచెప్పారు. ఈ తిరుగుబాటులో జి.వి.సుబ్బయ్య, జి.ఎల్.నారాయణలు ప్రముఖ పాత్ర పోషించారు.

ఇదంతా ఎఐసిసి నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినప్పుడు వాళ్లు ఆంధ్రలో కాంగ్రెస్ పునర్నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. అయితే కిసాన్ సమ్మేళనం విషయంలో రగడ వద్దని మాత్రం పిసిసిని వారించారు. అప్పటినుండి రాజకీయ చైతన్యం గల ప్రతి కిసాన్ కార్యకర్త, కృషికార్ లోక్‌పార్టీ విధానానికి కట్టుబడినవారు కాంగ్రెస్ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవడం మానేశారు.

కృషికార్ లోక్‌పార్టీ తిరిగి రంగంలోకి ఎందుకు దిగరాదు?

ఈ ప్రమాదకరమైన పరిణామాన్ని నేను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ నాయకుల దృష్టికి 1957 జూన్-జూలై నెలల మధ్యకాలంలో తీసుకొచ్చి ఇచ్చిన సలహా ఏమంటే ఈ విలీనం ప్రక్రియ ప్రయోగాన్ని నిలిపివేద్దాం. కాంగ్రెస్-కె.ఎల్.పి.లను విడివిడిగా కొనసాగనిద్దాం. అయితే శాసనసభా వ్యవహారాల్లో మిత్రపక్షంగా కొనసాగేటట్లు చూద్దామని. మనం సాధారణ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను మర్చి కె.ఎల్.పి. ప్రజాపార్టీ నాయకుల్ని మంత్రి వర్గంలోకి రానివ్వలేదు. వాళ్లంతా ఐక్య కాంగ్రెస్‌కు చెందిన వారైనప్పటికీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకత్వంలో వారికి గౌరవప్రదమైన స్థానాలు దక్కలేదు. వాళ్లతో సమానంగా చూడలేని 1951కి ముందునాటి మురాతత్వంతో మసలే నాయకత్వంలో వాళ్లు ఇంకేమాత్రం మైత్రిని నెరపలేరన్నాను.

మార్చి 1956లో కందుల ఓబులరెడ్డి గారు ఆంధ్ర రాష్ట్రానికి ఆహార, వ్యవసాయ శాఖామాత్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి అసమర్థుడైన కారణంగా నీలం సంజీవరెడ్డి కందుల ఓబులరెడ్డికి 18 మాసాలపాటు ఆ పదవి దక్కకుండా చేయగలిగారు. కందుల ఓబుల రెడ్డి రైతు విద్యాలయం నుండి పట్టభద్రుడై 1934లో ప్రజా జీవితంలోకి వచ్చినవాడు. సంజీవరెడ్డి సాగించే వర్గపోరు కె.ఎల్.పి. మంత్రులు లచ్చన్న, ఓబులరెడ్డి గార్లకు నచ్చకపోవడంతో అది తర్వాత అనేక దురదృష్టకర పరిణామాలకు దారితీసింది.

కె.ఎం.పి.రాజ్ ఆదర్శాల పట్ల ఉల్లాసాన్ని వ్యక్తపర్చే ఆంధ్ర ప్రజానీకం ఇరువురు కె.ఎల్.పి. మంత్రుల కృషిని కొనియాడారు. ఇంతలో స్థానిక పంచాయతీల్లోని నాయకులు, కార్యకర్తలు, గ్రామాల్లోని శల్యులు, నారదులు పిసిసి మంత్రుల చెవుల్లో గూడు కట్టసాగారు. వాళ్లు ఆ చనువును స్థానిక, కులపరమైన గొడవల్లో ఉపయోగ పెట్టుకోసాగారు. ప్రజల్లో కె.ఎం.పి.రాజ్ ఆదర్శాలను ప్రచారం గావించలేదు. అయితే కె.ఎం.పి.రాజ్ కార్యకర్తలు మాత్రం ప్రజల్లో కె.ఎల్.పి. మంత్రుల పట్ల, దాని ఆదర్శాల పట్ల, కార్యక్రమాల పట్ల ఉత్సాహాన్ని ప్రోదిచేసి కె.ఎల్.పి. మంత్రులను స్వాగతించేందుకు భారీ ర్యాలీలను నిర్వహించి వాళ్లు వివరించే కె.ఎల్.పి.రాజ్ ఆదర్శాలను శ్రద్ధగా వినేవారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితోసహా మిగతా పదకొండు మంది మంత్రుల కంటే కె.ఎల్.పి. మంత్రులిరువురే ఆంధ్ర ప్రాంతమంతటా ప్రజల్లో వుత్సాహాన్ని

రేకెత్తించసాగారు. అది ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మంత్రుల్లో అసూయను మరింత పెంచింది. వారిరువురూ పెంచే ప్రజాదరణను మొత్తం మంత్రి వర్గానికి చెందినదిగా మలచుకునేటట్లు మసలుకోలేదు. అందుకు కారణం పిసిసికి చెందిన మంత్రులు వాళ్ల ముఠాతత్వం, కులాభిమానాలను దాటి పైకి ఎదగకపోవడమే.

అంతకుముందు ఆంధ్ర, తెలంగాణాలను ఆంధ్రప్రదేశ్‌గా విలీనం చేయడంతో రాష్ట్ర జనాభా మూడు కోట్లకు చేరింది. కాంగ్రెస్ పార్టీ కొత్త నాయకుడ్ని ఎన్నుకోవాల్సి వచ్చింది. బెజవాడ గోపాలరెడ్డిని ఓడించి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. గత ఆరు సంవత్సరాలుగా కె.ఎల్.పి. పట్ల కొనసాగిస్తూ వస్తున్న వైరం కారణంగా కె.ఎల్.పి. ప్రతినిధుల్ని మంత్రి వర్గంలోకి తీసుకోలేదు. ఆయన 1952 నాటి పెద్దమనుషుల ఒప్పందాన్ని తోసిపుచ్చాడు. ఈ అగౌరవ చర్య లాల్‌బహదూర్, మరికొందరు కాంగ్రెస్ నాయకుల అవగాహనకు వచ్చినా గాంధీ తరహా రాజకీయ గౌరవ పంథా విషయంలో జవహర్‌లాల్‌జీకి నచ్చజెప్ప లేకపోయారు. అలా వాళ్లకు నచ్చిన వ్యక్తి ఆంధ్రలో గాంధీ పద్ధతిలో ప్రవర్తించేటట్లు చేయడంలో విఫలమయ్యారు.

నేను కాంగ్రెస్ నాయకుల విశ్వసనీయతపై దృష్టిని సారించడం ఆంధ్ర మంత్రి వర్గంలో కేవలం ఏవో కొన్ని స్థానాలు సంపాదించేందుకు కాదు. చట్టసభల్లో మంత్రి వర్గంలో ఉన్న స్థానాలు ప్రాముఖ్యాన్ని సంతరింపజేసుకునే మాట వాస్తవమే. అయితే కాంగ్రెస్‌వారు మంత్రి వర్గంలో స్థానాల కోసం అంతగా పెనుగులాడేది పదవుల కోసం, ఆశ్రితపక్షపాతాన్ని ప్రదర్శించేందుకు, అవినీతిని పెంచి పోషించేందుకు, ముఠాతత్వాన్ని, కులతత్వాన్ని రగిలించి స్వప్రయోజనాలు పొందేందుకు అనేది సుస్పష్టం. పైగా మేము మంత్రి వర్గంలో స్థానాలు కోరింది విధాన నిర్ణయాలు సజావుగా జరిగేటట్లు చూచేందుకు, పరిపాలనకు దిశా నిర్దేశం చేస్తూ అన్ని వర్గాలవారికి న్యాయం జరిగేటట్లు చూడాలని. అది ఏ మంత్రి వర్గమైనా నిర్వహించాల్సిన కర్తవ్యం. కనుకనే మంత్రి వర్గంలో స్థానాలు కోరాలికానీ బిచ్చమెత్తరాదు. వాటిని పొందిన తర్వాత ఆ పదవుల్ని సద్వినియోగం చేయాలేకానీ దోపిడీకి వాడుకోరాదు. దీనికోసమే చట్టసభల్లో ఆధిక్యం సాధించిన పక్షాలు, ఆధిక్యం సాధించలేని పక్షాలు ఉంటాయి. బాల్డ్విన్ నెవిల్లే చాంబర్లిన్‌లు మంత్రి వర్గంలోకి చర్చిల్‌ను తీసుకోనందువల్ల వాళ్ల విదేశాంగ నీతి ఎంత దారుణమైన మార్పుకు గురైందో ఎవరైనా ఇట్టే గ్రహించవచ్చు. అలాగే బెవాన్ ముఠా అప్పుడప్పుడూ ప్రతిఘటనలకు పాల్పడినా ఆయనతో చెలిమిని బ్రిటిష్ లేబర్

పార్టీ విడనాడలేకపోయింది! జవహర్‌లాల్‌జీ, మిగతా కేంద్ర కాంగ్రెస్ పెద్దలు తెలుసుకోవాల్సిందేమంటే 1955 సాధారణ ఎన్నికల్లో ప్రజలు ఓట్లేసింది ఐక్య కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికను చూసి, ఆ ప్రణాళిక ఆధారంగా పోటీ చేసిన అభ్యర్థుల్ని చూసి. వాళ్లకు చట్టసభల్లో ఆధిక్యాన్ని సంపాదించిపెట్టడం ద్వారా ప్రజలు ఐక్య కాంగ్రెస్ మంత్రి వర్గాన్ని కోరుకున్నారు. శాసనసభ నాయకత్వంలో ఐక్య కాంగ్రెస్‌కు సంబంధించిన అన్ని పార్టీలవారూ పాలుపంచుకోవాల్సి ఉంది. కనుక కాంగ్రెస్ ప్రతినిధులే మంత్రి వర్గంలో ఉండేటట్లుగా చేస్తూ కృషికార్ లోక్‌పార్టీ, ప్రజా పార్టీలకు మంత్రి వర్గంలో స్థానం లేకుండా చేయడం ఓటర్ల కోరికను విస్మరించడమే.

ఎఐసిసి అన్ని పార్టీలకు రాష్ట్ర మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం ఉండేటట్లు చూడాల్సిన బాధ్యతను విస్మరించింది. పైగా కాంగ్రెస్‌పై నమ్మకంతో కృషికార్ లోక్‌పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడం జరిగింది. కాంగ్రెస్ నాయకుల మీద ఇప్పుడు ఇలా ఆధారపడాల్సి వచ్చింది. పార్లమెంటరీ, మంత్రి వర్గ సాంప్రదాయాలను ఈ సందర్భంగా కాంగ్రెస్ పాటించలేదు. నీలం సంజీవరెడ్డి 'మొండి మనిషి' అనే తన ఖ్యాతిని మరోసారి రుజువు చేసుకున్నట్లయ్యింది. ఆయన ఎదురుతిరిగింది తన ముఠాలోని వాడైనాసరే రాజకీయంగా శిక్షించకమానడు. ఆయన నాయకత్వంలోనే 1951 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైంది. 1955లో ఆయనే ఐక్య కాంగ్రెస్ నిర్మాణానికి అడ్డుతగిలారు.

అంతేకాకుండా ఐక్య కాంగ్రెస్ అభ్యర్థుల కొందరి పరాజయానికి ఆయన దోహదం చేశారు. ఆయన యునైటెడ్ కింగ్‌డమ్‌లో, కెనడాలో, ఆస్ట్రేలియాలో, న్యూజిలాండ్‌లో ఉన్న పార్లమెంటరీ సాంప్రదాయాలను పాటిస్తూ తన పార్టీలో తనకు ఎదురుతిరిగేవారిని దూరంగా పెడితే పెట్టవచ్చుకాక. మరి జవహర్‌లాల్‌జీ, ఇతర ఎఐసిసి పెద్దల ఇంగితజ్ఞానం ఏమైనట్లు?

తెలంగాణలో సాధారణ ఎన్నికలు ముగిసిన తర్వాత కృషికార్ లోక్‌పార్టీ, నా మిత్రులు నా మాటకు విలువనిచ్చి నీలం సంజీవ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయినా సరే కె.ఎల్.పి.కి, తెలంగాణ సముదాయాలకు, ప్రజాపార్టీకి మంత్రి వర్గంలో స్థానం కల్పించలేదు. అప్పటికీ ఎఐసిసి చొరవచూపి మంత్రి వర్గంలో అందరికీ ప్రాతినిధ్యం దక్కేలా చూడలేదు. కె.ఎల్.పి. కాంగ్రెస్‌తో విలీనం కావడం అదనపు సౌలభ్యంగానే భావించి మిన్నకుంది. ఐక్య కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో పొందుపర్చిన విధులను మర్చిపోతే ఎలా? ఇక ప్రజాపార్టీ విషయంలో అది కాంగ్రెస్‌లో విలీనంకాలేదని

మంత్రి వర్గానికి దూరంగా ఉంచారు. భారత ప్రజలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి నిరంతరం సంభవించే ఈ విపరీతత్వాన్ని ఎలా ఓపిగ్గా భరిస్తున్నారో చూస్తూ ఉంటే ఆశ్చర్యం కలుగకమానదు. (నెహ్రూ, శాస్త్రి, నాడార్, ఇందిర మంత్రి వర్గాల్లోని వుత్సవ విగ్రహాలకు సహాయపడిన ప్రజలందరి మాట దేవుడెరుగు కనీసం కాంగ్రెస్‌వారందరికైనా న్యాయం జరిగేటట్లు చూడలేదు) .

పూర్వపు కేంద్ర ఆర్థిక శాఖామాత్యులు సి.డి.దేశ్‌ముఖ్ 1959లో కొందరు కేంద్ర మంత్రులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఉన్నత స్థాయి న్యాయమూర్తితో విచారణ జరిపించమని సలహా ఇచ్చారు. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన మేధావులు, పక్షపాత వైఖరిని ప్రదర్శించని పత్రికలు ఈ విషయాన్ని పట్టించుకుని న్యాయ విచారణ జరిపించాల్సిందేనన్నారు. అనేక మాసాలపాటు నెట్టుకుంటూ వచ్చినా నెహ్రూ ఒత్తిడిని తట్టుకోలేకపోయారు. ఎట్టకేలకు 1960లో తాను నియమించిన కాంగ్రెస్ అధ్యక్షుడిని ఈ విషయంలో ఒక విచారణ సంఘాన్ని నియమించమన్నారు. నివేదికను తయారుచేసి పార్టీ పరిశీలనకు పంపమన్నారు. ఇతర పార్టీలవాళ్లను అలా ఉంచండి కాంగ్రెస్‌లోనే ఒకరిపై మరొకరు నిత్యం దుమ్మెత్తిపోసుకుంటూనే ఉంటారు. కాంగ్రెస్ అవినీతి బట్టబయలుకావడంతో మంత్రుల ప్రవర్తనను కట్టడి చేసేందుకు అంబుడ్స్‌మన్ వ్యవస్థ కావాల్సి వచ్చింది. కె.సంతానం ఆధ్వర్యంలో అవినీతి వ్యతిరేక కమిషన్ నెలకొల్పడం జరిగింది. అది కూడా పూర్తిగా కట్టడి చేయలేక పోయింది.

అయితే పదిహేడు సంవత్సరాలుగా మేము కాంగ్రెస్ నియంతలను వ్యతిరేకిస్తూ చేసిన కృషి వృధాగా పోలేదు. ఎన్ని కుంభకోణాలు వెలుగులోకి వచ్చినా కొందరు కాంగ్రెస్ నాయకులు గెలుపొందడం ఓటర్లలో అధికులు అమాయకులు, నిరక్షరాస్యులు కావడమే. కనుక అవినీతిని అరికట్టేందుకు ఒక సంస్థాగత అధికార వ్యవస్థ అవసరం ఏర్పడింది. మంత్రుల అవినీతిని ఎండగట్టిన ముఖ్యమంత్రి ప్రకాశం గారికి మేము మద్దతు పలికిన కారణంగా అనేక ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది. ఏమాటకామాటే చెప్పుకోవాలి -గుర్జాలీలాల్‌నందా కాంగ్రెస్‌లో పెరుగుతున్న అవినీతి రాచపుండును తొలగించి అధికార మదాంధులైన వారికి గాంధీ మార్గంలో కనువిప్పు కలిగించేందుకు బాగా కృషి చేశారు. పరిపాలనా సంస్కరణల కమిటీ కూడా మా డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని లోక్‌పాల్ వ్యవస్థ రూపొందేందుకు సిఫారసులు చేసింది.

46

1957లో లోక్‌సభ ఎన్నిక -నా అనుభవాలు

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్ ముఖ్యపట్టణంగా ఏర్పాటైంది. అంతకుముందు రెండేళ్ల క్రితమే ఆంధ్ర రాష్ట్రంలో ఎన్నికలు జరిగాయి కనుక తిరిగి ఎన్నికలు జరపడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కనుక ఎన్నికలు తెలంగాణా ప్రాంతంలో మాత్రమే నిర్వహించాలని పార్లమెంట్ నిర్ణయించింది. కనుక 1957 సాధారణ ఎన్నికలు పార్లమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ అంతటా, అసెంబ్లీకి మాత్రం తెలంగాణ ప్రాంతంలో జరిగాయి.

కాంగ్రెస్ అభ్యర్థుల్ని లోక్‌సభకు ఎంపిక చేసే కమిటీలో పూర్వపు ఆంధ్ర ప్రాంతం నుండి కె.ఎల్.పి. తరఫున నేనూ, లచ్చన్న మాత్రమే ఉన్నాం. ఓడిపోయిన ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి అంతకుముందు లచ్చన్నతో ఉన్నవారు తిరిగి సంజీవరెడ్డి సరసకు చేరారు. దీన్ని కాంగ్రెస్‌వాదుల వ్యవహారంగా చూద్దామని, రెండు వైరి వర్గాల వ్యవహారంగా చూడొద్దని కమిటీకి చెబుతూనే వచ్చాను. నేను ప్రతిపాదించే పేర్లలో కె.ఎల్.పి, ప్రజా పార్టీలకు చెందిన కాంగ్రెస్‌వాదులు ఉండేవాళ్లు. ఆంధ్ర కిసాన్ సమ్మేళనం కార్యదర్శిగా ఉన్న కె.బాలిరెడ్డి పేరును తాత్కాలిక ప్రాతిపదికన చేర్చారు. వాళ్ల ముఠాకు చెందిన ఇద్దరు ఏ కారణాల వల్లనో వాళ్ల అభిమానానికి దూరమైన వాళ్ల పేర్లు ఎప్పుడు అంగీకరించారో తెలుసా – వాళ్లు గట్టిగా కావాలనుకున్న ఇద్దరి పేర్లను ఖరారు చేసిన తర్వాత.



రాజేంద్ర ప్రసాద్

కె.ఎల్.పి, ప్రజాపార్టీకి చెందినవాళ్లకు సరైన ప్రాతినిధ్యాన్ని కల్పించకుండానే

కాంగ్రెస్ ప్రాబల్యం అధికంగా ఉన్న ఎన్నికల సంఘం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూపోయింది. 1954-55లో ఎటువంటి పరిస్థితుల్లో ఐక్య కాంగ్రెస్ రూపొందిందో అందరికీ తెలుసు. అందులో కె.ఎల్.పి. గౌరవానికి భంగం వాటిల్లకుండా చూడాలనే పెద్దల ఒప్పందాన్ని ఖాతరు చేయకుండానే అభ్యర్థుల ఎంపిక జరిగింది. ఈ అన్యాయాన్ని మేము వ్యతిరేకించినా ఫలితం లేకపోయింది.

ఇక లోక్‌సభకు నా ఎంపిక విషయం వచ్చేసరికి డిసిసి నన్నుగానీ, దేవీజీనిగానీ పోటీకి నిలపమంది. ప్రాంతీయ కాంగ్రెస్ నా పేరును సిఫారసు చేస్తే ఎఐసిసి దేవీజీ పేరును ఖరారు చేసింది. దేవీజీ లోక్‌సభకు పోటీ చేసేందుకు అంత సుముఖంగా లేదు. కాంగ్రెస్ వర్గాలవారు పూర్తిగా సహకారం అందిస్తారో లేదో తెలియదు. కనుక కె.ఎల్.పి. వారు నన్నే పోటీ చేయమన్నారు. ప్రజలు ఎప్పుడైనా నా పక్షానే ఉంటారనే విశ్వాసంతో నేను పోటీ చేయాలని నిర్ణయించుకున్నాను. ఎఐసిసి నాయకులు కూడా అభ్యర్థిత్వాన్ని అంగీకరించారు.

ఎఐసిసి నాయకులు అభ్యర్థుల పేర్లను ఖరారు చేయడానికి చాలాముందుగానే విశ్వసనీయ వర్గాల కథనాల వల్ల తెలియవచ్చిందేమంటే కొందరు రాష్ట్ర నాయకులతో కుమ్మక్కయిన గుంటూరు జిల్లా నాయకులు నన్ను తెనాలి స్థానానికి ఎంపి కయ్యేటట్లు చేసి అక్కడి కమ్యూ నిస్టుల సహకారంతో ఒక స్వ తంత్ర అభ్యర్థిని నాపై నిలిపి నన్ను ఓడించి కె.ఎల్.పి.ని చావు దెబ్బ తీయాలని చూస్తున్నారని. నేను కావాలంటే పక్కనే వున్న ఒంగోలు స్థానాన్ని కోరవచ్చు. అయినా నేనలా చేయలేదు. నేను తెనాలి స్థానానికే పోటీ చేసి ముసుగులో ఉన్న కమ్యూనిస్ట్

ధేబర్.

అభ్యర్థిని ఓడించి నేను అత్యధిక ఓట్లు సంపాదించగలనని రుజువు చేయదల్చాను. అయినా నేను కాంగ్రెస్ నాయకులతోనూ, ఎమ్మెల్యేలతోనూ చర్చలు జరుపుతూనే ఉన్నాను. నేను వాళ్లందరినీ కలిసి ఓపిగ్గా వాళ్ల ఇబ్బందుల్ని విన్నాను. కె.ఎల్.పి వర్గంతో చర్చించి ఇరువురినీ శాంతింపజేసే ప్రయత్నాలు చేస్తున్నాను. స్థానికంగా తలెత్తే పక్షపాత ధోరణులను సర్దుబాటు చేస్తానని రాష్ట్ర కమిటీ నాయకులకు ఎన్నికలకు ఎంతో ముందుగానే తెలియజేశాను. నేను అనధికారికంగా ప్రచారాన్ని ప్రారంభించిన రెండు వారాలకు పిసిసి మంత్రి వర్గ ముఠాకు చెందిన ప్రముఖ నాయకుడు నాతో బాహాటంగా గొడవకు దిగకుండా కమ్యూనిస్ట్‌లను వాళ్ల అభ్యర్థిని నిలిపేందుకు రెచ్చగొడుతున్నాడని స్పష్టంగా తెలియ వచ్చింది. నామినేషన్ పత్రాలు దాఖలు చేసే సమయం వరకూ వాళ్ల అభ్యర్థి ఎవరో తేల్చనేలేదు. అందుకు కారణం అప్పటికే నా గెలుపు ఖాయమని అందరూ భావిస్తున్నారు. కనుక నన్ను వాళ్లు అనవసరంగా యాగీ చేయదల్చలేదు. ఒకవేళ కమ్యూనిస్ట్ అభ్యర్థి చివరి నిమిషంలోనైనా ఉపసంహరించుకునే అవకాశం ఉంది కనుక మంత్రి వర్గ ముఠాలోని ఒకరిని నాపై పోటీ చేసేందుకు ఒప్పించారు. అంతగా చైతన్యవంతంకాని రైతు కుటుంబాల నుండి వచ్చిన అభ్యర్థిని కమ్యూనిస్ట్‌లు బలపర్చడంతో ఆ సామాజిక వర్గాన్ని అడ్డంపెట్టుకుని కాంగ్రెస్‌లోని మంత్రి వర్గ ముఠా కూడా లోపాయకారిగా వాళ్లకు సాయపడసాగింది.

జయప్రకాశ్ నారాయణ

ఎన్నికల ప్రచారంలో మంత్రి వర్గముఠాకు చెందినవాళ్లల్లో కేవలం ఇద్దరు మాత్రమే నాకు బహిరంగంగా మద్దతు ప్రకటించారు. వారిలో ఒకరు అఖిలభారత చేనేత కాంగ్రెస్‌కు చెందిన ప్రగడ కోటయ్య. ఆయన రైతు విద్యాలయం నుండే పట్టభద్రుడయ్యాడు. నాకు మద్దతు పలికిన మరో ఎమ్మెల్యే సొంత పట్టణంలోనే రాష్ట్ర నాయకులు జోక్యం చేసుకుని ఓట్లు పడకుండా చూశారు. ఆ నాయకుడు బాపట్ల ఎన్నికల బహిరంగ సభలో మాట్లాడుతూ 'ప్రొఫెసర్ రంగా ఓటమి జవహర్‌లాల్ ఓటమిగా భావించరాదు. ఒకవేళ ఓడిపోవడమంటూ జరిగితే అది ఆయన మిత్రుల వల్లనే జరిగిందని భావించాలి'. ఎన్నికలకు కేవలం రెండు రోజుల ముందు ఆయన తెనాలి బహిరంగ సభలో మాట్లాడుతూ నా పేరే ప్రస్తావించలేదు. నియోజక వర్గంలోనూ, బయటా అదొక నగుబాటు వ్యవహారంగా మారింది. రంగా గారికి కాంగ్రెస్ నుండి దక్కింది కేవలం ఎన్నికల గుర్తు తప్ప ఇంకేం లేదని గేలి చేయసాగారు.

మీకో వాస్తవం చెప్పనా? వేరే నియోజక వర్గంలో వాళ్ల సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి కె.ఎల్.పి. వాళ్లు ఓట్లు వేయరట. కనుక మీరు కూడా రంగాకు ఓట్లు వేయకండి అంటూ ఓటర్లలోని ప్రతి సామాజిక వర్గాన్ని రహస్యంగా కలసి కొండీలు చెప్పసాగారు. ఈ విధంగా బ్రాహ్మణులు, తెలగ, వైశ్యులు, రెడ్లు, మహ్మదీయులు నా నుండి దూరమయ్యే విధంగా కృషి చేశారు. ఈ విధంగా సాగిన ఈ దొంగచాటు వ్యవహారం కాకుండా కమ్యూనిస్ట్‌లు కూడా వారితో జతకట్టి ప్రజా సోషలిస్ట్ పార్టీ వారు వాళ్లకు దక్కే 25 శాతం సీట్లు వాళ్లకే దక్కే విధంగా కృషి చేశారు. ఆ విధంగా వాళ్లు నన్ను సైద్ధాంతికంగా, సంస్థల నిర్వహణాపరంగా వైరి వర్గంగా భావించారు.

పది వారాలపాటు సాగిన ఎన్నికల ప్రచారంలో ఒక్క రోజు కూడా ఏ రాష్ట్ర మంత్రిగానీ, కేంద్ర మంత్రిగానీ నా నియోజక వర్గానికొచ్చి నా అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ఓట్లడిగినవారు లేరు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి చెందిన మంత్రుల ముఠావారు జవహర్‌లాల్‌జీని, కొందరు కేంద్ర మంత్రులను రప్పించారుకానీ వాళ్లను నా నియోజక వర్గ పరిధి వెలుపలనే తిప్పారు. జవహర్‌లాల్‌జీ విజయవాడకు వచ్చారు. నా నియోజక వర్గానికి, విజయవాడకూ మధ్య సరిహద్దు కృష్ణానది మాత్రమే. అయినా ఆయన వచ్చి నాకు ఊతం ఇవ్వాలనుకోలేదు. ఆయన గుంటూరు వచ్చారు. అది నా నియోజక వర్గానికి ఆరు మైళ్ల దూరంలోనే ఉంది. అక్కడ ఒక కాంగ్రెస్ అభ్యర్థి సభలో మాట్లాడి నా నియోజక వర్గాన్ని విస్మరించారు. నా ఎన్నిక సందర్భంగా నన్ను అలా నిస్సిగ్గుగా

పట్టించుకోకుండా వదిలేసింది కేంద్ర నాయకత్వం.

అయితే నాకు ఎక్కువగా ప్రజలు, కె.ఎల్.పి. కార్యకర్తలు, మహాత్మాగాంధీ ఆశయాల పట్ల శ్రద్ధ చూపేవారు తోడ్పాటునందించడం చూసి ఆనందించేవాణ్ణి. నేను వాళ్ల గ్రామాలకు, శివార్లకు, ఇళ్లకు వెళ్లినందుకు ఆ గ్రామీణ ప్రజలు చూపిన ఆదరణకు ఉత్తేజితుణ్ణయ్యేవాణ్ణి. పలు గ్రామాల నుండి ఎన్నికల నిధికి విరాళాలు అందాయి. అదంతా నియోజక వర్గంలో పర్యటించేందుకు, పట్టణాల్లో సభల ఏర్పాటుకు పనికొచ్చేవి.

రైతులు, చేతివృత్తులవారు, ప్రత్యేకించి చేనేతపనివారు, కమ్యూనిస్ట్ అభిమానులుకాని ఇతర నిమ్నవర్గాల ప్రజలు నా వెనక దృఢంగా నిలిచారు. వాళ్లల్లో వాళ్లు కొద్ది మొత్తాలు పోగుచేసి స్థానిక ఎన్నికల ఖర్చులకు వాడేవారు. నేను దాదాపుగా ప్రతి గ్రామానికీ వెళ్లాను, శివారు ప్రాంతాల్లో తిరిగాను. ప్రతి సముదాయాన్ని వుద్దేశించి ప్రసంగించాను. ఒకసారికిమించి వెళ్లిన గ్రామాలూ లేకపోలేదు. నేను కె.ఎం.పి.రాజ్ సందేశాన్ని అలా వ్యక్తిగతంగా సరాసరి వారికి అందించడంతో ప్రజలకు ఎన్నికల పట్ల ఆసక్తి కలిగింది. ఆ ప్రచారం నాకు ఉత్తేజకరంగా ఉంది. ఆ పదివారాలూ రోజుకు దాదాపు పన్నెండు గంటలు పనిచేయాల్సి వచ్చింది. రోజుకు ఐదారు సభల్లో మాట్లాడాల్సి వచ్చేది. ఇంకెన్నో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాల్సి వచ్చేది. ఇంతేగాక కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం నేను మరో మూడు పార్లమెంట్ నియోజక వర్గాల్లో గుంటూరు జిల్లాలో ప్రచారం నిర్వహించాల్సి ఉంది. అదృష్టవశాత్తూ నా ఆరోగ్యం బాగానే ఉంటోంది. కె.ఎల్.పి. కార్యకర్తలకు, సంప్రదాయ గాంధీవాదులకు, మా రాజకీయ వివరణలను శ్రద్ధతో విన్న ప్రజలకు నేను సర్వదా కృతజ్ఞుణ్ణి.

కార్యకర్తలు, తెలుగులో సాటిలేని మేటి వక్తలైన పి.కోటేశ్వరరావు, సుంకర సత్యనారాయణ, రోశయ్య, వీరాచారి, ఎడ్వర్డ్ వంటి వారు నా కోసం ప్రచారం చేశారు. నా ఆశయాలైన కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం గురించి, రైతు స్వామ్యం గురించి ప్రజలకు వివరించారు. వాళ్లు ఇంకా ముందుకెళ్లి కిసాన్ సమ్మేళన్ సందేశాన్ని అందించారు. నేను పార్లమెంట్‌కెళ్లేది ప్రధానంగా రైతుల, చేతివృత్తులవారి సంక్షేమాన్ని కాంక్షించేనని, దాన్ని పరిరక్షించేందుకేనని వివరించారు. వాళ్లంతా నేను 1944లో బాపూతో మాట్లాడి కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం పార్టీకి ఆయన ఆశీస్సులు అందుకున్న విషయం అన్ని సభల్లోనూ చెబుతూ వచ్చారు. నాకు ప్రచారాన్ని నిర్వహించేవారు ఎక్కడికెళ్లినా కమ్యూనిస్ట్‌లు రైతులకు, వాళ్ల ఆర్థిక వ్యవస్థకు, స్వయంఉపాధి హెూదాకు

ఏ విధంగా వ్యతిరేకులో ప్రజలకు వివరించి చెప్పేవారు. కాంగ్రెస్ వారు ఎన్ని అడ్డంకులు సృష్టించినా నేను ఇరవై ఏడు వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందాను. రైతులు, కూలీలు, చేతివృత్తులవారే నా గెలుపునకు కారకులయ్యారు. గ్రామీణ ప్రజానీకానికి నా గెలుపు ఆదర్శంగా నిలిచింది.

ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత కూచిపూడిలో అభినందన సభ ఏర్పాటుచేశారు. జవహర్‌లాల్‌జీ అధ్యక్షతన ఏర్పాటైన ప్రణాళికా మండలి (ప్లానింగ్ కమిషన్) మన రైతులపై సహకార వ్యవసాయ భారాన్ని మోపాలని చూస్తోందని ఆ సభలో రైతులకు హెచ్చరిక జారీచేశాను. మరో నియోజక వర్గం నుండి లోక్‌సభకు ఎన్నికైన కొత్త రఘురామయ్య నెహ్రూ నాయకత్వంలో అలాంటిది జరగదని భరోసా ఇచ్చారు. రైతులకు మౌలికంగా నిలిచే స్వయం ఉపాధి, భూవసతిపై కాంగ్రెస్ వ్యతిరేక దిశలో ప్రయాణిస్తున్న తీరును నేను ముందుగానే ఎలా పసిగట్టగలిగానా అని తెలుగు పత్రికలు విస్తుబోయాయి. ఒక సంవత్సరం గడిచేటప్పటికి ప్లానింగ్ కమిషన్ నిజస్వరూపం బట్టబయలైంది. అది ఎల్వాల్ సదస్సులో గ్రామదానం రూపంలో బహిర్గతమైంది. ఆ సదస్సును వినోబాజీ ఏర్పాటుచేయగా ప్రధాని జవహర్‌లాల్‌జీ, రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ అధ్యక్షుడు ధేబర్, జయప్రకాశ్ నారాయణ్, సిపిఐ, పి.ఎస్.పి. ప్రతినిధులు హాజరయ్యారు. నాకు ఎప్పుడో అర్థమైంది ప్లానింగ్ కమిషన్ ద్వారా జవహర్‌లాల్‌జీ ఆ దిశగా ప్రయాణిస్తున్నారని. ఆ విధంగా వాళ్ల కుట్ర వెల్లడైంది. దానివల్ల వాళ్లు దేశాన్ని ఆర్థికంగా ధ్వంసం చేయడమేకాకుండా సామాజిక బానిసత్వంలోకి నెట్టివేస్తారని కిసాన్ వేదికల నుండి హెచ్చరికలు జారీ చేయసాగాను. పలువురు కాంగ్రెస్‌వాదులు రాజకీయ అధికారం, అవకాశాల కోసం అర్రులుచాచేవారు జవహర్‌లాల్‌జీకీ, నాకూ మధ్య గల అంతరాలను బాగా వాడుకుని రాష్ట్ర రాజకీయాల్లో వాళ్ల ప్రాపకాన్ని పెంచుకునేందుకు సిద్ధమయ్యారు. అందువల్లనే వాళ్లు లోపాయకారిగా నాకు ఎదురునిలిచి ఓడించి జవహర్‌లాల్‌జీ మెప్పు పొందదల్చారు. అయితే నేను నా కె.ఎల్.పి. పద్ధతిలో రైతుల కోసం కృషి చేస్తూ గాంధీజీ రైతులకిచ్చిన హామీలను పూర్తిచేయాలని కాంగ్రెస్ పార్టీని కోరసాగాను. ఆ విధంగా కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యుల విశ్వాసాన్ని చూరగొన్న కారణంగా జవహర్‌లాల్‌జీ నాయకత్వంలో ఉన్న పార్లమెంటరీ పార్టీకి 1958లో తిరిగి కార్యదర్శిగా నన్ను ఎన్నుకున్నారు.

47

లోక్‌సభలో దిగ్ధ్భమ

లోక్‌సభలో తొలి సంవత్సరం (1957-58) రెండు ముఖ్యమైన సందర్భాల్లో ప్రధాన భూమికను నిర్వహించాల్సి వచ్చింది. మొదటి సందర్భం కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు డాంగే కాంగ్రెస్ మంత్రి వర్గం ప్రజాస్వామిక పునాదులు కదిలేటట్లుగా ప్రసంగించి నెహ్రూ ప్రభుత్వాన్ని, మార్క్స్‌వాదాన్ని విశ్వసించే ప్రజల, ప్రభుత్వాల తీరును చూసి ఆ బాటన నడవమని చెప్పినప్పుడు. స్పీకర్ ఎం.ఎ.అయ్యంగార్ కమ్యూనిస్ట్ నాయకుని సూచనపై స్పందించమన్నారు. నేను ఆ సంవత్సరం పార్లమెంట్‌లో చేసిన అతి ఫలవంతమైన ప్రసంగాల్లో అది ఒకటని, నేను కమ్యూనిస్ట్ నాయకుడు లేవనెత్తిన అన్ని ముఖ్య అంశాలకు తగిన రీతిలో సమాధానం చెప్పానన్నారు. నేను చెప్పిందేమంటే - భారతదేశం గాంధీపుట్టిన దేశం. అందువల్ల అది గాంధీమార్గాన్ని, గాంధీ సిద్ధాంతాలను పాటిస్తుంది. రష్యా, చైనాల్లో మాదిరిగా లక్షలమంది రైతుల్ని ఊచకోత కోయొద్దు. కోట్లమంది రైతుల్ని కూలీలుగా మార్చివేయొద్దు. ఔను, అమెరికా సాయంకోరి భారతదేశం మంచి పనే చేసింది. ఇప్పుడు మన దేశ పురోభివృద్ధికి అటువంటి విదేశీ సాయం అవసరం ఎంతైనా ఉంది. అటువంటి అవసరం లేదనుకుంటే పారిశ్రామిక, సామాజిక, ఆర్థిక అభివృద్ధిని నత్తనడకలా కొనసాగించాల్సి ఉంటుంది లేదా మరుగుజ్జుతనాన్ని ఆశ్రయించాల్సి ఉంటుంది.

డాంగే

ఒకవేళ కమ్యూనిస్ట్‌లు భారతదేశం దుర్భర దారిద్ర్యంలో కొట్టుమిట్టాడాల్సిందేనంటే అలా చేసినందువల్ల ప్రజలు మా ప్రభుత్వం పట్ల విసిగి వేసారి కమ్యూనిస్ట్ నాయకత్వాన్ని స్వాగతిస్తారనుకుంటున్నారేమో. ప్రజాస్వామిక, రాజకీయ పక్షాలేవీ కమ్యూనిస్ట్‌లు చెప్పేది విని అంతర్గత వనరులపైనే కేవలం ఆధారపడుతూ తమ అభివృద్ధిని తామే అడ్డుకుంటూ ఆత్మహత్యవంటి విధానాన్ని పాటిస్తారనుకుంటున్నారేమో. ఆ పప్పులేమీ ఉడకవు. ఆ తర్వాత కమ్యూనిస్ట్‌లెన్నడూ మా ప్రజాస్వామిక విధానాలపై అటువంటి నిందాపూర్వక, పసలేని ఆరోపణలను చేసే ప్రయత్నం చేయలేదు.

ఇక రెండో సందర్భం మసానీ కట్‌మోషన్ (కోత తీర్మానం) సమయం. సహకార వ్యవసాయం విషయంలో ప్రభుత్వ వైఖరి గురించి ఆయన అప్పుడు ఎంతో స్పష్టంగా, సార్థకంగా ప్రసంగించాడు. కమ్యూనిస్ట్ దేశాల్లో సహకార వ్యవసాయం ఎలా విజయం సాధించలేకపోయిందో వివరించాడు. కమ్యూనిస్ట్‌ల ప్రయోగాలైన కమ్యూన్స్ (సహ జీవన వ్యవస్థ), హండ్రెడ్ ఫ్లవర్స్, సహకార వ్యవసాయం భారతదేశానికి మార్గదర్శనం గావించజాలవన్నాడు. అత్యంత ప్రమాదకరమైన ఈ విధానాలు భారతీయ రైతులకు ఎలా తగినవికావో వివరించి వాటిని వారిపై బలవంతంగా రుద్దరాదన్నాడు. దానికి నేను మద్దతు పలికాను. ప్రభుత్వానికి తొందరపాటు చర్యలు తగవని హెచ్చరించాను. రైతుల ఓట్ల ఆధారంగా గెలిచి సాధారణ ఎన్నికల సమయంలో ఆ విధమైన ప్రజాభిప్రాయ సేకరణ ఏమీ జరపకుండానే సహకార వ్యవసాయం విషయంలో జాతీయ స్థాయి ప్రచారాన్ని చేపట్టే హక్కు నెహ్రూ ప్రభుత్వానికి లేదన్నాను. భారతదేశ రైతులు దోపిడీదార్లు కారు. వాళ్లు స్వయం ఉపాధితో జీవనం సాగిస్తారు. వాళ్లు స్వేచ్ఛాయుత స్వతంత్ర జీవనాన్ని కాంక్షిస్తారు. కనుక గాంధీ

మసానీ

విధానాలైన అహింస వికేంద్రీకరణ, ప్రజాస్వామ్యం వంటివాటిని అమలుచేయాల్సిన అవసరం ఎంతైనా వుందన్నాను. కాంగ్రెస్ ప్రభుత్వానికి సవినయంగా మనవి చేశాను–సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టినట్లయితే తలకుమించిన భారమైన అవినీతి పాలకవర్గం, వాళ్ల పెత్తనం వ్యవసాయ రంగంలోకి ప్రవేశిస్తుందన్నాను. సహకార వ్యవసాయాన్ని అవి అంటిపెట్టుకునే ఉంటాయన్నాను. ఒక పార్లమెంట్ సభ్యుడు తప్ప చర్చలో పాల్గొన్నవాళ్లంతా మా వైఖరిని సమర్థించారు. జాతీయ ఉద్యమంగా సహకార వ్యవసాయాన్ని చేపట్టడాన్ని వ్యతిరేకించారు. సాధారణ ఎన్నికల తర్వాత అదే ప్రథమంగా ఆ సమస్యపై నా వైఖరిని అలా తేటతెల్లం చేస్తూ కాంగ్రెస్‌కు నేను మద్దతు పలకడంలో పరిమితులుంటాయని సూచించాను. అటువంటి తీక్షణమైన ప్రసంగ పాఠం పత్రికల్లో ప్రచురించినందువల్ల భారతావనిలో రైతు కార్యకర్తలు ప్రేరణ పొందారు. రాజకీయాల్లో వాళ్ల స్థానమేమిటో తెలుసుకున్నారు. రైతు ఆర్థిక వ్యవస్థను మన ఇతర రాజకీయ మొహమాటాలకు, సంప్రదింపులకు దూరంగా కాపాడుకోవాల్సిన వైనం వాళ్లకు తెలియవచ్చింది.

సహకార వ్యవసాయం విషయంలో అటువంటి అప్రజాస్వామిక పద్ధతిలో మాట్లాడిన ఆ ఏకైక పార్లమెంట్ సభ్యుణ్ణి సహాయ మంత్రిగా అందలం ఎక్కించారు. ఏం చేద్దాం నెహ్రూయిజం స్ఫూర్తి అటువంటిది.

పార్లమెంట్‌లోని కాంగ్రెస్ పార్టీ నన్ను సమర్థించేందుకే పూనుకోవడంతో ఆ స్వేచ్ఛను అలాగే వదలి జవహర్‌లాల్‌జీ ఆయన పేరు గడించిన పరోక్ష పద్ధతికి పూనుకున్నాడు. అదేమంటే వినోబాజీని రంగంలోకి దించి ఆయన నైతిక ప్రభావంతో ప్రజల్ని ఆకట్టుకోవాలని. కనుక కాంగ్రెస్ కార్యదర్శిగా ఉన్న శ్రీమన్నారాయణను గ్రామీణ విప్లవం కోసం పావులు కదిపే దిశగా మైసూరులోని ఎల్వాల్‌లో అఖిలపక్ష సదస్సును ఏర్పాటుచేయాలనే వినోబాజీ ప్రతిపాదనకు సహకారాన్ని అందించమన్నారు. 1957లో ఆ దురదృష్టకరమైన సదస్సులో భూదాన ఉద్యమానికి కొనసాగింపుగా పైకి కనిపించే గ్రామ దాన పథకానికి దేశాధ్యక్షుడు, ప్రధాని, ఇతర కాంగ్రెస్ నేతలు, కమ్యూనిస్ట్, సోషలిస్ట్ పార్టీలు కోపు గాయడం జరిగింది.

వాళ్లు నన్నుగానీ, రైతుల ప్రయోజనాల కోసం పోరాడే మరే ఇతర రైతు సంస్థలకు చెందిన నాయకులనుగానీ ఆ సభకు ఆహ్వానించకుండా జాగ్రత్తపడ్డారు. ఎందువల్లనంటే మేమంతా చైనా పద్ధతిలో నిర్వహించే సహకార వ్యవసాయానికి వ్యతిరేకులం. మేము

కోరేదేమంటే వ్యవసాయాభివృద్ధికి సేవా సహకార సంఘాలను ప్రోత్సహించండి. అంతేకానీ సహకార వ్యవసాయాన్ని కాదు. రైతు యాజమాన్యాన్ని, స్వయం ఉపాధిని దెబ్బతీసే ఏ పథకాన్నీ మేము అంగీకరించం. బహుశా జవహర్‌లాల్‌జీ గ్రామ దానం అనే ఆకర్షణీయమైన పథకాన్ని గాంధీజీ ఆధ్యాత్మిక వారసుని (వినోబా) ఆశీర్వాదాలతో, ప్రగతిశీల పార్టీలుగా చెప్పుకునే వాటి మద్దతుతో ప్రారంభిస్తే పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీగానీ, నేనుగానీ సమ్మతించం. రైతుల ఆర్థిక వ్యవస్థ విషయంలో మా పథకాలను వ్యతిరేకించే సాహసానికి ఒడిగడితే దాన్ని నేను కొనసాగనివ్వను.

2.10.1957 నాడు నారాకోడూరులో మేము గాంధీ జయంతిని జరుపుకుంటున్నాం. మా కె.ఎల్.పి. శాసనసభ్యులిరువురు బాపయ్య, శివయ్యలు ఎల్వాల్ సదస్సు విషయంలో విరుచుకుపడ్డారు. ఇటువంటి స్థితిలో రైతులు చేయాల్సిందేమిటో ఆ పెద్ద బహిరంగ సభలో చెప్పమన్నారు. ఆ నెలాఖరుకు కృష్ణా జిల్లా కిసాన్ సదస్సుకు అధ్యక్షత వహించాల్సి ఉంది. దాన్ని కిసాన్ నేత గొర్రెపాటి వెంకట సుబ్బయ్య మచిలీపట్నంలో ఏర్పాటుచేస్తున్నారు. కనుక నేను భారతదేశమంతటా గల నా సహచర రైతు నేతలను ఈ గ్రామదాన ప్రమాదాన్ని గురించి సంప్రదించాల్సి ఉంది. వాళ్లు దాన్ని వినోబా సిద్ధాంతంగా ప్రజల ముందుకు తెస్తున్నారు. దాన్ని ఢీకొట్టాలంటే నేను జవహర్‌లాల్‌జీ మీదకు కత్తులు దూయాల్సి ఉంటుంది. వేదికను ముందుగానే సిద్ధంచేసి పత్రికలను, రాజకీయంగా ప్రతిపక్ష పార్టీల్లో ఉన్న వాళ్లను ఆహ్వానించాలి. ఇది జరిగితే నా రాజకీయ జీవితం చిక్కుల్లోపడే అవకాశముంది. తత్ఫలితంగా తిరిగి కాంగ్రెస్‌కు దూరం కావాల్సి ఉంటుంది. నా మిత్రులు బలవంతుడైన జవహర్‌లాల్‌జీపై, శక్తిమంతమైన కాంగ్రెస్ పార్టీపై పోరాడేందుకు సిద్ధమేనా? మన సార్వజనిక ఓటు హక్కు వినియోగం ఎలా గుడ్డిగా జరుగుతుందో తెలియందెవ్వరికి? నా వయస్సు ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ చేసే వయస్సు. ఈ వయస్సులో 'శంకర్స్ వీక్లీ'లో పేర్కొన్నట్లు ఒంటరిగా దుక్కిదున్నినట్లుగా మరో స్వతంత్ర రాజకీయ ఉద్యమం నడపగలనా? 1951లో అలా చేసినప్పుడే 'శంకర్స్ వీక్లీ' అలా వ్యాఖ్యానించింది. అయినా నేను నా అంతరంగం చెప్పేదానికి కట్టుబడి నడవదల్చాను. కనుకనే గ్రామ దాన ఉద్యమంపై విరుచుకుపడ్డాను. మచిలీపట్నం కిసాన్ వేదికపై నుండి బెదిరించాను. ఒకవేళ గ్రామదాన ఉద్యమాన్ని వాళ్లు జాతీయ స్థాయిలో చేపడితే రైతుల్ని సత్యాగ్రహాలు చేసేందుకు సిద్ధంకమ్మని చెప్పాను.

ఈ విధమైన బెదిరింపు వార్తాపత్రికలకెక్కగానే వినోబాజీ గ్రామదానం అనేది బలవంతపు చర్య కాబోదన్నారు. జవహర్‌లాల్‌జీ, కాంగ్రెస్ ఉపనాయకులు పంత్‌జీ, దేశ ఉపాధ్యక్షులు రాధాకృష్ణన్, కాంగ్రెస్ అధ్యక్షులు ధేబర్ నా ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ నాకు లేఖలు రాశారు. గ్రామదాన ఉద్యమం రైతు ఆర్థిక వ్యవస్థవంటి వాటికి ప్రతికూలమైనదిగా భావించవద్దన్నారు.

వాళ్ల జాబులు, వాళ్లకు నా జవాబులు మాత్రమేకాక **'రంగా ఎందుకు రాజీనామా చేశాడు'** *Why Ranga Resigns,* **'స్వేచ్ఛకు వాటిల్లిన ముప్ప'** *Freedom in Peril,* **'రైతులపై విరుచుకుపడ్డ తుఫాను'** *Storm Burrest over Peasants*

చదివితే నేను అప్పుడు ఎన్నెన్ని కడగండ్లకు గురయ్యానో, ఎన్నెన్ని ఒత్తిడులకు లోనయ్యానో మీకే తెలుస్తుంది. ఆనాటి శక్తిమంతమైన రాజకీయ ఒత్తిళ్లను తట్టుకొనగలిగిన నైతిక దారుఢ్యం నాలో ఉంది.

1958 మే నాటికి అంటే ఇదంతా జరిగిన ఆరు మాసాలకు పార్లమెంట్‌లోని కాంగ్రెస్ పార్టీ నా పట్ల విశ్వాసాన్ని నింపుకుని ఆ ఉప్పెన సంగతి పక్కనబెట్టి నన్ను ఏకగ్రీవంగా దాని సీనియర్ కార్యదర్శిగా ఎన్నుకుంది. నా ఎన్నిక జవహర్‌లాల్‌జీకి రాజకీయంగా ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నదిగా కన్పించి ఉండొచ్చు. ఆయనకు నచ్చిన, ఆయన మెచ్చిన ప్రణాళిక గ్రామదాన ఉద్యమం విఫలమైంది. అయినా ఆయన కాకలుతీరిన రాజనీతిజ్ఞుడు కనుక కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్య నిర్వాహక వర్గానికి నన్ను పరిచయం చేస్తూ ఎంతో ఆహ్లాదకరంగా అన్నారు: 'రంగాజీ ఇప్పుడు మనకు సాయం అందిస్తారు'. ఆ మైత్రి ఎక్కువకాలం నిలిచేదికాదని రుజువైంది. అయితే ఒకటి మాత్రం నిజం. ఓ రెండేళ్లపాటు మా మధ్య పరస్పర విశ్వాసం, చక్కని సహకారంతో ఒక ఉల్లాసమయ వాతావరణం నెలకొన్నది. ఆయన తన మార్గాన్ని వీడి అతి ముఖ్యమైన, గూఢమైన, జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాల గురించి సంప్రదించసాగారు. అయినా మా మధ్య నిరంతర వైరుధ్యం అగాధంలా వుందని మా ఇరువురికీ తెలుసు.

సోవియట్ గ్రామీణ ఆర్థిక విధానాన్ని కనుక ఆచరించేటట్లయితే మంచి పంటలు పండుతాయని, అధిక ఫలసాయం లభిస్తుందని ప్రణాళికా సంఘం ఆయనపై తెచ్చే ఒత్తిడి ఆలోచించుకునే వ్యవధిని కూడా ఇవ్వడంలేదు. అందువల్ల మేము మనస్సు విప్పి ఉల్లాసంగా ఇతర విషయాలు మాట్లాడుకునే సందర్భంలో ప్రణాళికా సంఘం

ఆలోచనను పార్టీ ముందుంచే విషయంలో తనకు మద్దతు పలకమన్నారు. అలా నన్ను ఆయన పలుమార్లు కోరడం జరిగింది. **మా మధ్య అవగాహన, చనువు ఎంతగా పెరిగినా ఆయన ఏది చెబితే దానికి తలాడించే దశకు నేను చేరలేదు.** చివరకు ఆయన నాగపూర్ సదస్సులో ప్రభుత్వం నిర్వహించే సహకార వ్యవసాయ పద్ధతిని చర్చకు తెచ్చేందుకు సిద్ధమయ్యాడు. నేను వద్దని వారించాను. కావాలంటే వచ్చి వ్యతిరేకించమని అలా చేస్తే తనకేం అభ్యంతరం లేదన్నారు. అయితే నాకు వ్యతిరేకంగా పావులు బాగా కదుపుతున్నారన్నమాట అని బదులు పలికాను. నేను కార్యదర్శిగా వున్న పార్లమెంటరీ పార్టీలో ఈ విషయంపై ఆయనకు మద్దతు లభించడంలేదని అఖిలభారత కాంగ్రెస్ కమిటీ నిర్ణయం ద్వారా దాని మెడలు వంచదల్చాడని అర్థమైంది. అందుకే అనేశాను -నన్ను పార్టీ నుండి దూరం చేసుకునేందుకు ఎందుకంత తొందర అని. 1951-53 మధ్యకాలంలో మద్రాస్ ప్రభుత్వ పతనాన్ని గుర్తుచేశాను. మనం మనం పోట్లాడుకుని అధికారం కమ్యూనిస్ట్‌ల చేతుల్లో పెట్టడం ప్రమాదకరంగా భావించి తిరిగి కలసి పనిచేస్తున్నాం. ఆ విధంగా ఆంధ్రలో మిగతాచోట్ల ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొస్తున్నామని చెప్పాను.

ఇరువురికీ ఇబ్బందికరమైన ఆ చర్చ 11.5.1959 వరకూ మా మధ్య కొనసాగుతూనే ఉంది. ఆ తేదీన నాగపూర్ సభలో సహకార వ్యవసాయానికి అనుకూలంగా జాతిని జాగృతం చేయాలని తీర్మానించడం జరిగింది. జనవరి 19వ తేదీన నా అసమ్మతిని ప్రకటించాను. మార్చిలో పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి పదవికి రాజీనామా సమర్పించాను. చివరకు జూన్ 1959లో కాంగ్రెస్ సభ్యత్వానికి రాజీనామా చేశాను.

చివరి రోజుల్లో మేము చాలా దగ్గరయ్యాం. 1937 నుండి 1951 వరకూ నేను నిర్వహించిన పార్టీ కార్యదర్శి పదవి నుండి తప్పించాలనుకుంటే ఆయన వద్ద అస్త్రశస్త్రాలు అనేకం ఉన్నాయి. అయితే కమ్యూనిస్ట్‌ల సవాల్‌ను ఎదుర్కొనేందుకు అక్కడ నేను అవసరమయ్యాను. అందువల్లనే గాంధీజీ, సర్దార్‌జీలకు చేరువైనట్లుగానే జవహర్‌లాల్‌జీకి చేరువవుతానని అందరూ భావించారు. ఆయనా అలా భావించేందుకు అవకాశం కల్పించారు. నేను ఆయన ఇవ్వజూపిన ఏ పదవుల్నీ స్వీకరించేందుకు సిద్ధంగా లేనందువల్ల ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరంలేని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా నియమించారు. ప్లానింగ్ కమిటీ రూపొందించే వ్యవసాయపరమైన ఏ

విధానంపైన అయినా మా ఇద్దరి మధ్య వివాదం చెలరేగితే అందరికీ ఆనందంగా వుండేది.

నేను సహకార వ్యవసాయంపై నాగపూర్ తీర్మానాన్ని వ్యతిరేకించిన సందర్భంగా ఆయనతో నా విభేదాలు సురైనవిగానే భావించడం వల్ల కొత్తగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మాలవియావంటి సోషలిస్ట్‌లు నా రాజీనామాను కోరమని సలహా ఇచ్చినా ఆయన అలా చేయలేదు. పార్లమెంటరీ పార్టీ కార్యదర్శిగా నా రాజీనామాను ఎంతో అయిష్టంగా సమ్మతించిన పిమ్మట కార్యనిర్వాహక వర్గంలోని విధేయులు కొందరు నా కాంగ్రెస్ సభ్యత్వానికి కూడా రాజీనామా చేయమని కోరమంటే ఆ ప్రతిపాదనను ఆయన అంగీకరించలేదని నాకు తెలియవచ్చింది. ఊహకు అందని విషయాన్ని ఊహిస్తూ ఆయనతో మైత్రికి వ్యవసాయ విషయాలను మినహాయిస్తే మెత్తబడతాననే నమ్మకం ఆయనకుంది. దానికి కారణం 1951-55లో మా మధ్య నడచిన సంబంధాల తీరే. అప్పుడు మేము కలసి లేము. కనుక ఆయన నా రాజీనామా విషయంలో తుది నిర్ణయాన్ని నాకే వదిలివేశారు. అయితే ఆ ఘర్షణ, సుదీర్ఘ చర్చలు నాకూ, జవహర్‌లాల్‌జీకి మధ్య వ్యక్తిగత, సామాజిక సంబంధాల్లో గుణాత్మక విభేదాలకు దారితీసింది.

నేను చివరకు ఆయన్నూ, కాంగ్రెస్‌ను వీడిపోతానని కలలోనైనా ఊహించకపోవడమేగాక ఆయన ఒకనాటి సన్నిహిత సహచరుడు, గవర్నర్ జనరల్‌వంటి ప్రముఖుడు అయిన పూజ్య రాజాజీ, ఎం.ఆర్.మసాని, మున్షి, వి.పి.మీనన్, నారాయణరెడ్డి, నరసింహారావు, బెంగుళూరుకు చెందిన శ్రీనివాసన్, సర్దార్‌లాల్‌సింగ్, ఎం.రత్నస్వామివంటి వారి సరసన నిలుస్తానని కూడా ఊహించలేదు. దానితో చిర్రెత్తుకొచ్చి అసహనాన్ని ప్రదర్శించి అప్రజాస్వామికంగా ప్రవర్తించి తాను గొప్పగా ప్రజల్లో పెంచుకున్న కీర్తికి మచ్చ వచ్చేటట్లుగా తానే ప్రవర్తించాడు.

ఇదంతా కలిసి పరాకాష్టకు చేరి పార్లమెంట్‌లో 1960లో ఇలా వ్యాఖ్యానించేటట్లు చేసింది 'మా గౌరవనీయ మిత్రుడు అనేక పార్టీలు మారాడు'. అది తిరిగి నన్ను ఇలా అనేలా ప్రేరేపించింది: 'నాకు అలా చేసే ధైర్యం ఉంది. నా గౌరవనీయ మిత్రుడు అటువంటి సాహసాన్ని ఎన్నడూ ప్రదర్శించలేదు'. అనేక సందర్భాల్లో జవహర్‌లాల్‌జీ కాంగ్రెస్‌కు రాజీనామా సమర్పిస్తారనుకునే వారు అది గాంధీజీతోనూ, వర్కింగ్ కమిటీతోనూ తలెత్తే విభేదాల కారణంగా. అది రాజకీయంగా ఆయనకు ఎంతో

నష్టంవాటిల్లజేస్తుందని గమనించి అటువంటి ప్రయత్నాన్ని దాటవేసేవాడు. **'మీకూ, నాకూ మధ్య తేడాలు నాకు ఎంతో ఎక్కువగానూ, మౌలికమైనవిగానూ కనిపిస్తున్నాయి. ఆ అగాధం పూడి మనం కలసి మాట్లాడుకునే అవకాశం కనిపించడంలేదు'** అని మహాత్ముడు చేసిన హెచ్చరికను నెహ్రూగాక ఇంకెవరైనా తమ వామపక్ష క్రియాశీల భావాలను అణచుకుని ఎలా వెనక్కి మళ్లగలరు? పై విషయం Bunch of Letters (లేఖా గుచ్ఛం)లో లభిస్తుంది.

నేను అటువంటి సంఘటనలను ఎన్నింటినో ఎత్తి చూపగలనని, అందువల్ల తన అవివేక వ్యాఖ్యను నేను అలా తిప్పికొట్టడంపై ఆగ్రహాన్ని ప్రదర్శించడం తనకు మంచిదికాదనుకున్నాడు. అందువల్ల ఆ సందర్భం పార్లమెంట్‌ను, ఆయన్ను నవ్వుకునేటట్లు చేసి నవ్వుల పువ్వులు పూయించింది.

దెబ్బతిన్న బెబ్బులివలే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ విధాన నిర్ణాయక మండలి జవహర్‌లాల్‌జీ ఇచ్చిన ఊతంతో నన్ను రాజీనామా సమర్పించాల్సిందిగా కోరేందుకు నిర్ణయించింది. ఒకవేళ నేను రాజీనామా చేయాల్సి వస్తే కాంగ్రెస్, కె.ఎల్.పి., కె.ఎం.పి.ల కలయికతో ఏర్పడిన ఐక్య కాంగ్రెస్‌కు చెందిన ఆంధ్ర శాసనసభ్యులంతా రాజీనామా సమర్పించాల్సి ఉంటుందని, అలాగే మా మద్దతుతో గెలిచిన పార్లమెంట్ సభ్యులు కూడా రాజీనామా చేయాల్సి ఉంటుందని నేను మొండికెత్తాను. దానికి సమాధానం చెప్పే సంస్కారం గర్వానికి పెట్టింది పేరైన జవహర్‌లాల్‌జీకి లేదు. 1955లో మేము స్థాపించిన ఐక్య కాంగ్రెస్‌తో విశ్వాసపాత్రంగా మసలుకోవడంలో విఫలమైన విషయాన్ని గుర్తించి ఉండాలి. అందువల్ల ఆ గొడవ అంతటితో సర్దుమణిగింది.

కని తీర్చుకునే వైఖరిని ప్రదర్శించిన ఆ కాంగ్రెస్‌కు నేను సవివరంగా ఇచ్చిన సమాధానాన్ని చూసినవారు అప్పటి రాజకీయ ఘటనలను, వాతావరణాన్ని గ్రహించగలరు. ఆ తర్వాత మేము రాజకీయంగా విసురుకున్న విసుర్లు –అవి జాతీయ అంశాలపైన కావచ్చు, చైనా దాడిపై కావచ్చు. వాటన్నింటినీ పక్కకు నెట్టి నా నిజాయితీపై ఆయనకు అపారమైన నమ్మకముందని పార్లమెంట్‌లో జవహర్‌లాల్‌జీ చెప్పగలిగాడు.

48

కాంగ్రెస్ అధ్యక్ష పదవి ప్రారబ్ధం : 1955-56

1921లో జాతీయోద్యమానికి గాంధీజీ నాయకత్వం వహించిననాటి నుండి కాంగ్రెస్ అధ్యక్ష పదవిని పేరెన్నికగన్న అఖిలభారత స్థాయి నాయకులు చేపట్టారు. వాళ్లకు భారత ప్రజలతో, మేధావులతో సంబంధాలుండేవి. కాంగ్రెస్ కమిటీ చర్చల్లో వాళ్ల ప్రతిభ వెలుగులోకి వస్తూ ఉండేది. డిసెంబర్ 1929 నాటికి నెహ్రూని అధ్యక్షునిగా ఎన్నుకున్న సమయానికి ఆయన వయస్సు 40 సంవత్సరాలు బొటాబొటిగా ఉంటాయి. **అలా ఎందుకు జరిగిందంటే నెహ్రూ తండ్రికి వయస్సు మీరిపోతున్నందువల్ల కొడుకును కాంగ్రెస్ గద్దెపై చూడాలనుకున్నాడు.** ఎందుకంటే తన కుమారుడు స్వతంత్ర భారతదేశపు ప్రభుత్వ పగ్గాలు పట్టడం చూడడం సంభవిస్తుందో లేదోనని బెంగ. కాంగ్రెస్ సంస్థ ఆ పెద్దాయన కోరికను మన్నించి నెహ్రూను అధ్యక్షునిగా గద్దె నెక్కించింది.

ఆ రోజుల్లో కాంగ్రెస్ అధ్యక్ష పదవి అంటే ఎంత గౌరవప్రదమైన పదవో దాన్ని అధిష్ఠించినవారిని చూస్తే తెలుస్తుంది. దురదృష్టవశాత్తూ జవహర్‌లాల్‌జీ స్వతంత్ర భారతదేశానికి ప్రధాని కాగానే మారిన పరిస్థితుల్లో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పూర్వపు వైభవం సంతరింపజేసేందుకు ఏవో కుశంకలు. దానివల్ల కాంగ్రెస్ అధ్యక్ష పదవి ప్రతిష్ట దిగజారింది. అప్పట్లో కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్న **ఆచార్య కృపలానీ** కూడా

ఆచార్య కృపలానీ

ప్రభుత్వ ప్రధాన విధాన నిర్ణయాలన్నింటిలో కాంగ్రెస్ అధ్యక్షుణ్ణి విశ్వాసంలోకి తీసుకుని చర్చించకపోవడాన్ని ఆక్షేపించాడు. అయితే ప్రధాని, కాంగ్రెస్ అధ్యక్షుడికంటే భిన్నమని, అధ్యక్షుడు కేవలం ఒక రాజకీయ పక్షనేత అని, ప్రధాని అంటే ప్రభుత్వ అధినేతగా ప్రజలందరివాడనే అభిప్రాయం నెహ్రూది. **ఈ విషయంలో నెహ్రూకు సర్దార్ పటేల్ వత్తాసు ఉంది.**

గాంధీ గారు కూడా నెహ్రూ పద్ధతిలో నెహ్రూను నడవనిచ్చాడు. కాంగ్రెస్ అధ్యక్షుడిని చిన్నచూపు చూడడం నచ్చక ఆచార్య కృపలానీ ఆ పదవికి రాజీనామా సమర్పించాడు. ఆహార వ్యవసాయ శాఖామాత్యులుగా ఉన్న **రాజన్‌బాబు** ఆ పదవిని నిర్వహిస్తూనే కాంగ్రెస్ అధ్యక్షుడయ్యారు. ఆ విధంగా ప్రధాని ఆధిక్యానికి అక్కడ ఇబ్బందిరాలేదు. ఆ విధంగా గాంధీజీ జీవించి ఉన్నకాలంలోనే కాంగ్రెస్ అధ్యక్ష పదవి పతనం ప్రారంభమైంది. ఇటువంటివన్నీ గ్రహించిన గాంధీజీ రాజకీయ పార్టీగా కాంగ్రెస్‌ను రద్దు చేసేందుకు ఇదే తగిన సమయమన్నారు. దాని గొప్పదనాన్ని, గౌరవ ప్రతిష్ఠలను ఎవరూ కొల్లగొట్టరాదని, స్వాతంత్ర్య ఫలాలను ఎవరూ సొంతం చేసుకోరాదని, స్వాతంత్ర్యం కోసం పోరాడిన ప్రజలందరికీ ఆ ఫలాలు దక్కాలన్నది ఆయన భావన. ఆ గౌరవ ప్రతిష్ఠలు తరతరాలుగా స్వాతంత్ర్య యోధులు సముపార్జించినవి. కనుక రైతు సంఘాల కార్యకర్తలు, సోషలిస్ట్‌లు, ఫార్వర్డ్ బ్లాక్‌వారు మరెందరో అసమ్మతి వర్గాలవారు అధికారం కేవలం కాంగ్రెస్‌వారే అనుభవించడాన్ని ఆవౌదించడమన్నది అన్యాయమే. **అయితే అధికారం ఇప్పుడు జవహర్‌లాల్‌జీకి కలికి తురాయి.** గాంధీజీ నైతికత్వం, కోరిక హుష్‌కాకి అయ్యాయి. గాంధీజీ తన అనుయాయులను కోరిన తుది కోరికను జవహర్‌లాల్‌జీ ఆదరించే దశలో లేదు. ఒకవేళ ఆయన ఆదరించి

ఇందిరా గాంధి

ఉండి ఉన్నట్లయితే స్వతంత్ర భారతదేశ చరిత్ర మరోవిధంగా ఉండేది. ఇంతటి ఆనందలేమి ఉండేదికాదు.

కాంగ్రెస్ పార్టీని రద్దు చేయకపోవడమే లాభదాయకమని జవహర్‌లాల్‌జీ, ఇతర రాజకీయ నాయకులు భావిస్తూ ఉండగా కాంగ్రెస్ అధ్యక్షుడు తనకు తానే కనీసం సలహా ఇచ్చే అధికారం కూడా లేకుండా చేసుకుని వాళ్ల చేతుల్లో కీలుబొమ్మగా మారి పోయాడు. **పురుషోత్తమ్‌దాస్ టాండన్** అధ్యక్షుడిగా ఉండగా ఆయన జంకూగొంకూ లేనివాడని గ్రహించి ఆయనే రాజీనామా సమర్పించేటట్లు చేశారు. అప్పుడు కాంగ్రెస్ అధ్యక్ష స్థానం కూడా ప్రధానికే అప్పగించారు. ఆ విధంగా ఆయన పార్టీ మీద, మంత్రి వర్గం మీద పట్టు సాధించాడు. **జవహర్‌లాల్ 'ప్రజాస్వామిక నియంతృత్వం'**లో కాంగ్రెస్ ఓ భాగమైంది. జవహర్‌లాల్‌జీ తన తర్వాత అధ్యక్షుడిగా ఓ చిన్న రాష్ట్ర ముఖ్యమంత్రిని ఎంచుకున్నాడు. ఆయన ముందు వరస కాంగ్రెస్ నాయకుల్లో లేరు. కనుక ఆయన ప్రధానికి సరితూగడు, ప్రమాదకారి కాబోడు. అయినా అప్పుడప్పుడూ పురుగు తొలుస్తూ ఉండడమెందుకని తన కుమార్తెనే కాంగ్రెస్ అధ్యక్షురాలిని చేశాడు.

సంజీవరెడ్డి

ఆయన ఈ వ్యవహారం తాను స్వాగతించేది కాదని ఎంతగా నటించినా ఇతర నాయకులకు తెలుసు ఆయనకు ఎదురుగా నిలిచి స్వతంత్ర నిర్ణయాలు చేయగల నాయకుడిని ఆయన ఇష్టపడడని. మనక బారిన కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆయన కుమార్తె రాకతో ఆకర్షణీయంగా మారిన భ్రాంతిని కలుగజేసింది. నెహ్రూని అభిమానించే వారి హృదయాలకు ఉల్లాసాన్ని సమకూర్చింది. **మోతీలాల్ నెహ్రూ తన కుమారునికి అధికారాన్ని కట్టబెట్టగాలేంది జవహర్‌లాల్ తన**

కుమార్తెకు ఎందుకు అధికారాన్ని కట్టబెట్టకూడదు? పైగా ఈ ఎన్నిక తర్వాత చాలామంది ఉత్సాహభరితంగా మెచ్చుకునే వాళ్లు వ్యాఖ్యానించేది ఏమంటే నెహ్రూ మూడు తరాలపాటు గద్దెపై కూర్చున్నాడని. తాతకూ, మనవరాలికీ మధ్య శక్తిమంతమైన ఆ హెూదా కాస్తా పూర్తిగా చిక్కిపోయింది. **భూస్వామ్య పెత్తందారీతనం దూరమవుతూ ఉంటే నెహ్రూ రాజకీయ పెత్తందారీతనాన్ని ప్రవేశపెట్టాడు.**

నెహ్రూ కుమార్తె తర్వాత అప్పటి ఆంధ్ర ముఖ్యమంత్రి సంజీవరెడ్డి కాంగ్రెస్ అధ్యక్షులయ్యారు. ఆయన జాతీయ రాజకీయాలకు కొత్త కావడంతో ఆ పదవి వల్ల లభించిన పర్యటన అవకాశాలకు ముగ్ధుడయ్యాడు. అప్పుడు రాజాజీ నన్ను స్వతంత్ర పార్టీకి నాయకత్వం వహించేందుకు ఆహ్వానించి ఉన్నాడు.

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా ప్రభుత్వ ఉద్యోగాన్ని వదలి ప్రజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మధ్యంతర పార్లమెంట్ సభ్యుడిని చేయడంలో నా పాత్ర ప్రధానమైనదే. ఇటువంటి ఆంధ్ర నాయకుల్ని మరెందరినో మైసూరు, మద్రాస్, ఆంధ్ర మంత్రి వర్గ సభ్యుల్ని కాంగ్రెస్ అధ్యక్షులుగా చేసి 1962లో చిత్తూరు ఉప ఎన్నికలో నేను పోటీ చేస్తున్న సందర్భంగా వాళ్లందరినీ నాకు వ్యతిరేకంగా ప్రచారం చేయమని పంపినా నేనే గెలిచాను.

ఏది ఏమైనా సంజీవరెడ్డికి కూడా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆశించదగినదిగా కనిపించక రాజీనామా నవమర్పించేందుకు జవహర్‌లాల్‌జీని వేడుకుని తిరిగి ఆంధ్ర ముఖ్యమంత్రి పదవిని చేపట్టేందుకు ప్రయత్నించాడు. మరి ఆయన్ను ఆ పదవిలో కూర్చోబెట్టేందుకు ఆయన స్థానంలో ముఖ్యమంత్రి అయిన యువ హరిజన నాయకుడు డి.నంజీవయ్యను కాంగ్రెస్ అధ్యక్షుడిగా చేసి సంజీవరెడ్డిని తిరిగి ఆంధ్రాకు ముఖ్యమంత్రిని

డి.సంజీవయ్య

చేశారు. సంజీవయ్య యువకుడు కనుక ముమ్ముందు ఎన్నో అవకాశాలు ఉంటాయి కనుక పార్టీకి సేవలు అందించేందుకు సిగ్గుపడాల్సిన పనిలేదన్నారు. ఇదంతా చూస్తుంటే కాంగ్రెస్‌వాదుల్లో కాంగ్రెస్ అధ్యక్ష పదవి అంటే సంపూర్ణంగా ఆకర్షణను కోల్పోయిన పదవిగా కనిపిస్తోంది. సంజీవయ్య ఎంతో నిజాయితీగా చెప్పారు. నేను భారత రాజకీయాలకు కొత్త. జాతిపిత దక్షిణ భారతదేశంలో పర్యటించినప్పుడు ఆయన దర్శనం కూడా దక్కని చిన్నవాణ్ణి. అలా పార్టీ అధ్యక్షునిగా కొంత తర్ఫీదునిచ్చి తర్వాత ఆయన్ను కేంద్ర కేబినెట్‌లోకి కార్మిక మంత్రిగా తీసుకున్నారు.

సంజీవయ్య స్పష్టత కలిగిన వ్యక్తి. కాంగ్రెస్ సంస్థ అవకాశవాదులకు, సంపదను పోగేసుకునే వారికి నిలయంగా మారిందని వ్యాఖ్యానించగల సత్తాను సమకూర్చున్న వాడు. ఆయన తర్వాత మాట్లాడడం ఎక్కువగా ఇష్టపడని మద్రాస్ నాయకుడు కామరాజ్ నాడార్ కాంగ్రెస్ అధ్యక్షులయ్యారు. ఆయన శక్తి అంతా ఆయన మౌనంలోనే నిబిడీకృతమై ఉంది. ఆయన మౌనం వీడాడంటే పలికే మాట ఒకటే 'పార్కలాం' (చూద్దాం). ఆయన ఉన్నత పాఠశాల గడప తొక్కినవాడు కాదు. ఆయనకు ఇంగ్లీష్ కొంచెం వచ్చు, హిందీ అంతకంటే తక్కువ. అయినా అధికారం ఎక్కడ కేంద్రీకృతమైందో, వగ్గాలు వట్టడమెలాగో బాగా తెలిసినవాడు. ఆయన తమిళనాడు కాంగ్రెస్‌కు మకుటంలేని మహారాజు. ఎవరికైనా రాజకీయాధికారం కట్టబెట్టగల దిట్ట. తమిళనాడులో కమ్యూనిస్ట్‌ల ఆధిక్యం పెరిగినప్పుడు రాజాజీని ముఖ్యమంత్రిగా వుండమని కోరినవాడు, ఆ సంక్షోభం ముగిసిన తర్వాత తానే తిరిగి ముఖ్యమంత్రి కావడం మంచిదని తలపోసినవాడు. జవహర్‌లాల్‌జీ

కామరాజ్ నాడార్

తర్వాత ప్రధానులుగా శాస్త్రి, ఇందిరలను చేసి రాజకీయాల్లో చెరగని ముద్ర వేసినవాడు. కాంగ్రెస్ అధ్యక్షునిగా ఆయన కీర్తికిరీటంలో అదే కలికితురాయి. నాడార్ అధ్యక్షుడిగా ఉన్నకాలంలో కాంగ్రెస్‌లో జగడాలు, అభిప్రాయ భేదాల పంటలు పుష్కలంగా పండుతున్నాయి. ఆయన ఉత్తరప్రదేశ్, బీహార్, గుజరాత్, పంజాబ్, ఆంధ్ర, ఒరిస్సా, రాజస్థాన్‌లలో మంత్రుల మాట విననివారిని బుజ్జగించడంలో అవిశ్రాంతంగా కృషి చేయడం జరిగింది. **కాంగ్రెస్‌వాదుల్లో అధికారం పట్ల వ్యామోహాన్ని తగ్గించి సంస్థాగతమైన పని పట్ల శ్రద్ధ పెంచడంలో కామరాజ్ పథకం పాలింది.** అయితే ఆ పథకం నేడు శిథిలమైంది. దాని ప్రయోజనం బూడిదలో పోసిన పన్నీరైంది. వాస్తవానికి ఆయన పార్టీలోని దొల్లతనాన్ని, ప్రభావ శూన్యతను వెలికితెచ్చాడు. నిరాడంబరుడైన ఆ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాటలతో పనిలేని కార్యశూరుడు కాంగ్రెస్‌వాదులను నిజాయితీ పట్ల, స్వార్థరహిత సేవ పట్ల మనస్సు లగ్నమయ్యేటట్లు చేయలేకపోయాడు.

ఆయన అధ్యక్షునిగా ఉన్న కాలంలోనే పదిహేను రాష్ట్ర ప్రభుత్వాలు కాంగ్రెస్‌వి ఉండగా తొమ్మిది కుప్పకూలాయి. ప్రజా ప్రతినిధుల మారకాలు మొదలైందప్పుడే. శాసనసభ్యుల పార్టీ ఫిరాయింపుల రాజకీయ పెనుభూతాన్ని ఆయన మనకు అందించినవాడుగా మిగిలిపోయాడు.

కాంగ్రెస్ నాయకులు తిరిగి అధ్యక్షుని కోసం గాలింపు చర్యలు మొదలుపెట్టారు. ఎట్టకేలకు మైసూరు ముఖ్యమంత్రి నిజలింగప్ప దొరికారు. అయితే శర్వతి ఆనకట్ట అవినీతి బాగోతం, అసమ్మతి కాంగ్రెస్ శాసనసభ్యులు ఆయన మంత్రి వర్గంపై మోపిన అభియోగాల విషయంలో ప్రజల కళ్లు కప్పేదెలా? నెహ్రూ తర్వాత అధ్యక్షులైన ఐదుగురి మాదిరిగానే ఈయన కూడా ఈ పదవిలో కూర్చున్నప్పుడు జాతీయ అవగాహనను, దృష్టిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధ్యక్షుని కోసం గాలించే సమయంలో ఢిల్లీ దినపత్రిక ఒకటి అతికినట్లు ఇలా వ్యాఖ్యానించింది: అత్యున్నత స్థానాల్లో న్యాయం క్షణంలో దిశ మార్చుకుంటుంది అనేది కాలాపహరణ మూకాభినయపు సారాంశంగా నిలుస్తుంది. ఇది ఆ నియమ రహిత నిస్పృహతత్వానికి తాజా ఉదాహరణగా నిలుస్తుంది'. (4.12.1967).

కాంగ్రెస్ విషయంలో విమోచన దిశగా గమనింపదగిన అంశమేమంటే 1951లో, 1959లో మేము అనేకమందిమి ఆ సంస్థను వదలివెళ్లినట్లుగానే ఇప్పుడు సాహసోపేతమైన కొద్దిమంది కాంగ్రెస్ నిరసనకారులు కాంగ్రెస్‌ను వదలి వెళుతున్నారు.

పోలిక కాంగ్రెస్‌ను వీడిపోవడం దగ్గరే ఆగిపోతుంది. మేము కాంగ్రెస్‌ను వీడింది సిద్ధాంతపరమైన కారణాల వల్ల. ప్రస్తుత నిరసనకారులు సిద్ధాంతపరమైన కారణాల వల్లగాక నిరాశా, నిస్పృహల వల్ల కాంగ్రెస్‌ను వదలి వెళుతున్నారు. ఈ నిరసనకారులు ఓటర్లకు విన్నవించేదేమంటే సరికొత్త ప్రత్యామ్నాయ కార్యక్రమాలతో ప్రగతిని సాధిస్తామనికాక కాంగ్రెస్ ప్రణాళికను మరింత చిత్తశుద్ధితో, నిజాయితీగా, సమర్థవంతంగా అమలుపరుస్తామని. వాళ్లకు కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయాలన్నా, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎన్నికల వ్యూహరచన చేయాలన్నా , కాంగ్రెస్ పార్టీ నుండి చీలిన మరికొన్ని పార్టీలతో చేతులు కలపాలన్నా వాళ్లకు గల రాజకీయ అనుభవం చాలదు. అటువంటి శక్తిహీన పార్టీల వల్ల ప్రతిపక్షం సమర్థవంతంగా మనజాలదు. దేశం అసమర్థ, అవినీతిమయ కాంగ్రెస్ పాలనలో ముక్కుతూ మూలుగుతూ గడుపుతూ ఉంటే కాంగ్రెస్ మాత్రం శక్తిమంతమైన ప్రజాస్వామిక ప్రతిపక్షాన్ని ప్రోత్సహిస్తుందని మనం భావించేదెలా? ఇప్పటికే భారత రాజకీయ రంగంపై ఓ డజను దాకా రాజకీయ పార్టీలు ఉన్నాయి. అవి రెండు లేదా మూడు ప్రతిపక్ష పార్టీలుగా ఏర్పడలేక విషాదాంత నుఖాన్ని వంచుతూ ఉంటే ఇప్పుడు క్రాంతి దళం అని మరో పార్టీ అట! వాస్తవానికి ఈ విధంగా కాంగ్రెస్ మన రాజకీయాలను నైతిక దివాళాకోరుతనం వైపునకు నడిపించింది. అప్పటి అధ్యక్షుడు రాధాకృష్ణన్ 'స్మార్తికి సంక్షోభం' చీడ పట్టసాగిందని గర్హించాడంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరమేముంది?



నిజలింగప్ప

సమస్యాత్మక రాష్ట్రాలైన

కేరళ, పశ్చిమబెంగాల్, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో సంకీర్ణ ప్రభుత్వాలో లేక అఖిలపక్ష మంత్రి వర్గాలో ఏర్పాటుచేయమన్న మా సూచనను కాంగ్రెస్ పాటించలేదు. మేము అలా ఎందుకు సూచించామంటే బ్రిటిష్ తరహా ప్రభుత్వ పాలన ఆ రాష్ట్రాలకు తగినది కాదని రుజువైంది కనుక. మా సూచనను పాటించకుండా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ మంత్రి వర్గాలను ఉబకేసి తమ రాష్ట్ర అసెంబ్లీ పార్టీలతో తోలుబొమ్మలాటలు ఆడించని పక్షంలో మరో రాజకీయ అరాచకత్వానికి మార్గం సుగమం చేస్తున్నట్లయ్యింది. కాంగ్రెస్ చేపట్టిన మరో అపవిత్ర యుక్తి విన్యాసమిది. అది పార్లమెంటరీ వ్యవస్థను దిగజార్చే పద్ధతి. దానివల్ల ప్రజాస్వామ్యం పట్ల ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడమే.

1951లో దాని అవినీతి విధానాలకు విసిగి వేసారి కాంగ్రెస్ నుండి దూరంగా జరిగినప్పుడు అది 'లోలోపలే కుళ్లిపోతూ కుళ్లిన పండులా ముక్కలు ముక్కలుగా చెల్లాచెదురు కాసాగింది. నేను అప్పుడు హెచ్చరికలు జారీ చేశాను: ఇలా అయితే భారతదేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదని, దేశాన్ని కమ్యూనిస్ట్‌లకు బహుకరిస్తుందని'. అప్పుడు దురదృష్టవశాత్తూ దేశం కొన్ని ఆసియా దేశాల మాదిరిగా తయారవుతుంది.

తర్వాత ఘటనలు ఈ హెచ్చరికలను భవిష్యద్దర్శకాలుగా మార్చాయి.

49

వినోబా గ్రామదాన ఉద్యమం : ఆంధ్ర రైతుల నిరసన ప్రదర్శనలు

12 జూలై 1957 ప్రాతఃకాలం విజయవాడలో చల్లగా, ఆహ్లాదకరంగా ఉంది. లక్షకు పైగా ప్రజలు అక్కడకు చేరుకున్నారు. వారిలో ఎక్కువమంది రైతులే. ఆ రోజు నా విగ్రహ ఆవిష్కరణ. బొంబాయి నేత, కేంద్ర మంత్రి ఎస్.కె.పాటిల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తూ చెప్పిందేమంటే - ఈ విగ్రహం రైతుల, చేతివృత్తి కళాకారుల, గ్రామీణ ప్రజల జాతీయ స్థాయి చిహ్నంగా నిలిచిపోతుందని.

నేను ఏ ఆదర్శాల కోసం, ప్రయోజనాల కోసం ఉద్యమాలకు ఊపిరిగా నిలిచి విశేషంగా కృషి చేశానో దాన్ని వివరించి చెప్పే ప్రక్రియగా ఆ చిహ్నం రానున్న తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలువగలదు. అంతర్జాతీయ రైతు సంఘం జనరల్



వినోబా

సెక్రటరీ డాక్టర్ జి.డిమిట్రోవ్ ఆ సందర్భంగా నిర్వహించిన సభకు అధ్యక్షుడు. ఆయన ప్రపంచ కర్షకుల కోసం, వ్యవసాయదారుల కోసం చేసిన కృషికి గుర్తింపుగా అది నిలుస్తుందన్నారు.

విగ్రహాలను నెలకొల్పడంలో ఆంధ్ర ప్రజలదే పైచెయ్యి. వాళ్లు జాతీయ నాయకులందరి విగ్రహాలను నెలకొల్పుతారు. సర్కారు జిల్లాల గుండా వెళ్లే వాళ్లకు రోడ్డు పక్కన గల గ్రామాల్లో, పట్టణాల్లో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ లేదా పొట్టిశ్రీరాములు విగ్రహమో కనిపిస్తుంది. అదిగో ఆ పరంపరలోనే ప్రజలు నాకూ, ప్రకాశం పంతులు గారికి చందాలతో వాళ్ల హృదయపూర్వక హర్షాతిరేకంతో ఆంధ్ర ప్రజలు విజయవాడలో నెలకొల్పారు.

వ్యక్తుల జ్ఞాపక చిహ్నాలు నెలకొల్పే విషయంలో నేను అంతగా సుముఖుణ్ణి కాను. నాకు మంచి మిత్రుడు, అనేక సామాజిక ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచే గూడూరుకు చెందిన జి.వి.ఎస్.నాయుడు గారు పాలరాతి విగ్రహం చెక్కిస్తానంటే చాలాకాలంగా వారిస్తూ వచ్చాను. అది మద్రాస్‌కు చెందిన శిల్పి నాగప్పతో తయారుచేయిస్తానన్నారు. అటువంటి విగ్రహాల బోధనామయ విలువను గ్రహించిన తర్వాత ఆ శిల్పి ముందు కూర్చున్నా.

ఆంధ్ర కిసాన్ సమ్మేళన్ అధ్యక్షులు జి.వి.సుబ్బయ్య, సీతారామయ్య, కె.ఎల్.పి. శాసనసభ్యులు ఎన్.వి.నాయుడు, జి.లచ్చన్న, వి.వి.రమణ మరెందరో కలసి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని విజయవాడలో నెలకొల్పాలనుకున్నారు. 1952లో విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ఏర్పాటైంది. ముఖ్యమైన కూడలి వద్ద విగ్రహాన్ని నెలకొల్పేందుకు పురపాలక సంఘం అనుమతించింది. ప్రముఖ నాయకులు, ఆంధ్ర మంత్రులు అందరూ కమిటీతో సంబంధాలు పెట్టుకుని ఉన్నారు. యివ్వగలిగిన వారంతా విరాళాలు ఇచ్చారు. ఆ విధంగా అది ఆంధ్రలో బహుళ ప్రచారంలోకి వచ్చింది. చివరకు విగ్రహ ప్రతిష్ఠాపన రోజు రానే వచ్చింది. తండోపతండాలుగా ప్రజలు తరలివచ్చారు.

విగ్రహాన్ని నెలకొల్పేందుకు ప్రజలు ఎందుకు అంతగా శ్రద్ధ వహిస్తున్నారు? రైతుల భూకమతాల హక్కును కాలరాచే నెహ్రూ పథకాలను నేను తీవ్రంగా విమర్శించాను. అది రైతులకు బాగా నచ్చింది. కాంగ్రెస్ నాయకులు నాపై సంధించిన క్రమశిక్షణా చర్య అనే బెదిరింపును వాళ్లు అసహ్యించుకున్నారు. వినోబా గ్రామదాన ఉద్యమాన్ని వాడుకుని రాజకీయంగా కాంగ్రెస్‌వాళ్లు ప్రజలను దోపిడీకి గురిచేయబోతూ

ఉంటే నేను దాన్ని అడ్డుకున్నాను. అది వాళ్లకు బాగా నచ్చింది. ఆ వివాదం ఇటు కాంగ్రెస్‌లోనూ, అటు రైతులలోనూ చిలికి చిలికి గాలివానైంది. కాంగ్రెస్‌లోని క్రమశిక్షణవాదులు నాపై ఎటువంటి చర్యలు తీసుకోవాలా అని చూస్తున్నారు. రైతులేమో మరింత భక్తిశ్రద్ధలు చూపుతూ చైతన్యవంతులై నా వైఖరిని బలపరుస్తున్నారు.

కంట్రోళ్లకు, కోటాలకు, పర్మిట్లకు, లైసెన్స్‌లకు, బలవంతపు ధాన్యం సేకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న మా పోరాటం ప్రణాళికా సంఘానికి గిట్టని వ్యవహారం.

అలాగే పల్లె ప్రజల ఆకాంక్షల పట్ల, ఉత్సుకత పట్ల మా వైఖరి, కార్యక్రమాలు పండిట్ నెహ్రూకుగానీ, ఆయన ప్రభుత్వానికి గానీ అనుకూలంగా లేవు. కృషికార్ లోక్‌పార్టీ వర్గం ప్రపంచం కోరుకునే దిశగా ప్రజాస్వామ్య భారతదేశ శాఖకు ఎంతో తోడ్పాటునందించినా ప్రణాళికా రచయితలు మమ్మల్ని పెద్ద అడ్డంకిగా భావించసాగారు. మేము లేకుంటే ఈ నామమాత్రపు ప్రజాస్వామ్యంలో త్వరితగతిన భారతదేశపు వ్యవసాయాన్ని, కళలను, చేతివృత్తులను సమిష్టీకరణ గావించి ఉండేవారు.

కనుక ప్రజలు మా కృషి పట్ల వాళ్ల విశ్వాసాన్ని ఈ విధంగా ప్రదర్శనకు పెట్టడం గమనించదగ్గ వ్యవహారమే మరీ ముఖ్యంగా ఆ సమయంలో. ఎందుకంటే ప్రణాళికా యుగం ప్రారంభంనాటి నుండే కృషికార్ లోక్‌పార్టీకి చెందిన మేము లేకుంటే ప్రణాళికా రచన చేసేవారు రైతుల్ని పక్కకు పెట్టి వాళ్ల స్వయం ఉపాధి పద్ధతుల్ని మార్చివేసి వాటి స్థానంలో సహకార వ్యవసాయాన్ని, సాముదాయిక విధానాన్ని ప్రవేశపెట్టేవారు.

వినోబా గ్రామదాన ఉద్యమ: రైతుల ప్రతిఘటన

1957లో అక్టోబర్‌లో మచిలీపట్నంకు, నవంబర్‌లో గుడివాడకు, డిసెంబర్ 29న నెల్లూరుకు ప్రజలు తండోపతండాలుగా వచ్చి నన్ను అభినందించారు. ఆ విధంగా రైతుల విశ్వసనీయతను తిలకించే అదృష్టం నాకు లభించింది. రాజకీయ నాయకుల విషయంలో వారు చూపించే శ్రద్ధ, ఇచ్చే గౌరవం ప్రత్యేకంగా ఉండేది. ఈ విధమైన గౌరవం నాకు పైనచెప్పిన ప్రాంతాల్లో దక్కింది. మచిలీపట్నంలో 58 జతల ఎడ్లను కడితే, గుడివాడలో 116, నెల్లూరులో రెండొందల జతల ఎడ్లను కట్టి ఊరేగింపుగా వచ్చి వారి గౌరవాన్ని చాటారు. అంటీముట్టనట్లుండే 'హిందూ', 'మెయిల్' వంటి పత్రికల విలేకరులు వార్తలు రాశారు ఆయా పట్టణాల్లో అంతకుముందు నిర్వహించిన ఊరేగింపుల్లోకెల్లా అవే పెద్దవని. ఆ మూడు పట్టణాల్లో సభలకు హాజరైన ప్రజలను

వరసగా 45 వేలు, 50 వేలు, 50 వేలుగా పేర్కొన్నారు.

కృష్ణా జిల్లా వెనకబడిన తరగతుల నాయకుడు కృష్ణ, ఆంధ్ర రైతు నాయకుడు జి.వి.సుబ్బయ్య వచ్చి కిసాన్ సమ్మేళనం సదస్సుకు హాజరయ్యేందుకు మాట తీసుకున్నప్పుడు వినోబాజీ భూదాన ఉద్యమాన్ని గ్రామదాన ఉద్యమంగా మార్చి రైతు ఆర్థిక వ్యవస్థను వ్యతిరేకిస్తారనే అనుమానం ఇసుమంతైనా లేదు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యల పట్ల, గొప్ప గొప్ప విషయాల్లో తమ నాయకులను సంప్రదించకపోవడం పట్ల నిరసన వ్యక్తంచేసే వాతావరణం మాత్రం ఉండేది. 1936 నుండి అటువంటి సమస్యలు ఏమైనా ఎదురైనప్పుడు ప్రజలు నా వైపునకో, ప్రకాశం పంతులు గారి వైపునకో చూసేవారు. మచిలీపట్నంలో ఊరేగింపు, సదస్సు విజయవంతం కావడంతో గుడివాడ, నెల్లూరులలో తిరిగి ఊరేగింపులు, సదస్సులు పెద్దయెత్తున నిర్వహించారు.

నా మైత్రి కోసం వాళ్లెందుకు పోటీపడుతున్నారు? నాకు మంత్రి పదవి లేదు. కేంద్రంలోగానీ, రాష్ట్రంలోగానీ ఏదైనా పదవి వస్తుందనే నమ్మకమూ లేదు. వారు కూడా నా నుంచి అటువంటిదేమీ ఆశించలేదు. కేంద్ర ప్రభుత్వ నాయకుల వద్దగానీ, కాంగ్రెస్ పెద్దల వద్దగానీ అధికారం కోసం ఎన్నడూ సాగిలబడిందీ లేదు. మంత్రి పదవి నా కె.ఎల్.పి. అనుయాయులెవ్వరికీ దక్కే అవకాశం లేదు. కమ్యూనిస్ట్‌ల మాదిరిగా నాకు సిద్ధాంతపరంగాగానీ, ఆర్థికపరంగాగానీ సీమాంతర సహాయం అందే అవకాశమూ లేదు. పంచాయతీల్లో, సహకార సంఘాల్లో అధికారాన్ని చేజిక్కించుకోమని నా సహచరుల్ని ఎన్నడూ ప్రోత్సహించిందీ లేదు.

భారత ప్రజా జీవనంలో నా పాత్రను అభిమానించడం వల్ల, రైతు ఆర్థిక వ్యవస్థ విషయంలో నాకున్న తపన వల్ల, నీతిమంతమైన పాలన విషయంలో బలమైన కోరికలు ఉండడం వల్లనే రైతులంతా నన్ను అభిమానించారు. మచిలీపట్నంలోనూ, గుడివాడలోనూ తిరుగులేని ప్రభుత్వ పెత్తనానికి వ్యతిరేకంగా పోరాటానికి పిలుపునిచ్చినప్పుడు రైతులు తీవ్రంగా స్పందించారు. ఆ రెండు పట్టణాల్లోని పురపాలక సంఘాలు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, మంత్రుల ముఠా చెప్పుచేతల్లో ఉన్నప్పటికీ నన్ను రైతులు స్వాగతించడం విశేషం. నేను ఎంచుకున్న మార్గానికి గుర్తింపునిచ్చినందువల్లనే ఇదంతా జరిగింది. మచిలీపట్నం నుండి ప్రచురించే తెలుగు వారపత్రిక కృష్ణా పత్రిక ఈ విషయంలో ఎంతో సంతృప్తిని వ్యక్తంచేసింది. వేలమంది జనం అక్కడకు వచ్చింది

ఏదో ప్రయోజనాన్ని ఆశించి కాదు, వేలంవెర్రి కోసం అంతకన్నా కాదు. రైతు వుద్యమం పట్ల వారికున్న విధేయతను చాటేందుకే అలా వచ్చారని కృష్ణా పత్రిక పేర్కొనడం సంతోషదాయకం.

గ్రామదానం వల్ల రైతులు, కౌలుదార్లు భూమి హక్కును కోల్పోతారని, పంచాయతీ పెత్తందారీతనం రూపుదాల్చుతుందని వాళ్లకు తెలియజేశాను.

భారతీయ రైతులు, వృత్తికళాకారులు స్వయం ఉపాధి హోదా వంటి సామాజిక ఆదర్శాల పట్ల, రాజకీయ ఆర్థిక విధానాల పట్ల ఆకర్షితులవ్వాలని గుడివాడలో జరిగిన ఓ సదస్సులో నేను పేర్కొన్నాను. అది నిజంగా నేను నా జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సుదినం. అది నా ఒక్కడికే సుదినంకాదు భారతీదేవి, లచ్చన్న, గొర్రెపాటి, సమస్త ప్రజానీకానికి కూడా సుదినమే.

నెల్లూరు సదస్సులో (31.12.1957) నేను మద్దతు ప్రకటిస్తూ వచ్చిన ముఖ్య అంశాలపై దృష్టి పెట్టాను. వ్యవసాయదారుల ఆర్థిక వ్యవస్థ, వాళ్ల స్వయం ఉపాధి ప్రజాస్వామ్యానికి పునాదులుగా నిలుస్తాయన్నాను. కృషికార్ లోక్‌పార్టీ ప్రజాస్వామిక, గాంధీతరహా కాంగ్రెస్ నాయకత్వంపై ఉంచిన నమ్మకాన్ని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, మంత్రి వర్గం అప్రజాస్వామిక రీతిలో వాళ్ల వైపునకు తిప్పుకున్నాయన్నాను. గ్రామాల్లో మూరాలు కట్టి, కక్షలు పెంచి, పరిపాలనలో, న్యాయ వ్యవస్థలో జోక్యం కల్పించుకుంటూ ప్రభుత్వాన్ని పరిపాలించే పార్టీకి, స్థానిక నాయకులకు ఊడిగం చేయిస్తున్నాయన్నాను. బి.రామచంద్రారెడ్డి, చెన్నారెడ్డి ఆ వేదికపై ఉన్నారు. వారిలో మొదటివారు స్వతంత్ర పార్టీ వ్యవస్థాపక సభ్యులుకాగా రెండోవారు కేంద్ర మంత్రి.

ఎంతో నిక్కచ్చిగా ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, మంత్రి వర్గంలోని ముఖ్యులు ఆ ప్రసంగానికి రెచ్చిపోయారు. నాపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిందిగా అఖిలభారత కాంగ్రెస్ కమిటీని కోరారు. అయితే వినోబాజీ తన ప్రతిపాదనను వ్యతిరేకించిన నా ధైర్యాన్ని మెచ్చుకున్నారు. పటిష్టంగా ఉండే కాంగ్రెస్ క్రమశిక్షణను ఎలా ఉల్లంఘించగలిగానా అని ఆశ్చర్య చకితులయ్యారు. ఆయన నిరాశ కూడా చెంది ఉంటారు. ఎందువల్లనంటే కాంగ్రెస్, వామపక్షాలు తన ప్రతిపాదనను అంగీకరిస్తే అది ఎంతటి దారుణమైనదైనా సరే నాయకులు, కార్యకర్తలు అంగీకరించి తీరుతారని ఆయన అభిప్రాయపడ్డారు. ఆంగ్ల వారపత్రిక స్వరాజ్య సంపాదకులు ఖాసా సుబ్బారావు గారు నా వైఖరిని సమర్థిస్తూ రాశారు.

ఢిల్లీలోని కిసాన్ మేధావులు నా ప్రకటనలు, ప్రసంగాలు గ్రామదాన్ విషయంలో చేసినవి ఒక చిరుపొత్తంగా తయారుచేసి 'ది పంచాయత్ ల్యాండ్ లార్డిజమ్ వర్సెస్ పెజెంట్ ఎకానమీ' అనే దాన్ని రైతు విద్యాలయం 1958 నూతన సంవత్సరంనాడు ఆవిష్కరింపజేసేటట్లు సహకరించారు. లాల్‌సింగ్, మున్షీ, ఖాసా సుబ్బారావులు, కాకలుతీరిన రాజకీయవేత్తలు, విశ్వేశ్వరయ్య, రాజాజీ, సి.పి.రామస్వామి, జనరల్ కరియప్పవంటి వారంతా సహకార వ్యవసాయంపై విరుచుకుపడ్డారు.

గుడివాడలో ఉత్సవాలు నిర్వహిస్తున్న రోజునే (7.11.1957) ఫోన్‌లో ఆహ్వానం అందింది. నవంబర్ 11న సిపిఎ సదస్సుకు హాజరయ్యేందుకు పాకిస్థాన్ విమాన ప్రయాణానికి సిద్ధం కమ్మని.

ఢిల్లీలోని వారు కూడా నా జన్మదినాన్ని జరిపారు. నేను తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాన్ని వాళ్లు సమర్థించారు. ప్రజా సేవలో పాటిస్తున్న ప్రమాణాలను ప్రశంసించారు. ఆ విధంగా భారతదేశంలో మా కిసాన్ ఉద్యమానికి మద్దతుగా డిమిట్రోవ్ పర్యటన, ఆ మూడు పట్టణాల్లో ప్రజలు పలికిన స్వాగతం, హైదరాబాద్‌లో రంగా భవన్ ప్రారంభం, బల్గేరియా, పాకిస్థాన్‌లలో నా పర్యటన, నెహ్రూ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతు పోరాటాలు అన్నీ కలగలసి భారత కిసాన్ ఉద్యమ చరిత్రలో 1957 ఒక మైలురాయిగా నిలిచింది.

50

స్వతంత్ర పార్టీ నాయకత్వంలోకి రాజాజీ ఆహ్వానం



4 జూన్ 1959న మేమంతా ఆ ఆహ్లాదకర సుప్రభాత వేళలో మద్రాస్‌లోని బ్రాడ్వేలోని ఉడ్‌ల్యాండ్స్‌కు చేరుకున్నాం. అఖిలభారత వ్యవసాయదారుల ఫెడరేషన్, కిసాన్ సమ్మేళన్ ఆహ్వానం మేరకు అక్కడకు చేరాం. అంతకుముందు ఐదారు వారాల క్రితం రాజాజీ, నేనూ, మరికొందరు మిత్రులం బెంగళూరులో కలసి ఈ సభ ఏర్పాట్ల విషయం మాట్లాడుకున్నాం కనుక సభకు ఎవరెవరు వచ్చేది నాకు తెలుసు. ఈ సభను ఏర్పాటుచేసే విషయంలో సర్దార్ లాల్‌సింగ్, జిన్‌రాజ్ హెగ్డే, రామచంద్రారెడ్డి, రాజాజీకి అందుబాటులో ఉన్నవారు, బెంగళూరు మిత్రులు కొందరు చొరవ చూపారు.

మేమంతా ఎనిమిది పదుల వయస్సు దాటిన రాజాజీ రాక కోసం ఎదురుచూస్తున్నాం. ఇంతలో ఆయన వచ్చారని తెలిసి నేను మెట్ల వద్దకు వెళ్లి నమస్కరించాను. ధవళ బంగారు రంగు ఛాయలో ఉన్న కర్ర ఊతంతో ఎంత మెల్లగా, జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారో చూసి ముచ్చటపడ్డాను. నన్ను ఎంతో ఆప్యాయంగా అభినందించారు. తల నిమిరారు. ఆయనకు కుడిపక్కన నన్ను కూర్చోమన్నారు. ఆయనతో ఏకీభావంగా మసలుకోమన్నారు. ఆయన మనస్సులో ఏముందో నాకు తెలియదు. అంతకుముందు రోజు కొందరు నాయకులతో మాటల సందర్భంగా తెలియవచ్చిందేమంటే ఆర్థిక సూత్రాలు, భూమి, వ్యవసాయదారుల సమస్యలకు సంబంధించిన విధానాల ముసాయిదా వివరణలు సిద్ధమయ్యాయని, వ్యవసాయ ప్రణాళికా ముసాయిదా కూడా తయారైందని, వాటిపై ఈ నాలుగో తేదీన చర్చలు జరిపి ఖరారు చేసి ప్రజాభిప్రాయ సేకరణ కోసం ప్రజలకు వాటి ప్రతులు పంపేందుకు

సిద్ధం చేస్తారని అనుకున్నాను. అలా భవిష్యత్తు ప్రణాళికకు, పట్టణవాసులకు సంబంధించిన ప్రణాళికలకు రూపురేఖలు దిద్దడం జరుగుతుందనుకున్నాను.

మేము సభలో కూర్చున్నాం. సభ ప్రారంభమైంది. అంతకుముందు అనుకున్నదానికి భిన్నంగా సభను నిర్వహిస్తున్నారు. కొంచెంసేపు అవీ ఇవీ మాట్లాడుకున్న తర్వాత నేను సూచించాను ఫెడరేషన్ ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి సభ ప్రారంభానికి సంబంధించిన ఉపోద్ఘాతం చెప్పమని. అయితే ఆ సభకు అధ్యక్షత వహించేది ఎవరనే ప్రశ్నను ఎవరో లేవనెత్తారు. మాలో పలువురం అధ్యక్షత వహించేది రాజాజీయే అన్నాం. ఆయన అంగీకరించడానికి సిద్ధంగా లేరు. అటువంటప్పుడు ఈ సమావేశం వల్ల ప్రయోజనం ఉండదని లేచి నిలబడి గబగబా చెప్పేశాను. ఆయన నా ఎడమ చేయి పట్టుకుని నన్ను ఆపే ప్రయత్నం చేశారు కానీ ఆయనకు అధ్యక్షత వహించక తప్పలేదు. అటువంటి సహకార ధోరణి నాకు ఆనందాన్నిచ్చింది. 31.1.1967న నేనూ, భారతీదేవి కలసినప్పుడు ఇటువంటి ప్రారంభ సభకు అధ్యక్షత వహించాలని, జవహర్ నాయకత్వానికి ఎదురు నిలిచే మా కృషిని ఆశీర్వదించాలన్నాను. అప్పుడాయన అందుకు అంగీకరించారు.

రెడ్డి గారు ప్రతినిధులకు ఆహ్వానం పలికి వ్యవసాయదారుల్ని కాంగ్రెస్ నాగపూర్ సదస్సులో ప్రకటించిన విధంగా సోవియటీకరణ నుండి కాపాడడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించడమే ఈ సభ ఉద్దేశమని చెప్పి సభ నిర్వహణా పగ్గాలను రాజాజీకి అందించారు.

ఆ సభను ఒక నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావం దిశగా మళ్లించేందుకు ఆయనకు ఎంతోసేపు పట్టలేదు. కబళించే రాజ్య పాలన నుండి, రాజ్యాంగేతరంగా నియంతృత్వ ధోరణిలో ప్రణాళికా రచన చేసి అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకోవాలని చూసే ప్రణాళికా సంఘం బారి నుండి, ప్రజల స్వాతంత్ర్యాన్ని మట్టుబెట్టాలని చూసే ప్రభుత్వ యంత్రాంగం నుండి ప్రజలను కాపాడేందుకు కొత్త రాజకీయ పక్షం అవసరమని అందరూ గుర్తించారు. అయితే దానికి ఎవరు నాయకుడిగా ఉంటే బాగుంటుందనే ప్రశ్న లేవనెత్తడం జరిగింది. ఆ బరువు బాధ్యతలు మోయడానికి ఆయనే తగిన నాయకుడని మేమన్నాం. ఆయన అందుకు ఒప్పుకోలేదు. మరొకరు ఎవరైనా నాయకునిగా ఉంటే బాగుంటుందని ఆయన అన్నారు. అప్పుడు ఆయన ఈ విషయమై జాతీయ స్థాయిలో కొందరు నాయకులతో సంప్రదిస్తే వాళ్లేమన్నదీ వివరించారు.

ఆయన ప్రముఖంగా జయప్రకాశ్ నారాయణ్ పేరు చెప్పారు. ఆయన కూడా ఈ చర్చల్లో పాల్గొంటారని తెలియజేశారు. అంతలో ఆయన రానేవచ్చారు. ఆయనకు జరిగిన విషయం తెలియజేయగానే రాజకీయ పార్టీల్లో అటువంటి కీలకపాత్ర పోషించేందుకు సిద్ధంకాకపోవడానికి ఆయన కారణాలు ఆయన చెప్పారు. అప్పుడు రాజాజీ ఆ బాధ్యతను నన్ను స్వీకరించమని అన్నారు. అప్పుడు రాజాజీ నాయకత్వం వహిస్తే నేను అన్ని విధాలా సహకరించగలనన్నాను. అప్పుడు రాజాజీ చెప్పిందేమంటే కొత్త పార్టీకి నేను నాయకునిగా ఉంటే ఆ నాయకుణ్ణి తాను నడిపిస్తానన్నారు అది నాకు ఆమోదయోగ్యమైనట్లయితే. అందరూ దానికి అంతకుమించిన సర్దుబాటు మరొకటి ఉండబోదన్నారు. ఆ విధంగా నూతన పార్టీ, దానికొక నాయకుడు, ఆ నాయకునికొక నాయకుడు ఆవిర్భవించారు.

అప్పుడు మేము నూతనంగా ప్రతిపాదించిన పార్టీకి ముసాయిదా నియమావళిని రూపొందించే పనిలో పడ్డాం. స్వేచ్ఛ ద్వారా సంపదను పొందడమెలా అనే ప్రాతిపదికపై విపులంగా చర్చించాం.

ఇంతలో ఒకరు పార్టీకి పేరు పెట్టాలి కదా అన్నారు. నేను చొరవ తీసుకుని సాయంత్రం జరగబోయే బహిరంగ సభలో నూతన పార్టీకి నామకరణం చేద్దామని రాజాజీని కోరాను. ఆ సభను ప్రతిష్టాత్మకంగా వివేకానంద హాలులో నిర్వహిస్తున్నారు. ఆ సభలో మసానీ కూడా ప్రసంగించనున్నారు. రాజాజీ అందుకు అంగీకరించారు.

మా పార్టీ ఆ విధంగా వివేకానంద హాలులో రూపుదాల్చింది. అది స్వామి వివేకానంద జ్ఞాపక చిహ్నం. ఆయన జాతీయ స్వాతంత్ర్య ఉద్యమానికి ఆధ్యాత్మిక ఆత్మను క్రియాశీలం గావించినవాడు. ఆ రోజు అలా రాజాజీ దానికి తగినట్లుగా నూతన రాజకీయ పక్షానికి ఊపిరిలూదారు. జవహర్‌లాల్ మాత్రం తన రాజకీయాల నుండి దేవుణ్ణి బయటకు పంపేందుకు సిద్ధమయ్యాడు. స్వతంత్ర పార్టీ మాత్రం వివేకానందుని తరహాలో దేవుణ్ణి తమ భాగస్వామిగా మారమని ప్రార్థించింది.

స్వతంత్ర పార్టీ ఆవిర్భావానికి ముందు, తర్వాత:

గత కొన్ని మాసాలుగా మసానీ మధ్యేమార్గంగా వెళ్లే రాజకీయ పక్షం గురించి వాదిస్తూ వస్తున్నారు. ఆ దిశగా 1958, 1959 సంవత్సరాల్లో ఢిల్లీలో రెండు, మూడు ఇష్టాగోష్ఠి సమావేశాలను కూడా ఏర్పాటుచేశారు. ఆయన రాజాజీతో ఈ విషయంలో

ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిపారు. ఆ రాజకీయ పక్షానికి నాయకత్వం వహించమని కోరుతూనే ఉన్నాడు. రాజాజీ నూతన రాజకీయ పక్షానికి స్వతంత్ర పార్టీ అని నామకరణం చేసినప్పుడు ఆయన అక్కడే ఉన్నారు. ఆ సభలోనే **'రంగా కాంగ్రెస్‌కు ఎందుకు రాజీనామా సమర్పించాడు?'** అనే చిరుపొత్తాన్ని విడుదల చేయడం జరిగింది.

సర్దార్ లాల్‌సింగ్, ఫెడరేషన్ అధ్యక్షులు – ఈ సమావేశం జరగడానికి ముఖ్య కారకులు ఉధమ్‌సింగ్ నాగోక్, పంజాబ్ రైతుల గ్రామీణ జనతా పార్టీ నాయకులు 1959 జనవరి 31న దోరాహాలో బ్రహ్మాండమైన పంజాబ్ కిసాన్ సదస్సు నిర్వహించారు. లక్షమందికిపైగా ఆ సభకు వచ్చారు. దానికి అధ్యక్షుణ్ణి నేనే. అప్పుడు బహిరంగంగానే నేను నెహ్రూ ప్రభుత్వాన్ని దుయ్యబట్టాను. కాంగ్రెస్ నాయకత్వం అనుసరించే కమ్యూనిస్ట్ పోకడల్ని అడ్డుకునేందుకు రైతులు తమంత తాముగా సమాయత్తం కావాలన్నాను. నేను వాళ్లకు వెన్నుదన్నుగా నిలుస్తానన్నాను. అదే వేదిక మీద జనరల్ కరియప్ప కూడా ఉన్నారు. పంజాబ్ స్వాతంత్ర్య సమరం సందర్భంగా ఏ విధంగా అయితే వీరుల్ని జాతికి అందించిందో అదే విధంగా ఇప్పుడు రైతుల హక్కుల పరిరక్షణ పోరాటానికి కూడా అక్కడి వీరులు సిద్ధమేనన్నారు. కనుక సాహసోపేతులైన సర్దార్లు, నేనూ కలసి రైతుల రక్షణ విషయం పట్టించుకోమని రాజాజీని కోరాం. కనుక రాజాజీ అందరినీ సంప్రదిస్తూ నాలుగు మాసాల కాలాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ విధంగా కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఓ శక్తిమంతమైన ప్రజాస్వామిక పక్షాన్ని ఏర్పాటుచేసుకున్నాం.

మసానీ, నేనూ ఫిబ్రవరి 28న అటువంటి ఉమ్మడి వేదిక మీద బెల్గాంలో వున్నాం. మాజీ పార్లమెంట్ సభ్యులు, తర్వాత మైసూర్ రాష్ట్ర స్వతంత్ర పార్టీ అధ్యక్షులైన జి.డి.పాటిల్ దాన్ని ఏర్పాటుచేశారు. నాగపూర్ కాంగ్రెస్ నిర్ణయాలకు వ్యతిరేకంగా అన్ని రంగాల నుండి పోరాడాల్సిన విషయాన్ని శ్రోతలకు తెలియజేశాం. నిజం చెప్పాలంటే సహకార వ్యవసాయం రైతుల్ని వణికిస్తున్న తరుణంలో పార్లమెంట్ సభ్యుల్లో నా తరఫున నిలబడింది మసానీయే. నేను కాంగ్రెస్‌లో పార్లమెంటరీ పార్టీ కార్యదర్శిగా కొనసాగుతున్న కాలంలో ఆయన ఓ స్వేచ్ఛామయ రాజకీయ వేదిక కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు అది కాంగ్రెస్‌లోని కమ్యూనిస్ట్ ధోరణులకు వ్యతిరేకంగానే. నేను లోక్‌సభలో ముందు వరసలో ఉంటే ఖచ్చితంగా నా వెనకే మసానీ ఉండేవారు. మేము తరచుగా మా అభిప్రాయాలను ఇచ్చిపుచ్చుకుంటున్నాం. చిత్రమేమంటే స్వతంత్ర పార్టీ ఆవిర్భావం

తర్వాత పార్లమెంట్‌లో నేను ఆ పార్టీ నాయకునిగా, ఆయన ఉపనాయకునిగా పనిచేయసాగాం.

ఈ మద్రాస్ సమావేశానికి ముందు రాజాజీ పలువురు తమ బెంగళూరు మిత్రులతో రెండు, మూడు సమావేశాలు ఏర్పాటుచేయించారు. వారు కూడా ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను శక్తిమంతం గావించే ఒక స్వతంత్ర పార్టీ అవసరాన్ని ఏకరువు పెట్టారు. భారతదేశం నలుమూలల నుండి వచ్చినవారు కూడా కొత్త పార్టీ ఆవిర్భావం జరగాల్సిందేనన్నారు. అయితే నాయకుడెవరు? అందులో చేరేదెవరు? అందరికీ ఆమోదయోగ్యమైన ఉమ్మడి ప్రణాళికేది? నిధులు సమకూరేదెలా? క్రియాశీల కార్యకర్తలను, శ్రేణుల్ని తయారుచేసేదెవరు? దేశ భవిష్యత్తు కోసం రాజాజీ ఆ పార్టీకి నాయకత్వం వహిస్తే దానికి విశ్వజనీనత సిద్ధిస్తుందని అందరూ భావిస్తున్నారు.

చివరి సమావేశంలో రాజాజీ ఓ చారిత్రాత్మకమైన పిలుపునిచ్చారు : 'కుటుంబాన్ని, కొండ్రను రక్షించుకునేందుకు ప్రజలు ఏకోన్ముఖులు కావాలి'. అప్పటినుండి అది స్వతంత్ర పార్టీ నినాదాల్లో ప్రభావశీలమై అలరారింది.

రాజాజీ జాతికి ఈ పిలుపునిచ్చేముందు మన జాతీయ ధర్మాన్ని కాపాడేందుకు, గాంధీ ఆదర్శాలను ప్రవర్ధమానం గావించేందుకు ఒక జాతీయ కూటమి అవసరమని భావిస్తున్నారు. రాష్ట్రాలకు రాజ్యాంగం అందించిన స్వయంప్రతిపత్తిని ప్లానింగ్ కమిషన్ సాయంతో కేంద్ర ప్రభుత్వం దురాక్రమణ గావించబూనడం అనేది అంతకు కొన్ని సంవత్సరాల ముందే పసిగట్టారు. కనుక రాష్ట్రాల స్వయంప్రతిపత్తి కోసం వాదించసాగారు. **కాంగ్రెస్ ప్రభుత్వం స్టాలినిజం పట్ల పెంచుకుంటున్న మక్కువను ప్రజలు అడ్డుకోవాలన్నాడు.** యెల్వాల్ కాంగ్రెస్ నిర్ణయాలకు వ్యతిరేకంగా నేను సత్యాగ్రహ సమరానికి పిలుపునిచ్చినప్పుడు ఆయన నాతో గళం కలిపారు. నాపై కాంగ్రెస్ క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు సమాయత్తంకాగా మద్రాస్ నుండి వచ్చే స్వరాజ్య పత్రిక (స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో యంగ్ ఇండియా నిర్వహించిన పాత్రను ఇప్పుడీ పత్రిక పోషిస్తుంది) నాకు అండగా నిలిచింది. రాజాజీ నినాదం **'కుటుంబాన్ని కొండ్రను రక్షించుకో'** అన్నది కాంగ్రెస్‌పై రైతుల రెండేళ్ల పోరాట ఫలితం. గ్రామదానం, సహకార సమిష్టి వ్యవసాయం ముసుగులో రైతుల ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. దాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు.

కె.యం.మున్షీవంటి అనుభవజ్ఞుడైన నాయకుడు మిత్రునిగా లభించడం నా

అదృష్టం. ఆయన భారతీయ సంస్కృతీ సంప్రదాయాల గురించి లోతుగా అధ్యయనం చేశారు. సహకార వ్యవసాయం పేరిట కాంగ్రెస్ నియంతృత్వ పోకడలు పోయే ప్రమాదమున్నదని ఆయనా గ్రహించారు. అందువల్ల నాగపూర్ తీర్మానాలను ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఆయన మాతో కలసి రావడం మాకెంతో ప్రోత్సాహాన్నిచ్చింది. మా కొత్త పార్టీలో ఆయన మా సహచరుడయ్యేందుకు ఆగస్ట్‌లో జరిగే సదస్సు వరకూ ఆగాల్సి వచ్చింది.

నేను ముగ్గురు గుజరాతీ నాయకులతో కలసి జూన్ 6న ఒంగోలు వెళ్లి తిరిగి వచ్చి చూస్తే రాజాజీ వర్తమానం ఉంది –9వ తేదీన గోఖలే హాలులో (మద్రాస్) జరిగే సదస్సుకు హాజరుకమ్మని. నేను వెళ్లాను.

గోఖలే హాలు గోపాలకృష్ణ గోఖలే సేవలకు స్మృతిచిహ్నం. దాని నిర్మాణానికి స్ఫూర్తినందించిన వ్యక్తి అనీబిసెంట్. నేను అక్కడికి చేరేటప్పటికి సమావేశానికి వచ్చినవారితో హాలు కిటకిటలాడుతున్నది. రాజాజీ మెల్లగా అడిగారు –పార్టీకి నాయకత్వం వహించేందుకు సిద్ధమేనా అని. నేను నా అంగీకారాన్ని తెలియజేశాను. ఆయన ఆనందించారు. ఆ విధంగా నన్ను గోఖలే హాలులో స్వతంత్ర పార్టీ అధ్యక్షుడిగా నిలిపి గౌరవించారు.

తొలి ఆరు దినాలు ఆకాశవాణిలోనూ, పత్రికల్లోనూ పతాక శీర్షికలకెక్కింది. భారతీయ పత్రికలేగాక బ్రిటన్‌లోనూ, అమెరికాలోనూ పేరెన్నిక గల పత్రికలు దీన్ని సంపూర్ణ ప్రగతిదాయక స్వరాజ్య ఉద్యమంగా, భారత ప్రజాస్వామ్యాన్ని శక్తిమంతం, సువిశాలం గావించే ఉద్యమంగా, ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా ఎదురునిలవాల్సిన అవసరాన్ని చాటిచెప్పే ఉద్యమంగా పేర్కొన్నాయి. రాజాజీ అడుగుజాడల్లో దాన్ని నడపడాన్ని అనేకమంది రాజనీతిజ్ఞులు స్వాగతించారు. రాజకీయాల నుండి విరమించుకున్న తర్వాత తిరిగి రైతుల, వృత్తికళాకారుల, దుకాణదారుల, ఉద్యోగుల కోసం రాజాజీ నిలబడడం చాలా సంతోషించదగ్గ విషయమని పత్రికలు పేర్కొన్నాయి. వాళ్ల కుటుంబాన్ని, కమతాన్ని సంరక్షించుకునేందుకు ప్రజల్ని సమాయత్తపర్చడం ఆ వయస్సు మళ్లిన రాజనీతిజ్ఞుని నిరుపమాన సాహస చర్యగా అవి శ్లాఘించాయి. రాజకీయ వాతావరణంలో నీతి, సామర్థ్యం, తెలివితేటలు, గాంధీ స్ఫూర్తి నిలబడాలంటే... ఇటు పరిపాలనలోనూ, అటు చట్ట సభల్లోనూ, స్వరాజ్య భారతంలోని జాతి జీవనంలోనూ అవి రాజ్యమేలాలంటే రాజాజీ

వంటి రాజనీతిజ్ఞుని నాయకత్వం అవసరమని మేమంతా భావించాం.

స్వతంత్ర పార్టీ ఆవిర్భావం తర్వాత మూడు వారాలకు మేము బొంబాయి చేరుకున్నాం. అక్కడి విద్యావంతులు, వ్యాపారులు, విద్యార్థులు, యువకులు ప్రతి బహిరంగ సభలోనూ స్పందించినతీరు మమ్మల్ని అబ్బురపర్చింది. పూర్వం బాపూజీ వస్తే ప్రజలు ఎలా కదం తొక్కేవారో అటువంటి గౌరవమే రాజాజీకి దక్కింది. జహంగీరు హాలు కిటకిటలాడడం చూస్తే అదే హాలులో 1939లో జరిగిన ఫార్వర్డ్ బ్లాక్ సమావేశం గుర్తుకొచ్చింది. పూర్వం గవర్నర్లుగా పనిచేసిన మోదీ, మున్షీలు రాజాజీని స్వాగతించేందుకు వచ్చారు.

బొంబాయి వేదికల నుండి రాజాజీ ప్రభుత్వ పరిశ్రమలపైన, ఉద్యోగులపైనా వృధా అవుతున్న ప్రణాళికా వ్యయాన్ని ఎత్తిచూపుతూ గర్జించారు. పరిపాలిస్తున్న రాజకీయ పక్షం అధికారాన్ని, పాలనా యంత్రాంగాన్ని స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నదని దుయ్యబట్టారు. ప్రజల మౌలిక స్వాతంత్ర్యాలపై అధికారుల జోక్యాన్ని నిరసించారు. చట్టాన్ని, న్యాయవ్యవస్థను గౌరవించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. స్వతంత్ర పార్టీ వ్యవసాయదారుల పక్షమన్నారు. అలాగే స్వేచ్ఛ పట్ల అనురాగం కలిగిన వృత్తిదారుల, స్వతంత్ర వ్యాపారుల పక్షమన్నారు. వాళ్లు చిరువ్యాపారులు కావచ్చు, మధ్యతరగతికి చెందిన వ్యాపారులు కావచ్చు లేదా పెట్టుబడిదారులు కావచ్చు, వాళ్లు లక్షలమంది వుండొచ్చు. వాళ్లందరికీ ప్రభుత్వ ఊతం లభిస్తే పారిశ్రామికాభివృద్ధి త్వరితగతిన జరుగుతుంది. ఉద్యోగావకాశాలు మెరుగవుతాయి. తద్వారా అధిక ఉత్పత్తిని, సంపదను సాధించవచ్చు. వర్తక, వాణిజ్యాలకు కాణాచియైన, రాజకీయాల్లో ఆరితేరిన ఆ నగరంలో రాజాజీ మాటలు మారుమోగాయి.

రాజాజీ రాజకీయ భీష్ముడు అనడంలో అతిశయోక్తి ఎంతమాత్రమూలేదు. ఆయన పిలుపును పత్రికలు అందిపుచ్చుకోవడంలో విశేషమేముంది? అది ప్రధానిని మరింతగా కోపోద్రిక్తుణ్ణి చేసింది. ఆయన మర్యాద పరిధుల్ని దాటి పత్రికల్ని, స్వతంత్ర పార్టీని తిట్టిపోసే స్థాయికి దిగజారారు. మాది రాజకుమారుల, కోటీశ్వరుల పార్టీ అనే అభియోగం మోపాడు. అయితే మా పార్టీ ప్రారంభించి నెలలు గడిచినా రాజకుమారులు గానీ, కోటీశ్వరులుకానీ చేరిందిలేదు. స్వతంత్ర పార్టీని కన్సర్వేటివ్ పార్టీ (సంప్రదాయ వాద పక్షం) అని ఆయన దుమ్మెత్తిపోశారు. కాని నిజానికి మాది ఉదారవాద పక్షం. (లిబరల్ పార్టీ). మా విధానం స్వేచ్ఛా విపణి విధానం అని ఆయన విమర్శించినప్పుడు

రాజాజీ అన్నారు – ఒక్క విషయం గుర్తుంచుకో, రంగా స్వయంగా రైతు; వ్యాపారస్థుడు కాదు. ఆయనే మా పార్టీకి అధ్యక్షుడు. పార్టీకి ఆయన ఉత్ప్రేరకుడు. అయితే ఎవరికి ఆత్మపరిశోధనా శక్తి ఉంటుందో వాళ్లు స్వేచ్ఛా విపణిని కోరినా తప్పలేదు.

ఆగస్ట్ 1వ తేదీన బొంబాయిలో కలుద్దామనుకున్నాం. ఆ రోజు లోకమాన్య తిలక్ జయంతి. ఆ త్యాగధనుని ఆశీస్సులు పొందుదామని భావించాం.

ఆ ఏడు వారాల సమయంలో భారతదేశం నలుమూలల నుండి అనేక రంగాలకు చెందిన అనుభవజ్ఞుల నుండి అభినందనలు అందుకున్నాం. చిన్న మొత్తాలే అయినా పార్టీకి నిధులు వేలలో అందసాగాయి. స్వతంత్ర పార్టీ శాఖలు దేశమంతటా విస్తరించ సాగాయి. దేశవ్యాప్తంగా జరిగే పార్టీ నిర్మాణ కార్యక్రమాలను సమన్వయపర్చడంలో బెంగుళూరులోని కేంద్ర కార్యాలయం సతమతం కాసాగింది.

బొంబాయిలో సదస్సు జరుగుతున్న తరుణంలో రెండో రోజున మున్షీ మాతో కలసి కృషి చేయాలని నిర్ణయించారు. నెహ్రూ గారి శుష్కప్రియ వచనాలతో విసిగి వేసారిన వారంతా మా పతాకం నీడకు చేరారు. సదస్సుకు భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుండి వెయ్యిమందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. రాజాజీ పిలుపును అందుకుని వాళ్లంతా ఐచ్ఛికంగా వచ్చినవారే. వారిలో ఎక్కువమంది అంతకుముందు కాంగ్రెస్ పార్టీకి చెందినవారే. స్వాతంత్ర్య సమరయోధులే. వాళ్లందరికీ మా పోరాటం వాళ్లు కొనసాగించిన దేశ స్వాతంత్ర్య పోరాటానికి కొనసాగింపుగా కనిపించడంతో వాళ్ల స్పందన ఆవేశపూరితంగా, వీరోచితంగా కనిపించింది.

శ్రీమతి సుబ్బలక్ష్మి గానాన్ని ప్రార్థనా గీతం రూపంలో ఆలకించే అదృష్టం ఆ సదస్సులోని వారికి దక్కింది. దాదాభాయి నౌరోజీ మనుమరాలు వాళ్ల తాత గారి స్ఫూర్తిని అందరికీ పంచేందుకు ఆ సభకు హాజరైంది.

అందరినీ అద్భుతంగా ఆకట్టుకున్న అంశం రాజాజీ ముగింపుగా అంత వయస్సులో అరగంటసేపు నిల్చుని చేసిన ప్రసంగం. ఆయనలోని ఆ దారుఢ్యానికి అందరూ అచ్చెరువొందారు. రాజాజీ అంతే, ప్రజల్లో స్పందన చూశారంటే ఎక్కడలేని శక్తిని కూడగట్టుకుంటారు. అలా చేయడం యువకుల వల్ల కూడా కాదు. ఓ రెండేళ్లపాటు నేను ఆయన వెంట పర్యటిస్తూనే ఉన్నా. ఎక్కడ సభ జరిగినా ప్రజలు తండోపతండాలుగా హాజరవుతూనే ఉన్నారు.

బొంబాయి నుండి మేము అహ్మదాబాద్‌కు చేరుకున్నాం. ఆగస్ట్ 5వ తేదీన జరిగిన

బహిరంగ సభ అంతకుముందు రికార్డును బద్దలుకొట్టింది. అంతకుముందు రోజు మేము సబర్మతీ ఆశ్రమానికి వెళ్లాం. మాకు అదొక తీర్థయాత్ర. బాపూ బతికున్న సమయంలో అక్కడకు పలు సందర్భాల్లో వెళ్లాం. రాజాజీ అక్కడకు చేరుకుని చలించిపోయారు. తన తొలి సందర్శన, బాపూ ఆప్యాయత గురించి చెప్పసాగారు.

1959 జూలై 4న స్వతంత్ర పార్టీ స్థాపన నాటి నుండి ఆగస్ట్ 1వరకూ నా ప్రజా జీవనంలో సరికొత్త దశ. ఆనాటి నుండి జాతీయ, అంతర్జాతీయ సంఘటనల విషయంలో నేను వీక్షించి స్పందించిన తీరును స్వీయ చరిత్రగా తీర్చిదిద్దాల్సి వచ్చింది. స్వతంత్ర పార్టీ సదస్సుల్లో నా ప్రసంగాలు, అలాగే పార్లమెంట్‌లో ప్రసంగాలు, రచనలు, నివేదికలు 1959 నుండి నేను చేసిన కృషికి ప్రబల తార్కాణంగా నిలుస్తాయి. (ఇవి 1963లో ప్రచురించిన **ఫ్రీడం ఇన్ పెరిల్**లో పొందుపర్చారు). రాజాజీ నా పట్ల నమ్మకాన్ని పెంచుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నా.

పదేళ్ల క్రితమే (24.7.1948) జవహర్‌లాల్ స్వయంగా ధృవీకరించారు. 'రాజాజీ ప్రాథమికంగా భారతదేశపు మహోన్నత మేధకు ప్రాతినిధ్యం వహిస్తారు'. 1950 జనవరి 26న రాజాజీ చివరి గవర్నర్ జనరల్‌గా పదవీ విరమణ చేసే సందర్భంగా నెహ్రూ అన్నారు :'మీ పట్ల మాకు అభిమానముంది. మీ సేవలు ఈ దేశానికి చాలా అవసరం. ఇది మీరు తిరుగాడిన నేల. ఎంతోకాలంగా సేవలందించిన పుడమి. అది తిరిగి మిమ్మల్ని ఆహ్వానిస్తుంది'. విధివిచిత్రమేమోకానీ మేము ఆయన్ను తిరిగి క్రియాశీల రాజకీయాల్లోకి ఆహ్వానించాం. ఎందుకంటే జవహర్‌లాల్ నెహ్రూ రైతు కుటుంబాలకు, కమతాలకు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాడు.

'స్వాతంత్ర్యేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం గళమెత్తడం ఈనాటిది కాదు. అది సమాజం, సామాజిక సంబంధాలంతటి పురాతనమైంది. మన రుషుల కాలం నుండి, రామాయణ, మహాభారత కాలాలకు పూర్వం నుండి, సోక్రటీస్, ఏథెన్స్ ప్రజాస్వామికంగా వర్ధిల్లే వరకూ మునీశ్వరులు, రాజకీయవేత్తలు దాని గురించి ఆలోచిస్తూనే వచ్చారు. ప్రజలు రకరకాల రాజుల పాలనలో వాళ్ల గృహాల్లో, సముదాయాల్లో ఏమేరకు స్వేచ్ఛను అనుభవించవచ్చు అనేది చర్చకు వస్తూనే ఉంది. రాజ్యం వాళ్లకు కనీస జాతీయ భద్రతను, శాంతియుత మనుగడను, సామాజిక సామరస్యాన్ని నెలకొల్పేందుకు హామీ ఇవ్వాల్సి వచ్చింది. ప్రజలకు ఆనందాన్ని సమకూర్చేదేది అనే విషయంలో ప్లేటో, అరిస్టాటిల్ రెండు విభిన్న కోణాల నుండి వారి వాదనలు వినిపించారు. రాజ్యం

ఏమేరకు వ్యక్తికి స్వాతంత్ర్యాన్ని అనుమతించాలనే విషయంపై చర్చ చేశారు.

భారతదేశంలో కూడా ధర్మం ఒక ఆలోచనాధారగా, ఆచరించే పద్ధతిగా అనేక శతాబ్దాలుగా రూపొందుతూ వచ్చింది. అవి రాజులకు, మంత్రులకు, అధికారులకు అధిగమించరాని ప్రవర్తనా నియమావళిగా నిలిచింది. ఆ ధర్మం ప్రకారం గ్రామీణులు గౌరవింపబడేవారు. భూమిపై హక్కు దళారుల ఆర్థిక స్వాతంత్ర్యం, ఆమోదయోగ్యమైంది. దాదాపుగా మన దేశ ప్రజలందరూ స్వయంఉపాధిని ఆశ్రయించి వారి సామాజిక, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పరిపాలించే రాజులతో నిమిత్తంలేకుండా అనుభవించారు. ఎక్కడైనా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ స్వేచ్ఛకు పాలకులు విఘాతం కలిగిస్తే ప్రజలు పెద్దయెత్తున అటువంటి అధికార ఉన్మాదులపై పోరాడేవారు. బ్రిటిష్‌వారి **హక్కుల పత్రం,** ఫ్రెంచివారి, అమెరికావారి **సహజ మానవ హక్కులు** అటువంటి పోరాటాల ఫలితమే. మనం గత రెండు తరాలకు చెందినవాళ్లం. బ్రిటిష్ సామ్రాజ్యవాదం ఆ హక్కుల్ని కాలరాయడంతో తిరిగి వాటి కోసం స్వాతంత్ర్య పోరాటాన్ని సాగించాం. ఐరోపా ప్రజలు, పాశ్చాత్య పాలనా విధానాలకు కట్టుబడినవారు రెండో ప్రపంచ యుద్ధ సమయంలో నియంతృత్వాన్ని అంతమొందించేందుకు కలసికట్టుగా కృషి చేశారు.

రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో స్వేచ్ఛ కోసం విజేతలుగా నిలవాలనుకునేవారు వాళ్లల్లో వారు అంతర్జాతీయంగా సంఘీభావంతో ముందుకు వచ్చి సామ్రాజ్యవాద వ్యతిరేకవాదులుగా పరిగణించుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో వాళ్లు నియంతృత్వానికి వ్యతిరేకులయ్యారు. సోవియట్ శక్తులు అంతర్జాతీయ సమితి, మానవ హక్కుల నియమావళిని అంగీకరించక అది ఒక దేశం తర్వాత మరో దేశాన్ని అంటే తూర్పు ఐరోపా, ఆసియా బంధపు దేశాలను తమ చెప్పుచేతల్లోకి తెచ్చుకున్నాయి. అక్కడి ప్రజలకు మానవ హక్కులు హుళక్కి రైతులకు వాళ్లు వ్యవసాయం చేసే భూమిపై హక్కు లేదు. స్వయం ఉపాధికి తావులేదు. ఆలోచించే, మాట్లాడే హక్కులేదు. కనుక స్వేచ్ఛను ప్రేమించేవారంతా ఈ కమ్యూనిస్ట్ సవాల్‌కు ఎదురునిలిచారు. పరిపాలించేవారు తమ అధికారాన్ని అలాగే అంటిపెట్టుకునేందుకు, ఇతరులపై పెత్తనాన్ని విస్తృతపర్చేందుకు అంతగా వీరోచిత ప్రదర్శనలు చేయాల్సిన పనిలేదు. వాళ్ల అధికారాన్ని ప్రశ్నించాలన్నా, దాని విస్తృతిని అరికట్టాలన్నా, దాన్ని కట్టడిలో ఉంచాలన్నా, ప్రజల ప్రయోజనం కోసం దాన్ని సక్రమంగా వినియోగించేటట్లు చేయాలన్నా నైతికంగా, శారీరకంగా మనకు ఎంతో ధైర్యం కావాలి.

గౌరవప్రదమైన దేశాలన్నింటి నుండి భౌతికపరమైన త్యాగాలు తప్పనిసరి. స్వతంత్ర పార్టీ ఇప్పుడు అటువంటి పాత్రనే పోషించనుంది. ఈ కార్యక్రమాన్నే అది చేపట్టింది. జవహర్‌లాల్‌జీ ఇటువంటి వీరోచిత పాత్రను అపార్థం చేసుకోవడం దురదృష్టకరం. దాన్ని ఆయన 19వ శతాబ్దపు విజయం సాధించలేని వ్యవహారంగా భావించాడు. ఏది ఏమైనా స్వతంత్ర పార్టీ రాజాజీ నాయకత్వం కింద చేపట్టిన కార్యక్రమాలు వెలకట్టజాలనివి. మానవ హక్కుల్ని, స్వయం ఉపాధిని, ఇంకా మరికొన్ని సామాజిక ఆర్థిక స్వాతంత్ర్యాల్ని సాధించుకునేందుకు పూర్తి విశ్వాసంతో మనం ముందుకు సాగాల్సిందే.

స్వేచ్ఛ కోసం మానవుని ఎడతెగని పోరాటానికి ఇది అత్యంత ప్రగతిదాయక, వర్తమాన తోడ్పాటు. అధికారంలో ఉన్నవారు ప్రజల జీవితాలతో ఆడుకుంటూనే వుంటారు. దాన్ని స్వతంత్ర పార్టీ ప్రతిఘటిస్తుంది.

(బొంబాయి తొలి సదస్సు 1.8.1959 నాటి నా అధ్యక్షోపన్యాసం నుండి గ్రహించిన భాగాలు)

ఆచార్య ఎన్ . జి . రంగా

51

పార్లమెంట్ సభ్యత్వ రాజీనామా నిరాకరణ

నా సమాధానం నుండి కొన్ని భాగాలు: 1948 నాటి వ్యవసాయ సంస్కరణల విషయంలో మైనార్టీ వర్గంగా మేము సమర్పించిన నివేదిక నుండి కొన్ని భాగాలను ఉదహరించడం ద్వారా ఒక విషయం రుజువవుతుంది. అది వాళ్లు నా వైఖరిని దెబ్బతీయాలని చేసిన పనే. అయినా సమిష్టీకరణ విధానాన్ని ఆశ్రయించే వర్గపు ఒత్తిడిని తట్టుకుంటూ రైతుల బాగు కోసం నేనెంతగా కృషి చేసిందీ తేటతెల్లమవుతుంది.

మద్రాస్ మాజీ ప్రీమియర్ ఒ.పి.ఆర్.రెడ్డిని కలసి సమిష్టి సహకార వ్యవసాయం అనివార్యమని భావిస్తే ముందుగా ప్రభుత్వ భూముల్లో ప్రయోగాలు చేసి తర్వాత రైతుల వద్దకు రావాల్సి ఉంటుందని గట్టిగా చెప్పాం. అయితే వాళ్ల ప్రయోగాలు సఫలీకృతం కావడం తథ్యమనేది తేల్చి ప్రజల ముందుకు వచ్చేంత తెలివితక్కువతనాన్ని కాంగ్రెస్‌కానీ, వాళ్ల ప్రభుత్వంకానీ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయవు. కనుక తొలి పంచవర్ష

ప్రణాళిక రూపుదిద్దుకుంటున్న సమయంలో చర్చల సందర్భంగా అర్థమైందేమంటే ప్రభుత్వమూ, ప్రణాళికా రూపకర్తలు రైతు ఆర్థిక వ్యవస్థకు వ్యతిరేకులని. కనుక ప్రభుత్వ చర్యలు ఎంతటి ప్రమాదభరితమో నేను 10.12.1952 నాటి నా పార్లమెంట్ ప్రసంగంలో వివరించాను. వాస్తవానికి నేను ప్రతిపక్షాల వైపు మొగ్గుచూపాను -వారు చెప్పే నామమాత్రపు భూసంస్కరణ పథకాలను అడ్డుకునేందుకు. అటువంటి తరుణంలో కూడా 22.12.1952న వారికీ, నాకూ మధ్య తిరిగి సంప్రీభావం ఉంటే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ కోరింది. అయితే నేను నా ఓటు ప్రాముఖ్యాన్ని వివరించాను. అయినా వారు పునర్నిర్మాణాన్నే కోరుకున్నారు. దానికి కారణం లేకపోలేదు. ఆంధ్రలో కమ్యూనిస్ట్‌ల ప్రాబల్యం తగ్గాలంటే నేను వాళ్లకు కావాలి. అందుకని వారు రైతు సమస్యలపై నాకు స్వేచ్ఛనిచ్చారు.

నేను తొలి ప్రణాళికనే వ్యతిరేకించాను: 10.12.1952నాడే రాజ్యసభలో నేను ప్రకటించాను. **'మేము (కృషీకార్ లోక్ పార్టీ) ప్రాతినిధ్యం వహించే రైతులు, చేతివృత్తులవారు సాముదాయిక పథకాలను సమర్థించరు'**. నేనింకా ఏమని అభియోగం మోపానంటే 'ఒక వైపు నుండి కమ్యూనిస్ట్‌లు, మరో వైపు నుండి ప్రభుత్వం మన భూఆర్థిక వ్యవస్థ నుండి చిన్న కమతాలను లాక్కోవాలని చూస్తున్నాయి. కనుక సన్నకారు రైతులకు వ్యతిరేకంగా ప్రణాళికా రచన చేయడం తప్పు'.

రైతుల సహకారం ఉన్నా లేకున్నా నామమాత్రపు భూసంస్కరణలకు నేను వ్యతిరేకినని తెలియజేశాను. 'ఆ సిఫారసుల వెనక కొన్ని చిక్కుముళ్లు ఉన్నాయి. గ్రామీణ భారతదేశంలోని ప్రతి వ్యక్తి ఆర్థిక, సామాజిక కార్యకలాపాలపై ప్రణాళికా రూపకర్తలు ప్రభుత్వానికి పెత్తనాన్ని కట్టబెట్టచూస్తున్నారు'.

ప్రభుత్వ భూముల్ని, భూదాన్ భూముల్ని భూమిలేని వ్యవసాయ కూలీలకు పంచాలన్నాను. గ్రామీణ, పట్టణ వ్యత్యాసాలను తొలగించాల్సి ఉందన్నాను. ఈనాటికి కూడా ప్రభుత్వం అనుసరణీయమైన లక్ష్యాల దిశగా సాగడంలేదు. ముగింపుగా ఇలా చెప్పాను : **'ఇది గాంధీ ప్రణాళిక కాబోదు. ఇది సోవియట్ ప్రణాళికకు నకిలీ రూపం.'**

అఖిలభారత కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ నాకు 20.12.1952న లిఖితపూర్వకంగా తెలియజేశారు: 'మనం ప్రగతిశీల శక్తులన్నింటినీ కూడగట్టాల్సిన అవసరాన్ని గుర్తించాల్సి ఉంది. పంచవర్ష ప్రణాళికను పార్లమెంట్ ఆమోదించింది. దానివల్ల మనందరిపై బాధ్యత మరింతగా పెరిగింది. నేను బహు జాగ్రత్తగా సమాధానం

రాశాను: 'మీరు పంచవర్ష ప్రణాళికను పార్లమెంట్ ఆమోదించిందంటున్నారు. అయితే నేను దానికి వ్యతిరేకంగా ఓటు వేయాల్సి ఉంది. 18 కోట్లమంది సన్నకారు రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకోకుండా ప్రణాళికా రచన చేశారు. వారి విధానాన్ని నేను అంగీకరించజాలను'. రైతు వ్యవస్థలోని సామాజిక సానుకూలతలను వారు మదింపు చేసినట్లు కనిపించదు. దాదాపు 12 కోట్లమంది సన్నకారు వ్యవసాయదారులు తమ భూమి హక్కును కోల్పోకుండా సేద్యాన్ని కొనసాగించేటట్లయితే 15 కోట్లమందికి ఉపాధి లభిస్తుంది. వాళ్లు వాళ్ల చొరవను, వ్యాపార తత్పరతను కాపాడుకోగలుగుతారు. ఇంకా నేను ఏమి చెప్పానంటే **'ప్రణాళికా సృజనకర్తలు సహకార సంఘాల, పంచాయతీల విషయం మాట్లాడేటప్పుడు కూడా కేంద్రీకరణపై, నిరంకుశత్వం విషయంలో శ్రద్ధ చూపుతున్నారు'.** అందుకే ఇలా హెచ్చరించాను –'మీరూ, జవహర్‌లాల్‌జీ ఈ ముఖ్యమైన అంశాలను ప్రణాళికల్లో తిరిగి జొప్పించే అవకాశం ఉందని భావిస్తే అప్పుడు మా పార్టీ తన సేవల్ని కాంగ్రెస్ ముందుంచగలుగుతుంది'.

దానికి సమాధానంగా వాళ్ల నాయకత్వ ధోరణిని ఈ విధంగా ప్రతిధ్వనించేటట్లు చేశారు: జవహర్‌లాల్‌జీని ప్రణాళికను ఆమోదించిన కొద్దిరోజులకే దాన్ని మార్చమని అడగజాలను. అయితే ప్రణాళికను మనం కోరుకున్నవిధంగా మలుచుకోవచ్చు'. 1955లో ఆంధ్రలో సాధారణ ఎన్నికల సందర్భంగా కమ్యూనిస్ట్‌ల్ని ఓడించిన తర్వాత ఈ నాలుగు సంవత్సరాల్లో కాంగ్రెస్ తన ప్రణాళికల్ని రైతు రక్షణకు వినియోగించిందీ లేనిదీ ప్రజలకు తెలుసు.

1955 నుండి కాంగ్రెస్‌లో నా పాత్రకు ముఖ్యమైన ఆధారం ఐక్య కాంగ్రెస్.

కృషికార్ లోక్‌పార్టీ నాయకుడు లచ్చన్న ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంతో కాంగ్రెస్ మంత్రి వర్గం ఆంధ్రలో 1954 నవంబర్‌లో వీగిపోయింది. ఆంధ్ర అసెంబ్లీకి 1955లో సాధారణ ఎన్నికలు జరిగాయి. కమ్యూనిస్ట్‌లు అధికారాన్ని చేజిక్కించుకునేందుకు సర్వ ప్రయత్నాలూ చేశారు. వాళ్లు అధికారాన్ని చేజిక్కించుకోకుండా నేను అడ్డుకోవడానికి ప్రయత్నించాను. అలాగే జవహర్‌లాల్, ప్రకాశం పంతులు గారు కూడా ప్రయత్నించారు. ఆ విధంగా మేమంతా కలసి ఐక్యకాంగ్రెస్‌గా రూపొందాం. తత్ఫలితంగా కమ్యూనిస్ట్‌లు ఘోర పరాజయంపాలయ్యారు. **అంతకుముందు అసెంబ్లీలో అన్ని పార్టీలకన్నా ఎక్కువ సీట్లు గెలుచుకున్న వారు ఈసారి మైనార్టీలో పడిపోయి 16 స్థానాలు మాత్రమే దక్కించుకోగలిగారు.** 7.3.1955న కాంగ్రెస్

పార్టీ అధ్యక్షులు ధేబర్ నాతో అన్నదేమంటే 'ఫలితాన్ని సాధించడంలో మీరు నిర్వహించిన పాత్రకు మిమ్మల్ని తప్పక అభినందించాలి'. ఎన్నికల సమయంలో మన కూటమి మంచి ఫలితాన్ని తెచ్చిపెట్టింది. జవహర్‌లాల్‌జీ, ధేబర్ భాయ్ ఎన్నికల కూటమిని మరింతగా పటిష్టపర్చేందుకు కె.ఎల్.పి. కాంగ్రెస్‌లోకి విలీనమైతే బాగుండుననుకున్నారు. ఎన్నికలప్పుడు రెండు పార్టీలూ విడివిడి గుర్తుల మీదనే పోటీ చేశాయి. ఆ దశలో కూడా నేను వాళ్లకు గుర్తుచేశాను. -'కె.ఎల్.పి. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం అనే ఆశయాన్ని సాధించింది. రైతులు, వృత్తికళాకారులు, మేధావులు దాన్నే కోరుకున్నారు. అందుకే కాంగ్రెస్‌లో కలసిపోయేందుకు కె.ఎల్.పి. అంగీకరించింది. గాంధీజీ ఆదర్శాలకనుగుణంగా కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్యం పార్టీని నెలకొల్పాలనుకుంది'. అంతకుముందు 1952లో జనరల్ సెక్రటరీతో నేను నెరపిన ఉత్తరప్రత్యుత్తరాలను జతచేశాను. అదంతా జవహర్‌లాల్‌జీ చూసినట్లు తెలియజేశారు.

పైగా యునైటెడ్ కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ పాత ఎన్నికల ప్రణాళికల ఊసేలేదు. రైతుల భూమి హక్కు విషయంలోనూ, వాళ్ల ఆర్థిక వ్యవస్థ విషయంలోనూ ఎటువంటి అవరోధాలూ కలుగనివ్వమని, పైగా సేవా దృక్పథంతో నిర్వహింపబడే సహకార సంఘాల ద్వారా అవి మరింత శక్తిమంతమవుతాయని స్పష్టంచేయడం జరిగింది.

రైతులకు వ్యతిరేకంగా వివిధ ఆకృతుల్లో కాంగ్రెస్ ప్రణాళికలు:

1945 నుండి 1957 వరకూ వరసగా కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలను పరిశీలించినట్లయితే కాంగ్రెస్ సహకార వ్యవసాయం విషయంలో తన ఆశయాలను సర్దుబాటు చేసుకుంటూ వస్తున్నట్లు అర్థమవుతుంది. సోవియట్ వ్యవస్థ రైతులకు వ్యతిరేకంగా నడుచుకోవడం వల్ల వచ్చిన నష్టాలు కారణం కావచ్చు లేదా భారతదేశంలోనే స్వయంగా గడించిన అనుభవం కూడా దానికి కారణం కావచ్చు. ఉదాహరణకు 1945 ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ చెప్పిందేమంటే -'ప్రగతిదాయక వ్యవసాయం, సరికొత్త సామాజిక విలువల నిర్మాణం, ప్రోత్సాహకాలు అందాలంటే భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా సహకార వ్యవసాయాన్ని చేపట్టాల్సి ఉంటుంది'. 1951నాటికి కాంగ్రెస్ ఇలా ధైర్యంగా చెప్పగలిగింది -**'చిన్న కమతాలు, ఆర్థికంగా లభ్ధి చేకూర్చని కమతాలు వ్యవసాయ ఉత్పత్తిని త్వరితగతిన అభివృద్ధి చెందించడంలో అడ్డుగా**

నిలుస్తున్నాయి. ఆ అడ్డంకిని తొలగించుకుని ముందుకు సాగాలంటే సహకార వ్యవసాయమే శరణ్యం. దానికి ప్రతి గ్రామంగానీ లేదా దానిలో తగినంత భాగంగానీ సహకార యాజమాన్య నివారణకు కొలబద్ద కావాల్సి ఉంది'. దీన్ని ప్రతిఘటిస్తూనే మాలో చాలామందిమి కాంగ్రెస్‌ను వదలి కె.ఎల్.పి.ని రూపొందించాం. అందువల్లనే 1957నాటికి కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక కొంత సమన్వయ ధోరణితో సాగింది. సహకార పద్ధతిలో అధిక ఫలసాయం సాధించే దిశగా ప్రోత్సహించాల్సి ఉంది. ఈ చివరి ఎన్నికల ప్రణాళికా రచనతో పాతవి అన్నీ రద్దవుతాయి. దీనితో కోట్లమంది రైతు ఓటర్లు ఆ ఎన్నికల ప్రణాళిక ద్వారా కాంగ్రెస్‌కు అధికారాన్ని అప్పగించి సహకార వ్యవసాయం విషయంలో సానుకూలంగా స్పందిస్తారనే ఓ భావన ఉంది. తద్వారా జాతీయ స్థాయిలో అదొక ఉద్యమంగా సాగుతుందనే ఆలోచన కూడా లేకపోలేదు.

ఇదంతా వ్యష్టి వ్యవసాయానికీ, రైతు భూస్వామ్య హక్కుకు వ్యతిరేకంగానేగాక 1945 ప్రణాళికకు కొనసాగింపుగా ఉందనే ప్రమాద ఘంటిక వినిపించకపోలేదు. అయితే నాగపూర్, భావనగర్‌లోని కాంగ్రెస్ తీర్మానాలు ఎన్నికల ప్రణాళికలోని అంశాలను ఎలా రద్దుపర్చగలవు? ప్రణాళిక స్పష్టంగానే ఉంది: దళారీ వ్యవస్థను రద్దుపర్చి దున్నేవాడికే భూమిపై హక్కు ఉండాలని. కనుక కాంగ్రెస్‌కుగానీ, 27.7.1959న నాకు సంగ్రహాంశాలు పంపిన జవహర్‌లాల్‌జీకిగానీ 1957 ప్రణాళిక నాగపూర్ తీర్మానానికి అనుకూలమని సమర్థించుకోవడం కుదరదు. అందరూ గ్రహించాల్సిందేమంటే ఎన్నికల ప్రణాళికలకు బాహ్యంగా ఏమి రాశారనేది. 1.8.1959 నాడు జరిగిన స్వతంత్ర పార్టీ సదస్సులో నేనేం చెప్పాను – విధేయులైన శాసనసభ్యులను, కాంగ్రెస్‌లోని ఇతర శ్రేణులను ఎన్నికల ప్రణాళికలోని ప్రతి అంశాన్నీ అది విడిగా చెప్పిందైనా, నెహ్రూ సిద్ధాంతాల్లో అదొక భాగమైనా విధిగా పాటించాల్సిందేనని కాంగ్రెస్ నాయకత్వం కోరరాదని. అది ఇప్పటికైనా గ్రహించాల్సిందేమంటే మార్క్స్ సిద్ధాంతాలకో, నియంత్రిత ఆర్థిక వ్యవస్థకో, రాజ్యాధికార సిద్ధాంతాలకో అంటకాగే ఒకరిద్దరు నాయకులను పిలిచి ఎన్నికల ప్రణాళికలు తయారుచేయించే పనిలో ప్లానింగ్ కమిషన్, ఎఐసిసి జోక్యం కల్పించుకుని అప్రజాస్వామిక ప్రణాళికలను పొందుపర్చుతూ కూర్చుంటే ఎన్నికల ప్రణాళికలో స్వయం ఉపాధిపై కట్టడి వంటి అంశాలు తప్పక వచ్చి చేరుతాయి.

కాంగ్రెస్ ఎత్తుగడల్ని ఎంతోకాలంగా

ప్రతిఘటిస్తూ వచ్చిన వ్యవసాయదారులు:

జవహర్‌లాల్‌జీ (7.8.1959) పత్రికా గోష్ఠిలో తమకు సహకార వ్యవసాయంపై గల తపనను విమర్శించేవారిని గేలి చేసేందుకా అన్నట్లుగా ఇలా వ్యాఖ్యానించారు : ఇన్నేళ్లుగా వారు కాంగ్రెస్ పార్టీ విడుదల చేసే ఎన్నికల ప్రణాళికలను చూస్తూ మిన్నకున్నారు. ఇప్పుడు హఠాత్తుగా రైతుల వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ స్థానంలో కాంగ్రెస్ సహకార వ్యవసాయ పద్ధతిని ప్రవేశపెడుతున్నదని వ్యతిరేకిస్తున్నారు. దీని అర్థమేమిటి? భారత కిసాన్ సమ్మేళనం, గ్రామీణ ప్రజా సంస్థల సమాఖ్య, నేనూ, కాంగ్రెస్, ఆయనా ప్రవేశపెట్టిన ఈ ప్రమాదభరిత ఏర్పాటును ఎన్నోఏళ్లుగా ప్రతిఘటిస్తూ వస్తున్న విషయం ఆయనకు తెలియకపోవడం వింతగా ఉంది. 19.1.1959న నేను ఆయనకు ఓ లేఖ రాశాను. ఆ లేఖకు జతచేసినదాన్ని ఆయన చదివే ఉంటారు. నేను అందులో నాగపూర్ తీర్మానాన్ని వ్యతిరేకించిన విషయాన్ని, 1955 నుండి నేను రాసిన రచనల గురించి తెలియజేశాను. సహకార వ్యవసాయ పథకాన్ని అమలుచేయవద్దని అందులో కోరాను.

సహకార వ్యవసాయం విషయంలో గ్రామీణ ప్రజా సంస్థల సమాఖ్య చేసిన హెచ్చరికను మెచ్చుకుంటూ 'బోల్డ్ లీడ్' అంటూ ఢిల్లీ హిందూస్తాన్ టైమ్స్ పత్రిక 25.12.1956న సంపాదకీయం రాసింది. ఆ విషయం ఆయనకు తెలియదంటే అది రైతుల తప్పుకాదు, నా తప్పు అంతకన్నా కాదు. ఇటీవల (14.12.1958న) భారత కిసాన్ సదస్సు ఢిల్లీలో సమావేశమై ప్రమాదభరితమైన ఆ ప్రతిపాదనను విరమించుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరిన విషయం ఢిల్లీలోని పత్రికలన్నీ ప్రముఖంగానే ప్రచురించాయి. ప్రసంగవశాత్తూ ఇది గమనార్హం. నేనింతగా దాన్ని వ్యతిరేకిస్తూ పార్లమెంట్‌లో, బహిరంగ సభల్లో ప్రసంగిస్తున్నా, పుస్తకాల్లో రాసినా లోక్‌సభకు నా అభ్యర్థిత్వాన్ని ఆమోదించింది.

రైతుల పట్ల తన బాధ్యతను విస్మరించిన కాంగ్రెస్

ప్రభుత్వం కనుక ప్రజల సంక్షేమాన్ని పట్టించుకుని ఉంటే, రైతు ఆర్థిక వ్యవస్థపై లోతుగా అధ్యయనం చేసి రైతులకే జీవితాన్ని అంకితం చేసిన నా అభిప్రాయాలను,

హెచ్చరికలను ఖాతరుచేసి ఉంటే కాంగ్రెస్ నాయకులు యెల్వాల్ సదస్సు నిర్ణయాలకు అనుగుణంగా రైతు ఆర్థిక వ్యవస్థను మార్పు చేసేందుకు అలా మొగ్గుచూపి ఉండేవారు కాదు. 25.10.1957న నేను జవహర్‌లాల్‌జీకి ఫిర్యాదు చేశాను : 'యెల్వాల్ ఒప్పందం సామాజికంగా ప్రమాదకరమైనది, ఆర్థికంగా ఉత్పాదక శక్తి హీనం. మరి అటువంటిదాని గురించి రైతులతోనూ, వారి సంస్థలతోనూ ఘనిష్ట సంబంధాలు కలిగి ఉన్న మాతో సంప్రదించకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారు? అందుకు ఎందరో రైతుల మాదిరిగానే నేనూ బాధపడుతున్నా'. 'రంగా ఎందుకు రాజీనామా సమర్పించాడు' అనే వివరణ పత్రంలో ఇవన్నీ ఉన్నాయి. అయితే వారికి ఇబ్బంది కలిగించే అంశాలను కాంగ్రెస్ వారు సునాయాసంగా దాటవేయగలరు.

కాంగ్రెస్ దానంతట అది 1955 ఎన్నికల్లో పోటీ చేస్తే ఆధిక్యం సాధించే అవకాశాలు కనిపించడంలేదు. అందువల్ల అది నన్ను, నా మిత్రులను ఆహ్వానించి మాతోపాటు కె.యల్.పి.కి మద్దతు పలికే లక్షలమంది రైతుల తోడ్పాటును స్వాగతించింది. మేము మా వనరులన్నింటినీ ఐక్య కాంగ్రెస్‌కు ధారపోశాం. అది కాంగ్రెస్‌కంటే పెద్దది. ఎందుకంటే అది కె.యల్.పి, ప్రజా పార్టీ, కాంగ్రెస్‌ల ఐక్య సంఘటన. మేమంతా కమ్యూనిజానికి వ్యతిరేకులం. మాకు ప్రజాస్వామ్యం పట్ల, రైతు ఆర్థిక వ్యవస్థ పట్ల వల్లమాలిన అభిమానం.

మా సంకీర్ణం కనుక అప్పుడు ఏర్పడి ఉండకపోతే 1955లోనే ఆంధ్రలో తొలి కమ్యూనిస్ట్ ప్రభుత్వం ఏర్పడి ఉండేది. 1957, 1967 సాధారణ ఎన్నికల్లో కేరళ, ఆంధ్రతోపాటు మరెన్ని రాష్ట్రాలు ఆ దిశగా సాగిపోయేవో ఆ దేవుడికే తెలియాలి. కమ్యూనిస్ట్ వ్యతిరేక పోరులో నేనూ, కె.యల్.పి. నిర్వహించిన పాత్రను శ్లాఘించారు. తర్వాత కాంగ్రెస్‌లో విలీనం కమ్మని కోరారు. మేము దానికి అంగీకరించినప్పుడు కాంగ్రెస్‌వారి సానుకూల భావన ఎలా ఉండాలి? కె.యల్.పి. ప్రతినిధులందరినీ మంత్రి వర్గం వెలుపల ఉంచడమేనా? కె.యల్.పి. ఆశీర్వాదాలు పొందని ఒక బలహీన ప్రజా ప్రతినిధిని దొంగచాటుగా మంత్రి వర్గంలో చేర్చుకోవడమా? మేము విలీనానికి అంగీకరిస్తే మంత్రి వర్గంలోకి తీసుకునే అభ్యర్థి విషయంలో మమ్మల్ని సంప్రదించే పనిలేదా? సరే, మంత్రి వర్గంలోకి ఎవరిని తీసుకోవాలి? ఎవరిని తీసుకోకూడదు? అనే విషయంలో ముఖ్యమంత్రికే హక్కు ఉంటుంది కదా అనవచ్చు. అయితే రైతు కుటుంబ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే విషయాలైన గ్రామదానం, సహకార వ్యవసాయం

విషయంలో నిర్ణయాలు తీసుకునేటప్పుడైనా మమ్మల్ని సంప్రదించాల్సిన అవసరంలేదా? అలాగే భూపరిమితిని విధించేటప్పుడూ ఎవరినీ సంప్రదించకుండా చాలా తక్కువగా నిర్ణయించారు. నేను అభ్యంతరాలు చెబుతున్నా వినకుండా 1957 సాధారణ ఎన్నికల్లో లోక్‌సభకు అభ్యర్థుల్ని నిర్ణయించే సమయంలో కె.యల్.పి.కి చెందినవాళ్లకు అన్యాయం చేశారు. 1957లో జరిగిన సాధారణ ఎన్నికల్లో నా నియోజక వర్గంచుట్టూ గిరికీలు కొడుతూనే రాష్ట్ర, కేంద్ర మంత్రులు, జవహర్‌లాల్‌జీతోసహా నా నియోజక వర్గంలోకి అడుగుపెట్టలేదు. నేను ఓడిపోవాలని ఎవరెంతగా ప్రయత్నించినా నేను విజయం సాధించాను. నా విజయానికి గండికొట్టాలని చూసినవారిపై ఎలాంటి క్రమశిక్షణా చర్యల్లేవు. పైగా కె.యల్.పి. పట్ల రాజకీయ కృతజ్ఞత మృగ్యం కాసాగింది. ఎందుకని? మేము విలీనం అవసరాన్ని గుర్తించి కాంగ్రెస్‌తో జత కట్టినందుకా? కె.యల్.పి. ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వల్లనే ఆంధ్రలో కాంగ్రెస్ పడిపోయిందనే అభియోగాన్ని జవహర్‌లాల్‌జీ మరచిపోలేకపోయినందువల్లనా? రైతులకు వ్యతిరేకంగా ప్లానింగ్ కమిషన్ వేసే ఎత్తుల్ని నేను భరించలేని విధంగా వ్యతిరేకిస్తూ చిత్తు చేస్తున్నందుకా? వాళ్లు గత ఎనిమిది సంవత్సరాలుగా అవలంబిస్తూ వస్తున్న రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా నేను కాంగ్రెస్‌ను వీడి మున్ముందు రైతుల తరఫున పోరాడదల్చాను. పైగా యునైటెడ్ కాంగ్రెస్ పక్షాన ఆంధ్రలో పోటీచేసి గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపిలు రైతులకు ఇచ్చిన వాగ్దానాలు మర్చినందున వాళ్లు ఆ పదవుల్లో కొనసాగే నైతిక హక్కును కోల్పోయారు.

1957నాటి ఆంధ్ర ప్రాంతపు సాధారణ ఎన్నికల విషయానికొస్తే అవి 1955నాటి మధ్యంతర ఎన్నికల ఫలితాల కొనసాగింపే. అదృష్టవశాత్తూ నేను ఎల్లప్పుడూ రైతుల పక్షానే నిలిచేవాడిని. సహకార వ్యవసాయాన్ని రెండో పంచవర్ష ప్రణాళిక తర్వాత అమలుపర్చాలనే ప్రభుత్వ, ప్రణాళికా సంఘం పట్టుదలకు వ్యతిరేకంగా జూలై 1957లో నేను పార్లమెంట్‌లో అలా గళం విప్పగలిగాను.

భారతదేశానికి ఏ విధానం వల్ల లబ్ధి చేకూరుతుంది? కుటుంబ వ్యవసాయ విధానం వల్లా? స్వయం ఉపాధి వల్లా? లేక సహకార వ్యవసాయం వల్లా? కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలు ముందేసుకుని శోధిస్తే ఈ సమస్యకు సమాధానం దొరకదు. వాళ్ల మాటను కాదన్నవారి నుండి రాజీనామా లేఖలు తీసుకుంటే ఆ సమస్య పరిష్కారం కాదు. పార్లమెంట్ వెలుపల, లోపల కాంగ్రెస్ సభ్యులకు స్వతంత్రంగా ఓటు వేసే

హక్కును కల్పించి తర్వాత ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటే సమస్య పరిష్కారమవుతుంది.

అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం నా రాజీనామా కోసం అసమర్థనీయ కోరికను వెలిబుచ్చి తప్పుచేసిందని భావించాను. అది కేవలం రాజీనామా కోసమే అయితే ఇబ్బందిలేదు. కాంగ్రెస్‌కు రాజీనామా చేయకుండా పార్టీలు మారే ఒక అలవాటును మాన్పించే రీతిగా అది కనిపించింది. కాంగ్రెస్‌లో ఇటీవల పరిణామాలు చూస్తే అవి అందుకు దారితీసేవిగా ఉన్నాయి. అయితే ఇతర పార్టీల నుండి సభ్యుల్ని కాంగ్రెస్‌లోకి లాక్కున్నప్పుడు ఈ తెలివితేటలు ఏమైపోయాయో?

వాస్తవానికి అదెంత దూరం వెళ్లిందంటే మాకు తెలియకుండానే మా కె.యల్.పి. శాసనసభ్యుల్ని మంత్రి పదవుల ఆశ చూపి లాక్కెళ్లారు. **జవహర్‌లాల్‌జీకి వాళ్లతో రాజీనామా చేయించి తిరిగి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌పై గెలిపించుకోవాలనే విషయం తట్టనే లేదు.** కనుక కాంగ్రెస్ శాసనసభ్యులు పలువురు నాగపూర్ తీర్మానానికి, ఇంకా ఇతర విధానాలకు, కార్యక్రమాలకు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తంచేసేవారున్నారు. వాళ్లంతా కాంగ్రెస్ నా పట్ల ప్రవర్తించిన తీరు చూసి భయపడాల్సిన పనిలేదు. దాని వ్యవహారాన్ని చూసిన తర్వాతే కాంగ్రెస్‌కు రాజీనామా సమర్పించవచ్చు.

(24 నవంబర్ 1967లో అప్పటి న్యాయ శాఖామాత్యులు గోవిందమీనన్ లోక్‌సభలో స్పష్టంగా ప్రకటించారు. కాంగ్రెస్ నుండి నా రాజీనామాను 1967లో పార్టీ మార్పిడుల సందర్భంగా ఇచ్చిన రాజీనామాలతో సరిపోల్చరాదన్నాడు. అందుకు కారణంగా ఆయన చెప్పిందేమంటే నా రాజీనామా మూల రాజకీయ సిద్ధాంతాలతో విభేదించి జరిగిందని.

(1967లో రాజీనామాల పరంపర సిద్ధాంతాల కోసం కాదు, కేవలం అధికారం కోసం)

సమాప్తం

FIGHT FOR FREEDOM

AUTOBIOGRAPHY OF PROFESSOR N. G. RANGA

భారత జాతీయ ఉద్యమం ప్రసాదించిన ఆణిముత్యాల్లో ఆచార్య రంగ ఒకరు. ఇది ఆయన ఆత్మ కథ. బాల్యం నుంచి మొదలై 1959లో స్వతంత్ర పార్టీలో చేరేవరకూ ఇందులో ఆయన జీవన ఘట్టాలు ఉంటాయి. అడుగడుగునా ఆయనకు ఎదురైన స్థానిక, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ అంశాలన్నింటిపైనా ఆచార్య రంగ స్పందించిన తీరు మనకు కళ్లకు కడుతుంది. ఆయన ప్రత్యేకతను ఎత్తి చూపెడుతుంది.

ఆచార్య రంగ తాను నమ్మినదాని కోసం ఎంత దూరమయినా పోయారు. ఎవరితో అయినా ఢీకొన్నారు. ఎంత త్యాగానికైనా సిద్ధమయ్యారు. **"నా అదృష్టమేమోగాని జవహర్‌లాల్‌జీ అంత సుదీర్ఘ కాలం ప్రధానిగా ఉన్నా నేనెన్నడూ ఆయన దయకు పాత్రుడిని కావలసిన అవసరం కలగలేదు"** అంటారాయన వ్యంగ్యంగా.

ఆయన రైతు రంగ. ఆయన మాటలకీ చేతలకీ ఆలోచనలకీ సిద్ధాంతాలకీ కేంద్ర బిందువు రైతులే. ఎన్ని దేశాలు తిరిగినా ఎన్ని చదువులు చదువుకొన్నా ఎవరితో కలిసినా ఎవరితో విడిపోయినా ఆయన రైతు బిడ్డగానే మసలుకొన్నారు.

PEACOCK BOOKS